


అమృత ఘడియలు

అఖిల భారత పత్రిక, జనవరి 2005



దైవము మానవుల మధ్య సంచరిస్తూ
ఆయన ఉచ్ఛ్వాస నిశ్వాసములు
మన అస్తిత్వ జలధిపై ప్రసారమయ్యే
పవిత్ర ఘడియలు కొన్ని


ఆయన తిరోహితమై
మానవులు కేవలం వారి వారి
స్వశక్తి మీదనే ఆధారపడే
ఘడియలు మరికొన్ని.



మొదటి వేళలలో
అల్పప్రయత్నం చేసినా
అది అధిక ఫలితాలనిచ్చి
విధినే మార్చివేయగలదు.


రెండవ పక్షంలో ఎంత శ్రమించినప్పటికి
అల్పమైన ఫలితమే దక్కుతుంది.

అయితే ఈ రెండవ ఘట్టము
మొదటి ఘట్టమును ఆహ్వానించి
భగవంతుని కృపాకటాక్షములను
వర్షింప జేసే యజ్ఞధూమము కావచ్చును.



దివ్యముహూర్తము అరుదెంచినప్పుడు
ఏ మనిషైనా, దేశమైనా నిద్రాణమై
ఉండటం కడు శోచనీయము.
అలా చెవులు మూసుకొని ఆయన
పిలుపును విననివాడు దీపపు వత్తి కొడి
దులిపి భగవంతుని ఆహ్వానించుటకు
సిద్ధము కాలేదన్న మాట.

కాని అన్ని విధములుగా
సిద్ధముగా ఉండి కూడా
దివ్యముహూర్తాన్ని లెక్కచేయక
తచ్ఛక్తిని వృథా చేయువానికి
అపారమైన నష్టమూ, సర్వనాశనమూను.



దివ్యముహూర్తము అరుదెంచినప్పుడు
నీ ఆత్మను ప్రక్షాళనము కావించుకొని ఎట్టి
మోసము, టక్కరితనము, దర్పములేక, శుచి
ర్భూతుడవై దృష్టిని తిన్నగా ఆత్మలోకి
సారించి దాని నెవరు పిలుస్తున్నారో
గుర్తించుము.


చిత్తశుద్ధి లేకపోవడం వలన
నీవు పరమాత్మ నుండి ఎప్పుడైనా
తప్పించుకోగలవేమో గాని ఇప్పుడు మట్టుకు
అది నీ రక్షణకవచములో ఒక ఛిద్రము,
భగవంతుని సమ్మెటవేట్లకు ఆహ్వానము.

ఒక వేళ ఆ క్షణానికి
నీవు తప్పించుకోగలవేమో గాని
పిదప ఆ దివ్యఘాతము నీకు తగిలి
నిన్ను పరాజితుణ్ణి చేయుటం తథ్యం.



కాని నీవు పవిత్రముగా ఉన్నావు కాబట్టి
భయపడాల్సిన పని లేదు.
ఏలన అది ఒక ఝంఝామారుతము,
ఓ జ్వాల, ఓ సుడిగాలి, ఓ పెనుతుఫాను,
శివుని విలయతాండవము.


ఎవరైతే భయముతో వణికిపోకుండా
ఆ ధాటిని తట్టుకోగలరో వారు
పతనమైనా తిరిగి లేచి నిలబడగలరు.
గాలిలో కొట్టుకుపోయినా తిరిగి రాగలరు.



లౌకికం లౌకికం అంటూ నీవు
మరింత తాపత్రయపడేవు జాగ్రత్త.
ఏలన మనమిపుడు అమేయము,
అనూహ్యము అగణితము అయిన
ఒకానొక వేళా విశేషము నందున్నాము.


దివ్యప్రభంజనమును నీ అల్పిష్ఠి దృష్టితో
అంచనా వేసేవు జాగ్రత్త!
గట్టి విశ్వాసంతో ముందుకు సాగిపొమ్ము.

ముఖ్యంగా అహంకారపు పెనుతుఫాను నుండి
నీ ఆత్మను రక్షించుకొమ్ము.



అపుడొక జ్యోతి ప్రత్యక్షమై
చీకటిని చీల్చివేసి తుఫాను నరిగట్టి
నీకు సాయపడగలదు.
నీవు మేరు పర్వతము నధిరోహించి
విజయకేతనమును రెపరెప లాడించగలవు.

శ్రీఅరవిందులు



అఖిల

అఖిల భారత పత్రిక ఫిబ్రవరి 2005



నేను ఎప్పుడూ మీతో ఉంటానన్న మాట నిజమే, కాని నువ్వు నన్ను పిలవటం ఎప్పటికి మరిచిపోకూడదు. నన్ను పిలిచినప్పుడే నా సాన్నిధ్యము క్రియాశీలమై నీలో పని చేయడం మొదలు పెడుతుంది.

శ్రీమాత

విషయసూచిక

శ్రీమాతారవిందుల ప్రవచనములు

ఒక పురాతన చాల్డియా దేశపు గాథ	...	4
మాతృమూర్తి ప్రేమ కుసుమములు	...	5
మధురాతి మధురమూర్తి మాతృమూర్తి	...	12
'దరహాస చంద్రిక' కు శ్రీమాత లేఖలు	...	13
శ్రీమాత ప్రేమ	...	20
శ్వేత గులాబీల ప్రశాంత పరిమళం	...	22
దైవం మీద నిజమైన ప్రేమ	...	26
నేను నీతోనే ఉంటాను	...	29
నిజమైన ఆంతరంగికమైన సంబంధం	...	35
శ్రీమాత ఫోటోలు	...	37
BECAUSE THOU ART	...	39
మూర్తీభవించిన ప్రేమ	...	40
చివరి మాట	...	42
సమాచార పత్రం	...	43

ఉపోద్ఘాతము

గర్భగుళ్లో విగ్రహం వుంటుంది. ఆ విగ్రహానికి రక్తమాంసాలు లేక పోవచ్చు. కాని అది ఒక సజీవ ప్రతిమ. దానికి శక్తి వుంటుంది. మనిషి ఉన్నాడు. ఆ మనిషికి రక్తమాంసా లుంటాయి కాని శక్తి ఉండదు. ఈ రెండింటికి ఒక వారధి కట్టాలి. ఒక మహాపురు షుడు జన్మిస్తాడు. ఆయనకు శక్తి వుంటుంది. రక్తమాంసాకృతి కూడ వుంటుంది. సావిత్రి (170 పుట) లో చెప్పినట్లు:

...incarnate in a human form

And breathing in limbs that one can touch and clasp,

ప్రతి యుగంలోను అటువంటి మహాపురుషులు జన్మిస్తూనే వుంటారు. శరీరధారణ వలన దైవము మనకి అతి సన్నిహిత మవుతాడు. ఆధ్యాత్మిక మార్గం ఏర్పరుస్తాడు. తానే సాధన చేసి చూపిస్తాడు. అంతేగదా మరి. ఆయన వెంటనున్న వారికి దారి చూపిస్తాడు. తన శక్తి నిచ్చి సాధనను వేగిర పరుస్తాడు. ఇంకా చెప్పాల్నంటే తనే చేసి పెడతాడు కూడ. కాని ఆయన దగ్గర వుండేందుకు నోచుకోని వారి సంగతేమిటి? ఏం ఫరవాలేదు. సన్నిహితులతో వారు సలిపిన ప్రశ్నోత్తరాలు, సందేహ నివృత్తులు ఇతరత్ర అడుగడుగునా వారు చూపించిన మార్గదర్శకత్వ మంతా మనకి అందుబాటులో వుంది. ఇవన్నీ మనకు వారి దగ్గర లేని లోటును తీరుస్తాయి. వారి ప్రవచనాలు చదువుకొన్నప్పుడు వారి శక్తి కూడ మనలో ప్రవేశించి మనకు మార్గదర్శకమౌతుంది.

— సంపాదకుడు

ఒక పురాతన చాల్డియా దేశపు గాథ

చాలా కాలం క్రిందట, నేడు అరేబియా అనబడే ఎడారిలో, దివ్య ప్రేమను మేల్కొలుపుటకై, ఒక దివ్యజీవి అవతరించాడు. ఊహించినట్లుగానే, మానవులు ఆ జీవిని వేధించసాగారు. అపార్థం చేసుకున్నారు, అనుమానించారు, తరిమికొట్టారు. ఆ క్రూరాత్ములు గావించిన గాయాలు అతనికి ప్రాణాపాయంగా మారాయి. తాను అవతరించిన కార్యాన్ని సాధించుటకు వీలుగా, ఏకాంతంలో, ప్రశాంతంగా మరణించాలని అతని కోరిక. కానీ తరుమబడటం వలన అతను పరుగు తీసాడు. ఉన్నట్లుండి, ఆ విశాలమైన ఎడారిలో ఒక చిన్న దానిమ్మపొద కనిపించింది. తన శరీరాన్ని ప్రశాంతంగా త్యజించుటకై, ఆ పుణ్యజీవి ఆ పొదలోకి దూరాడు. వెంటనే ఆ పొద విచిత్రంగా విస్తరించింది. ఎత్తుగా, ఏపుగా, గుబురుగా, దట్టంగా పెరిగింది. దానిని వెంబడిస్తూ వచ్చిన వారికి, అతను అక్కడే దాగియున్నదనే అనుమానం కూడా రాలేదు. వారి దారిన వారు వెళ్లిపోయారు.

ఆ పవిత్ర రక్తము బొట్టు బొట్టుగా పడి నేలను తడుపుతున్న కొద్దీ, ఆ పొద అద్భుతమైన పూలు పూసింది. ఎర్రని ఎరుపైన, పెద్దవైన, దట్టమైన రేకులు గలవి... లెక్కలేనన్ని నెత్తుటి చుక్కలు.

ఈ పుష్పాలే మనకు దివ్యపేమను ప్రకటించే అద్భుతాలు[1].

మూలం: శ్రీమాత

అనువాదం: అందుగులపాటి కైలాసపతి, జానకి

(*CWM* Vol. 15, pp. 206-07)

[1] ప్రతి సంవత్సరం కాళీ పూజనాడు శ్రీమాత 'దివ్యప్రేమ' పువ్వులను పంచేవారు.

మాతృమూర్తి ప్రేమ కుసుమములు
(ప్రశ్నోత్తరములు)

దివ్యప్రేమ అంటే ఏమిటి? దాని రూపురేఖలు ఎలా వుంటాయి? దాని వల్ల మన కేమైనా లాభం వుంటుందా? శ్రీమాత దివ్య ప్రేమను తన బిడ్డల మీద వర్షింప చేస్తుంది. వారి ఎదలో ఆసీనమై వారి పిలుపుకోసం వేచి వుంటుంది. మన విషయంలో కూడ అంతే. మనము ఆమెను ఎంత గాఢంగా ప్రేమిస్తే అంత గాఢంగా ఆమె మన జీవితంలో కలుగజేసికొని దానిని పరిణమింప చేస్తుంది.

— సంపాదకుడు

ప్రియమైన శ్రీమాతా, నీ సత్యానికేతనానికి నన్ను నడిపించుము. భక్తిపూర్వకంగా నా మనస్సును నీకు అర్పిస్తున్నాను. (Lead me to thy own home in Truth... I offer thee my will of progressive submission and increasing adoration.)

ప్రియమైన చిన్నారి! మార్గం తెరవబడింది. నిన్ను ఆదరంతో ఆదుకోడానికీ, ప్రేమతో నా బాహువులందు నిన్ను బంధించుటకు చేతులు చాచి నీ కోసం ఎదురు చూస్తున్నాను.
ప్రేమపూర్వకమైన ఆశీస్సులతో.

22 అక్టోబరు 1938

నా ప్రాణానికి ప్రాణానివి
నాకు కూడ నీ దగ్గరకు రావాలనే ఉన్నది.
ఎందుకంటే నీ చేతుల్లో మాత్రమే
నాకు శాంతీ సంతోషమూ ఆనందమూ
యథార్థమైన సత్యమూ
నా జీవిత సాఫల్యమూ, అస్తిత్వమూ ఉన్నాయి.
అయితే ఇంకా నాకు మార్గం స్పష్టం కాలేదు.

అయితే ఈ ప్రాకృతికమైన, మృత్యుభూయిష్టమైన దేహాన్ని ఈడ్చుకుంటూ మిరుమిట్లు గొలిపే నీ శిఖరాన్ని నేనెలా అధిరోహించగలను?

నిన్ను నా చేతుల్లో మోసినప్పుడు శిఖరారోహణం సులభ మవుతుంది.

ప్రియమైన చిన్నారికి ప్రేమపూర్వకమైన ఆశీస్సులు.

25 అక్టోబరు 1938

ప్రియతరమైన మాతృమూర్తీ!

రోజు రోజుకీ నువ్వు ఇంకా ఇంకా ప్రేమపూర్వకంగా కనపడుతున్నావు. అధికాధికంగా, ఆరాధనీయంగా పరిణమిస్తున్నావు. ఏ ఇంద్రజాలంతో నువ్వు మమ్మల్నిలా మంత్రముగ్ధులను చేస్తున్నావు?

అది నీకు తెలియదా? ఒకే మంత్రం! ఒకే పాశం! అది నా ప్రేమ! నా పిల్లలను ఆచ్ఛాదిస్తుంది. వారికి సహాయం చేసి, రక్షించుటకై దైవానుగ్రహాన్ని ఆహ్వానిస్తుంది.

("The only mystery, the only spell is my love – my love which is spread over my children and calls down upon them the Divine's Grace to help and to protect")

6 నవంబరు 1938

ప్రియమైన మాతా! నాకు తెలుసు! నీ ప్రేమ, నీ ఆశీస్సులు ఎప్పటికీ నాపై ఉన్నాయనీ తెలుసు! కాని నీవు నా పట్ల అంత అచంచలమైన దయ, ఉదారత చూపించవచ్చు! ఇది నా కెంతో కష్టంగా ఉంది. నా ప్రకృతిలో కొన్ని సులభం కానివి ఉన్నాయి. అవి తగిన అంతశ్శక్తితో మిమ్మల్నీ, మీ యోగాన్నీ స్వీకరించే విషయంలో నిరోధంగా ఉన్నాయి.

నేను ప్రేమించేదీ, ఆశీర్వదించేదీ, ఒక గురువుగా కాదు. తాను ఇచ్చేదానికి ప్రతిఫలాన్ని ఆశించని ఒక మాతృమూర్తిగా మాత్రమే!

9 జూలై 1939

ప్రియతరమైన మాతా!

రాసులు రాసులుగా నా ప్రేమను నీకు సమర్పించుకుంటున్నాను.

నా హృదయకుహారంలోని సింహాసనంపై
నీ పాదపద్మాలను శాశ్వతంగా ప్రతిష్ఠించుకోనిమ్ము.

ప్రియమైన చిన్నారీ!
నీ హృదయం మధురమైన నివేశనం.
దీనికి కారణం నీ ప్రేమ!
నన్ను ఎప్పటికీ అక్కడే ఉండనీ.
ఎందుకంటే నీ సమస్తమైన అస్తిత్వాన్ని
వెలుగుతో, ప్రేమతో సంతోషంతో నింపేందుకు.
నా ప్రేమపూర్వకమైన ఆశీస్సులతో,

8 ఆగస్టు 1939

దయచేసి చెప్పు తల్లీ! నేనొక పేద మానవమాత్రురాల నైనప్పటికీ నన్ను నిజంగా అచ్చంగా ప్రేమిస్తున్నావా? లేక ఇదంతా వట్టి ప్రయోగమేనా? నిన్ను ఈ ప్రశ్నను వేయడానికి సిగ్గుపడుతున్నాను. అయితే తరచు ప్రయోగమన్న మాటను వింటు న్నాను. అది ఎన్ని విధాలుగానో ఉంటుంది. అది వినగానే భయం వేస్తుంది.

దాన్ని గురించి నీ నుండి వ్యక్తిగతంగా వినాలనుకుంటు న్నాను. మాతో కేవలం ప్రయోగం చేయడం లేదు కదా! ఇందుకు క్షమించవలసిందిగా ప్రార్థిస్తున్నాను.

ప్రియమైన చిన్నారీ! అందరు చెప్పే మాటలను వినవద్దు. అది నిన్ను చేతనయొక్క పతనదశల నుండి కాపాడుతుంది.

ఈ సాయంకాలం నిశ్శబ్దంగా నీ వైపు చూచినపుడు నీ ప్రేమను అంటిపెట్టుకొని వుండమని నీతో చెప్పాను. అంతేకాని ఇటువంటి వ్యాఖ్యానాల, వివరణల, మూర్ఖమైన అజ్ఞానం ముందు సమర్థించుకోవాలని అనుకోవద్దు.

నీవు నమ్మినా, నమ్మకపోయినా నా ప్రేమ మరియు ఆశీ స్సులు నీపై వున్నాయి.

12 ఆగస్టు 1939

ప్రియమైన మాతృమూర్తీ!

నిన్న నేను వేసిన ప్రశ్నకు సవినయంగా క్షమాపణ కోరు కుంటున్నాను. నా మూర్ఖతను మన్నించవలసిందిగా కోరుతున్నాను.

ఆహా! నీ ప్రేమను ప్రశ్నించే శక్తి నా కెక్కడిది? నువ్వు మూర్తీభవించిన సత్యం, ప్రేమ, శ్రేయస్సులు గదా!

ప్రియమైన చిన్నారి!

నాకు తెలుసు! ఇదొక తాత్కాలికమైన మానసిక స్థితి అనీ, దాని నుండి నీవు త్వరగా బయటపడతావనీ తెలుసు! ఈ ప్రేమ మరియు సత్యం అనేవి నీకు కవచం అవనీ. ఇది నిన్ను దుష్టశక్తుల నుండి రక్షించనీ!

నా ప్రేమ మరియు ఆశీస్సులు నిన్ను లక్ష్యానికి చేర్చుగాక!

13 ఆగస్టు 1939

ప్రియమైన మాతృమూర్తీ!

నీ ప్రేమయే నాకు నిజమైన శరణు, ఏకైక శక్తి. అమ్మా! ఈ మాలిన్యముల సంపుటిని నీకు సమర్పించుటకు నేనెంతో సిగ్గుపడుతున్నాను. నీవే దానిని పరిశుద్ధము చేయగలవు!

ప్రియమైన చిన్నారి!

నివేదన ఎలాంటిదైనా సరే, నిష్కపటంగా సమర్పించిన యెడల అది దివ్యకాంతులతో వెలిగిపోతూ వుంటుంది. అది సంపూర్ణ సూర్యుడుగా ఎదిగి మనిషినంతా వెలిగింప జేస్తుంది. నా ప్రేమను నమ్ము, నా సహాయాన్ని విశ్వసించు!

మా ఆశీస్సులు నీపై ఎప్పటికీ ఉంటాయి.

19 ఆగస్టు 1939

నీవెంత అద్భుతమైన ప్రేమమూర్తివి!

ఈ ప్రపంచంలో నిన్ను పోలిన వారెవ్వరైనా ఉంటారా

Love.

నా ప్రియతరమైన చిన్నారికి, ప్రేమ కానుక!

దివ్యమైన ప్రేమలోని సమస్త సంతోషమూ, సమస్త కాంతి, సమస్త శాంతి కలుగుగాక!

నా ప్రేమ పూర్వకమైన ఆశీస్సులు

20 ఆగస్టు 1939

*

నా జీవిత జీవనశక్తీ! మధురమూర్తీ! అమ్మా! నా ప్రేమను అంగీకరించు. నా తప్పుల్ని క్షమించు. అనేక సంవత్సరాలుగ చేస్తున్నట్లుగానే ఈ లోటుబాట్లు ఎప్పుడూ వస్తూనే వుంటాయి. కాని ఈ మబ్బుల్లో కూడా నీ తేజోహాస వదనం మాత్రం నా నుండి అదృశ్యం కారాదు.

నా ప్రియతమ చిన్నారి!

నీవు త్వరలో కష్టాల నుండి బయటపడగలవని నమ్ముతున్నాను.

ఉన్నత తరమైన చేతనా స్రవంతిలోకి ఒక గెంతు వేస్తే చాలు. నీ సమస్యలన్నీ పరిష్కృతమవుతాయి.

నీవు నీ కష్టాల్ని మరచిపోగలవు.

నేను క్షమిస్తున్నానని ఎప్పుడు అనుకోను.

క్షమించడం కాదు ప్రేమ చేసేది.

అది అర్థం చేసుకుంటుంది, బాగు చేస్తుంది.

ఎల్లప్పుడూ నా ప్రేమపూర్వకమైన అభినందనలు.

28 ఆగస్టు 1939

(సాధకుని జన్మదినాన ఇచ్చిన సందేశం)

దివ్యప్రేమయే నీ గమ్యము.

అమలినమైన ప్రేమయే నీ మార్గం.

ఎప్పటికీ నీ ప్రేమకు విధేయుడవై యుండుము.

నీ కష్టాలను జయించగలవు.

Let divine love be your goal.

Let pure love be your way.

Be always true to your love and all difficulties will be conquered.

Love and blessings to my dear child.

నా ప్రియమైన చిన్నారికి, ప్రేమపూర్వకమైన ఆశీస్సులు.

9 సెప్టెంబరు 1939

నా ప్రియమైన మాతృమూర్తి!
నా జన్మదిన పుస్తకంలో శ్రీఅరవిందులు,
"ఉన్నతమైన చేతనలోకి ఎగయుము.
దాని వెలుగు నీ ప్రకృతిని నియంత్రించనీ,
పరివర్తన చేయనీ" అని వ్రాసారు.
కొంతకాలం క్రితం నీవు,

"ఉన్నతమైన చేతనలోకి ఒక్క గంతు వేస్తే నీ సమస్య లన్నీ పరిష్కృతమవుతాయి, నీ కష్టాల్ని మరచిపోగలవు" అని వ్రాసావు.

మళ్ళీ దివ్యప్రేమ నీ లక్ష్యం కానీ,
స్వచ్ఛమైన ప్రేమ నీ మార్గం అవనీ
ఎప్పటికీ నీ ప్రేమకు విధేయుడవై యుండు.
అన్ని కష్టాలు తీరిపోతాయి.

ఈ ఊర్ధ్వచేతన స్వచ్ఛమైన ప్రేమ వంటిదా?
అయితే జ్ఞానానికి, దీనికి సంబంధం ఏమిటి?

ఊర్ధ్వచేతన స్వచ్ఛమైన ప్రేమయే. అయితే ఇది పరాజ్ఞానానికి దారితీసే మార్గం కూడా. ఈ రెండూ ఒకటే, భేదం లేదు. బుద్ధి మాత్రమే వీటిని వేరు చేస్తుంది.

మనస్సు చేసే గోలను తిరస్కరించడమే దీనికి రాజ మార్గము. కోపతాపాలని, క్షుద్రావేశాలని కూడా అంతే.

మనస్సును, హృదయాన్ని నిరంతరం దైవం వైపు మరల్చడమే. దీన్ని నిర్వర్తించడానికి దైవాన్ని ప్రేమించడం కంటే వేరే మార్గం లేదు.

నా ప్రేమపూర్వకమైన ఆశీస్సులు.

19 అక్టోబరు 1939

ప్రియతమ మాతృదేవత తన నివాసానికి ఇంత దుర్బలమైన పాత్రను ఎందుకు ఎన్నుకుంది? ఆ దేవత నాలో ఉన్నంత

వరకూ త్వరలోనో, నిదానంగానో ఆమెకు తగని ఈ దీనుడు విరమించ వలసి రావచ్చు. అంతవరకూ, ఈ దీనుడికి విశ్రాంతి లేదు.

ప్రియమైన చిన్నారి!

అందుకే ఇప్పుడే ఆ క్షుద్రవ్యక్తిని వదిలేసి విశ్రాంతినీ, శాంతినీ, సంతోషాన్నీ పొందమంటున్నాను.

ఒక మొండి రాక్షసిని వదిలించుకోవలసి వచ్చినపుడు, ఒక చెడుదంతాన్ని పీకటం వంటిది. ఎక్కువ ఆలస్యం చేయ కూడదు[1]. నీకు బయటా, లోపలా సర్వత్రా శ్రీమాత సహాయం ఉంది. *(Inside, outside and everywhere is the help of the Mother...) ఆమె ప్రేమపూర్వకమైన ఆశీస్సులతో*

28 అక్టోబరు 1939

ప్రియమైన చిన్నారి!

నా కిష్టం లేకపోవట మేమిటి?

నీవు ఇంతకు ముందు రోజున వ్రాసిన దానికి సమాధానం ఇవ్వకపోవడానికి కారణం; దానికంత ప్రాముఖ్యం లేదు కనుక.[2]

నా వాక్యాని కర్థమిది. నా ప్రేమ నిన్నర్థం చేసుకోగలదు. నా ఆశీస్సులు ఈ విధమైన ఉపరితల చేష్టలపై ఆధారపడి వుండవు.

'నేను అనే సమస్య[3]' అంటున్నావే – అది తప్పకుండా పరిష్కరింపబడుతుందనే నమ్మకంతో ఉన్నాను.

నా ప్రేమ మరియు ఆశీస్సులతో,

25 జూలై 1940

అనువాదం: మాదిరాజు రంగారావు

(*CWM* Vol. 16, pp. 208-20)

---

[1] ఈ సాధకుడు వృత్తిరీత్యా దంతవైద్యుడు.

[2] సాధకుడు తనకు బంధువులు పంపిన డబ్బుల్ని తీసుకోవచ్చునా.? అని అడిగాడు. దీనికి సమాధానంగా మాత "నా ప్రేమ మరియు ఆశీస్సులు నీ కెప్పటికీ వుంటాయి." అని వ్రాసింది.

[3] సాధకుడు తన ఉత్తరంలో వ్రాసింది అతని వ్యక్తిగత విషయము.

మధురాతి మధురమూర్తి మాతృమూర్తి

ఆమె దివ్యమధుర మృదుమాదక సమ్మోహన మంత్రాన్ని ఊదుతుంది. ఆమెకు చేరువ కావడమే నిండు సంతోషాన్నిస్తుంది. హృదయంలో ఆమె ఉన్నట్లు భావించడం మన ఉనికిని సైతం మంత్రముగ్ధం చేస్తుంది. సూర్యుని నుండి కాంతి ప్రసరించినట్లు ఆమె నుండి సౌందర్య, సౌకుమార్య, కారుణ్యాలు ప్రవహిస్తున్నాయి. ఆమె తన చిరునవ్వులు చిలికే ప్రేమల్ని, తన అపూర్వ దృష్టినీ అంతటా నిలుపగలదు. ఈ ఆత్మ తనలోని ముగ్ధత్వానికి చిక్కి అగాధ ఆనందపు లోతుల్లోకి లాగబడుతుంది. అయిస్కాంత తత్త్వంతో నిండిన ఆమె కరస్పర్శలు, వాటి సున్నిత, మార్మిక ప్రభావం మనస్సునూ, జీవితాన్నీ, శరీరాన్నీ పునీత మొనరిస్తుంది. ఆమె పాదం మోపినచోట దివ్యానందమయ అద్భుత ప్రవాహాలు పొంగిపొర్లుతాయి.

మూలం: శ్రీఅరవిందులు

అనువాదం: హర్షవర్ధన్ ('దివ్యశక్తి' నుండి)

(*SABCL* Vol. 25, pp. 30-31)

Let the peace of deep love penetrate your whole being and flood you with a quiet joy and strength.

The Mother

'దరహాస చంద్రిక' కు శ్రీమాత లేఖలు
(Letters to 'My Little Smile')

మదర్‌కి దగ్గరగా అతిసన్నిహితంగా వున్నవాళ్లు కొంతమంది వున్నారు. అట్టివారి జీవితము, చర్యలు, ఒకటేమిటి సమస్తమైన కార్యకలాపాలు, శ్రీమాత ప్రత్యక్ష పర్యవేక్షణలో జరుగుతూ వుంటాయి. అంతేకాదు, వారితో శ్రీమాత అత్యంత చెలిమితో ప్రవర్తిస్తూ వుండేవారు. వాళ్ళు ఎంత అదృష్టవంతులు! వారికీ శ్రీమాతకు జరిగిన ప్రత్యుత్తరాలు ఎంత విలువైనవో వాటిని చదువుకుంటే మీకే తెలుస్తుంది. ఉదా: "ఎప్పుడూ నవ్వుతూ వుండు. కష్టాలెదురైనప్పుడు ఇంకా విరగబడి నవ్వు. అవి నిన్నేమీ చేయజాలవు."

— సంపాదకుడు

నా దరహాస చంద్రికా,

ఎప్పుడూ చిరునవ్వులు చిందిస్తూ వుండాలి. కష్టాలొచ్చినప్పుడు బుంగమూతి పెట్టుకోకుండా ఇంకా నవ్వాలి, విరగబడి నవ్వాలి! సూర్యకిరణాల్లాంటి చిరునవ్వులు సంకటములనే మబ్బుల్ని కరిగించివేస్తాయి.

సంకటాలను పూర్తిగా నివారించేందుకు ఒక్కటే మందు. నా దగ్గర దాపరికం చేయవద్దు. సంపూర్ణంగా, నిష్కపటంగా ఉండుటయే ఏకైక మార్గం. నీలో జరిగే ప్రతి కదలిక, ప్రతి ఆలోచనా, కోరికా వెంటనే నాకు తెలియపరచు. నీకు సంపూర్ణమైన, సంతోషకరమైన శాంతి చేకూరుతుంది.

ఆత్మీయతానురాగాలతో!

1936 సెప్టెంబరు 6

నా చిన్నారి మందస్మితమా!

నీ లేఖ నన్ను సంతోషపరచింది. ఇప్పుడు హాయిగా, ఉల్లాసంగా ఉన్నావని తలుస్తాను.

చిన్న చిన్న విషయాలను లెక్కచేయ్యకూడదు. ఇవన్నీ దుఃఖభాజకమైన జీవితంలోని దురవస్థలు, వికారాలు, అమాయక

మైన పసిబిడ్డ మనసులో జనించిన ఊహాకల్పనలే. జీవితం నవలల్లో చిత్రీకరించినట్లుండదు – ప్రతి జీవితం చిన్నవో, పెద్దవో బాధల సుడిగుండాలతో సతమత మవుతూంటుంది. దివ్యచైతన్యంతో తాదాత్మ్యం చెందటం వలన మాత్రమే వ్యక్తి నిజమైన శాశ్వతానందాన్ని పొంది సంరక్షించుకోగలడు.

చిన్నారి చిరునవ్వా! నీ విశ్వాసాన్ని, నమ్మకాన్ని వమ్ము చేసుకోకు. అంతా చక్కబడుతుంది.

ప్రేమతో.

1932 ఆగస్టు 1

నిరాశా, నిస్పృహల ద్వారాలు తెరిచేవు జాగ్రత్త బిడ్డా! నువ్వు నిరుత్సాహపడి ఎదురుతిరిగావో చైతన్యం నుండి దూరంగా, బహుదూరంగా పోతావు. ఎంత మాత్రం ఆనందం ప్రవేశించలేని అంధకార కూపంలో కూరుకుపోతావు!

నీ చిరునవ్వే నీ వజ్రాయుధం! ధైర్యస్థైర్యాలతో అన్ని పరిస్థితుల్లోను నవ్వుతూ ఎలా పని చెయ్యాలో నీకు తెలుసు. ఈ విషయంలో నీకు నీవే సాటి. కాని నీవు ఇతరులను అనుసరిస్తున్నావే! వారి నుండి నీవు అసంతృప్తిని, తిరుగుబాటుతనాన్ని, నిరాశను అలవర్చుకుంటున్నావు. దాంతో నీ పెదవులపై చిరునవ్వు వాడిపోయింది. దానితో పాటుగా నీపై నాకుగల విశ్వాసం, నమ్మకం తొలగిపోయాయి. ఈ పరిస్థితులలో ఎన్ని దివ్యశక్తులు నిన్ను పరివేష్టించినా ఫలితం ఉండదు. నువ్వు వాటిని నిరాకరిస్తావు!

ఈ పరిస్థితిని చక్కబరిచే మార్గం ఒకే ఒకటుంది. నీ చిరునవ్వును తిరిగి తెచ్చుకో. నమ్మకాన్ని, పునరుజ్జీవింప చేయి. విశ్వాసం కల బిడ్డగా మరోమారు ఋజువు కావాలి. నీ లోటుపాట్లను, కష్టాలను, పొరపాట్లను గూర్చి శోకించకు. నీ చిరునవ్వే వాటన్నింటిని తరిమికొడుతుంది. **(...do not brood over your faults and difficulties. It is your smile that will chase them away)**

1932 ఆగస్టు 16

అవును మదర్... నీ చిన్నారి చంద్రికపై సదా నీ ప్రేమను కురిపిస్తావని నాకు తెలుసు. కాని నేను కోరేది – నన్ను కూడ, నిన్ను ఇంకా అధికాధికంగా ప్రేమించేటట్లు చెయ్యవా.!

నీ చిన్నారి

అవును, ప్రియమైన చిన్నారీ, చిరునవ్వుతో ఆనందంగా వుండడం నీకు తెలుసు. నిన్ను ప్రేమించే తల్లిని నువ్వు బాగానే ప్రేమిస్తున్నావు. ఇంకా ఎక్కువగా ప్రేమిస్తావు. మరింత ఎక్కువగా ప్రేమిస్తుంటావు.

1933 జూలై 2

ప్రియమైన మాతా!

నేనీ రోజు కూడా, ఎంబ్రాయిడరీ చెయ్యడం కొరకు చీరను ఫ్రేములో బిగించుటలో నిమగ్నమయ్యాను. కానీ చీర ఫ్రేములో తిన్నగా లేదు. అందుకని దాన్ని విప్పేసి మళ్ళీ కుట్ట వలసి వచ్చింది. దాన్ని సరిచేసేందుకు మూడురోజులు పట్టింది.

నా చిన్నారీ! అవును. అలా చెయ్యడం కష్టమే. మన నిత్య జీవితంలో కూడ అంతే కదా మరి! ఏదైనా చేసినప్పుడు అది బాగుండకపోతే, అదే పనిని మళ్ళీ మళ్ళీ చెయ్యాల్సివస్తుంది కదా...

1933 ఆగస్టు 24

నా చిన్నారీ!

ఈ రోజు ఉదయం ప్రణామసమయంలో ఎందుకు ఏడుస్తున్నావు? ఎందుకంత బాధ పడ్డావు చిట్టితల్లీ? నేను నిన్ను సముదాయించలేక పోయాను. నాకు చాలా విచారంగా ఉంది సుమా! నీ దుఃఖానికి కారణం చెప్పవచ్చు గదా! సాధ్యపడితే నేను దాన్ని తొలగిస్తాను. నా ప్రేమ మొత్తం సదా నీ మీదనే వుంటుందని నీకు తెలియదా? నీ కష్టసమయంలో ఆదుకునేందుకు కూడ నా యావచ్ఛక్తీ నీతోనే ఉంటుంది.

1934 జనవరి 24

ప్రియాతిప్రియమైన శ్రీమాతా!

ఆ సమయంలో ఏడుస్తున్నానని నాకు తెలియదు. నా బాధ మీకు కష్టం కలిగించిందా? ఇబ్బంది పెట్టిందా? నాకు తెలిసినా మళ్ళీ అడుగుతున్నాను. "నా హృదయం ప్రశాంతంగా ఉన్నదా? నిజమైన శాంతి పొందుతున్నానా? నేను ప్రశాంతంగా ఉన్నానా? కనీసం మీ గదిలో ఉన్నప్పుడైనా 5 లేక 10 నిమిషాలైనా శాంతిని కలిగి ఉన్నానా? ప్రణామం చేసే సమయంలో మీ ఒడిలో వాలి తలను ఆన్చినప్పుడైనా నేను ప్రశాంతంగా, హాయిగా వుండగలుగుతున్నానా"

మరి అలాంటప్పుడు నేను సంతోషంగా వుంటానని మీరెలా అనుకుంటారు?

మీరెప్పుడు నా సుఖసంతోషాలే కోరుతారని, అంతే గాక నాపై ఎల్లప్పుడూ ప్రేమామృతాన్ని ప్రసరింప జేస్తారని నాకు తెలుసు. కాని సర్వకాల సర్వావస్థల యందు నేను దాని అనుభూతి పొందాలి. (అశాంతిగా ఉన్నా కూడ ప్రతీ క్షణం దానిని అనుభవించడం సాధ్యమా?)

నా ఏడుపువలన మీరు బాధపడవద్దు. ఏమున్నా లేకపోయినా మీ మెత్తని హస్తాలతో నన్ను నిమిరి బుజ్జగించారు! అరుదుగా లభించే ఆ భాగ్యం నాకు కలిగింది. ఇంకేం కావాలి! అలా ఎప్పుడూ చెయ్యరు కదా!

మీ చిన్నారి

ఉదయం నన్ను కలుసుకో.

1934 జనవరి 25

*

ఈ నెల నీవు కోరిన అనుభూతిని నీకు తెచ్చివ్వగలనని ఆశిస్తున్నాను. సంతోషంతో కూడిన ప్రశాంతత, నిత్యశాంతి, తేజోమయ మౌనం.

అవే నా యిచ్ఛ, నా ఆశీస్సులు

1934 ఫిబ్రవరి 1

శ్రీమాతా!

నా హృదయంలో నిన్ను బంధిస్తాను మదర్! ఇక ప్రశాంతతను గురించి, ఆనందాన్ని గురించి ఆలోచించాల్సిన పనే లేదు. మీరు మా హృదయాలలో అధివసించినపుడు ఇవన్నీ మాకు లభించేవే.

నా ప్రియమైన చిన్నారీ!

నన్ను బంధించేందుకు ఎంతో దూరం వెళ్ళనక్కర లేదు. ఎందుకంటే నేను మీ హృదయంలోనే ఉన్నాను. మీ కనులు తెరుచుకోగానే నన్ను చూడగలరు. బాహ్యంగా నన్ను వెదికే బదులు అంతరంగంలోని నన్ను నీ దృష్టిని లోనికి మరల్చి తెలుసుకో. శీతోష్ణాలను అనుభవించే రీతిగానే నా సాన్నిధ్యాన్నీ (ఇంకా ఎక్కువగానే) పొందగలవు.

1934 ఫిబ్రవరి 2

శ్రీమాతా!

నాలో ఏదో మూసుకుపోయి ఉందనీ, అది మిమ్మల్ని చూడలేకుండ చేస్తోందని చెప్పారు. నా హృదయంలో మీ ప్రేమను అనుభవించాలని కోరుకున్నప్పుడు కూడా నా కది అందుట లేదు. నాలో మూసుకుపోయి ఉన్నది ఏమిటి? నా హృదయమా లేక వేరేమైనా కలదా? నా కవగతమగుట లేదు.

నా హృదయాన్ని మీ కొరకు తెరచిపెట్టి మీ ప్రేమను ఎల్లప్పుడూ అనుభవించాలనేదే నా ఆశ. కాని అది నిజంగా మూసి ఉంటే ఎలా తెరువగలను? నేనేం చెయ్యాలి? మీ కొరకు నిజంగా నా హృదయాన్ని తెరచి ఉంచాలనేదే నా కోరిక. శాశ్వతానందాన్ని అనుభవించాలనేదే నా ఆశ.

వత్సా,

నాకు తెలిసింది ఒకే ఒక మార్గం. తనకు తాను అర్పించుకొనుటయే, భగవంతునికి సంపూర్ణ ఆత్మార్పణమే. తనకు తాను ఎంత అర్పించుకోగలిగితే హృదయం అంత వికసిస్తుంది (తెరుచుకుంటుంది). ఎంత ఎక్కువగా వికసించగలిగితే గ్రహణ సామర్థ్యం అంత పెరుగుతుంది. ఆత్మార్పణ స్థాయి ననుసరించి

అంతరంగ సాన్నిధ్యాన్ని గ్రహించగలుగుతావు. దాని వలన కలిగే ఆనందాన్ని అనుభవించగలవు.

మాతృప్రేమతో

1936 జూలై 25

శ్రీమాతా!

దివ్యప్రియునికి ఒక వ్యక్తి తనకు తానుగా ఎంతవరకు అర్పించుకోగల డనేది నా కవగత మగుట లేదు. 'అర్పణ' (consecration) మరింతగా 'సమర్పణ' అగుటకు ఏం చెయ్యాలి? ఏ తీరుగా, ఏ రీతిగా నన్ను మీకు మరింత ఎక్కువగా సమర్పించు కొనుట సాధ్యపడుతుంది?

శ్రీఅరవిందుల జవాబు:

శ్రీమాతను సేవించుట కొరకై పనుల ద్వారా, ఇతరత్రా నిన్ను నీవు ఎలా సమర్పించు కొంటున్నావో అదే విధంగా అంతరంగ సమర్పణ కూడా. సాధారణంగా మనస్సు, ప్రాణికము (vital) వాటి కొరకే జీవిస్తూ, ఇది కావాలని అది కావాలని గోలచేస్తూ, వాటి నన్వేషిస్తూ వాటిని పొందనప్పుడు అసంతృప్తిని, తీరని వేదననూ అనుభవిస్తూంటాయి; అర్పించుకొన్నప్పుడు ఆ బాధలు, అసంతృప్తులు శమిస్తాయి. ఏం చేసినా వీటికి సమ్మతమే. దేనినీ కోరుకోరు. పూర్తిగా మదర్ మీదనే ఆధారపడి ఆమె యిచ్ఛను నెరవేర్చుటయే పరమావధిగ భావిస్తారు. అప్పుడు వారు వారి పాతసంస్కారాలు కరిగిపోగా అంతరంగాన్ని శ్రీమాత సన్నిధానంతో (సాన్నిధ్యాన్ని) నింపుకుంటూ శ్రీమాత ఇచ్ఛననుసరించి, శ్రీమాతను సేవిస్తూ జీవితాలను సార్థకం చేసుకుంటారు.

పై దానికి ఆంగ్లమూలం:

The word "consecration" is not enough for me to understand how exactly one can consecrate oneself to the Divine. In order to give myself to you more and more what should I do? How, in what way will I be able to give myself to you more and more?

Sri Aurobindo's reply:

Just as you give yourself through work to the Mother doing all for her, so there is an inner giving or consecration. Ordinarily the mind and vital live for themselves, want this or that, seek after it and feel dissatisfied and unfulfilled if they do not get it. But when they give themselves, this ceases. Whatever the Mother does with them that they accept – ask for nothing, rely on her entirely, live for her will and not for their desires. Then they begin to be empty of their old selves and old movements, fill with the presence of the Mother, the will of the Mother, the workings of the Mother – that becomes all their life.

శ్రీమాత శ్రీఅరవిందుల ప్రత్యుత్తరానికి తన ప్రేమను జోడించారు.

1936 జూలై 27

(*CWM* Vol. 16, pp. 100, 60-61, 67-68, 83-84, 89, 92, 98; *Letters to My Little Smile*, pp. 52, 85-86, 111-112)

అనువాదం: ఎస్.ఎస్. లక్ష్మి

Never forget for a moment that you are my much – loved children.

The Mother

శ్రీమాత ప్రేమ
(శ్రీఅరవిందుల సమాధానాలు)

నీవు శ్రీమాత బిడ్డవు. బిడ్డలపై శ్రీమాతకుండే ప్రేమ అపారం. వారి లోపాలను ఆమె ఓర్పుతో భరిస్తుంది. శ్రీమాతకు నిజమైన బిడ్డగ నుండుటకు ప్రయత్నించు. ఆ గుణం నీలో వున్నది. కాని నీ బాహ్యమనస్సు అల్పమైన, నిరుపయోగమైన విషయాలతో నిండి పోయి, చాలా తరచుగ తీవ్ర ఆందోళనకు గురి అవుతూంటుంది. శ్రీమాతను నీవు కలలో మాత్రమే చూడటం కాదు. ఆమె అన్ని వేళల నీతో వున్నట్లు, నీ లోనే వున్నట్లు చూడటం, భావించటం నేర్చుకో. అప్పుడు నిన్ను నీవు తేలికగ అదుపు చేసుకోగలుగు తావు, స్వభావాన్ని కూడా మార్చుకోగలుగుతావు. ఎందుకంటే మదర్ నీ దగ్గరే వుండటం వలన అంతా ఆమే నెరవేరుస్తుంది.

*

శ్రీమాత నుండి మామూలు ప్రేమను అనగా ప్రాణిక, తత్సంబం ధమైన ప్రేమను ఆశించినట్లయితే వారు తప్పక నిరాశ జెందు తారు – యోగంలో దాన్ని దాటిపోవాలి, పరిణమింప జేయాలి.

*

శ్రీమాత ప్రేమను పొందాలంటే, నీవు 'మంచి' గ మారటం తప్పనిసరి కాదు. ఆమె ప్రేమ యెల్లప్పుడూ వుంటుంది. మానవ ప్రకృతిలోని లోపాలను, ఆ ప్రేమ లెక్కచేయదు. అసలు విషయ మేమిటంటే, ఆ ప్రేమ ఎల్లప్పుడూ అక్కడ వున్నదనే ఎఱుక నీకు వుండాలి. అది జరగాలంటే నీ చైత్యము (psychic) ముందుకు రావాలి. ఎందుకంటే నీ మనస్సు, ప్రాణికము, భౌతికము పైపైన కనిపించే విషయాలను మాత్రమే గమనించి, పెడర్థాలను తీస్తాయి. ఒక్క చైత్యానికే సరైన అవగాహన వుంటుంది.

*

అతను బహుశ రెండు తప్పులను చేస్తూ వుండి వుండవచ్చు – మొదటిది, శ్రీమాత తనమీద ప్రేమను బహిరంగంగా వ్యక్తపరచా లని ఆశిం చుట; రెండవది, ప్రతిఫలాపేక్ష లేకుండా తనను తాను

తెరచి వుంచుకొనుటకు బదులు, సమర్పించుకొనుటకు బదులు, కేవలం తన పురోగమనాన్ని గురించే ఆలోచిస్తూ వుండటం. ఈ రెండు తప్పులు సాధకులు ఎప్పుడూ చేస్తుండేవే. వ్యక్తి తనను తాను తెరచుకొని, అర్పించుకొనినట్లైతే, ప్రకృతి సిద్ధపడినప్పుడు అభివృద్ధి దానంతట అదే వస్తుంది. కాని, దృష్టినంతా అభివృద్ధి మీదనే నిలిపినట్లయితే, అది కష్టాలకు, అవరోధాలకు, నిరాశకు దారితీస్తుంది. కారణం మనస్సు దేనినీ సరైన దృక్కోణంలో చూడదు. ఆ వ్యక్తిపై శ్రీమాతకు ప్రత్యేకమైన కటాక్షం వున్నది. ప్రతి రోజు ప్రణామ సమయంలో ఆమె ఒక సుస్థిరశక్తిని అతనిపై నిలుపుటకు ప్రయత్నిస్తున్నది. చైతన్యవంతుడై ఆ శక్తిని అందు కోగలుగుటకు అతను ప్రాణికంగాను, మానసికంగాను ప్రశాంత తను పొంది, తనను తాను సంపూర్ణంగా అంకితం చేసుకొనుటకు ప్రయత్నించాలి.

దివ్యప్రేమ, మానవప్రేమవలె కాదు. చాలా లోతైనది, విశా లమైనది, నిశ్శబ్దమైనది; దానిని తెలుసుకొనుటకు, దానికి ప్రతి స్పందించుటకు, వ్యక్తి ఎంతో ప్రశాంతతను, విశాలతను పొందాలి. దానిని గ్రహించుటకు ఒక పాత్రగాను, పరికరంగాను రూపొందు టకు, తనను తాను సంపూర్ణంగా సమర్పించుకొనుట అతని ఏకైక లక్ష్యం కావాలి. ఏది అవసరమో దాని ఉపలబ్ధిని పొందుటను, దైవవిజ్ఞతకు, దైవప్రేమకు వదిలివేయాలి. అందుకై యెంత సమయ మైనా వేచి వుండుటకు సిద్ధపడాలి. పట్టు వదలరాదు. జీవితమంతా భగవదాకాంక్షకే అంకితం చేయాలి. భగవంతుని కొరకే తెరచు కోవాలి (opening). *ఆత్మసమర్పణయే సాధనయొక్క రహస్యం. దేనినో అర్థించి పొందుటకు గాదు.* ఎంత ఎక్కువగా తనను తాను సమర్పించుకుంటాడో, అంత ఎక్కువగా అతని గ్రహణశక్తి పెరు గుతుంది. కాని అందుకొరకు అసహనము, తిరస్కారభావము పోవాలి. "నేనేమి పొందుట లేదు, నాకే సహాయము అందుట లేదు, నన్నెవరూ ప్రేమించుట లేదు, నేను వెళ్ళిపోతాను, జీవితాన్ని

త్యజిస్తాను, ఆధ్యాత్మిక సాధనను ఆపివేస్తాను" అనే ఆలోచనలకు తావియ్యరాదు.

అనువాదం: అందుగులపాటి కైలాసపతి, జానకి

(*SABCL* Vol. 25, pp. 176-78)

శ్వేతగులాబీల ప్రశాంత పరిమళం
(సాధకుల సందేహాలకు శ్రీమాత జవాబులు)

"నా కృపాకటాక్షములకు అందరు సమానంగా అర్హులే. మీరు వాటిని గుర్తించి మీ జీవితాన్ని చక్కదిద్దుకోండి. నా ప్రేమ మీ అంతరాంతరాల్లోకి చొచ్చుకొనిపోయి మిమ్మలను యోగమార్గంలో నడిపించు గాక" మొదలైన లోతైన సందేశాలను మనం చదువుకొని జీర్ణించుకోవలసిందే. — సంపాదకుడు

నా బిడ్డ లెవ్వరూ వ్యర్థులు కారు. దివ్యకార్య నిర్వహణలో ప్రతివారికి ఒక్కొక్క ప్రత్యేక పాత్ర ఉంది. ఎవరి స్థానం వారికుంది. వారందరినీ నేను సమానంగా ప్రేమిస్తాను. వారి శ్రేయోభివృద్ధుల కోసం యేది అవసరమో అది చేస్తాను. అందులో ఏ విధమైన పక్షపాతంగాని, వివక్షగాని వుండదు.

శత్రువుల దాడులంటారా అది యెప్పటి నుండో వున్న వ్యవహారామే. హఠాత్తుగా ఒక్కసారి వాటినాపడం అంత సులభం కాదు. కాని, యెప్పటికైనా అది ఆగిపోక తప్పదు. ఈ లోగా వాటిని అంతకంతకు బలహీనపరచి ఉదృతాన్ని తగ్గించవచ్చు. ఏదేమైనా, నా మాట మీద నమ్మకం వుంచి, నా సహాయం కోరినవారికి అది తప్పక లభిస్తుంది.

6 నవంబరు 1955

సమగ్ర సంపూర్ణ సమర్పణ చేసినవారికే నేను ఆదేశాలు యిస్తూవుంటాను. అప్పుడే ఆ ఆదేశాలు చర్చించబడడంగాని, నిరాకరించబడడంగాని జరగదు.

మిగిలిన వారికి కాంతి, సత్యం దర్శింపచేస్తూ, వారు కోరినట్టయితే సలహా యిస్తూ వుంటాను. వారి కేది మంచిదనిపిస్తే అది చేసే స్వేచ్ఛ యెప్పుడూ వుంటుంది.

సమర్పణ, దివ్యచైతన్య అవగాహన, సమర్థతలకి తగిన విధంగా తమని తాము ఉపయోగించుకొనే ప్రతి ఒక్కరు ఒక పత్యేకత కలిగినవారు. వీరికి నా ఆశీస్సులు, కరుణ వాత్సల్యాలను బట్టి, వీరెప్పుడూ అందరికంటె అగ్రస్థానంలో వుంటారు.

1 జూలై 1956

ఒక ప్రశాంత ఆనందం, శక్తి నిలువెల్లా వెల్లువెత్తే శాంత ప్రగాఢ ప్రేమానుభూతి కలుగుగాక! (Let the peace of deep love penetrate your whole being and flood you with a quiet joy and strength.)

26 నవంబరు 1956

లియోనార్డో డా విన్సీ చిత్రించిన చిత్రం (St. Anne) యిది – దివ్యపేమ, కరుణ గల అందమైన ప్రతిబింబం. ఆ కరుణ తప్పులన్నింటిని దులిపేసి పొరపాట్లని చెరిపివేస్తుంది.

6 ఫిబ్రవరి 1957

నీలో దైవముండబట్టే నీ జీవితానికి విలువ వున్నది. ఆ దైవమే నీకు పరమశాంతిని, పరమానందాన్ని, సంరక్షణలని యివ్వగలదు. నీలో ఉన్న ఆ దైవాన్ని కనిపెట్టినట్లైతే, నీ కష్టాలన్నీ మాయమైపోతాయి.

1957

మనని మనం పిలుచుకునే వస్తువు అహం! దైవమే మన అసలు రూపం.

23 మార్చి 1958

దైవం మాత్రమే సత్యం. మిగిలినదంతా అసత్యమే. ఆ దైవం సర్వాంతర్యామి. మహాఋషిలోను, పరమపాపిలోను కూడా వుంటాడు.

7 ఏప్రిల్ 1958

దైవమే నిజమైన ప్రేమ. మనమా పేరుతో పిలిచేదంతా వట్టి బూటకం. ఆ దైవప్రేమ అన్ని చోట్లా, అందరిలోను, అన్నిటిలోనూ వున్నది.

14 ఏప్రిల్ 1958

నీ ఆంతర్యంలో వున్న నన్ను గుర్తించడానికి ప్రయత్నించు. ప్రశాంతంగా, దృఢవిశ్వాసంతో వుండు. అదే నిన్ను నిశ్చింతగా నిద్రపుచ్చుతుంది.

5 ఆగస్టు 1959

దివ్యప్రేమ ఆశ్రయం పొందమని నేను చెప్పానంటే, దానర్థం అక్కడితో అంతా సరిపోయిందని కాదు. వ్యక్తి ప్రయత్నం, అనుకూల వాతావరణం కూడా సమగ్రంగా ముందుకు పోవడానికి అవసరం. దివ్యప్రేమ ఆశ్రయం దొరికినవారికి రక్షణ, మద్దతు, ఆనందం కూడా దొరుకుతాయి. ఆ ఆనందం అన్ని కష్టాలను, ఆటంకాలను అధిగమించగలిగే శక్తి నిస్తుంది.

31 జనవరి 1961

మనం పరమాత్మని ప్రేమించగలిగితే చాలు. అతడితో నిరంతర అనుబంధం వుంచుకుంటే, అతడెప్పుడూ మనతోనే వుంటాడు.

28 ఫిబ్రవరి 1963

విశ్వమూలము, లక్ష్యము కూడా దివ్యప్రేమే.

24 జూలై 1963

కృతజ్ఞతతో వెలిగే పవిత్రజ్యోతి మన హృదయంలో నిరంతరం ప్రజ్వలిస్తూ వుండాలి. ఆ జ్యోతి నులివెచ్చని, మధుర కాంతిలో అన్ని అహంకారాలు, అన్ని మాలిన్యాలు కరిగి మాయమవుతాయి. ఆ జ్యోతి సాధకునికి అతని లక్ష్యమైన పరమాత్మ

కరుణకి త్రోవచూపడమే కాదు. ఆ త్రోవ మరీ దగ్గర త్రోవ అవుతుంది.

అద్భుతమైన పరమాత్మ కరుణ ఎన్నటికీ మరువరానిది. అది పొందిన కృతజ్ఞతాభావం వున్న ప్రతి ఒక్కరికీ దివ్యలక్ష్యం చేరుకునే దగ్గరి దారి చూపుతుంది. వ్యతిరేకతల్ని, అహంకారాల్ని, అపార్థాల్ని, అజ్ఞానాన్ని ఏమాత్రం లక్ష్యపెట్టదు.

26 జూన్ 1964

ఏం చెయ్యాలి అనే నీ ప్రశ్నకి "ప్రభువుకి నిన్ను నీవు సమర్పణ చేసుకో. నీ జీవితాన్ని ప్రశాంతంగా, తృప్తిగా చేసే అవకాశం అతనికి ఇయ్యి" అన్నదే సమాధానం.

"నా జీవితంలో వుండవలసినది వొకే వొక ప్రేమ. ఒకే వొక సత్యం. అదే పరమాత్మ. నేనెల్లప్పుడూ కోరుకుంటున్నదీ నిన్నే. కోరుకోబోయేది నిన్నే" నువ్విలా ప్రార్థించాలనే వారి కోరిక.

26 సెప్టెంబరు 1964

నీ దుఃఖాన్ని పోగొట్టేందుకు శ్రీఅరవిందుల ఏప్రిల్ 24 సందేశం పంపుతున్నాను.

With all my Love.

"Love is the one emotion in us which can be entirely motiveless and self-existent; love need have no other motive than love."

– Sri Aurobindo

24 April 1966

సర్వసృష్టిని సృష్టికర్తతో ఐక్యం చేసే శక్తి ప్రపంచానికి ప్రసాదించేది ప్రేమ మాత్రమే.

చిత్తశుద్ధితో ఆకాంక్షించు. ఏదో ఒకనాడు ఆ అనుభూతితో ప్రేమస్వరూపుడి వవుతావు.

2 సెప్టెంబరు 1966

అసలు సత్యం ఎవ్వరికీ తెలియదు. కాని ప్రతి వొక్కరూ వాళ్ళకే తెలిసినట్లు మాట్లాడుతారు. కాని ఎవరికీ తెలియదు.

ఆ సత్యమే కనుక ఒకనాడు బైటపడిందా అందరూ "మన మింతటి అజ్ఞానులమా!" అని నోరు మూసుకుంటారు. ఆశ్చర్య చకితు లవుతారు. మూర్ఛపోయేంత పని అవుతుంది. కనుకనే మిమ్మల్ని తప్పుడు వ్యాఖ్యానాలు చెయ్యకుండా, ఏమాత్రం గొడవ చెయ్యకుండా నిశ్శబ్దంగా వుండమంటాను.

22 మార్చి 1967

నీ పాతజీవితంతో పూర్తిగా తెగతెంపులు చేసుకోవాలి – So that only the Eternal Love remains.

అనువాదం: నడిమింటి విజయలక్ష్మి

దైవం మీద నిజమైన ప్రేమ

మనం భక్తిప్రపత్తులతో దైవాన్ని అనేక విధాలుగా ఆరాధిస్తూ వుంటాం. ఒక స్థాయిలో దీనిని కూడ 'ప్రేమ' అంటారు. శ్రీమాత చైతన్యాన్ని స్మరించుకుంటూ దానికి లొంగిపోయే ప్రయత్నాన్ని 'దివ్యప్రేమ' అంటారు. ఈ అమృతాన్ని గ్రోలి ఆనందించాల్సిందే.

– సంపాదకుడు

దైవం దిశగా మరలిన ప్రేమ, మనుషులు అనుకునే మామూలు ప్రేమ కాదు. ఎందుకంటే అది ప్రేమ కాదు, కేవలం ఒక ప్రాణిక వాంఛ మాత్రమే, అంతా స్వంతం చేసుకోవాలనే తత్వం, స్వాధీనపరచుకుని, సంపూర్ణ హక్కును పొందాలనే ప్రగాఢ కోరిక. ఇలాంటిది దివ్యప్రేమ కాదు సరికదా దానికి యోగంలో ఏమాత్రం ఆస్కారం ఇవ్వరాదు. దైవంపై నిజమైన ప్రేమ అంటే ఆత్మార్పణ, నిష్కామమైనది, విధేయతతో కూడినది, శరణాగతమైనది. అది దేనినీ ఆకాంక్షించదు, ఆంక్షలను విధించదు, బేరసారాలాడదు. అసూయ, దర్పము, ఆగ్రహావేశాలు రేకెత్తించే కల్లోలాలను కలిగించదు – ఎందుకంటే యిలాంటివి దాని ప్రకృతిలో లేవు గనుక.

ఇందుకు ప్రతిఫలంగా దివ్యజనని కూడ తనకు తాను ధారాణంగా ఇచ్చుకుంటుంది. ఇదియే అంతరంగంలో ప్రసాదించ బడిన అనుగ్రహానికి ప్రతీక – నీ మనస్సులో, నీ ప్రాణికంలో, నీ భౌతిక చైతన్యంలో ఆమె ప్రవేశిస్తుంది, కనబడుతుంది. ఆమె శక్తి నీ అస్తిత్వపు కదలిక లన్నింటిని అధీనపరచుకొని, వాటిని పరిపూర్ణత్వము, సంతృప్తుల దిశగా మళ్లించి, *దివ్యప్రకృతిలో నీకు పునర్జన్మను ప్రసాదిస్తుంది. ఆమె ప్రేమ నిన్ను పూర్తిగా కప్పివేసి, ఆ చేతులలో నిన్ను భగవంతుని దరిగి కొనిపోతుంది.* అణువణువునా, నఖశిఖపర్యంతం అనుభవించాలని, పొందాలని, ఆకాంక్షించవలసినది దీనినే. ఇక్కడ కాలానికిగాని, పరిపూర్ణతకు గాని పరిమితి అంటూ యేదీ లేదు. ఎవ్వరైనా దీనిని నిజంగా ఆకాంక్షించి, సాధించ గలిగితే, వేరెద్దానికైనా అర్రులు చాచుటకుగాని, నిరాశ చెందుటకుగాని ఆస్కారము వుండనవసరము లేదు. ఎవరైనా నిజంగా ఆకాంక్షిస్తే వారు తప్పక దానిని పొందగలరు.

స్వార్థము, కోరిక ఏమాత్రం అంటనీయకుండా ప్రేమను స్వచ్ఛంగా ఉంచు. దానికి ప్రతిఫలంగా నీవు భరించగలిగినంత, నీవు గ్రహించగలిగినంత ప్రేమ నీకు లభ్యమవుతుందని తెలుసు కుంటావు.

దైవకార్యం నెరవేరాలనే తపన ముఖ్యంగాని, నీ కోరికల సంతృప్తి గాదు. ఎప్పుడైతే దివ్యచైతన్యం తన అతిమానస వెలుగు తోను, శక్తితోను దిగివచ్చి, భౌతిక పరివర్తన గావిస్తుందో, అప్పుడే యితర విషయాలకు ప్రాముఖ్యత నీయవచ్చు – కాని, అప్పుడు కూడ కోరికలను తీర్చుకొనుటకు కాదు, అన్నింటిలోను పరి పూర్ణతను ఆపాదించే దివ్యసత్యానికి మరియు నవజీవనంలో దానిని వ్యక్తపరచుటకు, ప్రాముఖ్యత నివ్వాలి. దివ్యజీవనంలో అంతా దైవం కొరకే, స్వార్థం కొరకు కాదు.

అయితే దైవంపై ప్రేమ అనేది మానసిక ప్రేమ మాత్రమే కాదు. అది అస్తిత్వం ఆసాంతం తహతహలాడటం, ప్రాణికము, ప్రాణిక భౌతికములు కలిసి ప్రకటించే ప్రేమ – అన్నీ కూడ ఒక విధమైన ఆత్మార్పణనీయగల సామర్థ్యం గలవి. ప్రాణికంగా

ప్రేమించినట్లయితే ఆ ప్రేమ కోరికలను సంతృప్తిపరచాలనే షరతులను విధించే ప్రేమ అని అనుకోవటం పొరపాటు. అయితే అదైనా కావాలి, లేనట్లయితే ప్రాణికం దాని బంధమును తప్పించుకొనుటకై పూర్తిగ దాని ప్రేమయొక్క లక్ష్యమునుండి వైదొలగాలని అనుకోవడం కూడ పొరపాటే. ప్రకృతియొక్క యితర అంశాల వలెనే, ప్రాణికం కూడ నిస్సందేహంగా సంపూర్ణ ఆత్మార్పణను చేసుకోగలదు. ప్రియాతిప్రియమైన దైవం కోసం తననే తాను మరచిపోగల స్థితిని మించిన ఉదారమైనది మరొకటి లేదు. ప్రాణికము, భౌతికము రెండూ కూడ నిజమార్గంలో వాటిని అవి సమర్పించుకోవాలి – నిజమైన ప్రేమమార్గంలో, స్వార్థపూరితమైన వాంఛా మార్గంలో కాదు.

*

ప్రశ్న: పవిత్రమైన, పరిపూర్ణమైన భక్తి ఎలా వస్తుంది?
మొదట నిశ్చలంగా వుండు – అప్పుడు, ఆ నిశ్చలత్వంలో నుండి ఆకాంక్షించు, నెమ్మదిగా, మనస్ఫూర్తిగ శ్రీమాతకు నీ అంతర ద్వారములను తెరచిపెట్టు.

మానసిక ఆందోళన నిన్ను కలవరపెట్టనీయ వద్దు. శ్రీమాత శక్తి పనిచేసి నీ హృదయకమలాన్ని తెరిచేటంతవరకు వేచి యుండు. పైనుండి వచ్చే వెలుగులో నీ భక్తి వికసిస్తుంది.

మూలం: అందుగులపాటి కైలాసపతి, జానకి

(*SABCL* Vol. 25, pp. 181-84)

నేను నీతోనే వుంటాను

కొంతమంది భక్తాగ్రేసరులు నిరంతర దైవారాధనలో మునిగి పోయి, ఎంతో శ్రమించి, తపించి చిట్టచివరకు దేవుణ్ణి ప్రసన్నం చేసుకుంటారు. మరి మనబోటి సామాన్యుల సంగతేమిటి? మనకు 'మదర్' ఉంది కదా. 'నేను నా శిష్యు లందరిలోకి ప్రవే శించి వారి యెదలలో సజీవంగా చాలా ప్రత్యక్షంగా ఉంటాను' అంటారామె. ఇంకా 'నాకు నీలో కాస్త చోటియ్యి. నేను నీ సాధన చేసిపెడతాను.' అంతేకాదు. 'నీ ప్రతికదలికను, నువ్వు చేసే ప్రతి చేష్టను, ప్రక్రియను నేను గమనిస్తుంటాను. సరి చేస్తుంటాను. ఎందుకంటే ఆ కదలికలు నావి. ఆ చేష్టలు నావి, ఆ ప్రక్రియలు నావిగా భావిస్తాను. నాతో చెప్పనిదే ఏ పనీ చెయ్యొద్దు. నన్ను సంప్రదించనిదే ఏ కార్యమూ తలపెట్టవద్దు.' ఆమె మాటలు వింటూంటే 'నువ్వెందుకు కష్టపడతావు, నీ బ్రతుకును నేను బ్రతికిపెడతానులే' అంటోందనిపిస్తుంది. ఇది కలా నిజమా!

— సంపాదకుడు

నేనెల్లప్పుడూ నీ యెదలో సజీవంగా నివసిస్తూ ఉంటాను.

*

నీ హృదయకవాటాలు తెరిచావంటే నీవు నన్ను చూడగలుగు తావు.

*

నేను నీలో నిరంతరం వున్న సంగతి జ్ఞాపకం పెట్టుకుంటే చాలు. అంతా దివ్యంగా జరిగిపోతుంది.

*

Always with you in a growing light and peace. నీలో ప్రేమ, శాంతి, ఆనందములు పొంగిపొరలగా చకచకా ముందుకు సాగి పోవాలి, ఇంకా పై స్థాయి నందుకోవాలి.

*

నా ఆశీస్సులు నీతో ఎప్పుడూ తప్పకుండా వుంటాయి సరే. కాని నీవు వాటిని ఉపయోగించుకోవాలి!

ఎవరైతే ఆకాంక్షిస్తారో వారికి నా అండదండ లుంటాయి.

*

ప్రశ్న: మీరు మీ నిజరూపంలో గాకుండ మాకుమల్లే ఎందుకు వచ్చారు?

అలా రాకపోయినట్లైతే నేను మీ చెంతకు వచ్చి 'చూడు నాకు మల్లె కావాలి' అని చెప్పేందుకు వీలుండేది కాదు.

*

'నేను మీతో ఉన్నాను' అంటే ఏమిటి?

(శ్రీమాత వివరణ)

ప్రశ్న:. 'నేను నీతో ఉన్నాను' అనే వాక్యానికి అర్థం ఏమిటి? మాకేమైనా సమస్య లెదురైనప్పుడు, దిక్కుతోచక నిన్ను ప్రార్థించినప్పుడు, అది నీకు వినబడుతుందా? ఎందుకంటే మేము వట్టి అర్భకులం. సరిగ్గా ప్రార్థించటం కూడ చేత కాదాయె! మరి ఈ అసమర్థుల ప్రార్థనలను వినే దెవరు? మా దగ్గరున్న మీరేనా? లేక పైన వున్న నీ మహాచైతన్యమా, సర్వవ్యాపకమైన దైవమా, యోగశక్తియా లేక శరీరధారియైన నీవా, నీ భౌతికచైతన్యమా? మేము చేసే ప్రతి ఆలోచనా, ప్రతి చేష్టా నీకు తెలుస్తుందా లేక అదొక విశ్వవ్యాప్తమైన మహాశక్తియా? మీరు ఏ రూపంలో మా మధ్యన మెసలుతున్నారో సెలవీయండి.

శ్రీఅరవిందులూ, మీరు ఒకే మహాచైతన్యము అని అంటారు కదా! మరి శ్రీఅరవిందులకు మీకు రెండు వేర్వేరు పాత్ర లున్నాయా ఏమిటి?

నేను మీతో ఉంటాను. అనగా నేనే నీవు, నీవే నేను కనుక. నేను మీతో ఉండటమంటే ఏమిటనుకుంటున్నావు? అది ఎంతో మహత్తరమైనది; మహోన్నతమైన పరమ చైతన్యం మొదలుకొని భౌతికచైతన్యం వరకుగల అన్ని స్తరములలోను, వివిధ స్థాయిలలోను అది రాణిస్తుంది. పాండిచ్చేరిలో నీవు ఊపిరి పీలిస్తే, దాంతోపాటు నా చైతన్యాన్ని కూడ పీలుస్తావు. ఇక్కణ్ణుంచి పది కిలోమీటర్ల దూరంలోవున్న చెఱువు వరకు గల సూక్ష్మభౌతికమంతా కూడ నా చైతన్యంతో నిండిపోయి

వుంటుంది. ఇంకా చెప్పాల్నంటే భౌతికప్రాణికంలోను (material vital), మానసిక స్తరము, అంతకంటె పైన స్తరములు (higher planes) లేక లోకములలో ఎల్లెడల వ్యాప్తమై వుంటుంది. మొట్ట మొదటిసారి నేనిక్కడకు వచ్చినప్పుడు పది మైళ్ళ దూరంగా వున్నప్పుడే (కిలోమీటర్లు కాదు) నాకు శ్రీఅరవిందుల సూక్ష్మ దేహం అనుభూతమైంది. ఉన్నట్లుండి అకస్మాత్తుగ ఆ పవిత్రమైన వాతావరణం, ఆ కాంతిమంతమైన వెలుగు నన్ను స్పర్శించి, నన్ను ప్రదీప్తము చేసింది. ఇదంతా ఎందుకు చెబుతున్నానంటే, ఇది కేవలం ఊహా కాదు. నీకు స్ఫూర్తి నిచ్చి నీ కళ్ళు తెరిపించే ఒక మహాశక్తి.

చాలా రోజుల క్రిందట శ్రీఅరవిందులు ఆశ్రమంలో అన్ని చోట్ల 'శ్రీమాత నిన్ను చూస్తూనే వున్నది అనుకొని ప్రవర్తించు. ఎందుకంటే ఆమె ఎప్పుడూ వుండనే వుంటుంది' అనే నోటీసును పెట్టారు.

ఇవి వట్టి మాటలు కావు. అక్షరసత్యములు. నేను నీతో నిజంగానే వుంటాను, *సూక్ష్మదృష్టి కలవారికి కనబడతాను కూడ.*

ఇక్కడి వాతావరణమంతా నా చైతన్యంతో నిండి వుంటుంది. నీ ప్రకృతిలోని విభిన్నాంశములను నీకు ఎత్తి చూపిస్తుంది. నీలో మార్పు చెందాల్సిన లక్షణాలేమిటో, పోషించి వృద్ధి చెందవలసినవి ఏమిటో, నిరాకరించవలసినవి ఏమిటో ఎత్తి చూపిస్తుంది.

ఎల్లెడలా వ్యాపించివున్న నా శక్తి ఈ పనిని చేస్తూ వుంటుంది. ఇంతే కాకుండ నన్ను, శ్రీఅరవిందులను అనుసరిస్తున్న సాధకులకు నాకు మధ్యన, ఒక అవినావభావ సంబంధమున్నది. దీనికి దగ్గర దూరముల ప్రసక్తి లేదు. నీవు పాండిచ్చేరిలో వున్నా సరే, ఫ్రాన్స్‌లో వున్నా సరే, ఎంత దూరంలో వున్నా సరే ఈ సంబంధం చాలా ఘనంగా వుంటుంది. సజీవంగా వుంటుంది. నాకు పిలుపులు వచ్చినప్పుడల్లా నేను నా శక్తిని పంపించి వారికి కావలసిన సహాయాన్ని – రచనా శక్తినో, రక్షణనో, లేక ఇతరమైన అవసరాలనో సమకూరుస్తాను. ఉన్న

ట్నుండి నాకు సందేశాలు వస్తుంటాయి. నేను వెంటనే తగిన ప్రతి క్రియ చేస్తాను. ఈ విధమైన పిలుపులు నాకు ఏ క్షణమైనా రావచ్చు. ఒక్కొక్కప్పుడు నేను మాట్లాడుతూ మాట్లాడుతూ మధ్యలో ఆగిపోవటమో, లేక పని చేస్తూ చేస్తూ చేయి నిలిచి పోవటమో జరుగుతూ వుండటం నీవు చూచే వుంటావు. నాకు పిలుపు వచ్చినపుడు దృష్టిని మరల్చడం వలన అలా జరుగుతుంది.

నేను శిష్యులుగా అనుమతించిన వారి విషయంలో ఇంత కంటె గాఢమైన సంబంధమే వుంటుంది. నా ప్రతిరూప మొకటి వారితో వుంటుంది. ఏం జరుగుతుందో చూస్తూ వుంటుంది. అవసరమైనప్పుడు నన్ను హెచ్చరిస్తుంది. 24 గంటలూ ఈ విధ మైన సందేశాలు నాకు వస్తూనే వుంటాయి. కాని ఇవన్నీ నా మనస్సులో పడనక్కర లేదు. అలాగైతే అది ఒక వరద అయి పోదూ! ఒకానొక సూక్ష్మస్థాయిలో అవన్నీ నమోదు అవుతాయి. గ్రామ్‌ఫోన్ రికార్డు మాదిరి అన్న మాట. నాకు తెలుసుకోవాలని అనిపించినప్పుడు నేను సూక్ష్మలోకాన్ని దర్శించి కనుక్కోగలను. పరిస్థితులను చూచి ఎలా పరిణమిస్తున్నాయో పరికిస్తూ వుంటాను.

మీకూ, నాకూ మధ్యగల ఈ అనుబంధం తెగిపోయేది కాదు. చాలా కాలం క్రితమే ఆశ్రమాన్ని వదిలి వెళ్ళినవారు ఆగ్ర హించి వున్నారు. వారు వెళ్ళిపోయినా సరే, నాకు మాత్రం వారి గురించి తెలుస్తూనే ఉంటుంది. అవసరం అయితే వారిని ఆదు కుంటూనే ఉంటాను. వారు ఎన్నటికీ విస్మరింపబడరు.

నా జీవితంలో నేను ఒక్క క్షణం కలుసుకున్న వారిపట్ల కూడా నా అంతట నేనే బాధ్యత వహిస్తూ ఉంటాను.

నేను, శ్రీఅరవిందులు ఒకటే అన్న విషయాన్ని ఇప్పుడు జ్ఞాపకం చేసుకో! మా ఇద్దరిదీ ఒకే చైతన్యం, ఒకే పురుషుడు. ఈ శక్తిగాని, ఈ ఉనికిగాని నీ వైయక్తిక చైతన్యంలో ప్రవేశించి నప్పుడు మాత్రమే అది ఓ రూపాన్ని తాలుస్తుంది. నీ ఉద్వేగా నికి, నీ ఆకాంక్షకు, నీ అవసరానికి, నీ వ్యక్తిత్వానికి అనుగు ణంగా అది మారుతూ ఉంటుంది. నీ ఆత్మచైతన్యం ఒక జల్లెడ వంటిదని, ఒక సూచిక వంటిదని నేను చెప్పగలను. కాబట్టి అది

దాల్చే అనంతకోటి రూపాలలో ఒకదాన్నే ఎంచుకుని స్థిరపరచుకుంటుంది.

వాస్తవంగా చెప్పాలంటే – భగవంతుణ్ణి గురించి ప్రతీ వ్యక్తీ ఏ విధంగా భావించుకుంటాడో ఆ విధంగానే కనబడుతాడు. అందులో సందేహం లేదు. భగవంతుడు నీకు దూరంగా ఉన్నాడనో, ఆయన దయలేనివాడనో నువ్వు నమ్ముతున్నట్లయితే భగవంతుడు నీకు దూరంగానే వుంటాడు. దయాహీనుడుగానే ఉంటాడు. నీవు దేవుని ఆగ్రహాన్నే అనుభూతి చెందినప్పుడు మరీ నీ ఇష్టదైవం అలాగే వుండవలసిన అవసరం వుంటుంది కదా! కాళిని భజించేవారికి ఆయన కాళికాదేవి అవుతాడు. భక్తులకు సాక్షాత్తు మోక్షమే. విజ్ఞాన జిజ్ఞాసువులకు దైవం ఓ విజ్ఞాన సర్వస్వమే. మిథ్యావాదులకు రూపరహితుడు. నాస్తికులకు నాస్తికుడు. అంతేకాదు ప్రేమికులకు ప్రేమే. ఆయన సోదరుడు, సన్నిహితుడు, స్నేహితుడు, హితుడు. ప్రతీ క్షణం, అనుక్షణం ఆత్మ చోదకుడు అని నమ్మేవారికి, సహాయం అందించేందుకు భగవంతుడు సర్వసంసిద్ధంగా ఉంటాడు. అన్నింటిని నిర్మూలిస్తాడని నీవు నమ్మితే, ఆయన నీ దోషాలన్నిటిని నిర్మూలించగలడు. పాపాల్ని సునాయాసంగా హరించగలడు. అంతులేని ఆయన కరుణను నువ్వు అనుక్షణం అనుభూతి చెందగలవు. భగవంతుని నుండి నువ్వు నీ అంతరాంతరాల్లో ఏమి కాంక్షిస్తున్నావో అదే భగవంతుని పట్ల రూఢి అవుతుంది.

దైవానికీ మానవులకు మధ్య బహుముఖమైన, అనంతమైన ఈ అనుబంధాన్ని అన్నిటిలోనూ నువ్వు ఒక్కసారి చూడగలిగే చైతన్యావస్థలోకి నువ్వు ప్రవేశించగలిగితే – అప్పుడు సమస్త విషయాల్లోనూ విశిష్టతను చూడగలవు. మానవజాతి పరిణామ క్రమాన్ని నువ్వు దర్శించగలవు. మానవుల కలలకు, ఆశలకు, ఆశయాలకు, అవగాహనకు అనుగుణంగా భగవంతుడు సృష్టించాడని నువ్వు తెలుసుకోగలవు. భౌతికవాదులకు భగవంతుడు ఏ విధంగా భౌతికవాదిగా ఉంటున్నాడో, ఆయన రోజు రోజుకీ ఏ విధంగా పెరుగుతూ, వికాసం చెందుతున్న మానవ

చైతన్యానికి సరిపడేటట్టు తేజోవంతుడౌతూ సమీపం అవుతున్నాడో తెలుస్తుంది. ఎవరికి వారే నిర్ణయించుకొనే స్వేచ్ఛ ఉంది. ఈ ప్రపంచచరిత్ర అంతా మానవునికి భగవంతునితోగల పరిపూర్ణ సంబంధమే. అది సనాతనమైనది. అద్భుతమైనది. వర్ణింపనలవికానిది. ఇంతా చేసి ఈ మొత్తం అంతా కలిసి భగవంతుని పరిపూర్ణ అవతరణలో ఒక వీసం మాత్రమే!

నీ ఆకాంక్ష ఏ విధంగా వుంటే దైవము ఆ విధంగా నీలో వుంటాడు. అలాగని నీ విపరీత ధోరణులకు ఆయన తలవంచుతాడని కాదు. నీ ఆత్మేచ్ఛను గురించి నేను మాట్లాడుతున్నాను. అయితే ఒక్కొక్కప్పుడు ఆయన నీవు చేసే గొంతెమ్మ కోరికలు కూడ తీరుస్తాడు. కొంతమంది భక్తులు ఒక నిమిషం సాన్నిధ్యాన్ని, ఒక నిమిషం ఎడబాటును అనుభవిస్తారు. ఆయన కూడ అదే విధంగా స్పందిస్తాడు. ఇంతకీ చెప్పబోయేదేమిటంటే దేవుణ్ణి గురించి నీవు అన్నదమ్ముల వరసే అనుకుంటావో, అక్కచెల్లెళ్ళ వరసే అనుకుంటావో, మరెలా అనుకుంటావో ఆయన అలాగే కనబడతాడు. ఇక్కడే నీవు జాగ్రత్తపడాలి. నీవు ఆయన్ని విశ్వసించాలి. నీవు ఆయన్ను పూర్తిగా నమ్ముకున్నావనుకో. ఇక ఆయన నీ జీవితంలో ప్రవేశించి అనూహ్యమైన విధంగా మిరకిల్స్ చేస్తాడు. అదొక ఇంద్రజాలమే. ప్రతి క్షణం ఆయన నిన్ను లేవదీసి, దగ్గరకు తీసికొని తన గుండెలకు హత్తుకుంటాడు. దృఢమైన బాహుబంధాలతో నిన్నాలింగనం చేసుకొంటాడు.

చివరి భాగం ఆంగ్లమూలం:

The attitude is thus very important, even the outer attitude. People do not know how important is faith, how faith is miracle, creator of miracles. If you expect at every moment to be lifted up and pulled towards the Divine, He will come to lift you and He will be there, quite close, closer, ever closer.

మూలం: శ్రీమాత

అనువాదం: ఆర్.ఎల్.ఎన్. శాస్త్రి, పున్నమరాజు నాగేశ్వరరావు

(*CWM* Vol. 13, pp. 52-53, 61, 68, 70, 73, 75-78)

నిజమైన ఆంతరంగిక సంబంధం

మనిషికి మనస్సు ఒకటున్నది గదా! అది ఒక శాపం. ఎంత గంభీరమైన విషయాన్నైనా సరే మనస్సుతో అర్థం చేసుకునేందుకు ప్రయత్నిస్తుంది, దిగజార్చేస్తుంది. మరి శ్రీమాత అనగా చైతన్యం ముద్ద కట్టిన మూర్తి గదా! నువ్వు ఆమెను మనస్సుతో గాకుండ అంతకంటె లోతైన దృష్టితో అర్థం చేసుకోవాలి. అప్పుడే నీవు ఆమె సాన్నిధ్యాన్ని పొందగలుగుతావు.

— సంపాదకుడు

ఇంతవరకు నీ అంతరాత్మ మనస్సు దాని భావాలు, ఆశయాల ద్వారా లేక ప్రాణికము, దాని ఆనందాలు, అభిలాషల ద్వారా అభివ్యక్తమైంది. కాని భౌతిక అవరోధాల నధిగమించి పదార్థము యొక్క రూపాన్ని మార్చివేసి, ఒక నూతన ధర్మాన్ని ప్రతిష్టించేందుకు అది చాలదు. నీ ఆత్మయే కదిలివచ్చి, నీ చైత్యపురుషుడు అంతఃపురంలోనుంచి ముందుకు వచ్చి పూర్తిగా జాగృతమై మౌళికమైన మార్పును తీసుకొనిరావాలి. చైత్యపురుషునికి మనస్సు యొక్క ఉద్దేశ్యాలతోగాని లేక ఇతర బాహ్యమైన కారణాల అవసరంగాని లేదు. తనంతటతానే అది నీకు ప్రత్యక్ష దివ్యానుభూతిని కలిగించగలదు. అది ఒక్కటే దైవసాన్నిధ్యాన్ని, ఆంతరంగిక ఆశ్రయాన్ని అందించగలదు. అవును, దైవం నీకు నిరంతరం తోడుగా వుంటుంది. అప్పుడు నీకు శ్రీమాత దూరంగా ఉండదు. సమీపంలో వుంటుంది! ఇక భగవదనుభూతిని గూర్చిన సందేహాలు దరిజేరవు. ఎందుకంటే మనస్సులో సందేహాలు చెలరేగుతూనే వుంటాయి. ప్రాణికం తహతహలాడుతూనే వుంటుంది. *కాని ఆత్మ మటుకు నిరంతర దివ్యానుభూతిని అనుభవిస్తూనే వుంటుంది!*

నీ చైత్యపురుషుడు దేహాంతఃపురంలో నుంచి బయటకు వచ్చి మా ఇద్దరి నిరంతర స్పర్శను, నిరంతర అనుభూతిని కలిగించి నీ బాహ్యజీవితము నంతటిని ఉద్దీపింప జేయాలి.

*

ఆంతరంగిక సంబంధమనగా శ్రీమాత నిరంతరం నీతో యున్న అనుభూతిని పొందుట. ఆమె వైపు అవిచ్ఛిన్నంగా మరలి యుండి, ఆమె శక్తి నీలో పని చేస్తున్నట్లు, నీకు సహాయపడుతూ, మార్గ మును చూపిస్తూ ఉండుట, ఆమె యందు భక్తిప్రేమలను కలిగి యుండి దగ్గరగా వున్నా, దూరంగా వున్నా నిరంతరము ఆమె నీ చెంతనే వున్న భావము కలుగుట. ఈ అనుబంధమే సాధకుని మనసును శ్రీమాత మనసుకు అత్యంత సన్నిహితంగా తీసుకు వెడుతుంది. ఇట్టి అనుబంధమే సాధకుని ప్రాణికాన్ని శ్రీమాత ప్రాణికంతో ఏకస్వనం చేస్తుంది. ఇట్టి సంబంధమే సాధకుని భౌతిక చైతన్యాన్నంతా శ్రీమాత చైతన్యంతో నింపుతుంది. ఆంత రంగిక దర్శనమనగా ఇదే. కేవలం ఆధ్యాత్మిక సంబంధంగాని, ఆత్మసంబంధంగాని కాదు. భౌతికపరమైనది కూడ.

మూలం: శ్రీఅరవిందులు
అనువాదం: ఎస్.ఎస్. లక్ష్మి

(*SABCL* Vol. 25, pp. 173, 174)

...this great, this sublime and divine love bending over us from the innermost depths of our being, bearing with our weaknesses, rectifyng our errors, healing our wounds, bathing our whole being with its regenerating streams.

The Mother

శ్రీమాత ఫొటోలు

శ్రీమాతతో సంభాషణ (జ్ఞాపకాల నుంచి)

ప్రశ్న: అమ్మా! మీ ఫొటోలో ఏముంటుంది?

జవాబు: అంటే ఏమిటి నీ ఉద్దేశ్యం?

ప్రశ్న: మీ ఫొటో దేనిని సూచిస్తుంది? మీ ఫొటోల్లో అసలు ఏముంటుంది?

జవాబు: నీకు ఆ మాత్రం తెలీదా? (చిరునవ్వుతో) నా ఫొటో అంటే ఎవరు? నేనే! స్వయంగా నేనే నా ఫొటోలో ఉంటా.

ప్రశ్న: అయితే మీ ఫొటోల్లో ఏ రకంగా ఉంటారు? ఏ రూపంలో ఉంటారు?

జవాబు: నేను అన్ని రకాలుగానూ ఉంటాను. ఎలా ఉంటాను అనేది ఆ ఫొటోను బట్టి ఉంటుంది. అది అనేక విషయాల మీద ఆధారపడి ఉంటుంది. నేను ఒక్కొక్క ఫొటోలో ఒక్కొక్క రకంగా ఉంటాను. ఒకేలా అస్సలు ఉండను. నా ప్రతీ ఫొటోలోనూ నా ప్రత్యేకమైన దర్శనం వారి వారికి తగ్గట్టు ఉంటుంది. ప్రతీ క్షణం నేను భిన్నంగా, భిన్న భిన్నంగా కనబడుతూ ఉంటా. ఎప్పుడూ ఒకేలా అసలు ఉండను.

చూడు. నేను ఒకరికి దయామూర్తిలా, మరొకరికి శాంత మూర్తిలా, ఇంకొకరికి ఉదాసీనంగా, మరొకరికి జాలి రూపంలా, ఇంకొరికి ప్రేమమూర్తిలా, మరొకరికి ఈ విశ్వంలో శాశ్వత భౌతిక సత్యంలా అగపడవచ్చు. లేదా శక్తి, నమ్రత, దివ్యమైన మధుత్వం (మాధుర్యం) అలా ఒకే ఫొటోలో విభిన్నాంశములు ప్రకటింప బడవచ్చు.

ఆ మారడం కూడా ఆ వ్యక్తిని బట్టి, అప్పటి స్థితిని బట్టి, వాని తత్త్వాన్నిబట్టి కొత్త కొత్తగా మారిపోతుందన్న మాట. అలాంటి మార్పు అస్తమానం అలా జరుగుతూనే ఉంటుంది. అంచేతే నేను ఎప్పుడూ ఒకేలా కనపడనన్న మాట. నా ప్రతి ఫొటోలోనూ నేను వేరే వేరేగానే ఉంటాను. ప్రతి వానికీ సరిగ్గా

వానికి సరిపోయే విధంగా ఒక ప్రత్యేకమైన తీరులో నేను రూపొందుతాను.

మామూలుగా నా ఫొటోలో ఆ క్షణంలో నా భావప్రకటన రీతి, నాలోని అనంత చైతన్యం కనబడతాయి. కాని అందులోనే (ఫొటోలోనే) విశ్వమాతయొక్క అనేకమైన అంతులేని రూపాలు ఉంటాయి. వాటిని మీరంతా కనుక్కోవాలి. మీరు నా ఫొటో చూడగానే నా ఏ స్వరూపం మీకు దర్శనమిస్తుందో మీరంతా కనుక్కోవాలి.

ఆ అంశం ఏమిటో మీరంతా అనుభవించాలి, తెలుసుకోవాలి. నా ప్రతీ ఫొటోలోనూ నా భిన్నమైన దర్శనము దాగి ఉంటుంది. నా ఫొటోలో ఉన్నది ఒక ఆధ్యాత్మిక రూపము. *కాని అది కేవలం ఒక కాయితం మీద ఉన్న బొమ్మ మాత్రం కానే కాదు. అది ఒక సజీవమైన రూపము.* పైపైకి చొచ్చుకు వచ్చే ఒక వాస్తవమైన శక్తి. ఏ కార్యమునైనా అనేక విధాలుగా చేయగల మహత్తర శక్తి అది.

ఆ శక్తి నాలోని ఒక భాగమే. కాకపోతే ఒక ఆకారం స్పష్టంగా దాల్చింది అన్న మాట. ఆ ఆకారంలోంచే నా శక్తి పని చేస్తుంది. ఎంచేత అంటే నేనే అక్కడ ఉంటాను కాబట్టి.

నేను నా ఫొటో ఎవరికి ఇస్తానో, వానికి ఏమిటి అవసరమో, ఎలా ఏ పరిస్థితుల్లో ఎందుచేత నేను నా ఫొటో ఇచ్చానో అనే వాటి మీద కూడా ఆ శక్తి ఆధారపడి ఉంటుంది. అంచేతే నేను ఎప్పుడూ నా ఫొటోలో ఒకే వ్యక్తిగా ఉండను. ఒకేలా దర్శనం ఇవ్వను.

ఇంకా, ఒక వ్యక్తి చేతనాస్థాయిని బట్టి, వాని స్వభావం ఎటువంటిది, అనే వాటి మీద కూడా ఆ శక్తి ఆధారపడి ఉంటుంది. నిజానికి అది అస్తమానం క్షణక్షణం మారిపోతూనే ఉంటుంది. అంచేతే నా ఫొటో ఒకటే అయినా నీకు ఒకలా, ఇంకొకరికి ఇంకోలా కనబడుతుంది. అదీ సంగతి. సరే, నన్ను ఇదంతా ఎందుకు అడుగుతున్నావు?

ప్రశ్న: అమ్మా మొన్న ఆ మధ్య నేను 'క' అనే ఆయన కొడుక్కి మీ ఫొటోలు పంపాను. ఆ ఫొటోల్లో సరిగ్గా ఏముందో తెలుసుకుందామని ఇలా అడిగాను. అంతే.

జవాబు: నాన్నా, ఆ ఫొటోలు నేనేరా. ఇప్పుడు ఇక్కడ నీకు ఎలా కనబడుతున్నానో ఆ ఫొటోలో కూడా సరిగ్గా ఈ నేనే అచ్చంగా అంతా నేనే అక్కడ ఫొటోలోనూ. ఆ ఫొటోల్లో ప్రతి ఫొటోలోనూ నా ప్రత్యేక దర్శనం తెలుస్తూ ఉంటుంది. అంతా ముమ్మూర్తులా ఇప్పుడు ఇక్కడ నేను ఎలా ఉన్నానో అలాగే నన్నమాట.

మూలం: శ్రీమాత

అనువాదం: ఎం. సి. కనకయ్య

(*Sweet Mother – Harmonies of Light* by Mona Sarkar, pp. 8-12)

BECAUSE THOU ART

Because Thou art All-beauty and All-bliss,
My soul blind and enamoured yearns for Thee;
It bears Thy mystic touch in all that is
And thrills with the burden of that ecstasy.

Behind all eyes I meet Thy secret gaze
And in each voice I hear thy magic tune:
Thy sweetness haunts my heart through Nature's ways;
Nowhere it beats now from Thy snare immune.

It loves Thy body in all living things;
Thy joy is there in every leaf and stone:
The moments bring Thee on their fiery wings;
Sight's endless artistry is Thou alone.

Time voyages with Thee upon its prow –
And all the future's passionate hope is Thou.

Sri Aurobindo

(*SABCL* Vol. 5, p. 154)

మూర్తీభవించిన ప్రేమ

నా బాల్యమున – సుమారు పదమూడేండ్ల వయస్సులో – దాదా పొక సంవత్సరకాలము పాటు – ప్రతి రాత్రి ప్రక్కమీద శయనించగనే, నేను నా శరీరము నుండి వెలికి వచ్చి, సరాసరిగ ఇంటి పైకి, పిమ్మట పట్టణమంతటి పైకి, చాల ఎత్తునకు లేచినట్లును, అప్పుడు నేను నాకంటె పొడవైన ఒక అద్భుతమైన యంగీని ధరించినట్లును నాకు దోచుచుండెడిది. నేను పైకి లేచినకొలది, ఆ యంగీకూడ పొడవగుచు, నా చుట్టును వలయాకారముగ విస్తరిల్లి, పట్టణముపై అతివిస్తారమైన కప్పువలె నేర్పడుచుండెను. అంతట, అన్నివైపుల నుండియు నెందరో పురుషులు, స్త్రీలు, పిల్లలు, వృద్ధులు, రోగార్తులు, దుఃఖితులు – నా చెంతకు వచ్చి, విస్తరిల్లిన యా అంగీ చుట్టును గుమిగూడి, తమ కష్టములు, దుఃఖములు, బాధలు చెప్పుకొనుచు నన్ను సహాయ మర్థించుచుండిరి. వారి ప్రార్థన నాలకించినట్లుగ ఆ యంగీ సచేతనముగ కదలాడి, ప్రతి యొక్కరి వద్దకు విస్తరిల్లుచుండెను. దానిని వారు స్పృశించిన తోడనే, వారికి దుఃఖోపశమనమై, వ్యాధులు నయమై, తిరిగి వారు తమ తమ శరీరములలోనికి ప్రవేశించుచుండిరి. శరీరములనుండి బయటికి వచ్చుటకు ముందుకంటె ఎక్కువగ వారు సంతోషమును, బలమును పొందుచుండిరి. ఈ దృశ్యమంతయు కడు సుందరమై తోచి నా కెంతయు సంతోషము గూర్చుచుండెను. దీని ముందర, దినము నందలి ఇతర కార్యము లన్నియు వట్టి జడములుగా, నిస్సారములుగా, అవాస్తవికములుగా దోచి, రాత్రి వేళ నడచు ఈ కార్యక్రమమే నిక్కమైన జీవితముగ నాకు గన్పట్టు

చుండెను. తరచుగా నేనిట్లు శరీరము నుండి పైకి లేచినప్పుడు, నా యెడమ ప్రక్కన నొక వృద్ధుడు, మౌనముగా, నిశ్చలముగా, కృపా దృష్టితో నన్ను తిలకించుచు తన సాన్నిధ్యముచే నాకు ప్రోత్సాహము కల్పించుచుండెను. పొడవైన ఉదారంగు అంగీ ధరించిన యీ వృద్ధుడు 'దుఃఖములకు అదిష్ఠాత' (Man of Sorrows) గ ప్రఖ్యాతిగన్న మూర్తి విశేషమే యని నేను తరువాత తెలిసికొంటిని.

పగటివేళ పెక్కు సమయములలోను, రాత్రి యందును, నేను – అనగా నా చేతన, నా హృదయస్థానమున సంపూర్ణముగా ఏకాగ్రతను చెందియున్నట్లొక విశిష్టానుభూతి నాకు కలుగుచున్నది. ఈ హృదయమీ స్థితి యందొక అవయవ విశేషము గాదు; భావనా విశేషమును గాదు; వైయక్తిక స్థితి నధిగమించి నిత్యమై విలసిల్లు కేవల దివ్యప్రేమయే. ఇట్టి ప్రేమస్వరూపమే నేనైన కారణమున, జగత్తులోని ప్రతి వస్తుగర్భము నందును నేనున్నట్లు అనుభవము పొందుచున్నాను. అంతేగాక, అనంతముగా నా చేతులు సాచి, నిరవధిక వాత్సల్యముతో సకల జీవులను కౌగలించుకొని, జగత్తుకంటె విశాలతరమైన నా వక్షస్థలమునకు హత్తుకొనుచున్నట్లు సైతము నా కనుభూత మగుచున్నది. ఓ పరమేశ్వరా, వాక్కులు బొత్తిగా శక్తి చాలవని, మనస్సు చేయు అనువాదము లెప్పుడును బాలచేష్టలే. కాని, నీ కొరకై నా యాకాంక్ష మాత్రము ఎడతెరపి లేక అగ్రులు సాచుచునే యున్నది. నిజమున కది నీ రూపమే, నీవే – నీవే యీ శరీరమున, నీ యభివ్యక్తి కుపచరించవలసియున్న యీ అసమగ్రోపకరణమున నివసించుచున్నావు.

సకల జీవులు నీ జ్ఞానదీప్తిచే నగు శాంతి, సుఖము లనుభవించెదరు గాక!

22-2-1914

అనువాదం: కమలాకర వెంకటేశ్వరరావు ('ప్రార్థనలు – ధ్యానములు' నుండి)

(*CWM* Vol. 1, pp. 81-82)

చివరి మాట

ఒక ఖైదీ నేరము చేసి యావజ్జీవ కారాగారశిక్ష అనుభవిస్తున్నాడు. ఎప్పుడూ ఒకటే కోపం, దుఃఖం, ఒకటే భయం.

కాని ఒక వారము అతను చాలా ప్రశాంతంగా కనిపించాడు. ఒకసారి శనాదివారాలు కొడుకుతో గడిపిన విషయం జ్ఞాపకానికి వచ్చిందని నాతో చెప్పాడు. వారిద్దరూ సరదాగా పొరుగూరికి వెళ్ళారట. ఇంటికి తిరిగి వచ్చేటప్పుడు మంచు కురియడం మొదలయింది. పిల్లవాడు తండ్రిని చూసి 'నాన్నా! దారి ఏం బాగు లేదు. నీవు మంచి సారధివి గదా, నేను నీ ఒళ్లో పడుకుంటా అని తండ్రి తొడపై తలపెట్టుకుని నిద్రలోకి జారిపోయాడు.

ఆ సంఘటన జ్ఞాపకానికి వచ్చిన తరువాత ఆ ఖైదీ చిన్న పిల్లవాడిలా ఏడ్చాడుట. అపుడు భగవంతునితో ఇలా అన్నాడు – 'తండ్రీ! ఇకనుంచి నీవే నా చోదకుడివి. మార్గము బాగు లేదు. కాని, నేను నిన్నే నమ్ముతున్నా' అప్పటి నుండి అతను భగవన్మార్గమును చేరుటచే మనసంతా ప్రశాంతతతో నిండిపోయింది.

ఇదంతా రెండు సంవత్సరముల నాటి మాట. ఇప్పటికీ అతను జైలులో ప్రతి రాత్రి భగవంతుని తొడపై తలపెట్టుకుని నిద్రలోకి జారుకుంటాడు!

మూలం: అనామకుడు

అనువాదం: సూర్యప్రభ

సమాచార పత్రం

17 నవంబరు 2004: మదర్ మహాసమాధి రోజు – ఆమె మందిర దర్శనము, ప్రాతఃకాలమున సమాధి వద్ద, సాయంకాలము ప్లే గ్రౌండులోను ధ్యానము జరిగినవి. 20 నవంబరు నాడు కూడ ఆ రెండు చోట్ల ధ్యానము జరిగినది.
24 నవంబరు 2004: దర్శన దినము, శ్రీఅరవిందులు సిద్ధి పొందిన రోజు. శ్రీఅరవిందుల మందిర దర్శనము, సమాధి వద్ద ధ్యానము ప్రేగ్రౌండులో కవాతు ప్రదర్శనము, చివరగా ధ్యానము నాటి కార్యక్రమములు.
5 డిసెంబరు 2004: శ్రీఅరవిందుల మహాసమాధి నాటి కార్యక్రమములు: ఆశ్రమంలో సమాధి వద్ద ధ్యానము, సాయంకాలం ప్రేగ్రౌండులో ధ్యానము, ఉదయం శ్రీఅరవిందుల మందిర దర్శనము, 9 డిసెంబరు నాడు సమాధి వద్ద, ప్రేగ్రౌండులోనూ ధ్యానము.

ఈ ముఖ్య దినములలో పంచిపెట్టిన సందేశములు – మొదట ఆంగ్లము, తర్వాత తెలుగు.

17 నవంబరు:

Remember the Mother and, though physically far from her, try to feel her with you and act according to what your inner being tells you would be her Will. Then you will be best able to feel her presence and mine and carry our atmosphere around you as a protection and a zone of quietude and light accompanying you everywhere.

Sri Aurobindo

శ్రీమాతను జ్ఞాపకం పెట్టుకో. ఆమెకు దూరంగా ఉన్నప్పటికి, ఆమె నీతోనే ఉన్న అనుభూతిని పొందుతూ, ఆమె ఉద్దేశమేమిటో నీ అంతరాత్మకు ఎలా తోస్తే అలా చేయి. అప్పుడే నువ్వు నీతో శ్రీమాత ఉన్నట్లు, నేను కూడ ఉన్న అనుభూతిని చెంద



స్వస్వరూపావిష్కరణ

అఖిల

అఖిల భారత పత్రిక, మార్చి 2005

స్వస్వరూపావిష్కరణ

శ్రీమాత ప్రవచనములు

నువ్వు ఒక ప్రత్యేక వ్యక్తివనే మాట నిజమా?	...	3
స్వస్వతంత్రమైన పురుమడు	...	7
తనను తాను తెలుసుకొనుటయే ఆత్మనివేదనకు మూలసూత్రము	...	8
ఒకే శరీరం – అనేక వ్యక్తిత్వాలు, అనేక గమ్యాలు	...	12
దైవేచ్ఛను నెరపటమెలా?	...	18
వ్యక్తి అంటే ఎవరు?	...	21
ఏకరూప ధారణకు తొలిమెట్టు	...	24
తనను తాను తెలుసుకొనుట	...	28
స్వస్వరూపావిష్కరణ	...	33
~~యోగయానంలోని మూడు స్థాయిలు~~	...	~~35~~
మొదలు పెట్టడమెలా?	...	~~37~~ 35
సమైక్య సమర్పణ	...	~~40~~ 38
మనిషి తన సంకెళ్లను వదులుకుండేందుకు ఇష్టపడడు!	...	~~41~~ 39
నిజమైన నిగ్రహం	...	~~42~~ 40
యోగయానంలోని మూడు స్థాయిలు	...	43
శ్రీమాత పిలుపు	...	~~43~~ 41
సమాచార పత్రం	...	45

ఉపోద్ఘాతము

ఈ సృష్టి ఎలా జరిగింది? ఏకత్వం అనేకత్వం అయింది. ఎందు కయింది? తన వినోదం కోసం (శివుడు తాండవ నృత్యం చేస్తాడు). వినోదమంటే యేమిటి? తను సర్వజ్ఞుడు కదా! నిజమే. కాని ఉద్దేశపూర్వకంగానే తనను తాను కుంచిముకొని 'వీడేం చేస్తాడో చూద్దాం' అనుకున్నాడా ఏమిటి? అలాగే అనిపిస్తుంది. సరే మన పరిస్థితులను గురించి కాస్త తెలుసుకుందాము. తన వినోదం కోసం అన్నాడు కనుక, మన మీ సృష్టిని కాస్త పరిశీలిద్దాం.

మన మందుకు సమర్థులమా? మన ఇంద్రియాలందుకు చాలవే. ఇవి కేవలం మన అన్నపానాదులకు, లేక కొంచెం విస్తృతార్థంలో ఈ శరీరానికి సేవ చేసేందుకు పనికొస్తాయి, అంతే. నిజంగా దేవుడు మన ద్వారా వినోదం పొందాలంటే ఇంతకంటె గొప్ప ఉద్దేశమేదైనా వుండి వుండాలి. కాబట్టి నువ్వు ఈ ఇంద్రియాలను నమ్ముకుంటె లాభం లేదు. 'మీరు కాస్త కదలకుండా ఉండండి' అని చెప్పి మన ఆలోచనా విధానాలను అరికట్టి వీటన్నిటికంటె అతీతమైన వస్తువును నీలో కనిపెట్టాలి. అది నీ చైత్యకేంద్రము. దానిని దర్శించినట్లైతే, దాని ప్రభావం వలన మన దృష్టి విశాలమై ఆ 'వినోదమేమిటో' తెలుసుకో గలుగుతాము. దానినే తనను తాను తెలుసుకోవటం – 'స్వస్వరూపానుభూతి' అంటారు. ఈ సంచికలోని 'Individual being' దానినే సూచిస్తుంది. యోగంలో ఒకడుగు ముందుకు పోవాలన్నా, అది గురువు వలన జరగాల్సిందే అన్న విషయం మరిచిపోకండి. Hitch your wagon to a star అన్నారు గదా!

'Individualisation', 'unification' అనే పదాలకు రెడిమేడ్ తెలుగు శబ్దాలు దొరక్కపోవటం వలన 'స్వస్వరూపానుభూతి, మమేకము, సమైక్యము, సమీకరించుకొనుట, ఏకరూపధారణ' లాంటి పదాలను వాడటమైనది.

– సంపాదకుడు

నువ్వు ఒక ప్రత్యేక వ్యక్తివనే మాట నిజమా?

ఈ సృష్టిలో మానవునిది ఒక మధ్యంతర స్థాయి. మనకి మనం ఎంత గొప్పవాళ్ళమనుకున్నా, ఆధ్యాత్మిక పరిశీలన ముందర అది నిలవదు. మనిషి అనగా ఒక మూస, ఆ మూసలో కొన్ని పదార్థములను పోయగా తయారైన అచ్చు. ఒక మనిషికి ఇంకో మనిషికి ఏం తేడా లేదు. ఉదా: ఒకే భావనాధార అందరిలోకి ప్రవేశిస్తుంది. అందరు ఒకేలాగ స్పందిస్తారు. అంటే యేమిటి? నీవు స్వతంత్రుడవు కావు. కాని యోగం వలన నీకు తెలుస్తుంది, అసలు స్వాతంత్ర్యమంటే ఏమిటో. — సంపాదకుడు

ప్రశ్న: 'శరీరపు శక్తి అల్పమైనది. ఈ శరీరము ఒక మూస లాంటిది' అనే వాక్యాన్ని మన మెలా అర్థం చేసుకోవాలి మదర్?[1]

నీకు శరీరం లేకపోతే ఏమవుతుందో తెలుసా? ఈ రూపమే ఉండదు. ఇతరులకు, నీకు ఏమాత్రం భేదం ఉండదు. అంతరంగంలోకి వెళ్లి భౌతిక, ప్రాణికాంతర్గతాల లోకి ప్రవేశించినప్పుడు సర్వమానవాళి ఒకరిలోకి ఒకరు కరిగిపోయి ఒక ముద్దై పోతారు! మనుషులను వేరుపర్చడం చాలా కష్టం. నీకు శరీరం కనుక లేకపోతే అంతా గుజ్జు గుజ్జుగా ఉంటుంది. సముద్రంలో ఒక నీళ్ల సీసా ఉందనుకో. సీసాలో నీళ్లు సముద్రం కంటె వేరుగా ఉంటాయి కదా! ఆ సీసాయే లేకపోతే ఆ నీళ్లు సముద్రంలో కలసిపోతాయి. మనిషి విషయం కూడా అంతే. ఈ భౌతికశరీరం వల్లనే మనిషికి, మనిషికి భేదం ఉండేది. శరీరము ఒక మూస అన మాట. అది ఒక పాత్ర. సముద్రంలో సీసా ఎలాగో ఇదీ అంతే.

---

[1] ఈ శరీరం ఒక మూస లాంటిది. ఆత్మ, మనస్సులను ఆ మూసలోకి పోసినప్పుడు అది దాని అవధులను దాటిపోగలదు, దాని సామర్థ్యం ఎక్కువ అవుతుంది. దాని శక్తి పెరిగి పెరిగి అంతానికి, అనంతానికి ఒక వారధి అవుతుంది. — శ్రీఅరవిందులు
(*SABCL* Vol. 16, p. 386)

(ఒక పిల్ల నుద్దేశించి) మూసంటే ఏమిటో నీకు తెలుసా?

ద్రవపదార్థాన్నికాని లేక చిక్కటి గుజ్జునుగాని అందులోకి పోసినప్పుడు అది చల్లారి గట్టిపడుతుంది. ఆ మూసను బద్దలు గొట్టి దాన్ని బయటకు తీస్తావు. నీ శరీరం కూడా అంతే! ప్రాణిక మానసికాలను అందులోకి పోసినప్పుడు అవి ఒక ఆకారాన్ని పొంది 'నేను' అనే ఒక మనిషి తయారవుతాడు. తెలిసిందా?

విద్యనభ్యసించి జీవితంలో ఇతరత్రా అనుభవాలను సంత రించుకొన్నప్పుడు ఆ ద్రవపదార్థమంతా ఘనీభవించి నువ్వు ఒక స్పష్టమైన వ్యక్తిగా తయారవుతావు. అనగా నీ కంటూ కొన్ని ఆలో చనలు కొన్ని లక్షణాలు స్పష్టంగా ఏర్పడతాయన్న మాట. ఈ మనస్సు చాలా చిత్రమైనది. దాని ప్రస్తుత రూపం ఏమంత చెప్పు కోతగ్గది కాదు! స్వస్వరూపమును పొందిన యెడల అది చాలా గొప్ప విషయము. సాధారణంగా ఒక ఆలోచనా ప్రవాహము గోదావరల్లే పారుతూ ఉంటుంది. ఒకసారి నీలోకి, మరొకసారి ఇంకొకరిలోకి అలా నిరంతరం ప్రవహిస్తూనే వుంటుంది. అంద రిలోను ఒకే విధమైన భావము ఏర్పడుతూ వుంటుందన్న మాట. నీవు ఆలోచించే విషయాన్నే ఇంకొకరు ఆలోచిస్తూ వుంటారు. మరొకరూ అంతే. ఈ విధంగా ఆలోచనా ప్రవాహాలు, భావనా తరంగాలు ఒకరి నుంచి ఒకరికి ప్రవహిస్తూనే ఉంటాయి!

నిన్ను నీవు శ్రద్ధగా పరిశీలించుకున్నట్లయితే నీలో చెల రేగే ఆలోచనలు నీ స్వంతం కాదనేది స్పష్టమవుతుంది. మరి ఆలోచనలెక్కడ నుంచి వస్తాయిట? నువ్వు విన్నవి, చదివినవి, నీకు బోధింపబడినవి మొ॥ అనమాట. జీవితంలో నువ్వు అనుభ వించినవి గాని, వివేచించినవి గాని నీ వ్యక్తిగతములు కానేకావు. Only those who have an intense intellectual life, who are in the habit of reflecting, observing, putting ideas together, gradually form a mental individuality for themselves...ఏదో అలవాటు ప్రకారం తలవని తలంపుగా అర్ధజ్ఞానంతో చాలామంది జీవిస్తూ ఉంటారు. ఏం చేస్తున్నారో, ఎందుకు చేస్తున్నారో, ఎలా చేస్తు న్నారో అనే ప్రశ్నే ఉదయించకుండా బ్రతుకుతూ వుంటారు.

ఒకానొక దేశంలోను నైసర్గిక వాతావరణంలోను, సామాజిక వ్యవస్థలోను జన్మించిన వారు అప్రయత్నంగానే ఆ జీవనవిధానాన్ని, భావనా పరంపరలను, సాంవేదనలను (feelings), ప్రవర్తనలను అనుసరిస్తారు. 'నేనెందుకిలా చేస్తున్నాను' అని ఆలోచించవలసిన అవసరమే వుండదు. ఒకవేళ ఎవరైనా అలా ప్రశ్నించినా కూడ వారు జవాబు యివ్వలేరు. అది వారిలో రక్తనిష్ఠమైన గుణము.

నిజం చెప్పాల్నంటే జీవితమంతా కబుర్లు చెప్పుకుంటూ, భోజనం చేస్తూ, నిద్రపోతూ 'ఎందుకని ఇలా చేయాలి' అనే ప్రశ్న లేకుండానే నిత్యకృత్యంగా జరిగిపోతూంటుంది. అంతా అలవాటు ప్రకారం యాంత్రికంగా జరిగిపోతూంటుంది. నువ్వు ఒకానొక సమాజానికి చెందినపుడు, ఆ సమాజంలోని మర్యాదలను పాటిస్తావే కాని, మరో ఆలోచనలకు ఆస్కారం ఉండదు.

పైన వివరించిన విషయాలను బట్టి స్వస్వరూపము చాలా అరుదైన విషయమని (individuality is not at all the rule), ఎవ్వరికీ ఉండదని తేలిపోతుంది. 'నీ శరీరము, నీ స్వరూపము' అనే ఈ ప్రత్యేక కవచము లేకపోయినట్లైతే నీకూ ఇంకొకరికీ తేడాయే వుండదు. 'Individuality is a conquest' అని శ్రీఅరవిందులు అంటారు. సమిష్టి కంటే భిన్నమైన ఒక ప్రత్యేకమైన రూపాన్ని సంతరించుకోవటమనేది చాలా గొప్ప విషయం. దీనిని మీరు తేలికగా తీసిపారేసేరు జాగ్రత్త! అదొక గొప్ప సిద్ధి. *మీన మేషాలు లెక్కపెట్టుకుంటూ కూర్చుంటే జరిగేది కాదు! ఇది మొదటి దశ మాత్రమే. నువ్వు ఆ స్థాయికి జేరుకున్నప్పుడు దానిని దాటి మరొక చేతనాస్థాయిని జయించాలి.* ఉదాహరణకు నీ మనస్సునే తీసుకుందాం. ఇంతవరకు బుద్ధికౌశలంతో అధిరోహించిన స్థాయిలన్నిటిని, మానసిక నిర్మాణాల నన్నింటిని దాటిపోయి, నూతన శిఖరాలను ఆరోహించాలి. కాబట్టి మొట్టమొదట నీవొక ప్రత్యేక రూపాన్ని సాధించేందుకు చాలా కష్టపడాలి. ఇదంతా సాధించినా కూడ నువ్వు మొదటి సోపానానికే గదా చేరుతావు! అప్పుడు ఆ స్థాయిలో సుస్థిరంగా నాటుకున్నాక, మళ్లి పైచూపు,

శిఖరారోహణ, మరో చేతనా శిఖరంపై కాలుమోపి పతాకావిష్కరణ! మళ్లీ నిన్ను హెచ్చరిస్తున్నాను. నువ్వేం చేస్తున్నావో ఎందుకు చేస్తున్నావో ఏమాత్రం పరిశీలించుకోవడం లేదు! ...and afterwards one must demolish all that has been done in order to progress. But as you do not watch yourself doing things and as it is the custom – not everywhere, of course; let us say here – the custom to work, to read, to develop yourself a little, to try to do something, to form yourself a little, you do it quite naturally and without even watching yourself, as I said. మానవుల బాహ్యా స్వరూపాల పరస్పర సంఘర్షణనలను అనుభవించినపుడే నువ్వు వేరే మనిషివని నీకు తెలుస్తుంది. ఇతర సమయాలలో నువ్వు రాముడువో, లక్ష్మణుడువో అనే ఒక మనిషివి; సంఘర్షణ చెంది యుద్ధం జరిగినప్పుడే వ్యత్యాసాలు బహిర్గతమౌతాయి. నువ్వు వేరే మనిషివి. ఇతరులతో రాపిడి లేనప్పుడు అది కూడా నీకు తెలియదు. నిజం చెప్పాల్నంటే మీ అందరికీ ఎక్కువ తేడా వుండదు. సూక్ష్మాతి సూక్ష్మమైన భేదాలు మాత్రమే.

మూలం: శ్రీమాత
స్వేచ్ఛానువాదం: డా॥ ఆర్.ఎల్.ఎన్. శాస్త్రి

(*CWM* Vol. 9, pp, 43-46)

కొన్ని శతాబ్దాలుగా మానవాళి ఈ తరుణం కోసం వేచివున్నది. అది రానే వచ్చింది. అందుకని మన మాడుతూ పాడుతూ వృథాగా కాలం గడిపేందుకిది సమయం కాదు.

శ్రీమాత

(*CWM* Vol. 11, p. 307)

స్వస్వతంత్రమైన పురుషుడు

నువ్వు ఒక విలక్షణమైన మానవునిగా నిలబడాలి. పరిసరము లలో రకరకాల గాలులు వీస్తూండవచ్చు. ఉదా: కోపము, భయము మొదలైనవి. అవేవి నిన్నంటవు. ఎందుకంటె నువ్వు నీ చైత్య భూమికలో సుస్థిరంగా నాటుకు పోయావు. అట్టివారే నిజమైన మానవులు. అంతేగాని ఐశ్వర్యము, కీర్తిప్రతిష్ఠలు ఆర్జించినవారు కాదు.

— సంపాదకుడు

చైత్యపురుమనితో మమేకమై తమ నిజస్వరూపమును తెలిసికొనిన వారు వారి బాహ్యాజీవితమునుకూడ అంతరంగికము లోనుంచే నిర్వహించుకుంటారు. బాహ్యాప్రేరణలకు ఏమాత్రము చలించరు. ఎందుకంటే అటువంటి ప్రేరణలొచ్చినప్పుడు ముందరే వాటిని చూసి అంతరంగిక సాధనకు దోహదముచేయు వాటిని ఆహ్వాని స్తారు, కాని వాటిని తిరస్కరిస్తారు. అట్టి వారి జీవితమే వేరు. వారి మనస్సు, సామాన్య మానవులవలె సంతగోలగా ఉండదు. ఆత్మచైతన్యమును పొందిన వారి జీవితము సామాన్యుల జీవితం వలె అస్తవ్యస్తంగా ఉండదు. వారు ఎప్పుడూ, ఎట్టి పరిస్థితుల లోను తికమకపడరు. వారు వేసే ప్రతి అడుగూ, చేయు ప్రతి చర్యా వారి లక్ష్యాన్ని ఉద్దేశించే ఉంటుంది.

అసలు మనుమలంటే వారు – ఈ సృష్టిలో ప్రాకృతిక శరీరములను ధరించియు మహోన్నతమైన స్థాయికి జేరుకున్న వారు. అనగా ప్రాకృతిక దోషములను పూర్తిగా జయించి శిఖరా గ్రానికి చేరినవారు. పరిణామదశలో ఉన్నత స్థాయి నందుకోగల వైతాళికులన్న మాట. వారు సిద్ధపురుషులు. ఆ స్థాయిని అందు కోనంత వరకు మనిషి ఇంకా జాంతవిక స్థాయిలోనే వున్నా డన్న మాట. లేక అప్పుడే మానవస్థాయి నందుకొన్నాడు. కాని అతనిని 'మనిషి' అనలేము. పైన ఉదహరించిన జీవినే మనం 'నిజమైన మానవుడు' అనాలి. అర్థమైందా? మీ అంతరంగం లోకి చూసుకొని చెప్పండి. మీరు 'మనుషులు' అవునో కాదో.

మీరు 'మనుమలు' అవుతారనే ఉద్దేశ్యంతో ఇదంతా మీకు చెబుతున్నాను.

మూలం: శ్రీమాత

అనువాదం: డా॥ ఆర్.ఎల్.ఎన్. శాస్త్రి

(*CWM* Vol. 6, p. 108)

తనను తాను తెలుసుకొనుటయే ఆత్మనివేదనకు మూలసూత్రము

'నిన్ను నీవు భగవంతునికి నివేదించుకోవటమే తరుణోపాయము' అని మన శాస్త్రాలు ఘోషిస్తున్నాయి. ఈ నివేదనంటే ఏమిటో మనం తెలుసుకోవాలి. దైవానికి సమర్పించుకునేందుకు నీ దగ్గ రేముంది? నీ అహంకారపు ముద్ద. అదయితే ఆయన కక్కరలేదు. ఇది గాలిలో తేలే వస్తువు మాత్రమే. అహంకారానికి వ్యక్తిత్వమే లేదు. నువ్వు నీ ఆత్మను దర్శించి శరీరాన్నంతా ఆత్మపదార్థంతో నింపేశాయాలి. అప్పుడే నువ్వు దైవానికి సమర్పించుకోవటం అర్థవంత మవుతుంది. *– సంపాదకుడు*

'అహం' ను దైవంతో ఐక్యం చేయాలి. అయితే ముందుగా తాను తానుగా మార్పు చెందటం ఆవశ్యకం. తాను పూర్తిగా రాగరహితుడు కావటమే తప్ప మరొక మార్గం లేదు.

కొంతకాలం క్రితం ఒక సాధకుని వద్ద నుంచి జాబు వచ్చింది. వర్తమానంలో సాహిత్యంగా చెలామణి అవుతున్న చవుకబారు నవలలు, నాటకాలు ఇత్యాది తాను బొత్తిగా చదవలేకపోతున్నట్లు వాపోయాడు. ఆ రచనలోని పాత్రలు, పాత్రధారులతో మమైకమై నరకం అనుభవిస్తున్నట్లు ఆవేదన వెలిబుచ్చాడు. సృష్టిలో ఈ తరహా వ్యక్తులను అనేకమందిని నిత్యము మనం చూస్తూనే ఉంటాము. వీరు గ్రంథపఠనంలో మునిగిపోయి, ఆ రచనలలో విశ్లేషింపబడిన పాత్రల గుణగుణము లన్నింటినీ తమకు

వర్తింప చేసుకొంటారు. అయితే విచిత్రంగా ఈ లక్షణం తమకు అబ్బినట్లు వారు ఏమాత్రం గ్రహించరు. మనము ఏ పని చేస్తున్నప్పటికీ, దానిపై మనదంటూ ఒక ప్రత్యేకమైన ముద్ర పడి తీరుతుంది. ఇది సత్యము.

సృష్టిలో ఈ తీరు సహజం. గ్రంథస్థం చేయబడిన విషయాలు మననం చేసుకొన్నప్పుడు, ఒకరి నడవడి మనము వీక్షించినపుడుగాని మరొకరి సంకల్పాలను విశ్లేషించుకొన్నపుడుగాని, వాటి ముద్ర మనపై పడి కొద్దిగానో, గొప్పగానో మనలను ప్రభావితం చేయుటం కద్దు. ఈ మనోగత దృశ్యాలు అంతరంగంలో తీవ్ర సంక్షోభానికి, సంఘర్షణకు గురి చేయగలవు. సముద్ర తరంగాలు, విద్యుత్ తరంగాలవలె విరామం లేకుండా ఈ సంఘర్షణ కొనసాగుతుంది. ఈ మానసిక సంక్షోభం బహిరంగంగా వ్యక్తం కాదు. తుదకు వీటిలోని బలమైన శక్తిని విజయం వరిస్తుంది. ఈ వత్తిళ్ళు అనేకం అయినప్పటికి, ఈ పోరు ఒంటరి పోరు కావటం చేత, వీటిపై విజయం ఆశించినంత సులభం కాదని తెలుసుకోవాలి.

ఇదంతా ఒక పర్యాయము సమీక్షించుకొంటే, జీవుని యొక్క నిలకడ లేమిని, ఊగిసలాడుచున్న ధోరణి యని గ్రహించవచ్చును. నేటి మానవుని తీరును అద్దం పడుతుంది.

కాబట్టి జీవుడు, స్వస్పృహతో, తాను తానై, రాగరహితుడై, సమగ్ర వ్యక్తిగా ఎదగటం అవసరం. బాహ్యాపరమైన వత్తిళ్లకు ఏమాత్రము తావుండ కూడదు. అయితే తన ఆధ్యాత్మ పురోగతికి దోహదపడే అంశాలను స్వీకరించటం దోషము కానేరదు. అందుకు విరుద్ధమైన వాటిని తిరస్కరించటం ఆశ్చర్యం కలిగించదు. తాను తాను గావటంలో ఇదే పరమ రహస్యం. ఈ ఉన్నత స్థితికి చేరుకొన్నప్పుడు మాత్రమే తాను దైవానికి సమర్పించుకోగలడు.

ఇంతవరకు తేలిందేమంటే, తాను తానైతే గాని, దైవానికి సమర్పించుకోటం సాధ్యం కాదు. వివరించుకొంటె, భేద భావ స్వరూపమైన 'అహం' మరుగవటం అత్యవసరం. 'అహం' మరు

గవటమంటే ఆత్మార్పణమే శరణ్యమని గ్రహించాలి. ఆత్మార్ప ణకు తానంటూ ఒకడు వుండాలి. అందుకు స్వస్వరూపావిష్కరణ గావించుకోవాలి.

ఈ మాటల ధోరణితో నిన్ను తికమక పెట్టుతున్నట్లు భావిస్తున్నావేమో, ఇదంతా ఎందుకు చెబుతున్నానంటే, 'అహం' ను దైవంతో ఐక్యం గావించుటకు ముందుగా, తాను తానంటే ఏమిటో తెలుసుకోవాలి. నీకు స్వస్పృహ కలిగి ఒక స్వేచ్ఛా జీవునిగా, అనగా నిన్ను నిన్నుగానే తీర్చిదిద్దుటకు దాని అవసర మని తెలుసుకో. అందుకు భిన్నమైతే, అంతా తలక్రిందులై పోతుంది సుమీ! మళ్లీ చెబుతున్నాను. *తాను తాను గావటం కొరకే 'అహం' యొక్క అవసరమని గ్రహించటం అవసరం.*

ఇక తాను తానుగా మార్పు చెందటమంటే సర్వమూ ఆత్మ నివేదనమే గదా. ఇది శీఘ్రంగా ముగిసే ప్రక్రియ కానే కాదు. కొన్ని మాసాలు లేక సంవత్సరాలు పట్టవచ్చును. చైత్య కేంద్రాన్నే (psychic centre) ధ్యేయంగా సాధనను మలచుకొని స్వస్వరూపాన్ని ఆవిష్కరించుకోవాలి. అది పూర్వమే పునీతమై భగవద్దత్తమై పోయింది కాబట్టి, సాధనకు ఈ స్థానము కేంద్రమై నపుడు ఎల్లప్పుడు ఇదే విధంగా జరుగుతుందని గ్రహించుకో వాలి. ఈశ్వరానుగ్రహం కలిగి స్వస్వరూపాన్వేషణ తుది దశ సమీపించినపుడు, ఈశ్వరానుగ్రహాణంవల్ల అన్వేషణ ముగిసి సిద్ధి కలుగుతుంది.

ప్రశ్న: తల్లీ! స్వస్వరూపవంతులు బహు అరుదని తమరు సెల విచ్చారు కదా!

అవును. అయితే సృష్టిలో మానవాళినంతా దృష్టిలో పెట్టు కుంటే వీరంతా స్వస్వరూపావిష్కర్త లెన్నటికి కాలేరు. వీరంతా కలగూరగంపవలె ఓ సర్వసమ్మేళనరాశి. శ్రీఅరవిందుల రచన లలో ఈ విషయం స్పష్టంగా చెప్పబడినది. వారి దృష్టిలో ఇతడు స్వస్వరూపాన్ని సాక్షాత్కరింపచేసుకొన్న స్వేచ్ఛా జీవి. ఈ స్థితిని పొందటం సులభం కాదు.

అయితే ఒకానొక కృపావిశేషము వలన, బలమైన ఆకాంక్షతో, తనను తాను తెలుసుకోవాలని తపిస్తున్నప్పుడు, అప్రయత్నంగా హృదయకవాటం తెరుచుకొని దివ్యానుభూతికి లోనుగావచ్చును. ఏ కారణంగానైనా ఆ అనుభూతి క్షణికమై ద్వారాలు మళ్లి మూసుకొన్నప్పటికి, ఈతనికి జరుగు నష్టము లేశమే. ఆ దివ్యానుభూతి ముద్ర స్మృతిలో నిలిచిపోయి, ముమ్ముందు సాధనకు ఉపకరిస్తుంది. రేపో మాపో నీకున్నూ ఈ అనుభూతి కలుగవచ్చును.

ప్రశ్న: తల్లీ! ఈ 'అహం' తో మనము ముడిపడటానికి కారణం ఏమిటి?

బహుశః ఆ 'అహం' అవసరం కొంతవరకు ఉండి యుండవచ్చును. 'అహం' లేకపోతే స్వస్వరూపావిష్కరణ ప్రశ్న ఉదయించదు. ఆ ఉన్నత స్థితి, ప్రాప్తించిన తరువాత, 'అహం' అణగారిపోతుంది. ఇక అంతరించినట్లే. అయితే ఈ స్వస్వరూప స్థితి ప్రాప్తించినప్పటికీ, తమ స్థితిని ప్రదర్శించుకొనుటకు ఈ 'అహం' ను కొందరు ఉపయోగించటం చూస్తున్నాము. వీరంతా దీనిని దూరం చేసుకోవటానికి ఎటువంటి ప్రయత్నం చేయలేక పోవటం దురదృష్టము.

అయితే నేను మాత్రం ఈ 'అహం' ను అణచివేయటం విషయంలో మీరు ఏమరుపాటు పడకుండా ప్రతి క్షణం గమనిస్తాను. సత్యాన్వేషణకై తగిన సలహాలు, సూచనలకు కొదవ లేదు. మీరంతా యౌవనదశలో నున్న సాధకులు. అంతరంగమును పటిష్టము చేసుకొని, కఠోరదీక్షతో కొన్ని సంవత్సరాలు శ్రమపడాలి. మనస్సు స్వాధీనమై, సంకల్పబలము సిద్ధింపగా, స్థితిగతులను, నెమరువేసుకొన గలదు. అందువల్ల కాల వ్యవధి తప్పనిసరి. బాల్యదశలోనే ప్రారంభిస్తే యౌవనదశ చేరుకొన్నప్పటికి కొంత పురోగతి కనిపిస్తుంది. సాధ్యమైనంత వరకు సాధన ముందుగనే ప్రారంభించటం అత్యంత శుభము. ఎల్లప్పుడు అంతర, బాహ్యప్రవృత్తుల గతిని విశ్లేషించుకొంటూ, వీటి మూలము విచారించుకోవాలి. అపరిపక్వ దశలో అనగా ప్రవృత్తుల గతి విశ్లేషిం

చుకొనుటలో శక్తిహీనుడైనప్పుడు, మనస్సులో ఉదయించే అనేక ప్రశ్నలకు, సందేహములకు జవాబు లభించదు.

నీవు అన్యుల సాంగత్యములో నున్నప్పుడు మీ మధ్య వెలువడే భావతరంగాల గూర్చి నీ వెన్నడైనా దృష్టి సారించావా! నీపై ఆ భావతరంగాలు చూపగల ప్రభావం గురించి నీకు ఇసుమంతైన అవగాహన లేదు. అసలు నీవు నిద్రమత్తులో ఉన్న సంగతే తెలియని మందమతివి. ఈ విషయం కూడా నీకు అవగాహన లేదు. ప్రతి నిత్యము ఇదే ధోరణి సాగిపోతున్నది. ఇక నీ అధ్యాత్మిక జీవితానికి, నీ సాధనకు ఇంతే సంగతులు!

మూలం: శ్రీమాత
అనువాదం: శ్రీ శరణ్

(*CWM* Vol. 6, pp. 256-61, 333-36)

ఒకే శరీరం – అనేక వ్యక్తిత్వాలు, అనేక గమ్యాలు

నీ శరీర మొక్కటే అయినప్పటికి నిజానికది అనేక దినుసుల సంపుటి. మనోప్రాణిక దైవికములు నీలో నిక్షిప్తమై ఉంటాయి. వాటి వాటి బలాలతో నిన్ను తాడిస్తూ ఉంటాయి. పాపం నువ్వు ఆ శక్తుల చేతిలో ఓ కీలుబొమ్మవి. చైత్యసంపర్కం కలిగినప్పుడు గాని నీవు నిజమైన మనిషివి కాలేవు. – సంపాదకుడు

మనిషి బాహ్యస్వరూపము ఒకటే అయినప్పటికి అందులో అనేక భూమికలు నిక్షిప్తమై వుంటాయి. ఒక్కొక్కసారి ఒక్కొక్క భూమిక ఆవిష్కారమౌతుంది. దేని జీవితం దానిది. కాని ఇవన్నీ ఒకే శరీరంలో ప్రవర్తించటం వలన – ఆ సంపుటి – ఒకే వ్యక్తి అనే భ్రమ కలిగిస్తుంది. నీ స్థూలశరీరం వలెనే నీలో ఓ ప్రాణిక పురుషుడు, ఓ మనోమయ పురుషుడు, ఓ చైత్యపురుషుడు ఉంటారు. దీనిని అర్థం

చేసుకొనుట అంత సులభం కాదు. కోరికలు, మనోవికారములు ఉద్రేకాదులతో గూడిన జీవితం గడుపుతున్నప్పుడు ప్రాణిక పురుషుడు అధిపతి. నీవు ఆధ్యాత్మిక కృషిలో మనఃపూర్వకంగా, నిస్వార్థంగా సత్కార్యాలు చేస్తున్నప్పుడు నీలో చైత్యపురుషుడు ఆధిపత్యం వహిస్తున్నాడు.

*

ఈ సందర్భంగా శ్రీమాత ముందుచూపు (*CWM* Vol. 12, pp. 77-79) అనే వ్యాసంలో ఈ విషయాన్నే వివరిస్తూ ఇలా అన్నారు.

"మనం ఒకే అస్తిత్వం కానేరము. సామాన్యమైన తర్కాని కి అందే ఏకైక గమ్యంగల అస్తిత్వం కాదు మనది. చాలా మంది జీవితం సంక్లిష్టమై తలాతోకా లేకుండా ఉండడం గమనిస్తూంటాం. మనకి జరిగే సంఘటనలను గురించి ముందరే తెలియకపోవటానికిదే కారణం.

కొందరి విషయంలో విధి చాలా సంక్లిష్టమై వారికి జరిగే సంఘటనలు అకస్మాత్తుగానూ అనుకోని విధంగానూ జరుగు తుంటాయి.

'ప్రతి ఒక్కరూ ముఖ్యంగా తెలుసుకోవలసినది ఏమనగా – జీవజాలమంతా ముఖ్యంగా మానవులు అనేక తత్త్వాల సమ్మే ళనమై వాటి కవి ఒకదానితో ఒకటి పెనవేసుకొని ఒక్కోసారి పరస్పరరూపకములుగాను, కొన్ని సార్లు వ్యతిరేకిస్తూ ఒక దానితో ఒకటి పోటీ పడుతూంటాయి.'

మనలో అనేక వ్యక్తిత్వాలున్నాయి. ఈ వ్యక్తిత్వాలు, ఒక దానితో మరొకటి సానుకూలత కలిగినపుడు ఆ మానవునిలో మంచి బుద్ధికౌశలమో, కర్మకౌశలమో రాణిస్తాయి. కానీ, సాధార ణంగా అలా జరగదు. ఈ వ్యక్తిత్వాల పొందిక సాధారణంగా పొసగదు. ఒక వ్యక్తిత్వం పరిపూర్ణతను సాధించడానికి జ్ఞానా ర్థియై ముందుకు పురోగమిస్తుంటే మరొక దానికి వినోదమూ, భోగలాలసత్త్వమూ కావాలి. ఈ వ్యక్తిత్వాలు ఒక దానితో మరొ కటి పొసగనపుడు వ్యక్తి జీవితము అసంబద్ధ మవుతుంది. నిజా నికి ఇది సర్వసాధారణమే.

శ్రీమాత తన వ్యాసంలో –

"మానవునిలోగల వ్యక్తిత్వాలలో ప్రతి ఒక్కటి ప్రత్యేక పరిధిని కలిగి స్వీయ నిశ్చయ తత్త్వమున కనుగుణముగా ప్రత్యేక గమ్యం కలిగి ఉంటుంది. ఈ సంకల్పాల సమ్మేళనములో వివిధ ములై విజాతీయతను కలిగి వ్యక్తియొక్క గమ్యాన్ని నిర్దేశిస్తుంది."

ఒక వ్యక్తి అనేక వ్యక్తిత్వాలు కలిగి వుండవచ్చును. పది కాని, ఇరవైకాని ఉన్నాయనుకుందాం. ప్రతీ ఒక్కటీ ప్రత్యేకమైన గమ్యం కలిగి ఉంటుంది. భౌతిక ప్రపంచంలో వ్యక్తిత్వం అనగా మానవ శరీరమే. అందువలన మానవ శరీరంలోగల వ్యక్తిత్వాలు ప్రత్యేక గమ్యాన్ని కలిగి వుంటాయి. దాని వలన ఒక దానితో ఒకటి పొత్తు కుదరక పోరాటాలతో, సంఘర్షణలతో అంతరంగ అస్వస్థతకు దారి తీస్తాయి. బలమైన వ్యక్తిత్వం 'అర్భకుల' పై ఆధిపత్యం వహించటమేగాక వీటిని తలెత్తకుండ అణచివేస్తుంది. అందువలన మిగిలిన వ్యక్తిత్వాలు నిద్రావస్థలో వుండి సమయం కొరకు వేచి వుంటాయి. అనుకూల సమయంలో అకస్మాత్తుగా బయటపడి జీవితాన్ని తారుమారు చేస్తాయి – ఆ వ్యక్తి జీవితం అస్తవ్యస్తమైపోతుంది. ఒక రోజు ఓ పని చేస్తాడు. రేపు మరో కార్యం చేబడతాడు....

అలాంటి వారంతా భౌతిక జీవితంలో మునిగి వుంటారు. అందువలన అతి కొద్ది విషాదం కూడా వారిని పూర్తిగా కదల్చి వేస్తుంది. నిజమైన సామరస్యం కలిగిన వ్యక్తిత్వం అంతరంగ స్థితులను (వ్యక్తిత్వాలను) తెలివిగా సరి చేస్తుంది. పుట్టుకకు ముందే యీ సవరింపు అలవోకగా ప్రభావితమవుతుంది. కానీ అది అరుదుగా సంభవిస్తుంది. సరియైన విజ్ఞానము, క్రమశిక్షణ ద్వారా యీ సవరణ సాధింపబడుతుంది. దీనిని సాధించుటకు ఒక వ్యక్తి గట్టి కృషి చేసి, చైత్యపురుమని కేంద్రంగా చేసుకుని వివిధము లైన వ్యక్తిత్వాలను చుట్టు పొందుపరచవలసి వుంది.

శ్రీమాత *"వ్యక్తిగత క్రమశిక్షణ లోనూ, సంకల్పబలం లోనూ, ఈ వ్యక్తిత్వాల మధ్యగల సంబంధాలను క్రమబద్ధతను మార్చవచ్చును. ఈ వివిధములైన నియతి వాదాలన్నీ (determini-*

sms) చైతన్యం యొక్క కేంద్రీకరణ ననుసరించి ఒక దానిపై ఒకటి వివిధ రీతులలో పని చేస్తుంటాయి. వాటి సంకీర్ణత ఎల్లప్పుడూ మారుతూనే వుంటుంది. కనుక ముందుగా చూడలేము" అంటారు.

గణితంలో ఒక్కోసారి అనేక సంఖ్యలను గుణించాల్సివచ్చినప్పుడు ఆ సంకీర్ణత అగణనీయమై ఓ బ్రహ్మరాక్షసిలా తయారవుతుంది. అట్లే నీలో అనేక గమ్యాలు కలిగి వుండి ఒక సమయంలో ఆధిపత్యం కలిగిన భాగాన్ననుసరించి వివిధ సంయోగములతో వున్నప్పుడు జరగనున్నది తెలుసుకోగలుగుట సులభతరం కాదు. చైతన్యదశలో కూడా యిట్లే జరుగుతుంది. ఒక గమ్యం ఒక వ్యక్తికి ప్రాతినిధ్యం వహిస్తుంది. అవి ఒక దానిపై మరొకటి పనిచేయుట వలన జరుగు విషయాలు భయాన్ని గొలుపుతాయి. అందువలన వాటిని ముందుగా చూడలేము. విశ్వధర్మాలన్నీ వాటికవే స్వతంత్రంగా పని చేస్తుంటాయి. ఈ విశ్వంలోని చిత్రవిచిత్ర రూపాలన్నిటికి మూల మిదే.

"జీవితాన్ని సుఖసంతోషాలకు ఆలవాలంగా మలచుటకు ఏదైనా మార్గమున్నదా? వున్నది! అది నీ చేతన. ఆ చేతనను వున్నతస్థాయిలో నిలబెట్టాలి. నీ జీవనసరళంతా నీ చేతనాస్థాయి కణుగుణంగా నడుస్తుంది. 'నువ్వు మహోన్నత చేతనాస్థాయిలో వున్నట్లయితే నీకంతా మంచే జరుగుతుంది' అని చెప్పటం ముమ్మాటికి నిజం. కాని ఆ స్థాయి నందుకోవటం అందరికి సాధ్యం కాకపోవచ్చు. ఏం పరవాలేదు. నీ కేదైనా ప్రమాదం కాని, విషమ పరిస్థితికాని ఎదురైనప్పుడు వెంటనే నువ్వు ప్రార్థించి, తీవ్రంగా ఆకాంక్షించి 'నీ ఇచ్ఛయే జరుగు గాక' అని అనుకొని పూర్తిగా దైవానికి నివేదించుకోవాలి. అప్పుడు దైవము నీ మొర నాలకిస్తాడు. చిత్తశుద్ధితో చేసిన నీ పిలుపుకు జవాబు వచ్చి, నీకు జరుగబోయే ఘటన మారిపోతుంది. నీ కనుకూలంగా మలచబడుతుంది. ఇటువంటి ఘటనలనే అందరూ చూసి 'అద్భుతం అత్యద్భుతం' అని అనుకుంటారు.

చైతన్య స్థాయి మనిషి నెలా రక్షిస్తుందో చూద్దాం!

ఒక వ్యక్తి అతని కార్యాలయమునకై బయలుదేరుతాడు. ఇంటి నుండి కొంత దూరం వెళ్లిన తరువాత ఏదో మరచిపోయా నని గుర్తుకు వస్తుంది. వెనక్కు మరలి తాను మరచిన దానిని తీసుకుని వస్తూన్నప్పుడు తాను వెనుకకు తిరగకుండా ముందుకు అడుగు పెట్టినట్లయిన మరణించి వుండేవాడు. ఆ ప్రదేశంలో ప్రాణాంతకమైన సంఘటన జరిగింది. ఈ వ్యక్తి చైతన్యంలో ఏదో వెనుకకు వెళ్లమని చెప్పడం ద్వారా అతడు రక్షించబడ తాడు. దీని అంతరార్థం యిదే. చైతన్యం ప్రవేశించుట ద్వారా జరగబోయే విధి మారుతుంది. ఈ వ్యక్తిలో రెండు గమ్యా లున్నాయి. ఒకటి అతని చావును మరొకటి అతని ప్రాణాన్ని కోరుకున్నాయి.

ప్రశ్న: దీనిని కాకతాళీయం (అనుకోకుండా జరిగిన సంఘటన) గా చెప్పొచ్చా?

కాదు. అకస్మాత్తుగా జరిగేది తప్పక అసంగతం లేక అసంబద్ధమవుతుంది. అకారణంగా జరిగేది జీవితమే అసంబద్ధ మని నమ్మకం కలిగితే ఇంకా నేర్చుకోవలసింది చాలా ఉంది. జీవితం చాలా నిబద్ధత కలిగి ప్రతి చిన్న విషయం నిర్ధారింపబడే వుంటుంది. ఏ విషయమైనా అలవోకగా జరిగింది అనిపిస్తే విధి నిర్ణయాల గురించి కించిత్ జ్ఞానం కూడా లేదన్న మాట. జీవి తమంతా లెక్కలేని శాసనాల కలవేత. వాటిని గురించి బొత్తిగా తెలీనపుడు యీ శాసనాల ప్రకారం ఏది జరిగినా నీకు అద్భుతం అనిపిస్తుంది.

'పవిత్ర' ఇలా చెప్పారు. "గణితంలో అనేక సంఖ్యలు మూకుమ్మడిగా ఒకేసారి వర్తించినప్పుడు అవన్నీ స్వతంత్రంగా పని చేస్తుండగా వచ్చే ఫలితం అకస్మాత్తుగా వస్తుంది. దీనినే 'ఛాన్స్' అంటారు. అది అలా కనపడుతుంది."

ఎవరైతే వారి వారి చైతన్య పురోగమనానికై కృషి చేస్తారో, వారి జీవితాలలో ఒకప్పుడు జరిగిన సంఘటనలు ఒకప్పుడు దుర దృష్టకరంగా కనపడి 15 సం॥ తర్వాత అవి ఒక ఆశీర్వాదం గానో కృపాకటాక్షంగానో, గొప్పవిగానో కనపడుతున్నట్లు తెలుసు

కుంటారు. నీయొక్క అత్యున్నత చైతన్యాన్ని సామాన్య జీవనం లోనికి తెచ్చుకున్నప్పుడు నీ జీవితంలో ఒక మంచిని తెస్తుంది. ఇది స్పష్టమైన విషయం.

ఉన్నతిని సాధించిన వారికీ అనుభవం క్రొత్త కాదు. దుర దృష్టమనేది వారి సోపానానికి మొదటి మెట్టు. ఆ సంఘటన లేకుండా వారు పురోగమించలేరు. అంతర్గత దృష్టి కలిగిన వారు తమ ఉన్నత చైతన్యస్థాయి లోనికి ఇచ్ఛాపూర్వకంగా ప్రవేశించి నపుడు తమకు జరిగిన మహోపకారాన్ని చూడగలిగి గ్రహించ గలడు.

కానీ దీనిని గ్రహించడానికి మనఃపూర్వకమైన కృషి ద్వారా ఉన్నతిని సాధించాలి. నిజాయితీ లేనపుడు నీ జీవితా ర్గతం లోకి తొంగిచూసే దృష్టి అలవడదు. నిన్ను నువ్వు అంచనా వేసుకోగలిగినపుడు 'నేను ఎంత అల్పజీవిని' అనుకోగలగాలి.

మూలం: శ్రీమాత

స్వేచ్ఛానువాదం: ఎస్.ఎస్. లక్ష్మి

(*CWM* Vol. 5, p. 134; Vol. 15, pp. 308-15)

In the depths of your consciousness is the psychic being, the temple of the Divine within you.

The Mother

(CWM Vol. 3, p. 7)

దైవేచ్ఛను నెరపటమెలా?

జీవితంలో ఒక్కొక్కసారి నువ్వు ఒక పని చేసిన తరువాత అయ్యో! ఎందుకట్లా చేశానో అని బాధపడతావు. నీ నిమ్న ప్రకృతే దానికి కారణము. నీ సుప్తచేతన కూడా ప్రాకృతిక దోషములకు నిలయము. ఒక్క మానసిక విషయములే కాదు, శారీరక వ్యాధులు కూడా సుప్తచేతనలో నుంచే వస్తాయట. నీ అనుమతి లేనిదే అలా జరగదు. ఇది నీకు తప్పని సరేం కాదు. ఉన్నత చేతనను పొందినట్లైతే నువ్వు అక్కడ కాపలా కాసి దుష్టశక్తులను అక్కడికక్కడే తిప్పికొట్టవచ్చు. — సంపాదకుడు

"ఇదంతా బయటనుండి వచ్చే ప్రభావమేనండీ!" అంటూ పరిస్థితులను తిట్టుకోవటం మామూలే.

ఓ పీడగాలి వీచింది. అంతే. ఒక్క క్షణం చేతన క్షీణించింది. అంతే. "ఆహా! నేను సచైతన్యంగా లేను" అనుకుంటావు. దీని కంతటికి కారణం నీవు ఆకాంక్షించవు కాబట్టి.

నీకు దైవేచ్ఛను పాటించడం తెలియదులే. దైవేచ్ఛను తెలుసుకోవడం చాలా ముఖ్యమైన విషయం. నిజంగా దైవేచ్ఛను ఉటంకించటం నీకు తెలియదు.

సమైక్యపరచుకొనుట

సంకల్పం అనేది చాలా ముఖ్యమైన విషయం. నిజమైన సంకల్పం కోసం నిన్ను నీవు పూర్తిగా సమైక్యపరుచుకోవాలి. నిజానికి వ్యక్తిగా వుండాలంటే ముందు తనను తాను సమైక్యపరచుకోవాలి. శుద్ధ వ్యతిరేక ధోరణులకు ఆకర్షింపబడుతూ, తనను తాను తెలుసుకోకుండానే వ్యక్తి మూడొంతులు జీవితాన్ని గడిపేస్తాడు. మరి అలా ఎందుకు చేస్తాడు? అతడు బాహ్యప్రభావాల పుట్ట. అంతేకాదు అతని నడవడి, శక్తులు, చర్యలు, ప్రతిచర్యలు ఏవియు అతని స్వంతములు కావు. కాబట్టి విడిగా వ్యక్తి లేడు. తనకు ఆత్మబలం వుందని, సంకల్పబలం వుందని తెలుసుకోవడం

ప్రారంభించినప్పుడు వ్యక్తిగా కావడం ప్రారంభమవుతుంది. అయితే అతడు సమైక్యం చెందనిదే అతనికి ఆత్మబలం సిద్ధించదు.

నీ యిచ్ఛయే జరుగుగాక

ఆత్మబలం సిద్ధించిందా, ఇక అప్పుడు *'నీకు కావలసినదే నాకు కావాలి'* అని దైవంతో అనగలవు. అంతకు ముందు మాత్రం అలా అనలేవు. ఎందుకంటే – దైవం వాంఛించేది నువ్వు వాంఛించాలంటే – నీకు ఆత్మబలం – సంకల్పం వుండాలి. అవి లేకపోతే నువ్వు దేన్నీ సంకల్పించలేవు. సంకల్పం రావాలంటే – ముందు దాన్ని ఇష్టపడాలి. దాన్ని మరీ ఎక్కువగా ఇష్టపడాలి. దైవం ఏమి చేయాలని వాంఛిస్తున్నాడో దానిపై నీకు ఎక్కువ మక్కువ వుండాలి. దేవునికి సమర్పించి ఆయనకు అంకితం చేసే ఆత్మబలం నీకు లేదు.

Something like that, gelatinous, like jelly-fish... there... a mass of good wills – and I am considering the better side of things and forgetting the bad wills – a mass of good wills, half-conscious and fluctuating....

*

ప్రశ్న: శ్రీమాతా! కొన్ని తప్పులు జరుగుతూ వుంటాయి. అవి తప్పులని తెలుసు. అయినప్పటికి ఆ తప్పులను చేయకుండా వుండలేకపోతున్నాము. ఎవరో మమ్మల్ని బలవంతపెట్టినట్లుగా వుంటుంది.

నిన్ను బలవంతపెట్టేది ఇంకెవరు – నీ నిమ్నప్రకృతే! నీ అవచేతనలోనుంచి వచ్చే ప్రేరణలు నిన్ను శాసించి నీ చేత తప్పుడు పనులన్నీ చేయిస్తూ వుంటాయి. వాటికి లొంగిపోవటమో లేక గట్టి పట్టుదలతో నీ స్వశక్తి మీదనే నిలబడివుండటమో నీ చేతులలోనే ఉన్నది. అంతా నీ నిర్ణయము మీదనే ఆధారపడి వుంటుంది.

ఆఖరికి ఒక జబ్బుకి లొంగిపోవటమో లేదా అనే నిర్ణయం కూడ నీ చేతుల్లోనే వుంటుంది! ఇంకా చెప్పాలంటే, అసలు నువ్వు బ్రతికివుండాలో మరణించాలో అనేది కూడా నీ చేతు

ల్లోనే వుంటుంది. దానిని నిర్ణయించే క్షణం ఒకటి వస్తుంది. అయితే అలా జరిగేందుకు నువ్వు అతిజాగృతమైన చైతన్యస్థితిలో వుండాలి. అటో ఇటో తేల్చుకుండేందుకు ఒక్క క్షణం వ్యవధి వుంటుందంతే – సెకండులో నూరోవంతనుకోండి. అంతకు ముందర నీవేమీ చేయలేవు. ఆ తరవాతనూ చేయలేవు. నీ నిర్ణయానికి ఒక్క క్షణం వ్యవధి వుంటుందంతే. అప్పుడు కనుక నువ్వు పూర్తి జ్ఞానంతో వున్నట్లయితే ఆ నిర్ణయాన్ని వెంటనే తీసుకోగలవు.

కాని సాధారణ విషయాలలో మరీ అంత క్షణిక వ్యవధే కాకుండా నువ్వు నిర్ణయం తీసుకుండేందుకు కావలసినంత సమయముంటుంది. విధి లేక లొంగిపోవటమో లేక ఒక గట్టి నిశ్చయానికి కట్టుబడి వుండటమో నీ చేతుల్లోనో వుంటుంది. నీ మనస్సును దిట్టం చేసుకొని సత్యానుగుణంగానే ప్రవర్తించ దలచుకున్నట్లయితే, క్షుద్రప్రేరణలను తిరస్కరించి తిప్పికొట్టే శక్తి నీకుంటుంది. అలా కాకుండా 'నన్నది బలవంతం చేసింది నేనేమి చేయలేకపోయాను' అనుకుంటే అది నీ బలహీనతకు సంజాయిషీ చెప్పుకోటం తప్ప మరేం కాదు. నువ్వు సత్యాన్ని ఎంచుకోలేదన్న మాట అంతే. ఎందుకంటే దానినాదరించటమా తిరస్కరించటమా అనేది నీ చేతుల్లో వుంటుంది. కాని సర్వసాధారణంగా జరిగేదేమంటే 'అది నాకంటే బలంగా నన్నాకర్షించింది' అని సర్ది చెప్పుకుంటావు. అది బలంగా వుండటం దాని తప్పా? ఈ క్షుద్ర వ్యాపారాలు నీకు చెందినది కానే కావు! నువ్వొక చైత్యపురుముడివి, నీకు ఆత్మ వుంది. ఆ ఆత్మయొక్క ఉపకరణము నీవు. నువ్వు దాని పాలనలో వుండాలిగాని ఆ క్షుద్రశక్తులకు దాసోహము కాకూడదు.

మూలం: శ్రీమాత

అనువాదం: మాదిరాజు రంగారావు; పున్నమరాజు నాగేశ్వరరావు, అరోధృతి, ఆర్.ఎల్.ఎన్. శాస్త్రి

(ఏప్రిల్ 2003 'అఖిల' నుండి)

(*CWM* Vol. 6, pp. 348, 343-44)

వ్యక్తి అంటే ఎవరు?

ఈ సృష్టియొక్క మౌలిక సత్యాన్ని గురించి మనం తెలుసుకోవాలి. అఖండ పదార్థం అణువణువులుగా చీలిపోవటం ద్వారా ఈ సృష్టి ఏర్పడింది. ప్రతి ఒక్క అణువు స్వతంత్రురాలు. దేని దారి దానిదే. అంతా అరాజకమే. అయితే అఖండత్వము కూడ ప్రతి ఒక్క ఖండములోను దాగి ఉన్నది. అణువు ప్రమాణం పెరుగుతుంది. అఖండమౌతుంది. నువ్వు కూడా అంతే! నీ నిజ చైతన్యాన్ని పొందినప్పుడు దైవానికి నీవొక చక్కటి ఉపకరణము కాగలవు.
— సంపాదకుడు

అసలు వ్యక్తి అంటే ఏమిటో ఎవ్వరైనా చెప్పగలరా?

చాలమంది 'నేను' అని చెబుతారు. వారి ఆ 'నేను' వారి భావనలో, అనుభూతిలో, ఆలోచనలో, శరీరంలో ఒక భాగం అని వారి ఉద్దేశ్యం. ఆ 'నేను' అస్తమానం 'ఒకేలా' వుండదు. మారిపోతూ వుంటుంది. అంచేత అల్లాంటి 'నేను' లు అసంఖ్యాకంగా వుంటాయి. ఈ 'నేను' లు అన్నీ మారిపోతూ వుంటాయి. అయితే యిన్ని 'నేను' ల్లో 'ఒకేలా' నిలిచే అసలు 'నేను' ఏది? అంటే కచ్చితంగా చైత్యపురుమడే (psychic being).

మార్పులేకుండా ఒకేలా వుండాలి అంటే చావకూడదు. చావే వుంటే అది అలా వుండలేదు. అంతేకాదు ఆ 'నేను' అనుభవించే అనుభవం దానికి అంటకూడదు. అంటే అదే అనుభవ స్వరూపమూ కాకూడదు. నదీగర్భాన్నే (river-bed) నది అనుకోవడాన్ని ఉదాహరణగా తీసుకొని శ్రీమాత యిలా చెప్పారు.

నదీగర్భం అసలు నది కాదు. అది ఆ సమయానికి అలా అనిపిస్తుంది. అంతే. నిజానికి పోలికల వల్ల ఏ ప్రయోజనమూ వుండదు. కాని ఈ మనుమలు పోలికల్ని తెస్తూ వుంటారు. సరే.

మనమూ మన నదీగర్భం నుండి కాస్త ముందుకు వెడదాం. ఒకటి మాత్రం నిజం. జీవితం కూడా నదిలాగే వుంటుంది.

నదిలో 'ఒకేలా' వుండేది 'నీరే' కదా? కాబట్టి ఆ నీరే లేకపోతే – నదే లేదు కదా? సరే. నదిలోని నీటి బిందువులు అన్నీ ఒకేలా వుంటాయా? వుండవు. అలాగే వ్యక్తిలో నిలకడగా ఒకేలా వుండేది 'జాతి చైతన్యం'. ఆ చైతన్యమే వ్యక్తికి నిజమైన ఊపిరి. బయటకు కనపడే వ్యక్తి మారిపోతాడు. కాని చైతన్యంలో ఏ మార్పూ వుండదు. ఆ చైతన్యమే అన్ని ఆకారాలలోనూ వుంటుంది. అన్నిటినీ ఒక త్రాట కట్టేది అదే. అన్ని ఆకారాల లోనూ నిలకడగా వుండేది 'అదే'.

'అదే' సృష్టిలోని గొప్ప రహస్యం. చైతన్యం ఎల్లెడలా (అంతటా) ఒక్కటే. అదే తనను తాను విస్తరించుకొనుటకై చిన్న చిన్న శకలాలుగా విడిపోతుంది. అలాంటి ఒక్కొక్క శకలమే ఒక్కొక్క వ్యక్తి. ప్రతీ వ్యక్తీ యిలాగే ఈ పద్ధతిలోనే ఆవిర్భవి స్తాడు. వీళ్లందరిలో వుండే 'చైతన్యం' ఒక్కటే. ఈ స్థితి అనం తంగా ఇలా కొనసాగుతూనే వుంటుంది. ఇలాగే అనేక వ్యక్తులు ఆవిర్భవిస్తున్నారన్న మాట. వ్యక్తులుగా వీళ్లంతా వేరు వేరు. కాని చైతన్యస్వరూపం మాత్రం ఒక్కటే. వ్యక్తి ఏర్పడానికి కారణమైన ఈ అనంత చైతన్యం వ్యక్తిగా రూపొందగానే తన నుండి వేరైపో తుంది. తన నుండి దూరమైపోతుంది. వ్యక్తికీ తనకూ సంబంధం లేకుండా పోతుంది.

కాని వ్యక్తి తనలోని అనంతచైతన్యాన్ని గుర్తించినప్పుడు అది అనంతచైతన్యంలోని భాగమే అని తెలుసుకుంటాడు. అంటే ఆ అనంతచైతన్యమే తన నుండి తానే తనను తెలుసుకొనేలా మరో తాను అయ్యిందన్న మాట.

ఇక్కడ నేను 'అహం' అన్న మాటని కావాలనే ప్రస్తావిం చటం లేదు. ఎంచేతంటే 'అహం' అనేది ఒక 'అసత్యం', ఒక 'భ్రమ', నేను (అహం) అనుకొనేది ఒక అసత్యం. ఒక భ్రమ. దీని అంతస్తత్వమైన అసలు చైతన్యమే అసలు నిజం. ఈ 'అహం' అనేది ఆ రూపం పొందడానికి ఆ క్షణాన అవసరం. అంచేత నిజమైన చైతన్యాన్ని తెలుసుకొన్నప్పుడు ఈ 'అహం' కనుమరు గైపోతుంది. అసలు వుండదు.

ఆ చైత్యపురుషుడే అసలు వ్యక్తిత్వము (real individuality). ఆ దివ్యచైతన్యమే నీలా రూపొందింది అన్న మాట. కాని చైతన్యంలో ఇలా విడిపోవడమూ వ్యక్తిగా వుండడమూ అనేది ఏదీ లేదు. నీ కంటూ ఒక ప్రత్యేకమైన వ్యక్తీకరణ విధానం వుంటుందని నీకు తెలుసు. కాని ఆ వ్యక్తీకరణ ఏమిటి? అంటే 'ఒకేలా' వుండే దివ్యచైతన్యం యొక్క ఒక రూపం. అంతే. ఎలాగ అంటే నీవూ ఆ దివ్యచైతన్యమూ ఒకరినొకరు చూసుకొంటూ హాయిగా క్రీడిస్తారన్న మాట. అంటే ఒకే చైతన్యం రెండుగా అయింది అన్న మాట. ఇలా రెండుగా అవడం ఎందుకు అంటే ఈ సృష్టి జరగాలి కనుక. సమస్త జీవవస్తుజాలం ఏర్పడాలి కనుక. అలా రెండయి హాయిగా క్రీడించవచ్చు కనుక. నిజానికి ఇలా రెండుగా అవడం లేదు. అది ఒక ఆభాస అంతే.

*

మహాచైతన్యము ఖండఖండాలుగా చీలిపోయేందుకు కారణం – ఈ శకలాలను మళ్లి తనలో చేర్చుకుండేందుకే. తత్కారణంగా ప్రతి యొక్కరి లోను, ఈ వేర్వేరు జీవరాసు లన్నిటిలోను, *ఒకే ఆకాంక్ష పైకి యెగతన్నుతూ వుంటుంది. ఆత్మసమర్పణ తొణికిసలాడుతుంది.* ఈ వేర్వేరు వ్యక్తులు జీవించుటకు అసలు కారణం ఇదే. మరి సృష్టియొక్క పరమోద్దేశ్యాన్ని నువ్వు పాటించాలి గదా.

ముఖ్యంగా కావలసింది ఇదే. ఇది ఒక్కటే. ఇదే శాశ్వతం. మిగతాదంతా వట్టి దొమ్మలాట.

మూలం: శ్రీమాత

భావానువాదం: ఎమ్మెస్కే

(*CWM* Vol. 4, pp. 172-74; Vol. 3, p. 63; Vol. 11, p. 185)

ఏకరూప ధారణకు తొలి మెట్టు

నిన్ను నీవు సంస్కరించుకోవాలని ఎంత ప్రయత్నించినా అది జరగదు. ఎందుకని? నీది పాక్షిక చైతన్యము. నీ దృష్టి విశాలము కానంత వరకు నిన్ను నీవు సమీకరించుకోలేవు (unification of the being). పాండిత్యము కేవలం పుస్తకాధీనం కాకూడదు. ప్రత్యక్షంగా దానిని నిరూపించుకోవాలి. అనంత చైతన్యం అంటే ఏమిటో నువ్వు తెలుసుకున్నప్పుడు నీ మనస్సులో చెలరేగే సమస్తమైన అభీష్టములను దాని సమక్షమున నిలబెట్టాలి. అప్పుడే ఏవి దైవికములో ఏవి అదైవికములో తెలుస్తుంది.

— సంపాదకుడు

మీరెప్పుడైనా మీ చైతన్యాన్ని, మీ వ్యక్తిత్వాన్ని ఒకటిగా చేయాలని ఆలోచించారా? మీరు ఒక క్షణం ఒకలాగా, ఇంకోసారి ఇంకోలాగా ఆలోచిస్తున్నారని గమనించారా? ఒకసారి చేద్దామని నిర్ణయించుకున్న పనిని చక్కగా చేయగలరు. ఇంకోసారి చేయలేకపోతున్నట్టు గమనించి తికమక పడ్డారా? 'మీది' అనే ప్రత్యేక వ్యక్తిత్వంలో ఇన్ని భిన్నాతిభిన్నమైన అంశాలు అసలు ఎందుకున్నాయో, ఎందుకు అన్ని వేళలా లేవో తెలుసుకోగలిగారా?

ఒక గురువు పర్యవేక్షణలో యోగాభ్యాసం చెయ్యని వారికి కొన్ని సమస్య లెదురవుతాయి. అట్టివారు సాధారణ జీవనంలో అనుసరించే నీతినియమాలని శ్రద్ధగా పాటించినప్పటికి యోగంలో తమకి కోరుకున్న ప్రగతి రానందుకు ఆందోళన చెందుతుంటారు. ప్రగతి లేకపోవడానికి రెండు కారణాలుంటాయి – సాధారణంగా ప్రతి ఒక్కరూ తమ చైతన్యాన్ని, ఆలోచనా సరళినీ *సమర్థించుకోడానికే ప్రయత్నిస్తున్నారు తప్ప సవరించుకోవాలనే ఉద్దేశంతో ఉండరు.* అసలు ఈ ప్రపంచంలో మనం గీటురాళ్లుగా పెట్టుకున్న నీతినియమాలు అప్రమాణములు. అందుకే, మీ చైతన్యజీవనానికి సంస్కరణలో మొదటగా మీరు మంచి ఊహాశక్తి సహాయంతో మీలో వున్న వివిధ ఆలోచనలన్నింటినీ

అత్యంత పవిత్రమయిన భగవత్ సన్నిధిలో పరిశీలనకి సమర్పి స్తున్నట్లు ఊహించుకో గలగాలి.

మొట్టమొదట్లో ఇది కేవలం మీ ఊహే తప్ప వాస్తవం కాదు అని తెలిసినా, ఇది మీ పరిమిత చైతన్యం నుంచీ, మీ సంకీర్ణ నైతికనియమాల నుంచీ బయటపడటానికి సహాకరిస్తుంది. ఎందుకంటే, మీరు 'మీ ఆలోచనలు' అనే పరిమిత చైతన్యాన్ని 'అనంత' 'శాశ్వత' చైతన్యం ముందు సమర్పిస్తున్నారు. ఈ 'అనంతం' 'శాశ్వతం' అనే రెండు పదాలు మొదట్లో అర్థరహితంగా అనిపించినా, అవి మిమ్మల్ని మీ పరిమిత దృక్పథం దాటించి, అన్ని విధాలా అనంతమైన చైతన్యంచే పరీక్షింపబడేలా చేసినప్పుడు, ఆ స్థాయిలోని విలువలు సాధారణ మానవుల ఆలోచనా సరళికి భిన్నంగా వుంటాయని తెలుసుకుంటారు. సరైన సంపూర్ణ చైతన్యసాధనకి ఇదే మార్గం.

మీకు తెలిసిన నైతికసూత్రాల ఆధారంగా మీ ప్రవర్తనని విశ్లేషించుకోవడం మొదలుపెడితే, అవి దివ్యచైతన్యపు విధానాలకి భిన్నంగా వుంటాయి కనుక, ఎప్పటికీ మీ లక్ష్యం చేరుకోలేకపోవడమే కాక, దానికి విరుద్ధంగా వెడతారు. ఇలా అంటే, దైవత్వం నీతిహీనమని ఎప్పుడూ అనుకోకండి – ఎంతమాత్రం కాదు. కానీ, ఆ నియమాలు సాధారణ మానవులకి అర్థమయ్యేవి కావు.

అన్నిటికంటే క్షేమమైన పద్ధతేమంటే, ఎప్పుడూ భగవదేచ్ఛని అనుసరించి నడిచే ప్రయత్నం చెయ్యడం. కానీ చిక్కేమిటంటే, ఆ భగవన్నిర్ణయ మేమిటో తెలియదే! ఏం పరవాలేదు. నిస్సందేహంగా, ఆ భగవదాశేన్ని వినడం కష్టమే కాని, దుర్లభం కాదు. మీరు యోగమార్గంలో తొలిదశలోనే వున్నా, మీ హృదయాంతరాళాల నిశ్శబ్దంలోంచి, స్థిరంగా, ప్రశాంతంగా వినవచ్చే ఆ ఆదేశాన్ని మీరు వినగలరు.

ఆ భగవదాదేశం సూచన వినాలంటే, పూర్తి ఆర్ద్రత, నిజాయితీ, స్వచ్ఛత అవసరం. అదే లేకపోతే, మీ అహం మీకు చెప్పే మాటలనే దివ్యాదేశమని పొరపడుతూ, మిమ్మల్ని మీరే

మోసగించుకుంటూ, ఎన్నో తప్పులని ధైర్యంగా కొనసాగిస్తారు. నిజాయితీగా వుంటే మాత్రం, మీ మార్గంలో ఇటువంటి తప్పులు జరగవు. ఆ ఆదేశం మీకు ఏ రూపంలో అందుతుందో కచ్చితంగా చెప్పడం కష్టం. కచ్చితంగా ఒక స్వరమని కానీ, ఒక అనుభూతి అని కానీ ప్రత్యేకంగా చెప్పలేని ఒక సున్నిత, సునిశిత సూచన వస్తుంది. మీరు ఈ మార్గంలో సవ్యంగా వెళుతున్నంత సేపు, అంతా సామాన్యంగా, సాధారణంగానే వుండి, ప్రత్యేక సూచనలేవీ వుండవు. ఇదంతా ముందుకు సాగాలంటే ప్రప్రథమంగా మీలో ప్రతి క్షణం ప్రతి పనీ దైవేచ్ఛానుసారమే చెయ్యాలనే నిరంతర తపన అత్యవసరమని వేరే చెప్పనవసరము లేదు కదా! సరే, ఈ దృష్టిలో కొనసాగుతుంటే, అంతా సవ్యంగా సక్రమంగా వుంటూనే, ఉన్నట్టుండి మీ మనసులోనో, మీ హృదయంలోనో, ఒక్కోసారి మీ కడుపులో ఏదో కలవరం, ఏదో తెలీని చిన్న అలజడి, బాధగా అనిపిస్తుంది. సాధారణంగా ఎవ్వరూ దీన్ని ఒక సూచనగా గుర్తించరు. పట్టించుకోకుండా తోసిపారేస్తారు. మీ సాధారణ దినచర్యలో ఇటువంటి చిన్న ఇబ్బందికరమైన భావం అకారణంగానే మళ్ళీ మళ్ళీ కలగవచ్చు. అప్పుడు మీరు ఇది గమనించుకోడం నేర్చుకోవాలి. ఒక్క క్షణం ఆగి, ఆ ఇబ్బందికి కారణమేమిటో ఆలోచించుకోవాలి. ఇలా చేస్తే, మీరు దేవేచ్ఛకి విరుద్ధంగా, మీ అహం వల్ల తీసుకున్న ఒక నిర్ణయమో, పనో, ఆలోచనో ఈ బాధకి కారణమని తెలిసిపోతుంది.

మీ అహం ఒక చిక్కని నల్లని మచ్చలాగా మీ స్వచ్ఛమైన మార్గంలో కనిపిస్తుంది. 'అహం' ఏ విషయాన్నయినా తన ఇష్టాఇష్టాల దృష్టి నుంచి, తనకు ఇష్టమయిన కోణం నించే చూస్తుంది. తనకి ఇష్టమయినవన్నీ మంచి అనీ, కానివన్నీ చెడు అనీ తీర్మానిస్తుంది. ఈ 'అహం' అనే పొర వున్నప్పుడు ఏది నిజమో పూర్తిగా పరిశీలించలేము. మీకు నిజంగానే సత్యమైనదీ, సవ్యమైనదీ తెలుసుకోవాలని వుంటే, మీ 'అహం' నుంచి ఒక్క అడుగు వెనక్కి వేసి గమనించడానికి ప్రయత్నించండి. మీకప్పుడు

మీలో అకస్మాత్తుగా కలిగిన చిరు అలజడికి హేతువు మీ అహం స్వేచ్ఛగా తీసుకున్న నిర్ణయాలే అని తెలిసిపోతుంది. మీ 'అహం' ముకుళించి, ఘనీభవించిన చీకటి ముక్కలాగా అనిపిస్తుంది. ఎంతో ఓర్పుతో మీ ఉన్నత చైతన్యస్థాయి నుంచి ఈ కరుడుకట్టిన అహానికి దాని పొరపాటేమిటో చిన్నచిన్నగా వివరిస్తే, క్రమక్రమంగా మాయమవుతుంది.

ఇది మొదటి ప్రయత్నంలోనే, మొదటి రోజే సాధించగలరనను. కానీ పూర్ణ విశ్వాసంతో కృషి చేస్తే తప్పక విజయం సాధించగలరు. అదే కృషి కొనసాగిస్తే, ఏదో ఒక రోజున మీ వికాసానికి, ప్రశాంతతకీ అడ్డుగా వున్న ప్రలోభాలూ, వికారాలు అన్నీ తొలగిపోతాయి. ఈ అహంతో కూడిన ఆలోచనలు, నిర్ణయాలే మీ వికాసానికి అడ్డుగోడలు. ఈ సాధన కొనసాగాక, మీరు ఈ మార్గంలో మొదలుపెట్టిన పరిస్థితికీ, ఆ తరవాత దశలకీ చాలా తేడా వుందని తెలుస్తుంది. మొదట్లో అర్థమవనివీ, తెలియనివీ ఎన్నో విషయాలు తెలుస్తాయి. దృఢ నిశ్చయముంటే, విజయం తథ్యం. ఈ తొలి మెట్టు, మీ ఇచ్ఛ, మీ చైతన్యం ఎల్ల వేళలా ఆ దివ్యచైతన్యాన్ని వ్యక్తీకరించేలా అవడానికి చేసే కృషి ప్రయత్నించదగినదే.

ఈ సాధనలో మొట్టమొదట మీ చైతన్యంలోని అన్ని కోణాలనీ, వాటి వాటి కార్యకలాపాలనీ, ఆలోచలనీ గమనించాలి. వీటన్నిటినీ దేనికి దానిగా, వేరు వేరు భాగాలుగా గుర్తిస్తేనే మీలో భిన్న ప్రవృత్తులలో కలిగే ఉద్వేగాలకీ, ఆలోచనలకీ మూలం గుర్తిస్తారు. ఇది చాలా క్లిష్టమయిన పనే – దీనికి పూర్తి ఏకాగ్రత, నిజాయితీ అవసరం. ఎందుకంటే, మానవస్వభావంలో ఎవరి మనస్సైనా సహజంగా అతని ఆలోచనలనీ, చర్యలనీ సమర్థిస్తూనే వుంటుంది. అందువల్ల మన ఆలోచనలలోనూ, చర్యలలోనూ పొరపాట్లు జరగకుండా వుండాలంటే, వాటన్నిటినీ ఎంతో జాగ్రత్తగా పరిశీలించి, పరిపూర్ణ చైతన్యమనే ఉత్తమ న్యాయస్థానంలో వచ్చే నిష్పాక్షిక తీర్పుకి లోబడి తలవొగ్గాలి. సత్యమార్గంలో ప్రగతి సాధించి, నిజచైతన్యాన్ని తెలుసుకుని, ఈ

భూమ్మీదికి మనం వచ్చిన ఉద్దేశం తెలుసుకోవాలంటే, క్రమం తప్పకుండా మన సత్యాన్వేషణకి ఆటంకం కలిగించే వాటిని వదిలివేయాలి. క్రమక్రమంగా మన అన్ని ఆలోచనలనీ చైత్య పురుషునికి అనుగుణంగా మలచవచ్చు. నిరంతర కృషి వల్లే ఇది సంభవం. ఓర్పుతో, పట్టుదలతో ఈ జీవితాన్ని ఎన్నాళ్లయినా కొన సాగించి విజయం సాధించాలనే నిశ్చయం అవసరం.

మూలం: శ్రీమాత
అనువాదం: బి. వరలక్ష్మి

(*CWM* Vol. 4, pp. 80-81, 87-88; Vol. 12, pp. 3-4)

తనను తాను తెలుసుకొనుట

మహాపురుషులను చూసినపుడు 'ఆయన చాలా గొప్ప యోగి, ఎప్పుడూ కళ్ళు మూసుకొని ఉంటాడు. కాబట్టి ఆయనకేం తెలుసులే' అనుకుంటావేమో! కాని ఆయన జ్ఞాని. కళ్లు మూసుకున్నప్పటికీ జాగృతమై ఉంటాడు. ఉదా: ఒక మనిషి ఆయన దగ్గరకు వెళ్దామనుకుంటాడు. ఆయన కోపంగా ఉంటాడు. ఆ సంగతి ఆయనకు ముందరే తెలుస్తుంది. అతని కోపం ఆయన యోగ దృష్టికి ముందరే కనపడుతుంది. — సంపాదకుడు

తనను తాను తెలుసుకొనుట అనగా, వ్యక్తి తనలోని అంతర్గత సత్యాన్ని గురించిన ఎరుకను పొందుట, తన అస్తిత్వము నందలి వివిధ భాగాలను గురించి, అవి నిర్వర్తించవలసిన పనులను గురించిన అభిజ్ఞతిని పొందుట. ఏ పనిని ఎందుకు చేయాలో నీకు తెలియాలి. నీ ఆలోచనలు నీకు తెలియాలి, నీ భావాలు, నీ చేతలు, నీ కదలికలు, నీకు గల సమర్థత మొదలగు వాటన్నింటిని గురించిన అవగాహన నీకు కలగాలి. తనను తాను తెలుసుకొనుట మాత్రమే చాలదు. తనను తాను నియంత్రించుకో గలగాలి.

ప్రతి క్షణము ఒక ఆకాంక్షను కలిగి వుండాలి.

సాధ్యమైనంత చిన్నప్పుడే ఈ విద్య నభ్యసించాలి. ఎన్నేళ్లయినా ప్రయత్నాన్ని సడలించకుండా కొనసాగించాల్సిందే. అనగా పిన్నవయసు నుండే నిన్ను నీవు అధ్యయనం చేసుకొనుటను, నిన్ను నీవు తెలుసుకొనుటను, నెమ్మదిగా నిన్ను నీవు నిగ్రహించుకొనుటను ఆరంభించవచ్చు. అలాగే, నీవు 'వృద్ధుడవు' అయినప్పటికీ వయస్సు పైబడిన వాడవయినప్పటికీ, నిన్ను నీవు మరింత బాగా తెలుసుకునే ప్రయత్నాన్ని, నిన్ను నీవు మరింతగా అదుపులో వుంచుకునే ప్రయత్నాన్ని మానకూడదు.

వ్యక్తి తనను తాను పరిపూర్ణుడుగా తీర్చిదిద్దుకొనుటకుగాను, మొదటగా అతను తనను తాను తెలుసుకోవాలి. ఉదాహరణకు, యిలాంటి పరిస్థితి నీ జీవితంలో చాలా సార్లు తప్పక తటస్థపడి వుంటుంది. ఎవరో ఒకరు వున్నట్లుండి నిన్ను, 'నీవు అది ఎందుకు చేశావు?' అని ప్రశ్నిస్తారు. సరే, వెంటనే వచ్చే సమాధానం, 'నాకు తెలియదు' నిన్నెవరయినా, 'దేనిని గురించి ఆలోచిస్తున్నావు?' అని అడిగితే 'నాకు తెలియదు' అంటావు. 'ఎందుకు అలసిపోయావు?' 'నాకు తెలియదు' 'ఎందుకు సంతోషంగా వున్నావు?' 'నాకు తెలియదు' ఇదీ వరస. ఓ యాభై మందిని, ఆలోచించుకొనుటకు అవకాశ మివ్వకుండా, అమాంతంగా, 'నీవు అదెందుకు చేశావు?' అని ప్రశ్నిస్తే, వారు గనుక అంతర్గతంగా 'మేల్కొని' వుండనట్లయితే, 'నాకు తెలియదు' అని సమాధానమిస్తారు. (ఇక్కడ నేను మాట్లాడుతున్నది ఆత్మజ్ఞాన శిక్షణ నభ్యసించిన వారి గురించిగాని, తమను తాము పూర్తిగా జయించినవారి గురించి గాని కాదు. వారిని వారు సమీకరించుకొని, ఏకాగ్రతను పొంది సరైన సమాధానాన్ని యివ్వగలరు, కాని అందుకు కొద్ది మాత్రం సమయం పట్టవచ్చు). కాని నిన్ను నీవు శ్రద్ధగా గమనించినట్లయితే యిలా జరుగుతుంది. నువ్వు ఏదో ఒకటి అంటావు, కానీ అలా యెందుకని అన్నావో నీకు తెలియదు – మాటలు నీ నోటి నుండి బయటపడిన తర్వాత గానీ, నీవు చెప్పదలచినది యిది కాదు అని గమనిస్తావు. మాట వరు

సకు, నీవు ఎవరినో చూచుటకు వెళ్లవలసివస్తే, వారితో మాట్లా డబోయే మాటలను ముందుగానే సిద్ధపరచుకుంటావు. కానీ ఆ సంబంధిత వ్యక్తి ఎదుటకు పోగానే, నీవేమీ అనలేవు, లేదా వేరే మాటలు నీ నోటి నుండి వస్తాయి. ఎంత మేరకు యెదుటి మనిషి యొక్క సాన్నిధ్యము నీపై ప్రభావము చూపి, నీవు సిద్ధపరచు కున్న మాటలను మాట్లాడనీయకుండా ఆపిందో చెప్పగలవా? నేను మాట్లాడేది పరస్పర ప్రభావాలు యెంత స్పష్టంగా ప్రస్ఫుట మవుతాయన్న దానిని గురించి. నీ ప్రకృతి పైన యేది పని చేస్తుంది, యేది విఘాతాన్ని కలిగిస్తుంది అనే దానిని గురించి. వ్యక్తికి లేనిది యిదే. ఉదాహరణకు, ఒక వ్యక్తి ఉన్నట్లుండి బాధపడటమో లేక సంతోషంతో వుప్పొంగడమో జరుగుతుం టుంది, కాని, 'ఇది ఇందువల్ల' జరిగింది అని యెవరు చెప్ప గలరు? ఇది తెలుసుకోవడం చాలా కష్టం. అంత సులభమేమీ కాదు. వ్యక్తి పూర్తిగా 'మేల్కొని' వుండాలి; నిరంతరం అత్యంత శ్రద్ధతో పరిశీలించగల స్థితిలో వుండాలి.

రోజుకు పండ్రెండు గంటలు నిద్రిస్తూ మిగతా సమయంలో 'నేను మేల్కొనే వున్నాను' అని అనే వారున్నారు! రోజుకు ఇరవై గంటలు నిద్రిస్తూ మిగతా సమయం సగం నిద్రలో వుండేవారు కూడ వున్నారు!

ఇంత శ్రద్ధాపూర్వకంగా గమనించగల స్థితిలో నుండుటకు గాను, చెప్పాలంటే, నీ చైతన్యముయొక్క కేంద్రముతో నిరంతర సంపర్కము కలిగి యున్నటువంటి ఆంటెన్నా (antennae) నీకు ప్రతి చోటా వుండాలి. దీని వలన ప్రతి విషయాన్ని నీలో నమోదు చేసుకొన గలుగుతావు, క్రమపద్ధతిలో ఏర్పాటు చేసుకొనగలుగు తావు. ఈ విధంగా అయితే, ఆకస్మిక పరిణామాలు నిన్ను కల వరపరచవు, నీవు వంచించబడవు, నీవు అన్యధా భావించబడవు, నీవు మాట్లాడాలనుకున్నది తప్ప వేరొకటి మాట్లాడవు. కాని, మామూలుగా, యెంతమంది యీ స్థితిలో మనగలరు? 'చైతన్య వంతుడ వగుట' అని నేనడంలో గల కచ్చితమైన అర్థం యిదే. నీ ప్రస్తుత స్థితిగతుల నుండి, పరిస్థితుల నుండి యెక్కువ ప్రయో

జనాన్ని కోరుకుంటే, నీవు పూర్తిగా మేల్కొని వుండాలి. నీవు ఆకస్మిక సంభ్రమాశ్చర్యాలకు లోను కాకూడదు, ఎందుకో తెలుసుకోకుండా పనులను చేయకూడదు, విషయాలపై అవగాహన లేకుండ మాట్లాడకూడదు. నిరంతరం మెలుకువతో వుండాలి.

విభిన్న వ్యక్తిత్వాలు మీలో లేవని, జీవితమంతా శక్తుల యొక్క చైతన్యములయొక్క, ప్రకంపనల యొక్క అన్నిరకముల కదలికల యొక్క నిరంతర వినిమయములతో కూడినదని కూడ నీవు తెలుసుకోవాలి. ఒక గుంపులో చూడు: ప్రతి యొకరు త్రోసినట్లయితే అందరూ ముందుకు సాగుతారు, అందరూ గనుక వెనుకకు తగ్గితే ప్రతి ఒక్కరు వెనుకకు వస్తారు. నీ అంతరంగం లోను, నీ చైతన్యములోను జరిగేది యిలాగే వుంటుంది. అన్ని వేళలా యెన్నో శక్తులు, ప్రభావాలు, నీ పైన పని చేస్తుంటాయి, విఘాతాలను కలిగిస్తూంటాయి. ఇది వాతావరణంలో వాయువు వలె వుంటుంది. నీవు పూర్తిగా మేల్కొని వుండనట్లయితే యివి నీలో ప్రవేశిస్తాయి. నీ లోనికి బాగా చొచ్చుకొనిపోయి, తిరిగి నీలో నుండే వచ్చినట్లుగా బయల్పడినప్పుడు గాని వాటిని గురించిన అవగాహన నీకు కలుగదు. అధైర్యంతో ఆందోళన చెందిన వారు, ఆగ్రహావేశాలతో వూగిపోతున్నవారు, విచారంతో క్రుంగిపోతున్నవారు ఎవరికైనా తారసపడినట్లయితే, వారు కూడ ఉన్న పళంగా అధైర్యపడి, ఆగ్రహం చెంది, విచారానికి లోను కావడం ఎన్నిసార్లు జరుగదు? ఇలా యెందుకు జరుగుతుందో వారికే తెలియదు. కొందరితో ఆటలాడుతున్నప్పుడు, నీవు చాలా బాగా ఆడగలుగుతావు, కాని, మరి కొందరితో ఆడినప్పుడు నీవు అసలు ఆడలేకపోతావు. ఇలా యెందుకు జరుగుతుంది? దుర్మార్గానికి దూరంగా వుండే అతి నెమ్మదస్తులు సైతం యెప్పుడైనా అల్లరిమూకలతో కలవడం సంభవిస్తే, వారు కూడ అకస్మాత్తుగ కోపోద్రిక్తులవుతారు? ఇలా జరగటానికి కారకులెవరో ఎవరికీ తెలియదు: ఇది యేదో పీడ గాలి వీచినట్లు వుంటుంది. ఇలాంటి ప్రకంపనలను విడుదల చేయగల వారుంటారు. ఇతరులు తెలియ

కుండానే వాటికి ప్రతిస్పందిస్తారు. అతి చిన్నవిషయం నుండి అతి పెద్ద విషయం వరకూ ప్రతీదీ యిలాగే వుంటుంది.

ఒక గుంపులో తన స్వతంత్రాన్ని నిలద్రొక్కుకొని ఉండాల్నంటే అతను తనను తాను పరిపూర్ణంగా తెలుసుకోవాలి. అన్ని మిశ్రమాలకు అతీతమైన ఆత్మను గురించి తెలుసుకోవాలి. అనగా, నేను దేనినయితే నీ అస్తిత్వపు పరమ సత్యము అని అంటానో, దానిని గురించి తెలుసుకోవాలి. సమిష్టి ఆలోచన, సమిష్టి సూచనలు, వ్యక్తిగత ఆలోచనలపై తమ తీవ్ర ప్రభావాన్ని తరచుగా కనపరుస్తూంటాయి. విశేషమేమంటే యెవరు కూడ గమనించరు. ప్రతి వారు తాము 'అదే మాదిరి' గ ఆలోచిస్తున్నామని నమ్మితారుగాని అసలు నిజం, 'అదే మాదిరి' గ ఆలోచించేది సమిష్టి గాని, వ్యష్టి కాదు. సమిష్టి యెప్పటికీ వ్యక్తికన్నా అల్పమైనదే. ఒకే వర్గానికి చెందిన ఒకే మాదిరి గుణముగల వ్యక్తులను తీసుకో. వారు గుంపులో కలవకుండా ఏకాంతంగా వున్నప్పుడు, గుంపులోనున్న అదే వర్గానికి చెందిన యితరుల కన్నా రెండు రెట్లు ఉన్నతంగా వుంటారు. ఆ గుంపులో అస్పష్టతల మిశ్రమము వుంటుంది. చైతన్యరహితస్థితి లోనికి తప్పక జారిపోతావు. దీనిని తప్పించుకొనుటకు ఒకే ఒక మార్గం వున్నది. తనను తాను తెలుసుకొనుట, మరింత ఎక్కువ చైతన్యముతో నుండుట, మరింత శ్రద్ధ గలిగి వుండుట.

ఈ చిన్న అభ్యాసాన్ని చేసి చూడు. రోజు ఆరంభంలో యీ విధంగా అనుకో, 'నేను మాట్లాడేదానిని గురించి ఆలోచించకుండా మాట్లాడను.' నీవు మాట్లాడేదంతా ఆలోచించే మాట్లాడతానని నీ నమ్మకం కదూ! అది యెంత మాత్రం నిజం కాదు. నీవు యే మాటను అనకూడదనుకున్నావో, అదే నీ నోటి నుండి వచ్చేందుకు సిద్ధంగా వుండటం యెన్నోసార్లు జరుగుతుంది. దానిని బయటకు రాకుండా ఆపటానికి ఒక మనఃపూర్వక ప్రయత్నం చేయుట అనివార్యమవుతుంది.

ఆ విధంగా, క్రమక్రమంగా, నెమ్మదిగా, పట్టుదలతో, ముఖ్యంగా అతి జాగ్రత్త, అత్యంత శ్రద్ధ వున్నట్లయితే, వ్యక్తి

చైతన్యవంతుడవుతాడు, తనను తాను తెలుసుకొనుటయు, తదుపరి తన మీద తాను ఆధిపత్యము వహించుటయు నేర్చుకుంటాడు.

మూలం: శ్రీమాత
అనువాదం: ఎ. కైలాసపతి, జానకి

(*CWM* Vol. 4, pp. 34-37)

స్వస్వరూపావిష్కరణ

చైత్యపురుషుడు చైత్యపురుషుడంటారు. ఇదేమిటో తెలియదే! అది నీలో నిరంతరం ప్రకాశిస్తూ ఉండే దివ్యజ్యోతి. 'ఔరా! ఈ సంగతి నాకు తెలియదే! దీనిని గురించి తప్పకుండా తెలుసుకోవలసినదే' అని నీ కనిపించడం లేదు. మరి ఆలస్యమెందుకు? తక్షణమే ఆ అన్వేషణ మొదలుపెడదాం! — సంపాదకుడు

నీ నిజవ్యక్తిత్వం నీకు ఎప్పుడు తెలుస్తుంది? అంతరంగ చైత్యపురుష తత్వానుభూతి కలిగినప్పుడు. అంతవరకు నీవు గుంపులో ఓ గోవిందయ్యావి మాత్రమే! ఎన్నెన్నో విరుద్ధ శక్తులు నీలో భేటీ పడుతూ వుంటాయి. ఆధ్యాత్మిక పురోగతికి ఆత్మసంబంధియైన చైత్యసత్వాన్ని గుర్తెరగాలి. అప్పుడే రూపాంతరీకరణం సాధ్యమవుతుంది. మిగిలిన (ప్రాణిక మానసిక) విభాగాలు అజ్ఞానంలో వుంటాయి. మనసు నిన్ను తప్పు త్రోవ పట్టిస్తుంది. ఉత్సాహంగా మనసులో ఏ మెరుపు మెరిసినా అది దివ్యకాంతిగా భ్రమింపచేస్తుంది. సందేహానికి తావు ఇవ్వని నిర్దిష్టత, సత్య సంధత మనసుకు వుండదు. ప్రాణికశక్తులను చూసి దైవీశక్తులుగా పొరపడుతుంది. చైత్యపురుష తత్వమే నీలోని దైవానికి తిరుగులేని సాక్షి. *చైత్యపురుష తత్వంతో క్షణంపాటు సంసర్గం కలిగినా అది నీకు దైవంపై చెక్కుచెదరని దృఢవిశ్వాసానికి ఆలంబన మవుతుంది.*

నిజసత్వాన్ని తెల్సుకోవటం యెలా? 'అది తప్ప నాకు మరేదీ అక్కర్లేదు' అన్న ఆర్తితో కూడిన ప్రగాఢ ఆకాంక్ష ద్వారా! చైత్యపురుష తత్వంతో ఒక్క క్షణమైనా ప్రభావితులు కానివారు సాధారణంగా వుండరు. కాకపోతే ప్రభావితులు కావటం మాత్రమే సరిపోదు. తాదాత్మ్యం చెందాలి. పరిపూర్ణత కోసం తీవ్రంగా ప్రేరేపితుడవు కావాలి. మూలస్థాన మేదో తెలుసుకోవాలి. భావోద్వేగాన్ని శుద్ధచైత్యము (pure psychic) మసగ లేకుండా నిలిచి వెలిగే దీపం, అవరోధా లన్నిటినీ అధిగమించి దివ్యకాంతిలో పైకెగసి వెలిగే దీపకళిక. ఈ దివ్యకాంతితో నీవు మమేకమైనపుడు దివ్యసత్యానుభూతి నీకు కలుగుతుంది. ఈ ప్రపంచం చేసే వక్రభాష్యాలన్నీ నీకు అవగతమవుతాయి.

నీ స్వీయ వ్యక్తిత్వాన్ని (individual self) నిజచైత్యంతో (psychic self) మమేకం చెయ్యాలి. స్వీయవ్యక్తిత్వం కలగాపులగంగా వున్నా అనేకత్వంలో ఏకత్వంగా నిలిచి వుంటుంది – నిరంతరంగా సాగిపోయే నది తన ఉనికిని పోగొట్టుకొనకుండా వున్న ట్లు. నీ సాధారణ వ్యక్తిత్వము, నీ స్వస్వరూపపు ఛాయ మాత్రమే, సాధారణ వ్యక్తిత్వం శారీరక, ప్రాణిక, మానసిక భూమికలలో పలు రకాలుగా బురిడీలు కొడుతూ అస్థిరంగా వుంటుంది. చైత్యంతో తాదాత్మ్యం చెందినపుడది స్థిరపడుతుంది. అపుడే నీవు నిశ్చలుడవుగా ఆధ్యాత్మిక సాధకుడవు కాగలుగు తావు.

చైత్యపురుషుని పురోగతికి కీలక సూత్రం ఏది?

పరిపూర్ణ వ్యక్తిత్వ వికాసం. నీ స్వీయ వ్యక్తిత్వం, దానికి అనుబంధ సర్వానుభవాలు దివ్యచేతన కేంద్రంగా వ్యవస్థీకరింపబడాలి. చైత్యపురుషుని లక్ష్యమే అది!

మూలం: శ్రీమాత

అనువాదం: కర్రా వెంకటేశ్వర్లు

(*CWM* Vol. 3, pp. 124-25; Vol. 4, p. 149)

మొదలు పెట్టడమెలా?

ప్రశ్న: మానవ శరీరంలోని అన్ని భాగాలు ఒకే విధమైన ప్రవర్తనను కలిగి వుండునట్లు చేయుటమెలా?

నీ నిశ్చయాన్ని గట్టిగా అమలు చేయాలి. నీ మాట వినని భాగాలను, అల్లరి పిల్లల్ని ఎలా అదుపు చేస్తావో అలా చేయాలి. చాలా ఓర్పుతో ఆ విభాగాలను బుజ్జగించి నచ్చచెప్పాలి.

నీ అగాధ సీమలలో ఒక దేవాలయముంది. అందులో నీ చైత్యపురుషుడున్నాడు. నీలోని విభిన్న భాగములన్ని, వ్యతిరేక పోకడలన్ని ఈ కేంద్రమునకు విధేయమై, దానితో సారూప్యము జెందాలి. ఎప్పుడైతే నీవు చైత్యపురుషజ్ఞానాన్ని పొంది దాని ఆకాంక్షకు వశమవుతావో అప్పుడిక నీ సందేహాలు, సమస్యలు సమసిపోతాయి. ఇది కొంతకాలం పట్టవచ్చు ననుకో, అయినా చివరకు విజయం తథ్యం! *ఎప్పుడైతే నువ్వు ఒకసారి 'నేను నీ వాడినే' అని దైవానికి విన్నవించుకొంటావో ఆయన తన అంగీకారాన్ని తెలియపరుస్తాడో, ఇక నిన్నెవరూ ఆపలేరు.* ప్రపంచమంతా కోడై కూసినా నిన్నాపలేరు. నీ కేంద్ర సత్త దైవానికి సమర్పించుకున్నప్పుడు అసలు సమస్య తీరిపోయినట్లే. నీ బాహ్యా స్వరూపము చాలా జడమైనది. సామాన్య మానవులలో ఈ పై పొర చాల దట్టంగా వుంటుంది. లోపలి దైవసాన్నిధ్యం దానికి కలగనే కలగదు. అంతర్జీవి ఒక్కసారి 'నే నిక్కడున్నాను. నేను నీ వాడినే' అని ఎప్పుడైతే అంటాడో, అప్పుడు నీ బాహిరాంతర్యాల మధ్య ఒక వారధి ఏర్పడినట్లే. కొంచెం కొంచెం ఆ దట్టమైన పొర పల్చబడటం మొదలు పెడుతుంది. అది పూర్తిగా మాయమైపోయినప్పుడు బాహిరాంతర్యము లొకటై పోతాయి.

*

మానవ శరీరం ఒకటే అనిపించినా, అందులో అనేక విభాగాలుంటాయి. ఇవన్ని పరిపరి విధాల నిన్నేడిపిస్తూ వుంటాయి. నీ చైత్యా పురుషుడంటే ఎవరో నీకు తెలిసినప్పుడు వాటన్నిటినీ దానితో సమైక్యపరచాలి – కనీసం ఆర్ద్రమైన ఆకాంక్షతోనైనా ఒకటి

చేయాలి. నీలో ఈ సమైక్యత జరగనంత వరకు నీలో భిన్న స్వరూపాలు తప్పవు.

దీనిని ఎలా సాధించాలి అనేదే ప్రశ్న. నీలో ఏవోవో కదలికలు జరుగుతూండవూ? ఆలోచనలు, ఫీలింగ్సు, సాంవేదనలు, ఆవేశాలు, ప్రతిక్రియలు చెలరేగిన వెంటనే వాటిని నీ కేంద్రచేతన ముందర, చైత్యపురుషని సమక్షంలో పెట్టాలి. కేంద్రసత్తతో సజాతీయమైన వాటికి అనుమతి లభిస్తుంది. విజాతీయమైన వాటికి లభించదు. అవి తిరస్కరించబడటమైనా లేక పరివర్తింపబడుటమైనా జరుగుతుంది.

ఈ ప్రక్రియ కొద్ది రోజులలో జరుగుతుందనుకుంటున్నావేమో? కొన్ని సంవత్సరాలు పడుతుందని తెలుసుకో! ఫలించినప్పుడు నీలో సమైక్యత రాణించినట్లే. మార్గము సులభమై పయనం సునాయసంగా గడిచిపోతుంది.

*

ప్రశ్న: నువ్వు అవసరమైనవన్నిటిని నా కిస్తున్నావు సరే. కాని నా ఖర్మ – నేను వాటి నందుకో లేకపోతున్నాను. ఒక వేళ అందుకున్నా దానిని జీర్ణించుకోలేక పోతున్నాను. మాతా! ఏం చేయాలో తోచడం లేదు.

నీలో సమైక్యత లేకపోబట్టే అలా జరుగుతుంది. కొన్ని భాగాలు మొండిగా వుండి దివ్యశక్తులను గ్రహించలేవు. ఒక క్లాసులో మొద్దు పిల్లలని బుజ్జగించి మెల్లి మెల్లిగా వారికి విద్యనెట్లా గరుపుతావో అలాగే నీ లోని 'పెద్ద మనుషులను' కూడ మళ్లీ మళ్లీ వెలుగు చూపించి దార్లోకి తీసుకురావాలి.

*

మనిషికి కేంద్రం మనస్సు కాదు, చైత్యసత్త. దైవము నిక్షిప్తమై వుండే చోటు (దైవము మనకంటె గొప్పవాడు, సమర్థవంతుడు కదా). నీలోని సమస్తమైన విభాగములు (మనోప్రాణికభౌతికములు) దానికి సన్నిహితమై దానికి ఒదిగి వుండాలి. అప్పుడు నీ చేష్టలన్ని దైవాభివ్యక్తమే అవుతాయి. నువ్వు దేవేచ్ఛని పాటించ గలుగుతావు.

'సాధన ఒక్కొక్కప్పుడు ఆనందదాయకము, మరొకప్పుడు అంతా ఎడారైపోతుంది' అని శ్రీమాతకు మొరపెట్టుకున్న ఒక సాధకునికి ఆమె ఇచ్చిన జవాబు.

నీలోని విభాగములన్నీ చైత్యకేంద్రముతో సమైక్యము కాలేదనటానికి ఇంతకంటె తార్కాణము ఏం కావాలి?

ఇది ప్రతి ఒక్కరు ప్రయత్నము చేసి సాధించవలసిన విషయము. మా సహాయము మీ అందరికి తప్పకుండా వుంటుంది. *అయితే దాని ఫలితము నీ పిలుపుయొక్క ఆర్ద్రతను బట్టి, నీ గ్రహణశక్తిని బట్టి వుంటుంది.*

ఓర్పుగా నీ ప్రయత్నాన్ని కొనసాగిస్తూ వుండాలి.

*

మనిషిలోని భాగములన్నీ ఒకే లక్షణము కలిగి వుండకపోవుటయే దానికి కారణము ఒక్కొక్క భాగము ఒక్కొక్క దినుసు. పరస్పర వ్యతిరేకములు కూడ కావచ్చు! కొన్నిటికి ఆధ్యాత్మికం కావాలి. మరికొన్ని ప్రాపంచిక సుఖాలను ఆశిస్తాయి. వీటన్నిటిని సమాధానపరచి సమైక్యపరచేందుకు సుదీర్ఘమైన పరిశ్రమ కావాలి.

నీలో జ్యోతిశ్శక్తులను గ్రహించి అభ్యుదయము చెందిన భాగాలు కొన్ని వుంటాయి. వాటి స్పర్శవలన మిగతా భాగాలు కూడ ప్రభావితమై పరిణామము చెందుతూ వుంటాయి. దీనికి కొంత వ్యవధి అవసరము. అందుకనే నీకు సాధన ఆగిపోయినట్లు అనిపిస్తుంది.

మూలం: శ్రీమాత

అనువాదం: డా॥ ఆర్.ఎల్.ఎన్. శాస్త్రి

(*CWM* Vol. 3, p. 7; Vol. 16, pp. 362- 63, 360-61; Vol. 14, pp. 354-56)

సమైక్య సమర్పణ

ఆత్మార్పణ చేసుకుంటూ ఈ భావానికి నాంది పలికిన నీ చైత్య పురుషుని సంకల్పానుసారంగా నీ వ్యక్తిత్వాన్ని ఏకోన్ముఖం చేయ నారంభిస్తావు. నీ వ్యక్తిత్వంలోని తంతువుల నన్నిటినీ శ్రుతి కలిపి ఒకదాని తర్వాత ఒకటిగా కేంద్రసత్తలో విలీనం చేయాలి. ఇలా నీలోని వివిధాంశాల ఏకీకరణ కాకుండా స్వతః సిద్ధంగా నిన్ను ఆ పరమేశ్వరునికి సమర్పణ కావించుకోగలవు కానీ అదంత ఫలప్రదం కాదు. నీ వ్యక్తిత్వం ఎంత ఏకీకృతమైతే నీ ఆత్మార్పణ అంత సంపూర్ణమవుతుంది.

నీలోని విరోధ శక్తులు

ఎందువల్లనంటే నీలో పరస్పర విరుద్ధమైన అనేక సంస్కారణలు పోరు పెడుతుంటాయి. ఒక విభాగము దైవానికి తనను తాను నివేదించుకుంటే మిగతా భాగాలు ఒప్పుకోవు. 'మమ్మల్ని మేము సమర్పించుకోలేదు' అంటాయి. అంతేకాక తమ స్వేచ్ఛ కోసం, గుర్తింపు కోసం ఘోషించడం ప్రారంభిస్తాయి. వాటన్నిటినీ నీవు సమాధానపరచి పరమ సత్యాన్ని వాటికి చూపించాలి. ఓపిగ్గా నీలో నీవు కలయచూసుకుంటూ మూలమూలల్లో శోధించి తిరుగుబాటు చేస్తున్న అంశాలకు ఎదురు నిలిచి వాటికి నచ్చచెప్పాలి. ఈ విధంగా నీ మానసిక, ప్రాణిక, దైహిక విభాగాలన్నిటినీ క్షుణ్ణంగా పరిశీలించి అవన్నీ తాముగా దైవానికి నివేదించుకునేటట్లు చేస్తే అప్పుడే నీ సమైక్య సమర్పణ సంపూర్ణంగా జరిగినట్లవుతుంది. ఇక ఏ రకమైన కష్టాలూ వుండవు. అపుడిక నీవు అంధకారంలో నుంచి జ్ఞానజ్యోతి వైపు కాకుండా జ్ఞానం నుండి విజ్ఞానానికి, వెలుగు నుంచి దివ్యకాంతి దగ్గరకూ, ఆనందం నుంచి అమందానందం వైపుకు నడుస్తూ రూపాంతరీకరణకు సంసిద్ధమవుతావు.

మూలం: శ్రీమాత

అనువాదం: ఎ. ప్రభావతి, ఎ. వెంకటరామ శాస్త్రి

(2003 ఫిబ్రవరి 'అఖిల' నుండి)

(*CWM* Vol. 3, pp. 126-27)

మనిషి తన సంకెళ్లను వదులుకుండేందుకు ఇష్టపడడు!

మనిషి తనే చాలా గొప్ప వాడను కుంటాడు. అతనికి హద్దు లున్నాయని తెలియదు. ఎందుకంటే అవి వ్యక్తి నిర్మాణంలోనే ఏర్పడినవి. ఆ హద్దులే లేకపోతే, సర్వ మానవులు కలిసిపోయి వుంటారు! అందరి మనో, ప్రాణిక భూమికలు కలిసిపోయి వుంటాయి. దేహమే ఈ రెండింటి ఉనికిని వేరుగా ఉంచగలుగు తుంది. అయితే, ఒకసారి, ఈ భిన్నత్వ భావం కలిగినపుడు అది పోగొట్టుకుంటామేమో అన్న భయం కూడా చొరబడుతుంది. ఇది ఒక రకంగా మంచిదే కానీ, దైవం విషయంలో సరి కాదు. దైవంలో మన వ్యక్తిత్వం కోల్పోయి అహంకారాన్ని విడిచిపెట్టి, నిజమైన వ్యక్తి వవుతావు గనుక. ఎందుకంటే దైవం వ్యక్తియొక్క భౌతిక చైతన్యం వలె తాత్కాలికం కాదు గదా! ఒక చిన్న దైవస్పర్శతో ఇది గమనిస్తావు. ఇది కాని వ్యక్తిత్వ శాశ్వత ఉనికిని, ఒక నూరు శరీర మార్పుల వరకు, మానసిక చైత్యపురోభివృద్ధిని తెచ్చుకోగలుగుతావు. ఈ రకమైన దైవస్పర్శ లేకపోయినపుడే నువ్వు భయపడతావు. అది ఉన్నప్పుడు, నీ భౌతికకాయాన్ని కూడా మలిచి దాని వ్యక్తిత్వాన్ని పొగొట్టుకోకుండా, శక్తిని పెంపొందించుకుంటావు.

*

స్వేచ్ఛ కావాలంటే ఖైదులాంటి (సంకెళ్ల లోంచి) నువ్వు బైట పడాలి. ఆ ఖైదు అనేదే అహంకారం. అదే 'నేను నాది' అనుకో వడం. ఈ స్వేచ్ఛ కోసం పూర్తిగా, ఎల్లప్పుడూ దివ్య చైతన్యంతో ఐక్యమవడం, అహంకారపు హద్దులను ఛేదించడం, విశ్వాంత రాన్ని తనలోనికి తెచ్చుకోవడం. అప్పుడు వ్యక్తిత్వాన్ని అట్టేపె ట్టుకుంటూనే, ఈ అహంకారాన్ని సమూలంగా తుడిచివేయగలవు.

మూలం: శ్రీమాత

అనువాదం: ఝ. విమలాదేవి

(*CWM* Vol. 3, p. 169; Vol. 10, p. 264)

నిజమైన నిగ్రహం

నీ దైవస్పర్శ సంపూర్ణము, చైతన్యాత్మకము అయినట్లయితే అది నిన్ను బాహ్యారూపం నించి విడిపించి, నీకు శరీరం ఉంది గనుకే, నువ్వు జీవిస్తున్నావు అన్న భావంనుంచి తప్పిస్తుంది. ఇది సహజంగా, జీవి లేక వ్యక్తియొక్క భావన. ఏమంటే 'నేను' అన్న భావం శరీరంతో ముడివడి ఉంది గనుక. ఇది సహజం. అయితే వ్యక్తి గనుక కొంచెం లోతుకి వెళ్లి నిశ్చలంగా ఆలోచించితే, తనలో యుగయుగాలగా ఉంటున్న ఆ 'ఏదో' అన్న భావం పోయి, శాశ్వతంగా వున్న చైతన్యమే ఆ 'ఏదో' అని అదే 'నేను' అన్న భావం కలుగుతుంది. కాని దీనికి ఉన్మీలుడవటం, చాల లోతుకు పోవడం ఎంతో అవసరం. లేకపోతే, నేను ఇది చేస్తాను, అది చేస్తాను, చేయబోతాను, నాకిది కావాలి, అని అనుకునేవన్నిటికీ శరీరమే కారణం. ఎందుకంటే అది ఒక ఉద్రేకపూరిత, మిశ్రమ ఆలోచన స్పందనలు, ఆకర్షణ, ఇచ్ఛ, ఇటువంటివన్నీ కలిసి 'నేను' అనిపిస్తుంది. నేరుగా కాకపోయినా, ఈ శారీరక భావాలన్నీ కలిసి నేను అవుతాయి. కొంచెం లోతుగా విచారించి, అధ్యయనం చేసి పరిశీలించినపుడు ఒకదాని కొకటి సంబంధం లేదని, తెలిసినపుడు నీవు, నీ ఇచ్ఛ ప్రకారం జరిపించవచ్చు. క్రియలో కర్మలో తాదాత్మ్యం పొందవచ్చు, పొందకపోవచ్చు. ఏదో తేలియాడుతున్నట్లు భావన కలుగుతుంది.

ఇంకా ఎంతో లోతుగా పరిశీలిస్తే గానీ, చురుకుగా ఉన్న చైతన్య ఇచ్ఛని చలనంలోకి దించిన, మరొకటి ఏదో ఉన్నది. పరిశీలించి, ఆచి, తూచి, జ్ఞానపటిమైన, నిర్ణయాలను, ఉత్తరోత్తర జరగబోయే విషయాలను కూడా నిర్ణయిస్తుంది. ఆ 'ఏదో' అన్న దానికి శక్తి ఉన్నది అని తెలుసుకోగలిగినపుడు, భావప్రకోపాల మీద, స్పందనల (sensations) మీద వ్యక్తియొక్క అన్ని కదలికల మీద, నిగ్రహం చూపిస్తుంది. ఈ రెండో కక్ష్యభావం వలనే గమనించడం, పరిశీలించడం, న్యాయపరంగా చూడడం, నిర్ణయించడం జరుగుతుంది. ఇదే నిగ్రహానికి ఆరంభం. దీన్ని చైత

న్యంతో పట్టు తెంచుకుని సత్యాన్ని గ్రహించి, నిగ్రహం గురించి మాట్లాడినప్పుడు 'ఆ' ఇదే నిగ్రహశక్తికి మూలం అని తెలుసుకుంటాడు. ఇలాగే వ్యక్తి, తన ఆత్మలోకి చూడడం అన్నది నేర్చుకుంటాడు.

మూలం: శ్రీమాత

అనువాదం: డా. విమలాదేవి

(*CWM* Vol. 9, pp. 310-11)

శ్రీమాత పిలుపు

మానవాళి కొన్ని శతాబ్దాల తరబడి ఈ సమయం కోసం వేచి వున్నది. ఆ శుభ ముహూర్తము ఇప్పుడు రానే వచ్చింది.

మన మాడుకుంటూ, పాడుకుంటూ, వినోదంగా కాలక్షేపం చేసేందుకు ఇది సమయం కాదు. నడుం బిగించుకొని భవిష్య మానవునికై మార్గమేర్పరచి, నూతన సృష్టిని ఆవిర్భవింప చేయుటయే మన తక్షణ కర్తవ్యము.

ఈ విషయాన్ని చెప్పేందుకే మిమ్మల్ని ఇక్కడకు పిలిచాను. మీ కిష్టమైన పనిని తీసుకొని చెయ్యండి – నా సహాయం తప్పకుండా మీ కుంటుంది. చిత్తశుద్ధితో కార్యాన్ని చేపట్టండి. కావలసినంత శక్తిని నేను మీ కిస్తాను కదా! నీ గొప్పతనాన్ని నిరూపించేందుకు సమయం ఇదే.

గొప్పవాళ్లనగా నువ్వు మామూలుగా అనుకుండే సంపన్నవంతులు కాదు. చైత్యాత్మతో (psychic) తాదాత్మ్యము చెంది శరీరాన్నంతా చేతనామయం చేసిన వాళ్లే గొప్పవాళ్లు. *అటువంటి ప్రయత్నం చేసేవాళ్లకి నా సహాయం ఎల్లప్పుడూ ఉంటుంది.*

ఈ క్షణంలో నువ్వీ భూమ్మీద ఉన్నావంటే దానికి కారణం నువ్వు (నీ ఆత్మ) కోరుకున్నావు కనుక – ఈ విషయం నీకు జ్ఞాపకం లేదుకాని నాకు తెలుసు – అందుకనే నువ్విక్కడున్నావు. ఈ విషయాన్ని నువ్వు గుర్తించి, అందుకు తగినట్లుగా

స్పందించాలి. కార్యశూరుడవు కావాలి. ప్రయత్నించి నీ బలహీనతలను జయించాలి. నీ అవధులను అధిగమించాలి. ముఖ్యంగా *నీ అహంకార రక్కసితో 'నీకు కాలం తీరిపోయింది' అని చెప్పి దాన్ని తరిమేసేయాలి.* మనకిప్పుడు లేశమైనా అహంకారం లేని జాతి కావాలి. అహంకారం బదులు దివ్యచైతన్యమే మనకు కావాలి. మానవుని పరిణమింపజేసి అతిమానసజీవిని ఆవిర్భవింపజేయగల దివ్యచైతన్యం కావాలి.

నేను చెప్పేదల్లా ఒకటే. అహంకారం చేసే కాకిగోలను వినిపించుకోవద్దు. కేవలం నోటి మాటలు కాకుండా నీలో నిజమైన అంగీకారం ఉంటే చాలు. నా మాటలను హృదయపూర్వకంగా పాటిస్తే అదే పదివేలు.

మూలం: శ్రీమాత
అనువాదం: డా॥ ఆర్.ఎల్.ఎన్. శాస్త్రి

(*CWM* Vol. 11, pp. 307-08)

(ఏప్రిల్ 2002 'అఖిల' నుండి)

యోగయానంలోని మూడు స్థాయిలు

నీ ప్రథమ స్వరూపమేమిటో నీకు తెలియదు. అది బాహిరము నుండి వచ్చిన కొన్ని దినుసుల సముదాయం. నిజం చెప్పాలంటే అందులో నీ దంటూ ఏమీ లేదు. విశ్వవ్యాప్తమైన మనోప్రాణిక ములు నీలో ప్రవేశించి నిన్ను నడిపిస్తాయి.

ఒక విధంగా చెప్పాలంటే సంత నుండి అరువు తెచ్చుకుని సంతరించుకున్న కూర్పే నీ వ్యక్తిత్వం. అజ్ఞానం, నిశ్చేతనాల కద లికలతో ఈ నీ వ్యక్తిత్వం మామూలు జీవన పరిమితులకు లోబడి వుంటుంది. దీనిని నువ్వు క్రమంగా దైవప్రభావానికి ఉన్ముఖం చేసి, ఆ చైతన్యంలోకి ప్రవేశించాలి.

1. వ్యక్తిత్వం ఏర్పడటమంటే రూపాంతర దిశలో వేసే మొదటి అడుగు.
2. వ్యక్తిత్వాన్ని దైవానికి సమర్పించటం రెండో అడుగు.
3. దైవము నీ వ్యక్తిత్వాన్ని దివ్యీకరించటం మూడో అడుగు.

ఈ మూడు మెట్లల్లో మొదటిది వ్యక్తిత్వం ఏర్పడటం (స్వభావం, స్వధర్మాలను తెలుసుకొనటం). రెండవది, ఈ నీ వ్యక్తిత్వాన్ని దైవానికి సమర్పించటం (*సర్వధర్మాన్ పరిత్యజ్య...* అని గీతాచార్యుడు చెప్పినట్లు). మూడవది, దైవం ఈ వ్యక్తి త్వాన్ని తన పూర్తి అధీనం లోనికి తీసుకొని, తనను ప్రతిబిం బించేలా రూపాంతరీకరించటంతో అతను కూడా దైవంగా మార తాడు.

పైన చెప్పిన రెండవ మెట్టుతోనే యోగమార్గాలన్నీ ఆగి పోయాయి. సర్వధర్మాలను నిస్సంకోచంగా, నిశ్శేషంగా దైవానికి సమర్పణ చేయటంతో మన పని పూర్తయినట్లుగా భావించబడింది.

కాని శ్రీఅరవిందుల యోగం ఆ స్థాయి నుంచి మొదలవు తుంది. దైవము మన వ్యక్తిత్వాన్ని దైవసమానముగా మార్చి, మనము దివ్యక్రీడలో పాల్గొనేలా చేయాలి. దీన్నే మనం రూపాం తరీకరణ (transformation) మంటాం. ఇది జరగాలంటే మొదటి

రెండు మెట్లు ఎక్కవలసిందే. అప్పుడే మూడవ అడుగు వేయటానికి అవకాశం. ఒకేసారి మొదటి మెట్టు నుంచి మూడవ మెట్టుకి ఎగరలేము. రెండవ మెట్టు మీద కాలు మోపవలసిందే.

అమ్మా! మీరు చెప్పిన మూడవ మెట్టు: దైవము మనలను తన స్వాధీనంలోకి తీసుకుంటాడా లేదా అనేది పూర్తిగా భగవంతుని మీదే ఆధారపడి వుంటుంది కదా?

నిజం చెప్పాలంటే సర్వమూ భగవంతుని మీదే ఆధారపడి వుంటుంది. కాని నీకీ సంగతి తెలియదు. మూడవ స్థితిలో 'ఓహో అంతా దైవమే నిర్వహిస్తున్నాడు' అని తెలుస్తుంది.

ఇలా నీలో ఏదైనా ఒక భాగము మరో దాంతో 'బాగు, బాగు ఇంక నేను ఏమీ చేయనక్కర లేదు.' అనే వివరణ ఇచ్చిందంటే, దాని అర్థం అది ఇంకా నేను 'వేరు' అనే భావిస్తుందన్న మాట. పూర్తిగా దైవము ఎరుక ఏర్పడినప్పుడు ఈ ధోరణి వుండదు. ఎందుకంటే 'నేను' అనేది పూర్తిగా దాని ఉనికిని కోల్పోయిందన్న మాట. అప్పుడు అది తన వక్రధోరణిని కోల్పోయి, నిజమైన చైతన్యంతో తన కర్తవ్యాన్ని నిర్వహిస్తూ వుంటుంది.

మూలం: శ్రీమాత
భావానువాదం: గోదావరి

(*CWM* Vol. 7, pp. 407-408)

సమాచార పత్రం

2005 నూతన సంవత్సరానికి ఆశ్రమంలో ప్రొద్దున 6-630 గం॥ లకు సునీల్ భట్టాచార్జీ గారి సుమధుర సంగీతంతో స్వాగతం పలికారు. Bonne Anne కార్డులో యిచ్చిన సందేశం:

OM Sri Aurobindo Mira
Open my mind, my heart, my life
to your Light, your Love, your Power.
In all things may I see the Divine.

Sri Aurobindo

తెలుగు: ఓం శ్రీఅరవిందో మీరా, నా మనస్సులోకి, హృదయంలోకి, జీవితంలోకి నీ వెలుగును, ప్రేమను, మహిమను ప్రసరింపజేయవా! ఎల్లెడలా నేను దైవమునే కాంచు గాక!

సాయంకాలం క్రీడాంగణములో కవాతు ప్రదర్శన జరిగినది.

డెహ్రాడూన్ (ఉత్తరాంచల్) లోను, నవోడా (ఉ. ప్ర) లోను సభలు, ఇతర కార్యక్రమములు జరుపుకొనిరి. ఆంధ్రప్రదేశ్ పదవ వార్షిక సమావేశములు చిత్తూరులో 18-19 డిశంబరు 2004 తేదీలలో ఘనంగా జరుపబడినవి. ముఖ్యఅతిధి శ్రీ కె. వెంకటరెడ్డి గారు, డా॥ ఎమ్.వి. నడకర్ణిగార్లు తదితరులు అనేక విషయములపై ఉపన్యాసముల నిచ్చిరి. ముఖ్యంగా నడకర్ణిగారు 'Revitalising India for the New Millenium' అనే ఉపన్యాసమును చాలా మంది యువకులు, విద్యార్థులు ఎంతో ఆసక్తిగా విని ప్రభావితులైనారు.

శ్రీఅరవిందుల వెలుగులో శ్రీమద్ భగవద్గీతను గురించిన సి.డి

ఈ మల్టిమీడియా సి.డి లో 700 శ్లోకాలు దేవనాగరి, ఇంగ్లీష భాషలలో ఉన్నాయి. ప్రతి శ్లోకము సాంప్రదాయ పద్ధతిలో సంస్కృత శబ్దములతో శ్రవణోపేయంగా వర్ణించబడినవి. శ్రీఅరవిందుల Essays on the Gita పుస్తకమంతా ఉన్నది. పరిశోధకులకు ఉపయోగకరమైన రీతిలో విస్తృతమైన Index, యితర

ప్రేమంటే ఏమిటి?

శ్రీమాత ప్రవచనములు



అఖిల

అఖిల భారత పత్రిక, ఏప్రిల్ 2005

విషయసూచిక

ప్రేమ అత్యద్భుతమైన ఓ మహాశక్తి	...	3
సృష్టిలో ప్రేమయొక్క పాత్ర	...	6
శ్రీమాత చెప్పిన సృష్టి కథ	...	8
ఆకాంక్షల, అన్వేషణల వెనుక	...	10
ప్రేమ అంటే ఏమిటి?	...	13
దివ్యప్రేమకు పూర్వం ఏముండేది?	...	14
ప్రేమకి ఆది, తురీయ స్థితులు	...	16
ప్రేమ మనని పరివర్తింప జేసే ఒక జ్వాల	...	19
దివ్యప్రేమ – మానవ ప్రేమ	...	21
జంతువులకి మన మీద వుండే ప్రేమ	...	24
తొలిచూపులోనే ప్రేమ	...	26
ప్రేమ – కామవాంఛ	...	28
ఋజుమార్గము	...	29
భువిపై అతిమానస ఆవిర్భావాన్ని ఆకాంక్షించువారు పాటించవలసిన దీక్ష	...	31
నిజమైన ప్రేమ ఎలా దొరుకుతుంది!	...	34
పువ్వులు మనకు పాఠాలు నేర్పగలవు	...	36
దివ్యప్రేమ సర్వత్రా నిండి వున్నది	...	39
మార్గదర్శక వాక్యాలు	...	40
రాబోయే భవిష్యత్తు ప్రేమ – ప్రేమ – ప్రేమ మాత్రమే	...	43
సమాచార పత్రం	...	45

ఉపోద్ఘాతము

ప్రాపంచిక విషయాలతో రోసిపోయిన మానవుడు ప్రత్యామ్నాయము కోసం వెతుక్కుంటూ ఉంటాడు. కాని, ఏం చేయాలో తెలియదు. దేవుడు దేవుడు అనుకోవడం సామాన్యోక్తి అయిపోయింది. ఈశ్వరభావమే ఐశ్వర్యము. దివ్యచైతన్యము, దివ్యప్రేమ, దివ్యానందము మొదలగు అనేక రూపములలో అది అనుభూతమవుతుంది. దివ్యప్రేమను గురించి మన మిప్పుడు తెలుసుకుందాము. అది మామూలు ప్రేమవంటిది కాదు. సినిమా ప్రేమను గురించి అందరికీ తెలుసు. భక్తుల విషయంలో మరో రకమైన పవిత్రప్రేమ వారి నావహిస్తుంది. కాని అది కూడా దివ్యప్రేమ కాదు. ఈ సృష్టిని ముందుకు నడిపించుటకు దైవమే చరాచర వస్తు జాల మంతట దివ్యప్రేమ రూపంలో ప్రవేశించాడు. మన సమస్య లన్నిటికీ అది పరిష్కరించగలదు. మానవజాతిని పరివర్తింపజేసి నూతన మానవుని సృష్టించగలదు. దానిని మన మెలా దర్శించాలి? ఇది మానవమాత్రులకు అసాధ్యమైన పని. కాని మనకి మన ఆపద్బాంధవురాలు శ్రీమాత ఉన్నది కదా! 'సావిత్రి' లో చెప్పినట్లు:

> *I guide man to the path of the Divine....*
> *I know the goal, I know the secret route:*
> *I have studied the map of the invisible worlds;*
> (*Savitri*, p. 510)

– సంపాదకుడు

ప్రేమ అత్యద్భుతమైన ఓ మహాశక్తి

'ప్రేమ' అంటే తెలుసు కదా! అది నీ మనస్సును తేలిక చేస్తుంది. హృదయాన్ని కరిగించి వేస్తుంది. ఇది మనకు తెలిసిన మామూలు ప్రేమ. అయితే ఇంతకంటె వెయ్యి రెట్లు గొప్పదైన 'దివ్యప్రేమ' అనేది ఒకటున్నదని మనకు తెలియదు. అది సర్వవ్యాపి. సమస్తమైన సృష్టిలోను ప్రకాశిస్తున్న ఓ ఇంద్రజాలము. మన జీవితంలో ఆ ప్రేమను ఆవిష్కరింపజేసి ఆ జ్యోతిని వెలిగించాల్సిందే.

– సంపాదకుడు

ప్రేమ ఓ సర్వతోముఖ విశ్వవికాస శక్తి. విశ్వజనీనమైన విశిష్ట శక్తులలో ఒకటి. అసలు ప్రేమే దైవం – దైవమే ప్రేమ – దాని అస్తిత్వము స్వయంచోదితము. ఎక్కడ ఏమాత్రం అవకాశమున్నా ఎవరు దానిని వారిలోకి ఆహ్వానించగలరో వారి ద్వారా అది అభివ్యక్తమవుతుంది.

దేనిని మీరు ప్రేమ యని పిలుస్తారో, మరియు ప్రత్యేకముగ ఒక వ్యక్తికి సంబంధించిన లేదా స్వకీయమైన విషయంగా, వస్తువుగా, పదార్థంగా భావిస్తారో, అది కేవలం ఆ సర్వతోముఖ విశ్వవికాస శక్తిని ఆహ్వానించి, గ్రహించి, స్వయం వ్యక్తము గావించగల మీ శక్తిసామర్థ్యములు మాత్రమే. ప్రేమ ఓ సర్వతోముఖ విశ్వవికాస శక్తి అయినందున అది చైతన్యరహితము కాదు; అది ఓ సర్వోత్కృష్టమమైన శక్తి. అది భువిపైన తన సర్వతోముఖ, విశ్వవికాస శక్తిని స్వయం వ్యక్తీకరించేందుకూ, అనుభవైకవేద్యము గావించుటకూ ప్రయత్నము గావించును. అది దృఢసంకల్పంతో తన సంకల్పసిద్ధికి ఎట్టి ఏమరుపాటు లేక, సర్వవిధముల తన ప్రయత్నములందు ఎట్టి పొరపాట్లకు అవకాశ మివ్వక సజావుగ సాగించును – సకృత్తుగ. ఎరుక గలిగి, అతిజాగరూకతతో తన ఉపకరణములను ఎంపిక చేసికొనును.

ఏ ఉపకరణమైననూ తన లక్ష్యసిద్ధికి తగినది కానిచో దానిని విడిచివైచి, ఇతరములకై తన చూపును మరల్చును. మానవులు తాము హఠాత్తుగా ప్రేమలో పడ్డామని అనుకొంటారు.

వారు తమలో ప్రేమ ఆవిర్భవించి, అభివృద్ధి చెంది అటుపిమ్మట క్షీణించటం గమనిస్తుంటారు (శుక్లకృష్ణపక్ష చంద్రకళల పగిది). లేదా దాని సంశ్లేష్మణానుభూతి మరింత కాలము అనుభవైక వేద్యము గావించుకొనుటకు అవసరమైన అర్హత, సమర్థత, కౌశలముగల వారిలో కొంచెమెక్కువ సమయము నిలిచియుండు నేమో యని అవగతమగును. ఈ ఇంద్రియగోచరిత మంతయు తమ స్వంతము, స్వకీయానుభవ ఫలితము అను స్పృహ భ్రాంతి సంజనితమే! అది సర్వతోముఖ విశ్వవికాస అనంత ప్రేమసాగరము నుండి ఎగసిపడిన ఓ కెరటమే! – ప్రేమ లహరి సంజనిత తరంగమే – తదంతరంగమే – తదంతర్భాగమే.

ప్రేమ సర్వతోముఖ విశ్వవికాస సంధాయకము, మరియు శాశ్వతము. ఆ అనంతమైన ప్రేమ తనకు తానుగా వ్యక్తమగుచుండును. దాని తత్త్వసారము ఎల్లప్పుడునూ అనన్యము. అది ఓ దైవికశక్తి – స్వయంసంజనితము భగవదనుగ్రహము – శ్రద్ధావహము – శ్రద్ధాపూర్ణము. ఆచరణలో మనకు కనిపించు వికారములు, వక్రతావక్రీకరణలు దాని ఉపకరణములకు సంబంధించినవి. దాని అభివ్యక్తి కేవలము మానవులకే పరిమితం కాదు. ఇందుగల డందులేడని సందేహము వలదు, ఎందెందు జూచిన అందందు గనిపించును. ప్రేమ నిత్యమై, సత్యమై. అది సర్వవ్యాపకము, విశ్వాత్మకము, విశ్వమయము. దాని కదలికలు, చెట్టుచేమలలో, నారు మొక్కలలో, పైరుపచ్చలలో, బహుశః రాళ్ళలోనూ, రప్పలలోనూ ప్రత్యక్షమవుతుంది (రాల్గరిగించు విమలగాంధర్వ – సప్తస్వరశక్తీ, పైరుపంటలపై వీచు తెమ్మెరలూ ప్రేమ కదలికల మధురధారలే.)

జంతువులలోని ప్రేమ ఉనికిని పసిగట్టడం తేలికైన పనే. ఈ మహత్తర దైవికశక్తి యొక్క సకల వికార, వికృతవైకల్యములన్నియూ పరిమితమైన ఉపకరణముల యొక్క అస్పష్టత, అజ్ఞానము, స్వలాభాపేక్షల నుండియే ఆవిష్కృత మవుచున్నవి. అనశ్వరమైన ప్రేమకు దేనినీ అంటిపెట్టుకొని యుండుటగాని, తనకుగా ఏదేని కలిగి యుండవలెనను ఉత్కటమైన వాంఛగాని, ఎట్టి

కోరికలుగాని, ప్రగాఢమైన స్వాభిమానకాంక్షగాని లేవు. మరే ఇతర విషయములను లక్ష్యపెట్టక, పరిపూర్ణమైన అన్వేషణ – జీవాత్మ పరమాత్మతో సంవీలనం కావటానికి – ఆత్మసాక్షాత్కారానికి అన్వేషణ – ప్రేమ విశుద్ధగమనము ఆ అన్వేషణలోనే ఉన్నది.

పారమార్థిక ప్రేమ తనను తానర్పించుకొనునే గాని, దేనినీ ఆశించదు (విశ్వదాత చేయి ఎపుడునూ పైననేగాని క్రిందికి రాదు). మానవులు దానినుండి – ఆ సర్వతోముఖ విశ్వవికాస సంధాయక ప్రేమనుండి పొందినదానిని మనం ముఖతహః వెలువరించ పనిలేదు. వారు దానిని అందవిహీనమైన, జుగుప్సాకరమైన వస్తువుగా, పదార్థంగా, విషయంగా మార్చివేసారు. మరి అది అలా ఉన్నప్పటికీ మానవులలో సైతం ప్రేమయొక్క ప్రథమ పరిచయం, తమలోని ఏదో ఒక విశుద్ధ సత్యాన్ని ప్రకాశాయమానం చేస్తున్నది – అనుభవంలోకి తెస్తున్నది. వారు ఓ క్షణం పాటు తమను తాము మరచిపోగలుగుతారు. ఆ క్షణంలో ఆ దివ్య ప్రేమానుభూతి లలితమైన, సౌందర్యపరిపూర్ణమైన విషయసాకల్యాన్ని జాగృతపరచి ద్విగుణీకృతం చేసి చూపుతున్నది. (...for a moment its divine touch awakens and magnifies all that is fine and beautiful.) అటు పిమ్మట సహజమైన మానవస్వభావం తెర పైకి వస్తుంది – దీనికి మారుగా ఏమిస్తావు, దీనికి సరిగా ఏమిస్తావు అని తన మరి సుఖాల సంతృప్తికై వెంపర్లాడుతూ, అపవిత్రమైన కోరికల చిట్టాతో – దైవికమైన ప్రేమ పవిత్రతను వక్రీకరిస్తూ, భంగపరుస్తూ కళంకితం గావిస్తూ.

దివ్యప్రేమను వ్యక్తం చేయుటానికి, దివ్యప్రేమను పొందగల అర్హత కలిగి యుండాలి (అథాఽతో భక్తిం వ్యాఖ్యాస్యామః.) ఎందుకంటే, ఎవరికి సహజ స్వభావసిద్ధంగా దాని సహజ స్వాభావిక కదలికలు సువేద్యములో, వారే – కేవలం వారు మాత్రమే దానిని స్వయముగా సజావుగా వ్యక్తీకరించగలరు. దానిని గ్రహించి, ఆహ్వానించగల శక్తి ఎంతటి విశాలమో మరియు నిర్మలమో అంత విశుద్ధముగ, విస్తృతముగ, వారు దాని మౌలిక

పవిత్రతకు భంగము వాటిల్లకుండ వ్యక్తము జేయగలరు. ఎవ్వరైతే మనఃపూర్వకముగ ప్రేమకు – దాని సారసంగ్రహానికి, సుముఖత ప్రదర్శించరో, దాని సహజ నిత్య సత్యత నంగీకరింపజాలరో వారు భగవంతుని దరిజేరగ లేరు (సాత్వస్మిన్ పరమ ప్రేమ రూపా.) అంతేకాకుండా జ్ఞానం ద్వారా భగవత్ సాక్షాత్కారానికి – సాయుజ్యసిద్ధికి – ప్రయత్నించేవారు సయితం, ఒక దశకు చేరుకొన్న తరువాత, మరింత పురోగమించటానికి తాము ప్రేమతో సప్తపది నెరపటం ఆవశ్యకమని – అవి రెండూ, జ్ఞానం – ప్రేమ (భక్తిజ్ఞానాలు) ఒక్కటేనని – వాటి అభిన్నతను ఎరుక చేసుకొంటారు. జ్ఞానం – జీవదేవ సమైక్యజ్యోతి. ప్రేమ స్వయంగా జ్ఞానాత్మ. ఆత్మపురోగమనంలో అవి రెండూ సమైక్యమై ఒక దానినుంచి వేరొకదానిని వింగడించి చెప్పలేని ఓ మజిలీ ఉంది.

భావానువాదం: అన్నవరం ఆదిశేషయ్య

(*CWM* Vol. 3, pp. 69-70)

సృష్టిలో ప్రేమయొక్క పాత్ర

అచేతన ఎంత ఘోరమైన పరిస్థితో నీకు తెలియదు. దాంతో పోలిస్తే ఒక చిన్న గులకరాయి కూడా మహారాజే. దానికి చైతన్యమున్నది. అచేతనకి అది కూడా లేదు. అప్పుడు దేవుడు కలగుచేసుకొని, స్వయంగా తన ప్రేమను పంపించి అందులో నిక్షిప్తం చేశాడు. అప్పుడే సృష్టి మొదలైంది. *– సంపాదకుడు*

ఆది (origin) నుంచి వేరుచేయబడినపుడు చేతన అచేతనయింది. తిరిగి చైతన్యాన్ని మేల్కొల్పడానికి అది ప్రేమను ప్రభవింపజేసింది.

ప్రాదుర్భావ వేళ గొప్ప ఆకర్షణశక్తిగా ప్రేమ అవతరించి, అసమానమైన త్యాగానికీ, ఆత్మసమర్పణ రూపమైన ప్రేమఫలంగా రూపొందింది. ఈ రెండూ కూడా పరిపూర్ణమైన అద్వైతభావానికి కారణమైన, ఆకాంక్షయొక్క రెండు ధ్రువాలు. అంశికానికి మహా

భూతానికి మధ్య ఏర్పడిన అగాధానికి వంతెన కట్టాలంటే, దీని కంటె ఉత్తమమైన కచ్చితమైన విధానం మరొకటి లేదు. సృష్టించ బడినదానిని నశించిపోకుండా కాపాడడమే దీని ప్రయోజనం. దీని కోసమే ప్రపంచ మీవిధంగా సృజింపబడింది. ప్రేమ అప్రతిహాత మైన ఎదురులేని శక్తిగా రూపొందింపబడింది.

*

రొట్టెలు చేసేవాడు పిండి పులిసి, రొట్టెలు బాగా పొంగేందుకు అందులో యీస్టు కలుపుతాడు. దానివలన రొట్టె లోపల నుంచే పిండి పొంగి పైకి ఉబ్బుతుంది. అటులనే పదార్థాన్ని జాగృతము చేసి దైవం వైపు మరలించేందుకు భగవంతుడు స్వయంగా తానే ప్రేమరూపంలో దిగివచ్చాడు. అందుకే ఈ పరిణామ ప్రక్రియ లోపల నుంచి మొదలవుతుంది. (When the Divine wanted to rouse Matter, awaken it and make it rise towards God, He threw Himself into Matter under the form of love, and it is from within that the transformation takes place.)

భావానువాదం: ధారా రాధాకృష్ణమూర్తి

(*CWM* Vol. 14, pp. 123-24)

Love must not cease to live upon the earth;
For Love is the bright link twixt earth and heaven,
Love is the far Transcendent's angel here;
Love is man's lien on the Absolute.
(*Savitri*, p. 633)

శ్రీమాత చెప్పిన సృష్టి కథ

సృష్ట్యారంభంలో దేవుడు నాలుగు శక్తులను పంపించాడు. అవి మూర్తీ భవించిన శక్తులు – చేతన, వెలుగు, ప్రేమానందాలు, సత్యము. అయితే ఈ మూర్తులకు ఒక దుర్బుద్ధి పుట్టింది. తామే రాజులమని నిరంకుశ పరిపాలన మొదలు పెట్టినై. అప్పుడు మరొక్కసారి దేవుడు కలుగజేసుకొని ఆ నిశీధిని వెలిగింప జేశాడు.

– సంపాదకుడు

సృష్టి విధానాన్ని వివరించే కథనాలలో ఇంచుమించు సత్యమైన వాటినీ, సమగ్రమైన వాటినీ మనం పేర్కొనవచ్చును. నేను మీకు సంగ్రహంగా చెప్పబోయే కథను మీరు విస్సన్న చెప్పిన వేదంగా భావించకుండా సత్యాన్ని వివరించే ఒక ఇతిహాసంగా మాత్రమే స్వీకరించండి.

పరాత్పరుడు తనను తాను దర్శించుకునేందుకు ఐతరేయంగా తనను బహిర్గతం చేసుకోవాలని సంకల్పించాడు; మొట్టమొదట బహిర్గతం చేసింది బ్రహ్మాండవిజ్ఞానాన్నీ, దానిని నిర్వహించే శక్తినీ. ఆయన సంకల్పంలో ఒక వ్యూహం ఇమిడి వుంది. ఆ చిత్ చేతన (knowledge-Consciousness), శక్తి (Force) వాటి కార్యక్రమాన్ని మొదలుపెట్టినై. ఇంకేం, ఆ సృష్టి వ్యూహంలోని ప్రథమ ధర్మమే స్వేచ్ఛ కదా! అతి ప్రధానమైన ఆనందం కోసం వేట మొదలైంది.

ఈ ఆనందాన్నీ, స్వేచ్ఛనీ వ్యక్తం చేసేందుకు మూర్తులు అవసరమయ్యాయి. ప్రప్రథమంగా ఈ బ్రహ్మాండ సృష్టిని సర్వతోముఖంగా వికసింపజేయడానికి నలుగురు కుమారులు (Beings) ఉద్భవించారు. ఈ నలుగురూ చిత్‌చేతనా, జీవమూ, ప్రేమానందము, సత్ (సత్యం) లకు ప్రతీకలు.

వారికి మహత్తరమైన భావనాశక్తి, బలమూ వున్నాయని మీరు సులభంగానే ఊహించవచ్చు. ఎందుకంటే వారు ఆ తత్త్వాలకు మూర్తరూపాలాయె.

వారు కార్యోన్ముఖులై తమ కర్తవ్య నిర్వహణకు పూను కున్నప్పుడు దానిని గురించిన పూర్తి అవగాహన వారికున్నది కనుక. సంపూర్ణ స్వాతంత్ర్యం వుంది గనుక వారి ఇష్టారాజ్యం మొదలుపెట్టారు. ఆజ్ఞలను నిర్వహించే కింకరులలాగా కాకుండా నేనిప్పుడే ఉటకించిన వాక్యాల్లో శ్రీఅరవిందులు భావించినట్లు వారు తమకు అసలు మూలమైన భగవంతుని దృక్పథాన్ని అను సరించకుండా తమకు తోచినట్లు విచ్చలవిడిగా ప్రవర్తించారు. తత్కారణంగానే, యావత్ప్రపంచంలోను, సృష్టిలోను అయోమయస్థితి నెలకొన్నది. పరాత్పరునినుండి ఆయన సృష్టి వేరైనప్పుడు – వేరు కావటమే ప్రధాన కారణం – చైతన్యం నిశ్చేతనంగానూ, వెలుగు చీకటిగాను, ప్రేమ ద్వేషంగానూ, ఆనందం ఖేదంగానూ, జీవం మరణంగానూ, సత్యం అసత్యంగానూ మారిపోయాయి. అప్పుడవి యథేచ్ఛగా తమ సృష్టిని తామే సాగించాయి. దీని వలననే ఏకత్వం నష్టమై, భ్రష్టమై అనేకత్వంలోకి చెదిరిపోయి అవ్యవస్థ నెలకొన్నది.

అందుకనే ఈ ప్రపంచం ఇంత దారుణంగా తయారయింది! (సమయం లేదు గనుక వివరంగా చెప్పటం లేదు.) వీటన్నిటి ఫలి తంగా చిట్టచివరకు అచేతనమైన, నిశ్చేతనమైన, దుఃఖానికి మూల మైన ఈ పదార్థం ఏర్పడింది. ఈ సృష్టికోసమే పై నలుగురు కుమారులను ప్రభవింపజేసిన సృజనాత్మకశక్తి సంభవించిన పరి ణామాన్ని చూసింది. ఏమీ చేయలేక సరిదిద్దుకునే విధానాన్ని ఆదేశించమని పరాత్పరుణ్ణి ప్రార్థించింది. అప్పుడు ఆమెకు తన చైతన్యాన్ని అచేతనలోనికి, ప్రేమను దుఃఖంలోనికి, సత్యాన్ని అసత్యంలోనికి అవతరింపజేయమనే ఆదేశం అందింది. అప్పుడు ఉత్తమ చైతన్యమూ, ఉదాత్త ప్రేమా, పరిపూర్ణ సత్యమూ ఈ ఘోరాతిఘోరమైన పార్థివ ప్రకృతిలోకి దిగివచ్చాయి; నిద్రాణ మైన చైతన్యాన్నీ, ప్రేమనూ, సత్యాన్నీ మేల్కొల్పాయి. ఈ విధ మైన ప్రాయశ్చిత్తకాండలో పార్థివ తత్త్వాన్నీ, పదార్థ ధర్మాన్నీ ఆది స్థితికి ఉద్ధరింపజేశాయి. ఇదీ కథ.

భావానువాదం: ధారా రాధాకృష్ణమూర్తి

(*CWM* Vol. 9, pp. 205-07)

ఆకాంక్షల, అన్వేషణల వెనుక

ఈ భౌతిక జగత్తు అజ్ఞానాంధకారంలో మునిగిపోయి తనను సృష్టించిన దైవాన్నే మరచిపోయింది. అప్పుడు దేవుడు 'ప్రేమ' రూపంలో వచ్చి దానిని తట్టిలేపాడు. "చూడు. బ్రతుకంటే యిది కాదు. ప్రేమ అనే గొప్ప వస్తువొకటున్నది. కళ్లు తెరచి అదేమిటో తెలుసుకో" అని చెప్పాడు. — సంపాదకుడు

ఈ లోకంలో భగవత్ ప్రేమ వ్యక్తమవుతూంటుంది. అది ఒక ఆత్మహననం (great holocaust) వంటిది. ఒక మహోత్కృష్ట ఆత్మార్పణ. పదార్థంలోని అచేతనలో చైతన్యం నిదుర లేవాలంటే, కొద్ది కొద్దిగా ఒక దివ్యశక్తి ప్రదీప్తం కావాలంటే, మొత్తం ప్రపంచం ఒక దివ్యచైతన్యధామంగా, ఒక దివ్యప్రేమమందిరంగా మారాలంటే చైతన్యం అచేతనలోకి అడుగుపెట్టాలి. అందులో సంలీనం కావాలి. మహాచైతన్యం అందుకు అంగీకరించింది. తన అత్యున్నత దివ్యత్వాన్ని కోల్పోవడానికి, తన నిరపేక్ష చైతన్యాన్ని, తన అనంత జ్ఞానాన్ని వదిలిపెట్టి అచేతనతో చేతులు కలిపింది. అజ్ఞానం, అంధకారం నిండిన ప్రపంచంలో నివసించసాగింది. అదే మహోన్నత ప్రేమ.

తాను చేసిన దానికి ప్రతిఫలం కోరలేదు. తన పరిత్యాగాన్ని పెద్ద ఆర్భాటంగా చేయలేదు. మృదుమధుర భావాల వేషాలు దాల్చలేదు. ఎవరూ కూడా దానిని ప్రేమ అని పిలవరు. స్వచ్ఛమైన *ఈ దివ్యప్రవాహాన్ని అందుకుని వ్యక్తం చేయగలవారిని ఈ మహాప్రేమ (force of love) వెదుకుతోంది.* మానవాళి అంతా ఈ ప్రేమ కోసం పరుగులు తీయడం ప్రపంచ హృదయంలోనూ, అందరి హృదయాలలోనూ ఆపలేని ఈ పరవళ్ళు, ఈ గవేషణ – ఇవన్నీ ఏమిటో తెలుసా? ఈ మానవ ఆకాంక్ష, అన్వేషణల వెనుక ఒక దివ్యప్రేమ సృష్టించిన స్పందన, ఒక ప్రేరణ. లక్షలాది ఉప కరణాలకు ఆ అమృతస్పర్శ తగులుతుంది. ఎప్పుడూ ప్రయత్నిస్తూంటుంది కాని విఫలమవుతూనే ఉంది. ఈ నిరంతర సంస్పర్శ

ఈ ఉపకరణాలను సంసిద్ధం చేస్తుంది. హఠాత్తుగా ఏదో ఒక రోజున ఆత్మార్పణ చేసే శక్తిని వారిలో జాగృతం చేస్తుంది; ప్రేమించే శక్తిని వారిలో ఉత్పన్నం చేస్తుంది. (...suddenly one day there will awake in them the capacity of self-giving, the capacity of loving...)

ప్రపంచాన్ని, మానవాళిని తిరిగి భగవంతుని చెంతకు చేర్చడానికి తనలో నుండి ఒక పరాత్పర సనాతన చైతన్యం ఈ చీకటి లోకానికి పంపిన ఏకైక మహాశక్తి ప్రేమ. తమస్సులో, అవిద్యలో మునిగిపోయిన భౌతిక ప్రపంచం భగవంతుడ్ని మరిచి పోయింది.

ఆ చీకటిలోకి ప్రేమ నడిచి వచ్చింది. అక్కడ నిద్రపోతున్న దానిని తట్టి లేపింది. "విలువైనది ఏదో వుంది. అటు మేలుకోవాలి. విలువైనది ఏదో వుంది, అది జీవించాలి. అదే ప్రేమ!" అని మూసుకుపోయిన చెవుల్ని తెరిచి అది పలికింది. ఎప్పుడైతే ప్రేమ మేలుకోవడం జరిగిందో భగవంతునివైపు తిరిగి వెళ్ళే అవకాశం వచ్చింది. ప్రేమ ద్వారా భగవంతుని వైపు సృష్టి కదులుతుంది. దానికి ప్రతిస్పందనగా భగవత్ప్రేమ (కరుణ) సృష్టిలోకి దిగివస్తుంది. ప్రపంచానికి, పరాత్పరునికి మధ్య ఈ ఆదానప్రదానాలు లేనంతవరకు ప్రేమ తన సహజశక్తిని, పూర్ణానందాన్ని పొందలేదు. ఈ మృణ్మయ పదార్థంలోకి దివ్యప్రేమ దిగివచ్చి జీవస్పందన కలిగించింది. అప్పటినుండి లోకం ఈ ప్రేమను (Divine source of life) వెదక నారంభించింది. కాని అది అనేక తప్పటడుగులు వేసింది. చీకటిలో అటూ ఇటూ తిరిగింది. సృష్టి అంతా ఒక గుడ్డిదానివలె దేని కోసమో గాలించింది. తను దేనిని వెదుకుతుందో తనకే తెలియదు. మనుమల దృష్టిలో ప్రేమయొక్క మహోన్నత రూపాన్ని, అత్యంత నిస్వార్థమైన, అతినిర్మలమైన ప్రేమను సృష్టి చేరుకుంది. అది బిడ్డపట్ల తల్లి వాత్సల్యం వంటిది. తను పొందిన దానికన్నా మరి దేనినో రహస్యంగా మానవప్రేమ వెదుకుతోంది. అదేమిటో తెలియదు. దానిని ఎక్కడ పొందాలో అసలు తెలియదు. దివ్యప్రేమకు మనిషి మేలుకున్న క్షణంలో

ఇన్నాళ్ళూ తన హృదయం దేనికోసం తహతహలాడుతుందో అతనికి అర్థం అవుతుంది. ఇది ఆత్మ ఆకాంక్ష. చైతన్యం జాగృతం కావడమంటే అదే. భగవంతునితో సాయుజ్యం చెందాలన్న తపన. ఆ క్షణం నుండి అన్ని అజ్ఞానభ్రమలు వైకల్యాలు రాలిపోతాయి. తన ప్రేమతో భగవత్ ప్రేమకు స్పందిస్తూ సృష్టి అంతా ఒక ప్రస్థాన ప్రవాహమవుతుంది. భగవత్ ప్రేమ కొరకు సృష్టి ఉన్మీలనమైతే దివ్యప్రేమ అంతులేకుండా పరవళ్ళు తొక్కుతూ సృష్టిని ముంచెత్తుతుంది. చక్రభ్రమణం పరిపూర్ణమౌతుంది. పరాత్పరుడు, పదార్థం కలుసుకుంటాయి. వాటి దివ్యసమాగమం శాశ్వతమూ. పరిపూర్ణమూ అవుతుంది..

అనువాదం: కె. యజ్ఞన్న

(*CWM* Vol. 3, pp. 71, 73-75)

నిజానికి మనందరము దేవతలమే (We are all divine) కాని మనకా సంగతి తెలియదు. 'తానే దైవము' అని తెలియని ఈ మూర్ఖుడినే మనము 'నేను' అని పిలుస్తున్నాము.

శ్రీమాత

(*CWM* Vol. 16, p. 365)

ప్రేమ అంటే ఏమిటి?

మీకు ధనమంటే ఏమిటో తెలుసు. బంగారమంటే తెలుసు. కాని 'దివ్యప్రేమ' అంటే ఏమిటో తెలియదు. మొదట ఈ సృష్టి పట్టి అజ్ఞానంలో మునిగిపోయింది. దానిని ఎవరు బాగు చేయగలరు? ఒక్క ప్రేమకే అట్టి శక్తి వున్నది. కాని దానిని గురించి మన కెలా తెలుస్తుంది. సాధన ఒక్కటే మార్గం. — సంపాదకుడు

ఎందరో మహనీయులు ప్రేమను నిర్వచించాలని యత్నించారు. దానిని భాషలో వ్యక్తం చేయడం సాధ్యపడదు. ప్రత్యక్షానుభూతి వలన మాత్రమే ప్రేమంటే ఏమిటో తెలుస్తుంది. నా మాటలు దానికే దారితీస్తాయి. తాదాత్మ్యం లోని ఆనందమే ప్రేమ. సమాగమం లోని ఆనందపారవశ్యమే ప్రేమ అంతిమ రూపం. ఈ రెండింటి మధ్య ప్రేమ విశ్వజనీన దశలు అభివ్యక్తం అవుతాయి. ఈ సృష్టి ప్రారంభంలో ప్రేమకు రెండు కదలికలున్నట్లు మనం గుర్తిస్తాం. సంపూర్ణ ఏకత్వం వైపు అవి రెండూ పరస్పర సామరస్యపూర్వకమైన ప్రేరణలు మాత్రమే. ఒకటి ఆకర్షణశక్తి. రెండవది ఆత్మార్పణం. వ్యక్తి చైతన్యం దైవం నుండి విడిపోయి అచేతనగా మారినప్పుడు ఏర్పడిన అగాధాన్ని పూరించే శక్తి ప్రేమ తప్ప మరొకటి కాదు. విశ్వాన్ని నాశనం చేయకుండా సమస్తాన్ని దైవంతో కలపాలి. అందుకే అప్రతిహాత సాయుజ్యశక్తి ప్రేమ ప్రజ్వరిల్లింది.

చీకటిలో అచేతనలో, అంతులేని కరాళ నిశీధిలో ఈ ప్రేమ నక్షత్ర శకలాలు వెదజల్లబడ్డాయి. అప్పుడు జాగృతి, ఆరోహణలు ప్రారంభమయ్యాయి. తర్వాత భౌతిక లోకాలు, అనంత పరిణామం. భౌతిక, ప్రాణిక ప్రకృతిలో ప్రేమ కాలుష్య, చీకటి రూపం కనిపిస్తుంది. చెట్లలో, మొక్కల్లో ఈ ప్రేరణ కనిపిస్తుంది. వాటి అందం, సౌరభం పువ్వుల రూపంలో అర్పణ చేసుకుంటాయి. మృగాలలో ఆకలి, దప్పికల వెనుక కూడ ఈ ప్రేమే దాగి వుంది. సంతానాభివృద్ధిలో వాటి ప్రతి కోరిక వెనుక ప్రేమనే చూస్తాం.

మరింక ఉన్నత జీవులలో ఈ ప్రేమ మరికాస్త ఉన్నతస్థాయి నందుకుంది. వాటి సంతానం పట్ల ఆత్మత్యాగనిరతి, ప్రేమాతి శయం పరిఢవిల్లుతుంది. మనస్సును వరంగా పొందిన మానవ జాతిలో ఈ ప్రేమ ఆదర్శం పరాకాష్ఠకు చేరుకుంది. ప్రేమ నిరుప మాన చైతన్యరూపం దాల్చింది.

అనువాదం: కె. యజ్ఞన్న

(*CWM* Vol. 12, pp. 65-66)

దివ్యప్రేమకు పూర్వం ఏముండేది?

ప్రశ్న: దివ్యప్రేమ దిగిరాక పూర్వము ఎవరైనా వుండే వారా? వారికి తెలివి (జ్ఞానము) ఉండేదా?

భూలోకవాసులైతే లేరు. అచేతనాభూమికలోకి ప్రేమ దిగి వచ్చినప్పుడే భూమి పుట్టింది. జడపదార్థంనుండి దివ్యచైతన్యం వరకుగల భూమికలన్ని అచేతనము ఆవిర్భవించిన తరువాత వచ్చినవే. నేను చెప్పేదంతా ఒక దేశపు చరిత్ర వంటిదనుకుంటు న్నావేమో జాగ్రత్త! దేవుడు ప్రపంచాన్ని సృష్టించాలనుకున్నాడు. తనలోనుంచి ఒక అంశ బహిర్గతమై అచేతన (inconscient) పుట్టింది. అనగా ప్రపంచానికి ముందరే ఈ అచేతన పుట్టింది. కాని అప్పుడు ఈ సృష్టి ఎందుకు పనికిరాకుండా పోతోందని తెలిసిపోయింది. వెంటనే దివ్యప్రేమ (divine love) అచేతనలోకి ప్రవేశించి దానిని రక్షించాల్సి వచ్చింది. వెంటనే అచేతనకి చైత న్యము వచ్చింది. ఇప్పుడు మనకు తెలిసింది ఏమిటి? పరాచైత న్యము అచేతనలోకి దిగి దానిని వెలిగించినప్పుడే లోకాలన్నీ పుట్టినయి. అంతకు పూర్వము సూర్యచంద్రాదులేవీ లేవు. (నన్ను క్షమించాలి. ఈ విషయాన్ని మానవమేధకు అర్థమయేట్టుగా చెప్పటం చాలా కష్టం)

ప్రశ్న: దివ్యప్రేమ రాకముందర భౌతికపదార్థమున్నదా?

అచేతన అనగా అభావము

భౌతిక పదార్థము లేదనే చెప్పాలి. అది అచేతనము – ఒట్టి అభావము. అది నిజంగా అచేతనమే – ఏమాత్రం జ్ఞానం లేని అయోమయ స్థితి. మాటలలో వర్ణింపనలవి కాని స్థితి. దానిని గురించి తెలుసుకోవాల్నంటే దానిలోకి దిగి చూడాల్సిందే. అది చైతన్యపు ఛాయకూడ లేని మోడు.

ప్రశ్న: ప్రేమ సర్వవ్యాపకమైనదని మొక్కల్లోను గండశిల ల్లోను కూడ అది పెంపెసలారుతూ ఉంటుందని తమరు సెలవిచ్చారు. మరి రాళ్ళల్లో ఉన్న ప్రేమ మనకు కనపడు తుందా?

అచేతన రాయికంటే ఘోరమైన స్థితి

బహుశః రాయిలోని ధాతువులన్నిటిని సమీకరించునది ప్రేమయేనేమో. ఈ సందర్భంలో నీకో విషయం చెప్పాలి. జడపదార్థంలోకి దివ్యప్రేమ దిగిరావడం వల్లనే దానికి ఒక ఆకార మేర్పడింది. అంతకు పూర్వము అది అచేతనంగా ఉండేది. దానికి ఏ ఆకారము లేదు. భౌతికపదార్థంలోకి దివ్యప్రేమ దిగివచ్చి దానిని చైతన్యవంతము చేసినప్పుడే అమూర్తంగా ఉన్న దానికి మూర్తిమత్వము వచ్చింది. నువ్వు అచేతనాభూమికలోకి ప్రవేశిం చగలిగినట్లయితే (ఇది కొంచెం కష్టమే) అదెంత ఘోరమైనదో నీకు తెలుస్తుంది. రాయిలోని చైతన్యం అంతకంటె వెయ్యిరెట్లు మెరుగు. రాయికంటె నీకు ఎక్కువ తెలివున్నదని విర్రవీగిపోతా వేమో. అదే కొలతబద్దతో కొలిచినట్లయితే పూర్తి అచేతనకంటే గండశిల వెయ్యిరెట్లు చైతన్యవంతమైనది. కాబట్టి ఒక గులక రాయిని చూసి "ఓస్ ఇంతేనా" అని నువ్వు అనుకోనక్కర్లేదు.

అనువాదం: డా॥ ఆర్.ఎల్.ఎన్. శాస్త్రి

(జూన్ 2002 'అఖిల' నుండి)

(*CWM* Vol. 4, pp. 240-42)

ప్రేమకి ఆది, తురీయ స్థితులు

(సృష్టికి మూలకారణం)

ప్రేమకి ఆరంభం మోహం, పాశవిక తృష్ణ. తనకు కావలసిన దానిని బెబ్బులి కబళించివేయటం మనం గమిస్తాం. తన అను రక్తిని (love) అది అలా వ్యక్తం చేస్తుంది. మృగానికి పూర్వం జలచరాలకు కూడా ఇదే తంతు. ఉదరజీవాలు అవి. కడుపే వాటి బ్రతుకు. మరో వ్యాపృత్తి లేదు వాటికి. అంటే ఏమన్న మాట? ఆదిలో పదార్థజగత్తు లోనికి కబళించి విలీనం చేసుకునే ప్రక్రియగా 'ప్రేమ' వ్యక్తమైనట్లు అవగతమౌతున్నది కదూ! అంతకు ముందు కదలని మెదలని వట్టి అచేతనమే (incons- cience) ఉండేది. ప్రేమతోనే అందులో స్పందన మొదలైంది. చైతన్యం మేల్కొన్నది. పరివర్తనకు ప్రేరణ కలిగింది. కబళించి సూటిగా తనలోనికి విలీనం చేసుకోవటం ద్వారా నిమ్నస్థాయిలో చాల మొరటుగా ప్రేమ తొలుత వ్యక్తమైనది. ఏమైనా, ప్రేమ విశ్వశక్తి. జీవులకు ప్రేమలో (అది ఎంత మొరటుగా వ్యక్తీకరింప బడినప్పటికి) ప్రమోదం ఉంది. ఆనందం ప్రేమకి ఔన్నత్యాన్ని సంతరించి పెట్టింది. మరి కాస్త పైకి వెడితే మానవప్రేమ ఇంకా ఉన్నతోన్నతంగా అభివ్యక్తం అయింది. వ్యక్తికోసం లేదా దేశం కోసం ప్రాణత్యాగానికి కూడా సంసిద్ధం కావటం ప్రేమకి ఉత్కృష్టస్థాయి. ఇందులో కూడా కాస్తంత మాలిన్యం లేకపోలేదు.

ఈ విధంగా ప్రేమ ఉన్నత స్తరాలకు చేరుకుంటూ వచ్చింది. ఇంతకీ ప్రేమ పరాకాష్ఠ ఎక్కడ?

> "తాదాత్మ్యంతో పొందే ఆనందం (the joy of identification) ప్రేమకి పరాకాష్ఠ. ఏకం కావటం లేదా సంయోగంలో ఇది ఆనందం పరంబ్రహ్మ" (the bliss of union) గా అభివ్యక్తమౌతుంది.

తాదాత్మ్యత వల్ల కలిగే ఆనందం కూడ ప్రేమకి అసమగ్ర రూపమే. మేధస్సుకు అందని భావం ఇది. కొన్ని విషయాలు వాటి పరస్పర వైరుధ్యభావాల అనుభవం వలనగాని గ్రాహ్యం

కావు. అనుభూతి ప్రేరకాలైన అనుభవాలు బుద్ధికి అందవు కదా! ప్రేమకి మహోదాత్త దశ వైశ్వానుభూతి. చైతన్యం (చిత్) సృష్టికి మూలం. సృష్టి అంతా చైతన్యంలో తొణికిసలాడుతోంది. చైతన్య లక్షణమే అంత! ఇది ఎప్పుడు ఎక్కడ ఎలా ఆవిష్కృతమైనదో, ఆద్యంతాలు ఎక్కడో ఎవరి కెరుక! ఈ జగత్తు అంతా పరస్పరా నురాగ చైతన్యంతో పరిపుష్ఠమై ఉన్నది. సంయోగంలో, తాదా త్మ్యత వల్ల, పొందే పారవశ్యం గాని, ఆనందానుభూతి గాని మనోవైజ్ఞానిక శాస్త్రనిబద్ధంగా ఆవిష్కృతం కావు. విశ్వసృష్టికి మూలాధారాన్ని (చైతన్యం) వెతికి పట్టుకునేటందులకు విశ్వమంతా చుట్టి తిరిగినా మళ్లీ మొదటికే వస్తావు. *సృష్టికి మూలం చైతన్య మైతే, చైతన్యానికి మూలం ప్రేమ.* ఇవి అవినాభావాలు. సృష్టి సమగ్రతకి, నిండుతనానికి, సుసంపన్న వ్యక్తిత్వ, వస్తు వైవిధ్యా లకి ఇవే ఆధారం. సృష్టికి ఇంతకన్న హేతుబద్ధమైన వివరణ మరి లేదు.

*

నీలో వేర్పాటు భావం వైదొలగటానికి పరిపూర్ణ తాదాత్మ్యతా భావం నీకు సిద్ధించాలి.[1] ఇది నీకు విముక్తిని ప్రసాదిస్తుంది.

---

[1] తాదాత్మ్యతానందంలో ఏకీకరణ పొంది 'ప్రేమ' దివ్యానందంగా పరాకాష్ఠకి చేరి విశ్వ మంతటినీ తేజోవంతం చేసినదని శ్రీమాత వివరించినపుడు ఆశ్చర్యంతో ఎవరో అన్నారట:
"ఏమిటి ఇది? విశ్వం అంతానా?"
సమాధానంగా శ్రీమాత

నేను కావాలనే సృష్టి (creation) అనే మాట ఉపయోగించ లేదు. సృష్టిని ఎవరో ఎక్కడో సిద్ధం చేసి ఉంచారనే అపోహాకి అవకాశం ఉన్నది కాబట్టి. సృష్టి వేరు. సర్వేశ్వరుడు వేరు కాదు. సృష్టి కాలేదు; కాబడింది. (అంటే అందుకు కర్త లేడు.) సృష్టే ఆయన.; ఆయనే సృష్టి. దైవానికి అభివ్యక్తం సృష్టి. ("This world is God fulfilled in outwardness". (*Savitri*) శ్రీఅరవిందులు కూడా ఇదే చెప్పారు. అస్తి, నాస్తి విచికిత్సల కతీతంగా ప్రేమ (love) దివ్యానందంగా సర్వత్రా వ్యక్తమై ఉన్నది. (A hidden Bliss is at the root of things". (*Savitri*) సృష్టిలో తాదాత్మ్యతానందం పరస్పర సంయోగంలో దివ్యానందంగా పరిఢవిల్లి 'ఏకం సత్' తో విలీనమై. 'సత్‌చిత్ ఆనందం' గా సర్వభూత నివాసియై మిగిలి ఉన్నది. 'సర్వభూత నివాసోసి వాసుదేవ నమోస్తుతే.'

సృష్టి అంతా దైవంతో తాదాత్మ్యత పొందినపుడు సృష్టి వేరుగా ఉండనే ఉండదు. *(సర్వం బ్రహ్మమయం.)*

సృష్టికి (దివ్య) ఆనందం లక్ష్యం. ద్వంద్వ స్వరూపాలు పరస్పరం ఇచ్చిపుచ్చుకునే కార్యకలాపక్రీడకి పరమార్థం దివ్యానంద సిద్ధి.

పరిపూర్ణ తాదాత్మ్యతలో అటు వ్యక్తి, ఇటు పదార్థం స్వస్వరూప భేదాల నధిగమించి సర్వం జగన్నాథంగా విలసిల్లుతవి.

ప్రేమ, తాదాత్మ్యతలో అటు వ్యక్తి, ఇటు పదార్థం స్వస్వరూప భేదాల నధిగమించి సర్వం జగన్నాధంగా విలసిల్లుతవి.

ప్రేమ, తాదాత్మ్యత వల్ల పొందే ఆనందంగా ఆరంభమై సంయోగంలో బ్రహ్మానందంగా తురీయస్థితికి చేరుకుంటుంది. సంయోగం వినా మిగిలేది తాదాత్మ్యతానందానుభూతి మాత్రమే. ప్రకృతి పురుష సంయోగం ఆవృతిలోనే బ్రహ్మానందసిద్ధి. విశ్వవ్యాప్తంగా ఉన్నదంతా ఇదే. సృష్టి ఆద్యంతాలు కూడా ఇదే!

మేధకు అందని సూక్ష్మాతిసూక్ష్మ విషయాలు ఇవి. కాగా దివ్యానందంగా పరిపుష్టమయేది తాదాత్మ్యం వలననే అనేది మాత్రం వాస్తవం.

సమగ్రమైన తాదాత్మ్యత (perfect identity) పరిపూర్ణ సంయోగం (perfect union) అనే భావాలు బుద్ధికి అందవు. ఇవి విశ్వవిశాల హృదయానుభూతి ప్రేరకాలు.

అనువాదం: కర్రా వెంకటేశ్వర్లు

(*CWM* Vol. 6, pp. 103-05; Vol. 8, pp. 226-27)

ప్రేమ మనని పరివర్తింప జేసే ఒక జ్వాల

అన్ని శక్తులలోకి ప్రేమ ఒక సంపూర్ణమైన శక్తి అనేది సుస్పష్ట మైన విషయము. అది అంతటా వర్తిస్తుంది. దుస్సంకల్పాలనూ, దుష్టశక్తులను హరింపచేసే శక్తికంటే ఇదే బలీయమైంది. ఆ శుద్ధి చేసే శక్తి దేన్నీ సూటిగా మార్పు చేయలేదు. అది ప్రథమంగా దాని స్వరూప నాశనం చేసి ఆ తర్వాతే వదిలిపెడుతుంది. అంటే ఒక రూపాన్ని సంస్కరించాలంటే ముందు దాన్ని నాశనం చేసి ఆ పదార్థంతో ఇంకొక సుస్వరూపాన్ని సృష్టిస్తుంది. కానీ ప్రేమ మాత్రం అలా కాదు – ఉన్నదాన్ని ఉన్నట్లే మార్పుచేయగలదు. ఒక వస్తువును తయారుచేయాలంటే ఏ విధంగా దాన్ని కొలిమిలో కాల్చి మెత్తగా చేస్తారో, ఆ విధంగానే *ఎంతటి కఠినమైన దాన్నైనా మృదువుగా కరిగిపోయేటట్లు చేసే శక్తి ప్రేమకి ఉంది.* ఇలా నాశనం చేయకుండానే మార్పిడి చేయగలదు.

తెల్లని జ్యోతివంటి రూపముగల ప్రేమ ఎన్ని అడ్డంకులనైనా దహించివేయగలదు. నీలో ఏ విధమైన ప్రతిఘటన ఉన్నప్పటికీ – అది నీ సంచితపాపం కావచ్చు, అజ్ఞానం కానీ, అశక్తతకానీ దుష్టసంకల్పం కానీ కావచ్చు – ఏదైనప్పటికీ అది నీకెంత బరువుగా అయి నిన్ను బాధపెడ్తున్నా ఒక్క క్షణం ఆ పరిపూర్ణమైన దివ్యప్రేమను స్పృశించగలిగితే ఆ దివ్యాగ్ని దాన్నంతటినీ హరించివేస్తుంది. అనుభవించి చూస్తే నీకే తెలుస్తుంది – కొండంత భారం కూడా తృటిలో కరిగిపోతుంది.

*

పరివర్తన చేయగల శక్తి దివ్యప్రేమ యొక్క ధర్మము. నీ వెప్పుడైతే దివ్యప్రేమకు వివృతుడవవుతావో, ఆ క్షణంలో పరివర్తన చేయగల శక్తిని నీ కైవసం చేసుకోగలవు. నీ కెంత శక్తి వచ్చిందో కొలుచుకోటం ముఖ్యం కాకపోయినా సరైన స్పర్శ లభిస్తే మాత్రం అది నిన్ను పూర్తిగా నింపేస్తుంది.

*

ఏనాడైతే చక్కని, చిక్కని ప్రగాఢమైన దివ్యప్రేమ పృథ్వీపై అవతరిస్తుందో ఆనాడే పరివర్తనకి నాంది జరుగుతుంది. దాన్ని ఏదీ ఆపలేదు.

అయితే అత్యంత శక్తివంతమైన దాని ప్రభావం ఇటూ అటూ చెక్కుచెదరకుండా నిలపటానికి తగిన పరిస్థితులు భూమిపై కల్పించాలి. ఇదే విషయాన్ని శ్రీఅరవిందులు తమ లేఖల్లో ప్రస్తావించారు. శిష్యులొకరు "అది ఇప్పుడే దిగిరావచ్చు గదా" అని అడిగితే వారు ఇలా చెప్పారు, "అత్యంత భారవంతమైన ఆ శక్తి పాతాన్ని తట్టుకోగల సమర్థతగానీ, ఇముడ్చుకోగల మార్దవంగానీ భూమికి లేదు. ఆ ప్రేమ పరిమాణానికి తగినట్లు పృథ్వి విస్తరించి నమ్యంగా (సున్నితం) తయారవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఆ పదార్థం, దాని చైతన్యమూ కూడా తన కఠినత్వాన్ని వదిలి సున్నితంగా తయారుకావాలి. (Matter is still too rigid. And even the substance of the physical consciousness – not only the most material Matter, but the substance of the physical consciousness – is too rigid.)

*

ఓ ప్రభూ! నేను నిన్నే ప్రేమిస్తూ ప్రతి ఒక్కరిలోనూ నిన్నే చూస్తున్నాను. వారిలో ఉన్న నిన్ను ప్రేమిస్తున్న ఫలితంగా వారికి కొంతైనా నీ ఎరుక కల్గుతుందని నా భావన.

కానీ ఆ ప్రేమ ఎవరి ద్వారా వచ్చినా సరే, ఎట్టి అవరోధము లేకుండా ప్రేమ పొందడం ఎలాగో వారికి తెలియాలి; వారి పద్ధతిలోనే ప్రేమించబడాలనీ, వారు కోరుకొన్న వారి ద్వారానే ప్రేమ పొందాలనీ అనుకుంటారేగాని మరొకరి ద్వారా పొందడానికి ఇష్టపడరు. అందుకనే కొన్ని గంటల్లో పూర్తి కావలసిన పని శతాబ్దాలు పడుతుంది! (For them, the real thing is to know how to let themselves be loved without any preference and obstruction. But, not only do they not want to be loved except in their own way, they do not want also to open themselves to love unless it comes to them through the intermediary of their

choice... and what could be done in a few hours, a few months or a few years takes centuries to be accomplished.)

అనువాదం: డా॥ ఎ. ప్రభావతి, డా॥ ఎ. వెంకటరామ శాస్త్రి

(*CWM* Vol. 10, pp. 72-73; Vol. 15, pp. 94-95;
Vol. 10, p. 74; Vol. 13, p. 84)

దివ్య ప్రేమ – మానవప్రేమ

ప్రేమ ఒక్కటే, అది దివ్యము, శాశ్వతము, విశ్వవ్యాప్తము అయిన ప్రేమ. అది అందరికీ సమానమే.

మనిషి మాత్రం అన్ని రకాల స్పందనలనూ 'ప్రేమ' అంటాడు. అన్ని రకాల భావనలు, కోరికలు, ఆకర్షణలు, ఉద్వేగాలు, కామము, స్నేహబంధంతో సహా అన్నిరకాల బంధాలనూ, ఇంకా అనేక వాటినీ కలిపి ప్రేమ అని వ్యవహరిస్తాడు. అయితే ఇవన్నీ ప్రేమకి ఛాయలూ కావు. కనీసం మాలిన్యరూపాలైనా కావు. కేవలం మానసిక, ప్రాణిక భావగర్భిత శృంగార చేష్టలు మాత్రమే.

*

సత్యమైన ప్రేమ ఎన్నడూ ప్రతిస్పందన కోరదు. అసలు వారు ప్రేమించకుండా ఉండలేరు. అంతే తప్ప ఎదుటివారి ప్రేమ పొందటానికని ప్రేమించరు. తను ప్రేమించినవారు తిరిగి ప్రేమిస్తారనో లేక మరేదో కోరికానీ ప్రేమిస్తే అది నిజమైన ప్రేమ కాదు. ఏది ఏమైనా ఫర్వాలేదనుకొని ప్రేమించేది నిజమైన ప్రేమ. అందులోనే సంతృప్తి. మిగతావన్నీ బేరసారాలేగానీ ప్రేమలు కావు. ప్రేమ, ప్రేమకోసమే.

ఒకటి మాత్రం నిజం: నిస్వార్థ ప్రేమలో పడినవారు ఏమీ ప్రశ్నించరు. ఎదుటివారు ప్రేమిస్తున్నారా? లేదా? అని ప్రశ్నించడం చిన్నతనంగా, వెటకారంగా, అల్పత్వంగా అనిపిస్తుంది.

నిజంగా ప్రేమలో పడి ఆ ఆనందంలో తలమునక లవుతున్నప్పుడు వారి ప్రేమను గుర్తిస్తున్నారా లేదా అనే ఆలోచనే ఉండదు. ప్రేమిస్తున్న ఆ సంతృప్తే వారికి పదివేలు. ఇంకేమీ అవసరం ఉండదు.

మనస్సులో తర్జనభర్జనలు, ఏది గొప్పది అని లెక్కలేసుకుంటూ కూర్చుంటే అది ప్రేమ కాదుగదా అంగట్లో బేరమని మళ్లీ చెపుతున్నాను.

అయితే మానవులు ప్రేమను ఆ విధంగానే తయారుచేశారు. అదేమంత శోభస్కరంగా ఉండకపోవటమేకాక అంతకంటే అసహ్యకరమైన సందర్భాలకు దారితీస్తుంది; ఈర్ష్యాసూయలే కాక విపరీత సందర్భాలలో పగా, ద్వేషాలను కూడా కలుగచేస్తుంది. మొదట్లో ప్రేమించిన మనిషి తన ప్రేమను గుర్తించాలనుకోవడంతో ప్రారంభమవుతుంది. అదే భగవంతుని విషయంలో కూడా తను ప్రేమిస్తున్నట్లు భగవంతుడు తెలుసుకొని తీరాలని పట్టుబడతాడు. అదే వారి పతనానికి దారితీస్తుంది. అంతేకానీ అసలు విషయం దగ్గరకు రారు, తెలుసుకోవాలనుకోరు.

ఈ విధంగా మానవులు అనుకునే ప్రేమకూ అసలైన ప్రేమకూ ఎంతో దూరం పెరిగిపోయింది.

*

ప్రశ్న: మానవులెప్పుడూ వాళ్ళిచ్చే దానికి ప్రతిఫలంగా ఏదో ఒకటి కావాలని ఆశపడతారెందుకు?

దానిక్కారణం వారిలో వారు బంధింపబడి ఉండడమే.

వారి అవకాశాలు పరిమితమని తెలియడం వల్ల వారు వృద్ధిపొందాలన్నా, ముందుకు సాగాలన్నా, కనీసం జీవించియుండాలన్నా బయటనుంచి వస్తుపరిగ్రహణ చేయాలనుకుంటారు. వారి పరిమిత చైతన్యంలో వారుంటూండటం వల్ల ఒకరికి ఏదైనా ఇచ్చినప్పుడు వారిలో ఒక రంధ్రం ఏర్పడుతుంది. కాబట్టి ఏదైనా పరిగ్రహించి దాన్ని భర్తీ చేసుకోవాలనుకుంటారు. అది తప్పే కదా! వారి స్వల్ప పరిమితుల్లో బందీలుగా ఉన్నంత సేపూ పోగొట్టుకుంటారనే భయమూ, భర్తీ చేసుకోవాలనే ఆరాటమూ ఉంటాయి. అలా కాకుండా వారి ఇరుకు పరిధిని విశాలం చేసు

కోవాలి. చైతన్యాన్ని విస్తృతపరుచుకొని తామూ ఇతరులతో పాటే అనే భావాన్ని పొంది, తమ హద్దులను దాటి అంతటా తామే ఉన్నట్లు విస్తరించాలి. పరమచైతన్యంతో ఏకత్వాన్ని పొందాలి. అన్నీ తామే అయిపోవాలి. దానితో సంకుచిత పరిమితులు అదృశ్యమవుతాయి. అంతవరకూ అవి పోవు. ఆ స్థితి వచ్చేదాకా ఏదైనా ఇస్తే తమకు తక్కువైపోతుందనీ తిరిగి ఏదో ఒకటి తీసుకోవాలనీ అనుకుంటారు.

మన బుద్ధి సర్వత్రా ప్రసరించాలి. మనలోకి వచ్చిపోయే ప్రకంపనలన్నీ కూడా మనలోనే ఉండిపోవాలనుకోకుండా విస్తరించాలనీ, పెంపొందాలనీ, అన్నిట్లోనూ విలీనం కావాలనీ కోరుకుంటే ఇక పొగొట్టుకునేదేమీ ఉండదు. అంతటా మనమే ఉంటాము కదా! అయితే ఈ విషయం తెలియకపోవడం వలన ఇలా చేయలేరు. ఎంతసేపటికీ పోగుచేయాలనీ, కూడబెట్టాలనీ అనుకుంటారు. అది సాధ్యమేనా? కాస్త ఇచ్చి అది తిరిగి రాబట్టుకోవాలనే తాపత్రయం. ఓ మంచి ఆలోచన చెప్పి దాన్నందరూ గుర్తించాలనుకోవడం, ప్రేమను పంచి మళ్లీ అదే ప్రేమను కోరడం మొదలైనవన్నీ కూడా చాతగాకపోవటం వల్లనే జరుగుతాయి. తామే మంచి ఆలోచనగా మారిపోయి అంతటా వర్తించటం చేతగాదు. అన్నిటిలోనూ నర్తించే ప్రేమగా ఉండటం చేతగాదు. అవేవీ చేతకాక తన పరిమితులు తనే విధించుకొని, ఉన్నది పొగొట్టుకుంటే లేమితో బాధపడవలసి వస్తుందనీ భయపడతారు. అన్నిటితో ఏకత్వాన్ని, తన్మయత్వాన్ని పొందగలిగితే ఈ బాధ ఉండదు. ఎంతగా విస్తృతి పొందితే అంతగా తమ స్వంతమవుతుంది. దేనితో తన్మయత పొందితే అదే తాముగా అయిపోవచ్చు. ఇక అప్పుడు తీసుకోవలసిన అవసరం లేకుండానే ఇస్తూ ఉండవచ్చు. ఇస్తున్నకొద్దీ వృద్ధిపొందుతారు.

అనువాదం: డా॥ ఎ. ప్రభావతి, డా॥ ఎ. వెంకటరామ శాస్త్రి

(*CWM* Vol. 16, p. 409; Vol. 5, pp. 239-40. 233-34)

జంతువులకి మన మీద వుండే ప్రేమ

ప్రశ్న: మన మీద జంతువుల కుండే ప్రేమ ఎలాంటిది?

అది పామరులకి దేముడి మీదుండే ప్రేమ లాంటిది. అందులో గౌరవము, నమ్మకం, తనను సురక్షితంగా చూస్తాడు అనే విశ్వాసం కలిగి వుంటాయి. ఈ ఆరాధన చాలా చక్కటి అనుభూతి అనిపించవచ్చు. పైగా, అది హృదయంలోంచి సహజంగా పెల్లుబికేదే తప్ప ముందు వెనుక తర్కించుకుని పుట్టేది కాదు. ఉదాహరణకి కుక్కల్లో ఈ ఆరాధన చాలా ఎక్కువ పాళ్లలో వుంటుంది. ఇంక నమ్మకం విషయానికొస్తే, దీనిలో నేను ఈ యజమాని మీద నా ఆకలిదప్పికలకీ, బాగోగులకీ ఆధారపడి వున్నాననే భావం కలిసి (పోయి) వుంటుంది. నమ్మకం ఇటువంటి పరాధీనభావం వల్ల కలగడం పెద్ద సంతోషకరమైనది కాదు. దీనికి తోడు ఇంకో దురదృష్టమేమిటంటే ఇందులో చెప్పలేని భయం వెన్నంటి వుంటుంది. ఇది చాలా జాలికరం – కానీ జంతువుల్లో ఈ భయం కలిగించి, వాటి దైన్యాన్ని, వినయాన్నీ పెంచేది మాత్రం మనుషులే. ఈ తప్పు మనుషులదే.

జంతువుల నుంచి నిజమైన ప్రేమ లభిస్తే, అందులో ఆరాధనాభావంతో పాటు చక్కటి భద్రత, రక్షణ ఇచ్చే ధైర్యం వుంటుంది. అన్ని వేళలా తనకి కావలసినవన్నీ తీర్చి, రక్షణ ఇచ్చే కల్పతరువు అంటే వుండే చక్కటి భావం!

జంతువులకి ఆలోచనాశక్తి చాలా తక్కువగా వుంటుంది. అందుకే మనుషుల్లాగా అవి నిరంతరం ఆలోచనలతో సతమతమవవు. ఉదాహరణకి, వాటి మీద ఎవరన్నా దయ చూపిస్తే, సహజంగానే వాటిలో కృతజ్ఞత పెల్లుబుకుతుంది. ఇదే మనుషుల్లో అయితే నూటికి తొంభై ఎనిమిది శాతం అవతలి వ్యక్తి అయాచితంగా దయచూపడం వెనక ఏ స్వార్థముందో అని ఆలోచిస్తారు. మానవమేధస్సులో ఉన్న పెద్ద దుర్బుద్ధుల్లో ఇదొకటి. జంతువుల్లో ఇది లేదు కాబట్టి యజమాని దయకి వెంటనే కృతజ్ఞతతో స్పందిస్తాయి, పూర్తిగా నమ్ముతాయి. అందుకే వాటి ప్రేమ గాఢంగా

పెరిగి యజమానిని అంటిపెట్టుకుని వుండాలని తహతహలాడ తాయి.

ఈ అనుబంధంలో ఇంకో విచిత్రం కూడా వుంది. యజమాని మంచివాడై, ఆయన పెంపుడు జంతువు ఆయన్నే నమ్ముకుని వుంటే, వాళ్ల ప్రాణశక్తి, మానసిక శక్తి కూడా పరస్పరం ప్రభావిత మవుతాయి. దీని వల్ల ఆ జంతువుకి అద్భుత ఆనందానుభూతి కలుగుతుంది. మీ పెంపుడు జంతువుని మీరు ప్రేమతో లాలించినప్పుడు వాటిలో కలిగే స్పందన ఇదే. మీకు వాటి మీద వున్న ఆప్యాయత, అనురాగం రక్షించాలనే భావాలన్నీ అవి అనుభవించగలుగుతాయి. అందుకే మీలో గట్టి బంధాన్ని, అనుబంధాన్ని పెంచుకుంటాయి. అందుకే, కొంచెం తెలివిగల కుక్క, ఏనుగు, గుర్రం లాంటి వాటిల్లో ఈ బంధం నించే తేలికగా భక్తి పెంపొందే నాంది ఏర్పడుతుంది. ఈ భక్తిలో మనుషుల్లో వుండే వక్రతర్కాలు, లాభనష్టాలు, వాదవివాదాలు వుండవు. ఇది చాలా స్వచ్ఛమైన, సహజమైన, అందమైన భక్తి.

మనిషిలో మనస్సు ఆవిర్భవించుటకు పూర్వము ఎంతో అందంగా, సున్నితంగా వున్న చాలా విషయాల్ని కలుషితం చేసి పాడు చేసింది.

ఇంతకు ముందున్న జంతుస్థాయి నుంచి ఉన్నత మానవ స్థాయికి ఎదిగే మార్గంలోని మధ్యదశలో మాత్రం మనిషి తన మేధస్సుని చాలా నీచమైన, వక్రమైన పద్ధతిలో వాడుతుంటాడు. అన్నింటికీ లాభనష్టాలు తర్కించి అంచనా వేసుకోవడానికీ, ఇతర్లని మోసగించడానికీ, అధికారం చెలాయించడానికీ వాడుతూ మనసుని చాలా వికృతంగా చేసుకుంటాడు. ఎదుటివాడిని మోసం చేసి, లాభం పొందాలనే నీచమైన ఆలోచనలు లేకపోవడం వల్ల, నేను ఎంతోమంది మనుషులకంటే ఉన్నతంగా వుండే జంతువుల్ని చూశాను.

అనువాదం: బి. వరలక్ష్మి

(*CWM* Vol. 5, pp. 240-42)

తొలిచూపులోనే ప్రేమ

మధురమైన ఓ దివ్యమాతా! కొంతమందిని మొట్టమొదటి చూపులోనే ఆకర్షణ, మరికొంత మందితో విముఖత ఎందుకు కలుగుతాయి?

ఇది సాధారణంగా ప్రాణిక ఆకర్షణలకు (vital affinities) సంబంధించిన విషయము. కొంతమంది విషయంలో వారి వారి ప్రాణికాలు – స్నేహంగా ఉంటాయి. కొందరి విషయంలో ఉండవు. కాబట్టి ఇది కేవలం ప్రాణిక ప్రకంపనములకు సంబంధించిన విషయం తప్ప మరేమి కాదు. దీనినే ప్రాణిక రసాయన శాస్త్రము అనవచ్చు. ఇలా కాకుండా ఉండాలంటే, చాలా లోతుగా, విపులంగా తమ తమ చైత్యములలో (psychic consciousness) ఉండగలగాలి. అంతర్గతంగా, తమ చైత్యాలకి అనుగుణంగా, దర్శించి చూచినట్లయితే, తన లాంటి ఉద్దేశ్యాలు, భావాలు, ఆకాంక్ష ఉన్నట్లుగా తెలుస్తుంది. పైగా మనతో ఒక భాగస్వామి లాగ కూడా అనిపిస్తుంది. దీనినే దార్శికత, లేక విపులత అంటాము. అసురశక్తులు ఎదుటి వాళ్ళల్లో ఉన్నట్లో లేక మరేదో విముఖశక్తులు మనకు హాని కలిగించే శక్తులు ఉన్నట్లో, తెలిసి పోయి ఇబ్బంది పడతాము. ఇంకా స్పష్టంగా తెలుసుకోవాలంటే, ఆధ్యాత్మిక పురోగతి సంపూర్ణానుభవములు కావాలి. కానీ, ఇది మనం మనుషుల్లో సాధారణంగా చూడలేము. అయితే, విపుల జ్ఞానం ఉన్నవాళ్ళు తప్పకుండా, ప్రశాంతంగా తమకు కావలసింది చూచుకుని ప్రవర్తించగలరు. ఏ ఆకర్షణలు, విముఖతలు లేకుండా ఇష్టాయిష్టాలు కనబరచిన వాళ్ళు ప్రాణికశక్తులతో జీవిస్తున్న వాళ్లు అని మాత్రం స్పష్టంగా తెలుసుకోగలం. దీనితో మానసిక ఆకర్షణలు కూడా కలిస్తే కొన్ని పనులు తమకిష్టమైన వారితో చేద్దామని కూడా అనుకుంటారు. కొంతమంది కొంతమందితో మాత్రమే మాట్లాడడానికి ఇష్టపడతారు. మిగతా వాళ్ళంటే పెద్దగా ఇష్టం చూపరు. ఎందుకో కారణం తెలియదు. ఇష్టాయిష్టాలు ప్రాణిక ప్రపంచానికి చెందినవే అని మాత్రం మనం తెలుసుకోవచ్చు.

భౌతికరసాయన శాస్త్రం లాగా, ప్రాణికశాస్త్రం కూడా ఉంది. కొన్ని శరీరాలు కలుస్తాయి. కొన్ని కలవవు. కొన్ని పదార్థాలు రసాయన శాస్త్రంలో కలుస్తయి. కొన్ని పేలిపోతాయి. అలాగే ఇది కూడా. ఇలా బాగా కలిసిన మనుమలే, తమ ఆలోచనలు కూడా ఒకటిగా అయి అదే 'ప్రేమ' అని అనుకుంటారు. పైగా అబ్బ! ఇదే, ఇలాంటి మనిషినే నేను ఎదురుచూస్తున్నా! అని వాళ్ల దగ్గ రగా వచ్చి, కొంతదూరం వెళ్లారే ఇదంతా పై పై ఆకర్షణే అని కూడా తెలుసుకుంటారు. ఇది నిలిచేది, నిలబడేది కాదు కనుక యోగం చేద్దామనుకునే వాళ్లకి, ఇచ్చే మొట్టమొదటి సలహా ఏమి టంటే, ఈ ఇష్టాయిష్టాలకు దూరంగా అధిగమించి ఉండమని, పైకి ఎదగమనీ! అందులో ఈ ఇష్టాయిష్టాల్లో ఉంటే మాత్రం కష్టాలు తప్పవు. నీ జీవితం కూడా నీవు శిధిలం (నాశనం) చేసు కోవచ్చు. కనుక ఏదీ పట్టించుకోకూడదు. అపుడు నీకు, ఎటు వంటి వాళ్ళని చూసినా, వాళ్ల స్వభావాలు, పెద్ద విచిత్రంగా అని పించవు. కొంతమంది పుటకతోనే చెడ్డవాళ్లు, ఎదుటివాళ్ళకి హాని చేయడంలోనే ఆనందపడేవాళ్ళు ఉండవచ్చు. కాని ఇది కొంచెం అరుదు.

అనువాదం: విమలాదేవి

(*CWM* Vol. 9, pp. 179-81)

ఉన్నది ఒక్కటే ప్రేమ – అది దివ్యప్రేమ. మిగిలిన ప్రేమలన్నీ దాని వికారరూపాలు, మలిన రూపాలు, కురూపాలు.

శ్రీమాత

(*CWM* Vol. 16, p. 298)

ప్రేమ – కామవాంఛ

పశువు నుంచి సంక్రమించిన కామవాంఛ 'ప్రేమ' కాదు. ఆ మాటను అలా మలినపర్చటం నాకు ఇష్టం లేదు.

*

ప్రకృతి 'ప్రేమ' అనే ఒక మహనీయశక్తిని తన పునరుత్పత్తి కార్యక్రమానికి వినియోగించుకుంటున్నది. ఈ సత్యాన్ని విస్మరించి కామానికి ప్రాధాన్యత నిచ్చి మానవుడు 'ప్రేమ' ను పాశవిక స్థాయికి దిగజారుస్తున్నాడు.

*

నిమ్నస్థాయి నుంచి ఉన్నతస్థాయికి యెదిగినపుడే కామవాంఛ నధిగమించ గలుగుతావు. ప్రకృతిలో ఇది నిమ్నస్థాయి కార్యక్రమం. ఈ స్థాయిలో ఉన్నంత వరకు దీనిని నీవు వదిలించుకోలేవు.

*

ప్రేమ కామకలాపం కాదు; ప్రాణిక ఆకర్షణలకు లోబడిన కామ్యకర్మ కాదు. 'ప్రేమ' దివ్యస్పందన. ధీరోదాత్తులు మాత్రమే దీనిని గ్రహించగలరు. అభివ్యక్తీకరించగలరు. వారే, సర్వేశ్వర ప్రభావానికి ఒదిగి స్వచ్ఛంగా ఉండగలరు.

అనువాదం: కర్రా వెంకటేశ్వర్లు

(*CWM* Vol. 14, p. 133; Vol. 12, p. 66; Vol. 14 p. 134, 131)

'దైవము నన్నెంతగా ప్రేమిస్తున్నాడో తెలుసుకోవాలి' (Aspiration in the physical for the Divine's Love) అని నా భౌతికశరీరం తహతహలాడుతోంది.

శ్రీమాత

ఋజుమార్గము

ప్రశ్న: దివ్యప్రేమను పొందాల్నంటే సర్వభూతముల పట్ల ఉండే సహజ ప్రేమను విడనాడవలెనా? నిత్యజీవితంతో గాఢంగా పెనవేసుకొన్న ఈ మోహానుబంధముతో తెగతెంపులు చేసుకోవటమెలా తల్లీ?

నాయనా! మంచి ప్రశ్న వేశావు. ఆ తెగతెంపులు ఈ అనుబంధము ద్వారానే సాధ్యము. మరో మార్గం లేదు. కేవలం బాహ్యామైన అనుభూతులతో తృప్తిచెందక, లోతుగా పరిశీలించి ఈ అనుబంధముల మూలతత్వమేదో గ్రహించుకోగలగాలి. ఈ అనుబంధముల మూలసూత్రం 'అహం' అని గ్రహించిన పిమ్మట, బాహ్యానుబంధము తెగిపోయి సర్వసృష్టికి మూలమైన దివ్యానురాగానికి పాత్రుడు కాగలడు. ఇంతకన్న ఉత్తమమైన మార్గము కాన్పింపదు.

ఒక ప్రయోజనం కోసం మరొక దాన్ని త్యజించటం కష్టమే. మానవస్వభావము అనేక చిక్కుముడులతో కూడుకొన్నదై, విపరీత ప్రవృత్తికి హేతువగుచున్నది. ఈ స్వభావ వైచిత్రివల్ల, మోహాన్ని జయించటానికి సాధన చేయగా, మోహంతో పాటు, సర్వానురాగాది అనుభూతులకు కూడా దూరమగునటువంటి దురదృష్ట స్థితి ప్రాప్తింపవచ్చును. తిరిగి పూర్వస్థితిని పొందుటకు కొన్ని సంవత్సరాలే పట్టవచ్చును. శతాబ్దాలు కూడా పట్టవచ్చును.

అందువల్ల మోహానురాగాది అనుభూతులు ప్రాప్తించినపుడు, వాటి మూలములోకి చొచ్చుకొనిపోయి అంతర్గతంగా నిక్షిప్తమైన మూలస్వరూపమైన భగవత్తత్వాన్ని ఆకళింపు చేసుకోవాలి. తప్పటడుగులు వేయకుండా జాగ్రత్తగా ముందుకు సాగిపోవాలి. సూక్ష్మంగా వివరించుకొంటే, అనురాగాది అనుభూతులకు దూరం కాకుండా, ఆనందాది అనుభూతులకు దోహదం చేసే విధంగా సాధనను మళ్ళించుకోవటం అవసరం.

సృష్టిలో నిత్యము మనము గమనించే దార, పుత్ర, స్నేహాది అనుబంధాలు అజ్ఞానంతో కూడుకొని స్వార్థపూరితమైనవి. ఈ

అనుబంధాలను త్రోసిరాజనటం సాధ్యం కాదని శ్రీఅరవిందులు ఉవాచ. అలా అయితే జీవునిలో ఆర్ద్రత ఇంకిపోయి గుండె పాషాణంగా మారిపోతుంది. అందుచేత 'అహం' ను త్యజించి, త్యాగ నిరతితో, అనురాగవృద్ధికై కృషిచేస్తూ, ఈ అనురాగ వ్యతిరేక స్థితులైన 'నేను', 'నాది' యన్న స్వార్థచింతన, ఈర్ష్యాసూయ ద్వేషాదులను నాశనం చేసుకోవాలి. స్వార్థరాహిత్యమునకు, స్వయిచ్ఛా ప్రవృత్తి విజృంభణకు స్వస్తివాచకం పలకాలి. అపరి గ్రహణంతో బాటు, దాతృత్వగుణం అలవరచుకోవాలి. స్వసుఖా దులందు నిరాపేక్ష వహించి, అందరికి మమతానురాగాలను అందిం చాలి. ఇతరుల నుండి తానేమీ ఆశించక ఆనందస్థితుడై పోవాలి.

ఈ సాధన నీవు ఆచరించగల్గితే నీ పయనం శీఘ్రంగా సాగిపోయి, యోగసిద్ధికి హేతువై, మమతానురాగాలు తనకు, తన వారికే గాక, విశ్వవ్యాపకమున్న పరమార్థం గ్రహించి దివ్యాను భూతిని పొందగలవు. ఈ సాధనలో నీ పురోగతికి స్వార్థరాహి త్యమే ప్రథమ సోపానమని గ్రహించు. ఈ గుణము కేవలము సాధకులకే గాక జీవులందరికీ వర్తిస్తుంది. నిస్స్వార్థత కూడు కొన్న అనురాగ స్పృహతో తానేమీ ఆశించకుండా, తాను ఆత్మా ర్పణమైపోవటమే ఈ సాధనయొక్క లక్ష్యశుద్ధిని సూచిస్తుంది. యోగసాధనలో ఈ దశ ప్రాథమిక దశయై అహంకార ప్రవృ త్తితో కూడుకొన్న నిత్యజీవితానికి నాంది కాగలదు.

మరో విషయము. పూర్వము చెప్పిన విషయము మరొక మాటు మననం చేసుకొంటే, మోహానురాగాది అనుభూతుల మూల తత్త్వము నిశితంగా పరిశీలించి, అందు నిక్షిప్తమైన దివ్యానురాగ తత్త్వమును ఆకళించుకోగా, సిద్ధికి హేతువు కాగలదు. ఈ మార్గంలో తాను ఇతరులకు బాధ కలిగించే తన అహంకార ప్రవృత్తి విజృంభణకు బహుదూరం. నిత్యజీవితంలో కూడా, జీవునికి ఆమోదయోగ్యమై, ఆచరణయోగ్యమై, ఆధ్యాత్మిక అభి వృద్ధికి సోపానము కాగలదని నిస్సందేహంగా ఉటకించవచ్చును.

అనువాదం: శ్రీశరణ్

(*CWM* Vol.8, pp. 301-03)

భువిపై అతిమానస ఆవిర్భావాన్ని ఆకాంక్షించువారు పాటించవలసిన దీక్ష

అసలు ఈ సృష్టి గమ్యమేమిటి? నీ వెక్కడికి పోతున్నావు. బాల్య, కౌమార, వార్ధక్య దశలన్ని అనుభవించిన తరువాత నువ్వు పెద్దగా ఏం సాధించలేదనే తెలిపోతుంది.

దివ్యప్రేమ అనేది ఒకటున్నదట. అది మానవజాతిని పరిణమింపజేసి అతిమానసజాతిని ఆవిష్కరింపచేయగలదట. ఇంతటి మహత్తరమైన శక్తిని గురించి నువ్వు తెలుసుకొని ఏకాగ్రబుద్ధితో దానిని వెతికి పట్టుకుంటే నీ జీవితం సార్థకమవుతుంది. లేని యెడల నువ్వు వట్టి కాలక్షేపం చేస్తావు అంతే. — సంపాదకుడు

ఈ అభ్యాసాలన్నీ (మానవులపై నిస్వార్థ ప్రేమ, మొ॥) ప్రకృతి సహజంగా వేసే తడబడు అడుగులను అనుసరించు సామాన్య మానవునకు, చాలా యోగ్యమైనవి, వుపయోగకరమైనవి కూడా. కాని, యీ కార్యాన్ని వేగిరపరచాలనుకునే వారికి, యివి సంతృప్తి నీయలేవు. ఈ కార్యక్రమాన్ని మరింత సూటిగ తీవ్రతరం చేయాలన్న తలంపుతో వేరొక మార్గాన్ని యెన్నుకోదలచిన వారికి, యివి రుచించవు. మానవాళి యొక్క సామాన్యస్థితి నుండి, నిరంతర ప్రయాణం నుండి, విముక్తిని కలిగించే ఒక ప్రత్యేక ఉద్యమాన్ని చేపట్టదలచిన వారికి యివి నచ్చవు. భువిపైన అతిమానస సత్యాన్ని అభివ్యక్తపరచుటకు సృష్టింపబడే నూతనజాతి ఆవిర్భావ దిశగా కొనిపోయే మార్గంలో పయనించే ఆధ్యాత్మిక పురోగతిలో పాలుపంచుకొన అభిలషించు వారికి కూడ యివి సంతృప్తిని అందించలేవు. ఇలాంటి అపూర్వ జీవులు, మానవుల మధ్య నుండే అన్ని రకముల పరస్పర ప్రేమానురాగాలకు స్వస్తి పలకాలి. ఎందుకనగా, అవి యెంత సుందరమైనవి, స్వచ్ఛమైనవి అయినా కూడా, భగవంతునితో నుండే ప్రత్యక్ష సంబంధానికి అవరోధకారకాలై, దానిని త్రుంచి వేస్తాయి.

భగవత్ప్రేమను అనుభవించినవారికి, యితర ప్రేమలన్నీ చప్పగా వుంటాయి. అల్పములుగానో, అహంకారపూరితములుగానో, అంధకారబంధురములుగానో, యెడతెగని బేరసారాలాడుతున్నట్లుగానో లేక ఆధిక్యతకో, ప్రాధాన్యతకో ప్రాకులాడుతున్నట్లుగానో అగుపిస్తాయి. వీటిలో అత్యుత్తమమైనవి కూడ, సంఘర్షణ రేకెత్తించి సరైన అవగాహనను లోపింపజేసి, అపార్థాలకు దారితీసి, చికాకులమయమౌతాయి.

నువ్వు దేనినైనా అధికంగా ప్రేమించి నీ ప్రాణం పెట్టావనుకో, అప్పుడు నీకు కూడ దాని లక్షణాలే అబ్బుతాయి. ...it is a well-known fact that one grows into the likeness of what one loves. Therefore if you want to be like the Divine, love Him alone. అందువలన, దైవాన్నే అనుసరించదలచిన వారు కేవలం అతనిని మాత్రమే ప్రేమించాలి. దైవానికి, వ్యక్తికిగల పరస్పర ప్రేమ పారవశ్యతను అనుభవించిన వారు మాత్రమే, యితర ప్రేమానురాగాలు యెంత చప్పగా, నిరుత్సాహంగా, దుర్బలమైనవిగా వుంటాయో తెలుసుకోగలరు.

ఇట్టి అద్భుతస్థితినే మనమీ భువిపైన పొందాలని కోరుకునేది. ప్రపంచాన్ని రూపాంతరీకరించి, భగవత్ సాన్నిధ్యానికి యోగ్యమైన నెలవుగా మార్చగల శక్తి, దీనికే వుంటుంది. అప్పుడే నిర్మలము, సత్యము అగు ప్రేమ మారువేషంగాని, ఆచ్ఛాదంగాని లేని దేహంలో సాక్షాత్కరించగలదు.

ఈ ప్రపంచంలోని బాధనంతా అంతమొందించగలది ప్రేమ ఒక్కటే అని మానవునికి యింతకు పూర్వమే తెలుసు. ఈ అవగాహన మొదట్లో కొంత అస్పష్టంగా వున్నప్పటికీ, అతను పరిపూర్ణతకు చేరువౌతున్న కొద్దీ, స్పష్టత పెరుగుతుంది. అనిర్వచనీయమైన ప్రేమ చిందించే ఆనందం ఒక్కటే, యీ లోకంలో వియోగజ్వాలల తీవ్రపరితాపాన్ని తుడిచివేయగలదు. కారణం, పరమోత్కృష్టమైన దైవసంయోగం సమకూర్చే పారవశ్యకతలో మాత్రమే, సృష్టి తన సంకల్పాన్ని, సాఫల్యతను కనుగొనగలదు.

అందుకనే దైవము పదార్థములో బాహ్యాకృతిని దాల్చినప్పుడు, అతని ఉనికి మరుగున పడకుండా నుండుటకుగాను, ఆ భౌతిక పదార్థాన్ని తేజోమయం గావించి, పరిశుద్ధపరచి, లోప రహితంగా పరిణమింపజేయుటకై చేపట్టే యెట్టి ప్రయాసయినా కఠినంగాదు. ఏ నిష్ఠ గూడ కఠోరంగా వుండదు. ఎందుకనగా, అప్పుడే యీ అత్యద్భుత కారుణ్యము, జీవితాన్ని మధురానంద మయమగు స్వర్గధామంగా మార్చగల యీ దివ్యప్రేమ యీ ప్రపంచంలో స్వేచ్ఛగా అభివ్యక్తమవగలదు.

సర్వలక్షణ సమన్వితమైన ప్రేమనంతా కూడ, భగవంతునితో మనకుండే వ్యక్తిగత సంబంధానికే పరిమితం చేసుకొనాలని మనం నిశ్చయించుకొనుట వలన, ప్రతిఫలాపేక్షను గాని, కృతజ్ఞతనుగాని, మెప్పునుగాని ఆశించని పరిపూర్ణమగు, మార్పుకు లోనుగాని, స్థిరమగు, అహంభావ రహితమగు కరుణను, మంచితనమును యితరులతో మనకున్న సంబంధాల స్థానే నెలకొల్ప వలెను. ఇతరులు నీతో యే విధముగా ప్రవర్తించినా, నీవు మాత్రము యే విధమైన ఆగ్రహావేశాలకు లోను కాకూడదు.

క్లుప్తంగా మనోభావాలను నియంత్రించుట అనగా, భావావేశ ప్రేరితములగు మమకారాలన్నింటిని త్యజించుట అన్న మాట. అవి యే కోవకు చెందినవైనా కావచ్చును. ఒక వ్యక్తికో, ఒక కుటుంబానికో, ఒక దేశానికో, మరేదానికైనా కావచ్చు. ఒక దివ్య సత్యముపై పరిపూర్ణ మమకారాన్ని కేంద్రీకరించుటకుగాను, వీటిని విసర్జించ వలసిందే. అప్పుడు ఈ ఏకాగ్రత ఒక సమగ్రమైన తాదాత్మ్యతను సిద్ధింపజేసి భువిపై అతిమానస ఆవిర్భావానికి ఒక మంచి ఉపకరణమౌతుంది.

అనువాదం: అందుగులపాటి కైలాసపతి, అందుగులపాటి జానకి

(*CWM* Vol. 12, pp. 68-71)

నిజమైన ప్రేమ ఎలా దొరుకుతుంది!

ఒక్క చైత్యానికే (psychic) దివ్యప్రేమ అంటే ఏమిటో తెలుసు.

కాని నీ ప్రేమ అహంతో వక్రీకరించబడిన దివ్యప్రేమ అయినప్పటికి, దాని మూలం దివ్యప్రేమయే.

భాషాసౌలభ్యం కొరకు మనం యీ ప్రేమ, ఆ ప్రేమ అని అంటూంటామే కాని నిజానికి వివిధ మార్గాలలో ప్రస్ఫుటమయ్యే ప్రేమంతా ఒకటే.

ఎన్నో యేండ్లుగా నీవు వెతుకుతున్న ప్రేమను కనుగొనే రహస్యాన్ని నీకు తెలిపాను; కాని అది మానసికమైనది కాదు. నీ మనస్సును నిశ్శబ్దత ఆవహించినప్పుడే, నేను తెలియపరచాలనుకున్న దానిని నీవు తెలుసుకోగలుగుతావు. (...but it is not a mental clue; and it is only if your mind falls silent that you can feel what I want to convey to you.)

*

ఒకే ఒక ప్రేమ వుంది – అదే దివ్యప్రేమ. ఆ ప్రేమే లేకుంటే యీ సృష్టే లేదు. ఉన్నదంతా ఆ ప్రేమ మూలంగానే. అసలు ఉనికే లేని మన ప్రేమను కనుగొనాలని ప్రయత్నించినట్లయితే, ఆ ప్రేమను అనుభవించలేము – అది ఒకే ఒక ప్రేమ, ఈ సృష్టినంతా వ్యాపించియున్న ఆ దివ్యప్రేమ.

నువ్వు నిజంగా ఒకరిని ప్రేమించినప్పుడు, అతను తిరిగి నిన్ను ప్రేమిస్తాడా లేదా అనే ప్రశ్న వుండనే వుండదు. ఎందుకంటే వున్నది ఒకే ఒక ప్రేమ కదా. అది ఒక పూర్ణవస్తువు. ఆ ప్రేమకు, ప్రేమించుటయే తప్ప, వేరొక లక్ష్యం లేదు. విభజనలకు లోనైన ప్రపంచంలోనే, యిచ్చి పుచ్చుకునే ఆవశ్యకత యేర్పడుతుంది – ఎందుకనగా, ప్రతివారూ ప్రేమ అనేకత్వమయినదనే భ్రమలోనే బ్రతుకుతుంటారు, కాని అసలు నిజం యేమిటంటే, వున్నది ఒకే ఒక ప్రేమ. చెప్పాలంటే, ఈ ఒకే ఒక ప్రేమయే ఎల్లప్పుడూ తనకై తాను ప్రతిస్పందిస్తుంది.

*

మీలో ప్రతి యొక్కరు మీ చైత్యపురుషునితో సంపర్కమును యేర్పరచుకోగలగాలి. అది అంత అసాధ్యమైన విషయమేమీ కాదు. నీకు చైత్యపురుషుడున్నాడు, దివ్యశక్తులతో కచ్చితమైన సంపర్కాన్ని ఏర్పరచడానికే. అలాంటి సంబంధ మేర్పడినట్లయితే, దివ్యప్రేమ యెలాంటిదో అవగతమవడం ఆరంభమౌతుంది. ఇప్పుడు నేను చెప్పినట్లుగ, యేదో ఒక రోజు ఉదయం లేవటం తోటే, "ఓహ్! నాకు దివ్యప్రేమ కావాలి." అని అనుకుంటే సరి పోదు. అది అలా కాదు. ఒక గట్టి నిలకడగల ప్రయత్నంతోనూ ఒక సుదీర్ఘ యేకాగ్రతతోనూ, స్వార్థాన్ని విస్మరించుటతోనూ, నీ చైత్యపురుషునితో సంపర్క మేర్పరచుకో గలిగితే, "ఓహ్! నాకు దివ్యప్రేమతో సంపర్క మేర్పరచుకోవాలనుంది," అని కలలో కూడ అనుకోవు – ప్రతీదీ దివ్యప్రేమగా తప్ప వేరొండుగ అగుపించని స్థితిలోకి చేరుకుంటావు. (...it is not enough that one morning you wake up saying, "Oh! I would like to be in contact with divine Love", it is not like that. If, through a sustained effort, a deep concentration, a great forgetfulness of self, you succeed in coming into touch with your psychic being, you will never dream of thinking, "Oh! I would like to be in contact with divine Love" – you are in a state in which everything appears to you to be this divine Love and nothing else.)

ప్రశ్న: అందువల్ల చైత్యపురుషుడినే గాక, వేరే దివ్య ప్రేమంటే యేమిటో తెలుసుకో నవసరం లేదా?

లేదు, నీ చైత్యపురుషుని కనుక్కో. అప్పుడు దివ్యప్రేమంటే యేమిటో నీ కర్థమౌతుంది. దివ్యప్రేమతో ప్రత్యక్ష సంబంధానికై ప్రయత్నించకు, ఎందుకనగా, అది నిన్ను ప్రేరేపించే మరొక ప్రాణిక కోరికగా పరిణమిస్తుంది. బహుశ, నీకు అది తెలియక పోవచ్చు, కాని అది ఒక ప్రాణిక కోరిక మాత్రమే.

నీ చైత్యపురుషుని స్పర్శించి, దాని తత్త్వంలో జీవించాలి. అప్పుడే, సహజంగానే, నీ అంతట నీకే దివ్యప్రేమంటే యేమిటో తెలుస్తుంది.

ప్రేమ ఏదో ఒక వ్యక్తిగత విషయం కాదు, అది ఒక విశ్వ వ్యాప్తమగు దివ్యభావన.

అనువాదం: అందుగులపాటి కైలాసపతి, జానకి

(CWM Vol. 14, pp. 130-31, 130, 129;
Vol. 4, pp. 245-46; Vol. 8, p. 303)

పువ్వులు మనకు పాఠాలు నేర్పగలవు

పువ్వుల్లో గొప్ప చైతన్యం దాగి వుందని శ్రీమాత మనకు చెప్పారు. పువ్వులు సందేశాలను అందచేస్తాయి. నిన్ను పలకరిస్తాయి. పుల కరింప జేస్తాయి. నవ్వుతాయి కూడాను. మనమీ విచిత్రమైన విషయాలను గురించి నిదానంగా ఆలోచించి తెలుసుకోవాల్సిందే

– సంపాదకుడు

ఏమాత్రం లాభం పొందాలనే తాపత్రయం లేని నిస్వార్థపు ప్రవృత్తి, ప్రపంచంలోని చైత్యతత్వపు (psychic Consciousness) అత్యంత సుందరమగు నడత లన్నింటిలో మేటిది. కాని, వ్యక్తి మానసిక స్థాయిలో పైకెదుగుతున్న కొలదీ, అతనిలో యీ స్వభావం అరు దైపోతుంటుంది. కారణం, తెలివితేటలతో పాటు నిపుణత, టక్కరితనం సమకూరుతాయి. కాని, వాటితోపాటే దుష్ప్రవర్తన, ఎత్తుకు పైయెత్తు వేసే ధోరణులు కూడ అలవడతాయి. ఉదాహరణకు, ఒక గులాబీ పువ్వు వికసించినప్పుడు, అది ఎలాంటి ప్రోద్బలము లేకుండ, తనంతట తానుగానే వికసిస్తుంది. అందంగా అగుపిం చాలని, కమ్మని సువాసనలను వెదజల్లాలని, జీవించుటలోని ఆనందాన్నంతా అభివ్యక్తపరచాలని, వికసిస్తుంది. అలా చేయ డంలో దానికి యెలాంటి ఎత్తుగడ లేదు, అది పొందే లాభమూ లేదు. అందంగా అగుపించుటలోనూ, జీవించుటలోనూ కలిగే ఆనందం కోసం స్వచ్ఛందంగా వికసిస్తుంది. ఇక మనిషి విష యంలోనా, యెవరో కొందరు మినహా, బుద్ధి వికసించిన తక్షణమే అతనికున్న హోయలు, తెలివితేటలు వుపయోగించి, ఎంతో కొంత

ప్రయోజనం పొందాలని ప్రయత్నిస్తాడు. అది తనకు యేదో సమకూర్చాలని ఆశిస్తాడు, మనుమల నుండి ప్రశంశలనో లేక అంత కంటే నికృష్టమైన లాభాలనో ఆశిస్తాడు. అందువల్ల, చైత్యపురుష దృక్కోణంలో, మానవుల కన్నా గులాబీ యెంతో మెరుగు.

నీవు గనుక ఒక్క మెట్టు పైకెక్కి యే పనినైతే గులాబీ అసంకల్పితంగా చేస్తుందో[1] దానిని మనఃస్ఫూర్తిగా చేసినట్లయితే, అది మరింత శోభాయమానంగా వుంటుంది. కాని ఆ చేసే పని అలాంటిదే అయివుండాలి. స్వచ్ఛంగా పుష్పించే రమణీయత కలిగినది, దేని కోసమో అర్రులు జాచనిది, జీవించుటలో నుండే ఆనందం కోసమే జీవించునది.... ఇదీ వాటి ప్రేమస్వరూపం, అవి వికసించుటలోగల పరమార్థం. సూర్యుని యెదుట గులాబీ విచ్చుకొనుటను గమనిస్తే కచ్చితంగా అది తన అందాన్ని అందించుటకే అన్నట్లుగా వుంటుంది.

ఈ వ్యవహార మంతటిలోను పని చేయునది, ఒక మహత్తర శక్తి, ఒక మహోన్నతమగు విశ్వవ్యాప్త చైతన్యము, అన్నింటిని అతి సుందరంగా వికసింపజేయు ఒక మహిమాన్విత శక్తి నిండిన విశ్వవ్యాప్త ప్రేమ.

*

పువ్వులను, చెట్లను చూడు. సూర్యాస్తమయమయి, అంతటా నిశ్శబ్దం ఆవరించినప్పుడు, క్షణకాలం కూర్చొని స్వయంగా ప్రకృతిలో అన్యోన్య సంబంధాన్ని యేర్పరచుకో. నేలపై నుండి పైకి లేస్తున్నట్లుగాను, చెట్ల వేళ్ల అడుగు నుండి వాటి బోదెలలోని నారల గుండా పయనించి, పైవరకు విస్తరించి యున్న కొమ్మల అంచుల వరకు యెగబ్రాకినట్లుగా వుంటుంది. అది ఒక తీవ్రమైన ప్రేమ, తపనల ఆకాంక్ష – వెలుగును ప్రసరింప జేసి, సంతోషాన్ని ప్రసాదించి, ఆరిపోయిన జ్యోతిని తిరిగి జ్వలింప చేయాలనే తపన. అది యెంతటి స్వచ్ఛమైన, తీవ్రమైన ఆవేదన

---

[1] "నీవు నీ అత్యున్నతస్థాయిని పొందాలంటే. వెళ్లి ఒక పుష్పాన్ని చూడు; ఏది అది అసంకల్పితంగా చేస్తుందో. దానిని నీవు ఉద్దేశపూర్వకంగా చెయ్యి" – ఫ్రెడరిక్ వాన్‌షిల్లర్

అంటే, చెట్లలోని కదలికలను గనుక నీవు అనుభవించగలిగి నట్లయితే, నీ ప్రాణికం కూడ యిక్కడ అగుపించని శాంతి, వెలుగు, ప్రేమలకై సలిపే ప్రార్థనలో గళం కలుపుతుంది. ఒక్క సారి నీకు యీ సువిశాలమైన, పవిత్రమైన, సత్యమైన దివ్యప్రేమతో సంపర్కమేర్పడినట్లయితే, దానిని కొద్దిసేపటి వరకైనా అణు మాత్రం అనుభవించ గలిగితే, నరుని వాంఛ దీనిని యెంతటి తుచ్ఛమైన స్థితికి దిగజార్చేసిందో అవగతమౌతుంది.

*

ప్రశ్న: మీరు వ్రాశారు, "పువ్వులపై నుండు ప్రేమ, చైత్య శక్తిని కనుగొనుటలోను, తాదాత్మ్యము చెందుటలోను గణ నీయంగా వుపయోగపడుతుంది." అని. దీనిని మరింత విపులంగా విశదీకరించగలరా?

వృక్షప్రపంచంలో, పువ్వులు చైత్యాభివ్యక్తి అయినందు వలన, వాటిపై ప్రేమ అనగా, వ్యక్తి చైత్యస్పందనలకు ఆకర్షితు డౌతాడని అర్థం. అందువలన, అతనిలో నున్న చైత్యపురుషునిచే ఆకర్షింపబడతాడు అని.

ఈ చైత్యస్పందనలను నీవు గ్రహించగలిగితే, అది నిన్ను నీ లోనే వున్న చైత్యపురుషునితో అత్యంత సన్నిహిత సంబం ధాన్ని యేర్పరుస్తుంది. బహుశ, పువ్వుల అందచందాలు, గూడ, మనుషుల్లో చైత్యపురుషుని పై ఆకర్షణను రేకెత్తించుటకు ప్రకృతి వాడే సాధనమై వుండవచ్చు.

అనువాదం: అందుగులపాటి కైలాసపతి, జానకి

(*CWM* Vol. 5, pp. 242-43; Vol. 3, p. 72)

దివ్యప్రేమ సర్వత్రా నిండి వున్నది

దివ్యప్రేమ పౌర్ణమినాటి పండువెన్నెల విశ్వమంతా పరుచుకొని పుచ్చపూల చేనులాగా, విరగ్గాస్తున్నది. ఎంత దట్టంగా అలము కొంటున్నదా మహాశక్తి. ఎంత స్నిగ్ధకాంతితో ఉజ్జ్వలిస్తున్నది చూడగలగాలి, అనుభవించగలగాలి అంతే. నూటికి తొంభై మందికి స్పర్శానుభవాలు ఉండవు. వారి చర్మం దళసరిగా వుంటే సుకు మార స్పర్శలు అందవు. ఎవరికి తగ్గట్లు వారనుభవిస్తూ వుండటం లోకం రివాజు. వారి శక్తికి తగ్గంత స్వీకరిస్తారు. నీవొక నిండు వెన్నెల్లో తడుస్తున్నట్లుగా సాంద్రమైన దివ్యప్రణయ జ్యోత్స్నలో తడుస్తున్నట్లు భావించు. కానీ నీ కది తెలియటం లేదు. ఒక్కొ క్కసారి హఠాత్తుగా ఒక మెరుపు మెరిసినట్లు 'ఏదో' నిన్ను ఆవ హిస్తుంది. అప్పుడంటావు "ఓహో! దివ్యప్రేమ నన్నావరించింది. అందులో నేను తడిసిపోతున్నాను" అని. కానీ, అదెంత హాస్యా స్పదం! నీలో ఎక్కడో ఒక సన్నని సందు ఏర్పడి వుంటుంది. ఆ వెన్నెల కిరణం నీలోకి ప్రవేశించింది. చల్లగా, నెమ్మదిగా, నీకు తెలియకుండానే కానీ అది ఎప్పుడు అక్కడే వుంది – మహాచైత న్యంలాగా. ఇదీ నిత్యమూ – సర్వత్రా వ్యాపించే వుంది. కొత్తగా ఉషోదయంలాగా వచ్చిందేమీ కాదు. కానీ ఎవరూ దానికున్ము ఖంగా వుండరు. ఎప్పుడో – ఎందుకో హఠాత్తుగా దాని ఉనికిని గుర్తిస్తావు. అనుభవిస్తావు. "ఓహో! ఎంత మహాచైతన్యం. ఎంత దట్టమైన దివ్యప్రేమ వానలాగా కురుస్తున్నది" అంటావు.

అది హఠాత్తుగా కురిసే వాన కాదు. మెరిసే మెరుపూ కాదు. ఒక చిన్న గుండుసూది తలంత రంధ్రం – ద్వారం ఏర్పడి వుంటుంది నీలో. అక్కడే వున్న చైతన్యం నీరులాగా నీలోకి ప్రవ హించింది.

అదొక చైతన్యవంతమైన వాతావరణం. స్వీకరణ యోగ్యత కన్పించగానే ప్రవేశిస్తుంది. దైవలీలలన్నీ ఇంతే. *అక్కడే వున్నా పట్టించుకోవు. అనవసర విషయాలతో మనస్సు నిండివున్నం దున – ఇతర వ్యాపకాలలో మునిగితేలుతున్నందున – ఇది*

కన్పించటం లేదు తప్ప – అది లేని అంగుళమున్నదా ఈ బ్రహ్మాండంలో. నీవూ, నీ ఆలోచనలూ – నీ ప్రపంచం. ఈ గిరి గీసుకొని బ్రతికే మనిషికి అది గోచరించకపోవటంలో అబ్బుర మేమీ లేదు. ప్రతివాడు లౌకికవిషయాలతో సతమతమౌతుంటే (నవ్వు) లోకమంతా నీలో వుంటుంది తప్ప ఒక భగవంతుడు మాత్రం నీలో చోటు చేసుకోవటం లేదు.

కానీ అతడక్కడే అంతటా వున్నాడు.

అనువాదం: తుమ్మపూడి కోటీశ్వరరావు

(*CWM* Vol.6, pp. 135-36)

మార్గదర్శక వాక్యాలు

దైవం పట్ల నిజమైన భక్తి లేదా ప్రేమ అనగా ఎలాంటి కోరికలు లేని వినయపూర్వకమైన ఆత్మసమర్పణమే.

నిజమైన ప్రేమ అంటే యేమిటో తెలుసా!

ఉండేది ఒకే ఒక ప్రేమ. అది దైవం నుండి ప్రసరించే దివ్య ప్రేమ. అదే మనుమల్లో దైవం పట్ల ప్రేమగా లేదా భక్తిగా మారు తుంది.

భగవంతుని స్వభావం ప్రేమయే.

పరమోన్నత సత్యం తోటి పరిపూర్ణ ఐక్యతలో మాత్రమే సమగ్ర స్వేచ్ఛ వుంటుంది. ఈ ఐక్యతను సాధించడం, ప్రేమ పారితోషికమైన స్వేచ్ఛాపూర్వక ఆత్మసమర్పణం ద్వారా గాక మరెలా సాధ్యమవుతుంది? నేను చెప్పినట్లుగా ప్రేమ యొక్క ప్రథమ ప్రకటన లేదా తొలిచిహ్నం 'సేవ' యే.

కేంద్రహృదయ స్పందన పవిత్రంగా వుండాలి. అది దాని ప్రాథమిక పవిత్రతలో ప్రకటితం కావాలి. దాని వలన హృద యాంతర్గత ఆత్మప్రకటనం జరుగుతుంది. అంతట ఆ హృదయ స్పందన ప్రకటనం వెలుగుల వికాసంతో శోభాయమానంగా వెల్లి విరుస్తుంది. అప్పుడే అది సత్యంగా నిలుస్తుంది. వ్యవహారంలో

దీన్నే ఆత్మ సమర్పణం, ఆత్మ విస్మృతి అంటారు. ఇదే ఆత్మ యొక్క ఔదార్యం. ఇదొక్కటి మాత్రమే నిజమైన దివ్యప్రక్రియ. కాని సాధారణంగా ప్రేమ అని పిలువబడుచున్నది. యథార్థ ప్రేమ యొక్క కేంద్రమూలం నుండి చాలా దూరానికి తొలగించ బడింది.

ప్రేమలో జీవించడం ఎలాగో తెలిస్తే మనకు జీవితమంతా ప్రేమే అవుతుంది. మనిషి దైవప్రేమకు ద్వారాలు బిడాయించి నప్పుడే ఒంటరితనం అనుభవిస్తాడు. ప్రేమ కోసం తహతహలాడే గాఢమైన తృష్ణ ఒకటుంది. దానిని ఎలాంటి మానవ సంబంధమూ తీర్చజాలదు. ఆ దాహాన్ని కేవలం ఒక్క దివ్యప్రేమ మాత్రమే తృప్తిపరచ గలుగుతుంది.

ఇద్దరు మనుషుల మధ్య నెలకొన్న సంబంధం ఎంతో సద్భావంగాను, సరళంగాను, ఎంతో పవిత్రంగా వుండవచ్చు. కాని అది దైవశక్తిని, దైవసహాయాన్ని, ఆ సుగుణసంపత్తి నేరుగా అందకుండా తలుపులు మూసేస్తుంది. అంతేగాదు, ఆ మానవ సంబంధం ఆ సుగుణాల శక్తిని, కాంతిని పరిమితం చేస్తుంది.

నీవు దైవప్రేమతో సంబంధాన్ని కలిగి వుంటే అపుడు సర్వము, సకల పరిస్థితులు కూడ దివ్యప్రేమమయమే అని గుర్తించగలుగుతావు.

దైవప్రేమికుడు సకల ప్రాణికోటిలోను తాను ప్రేమించేది ఆ దైవాన్నే అవుతుంది. అంతట అతనిలో ద్వైత్యభావనకు ఆస్కారం వుండబోదు.

మన అంతరాంతరాలలోని యీ దివ్యచేతనను మనం పొందినప్పుడు, మన భావనాపటిమ ఎంత గొప్పగా పరివర్తన చెందునో! మన అవగాహనా శక్తి ఎంతగా విస్తృతి చెందునో! మన దయాస్వభావం ఎంతగా వర్ధిల్లునో!

ఈ విషయమై ఒక ఋషిపుంగవు డిలా అన్నారు: "దైవం అతి నికృష్టమైన మానవుల్లో సైతం నివసించి వుంటాడు. మన లోని ప్రతి ఒక్కరు తమలోని దైవాన్ని గ్రహించే ఆ హృదయ స్థానాన్ని చేరుకోవాలని నేను కోరుతాను. ఆ దైవాన్ని నిందించు

టకు మారుగా ఆయనతో యిలా అనాలి. "నిత్య నిర్మలుడవు, జనన మరణాతీతుడవునైన ఓ తేజోవిరాజితుడా! సర్వశక్తివంతుడవైన ఓ పరమాత్మా! నీ దివ్యస్వభావాన్ని మాలో ఆవిర్భవింప చేయుము."

మనం యీ సుందర సూక్తి ప్రకారం జీవింతుము గాక! అపుడు మన చుట్టు నున్న సర్వము కూడ అద్భుతావహంగా పరివర్తన చెందడాన్ని మనం గమనించగలం.

బాహ్యారూపాలకు వెనక చూడగల శక్తి, మాటలకు అతీతమైన భావగ్రహణశక్తి, ఈ దివ్యప్రేమకు తెలుసు. ఈ దివ్యప్రేమ ఎన్ని ఆటంకాలున్నా అంతర్గత దైవంతో సదా సంబంధం కలిగి వుంటుంది. సత్యమైన, ఎరుకతో కూడిన, వివేకవంతమైన ప్రేమ తీరు ఇదే! ఇదే!

అనువాదం: బి. నరసింహయ్య

(*CWM* Vol. 14, p. 137; Vol. 12, p. 305; Vol. 9, p. 50; Vol. 10, pp. 216-17; Vol. 14, p. 139, 128)

అహంకార ప్రవృత్తి యొక్క శృంఖలాలలో బంధింపబడిన జీవుడు, వాటిని ఛేదించి, ఇతరులకుగాని, తన వారికిగాని, తన దేశానికిగాని బలిదానము గావించుకొన్న తరుణంలో, స్వార్థరాహిత్య విస్మృతిలో ఒకానొక వినూత్న ఆనంద స్థితి ప్రాప్తించగా దైవసాన్నిధ్యమునకు చేరువైనట్లు గ్రహిస్తాడు. అయితే ఈ ఆనందం నిలకడలేని మెరుపు వంటిది. మరుక్షణంలో, విజృంభించిన అహంకార ప్రవృత్తి మేళవింపగా, ఈ అలజడివల్ల జీవుని ఆధ్యాత్మిక స్థితి దిగజారి, ఆనందం హరించిపోగలదు.

శ్రీమాత

(*CWM* Vol. 12, p. 68)

రాబోయే భవిష్యత్తు
ప్రేమ – ప్రేమ – ప్రేమ మాత్రమే

(ఏప్రిల్ 12, 1962 రాత్రి అనుభూతి)

ఉన్నట్లుండి ఆ రాత్రి ఓ మహా చైతన్యం (Yoga of the world) నన్నావహించింది. తీవ్రస్పందనలతో (big pulsations) పరమ ప్రేమ ఆవిష్కృతమౌతున్నది. ప్రతి ఒక్క స్పందనా ప్రపంచానికి ఆ ఆర్ణావాన్ని మరింత చేరువ చేస్తున్నది. ఆ బలీయమైన స్పందనలు శాశ్వతమైన అత్యద్భుత ప్రేమకు చెందినవి మాత్రమే. ఆ ప్రేమ ప్రతి స్పందనా విశ్వాన్ని ఆ ప్రేమ ఆవిర్భావం వైపు మరింత గొనిపోతున్నది.

ఏది సంభవించవలెనో అది సంభవించిందనియు, అతి మానసము ఆవిర్భవించినదనియు అనే నమ్మకం కలిగింది.

అంతా దైవమే – మనిషి లేడు.

అదలా సాగిపోతూనే ఉంది.

ఏది జరగాలో అది జరిగిందన్న సంగతి రూఢమైపోయింది.

అవిద్య పర్యవసానాలన్ని అదృశ్యమయ్యాయి. మరణం, రోగం, అజ్ఞానం – అన్నీ భ్రమలు, అవాస్తవం – అనుపస్థితం. కేవలం ప్రేమ, ప్రేమ, ప్రేమ మాత్రమే – అపారము, బలీయము, బ్రహ్మాండము అయిన ప్రేమ ప్రతిదాన్నీ ముందుకు తీసుకుపోతూ.

ఈ ప్రపంచంలో దాన్నెలా వ్యక్తీకరించాలి? ఈ రెండూ పరస్పర వ్యతిరేకములే. అది అసాధ్యం. కాని ఇప్పుడది అభివ్యక్తిని పొందింది: ఈ ప్రపంచం అతిమానసిక సత్యాన్ని తెల్సుకోవాలని నువ్వు ఒప్పుకొన్నావు.... అది సంపూర్ణంగా, సమగ్రంగా వ్యక్తీకరించబడుతుంది. తథాస్తు, తథాస్తు...

అది జరిగింది.

(దీర్ఘ నిశ్శబ్దం)

వైయక్తిక చైతన్యం తిరిగి వచ్చింది. అది పరిమితం. బాధను కలిగించే పరిమితి. అది లేకుంటే వ్యక్తి లేడు.

విజయం పట్ల నమ్మకంతో మహాప్రస్థానం మళ్లీ సాగింది. అంతరిక్షమంతా విజయగీతాలతో నిండిపోయింది.

సత్య మొక్కటే. అది మాత్రమే ఆవిష్కృతమౌతుంది. పద, పద ముందుకు!

ఓ సర్వోత్కృష్ట విజయ విధాతా! జయహే!

(నిశ్శబ్దం)

ఇప్పుడు చేయవలసిన కార్యం

క్షమ, సహనం, సంపూర్ణ సమత, నిరపేక్షమైన విశ్వాసం.

(నిశ్శబ్దం)

అనుభూతితో పోలిస్తే నేను చెప్పేదంతా వట్టి మాటలు తప్ప మరేమీ కావు – మరేమీ కావు.

మన చైతన్యం ఆ భగవంతుని చైతన్యం వంటిదే – పూర్తిగా. ఏమాత్రం భేదం లేదు, భేదం లేదు.

త్వమేవాహం – త్వమేవాహం – త్వమేవాహం.

అనువాదం: మాడభూషణం రాజగోపాలాచార్య

(*CWM* Vol. 15, pp. 411-12)

Awakened to the meaning of my heart,
That to feel love and oneness is to live
And this the magic of our golden change
Is all the truth I know or seek...

(*Savitri*, p. 724)

సమాచార పత్రం

21 ఫిబ్రవరి 2005 న శ్రీమాత జన్మదినం ఆశ్రమంలోను, దేశవిదేశాల లోని కేంద్రములలోను జరుపపడినది. శ్రీమాత చిత్రముతో గూడిన ఆనాటి సందేశము:

"There is a special personal tie between you and me, between all who have turned to the teaching of Sri Aurobindo and myself, – and, it is well understood, distance does not count here, you may be in France, you may be at the other end of the world or in Pondicherry, this tie is always true and living"

The Mother

నన్ను, శ్రీఅరవిందులను అనుసరిస్తున్న వారందరికీ నాకు మధ్య ఒక ప్రత్యేకమైన అనుబంధమున్నది. దగ్గరగా ఉన్నా సరే, దూరంగా ఉన్నా సరే, నువ్వు పాండిచ్చేరిలో ఉన్నా సరే, ఫ్రాన్సులో ఉన్నా సరే ఈ సంబంధమెప్పుడూ సజీవంగా ప్రకాశిస్తూ ఉంటుంది.

శ్రీమాత

కేంద్రముల వార్తలు: తిరుపతిలో శ్రీమాత జన్మదిన ఉత్సవములు ఘనంగా జరుపుకున్నారు. శ్రీయుతులు బలరామరెడ్డి, అప్పాస్వామి, సుధాకర్లుగార్లు ఉపన్యసించారు. శ్రీ వెంకట్రామయ్య, సముద్రాల లక్షణయ్య, మల్లికార్జున చెట్టి, గోవర్ధన్, భాస్కర పిళ్ళై గార్లతో సహా అనేకమంది ప్రముఖులు ఇందులో పాల్గొన్నారు. మధుర కేంద్రమువారు 25, 26 డిశంబరు 2004 తేదీలలో 'పిల్లల విద్య పై ఒక ప్రణాళిక' అనే విషయముపై ఒక సదస్సును నిర్వహించారు. లక్నో (యు.పి) లో ఒక శ్రీఅరవింద శ్రీమాత లైబ్రరీకి ప్రారంభోత్సవం చేసారు. డాల్టన్ గంజి (జార్ఖండ్) పోర్బందరు, వడోదరా (గుజరాతు) బెంగుళూరు (కర్నాటక) లలో అనేక సభలను కార్యక్రమములను నిర్వహించిరి. నైరోబి (ఉగాండా) లో శ్రీఅర



A Monthly Published by

SRI AUROBINDO SOCIETY, PONDICHERRY - 605002

Vol. 34, No. 5 Rs. 15

Registered with the Registrar of Newspapers for India: No. 23593/72

PO. Regn. No:
TN/PMG(CCR)/39/03-05
WPP No. 35/03-05



వాక్శుద్ధి

అఖిల

అఖిల భారత పత్రిక, మే 2005

వాక్శుద్ధి

శ్రీఅరవిందుల ప్రవచనములు

మాట్లాడుట ... 3
మాట తీరు – సంయమనం ... 5
ఆధ్యాత్మికానుభూతులను బహిరంగ పరచుట ... 12
సత్యవచనం ... 13
రెండు మహాశక్తులు: మౌనము, వాక్కు ... 17

శ్రీమాత ప్రవచనములు

శ్రీమాత వాక్సుధ ... 18
వ్యర్థ ప్రలాపములు ... 21
నిజమైన ఆకాంక్ష మాటల కతీతం ... 24
మౌన సంభాషణ ... 25
అవగాహన కలగనప్పుడు ... 28
భాష వెనుక భావం ... 31
వాక్కు సృజనశీలి ... 34
మాటలు, వాటి మూలతత్త్వము ... 37
శబ్దబ్రహ్మ ... 39
అతి వాగుడు అనర్థదాయకం ... 40
రోజుకి ఒక గంట సాధన చెయ్యి ... 42
వందేమాతరం ... 43
సంస్కృతం ... 45
చివరి మాట – ఒక యథార్థ గాథ ... 45
సమాచార పత్రం ... 47

ఉపోద్ఘాతము

యోగమనగా జీవితాన్ని సమూలంగా పరివర్తన చేయుట. అనగా ఏవేవో కొన్ని ప్రత్యేక క్రియలను ఆచరించటం కాదు. జీవితం లోని ప్రత్యంశమును సూక్ష్మదర్శినిలో పరిశీలించి యోగమునకు సహకరించునట్లు మలచుట. వాగ్వ్యవహారము జీవితంలోని ఒక ముఖ్యాంశము. ప్రొద్దున లేచినప్పటి నుంచి మనం ఇతరులతో మాట్లాడుతూనే వుండాలి. ఈ మాట్లాడటము విచ్చలవిడిగా జరుప వచ్చునా లేక దానిని కూడ నియంత్రించవలెనా అనేదే ప్రశ్న. మనకు కావలసినది అంతరంగిక దీక్ష, అంతరంగిక నియంత్రణ. కాని మన వాగ్వ్యాహారమంతయు మన పరమోపరిభాగము నుండి జరుగుతుంది. మన ఆవేశాలు, కోపతాపాదులన్ని మాటలలో ప్రక టితమౌతూ వుంటాయి. ఇది యోగజీవితానికి పూర్తిగా విరుద్ధము. కాబట్టి మనం మాట్లాడుతున్నప్పుడు చాలా అప్రమత్తంగా వుండాలి. సంయమనం పాటించాలి.

— సంపాదకుడు

మాట్లాడుట

మాట్లాడటమనేది మనిషియొక్క ఉపరితలము (superficial nature) నుండి జరిగే విషయము. అందుకనే అతిగా మాట్లాడటం హాని కరం. అది నీ శక్తిని వృథా చేస్తుంది. అంతరంగిక వికాసానికి అడ్డు తగులుతుంది.

*

మనము ఇంకొకరితో మాట్లాడినప్పుడు ప్రాణికశక్తుల వినిమయం (vital exchange) జరుగుతుంది. వాళ్ళ నిరాశానిస్పృహాలు (depression) మనకుకూడ అంటుతయి!

*

మామూలుగా కబుర్లు చెప్పుకోవటంవలన మనిషి కలవరపడ తాడు. అంతరంగికంగా దిగజారిపోతాడు. ఇదంతా అధోప్రాణిక భౌతికమానసముల (lower vital and the physical mind) ప్రతా పము – మనిషిని externalise చేసేస్తుంది. అందుకనే చాలమంది యోగులు మౌనవ్రతాన్ని పాటిస్తారు.

*

అంతరంగికంగా గంభీరమైన శాంతి నెలకొన్నట్లయితే సంభాషిం చుట వలన అదేమాత్రము చెదిరిపోదు. ఎందుకంటే మనోప్రాణి కములను ఆవహించిన ఆ శాంతి వాటి కతీతమైనది. అయితే సంభాషించుటవలన చేతన కొంతవరకు చెదిరిపోవచ్చు. నష్టము కలుగవచ్చు. మాట్లాడకుండా వుండటం వలన పెద్దగా నష్టమేమీ లేదు. ఏకాంతంగా వుంటాము అంతే. వార్తలు మొ॥ మామూలు కబుర్లు ఆడకపోవటం వలన వచ్చే నష్టమేమీ లేదు.

*

మనం చెవుల హోరెత్తేట్టుగా ఇతరులకు ఎంత బోధించినప్పటికి, ఆ విషయములు వారి ఉపరిమనస్సును మాత్రమే స్పర్శిస్తాయి. అవి ఆ మనస్సుకు నచ్చితే అది సంతోషిస్తుంది, పులకితమౌ తుంది అంతే. నచ్చని యెడల తిరస్కరిస్తుంది, విమర్శిస్తుంది, విసు

క్కుంటుంది, పెడమొహం పెడుతుంది. ఒక వేళ గట్టిగా బలవంత పెట్టినట్లయితే అది ప్రాణికాన్ని స్పర్శించి దానికి క్షణికావేశం కల గచేస్తుంది, అంతే.

*

అన్ని పరిస్థితులలోను, నీ ఆలోచనలపై, వాక్కుపై నియంత్రణ వుండాల్సిందే. ఆగ్రహావేశాలు పనికిరావుగాని, కొన్ని పరిస్థితు లలో గట్టిగా కోప్పడవలసి వస్తుంది. అవసరమైనప్పుడు భావ గాంభీర్యత, కఠినమైన పదాలు వాడాల్సిందే.

*

ఏవేవో ఊహించుకొని ఇతరులను అపార్థాలతోను, అభాండాల తోను, గోరంతలు కొండంతలు చేసి విమర్శించటం అందరికి వుండే జబ్బే. ఈ జాడ్యము ప్రాణికానిది. అది దాని వినోదం. భౌతికమనస్సు కూడ దానికి వంతపాట పాడుతుంది. అంతరం గంలో జరిగిన దివ్యానుభూతుల ప్రభావం బాహ్యజీవితంలోనికి కూడ రావాలంటే ఎక్కువ మాట్లాడకూడదు. ప్రాణికంగా చేసే గోలకు లొంగిపోకుండా స్థితప్రజ్ఞుడవై వుండటం చాలా అవసరం.

*

నువ్వు కొన్ని నియమాలని పొర్లుపోకుండా పాటించాలి. *ఇత రులను గురించి ఎప్పుడూ చెడ్డగా మాట్లాడకూడదు, విమర్శిం చనూ కూడదు.* పైకి కనపడే ఈ వ్యవహారమంతా నీలోను ఇతరులలోను ప్రకృతి చేసే ఖేలనమే కదా. అందుకని కేవలం ఈ బాహ్యసంఘటనలను గురించి నువ్వు తల్లక్రిందులై పోకూ డదు. వాస్తవాన్ని నిదానంగా, నిశ్చల చైతన్యంతో గ్రహించాలి.

అనువాదం: డా॥ ఆర్.ఎల్.ఎన్. శాస్త్రి, ఆర్. లక్ష్మీప్రసాదమ్మ

(*SABCL* Vol. 23, pp. 653, 835; Vol. 24, pp. 1550, 1555-58)

మాటతీరు – సంయమనం

పిచ్చాపాటి మాట్లాడుకోవడం బాహ్యామానవునికి సంబంధించిన విషయం. అంతరంగికంగా స్థిరపడినప్పుడు నీలో ప్రకృతి యాంత్రికంగా జరిపే కార్యక్రమములు (మాట్లాడటం మొ॥) అన్నిటిని అక్కడినుంచి నియంత్రించవలసిందే. నువ్వు ప్రశాంతచిత్తమును సాధించినప్పుడు ఇది సాధ్యమౌతుంది. – సంపాదకుడు

మాట్లాడటంలో పూర్తి సంయమనాన్ని సాధించడం మంచిది. అంతర్ముఖులమై పూర్తిగా నిజమైన అంతరంగ మరియు యోగ చైతన్యాన్ని వృద్ధిపరచుకొనుటకు అది ఒక ముఖ్యమైన ముందడుగు.

*

పూర్తి మౌనం, అతిగా మాట్లాడటం ఈ రెండూ రెండు ధ్రువాలు. ఏదీ మంచిది కాదు. చాలామంది మౌనవ్రతాన్ని పాటించడాన్ని నేను చూచాను. అయితే ఆ తర్వాత వారు మళ్లి విచ్చలవిడిగా మాట్లాడతారు! మౌనం పాటించినా సరే, పాటించకపోయినా సరే నిన్ను నీవు నియంత్రించుకోవటం ముఖ్యం.

*

మాట్లాడటం బాహ్యామనస్సు నుంచి జరుగుతుంది. కనుక మాట్లాడటంలో బాహ్యాచైతన్యం లోనికి దిగజారటం పరిపాటి. అయితే దాన్ని పూర్తిగా నివారించటం అసాధ్యం. నీవు వెంటనే అంతరంగ చైతన్యంలోకి వెళ్లాలి. ఒక వేళ నీవు సదా నీ అంతరంగ సత్తలో నుండి మాట్లాడగలిగితే లేక కనీసం అది నీ మాటల వెనుక ఆధారంగా ఉన్నట్లయితే ఏ బాధా లేదు.

*

చాలా బాహ్యానికి చెందిన మనస్సే గాలి కబుర్లతో సంతోషిస్తుంది. నిమ్నప్రాణిక నైజంలో నిశ్చలత, దానితోపాటు కొంత అప్రయత్నంగా కలుగు స్వీయనియంత్రణ నెలకొన్నప్పుడే ఆ అలవాటు

వున్నావారు దాన్ని పూర్తిగా జయించవచ్చు – ఇది చాలామం దిలో వుంటుంది.

వీటన్నింటిని సాధించుటకు సమయం పడుతుంది. అతి ముఖ్యమైనదేమనగా నిశ్చలతను దానితోపాటు నిజమైన శక్తిని మొత్తం వ్యక్తిత్వం లోనికి తేవడం.

*

నిజమే, మాట్లాడటం అంతరంగం నుండి రావాలి. అంతరంగ నుండి నియంత్రించబడాలి.

*

వాక్కు ప్రాణికముయొక్క అభివ్యక్తి. దాని అలవాట్ల ప్రకారం బయటపడుతుందే గాని నీ మనస్సును లెక్కచేయదు. నాలుక ఒక అల్లరి పిల్లవాడన్న మాట! మాట్లాడాలన్న ప్రేరణకు లోబడక, దాని అవసరం లేకుండా మాట్లాడగలిగి, తాను మాట్లాడటం సరియైనదని తోచినప్పుడు మాత్రమే మాట్లాడటం, ఏది సరిగా వుంటుందో దాన్ని గమనించి చెప్పడం అనునది యోగపరమగు స్వీయనియంత్రణ యొక్క అత్యావసరమైన భాగం.

ఎడతెగని పట్టుదల, జాగరూకత, బలమైన నిర్ధారణ వీటితో మాత్రమే అలా చేయవచ్చు. అయితే నిశ్చయం వున్నప్పుడు, దాన్ని కొద్దికాలంలోనే, దాని వెనుకనున్న శక్తి సహాయంతో సాధించవచ్చు.

*

'చాలా కాలంగా అలవాటుపడిన గుణాలు వెంటనే తొలగిపోవు' అన్న విషయం బాగా తెలిసిందే. ముఖ్యంగా మాట్లాడటం అన్నది చాలామందిలో అధికంగా వారి నియంత్రణ లేకనే, తనకు తానుగా వస్తుంది. జాగరూకత (vigilance) మాత్రమే కట్టుబాటును కలిగి స్తుంది. అందువల్ల ఎవరైనా తన మాటల వల్ల ఏదైనా అపాయం కలుగుతుందేమో, జాగరూకత లోపిస్తుందేమో అని మెలకువగా వుండాలి. ఆతురతతో కూడిన జాగరూకత కాక ఎక్కువ శాంతంగా కలగలపు లేక వుండగలుగుటే చాలా శ్రేయస్కరం.


*

శారీరక లేక ప్రాణిక – శారీరక అలవాట్లు మార్చుకోటం చాలా కష్టమైన పని. ఎందుకనగా వాటి చర్య అప్రయత్నంగా జరుగునది, మానసిక ఇచ్ఛకు లోనైనది కాదు. అందువల్ల వాటిని నియంత్రించడం కాని లేక పరివర్తింప చేయుటకు గాని మనస్సుకు కష్టమైన కార్యం. నీవు పట్టుదలతో నియంత్రించటం అలవాటు చేసుకోవాలి. తరచుగా నీవు నీ మాట తీరును నియంత్రించుటలో సఫలుడవైనచో – దానికి నిరంతర జాగరూకత అవసరం – చివరికి సంయమనం స్థిరమై, పోను పోను ఎల్లవేళలా జోక్యం చేసుకోగలదు. ఆ ప్రయత్నం శ్రీమాత కాంతికి, ప్రభావానికి పూర్తిగా తెరుచుకోనంత వరకు చేస్తూనే వుండాలి. అది నెరవేరినచో అప్పుడు ఆ సంయమనాన్ని అతిశీఘ్రంగాను, కొన్ని సమయాల్లో అతి త్వరగానూ చేయవచ్చు. చైత్యపు జోక్యం కూడా వుంటుంది – నీవు అనాలోచితంగా మాట్లాడదలచిన ప్రతి సందర్భంలోను జోక్యం చేసుకొనుటకై చైత్యపురుషుడు తగినంతగా జాగృతుడై, క్రియాత్మకంగా వుండి 'వద్దు' అని హెచ్చరించినచో, అప్పుడు మార్పు చాలా సులభమవుతుంది.

*

అధికంగా మానవుల మాట తీరు, ఆలోచన కొన్ని ముద్రపడిన మార్గాలలో యాంత్రికంగా సాగుతూ, మరల మరల ప్రకటితమవుతుంటాయి. వాటిని నియంత్రించునది లేక ఆజ్ఞాపించునది వాస్తవానికి మనసు కాదు. అందువల్లే చేతనాత్మక మనసు తన అధికారాన్ని, అనుమతిని ఉపసంహరించి, మరో విధంగా చేయాలని నిర్ణయించినప్పుడు కూడా, కొంతకాలం వరకు ఈ అలవాటు కొనసాగవచ్చు. అయితే ఎవడైనా ధృఢచిత్తుడైనచో ఈ అధోచేతనలో కూడిన యాంత్రిక అలవాటు, ఇకపై పనిచేయకుండా ఆపివేయబడిన యంత్రాలవలె పతనమవుతుంది. అప్పుడు అతడు ఆలోచించుటకు, మాట్లాడుటకు అంతరంగ దైవం అంగీకరించిన దాన్ని మాత్రమే స్వీకరించగలడు. అధోచేతనలోని అలవాటుకు విరుద్ధమైన దాన్ని ఏర్పరచుకొనగలడు.

*



వాక్కును కట్టుబాటులోనికి తేవటం కష్టం. తమ నోటికి వచ్చిన దాన్ని చెప్పడానికి ప్రజలు అలవాటుపడి వుంటారు. వారు తాము చెబుతున్నదానిపై అజమాయిషీని, నియంత్రణను చేయరు. మాట్లాడటంలో ఒక విధమైన యాంత్రికత వుంది. దాన్ని చైతన్యపు అత్యున్నత పరిధిలోనికి తేవడం ఎల్లవేళలా అంత సులభం కాదు. మాట్లాడటంలో చాలా పొదుపుగా ఎందుకు వుండాలి అనుటకు అదొక కారణం. బాగా ఆలోచించి సంయమనం పాటించుటకు అది సహాయపడుతుంది. పైగా నాలుక తన ఇష్టానుసారంగా ప్రవర్తించడాన్ని నివారిస్తుంది.

వాటికి లోబడక వుండటం అనగా తన మనసుకు, వాక్కుకు, సాక్షిగా వుండటం, వాటిని తనకన్నా వేరైనవిగా చూడటం, వాటితో తాదాత్మ్యం చెందకుండా వుండటం. వాటికి వేరుగా వుండి సాక్షిగా గమనించడం ద్వారా, అవి ఏవో, అవి ఎలా పనిచేస్తాయో, ఆపై వాటిని ఎలా నియంత్రించాలో, తాను అంగీకరించని దాన్ని తిరస్కరించడం, ఏది నిజమైనదని తోస్తుందో, దాన్ని ఆలోచించి మాట్లాడటం అను వాటిని అతడు గ్రహిస్తాడు. అయితే ఇది తక్షణమే సాధ్యం కాదు. ఈ తనకన్నా వేరైనది అను భవాన్ని స్థిరం చేయుటకు కొంతకాలం పడుతుంది. సంయమనాన్ని సాధించుటకు ఇంకా ఎక్కువ కాలం పడుతుంది. అయితే సాధన, పట్టుదలతో దాన్ని సాధించవచ్చు.

*

మాట్లాడు భాగం నుండి నీవు వేరుపడి శ్రద్ధగా పరిశీలించగలిగినప్పుడే దాన్ని నియంత్రించగలవు. మాట్లాడునది బాహ్యామనస్సు – దాన్ని అంతరంగ సాక్షీభూత మనసు ద్వారా గమనించి నియంత్రించాలి.

*

నిజానికి కావలసింది అంతరంగ నిశ్శబ్దత – అంతరంగంలో నిశ్శబ్దంగా వుండునదేదో ఒకటి బాహ్యా సంభాషణను, చర్యలను గమనిస్తుంది. అయితే దాన్ని ఏదో పైపైదిగా, తాను కానిదిగా, చాలా ఉదాసీనమైనదిగా, తనతో స్పర్శించబడనిదిగా భావిస్తుంది.

మాట్లాడుటకు, పనిచేయుటకు ఆధారమివ్వగల శక్తులను అది తేగలదు లేక ఉపసంహరించుకొని వాటిని ఆపగలదు, లేక వాటిని వాటి దారికి వదలి, వాటితో కలియకుండా వాటిచే చలించక పరి శీలించగలదు.

*

సహజంగా అలా ఎందుకనగా, ఈ విషయాలలో (చర్చలు, నవ్వులు) చైతన్యం బయటకు నెట్టివేయబడుతుంది. అంతరంగ సమస్థితి నుండి అతడు బయిటపడి తిరిగి అందులోనికి పోవడం కష్టమవుతుంది – ముఖ్యంగా ప్రాణికశక్తి ఒక విధంగా చెదిరి పోవడం చేత ఎవ్వరైనా చైతన్యపు బాహ్యతలం ద్వారా మాత్రమే, బాహ్యంగా ఏమి జరుగుతుందో దాన్ని లోపలి నుండి పరిశీ లిస్తూ, దానిలో తనను తాను విస్మరించకుండా, ఈ కార్యాలను చేయగల స్థితిని పొందగలిగినచో, అప్పుడు సమస్థితి లోపించదు. అయితే ఇలా తన ప్రతిరూపాన్ని పొందడం కొంత కష్టం – కొంత కాలానికి అలా కాగలడు, ముఖ్యంగా అంతరంగ శాంతి, నిలకడ తీవ్రం మరియు చాలా కాలం మనునవిగా కాగలిగినచో.

*

మాటలు, పనులలో తొందరపాటు (అధికంగా, ఎందుకనగా కొంత వరకు ఇది ప్రతి మనిషిలో వుంటుంది) – అదొక స్వభావం. నిర్ణయాలకై అతివేగంగా గంతులు వేయకుండా లేక వెంటనే ఆలోచనల నుండి, మాటలకు, చేతలకు వేగిరపడకుండా వుండు టకు క్రమశిక్షణలో పెట్టవలసింది బాహ్యంగా పోవు మనసును.

*

ఇంకొకరితో మాట్లాడేటప్పుడు నువ్వు చైత్యపురుష స్ఫూర్తితో మాట్లాడాలి.

1. ఆవేశంతో ఇష్టమొచ్చినట్లు మాట్లాడకూడదు. చర్చిస్తున్న విషయానికి సహాయపడే మాటలు, అవసరమున్నంత వరకే మాట్లాడాలి.
2. నువ్వు చెప్పదలచుకున్నదేదో చెప్పి ఊరుకోవాలి అంతే. నువ్వు చెప్పిందే న్యాయమని ఇతరులది తప్పని వాదించ

నక్కర్లేదు. ఒక విషయాన్ని గురించి నీ అభిప్రాయము చెప్పి, మాట్లాడకుండా ఉండాలి. గట్టిగా అరవకూడదు.

3. మాట్లాడే తీరు మామూలుగానే వుండాలి. పరుష వాక్యాలు, ఆగ్రహావేశాలు ఏమాత్రం పనికిరావు.
4. ఇతరులు గట్టిగా మాట్లాడినా సరే, వాదించినా సరే, నువ్వు మట్టుకు నెమ్మదిగానే వుండాలిగాని, వాళ్లతో పాటు నువ్వు కూడ రెచ్చిపోకూడదు. నెమ్మదిగా మాట్లాడినట్లైతే పరిస్థితి చల్లారుతుంది.
5. ఇతరులను గురించి చెడుగా మాట్లాడటం, ముఖ్యంగా సాధకుల మీద పితూరీలు చెప్పినప్పుడు నువ్వు కూడ వాళ్లతో కలిసిపోకూడదు. ఇటువంటి చౌకబారు కబుర్లు నీకే విధంగా సహాయం చెయ్యకపోగా నీ చేతనాస్థాయిని దిగజార్చివేస్తాయి.
6. ఇతరులను బాధపెట్టే మాటలు, చేతలు పనికిరావు.

అనువాదం: నైనారు అప్పాస్వామి

(*SABCL* Vol. 23, p. 639; Vol. 24, pp. 1549-1556)

I believe it is a practice to be recommended to everyone: to keep a certain time every day for trying to make the mind quiet, even, still.

The Mother

(*CWM* Vol. 3, p. 195)

ఆధ్యాత్మికానుభూతులను బహిరంగపరచుట

సాధన చేస్తున్నకొద్దీ నీ చేతనాస్థాయి పెరుగుతుంది. దానితో పాటు నీకు సూక్ష్మదృష్టి, కొన్ని యోగానుభూతులు కలుగుతాయి. నీవు వాటిని జాగ్రత్తగా పదిలపరచుకోవాలి. ఎవరితోటి చెప్ప కూడదు. — *సంపాదకుడు*

మన పూర్వ యోగులు, సాధన గురించి చెప్పిన నిబంధనల్లో, తమ స్వీయానుభవాలను గురువుతో తప్ప, మరెవ్వరితోనూ చెప్ప కూడదు (అందులోనూ ఇంకా సాధన కొనసాగుతున్నప్పుడు) అని అన్నారు. ఎందుకంటే అది తపస్సును క్షీణింప చేస్తుంది. దీనినే తపఃక్షయం అంటారు.

*

నువ్వు దాన్ని గురించి అధికారం లేనివాడికి చెప్పావు గనుక, ఆ దివ్యకాంతి నిన్ను వదిలి వెళ్ళిపోయింది. నీ అనుభవాలు, గురు వుతోగానీ లేదా నీకు సాధనలో సహాయపడగలిగిన వారితోగానీ మాత్రమే చెప్పడం నీకు శ్రేయస్కరం. ఇలా, నీ అనుభవాలను మరొకరితో చెప్పగానే సాధారణంగా అవి మాయమైపోతాయి. అందుకే మన యోగులు తమలో ఏం జరుగుతున్నదీ ఎవ్వరికీ చెప్పొద్దన్న నిబంధన పెట్టారు. నీలోని అనుభవాలు నీలో స్థిర పడినపుడు మాత్రమే నువు చెప్పొచ్చు. అంటే అవి నిన్ను విడిచి పెట్టి వెళ్ళలేనపుడు నీలో స్థిరంగా ఉన్నపుడు అన్న మాట. అలా శాశ్వతంగా నీలో ఉండగలిగిన నీ అనుభవాలు సాధనలో నీ పురో భివృద్ధికి దోహదం చేస్తాయి. పైగా చైతన్యకవాటాలు తెరుచుకుం టాయి.

*

ఈ ఆనందాన్ని నువ్వు అట్టే పెట్టుకోవాలంటే, నువ్వు నీ అను భవాలను, ఎవ్వరికీ చెప్పకుండా ఉండటం మంచిది. ఇతరులతో చెప్పిన అనుభవాలు రెక్కలొచ్చి ఎగిరిపోతాయి సుమా!

యోగాన్ని మరొకరితో చెప్పడం ద్వారా, తాను శిష్యులతో ఒక గురువు అవగలడు. మన పూర్వయోగులు ఏం చెప్పారంటే, శిష్యులను చేర్చుకున్న గురువు, వాళ్ల కష్టాలను, తన కష్టాలతోపాటు తన మీద వేసుకుంటాడు.

అనువాదం: విమలాదేవి

(*SABCL* Vol. 23, pp. 925-27)

సత్యవచనం

నువ్వు సాధన చేయటం ఉన్నత చైతన్యాన్ని పొందేందుకే కదా! అటువంటప్పుడు నువ్వు చాల జాగ్రత్తగా మాట్లాడాలి. అబద్ధాలు, అతిశయోక్తులు పనికిరావు. నీకు సత్యము కావాలంటే వాక్శుద్ధి తప్పనిసరి.

— సంపాదకుడు

సత్యమే మన గమ్యం అయినప్పుడు, మన మాటల్లోనూ, తలపుల్లో కూడా సత్యమే వుండాలి. అనృతము (falsehood) నీలోని భాగము కాదని, నీకు దానికి ఏ విధమైన సంబంధమూ లేదని తెలుసుకో. అప్పుడు నువ్వు దాని మాట ఎందుకు వినాలి? దానిని తేలికగా నిరాకరించగలవు; వెంటనే తిప్పికొట్టివేయగలవు.

*

నీలోని చైత్యపురుషుడు మేల్కొన్నాడని తెలుస్తున్నది. దాని ప్రభావము వలనే నువ్వు సత్యమునే పలక గలుగుతున్నావు. అంతరంగంలోంచి పొంగి పొరలే వెలుగు నీ శరీరము నందెల్లడలా వ్యాపించి దానిని సత్యమార్గంలో నడిపిస్తున్నది. It is evident from this inward control which you feel enlightening and guiding you and the resolution of truth-speaking that it made you take, that your psychic being is awake within you. మానవులలో ఎక్కడ చూసినా వ్యక్తిత్వంలో ఏవో కొన్ని లోపాలు కనబడుతూనే వుంటాయి. ఇష్టాయిష్టాలని బట్టో, వ్యక్తిగత అభిప్రాయాల

వలనో, సొంత లాభం కోసమో, అహంభావం వల్లనో – ఎన్నో కారణాలవల్ల అబద్ధం ఆడటం జరుగుతుంటుంది. ఒక్కోసారి అబద్ధం కాకపోతే సత్యాన్ని వక్రీకరించడమో, గోరంతలు కొండంతలు చెయ్యడమో లేదా కొండంతల్ని గోరంతలు చెయ్యడమో జరుగుతుంది. ఈ స్వభావాన్ని నిజంగా మార్చుకోవాలంటే సత్యాన్ని, ఉన్నదున్నట్లుగా మాట్లాడాలి. ఈ సత్యమార్గంలో ముందుకి వెళ్లాలంటే, ఎలాగయితే రోగలక్షణాలకు మందు వేసే ముందు ఆ వ్యాధి మూలం తెలుసుకుంటారో, మన స్వభావంలో అసలు మారవలసిందేమిటో తెలుసుకోవడమే మొదటి మెట్టు.

*

పూర్ణసత్యానికి తనలో అంకురార్పణ కావాలంటే సాధకుడు ఎల్ల వేళలా పూర్తి నిజాన్నే మాట్లాడడం చాలా అవసరం.

*

అవసర అనవసరాలతో పని లేకుండా, అసత్యానికి అన్ని వేళలా దూరంగా వుండాలి.

*

"ఎంత చిన్నదయినా, మనం కనక మన మాటల్లో కానీ వ్రాతల్లో కానీ అసత్యం దొర్లనిస్తే, పరిపూర్ణ సత్యానికి దూతలమెలా అవగలం? పూర్ణసత్యాన్ని గౌరవించే ప్రతి ఒక్కరూ ఎటువంటి పొరపాట్లకీ, అతిశయోక్తులకీ, వక్రీకరణలకీ తావివ్వకూడదు"

– శ్రీమాత

సత్యవచన ప్రాధాన్యత గురించి శ్రీమాత ఎంతో ఉన్నత స్థాయి నుంచి ఈ సూచనలిచ్చారు. పరిపూర్ణ సత్యానికి మీరు మాధ్యమం కావాలంటే, ఎట్టి పరిస్థితులల్లోనూ సత్యాన్నే పలకాలి. అలా అని, అన్ని విషయాలూ అందరికీ చెప్పకూడదు. కొంతమందికి ఆ సత్యాన్ని జీర్ణించుకుని అంగీకరించే స్థాయి ఉండకపోవచ్చు. ఇంకొందరు దాన్ని వ్యతిరేకించే వాళ్లవచ్చు, లేదా దాన్ని అసత్యంగా మలచవచ్చు. అటువంటప్పుడు మౌనంగా వుండి అటువంటివాళ్లతో సత్యాన్ని పంచుకోకపోవటం తప్పు కాదు. హాస్యానికైనా ఎగతాళికైనా సరే అసత్యం పలికితే, మనలోని చేత

నత్యాన్ని, సత్యాసత్య అవగాహనని దిగజార్చినట్లే. ఇదే విష యంలో గుర్తుపెట్టుకోవలసిన ఇంకో ముఖ్యవిషయం: సత్యమును మనస్సుతో తెలుసుకుంటే సరిపోదు. మనస్సుకు సత్యమంటే ఏమిటో తెలుస్తే కదా! మనస్సును దాటి ఉన్నత చేతనను సంపా దించు. అప్పుడే నీకు అసలు సత్యమంటే ఏమిటో తెలిసేది.

*

అబద్ధం ఎందుకాడాలి? అవసరం ఏమిటి? తెలిసిన ప్రతీదీ అంద రికీ చెప్పాలని నియమం లేదు. అలా చెబితే మంచికంటే చెడు ఫలితాలే ఎక్కువవచ్చు. అవసరమయితే, ఎంత అవసరమో అంతే చెప్పాలి. ఆ చెప్పేది మాత్రం నిజమే చెప్పాలి. అసత్యాలు, తెలిసి కావాలని సత్యాన్ని వక్రీకరించడాల్లాంటి పనులు మాత్రం చెయ్య కూడదు.

*

నిజమే పలుకుదామంటే కొన్ని విషయాలని గమనించుకోవాలి. ఒక్కోసారి లోలోపల అది అబద్ధం అని తెలిసికూడా బయటికి అది ఒప్పయినట్లు మాట్లాడటం జరుగుతుంది. వాస్తవానికి అది నిజం కాదు కదా! ఇంకొన్ని సందర్భాలలో లోలోన కచ్చితంగా నిజమని నమ్మినదాన్ని బయటకి చెప్పడం జరిగినా, యథార్థానికి అది నిజం కాకపోవచ్చు. లోపల అబద్ధమని తెలసీ పైకి నిజంలా చెప్పడం కావాలని మోసం చేసుకోవడమే. అంతేకాదు, అది సత్యాన్ని ధిక్కరించడమే. ఇంతకంటే లోపలనించీ సత్యమే చెబు తున్నామని నమ్మి, తెలియక అసత్యం చెప్పడం పొరపాటువల్లో, అజ్ఞానంవల్లో జరుగుతుందనుకోవచ్చు. ఇవన్నీ మన నిత్యజీవి తంలో జరుగుతుంటాయి.

మన చైతన్యం వుండే స్థాయిని బట్టి సత్యంపట్ల మన అవ గాహన, దృక్పథం, నిర్వచనం అన్నీ మారతాయనేది సత్యం. మనస్సు స్థానం కంటే పైస్థాయి, Higher Truth స్థాయినించి గమ నిస్తే, సత్యం నిర్వచనం వేరుగా వుంటుంది. క్రిందిస్థాయిలో, మనస్సు స్థాయిలో అసంపూర్ణ సత్యమవవచ్చు. అంతమాత్రాన నిరాశ పడనక్కర లేదు. అనంతసత్యాన్ని తెలుసుకునే ప్రయ

త్నంలో ఈ పరిమిత బుద్ధికి తెలిసే చిన్న చిన్న సత్యాలే, అసంపూర్ణ సత్యాలే మొదటి మెట్టు. పూర్ణసత్య చైతన్యం మనలోకి ప్రవహించాలంటే ఎప్పుడూ దాని కోసం హృదయపూర్వకంగా, స్వచ్ఛంగా స్వాగతం పలికేలా ఎటువంటి అజ్ఞానపు తెరలు అడ్డు లేకుండా వుండగలగాలి. సాధారణ స్థాయిలో వుండే కోరికలు, ఆవేశాలు, స్వార్థాలు ఆ స్వచ్ఛమైన పూర్ణసత్యాన్ని గ్రహించలేని గుడ్డివాళ్లుగా మనని చేస్తాయి, లేదా దానిని వక్రీకరించేలా చేస్తాయి. అందుకే నిరంతరం పైనుంచి ఏ క్షణాన ప్రసరించినా సంపూర్ణ సత్యాన్ని స్వీకరించగల స్వచ్ఛత కలిగి వుండాలంటే, క్రింది స్థాయిలోని అసంపూర్ణ సత్యాన్నీ, కల్మషాలనీ వదిలెయ్యగలగాలి. ఇదే కనక ఒక్కసారి చెయ్యగలిగితే Higher Consciousness సవ్యంగా పనిచెయ్యడం మొదలుపెడితే, సత్యమార్గంలో ప్రగతి చక్కగా, నిరాటంకంగా జరుగుతుంది. సత్యంలోని ఒక మెట్టు నుంచి ఇంకో మెట్టుకి ఎదగగలుగుతారు.

*

అబద్ధాలు చెప్పటం: ఇది నీ అధోప్రకృతికి చెందిన జబ్బు. ఋజు ప్రవర్తన లేనివారు మదర్ సహాయాన్ని అందుకోలేరు. వారంతట వారే దాన్ని తిప్పికొట్టివేస్తారు. అట్టివారు అతిమానస సత్య జ్యోతులను ఎలా గ్రహించగలరు? వారి అధోప్రకృతిని, ప్రాణిక, భౌతికములను ఎలా మార్చుకోగలరు? వారు తయారు చేసుకున్న స్వయంకృతాపరాధములో వారే లోతుగా కూరుకొనిపోతారు. ముందుకు సాగలేరు.

అనువాదం: బి. వరలక్ష్మి

(*SABCL* Vol. 23, p. 652;
Vol. 24, pp. 1558, 1553, 1559-60, 1308-09)

రెండు మహాశక్తులు: మౌనము, వాక్కు

ఎంత తెలివైనవాళ్ళయినా ముందర ఏం జరగబోతోందో ఊహించలేరు. కేవలం బాహ్యాపరిస్థితులను బట్టి చూస్తే అంతే. అలా కాకుండా లోపల నిక్షిప్తమైన రహస్యజ్ఞానాన్ని కనుక కనిపెట్టినట్లయితే దైవేచ్ఛ ఎలా వున్నదో, ప్రపంచ పరిణామాలు ఎలా వుంటాయో నీ కర్థమౌతుంది. — *సంపాదకుడు*

ఈ విశ్వంలో రెండు మహాశక్తులున్నాయి. మౌనము, వాక్కు. మౌనము సంకల్పిస్తుంది. వాక్కు సృజిస్తుంది. మౌనం కార్యకారి, వాక్కు ప్రేరణకారి – ఆ కార్యానికి ప్రేరణ ఇస్తుంది. మౌనము ఆజ్ఞాపిస్తుంది. వాక్కు మెల్లి మెల్లిగా నచ్చచెబుతుంది. ఈ ప్రపంచంలో జరిగే బృహత్పరిణామాలన్ని నిశ్శబ్దమైన అగాధాలలో తయారుచేయబడినవే. పైకి కనపడే గందరగోళమంతా సముద్ర కెరటాల సవ్వడి. క్రిందనున్న అగాధాలలో సముద్రజలాలు నిశ్చలంగా వుంటాయి. మనుమలు పైన జరిగే గందరగోళము వింటారే గాని లోపల దాగివున్న దైవేచ్ఛను కనుక్కోలేరు. అందుకనే అంటారు చరిత్రలో ఎప్పుడూ అనుకోని సంఘటనలే జరుగుతాయని. మనుషులు వారి దృష్టిని బాహిరము నుండి లోపలికి తరలిస్తేగాని రహస్యంగా దాగివున్న వాస్తవాన్ని దర్శించలేరు...

అనువాదం: డా॥ ఆర్.ఎల్.ఎన్. శాస్త్రి

ఆంగ్లమూలం:

There are two great forces in the universe, silence and speech. Silence prepares, speech creates. Silence acts, speech gives the impulse to action. Silence compels, speech persuades. The immense and inscrutable processes of the world all perfect themselves within, in a deep and august silence, covered by a noisy and misleading surface of sound – the stir of innumerable waves above, the fathomless resistless mass of the ocean's

waters below. Men see the waves, they hear the rumour and the thousnand voices and by these they judge the course of the future and the heart of God's intention; but in nine cases out of ten they misjudge. Therefore it is said that in history it is always the unexpected that happens. But it would not be the unexpected if men could turn their eyes from superficies and look into substance, if they accustomed themselves to put aside appearances and penetrate beyond them to the secret and disguised reality, if they ceased listening to the noise of life and listened rather to its silence.

(*SABCL* Vol. 3, p.366)

శ్రీమాత ప్రవచనములు:

శ్రీమాత వాక్సుధ

మాటలు తగ్గించు. చేతలు పెంచు. (మితభాషణమే మానవునికి పెట్టని భూషణం, ఆచరణలో మరింత శ్రద్ధ చూపించుటే కర్తవ్యం).

*

ఎక్కువ మాట్లాడకు. సత్యమును ఆచరించు. చిత్తశుద్ధితో ప్రవర్తించు.

*

పలుకబడిన మాటలన్నీ అన్ని వేళలా వాటి నిజమైన భావాల నందించ లేవు. పలికిన ప్రతి పలుకు ప్రతి ఒక్కరి అవగాహనకు అందాలని కూడా లేదు.

*

మౌనవ్రతం కంటే మాటలలో సంయమనం మేలు. సాధ్యమైనంత స్పష్టంగా ఆచి, తూచి మాట్లాడుట నేర్చుకొనడం మంచిది.

*

ముందుగా తనను తాను అదుపులో ఉంచుకుంటూ, నాలుకను తన అధీనంలో ఉంచుకొనుట నేర్చుకోవాలి. మౌనంగా ఉంటే చాలు సమస్యలు పారిపోతాయి!

ప్రశాంతంగా ఉండటం, బలాన్ని శక్తిని కూడగట్టడం కేవలం కర్మల నాచరించుటకేగాక రూపాంతరీకరణకు (transformation) కూడ ఎంతైనా అవసరం.

*

దుర్గుణాలలోకెల్ల ఎదుటివారిని విమర్శించుట అత్యంత ప్రమాద కారి.

*

పలికే ప్రతి అబద్ధము వినాశన దిశగా వేసే అడుగు కాగలదు.

*

ఇతరుల విషయాలను గూర్చి ముచ్చటించడం తగదు. అట్టి ముచ్చట్లను వినడం కూడా తగని పనే. విన్న విషయాలు నిజమా కాదా అని విచారించుట ఇంకా ఘోరం.

*

అసత్య ప్రచారానికి వ్యతిరేకంగాను, ప్రతికూలంగానూ మాట్లా డటం కూడా తప్పే. మొత్తానికి అట్టి విషయాలను ముచ్చటిం చడం కాలాన్ని వృథా చేయడమే గాక వారి చైతన్యస్థాయిని దిగ జార్చిన వారౌతారు.

*

కోపము మనిషికి శత్రువై పతనానికి దారితీస్తుంది.

*

నెమ్మదిగా మాట్లాడటం వ్యక్తి బలాన్ని నిరూపిస్తుంది.

*

ప్రశ్న: శ్రీమాతా! ఎవ్వరైనా నాతో సంభాషించినపుడు నా మనసు పరిపరివిధాల పరుగు పెడుతుంది. నా మనసు నిలకడగా, నిశ్చ లంగా ఉండే విధానాన్ని ఉపదేశించు తల్లీ!



The Mother in Japan, 1917

అట్టి సంభాషణలలో లీనమైపోకు సుమా! ఎవరో మరెవరితోనో మాట్లాడుతున్నారనుకో. ఎడంగా వుండి అవసరమైన మాటలను మాత్రమే మాట్లాడు.

ప్రశ్న: శ్రీమాతా! అత్యవసరంగా మాత్రమే మాట్లాడవలసినదనే మీ సందేశం అందింది. కానీ ఎవ్వరైనా నన్ను అనవసరంగా ప్రశ్నిస్తే నేనేమి చెయ్యాలి?

వత్సా, అట్టి ప్రశ్నలను పెద్దగా లెక్కచేయొద్దు. ముక్తసరిగా ఒకటి, రెండు మాటలతో తెమిల్చివేసెయ్యి.

అనువాదం: సత్యవోలు సుబ్బలక్ష్మి

(*CWM* Vol. 14, p. 224; Vol. 9, p. 113; Vol. 14, pp. 217-223; Vol. 17, p. 220; Vol. 14, p. 220; Vol. 17, pp. 50-51)

వ్యర్థ ప్రలాపములు

ప్రశ్న: అందరు ఊరికే సోది చెపుతూంటారు ఎందుకని? అసలు నిరుపయోగంగా ఎందుకు మాట్లాడుతారు?

అవును, నిజమే! చాలావరకు మానవుడు తనకు సంక్రమించిన వాక్ఛక్తిని గూర్చి గర్వపడుతుంటాడు. భూమిపై మాట్లాడే శక్తి గలవాడు మానవు డొక్కడే. అతనే శబ్దాలను నియమబద్ధంగా ప్రయోగించ గలిగినవాడు. ఇది చిన్నపిల్లలకు మనమిచ్చే ఆట వస్తువు లాంటిది. మానవుడు తనకున్న ఆ శక్తితో ఆటలాడుకుంటాడు. సహజమే కదా!

కొంతమంది మనుషులుంటారు. వాళ్ళు మాట్లాడినపుడే ఆలోచిస్తారు. మౌనంలో ఆలోచించలేరు. దాంతోవారు మాట్లాడటమనే అలవాటు చేసుకుంటారు. పురోగమించేకొలదీ బుద్ధిబలం పెరగటంతో వ్యక్తి యొక్క భావప్రకటనావసరం తగ్గుముఖం పడుతుంది. క్రిందిస్థాయిలోని వారికే మాట్లాడే అవసరం ఎక్కువగా ఉంటుంది. నిజానికి మానసికంగా పురోగమించిన వారిలో

బుద్ధి వికసించి అవసరాన్ని మించి మాట్లాడరు. ఉపయోగం లేని మాటలు వారి నోటి వెంట రావు. సంఘంలో అట్టడుగున ఉన్న ప్రజానీకం మితిమీరి మాట్లాడుతూ సమయాన్నంతా వృథా చేస్తుంటారు. వారి మాటలకు అడ్డూ అదుపూ ఉండదు. వారికి ఏం జరిగినా ప్రతి విషయమూ మాటల్లో బయటపెడుతుంటారు. పరివర్తన కలిగి ఉన్నతస్థాయి నందుకున్నవారు మితంగా భాషిస్తుంటారు.

దీనికి రెండు కారణాలు కనిపిస్తాయి. ఒకటి, భూమిపై గల జీవరాశిలో ఉన్నతదశ చేరుకున్న మానవునికి గల మాట్లాడే శక్తి పట్ల సహజమైన గర్వము. రెండు, ఒక వ్యక్తి తన ఆలోచనలను గురించిన అవగాహన మాట్లాడటం వలన మాత్రమే కలగడం. అలాకాక వ్యక్తి తన ఆలోచనలను అక్షరరూపం ద్వారా బయటకు వ్యక్తపరచ లేకపోయినపుడు ఆలోచించ లేకపోతాడు. అంతేగాక అతడి ఆలోచనలు కార్యరూపం దాల్చలేవు కూడా!

రాజకీయ నాయకులు, ఉపాధ్యాయులు, ఉపన్యాసకుల వంటివారు మాట్లాడటమే వృత్తిగా గల వక్తలు బుద్ధిబలంతో వ్యవహరిస్తారు. కానీ సాధారణ మానవులు పెద్దగా మేధోవికాసం లేనివారు అతిగా మాట్లాడతారు.

ప్రశ్న: మరి మాటలనదుపు చేయడమెలా తల్లీ?

మాట్లాడే ముందు ఆలోచించడం అలవాటు చేసుకోవాలి. దాని వలన మాట్లాడే అవసరం తగ్గి ఎంతవరకూ అవసరమో అంతే మాట్లాడటం అలవడుతుంది. ఒకచోట కలసి పనిచేసేవారు తోటి పనివారితో చిన్న చిన్న మాటలు 'ఇది చేయ్' 'అది అలా' 'సరే' 'అది అలాగే' లాంటి మాటలను అవసరాన్ని బట్టి వాడుకుంటారు. ఆ విధంగా మాట్లాడే ముందు ఆలోచించడం వలన మాట్లాడవలసిన మాటలు తగ్గిపోతాయి.

ప్రశ్న: కొంతమంది ఆలోచించేది ఒకటి, చెప్పేది మరొకటి ఎందుకని?

అవును. తరచు ఇలా జరుగుతూంటుంది. కొందరు ఆలోచించేది ఒకటి బయటకు చెప్పేది మరొకటి. ఆలోచన వాక్కుని

అదుపు చేయగలిగినపుడు వృథా ప్రేలాపన తగ్గుతుంది. అలా కానపుడు పలికేవన్నీ అసందర్భ ప్రలాపాలే అవుతాయి. సంభాషించడం వలన కలుగు ఆనందం కొరకు మాట్లాడటం ప్రారంభించే ఒక యంత్రం అనమాట. కొందరు అనేక విషయాలు చెప్తూ మధ్యలో "నేనిదంతా ఎందుకు చెప్తున్నా?" అంటూ ప్రశ్నిస్తారు. వాళ్లకే తెలియదు. కొందరు ఇతరుల మెప్పుమెహర్బానీల కోసం చెప్తుంటారు. ఒక్కొక్కప్పుడు శ్రోతలు వాడు ఇలా చెపుతాడేమో అని అనుకుంటారు. ఎదటివాడు ఓ మరమనిషిలా సరిగ్గా అదే చెపుతాడు!

ప్రశ్న: గట్టి తీర్మానం లేకపోవటం వలన ఇలా జరుగుతుందా?

అది ఒక మానసిక రుగ్మత. ఇష్టాయిష్టాలేమీ లేకుండానే మాట్లాడుతుంటారు. ఒక ఉడుత పంజరంలో గిరగిరా తిరుగుతూంటుంది. అలా ఎందుకు తిరుగుతుందో దానికే తెలియదు. అదే విధంగా కొందరి మనసుల్లో కలిగిన అలజడి, వచ్చీ పోయే మానసిక ఉత్సాహం వలన అలా జరగవచ్చు.

అనువాదం: సత్యవోలు సుబ్బలక్ష్మి

(*CWM* Vol. 6, pp. 222-23; Vol. 4, pp. 200-201)

In the communion of two meeting minds
Thought looked at thought and had no need of speech;

(*Savitri*, p.186)

నిజమైన ఆకాంక్ష మాటల కతీతం

నీ మనస్సు పరిపరి విధాల పరుగెడుతుంది. పైనుంచి దిగివచ్చే దివ్యవాణి దానికి వినపడదు. నీ హృదయకేంద్రము అటుల కాదు. అది తపస్సు చేయగలదు. మాటలతో పనిలేని తీవ్రమైన ఆకాంక్షను పైకి పంపించగలదు. అదే ఆకాంక్షతో చెదిరిపోకుండా ఉన్న యెడల, పైనుంచి దిగివచ్చే దివ్యావేశమును పొందగలదు.

– సంపాదకుడు

ప్రశ్న: 'The Word' అంటే అర్థమేమిటి?

అది మనం మామూలుగా మాట్లాడే వాక్కు కాదు.

అది పైనుండి రావాలి. దాని మూలం అన్నింటికన్న పైనున్న అంతరాల్లో వుంటుంది. త్రిశంకు స్వర్గం లాంటి మధ్యంతరంలో కాదు. అప్పుడే అది 'దైవవాక్కు' అవుతుంది. మరో విషయం, నేనేమి చెప్పానో దాన్ని చెయ్యాలి – ఇది అంత సులభమైన విషయం కాదు.

నేను చెప్పిందేమిటంటే, ప్రతి వారు సరైన వైఖరిని అవలంబించాలని, మానసిక మౌనం పాటించాలని. ఆ వైఖరి ఎలాంటిదై వుండాలంటే, మాటలకతీతమై, ఆలోచనలకతీతమై కేవలం చైతన్యము ద్వారా అభివ్యక్తమయ్యేదిగా వుండాలి. అది ఒక ఆకాంక్షతో కూడిన వైఖరి, అర్థం అయ్యిందా? దీనిని మాటలలో పొందుపరచటం నా విధి. కారణం, అది కాగితంపై ముద్రించబడాలి (అందువల్లనే మూడొంతుల శక్తిని కోల్పోతుందనుకో). అది తప్పనిసరి. లేనట్లయితే ఎవరికీ తెలియదు! నీకొక తెల్లకాగితాన్ని ఇచ్చినట్లయితే, దాంట్లో నేనేమి పొందుపరచానో నీకు తెలియదు కదా! అందుకే దానిని మాటలలో చెప్పవలసి వస్తుంది.

దీనికంతా ఒక నిజమైన, యథార్థమైన, పరిపూర్ణమైన ఆకాంక్ష అవసరం. కానీ ఈ ఆకాంక్ష మాటలలో బందీ కాకూడదు. కేవలం ఒక ఉత్కంఠగా (attitude) ఉండాలి – ఒక తీక్షణమైన, స్థిరమైన తపన. ఒక్క మాటకు కూడ దానిని కలత పెట్టే అవకాశానివ్వకూడదు. ఏదీ అంటని ఆకాంక్ష స్పందనల నిశ్శబ్ద

నిలయంగా వుండాలి. అప్పుడే ఆ మౌనంలోకి పైనుండి దిగి వచ్చిన సందేశం (మనసులో మాటల్లోను, నోటిలో శబ్దాల్లోను ముస్తాబైనది) 'the word' అవుతుంది. ఇంతకు తక్కువైనది యేదీ కాదు.

అనువాదం: అందుగులపాటి కైలాసపతి, జానకి

(*CWM* Vol. 6, pp. 98-99)

మౌన సంభాషణ

ఇద్దరు మనుషుల ఆలోచనాసరళి ఒకే విధంగా వుంటుందా? ఉదా: నువ్వు ఇంటికి ఒక పూలమాల తీసుకొనివెడతావు. నీ భార్య అది చూసి "అరె! నేను కూడ ఇదే రంగు, ఇలాంటి పూలమాలే కొన్నానండీ" అని అటుంది. ఇందులో ఆశ్చర్యపడవలసినదే ముంది? ఇద్దరి మనసులలో అంత సాజాత్యముంటుందా? వాళ్ల మనసులు ఒక్కటే అయిపోతాయి. — సంపాదకుడు

ఒంటరిగా కాక యితరులతో సహజీవనం సాగిస్తూ, పైకి మాట్లాడే అలవాటును నియంత్రించుకో గలిగేతే, నీకు, యితరులకు మధ్యన అంతర్గత అవగాహన యేర్పడుతున్న ట్లుగా గమనిస్తావు; అప్పుడు మీలో మీరు అతితక్కువ పదజాలంతోనో, పదరహితంగానో సంభాషించుకో గలుగుతారు. — శ్రీమాత

ప్రశ్న: ఇద్దరు మనుషుల మధ్య ఒక అంతర్గత అవగాహన, ప్రతి సందర్భంలోను, లౌకిక విషయాలలో కూడ యేర్పరచుకొనుట సాధ్యమా?

సాధ్యమే. మాటలు, రెండు మనసుల మధ్య సందేశాలను చేరవేసే సాధనాలుగా మాత్రమే వుపయోగపడతాయి. అదే వాటి యేకైక లక్ష్యం. కాని మాటల నుపయోగించకుండానే సందేశాలను యిచ్చిపుచ్చుకో గలిగినంత నిర్మలత, సత్తా మనసులకున్నట్ల

యితే, యీ ప్రక్రియ మరింత మెరుగ్గా, స్పష్టంగా, క్లుప్తంగా, యథా తథంగా కొనసాగుతుంది. అప్పుడు మాటలతో అసలు పనే వుండదు.

ప్రశ్న: పూర్తిగా లౌకిక విషయాలలో కూడానా?

అవును. ఎవరైనా ఒక చిన్న ప్రయోగం చేసి చూడవచ్చు. ఇద్దరి మనసుల శ్రుతి కలసినప్పుడు, వారిలో ఒకరు, 'ఎందుకు, ఈ వస్తువు యిక్కడ వుండవలసిందే, అక్కడెందుకుంది', అని అనుకోగానే, రెండో అతను అతి సహజంగా ఆ వస్తువును వెతికి పట్టుకొని దాని స్థానంలో దాన్ని వుంచుతాడు. అతనికి సుస్పష్టంగా అర్థమవుతుంది. ప్రత్యేకంగా చెప్పనక్కర లేదు. లేదా వేరొకరు 'బయటకు వెళ్లటానికి సమయమైంది' అనో లేక, 'నాకు ఫలానా వస్తువు అవసరం' అనో అనుకోగానే రెండో అతను పొరపాటు లేకుండా అర్థం చేసుకుంటాడు. అతనికి చెప్పే అవసరం వుండదు. అంతవరకెందుకు, అతి తరచుగా జరిగే విషయం – ఇక్కడ నేను మాట్లేడిది, వారిని వారు నియంత్రించుకొని, చైతన్యస్ఫూర్తితో సహ జీవనం సాగిస్తున్న వారి గురించి – ఒకరు నోటితో ప్రశ్న వేయక ముందరే మరొకరు దానికి సమాధాన మిస్తారు. ఆ ప్రశ్న అతని మనసులోనే వుంటుంది కానీ యితను సమాధాన మిస్తాడు: 'ఎందుకండీ, అవును, అది అలాగే వుంటుంది' అనో లేక 'లేదు, అది కాలేదు' అతను అసలు అడగనే లేదు, కానీ యితను విన్నాడు, అర్థం చేసుకున్నాడు, సందేశాన్ని అందు కున్నాడు. ఇలా తరుచూ జరుగుతూంటుంది కదూ!

మరొక విషయం. మాటలలో చెప్పవలసిన అవసరమున్న విషయాలలో సైతం, పది మాటలకు బదులు ఒక్క మాట చెప్పితే చాలు, మిగతా విషయం అర్థం అవడానికి. ఇలా సూటిగా సందేశం యిచ్చి పుచ్చుకొనుట ఒక అనుభవం. దీనిని సులభం గానే పొందవచ్చు. నీవొక క్రొత్త మనిషితో మాట్లాడాలి. కానీ మీ యిద్దరి మధ్య తగినంత మానసిక సంపర్కం లేదు. సంభాష ణలో అతను కొన్ని మాటలు వాడతాడు. అవే మాటలు ఒక ప్రత్యేక అర్థంతో వాడటం నీ కలవాటు. అందువల్ల అతను నీ

కర్థం కాడు. ఇదంతా మీరిద్దరూ మాట్లాడే భాష ఒకటి కాన ట్లుగా వుంటుంది. కొంత కాలం తర్వాత మీరిద్దరూ తరచూ కలుసుకుంటూ మానసికంగా ఒకరికొకరు చేరువైనప్పుడు, ఒకరి నొకరు అర్థం చేసుకోవడం మొదలవుతుంది.

వాస్తవానికి మాటలు, మాటల కందని దానిని చేరవేయు టకు ఒక వాహికగా మాత్రమే వుపకరిస్తాయి. తగినంత మానసిక యెదుగుదల సాధించిన వారికి పదరహితంగానే దానిని తెలుప వచ్చు. ఊహాలోకంలో మునిగియున్న వారికి, మాటలు అర్థాన్ని క్రుంగదీస్తాయి. దానిని తగ్గిస్తాయి. సంకుచితపరుస్తాయి, పరిమితం చేస్తాయి. శక్తిని హరింపజేస్తాయి. సూటిగా వ్యక్తపరచబడిన భావన, మాటలలో వ్యక్తపరచిన దానికన్న బలమైనదిగా వుంటుంది. మాటలు తగ్గిస్తాయి, పరిమితం చేస్తాయి, కఠినపరుస్తాయి. మృదు త్వాన్ని, సహజశక్తిని కోల్పోయేటట్లు చేస్తాయి. అంతెందుకు అసలు నిర్జీవపరుస్తాయి. ఇందుకు కారణం అతి సామాన్యమైనది. మను ష్లోని ఉపకరణాలు అవసరానికి అనుగుణంగా శ్రుతి చేయబడ నందువల్ల పదరహిత తంత్రీ వార్తాప్రసారం వీలుపడదు. వ్యక్తిలో ఉపకరణాలు సరైన రీతిలో శ్రుతి గావింపడినవైతే, రోజుకి పది మాటలైనా పలుకనవసరం లేకుండానే అవగతమౌతాడు.

అనువాదం: అందుగులపాటి కైలాసపతి, జానకి

(*CWM* Vol. 6, pp. 93-95)

An ear of mind withdrawn from the outward's rhymes
Discovered the seed-sounds of the eternal Word,
The rhythm and music heard that built the worlds,

(*Savitri*, p. 273)

అవగాహన కలగనప్పుడు

ఈ లోకంతీరు నీకు నచ్చదు. ఇంకొకళ్లు చెప్పిన మాటలు నీకు నచ్చవు. లోపల తిట్టుకుంటూ వుంటావు. ఎందుకని? నీ మనస్సును నిశ్శబ్ద పరచటం నువ్వు నేర్చుకోలేదు. అలా కాకుండా బైట జరిగే విషయాలకు ఏమాత్రం స్పందించకుండా నిదానంగా వుంటే నువ్వు ప్రతి దానికి గంతులు వేయటం మానేస్తావు. నీ ప్రాణం కుదుటపడుతుంది. — *సంపాదకుడు*

వ్యక్తిగతాభివృద్ధిని సాధించుటకే కాక, ఈ మార్గంలో ప్రాథమిక స్థాయిలో నున్నవారికి కూడ ఒక విషయంపై అవగాహన కలగక పూర్వం మౌనంగా యెలా వుండాలో తెలుసుకొనుట, పురోభివృద్ధి సాధనలో ముఖ్యంగా తోడ్పడే విషయాల్లో ఒకటి — బహిరంగంగా ఒక్క మాటైనా మాట్లాడకుండా మౌనంగా యెలా వుండాలి అనే కాదు, అంతరంగంలో కూడ మౌనంగా యెలా వుండాలో తెలుసుకోవాలి. అప్పుడే మనసు స్వాభావిక గర్వాహంకారాలతో కూడిన అజ్ఞానంతో పెత్తనం చెలాయించదు, అర్థం చేసుకోలేని పరికరంతో అర్థం చేసుకొనుటకు యత్నించదు. తన బలహీనతను తాను తెలుసుకొని చడీచప్పుడు లేకుండా తెరచుకొని, ఆ వెలుగును అందుకునే సమయానికై వేచి వుండగలదు. ఎందుకనగా ఆ వెలుగే, ఆ నిజమైన వెలుగు మాత్రమే దానికి అవగాహనను కలిగించగలదు. ఇదంతా అది నేర్చుకున్నదే కాదు, గమనించిందే కాదు. జీవితానుభవంతో గడించింది కాదు. అది పూర్తిగా దాని పరిధులకావలనున్న వేరొకటి. దివ్యానుగ్రహం ప్రతిరూపమగు ఆ వేరొకటి తనలో అభివ్యక్తమగునంత వరకు మనుసును నిబ్బరంగా, సౌమ్యంగా వుంచగలిగి అర్థం చేసుకొనుటకో, విమర్శించుటకో ప్రయత్నించకుండా వుంచగలిగితే పనులు మరింత వేగాన్ని పుంజుకుంటాయి.

మాటలు, మెదడులో చెలరేగే ఆలోచనలు, చెవులు చిల్లులు పడేటంత తీవ్రంగా వుంటాయి.

ప్రశాంతంగా, మౌనంగా వుండటం నేర్చుకోవాలి. ఏదైనా సమస్య తలెత్తినప్పుడు దానిని పరిష్కరించే వివిధ మార్గాల గురించి. వాటి పరిణామాల గురించి, చేయవలసిన పను లేమిటి, చేయకూడని వేమిటి అను వాటి గురించి తర్జన భర్జనలు సలుపుతూ సతమతమవకుండా, మంచి జరగాలనే ఆకాంక్షతో, మంచే జరుగుతుందనే నమ్మకంతో ప్రశాంతంగా వుండ గలిగితే, పరిష్కారం వెనువెంటనే లభిస్తుంది. మౌనంగా వున్నందువలన దానిని వినగలుగుతావు.

కష్టాల్లో యిరుక్కున్నప్పుడు యీ విధానాన్ని ప్రయత్నించి చూడు. కలత చెంది, రకరకాలుగా ఆలోచిస్తూ, పరిష్కారాలను వెతుకుతూ, విచారపడుతూ, చిరుబురులాడుతూ, మనసులో అదే పనిగా పరుగెత్తుటకు బదులు – బయట పరుగులు తీస్తావని కాదు నేననేది, ఎందుకంటే బహిరంగంగా అలా చేయకూడదనే ఇంగిత జ్ఞానం బహుశ నీ కుండవచ్చు గనుక! కానీ అంతర్గతంగా, అంటే నీ మెదడులో – ప్రశాంతంగా వుండు. నీ మనస్తత్వానికి అనుగుణంగా ఆత్రంగానో లేక శాంతంగానో, తీక్షణంగానో లేక విస్తృతంగానో, లేక వీటన్నింటిని సమ్మిళితపరిచో, వెలుగుకై ప్రార్థించు. దాని ఆగమనానికై నిరీక్షించు.

ఈ విధంగా నీ మార్గమెంతో సుగమమవుతుంది.

అనువాదం: అందుగులపాటి కైలాసపతి, జానకి

ఆంగ్ల మూలం:

To learn to be quiet and silent... When you have a problem to solve, instead of turning over in your head all the possibilities, all the consequences, all the possible things one should or should not do, if you remain quiet with an aspiration for goodwill, if possible a need for goodwil, the solution comes very quickly. And as you are silent you are able to hear it.

When you are caught in a difficulty, try this method: instead of becoming agitated, turning over all the ideas and

actively seeking solutions, of worrying, fretting, running here and there inside your head – I don' mean externally, for externally you probably have enough common sense not to do that! but inside, in your head – *remain quiet.* And according to your nature, with ardour or peace, with intensity or widening or with all these together, implore the Light and wait for it to come.

In this way the path would be considerably shortened.

(*CWM* Vol. 9, pp. 423-24)

నేనిచ్చే సలహా: మనస్సును ఆలోచనలు లేకుండా నిశ్చలము చేయుటకు, వీలుంటే ఏమాత్రం కదలిక లేకుండా రాయి చేసుకుండేందుకు ప్రతి రోజు ఒక నిర్ణీత సమయము కేటాయించుకోవాలి.

అదే పనిగా ఆలోచిస్తూ వుండటం కంటె అసలు ఆలోచనలు లేకుండా చేసుకోవటం చాల గొప్ప విషయం.

ఒక్క ఆధ్యాత్మిక జీవితానికి మాత్రమే కాకుండా నిత్యజీవితంలో కూడ ప్రతిరోజు కాస్సేపు నిశ్శబ్దంగా వుండటం మంచిది. అంటే వూరికే మాట్లాడకుండా వుండటమే కాదు, మనసులో ఏ మాత్రము కదలిక వుండకూడదు.

ఇప్పుడు మనం కాసేపు నిశ్శబ్దంగా వుందాము రండి.

శ్రీమాత

(*CWM* Vol. 3, pp. 195-96)

భాష వెనుక భావం

మనకి భాషాలోకమే తెలుసు. భాష కతీతంగా వుండే భావలోకం తెలియదు. ఏమాత్రం స్పందనలు లేని నిర్మల మనస్సుతో నువ్వు పై స్తరములను దర్శించినట్లయితే ఆ భావలోకమంటే ఏమిటో తెలుస్తుంది. రచయితలకు, కళాకారులకు దాని స్పర్శ కలుగుతూనే వుంటుంది.
— సంపాదకుడు

ఆధ్యాత్మిక విషయాలు గూర్చి మాట్లాడేటపుడు మనం ఉపయోగించే మాటలకు బందీలు కాకుండా జాగ్రత్త పడాలి. చైత్య, ఆధ్యాత్మిక విషయాలు గూర్చి నేను మాట్లాడినపుడు, అవి మాటల ఉపరితలం వెనక ఉన్న నైజాలు, యథార్థమైనవి మరియు వాటి భిన్నత్వములో కూడ అన్యోన్య సంబంధం కలిగి వుంటాయి. సత్యాన్ని పట్టుకోడానికి మనస్సు చేసే నిర్వచనాలు, వ్యత్యాసాలు చాలా బాహ్యంగాను, కఠినంగాను వుంటాయి. ఒక రితో నొకరు తరచుగా మాట్లాడే అలవాటు కలవారైతే తప్ప, మీరు ఒకరి నొకరు అర్థం చేసుకోవాలంటే, మీ మీ మాటల కర్థాన్ని వివరించవలసిన అవసరం ఎంతేని వుంటుంది. మనసులు కలసి పరస్పరం స్వేచ్ఛగా ఒకరి భావం మరొకరు అవగాహన చేసికొను స్థితిలో మాటలు భావప్రకటనకు కేవలం ఆధారభూతంగా మాత్రమే వుంటాయి. అపుడు నీవు పలికే ప్రతి మాటకు వివరణ పదే పదే ఇవ్వవలసిన అవసరం వుండదు. ఇలాంటిదే ఆదర్శ సంభాషణ. ఒకే వ్యక్తితో తరచుగా మాట్లాడంలో యిలాంటి ప్రయోజనం వుంటుంది. వారి మనస్సుల మధ్య అన్యోన్య సామరస్యత స్థిరపడి వుంటుంది కనుక వెంట వెంటనే అసలు విషయమేమిటో అవగాహన అయిపోతుంది.

రూపరహితమైన ప్రపంచం ఒకటుంది. మాటల వెనుకనున్న భావాన్ని నీవు పట్టుకోవాల్నంటే నీవు ప్రవేశించవలసింది ఆ ప్రపంచంలోనే. మాటల రూపంలో వుంటే నీ అవగాహనను నీవు గ్రహించవలసి వస్తే యథార్థజ్ఞానం పట్ల నీవు తిక

మకపడవలసి రావచ్చు. కాని నీవు నీ నిశ్చల నీరవ మనస్సుతో రూపం ధరించడానికి అవరోహించే భావాల ప్రపంచంలోనికి ఆరోహిస్తే వెంటనే యథార్థ అవగాహన లభిస్తుంది. మీరు ఒకరి నొకరు తప్పక అవగాహన చేసికొన తలిస్తే నిశ్చల నీరవస్థితి లోనే అవగాహన చేసికొన గలగాలి. ఒక ఉన్నతస్థితి వుంది. అచట మాటల అవసరం లేకనే ఒకరి భావనను మరొకరు గ్రహించేటంతగా వారి మనస్సులు అన్యోన్య సామరస్యపూరక ములై వుంటాయి. ఇలాంటి అన్యోన్య మానసిక సామరస్యత కొరవడినపుడు, నీ మాటల అర్థం వున్నదున్నట్లు అవతలి వ్యక్తి గ్రహించలేడు. ఎందుకంటే నీవు మాట్లాడిన భావానికి ఆవలి వాని మనస్సు తనకు తోచిన అర్థాన్ని ఇస్తుంది.

చూడు, నేనొక అర్థంలో ఒక పదాన్ని ఉపయోగిస్తాననుకో. నీవు దానికి మరో అర్థాన్ని ఆపాదించుటకు అలవాటుపడి వున్నా వనుకో. అపుడు నీవు నా దృష్టిలోని సరైన అర్థాన్నిగాక ఆ పదాన్ని నీ దృష్టిలోని అర్థంతో అవగాహన చేసికొంటావు. ఇది కేవలం ఆ సంభాషణకేగాక, గ్రంథపఠనానికి కూడ అన్వయిస్తుంది. ఒక పుస్తకంలోని నిగూఢ భావాన్ని అర్థం చేసుకోదలిస్తే, నీవు నీ మనస్సుయొక్క నిశ్చల నీరవస్థితిలో చదవాలి. అంతేకాదు. నీవు నీలోని భావరహిత స్థానంలోనికి ఆ భావం చొచ్చుకుపోవు టకై వేచి వుండాలి. అపుడు అక్కడ నుండి సరైన భావార్థం నీ చేతనయొక్క ఉపరితలం లోనికి నెమ్మదిగా తిరిగి వస్తుంది. కాని నీ బాహ్య మనోవలయం వద్దనే మాటలు తిరుగుచుండుటకు నీవు అనుమతించి, నీ మనస్సును ఆ మాటలతోనే నింపేస్తే, నీవు ఆ మాటల అర్థాన్ని, శక్తిని పూర్తిగా నష్టపోతావు. భావ ప్రక టనా కేంద్రం వెనుక భాగాన నున్న అప్రకటిత మనస్సుతో ఐక్యం కలిగి వుంటే తప్ప నీ భావగ్రహణం సమగ్ర భావగ్రహణం కాజాలదు.

ఒకప్పుడు మనం ఒకదానితో మరొకటి సంబంధం లేకుండా వేర్వేరు లోకాలల్లే వున్న వ్యక్తిగత మనస్సుల గూర్చి మాట్లాడు కున్నాం కదా! అవి ఒకదానితో ఒకటి ఎలాంటి సంబంధం

లేకుండా తమకు తాముగా ద్వారం బిగించుకొని వుంటాయి. కాని యిలాంటి పరిస్థితి హీనమనస్సుల పరిధి లోనిది. ఆ న్యూన మనోమండంలో నీ భావాలే నిన్ను బందీ చేస్తాయి. నీవు వాటి నుండి బయటపడలేవు. అచట నీ ఉపరితల మనస్సును గూర్చి నీ భావ ప్రతిబింబాలను గూర్చి మాత్రమే గ్రహించగలవు. కాని అప్రకటితంగా ఉన్నత మనోభూమికలోను, దాని ఉన్నత శ్రేణు ల్లోను, నీవు స్వేచ్ఛగ నుండగలవు. నీవు ఆ ఉన్నత భూమికలో ప్రవేశించినపుడు, నీవు నీ నుండి బైటపడి విశ్వ మనోభూమిక లోకి చొచ్చుకొని పోగలవు. అచట ప్రతి వ్యక్తిమనస్సు మహా సాగరంలో వలె మునకలు వేస్తూంటుంది. అక్కడ ఒక మనస్సు నుండి మరో మనస్సును యేదీ వేరు చేయదు. కనుక నీవు మరొకరి మనస్సును నీ మనస్సే అన్నంత స్పష్టంగా చూడగలవు, గ్రహించ గలవు కూడ. ఇతరులతో ఆ ఉన్నత భూమికలో ఐక్యత చెందినవుడు మాత్రమే నీవు వారిని అర్థం చేసుకొన గలవు. లేనిచో నీవు వారితో కలసిపోలేవు. వారిని స్పృశించలేవు. వారి మనస్సులో యేమి జరుగుచున్నది నీవు కచ్చితంగా తెలిసికొనే అవకాశం వుండదు. నీవు మరొక వ్యక్తి సమక్షాన వున్నపుడు కూడ అతడేమి ఆలోచిస్తున్నదీ, యేమి అనుభూతి చెందుతున్నది తెలుసుకోలేవు. కాని నీవు భావప్రకటనా భూమికకు పైన నిశ్శబ్ద భావ ప్రచారభూమిక లోకి వెళ్ళ గలిగినపుడు అతని భావాలను నీ భావాలుగా తెలుసుకొన గలుగుదువు. అపుడు భావప్రకట నకు నీవు ఉపయోగించే మాటలకు అంత ప్రాముఖ్యత వుండదు. ఎందుకంటే అచట మాటలకు అతీతంగా భావగ్రహణానికి పూర్తి అవకాశం ఉంటుంది. నీ కోసం కొద్దిపాటి మాటలు సరిపోవచ్చు. అక్కడ దీర్ఘ వివరణలు అవసరం లేదు. భావం పూర్తిగా బైటికి తేవలసిన అవసరం కూడ వుండదు. ఎందుకంటే ఆ భావార్థాన్ని నిశ్శబ్దంలో నువ్వు నేరుగా చూడ గలిగే అవకాశం నీకుంది.

*

ఎదుటి వారి భావాన్ని మాటల ద్వారా అపార్థం చేసికొనే విషయం సర్వసాధరణమైనదే. మనం స్పష్టంగానే చెబుతాము. కాని దాన్ని యెదుటివారు అర్థం చేసికొనే విధానం తల తిరగ జేస్తుంది. ప్రతి వారు దాని ఉద్దేశాన్ని వున్నదున్నట్లుగా గాక మరో విధంగా చూస్తారు. లేదా దాని భావాన్ని విరుద్ధంగానైనా వుంచుతారు. నీవు యిలాంటి దోషాలను తొలగించుకొని యథార్థ భావాన్ని గ్రహించాలంటే మాటలకు, శబ్దాలకు ఆవలి నిశ్శబ్దాన్ని వినాలి. నిశ్శబ్దంలో వింటే సరిగ్గా వింటావు. సరిగ్గా అర్థం చేసు కొంటావు. కాని నీ తలలో యేదో భావం కదలాడుతూ గోల చేస్తుంటే నీవు దానిని అర్థం చేసికొందువే కాని నీకు చెప్పిన విషయాన్ని కాదు.

అనువాదం: బి. నరసింహయ్య

(*CWM* Vol. 3, pp. 64-66; 52)

వాక్కు సృజనశీలి

వాక్కునకు సృజనశక్తి గలదు. భౌతికరంగములో కార్యము నిర్వహించగల శక్తిగూడ కలదు. ఋషిప్రోక్తములైన గాయిత్రి మంత్రాదులు, వాటి మహిమలు మనకు తెలియనివి కావు మంత్రానికి నిజంగా శక్తి ఉన్నదా? ఇది సత్యమేనా? ఒక వేళ సత్యమైతే దానికి హేతువు లేమిటి అనేదే ప్రశ్న. మనం విశేషస్ఫూర్తితో ఒక శబ్దమును ఉచ్చరించినపుడు శబ్ద తరంగములే కాక భావనా తరంగములుకూడ ఉద్భవించి ప్రచలితమౌతాయి. అంతే కాదు, అవి ఆ భావమును మోసుకొనిపోయి దానికి రూపకల్పన చేయ గలవు. శబ్దము భావమునకు బాహ్యశరీరము. — సంపాదకుడు

మనుమలు ఊసుబోక, వాగ్వ్యవహారంతో విలువైన సమయాన్ని ఎంత వృథాచేస్తారో చెప్పలేము. ఇది అందరికి తెలిసిన విషయమే. కాని దీనినరికట్టే విధానము ఎవ్వరికి తెలియదు.

మనమొక సంగతి గుర్తించాలి. శబ్దములు, శక్తినిధులు, మనో భావములకు వాహికములు. అందుకని కేవలం భావనాశక్తిచే మనకు కావలసిన ప్రయోజనములను సాధించగలము.

ఒక శబ్దమును ఉచ్చరించినపుడు దాని అర్థమును గురించి మనస్సులో తపోదీక్షతో ధ్యానించాలి. అందులో శక్తిని నిక్షేపించాలి. అప్పుడది ఒక బాణము వలె వెళ్లి లక్ష్యమును ఛేదించ గలదు!

శబ్దములలోని చైతన్యానికి మూడు ప్రధానమైన మూలములు కలవు. మొదటి రెండు శబ్దములందే స్వతస్సిద్ధములై ఉన్నవి. అందలి లోతైన భావముపై మనస్సును కేంద్రీకరించుట మూడవ కారణము.

ఈ మూడు శక్తులు ఒక శబ్దములో ఒకేసారి ప్రయుక్తమైనప్పుడు అది మంత్రశక్తిని సంతరించుకోగలదు.

1. మనస్సులో ఆలోచనా తరంగములు ఎటుల జనించునో అదే విధంగా కొన్ని శబ్దములు భౌతికపదార్థమును తరంగితము చేసి పరిణమించ చేయగలవు.

   ఆలోచనా తరంగములకు శాబ్దిక తరంగములకు గల సామ్యమును గమనించిన యడల, భాషలోని కొన్ని మూలధాతువులు మనకు తెలియగలవు. ఆ ధాతువులు కొన్ని మూలభావములను ప్రకటింపజేయును. అన్ని భాషలలోను అదే విధమైన అర్థమును కలిగి యుండును. (ఇది భాషల యొక్క లిఖిత రూపమునకు వర్తించదు. వాటి ఆధారములు వేరు)

2 అనాదిగా కొన్ని సందర్భములలో ప్రయుక్తమైన శబ్దములు కలవు. అవి మంత్రశక్త్యుపేతములు, ఆ శబ్దములు నిజంగా శక్తిభాండారములే (batteries of energy)

3. మరి కొన్ని శబ్దములు సజీవమైనవి. వాటిని దీక్షతో ఉచ్చరించిన వెంటనే ఫలితము కలుగును.

'ఓం' అనే సంస్కృత శబ్దము దానికి చక్కని తార్కాణము. పైన నిర్వచించిన త్రివిధములైన శక్తులకు నిలయము.

భారతదేశములో ఏ దేవతను పూజించినా, కొలిచినా, ధ్యానించినా ఓంకారముతోనే నిర్దేశించెదరు.

కల్లోలమైన వాతావరణమును శాంతపరచేందుకు, మనస్సును స్థిమితపరచేందుకు అనంతకాలమును నిర్దేశించేందుకు 'ఓం' కారము ఒక మహామంత్రము.

కొన్ని శతాబ్దాలుగా మానవులు ప్రయోగించుట వలన 'ఓం' కార శబ్దము అనంతమైన మానసిక శక్తులను సంతరించుకొని యున్నది. ముఖ్యంగా హిందువులకు ప్రత్యక్షంగా దైవమును సాక్షాత్కరింపజేసి ఆయన శక్తిని ఆహ్వానింపజేయుట కిది సాటిలేని మంత్రరాజము.

ప్రాచ్యదేశీయులు స్వాభావికముగా భగవదభినివేశము కలవారు, 'ఓం' కారము యొక్క మహిమను పూర్తిగా గుర్తించిన వారగుటచే దానిని వర్ణించి తత్ఫలితమును పొందగలరు.

అనువాదం: డా॥ ఆర్.ఎల్.ఎన్. శాస్త్రి
(2001 డిసెంబరు 'అఖిల' నుండి)

(*CWM* Vol. 2, pp. 63-65)

నీ మనస్సుకు ఏదో తోస్తుంది. దానిని పైకి వెల్లడిస్తావు. ఇది మామూలు మానవుల పరిస్థితి. కాని మానవమనస్సు కావల ఇంతకంటె బృహత్తరమైన లోకమొకటున్నది. అది చాల గొప్పది. అతివిశాలమైనది. నువ్వు ఆ లోకం లోకి ప్రవేశించగలిగితే ఇక నీ వ్యక్తిగత పరిధిలో బందీవై వుండనవసరములేదు. దానిని దాటి అనంతలోకంలో విహరించగలవు. ఆ భావజాలాన్ని పట్టుకొని మానవభాషలో అభివ్యక్తపరచనూ గలవు.

శ్రీమాత

(CWM Vol. 3, p.65)

మాటలు, వాటి మూలతత్త్వము

నీ మనస్సులో ఒక భావం మెరుస్తుంది. ఒక చేతన స్పంది స్తుంది. ఆ స్పందన రేడియో తరంగముల వలె నీలో నుండి ఉత్ప న్నమై పరిసరాలకు వ్యాపిస్తుంది. మరొకరికి తగులుతుంది. అప్పుడు ఆ విషయము వారికి తెలుస్తుంది. అదే విధంగా ఇత రుల స్పందనలను నువ్వు గ్రహించవచ్చు. — *సంపాదకుడు*

మౌలికతత్త్వాన్ని రసస్ఫోరకంగా దైవీకటాక్ష లబ్ధంగా ఆవిష్కరిం చగలిగినపుడే మాటలకి విలువ, లేకపోతే అవి వట్టి తృణములే!

మొలకెత్తిన ఒక ఆలోచనవల్ల నీ మనోసీమలో ప్రతిస్పంద నలు చెలరేగుతవి. స్పందనలు శ్రుతిబద్ధంగా శబ్దానికి అన్వయింప బడి మాటలుగా ఆవిష్కరింపబడుతవి. చైతన్యము, జ్ఞానము, గ్రహణశక్తి, స్ఫూర్తి – వీటికి అనుగుణంగా ఆలోచన రూపుదిద్దు కుంటుంది. భాష, భావంతో పాటుగా భావాతీత అంతస్సారాన్ని కూడా స్ఫురింపచేయాలి. అప్పుడే శ్రోత నీ మాటలకి తగిన రీతిలో ప్రతిస్పందిస్తాడు. భావప్రకటన కిది ఆదర్శసూత్రము.

శ్రోత మనసును ఆకట్టుకోగలగటమే భాష ప్రయోజనం. వక్తభావనా చైతన్యంతో సమానంగా శ్రోతకూడా ప్రతిస్పందిం చాలి; మమేకమవాలి. అలా కానప్పుడు వక్త తన మాటలను నయాగరా జలపాతంలా పొంగించినా అంతా – ("full of sound and fury signifying nothing") అర్థంలేని వ్యర్థ పదాడంబరమే! నీ భావప్రకంపనలు అసందిగ్ధంగా సుస్పష్టంగా ఉంటే నీ భావ తద నుగుణంగా భాసిస్తుంది. చురుకైన శ్రద్ధాళువు అయిన మనసుని ఆకర్షిస్తుంది. నిన్ను విన్న అతనిలో కూడా నీ భావస్పందనలకు సమాన ప్రతిస్పందనలు ప్రేరేపింపబడుతవి. భావైక్యత సిద్ధి స్తుంది. భాష భావస్ఫోరకంగా ఉండాలి. కాని, శబ్దాడంబర రణ గొణ ధ్వని కాకూడదు.

ముందు నీవు చెప్పదలచుకొన్నది స్థిరపరచుకొని స్పష్టం చేసుకోవాలి. పిమ్మట చైతన్యస్ఫూర్తితో భావప్రకటన చేయగలిగి

నపుడు అది నేరుగా శ్రోతచైతన్యాన్ని స్పృశించి స్పందింప చేస్తుంది. నీ భావాన్ని గ్రహించడంలో పొరపాటు ఉండదు. అలా కాక నీవు చెప్పేది నీకే అసంధిగ్ధంగా, అస్పష్టంగా ఉంటే వినే వాని బుద్ధి ఎక్కడికో షికారుకొడుతుంది. నీ వెంత సేపు మాట్లాడినా గోడతో మాట్లాడినట్లే కదా!

సాధారణంగా జరిగేది ఇదే. ఏదో చెప్పాలనుకొని మరేదో చెప్తావు. విన్నవాని బుర్రకది సరిగా ఎక్కిందో లేదోనని అతని లోకి పరీక్షగా చూడబోతే నీకు కనిపించేది – వంకర అద్దంలో ప్రతిబింబించిన నీ వికృతరూపం కాక మరేం కనిపిస్తుంది! వ్యక్తులు పరస్పరం అర్థం చేసుకున్నా మనుకుంటూ ఉంటారు; కాని ఇది కేవలం ఉత్తమాటల సందడితో సాధ్యపడదు.

ఎదుటివాని మనసుపై నీవేమాత్రం ముద్రవేయ తలచుకున్నా ముందు నీ మనసుని నిశ్శబ్దీకరించు. స్పష్టంగా ఆలోచించటం నేర్చుకో. నీ ఆలోచన శబ్దాతీతంగా సత్యసరళ సుందరంగా ఉంచుకో. అప్పుడే నిన్ను నీవు స్పష్టంగా తెలుసుకోగలవు.

ఎప్పుడూ ఈ ప్రయత్నం చేయకపోతే ఇప్పుడు ప్రయత్నించు. చెప్పేదేదో డొంకతిరుగుడు లేకుండా సూటిగా, స్పష్టంగా చెప్పగలుగుతే వినేవాని మానసిక ప్రవృత్తి అసాధారణంగా విలక్షణంగా ప్రతిస్పందిస్తుంది. నీ ఆలోచనకి నీవు ఇచ్చే శబ్దరూపం కంటే, భావ పుష్టి, స్వచ్ఛత ప్రధానమైనవి, మేలైనవి కూడా. భాష భావానికి ఒక తొడుగు మాత్రమే!

అనువాదం: కర్రా వెంకటేశ్వర్లు

(*CWM* Vol. 9, pp. 287-90)

శబ్దబ్రహ్మ

ప్రశ్న: అమ్మా! 'The Creative Word' అని ఒక పుష్పానికి నామ కరణం చేశారు కదా! దాని భావం ఏమిటమ్మా?

అది 'శబ్దబ్రహ్మ'. హైందవ సంప్రదాయంలో బ్రహ్మ సృష్టికర్త కదా! ఆయనది సిద్ధవాక్కు. దైవం మంత్రాధీనం. మంత్రానికి సృజనాత్మక శక్తి ఉంటుంది. ప్రతి మంత్రానికి ఒక అధిష్ఠాన దైవం ఉంటుంది. ఆ దైవాన్ని ఆవాహనం చేసుకొని మంత్రోచ్చారణం (జపం) చేసినపుడు దైవశక్తి సిద్ధిస్తుంది. అను కున్నది అవుతుంది. శబ్దం మంత్రానికి బీజం.

మన పురాణాలలో బ్రహ్మ సృష్టికర్త కదా! ఆయనకి ఈ పుష్పం *'The Creative Word'* ప్రతీక. మంత్రాలు శబ్దబ్రహ్మలు. మహా శక్తివంతమైనవని వేరే చెప్పనక్కర లేదు. మంత్రాధిష్ఠాన దేవతలు మంత్రసిద్ధి పొందినవారిని ఆవహించి, ప్రత్యక్షమై, సృజ నాత్మకంగా వ్యవహరిస్తారు. ఇష్టకామ్యార్థసిద్ధిని కలుగజేస్తారు. రూపాంతరీకరణ శక్తి కలిగి ఉంటారు. మంత్రానికి అర్థప్రాధాన్యం కన్న శబ్దశక్తి మిన్న. మాంత్రిక శబ్దాలు బలమైన స్పందనలను సృజించి శక్తివంతంగా తిరుగులేని ఫలితాలు ఇస్తాయి.

మనం కలుసుకున్నప్పుడు సాధారణంగా మనలో మనం కులాసాగా కుశలప్రశ్నలు వేసుకొని కబుర్లు చెప్పుకుంటూ – 'శుభం! అంతా మంచే జరుగుతుంది లెండి,' 'అస్తు' లాంటి ప్రియ వచనాలు చెప్పుకుంటూం. కేవలం మర్యాద పూర్వకంగాను, మాట వరసకి అన్నట్లుగా కాక, సత్సంకల్ప పూర్వకంగా ఆత్మ శుద్ధితో అంటే అవి సిద్ధవాక్కులుగా సార్థకము లౌతాయి. మంచి జరుగు తుంది.

తద్భిన్నంగా కోపంతో మాట్లాడిన తిట్లు, శాపనార్థాలు కూడా శక్తివంతంగా పని చేసి హాని కలిగిస్తాయి. సున్నిత మన స్కులైన వారిని మరింతగా బాధిస్తాయి. ఓ దెబ్బవేసి ఊరుకుంటే పరవాలేదు. కాని పరుషవాక్కు ఆసురికశక్తితో కూడిన విస్ఫోట

నంలా పనిచేస్తుంది. చెడు ప్రకంపనలు సృష్టించి దుష్ఫలితాలు కలుగ చేస్తుంది.

అంతశ్చేతన బలంగా ఉన్నవారి మాట వ్యర్థం కాదు. ఒక వేళ రజోప్రవృత్తి బలంగా (powerful vital) ఉంటే అది మరీ ప్రమాదం. ఆడినమాట తూటాలా గాయపరుస్తుంది. తస్మాత్ జాగ్రత్త! మాటల్లో సంయమనం సదా అనుసరణీయం.

అనువాదం: కర్రా వెంకటేశ్వర్లు

(*CWM* Vol. 7, pp. 347-49)

అతి వాగుడు అనర్థదాయకం

'సత్యం వద' 'ధర్మం చర' అంటారు. నువ్వెప్పుడూ సత్యమే పలకాలి. అంటే ఏమిటి? అనవసరంగా నువ్వు ఒక్క మాట కూడా పొర్లు పోకూడదు. ఇంకొకరిని గురించి చెడు చెప్పుకోవటం వలన కూడ నువ్వు నీ చేతనను దిగజార్చుకొని, చల్లార్చుకోవటమే అవుతుంది. — *సంపాదకుడు*

'అదుపాజ్ఞలు లేకుండా మితిమీరి మాట్లాడటం అనర్థదాయకం' అనే విషయం మీద ఈ రోజు ధ్యానం చేద్దాము. అనవసరమైన మాట ఒక్కటి మాట్లాడినా అది హాని కలిగిస్తుందని నేను మీకు చాలా సార్లు చెప్పాను. ఈ విషయాన్నే అనాది నుంచీ లోకాద్ధారకు లనేకమంది బోధ చేసి ప్రయత్నించారు కానీ ఫలితం లేకపోవడం దురదృష్టకరము. వ్యర్థసంభాషణలు, అక్కసు ఒలకపోసే పదాలు, ఇతర్లను ఆడిపోసుకోటంలో ఆనందపడటం వీటికి అంతమనేది కనుపించడం లేదు. ఈ విధంగా మాట్లాడే వారి చైతన్యం అధోగతికి జారుతుంది. దానికి తోడు అసభ్యకర పదజాలంతో పోట్లాడే అలవాటు కూడా ఉంటే అది వారి ఆత్మ హననానికే దారితీస్తుంది. కాబట్టి దానిని ఎవరూ తేలిగ్గా తీసుకోకూడదనే నేను మరీ మరీ నొక్కి చెపుతున్నాను.

ఆంగ్లమూలం:

It is a question of malicious gossip... of slander,of that pleasure taken in speaking ill of others. Anyone who indulges in this kind of incontinence debases his consciousness, and when to this incontinence is added the habit of vulgar quarrelling, expressed in coarse language, then that amounts to suicide, spiritual suicide within oneself.

I stress this point and insist that you take it *very* seriously.

*

నోటి కొచ్చినట్లు పేలకూడదు. అసభ్యంగా మాట్లాడనూ కూడదు. దీనికి మందు:

1. నీ కటువంటి పరిస్థితి ఏర్పడినట్లయితే మాట్లాడటానికి పూర్తిగా నిరాకరించు, ఇంకా కావాలంటే నోరు మెదపటానికి వీల్లేకుండా కట్టేసుకో!
2. నిన్ను నీవు నిర్దాక్షిణ్యంగా పరిశీలించుకొని ఎదుటివారిలో నీకేదైతే ఘోరంగా కనబడతాయో అవన్నీ నీలో కూడ ఉన్నట్లు తెలుసుకో.
3. అందుకు వ్యతిరేకమైన గుణాల (సుహృద్భావము, ఆర్ద్రత, వినయము మొదలైనవి) బీజాలు కూడా నీలో ఉన్నట్లు తెలుసుకొని వాటిని వృద్ధి చేసుకోవటంలో పట్టుదల వహించు.

ఆంగ్లమూలం:

To cure a critical sense that manifests by incontinence of speech:

1) When you are in this state, absolutely refuse to speak – if need be, make it physically impossible for yourself to speak.
2) Study yourself without pity and realise that you carry in yourself precisely all the things that you find so ridiculous in others.

3) Discover in your nature the opposite way of being (benevolence,humility, goodwill) and insist that it develop to the detriment of the contrary element.

స్వేచ్ఛానువాదం: డా॥ ఎ. ప్రభావతి, డా॥ ఎ. వెంకటరామ శాస్త్రి
(*CWM* Vol. 9, p. 143; Vol. 14, p. 221)

రోజుకి ఒక గంట సాధన చెయ్యి

"మీరు మాకు అనేక విషయాలు చెప్తున్నారు మదర్! కాని వాటినాచరించే విధానం మాకు తెలియదు" అని అడిగేవారికి శ్రీమాత "నీకు వీలయినప్పుడు ఒక గంటసేపు మాట్లాడకుండా వుండు. లేదా అవసరమయినంత వరకే మాట్లాడు" అని ఒక చిన్న చిట్కా చెప్పారు. ఫలితం నువ్వే చూస్తావుగా.

— సంపాదకుడు

ప్రతివారూ రోజుకి ఒక గంట సేపు మౌనం పాటించాలని నా సలహా. మౌనమంటే అత్యవసరమైన మాటలు తప్ప ఎక్కువ, తక్కువలు కాకుండా ఒక్క గంటసేపు మాత్రం ఉండాలని నేను చెప్తాను.

రోజులో నీకు వీలుగా ఉన్న సమయం ఎంచుకొని, ఆ సమయంలో నిన్ను నీవు పరిశీలించుకుంటూ అత్యావశ్యకమైన మాటలు మాత్రమే మాట్లాడు.

మొదట్లో ఏది అవశ్యకమో, ఏది కాదో అనే అనుమానం రావచ్చు. కాని క్రమక్రమంగా అది నీకే బోధపడుతుంది. రోజు రోజుకీ పరిస్థితి మెరుగవుతుంది.

తర్వాత నిశ్శబ్దంగా ఉండటం ఏమంత కష్టం కాదని నీవు గ్రహిస్తావు. కాని ఒకసారి మాట్లాడడం మొదలుపెడితే ఒకటి కాదు, రెండూ కాదు, అక్కర్లేని మాటలు అనేకం దొర్లిపోవడం గమనిస్తావు.

ఇదే ఒక అభ్యాసం కింద మీకిస్తున్నాను. ఒక వారం రోజులు పరిశీలించి ఇందులో ఎంతవరకూ కృతకృత్యులయ్యారో కాగితం మీద రాసి పట్టుకొని రండి.

*

వారం గడిచిన తర్వాత శ్రీమాత ఇలా అన్నారు:

మీ సమాధానాలు చూసి చాలా సంతోషించాను. వాక్కు నియంత్రణను కొంతమంది చాలా నిష్ఠతో పాటించారు. అది కొనసాగించడం అందరికీ మంచిది.

ఒకరు ఈ విధంగా రాశారు. అందులో ఎంతో నిజముంది. "అలా మొదలు పెట్టిన తర్వాత ఇక ఆ అభ్యాసం ఆపుచేయవల సిన అవసరం నాకు కనిపించలేదు. రోజుకి ఒక గంటసేపు ప్రారంభించిన ఆ అభ్యాసం తప్పనిసరిగా కొనసాగించటమే సహా జంగా తోస్తుంది. అదే అలవాటైపోతుంది."

నీకు ఈ విధమైన ఫలితం కనిపిస్తే అది నిజంగా అద్భు తమే.

స్వేచ్ఛానువాదం: డా॥ ఎ. ప్రభావతి, డా॥ ఎ. వెంకటరామ శాస్త్రి

(*CWM* Vol. 3, pp. 259-60, 263)

వందేమాతరం

మన్వంతరారంభంలో ఉత్తర మేరు ప్రాంతంలోని వారు సహజ భాష లేక దేవభాష అయిన సంస్కృతమును మాట్లాడేవారు. స్వచ్ఛతలో అది ద్వాపరంలోని సంస్కృతం కానీ, కలిలోని సంస్కృతం కానీ కాదు. అది వాక్కుకీ అర్థానికీ మధ్య సంపూర్ణ సంబంధంకల సత్యయుగపు భాష. అందులోని ప్రతి అచ్చుకీ, హల్లుకీ సహజంగానే ఒక ప్రత్యేక శక్తి వుంది. అది వాటికి స్వతః సిద్ధం తప్ప మానవ ప్రయత్నం వల్లగానీ, క్రమ వికాసం వల్లగానీ వచ్చిన శక్తి కాదు. ఈ బీజ శబ్దాలే తాంత్రిక బీజ మంత్రాలకి మూలం, వాటి ప్రభావానికి కీలకం. ఈ శక్తి వల్లనే

దేవభాషలోని ప్రతి అచ్చుకీ, ప్రతి హల్లుకీ ఒక విశిష్టమైన మూల అర్థం ఉండి, ఉత్పన్న శబ్ద, అర్థాలకి ఆధారమైంది. అచ్చుల హల్లుల కలయిక వల్ల ఎన్నో మూలధాతువులు ఏర్పడ్డాయి. మరి కొన్ని ధాతువులు కేవలం అచ్చులనుండే ఏర్పడ్డాయి. అనంతరం ఇవి మరికొన్ని హల్లులతో కలసి రెండవ స్థాయి ధాతువుల నేర్ప రిచాయి. అన్ని పదాలూ ఈ ధాతువులనుంచే వచ్చాయి. శుద్ధ అచ్చులకో, మిశ్రమ అచ్చులకో హల్లుల ముగింపులు జోడించి, మూలధాతువులలో మార్పులు చేసినందువల్ల కొన్ని సరళమైన శబ్దములూ, మార్పులూ చేయనందువల్ల మరి కొన్ని శబ్దములూ వచ్చాయి. క్లిష్టమైన మాటలు మిశ్రమాల ద్వారా ఏర్పడ్డాయి.

ఈ భాషే క్రమంగా అర్థంలోనూ శబ్దంలోనూ దోష భూయిష్టమై గ్రామ్యత పెరగడంతో త్రేత, ద్వాపర, కలియుగాల లోని సంస్కృతం అయింది. అప్పుడప్పుడు పాక్షికంగా శుద్ధిచేయ బడినా, కొంతకాలానికి తిరిగి కలుషితమై మళ్లీ మళ్లీ కొంచెం శుద్ధిచేయ బడుతూండటం వలన ఈ భాష తన సహజ రూపు రేఖలతోటి, నిర్మాణం తోటి పూర్తి సంబంధం కోల్పోకుండా వుంది. ఈ సహజభాష దేవభాషతో సంబంధం ఎంత దూరమైనా, ప్రతి ఒక్క భాష దీని వక్రీకరణ వలనో, వాడుక వల్ల వచ్చిన ప్రాకృత భాషనుంచో, లేక మళ్లీ ఆ ప్రాకృతం యొక్క ప్రాకృతం నుంచో, దాని లోని మాలిన్యం యొక్క వివిధ స్థాయిలని బట్టి ఏర్పడినదే. విశ్వవ్యాప్తమూ, అనంతమూ అయిన ఈ భాష భారతదేశంలో అత్యంత శుద్ధరూపంలో ఉండటం వల్లనే దానికి వేరే ప్రాంతీయ నామం ఏది ఇవ్వకుండా సంస్కృతమనే పిలవ బడుతోంది. మానవ భాషని క్షుణ్ణంగా అర్థం చేసుకోవడానికి అవగాహన చేసుకోవడానికీ, ఆ తరువాత సంస్కృతభాషని మళ్లీ తాజాగా క్షాళనం చేయడానికీ నాంది ఎప్పుడూ సంస్కృతం ఆది భాష అనే సత్యాన్ని తెలుసుకోవడంలోనే వుంది.

మూలం: శ్రీఅరవిందులు

అనువాదం: బి. వరలక్ష్మి

(*SABCL* Vol. 11, pp. 449-50)

సంస్కృతం

'సంస్కృతం' దేవభాష అనియు, సంస్కృతమే భరతఖండానికి రాష్ట్రభాష కావాలనియు శ్రీమాత ప్రవచించారు.

మాతురాజ్ఞా శిరసి ధార్యా
యత్నతః, సాన పరిహార్యా మాతురాజ్ఞా
సంస్కతం స్యాద్ రాష్ట్రభాషా
సంస్కృతిః స్యాత్ రక్షితాऽऽశా మాతురాజ్ఞా
సంస్కృతం భారతం రాష్ట్రం
దివ్యపురుషం విశ్వమఖిలమ్
శ్రీమదరవిందామలాశయ –
సురభిమకరందోరుసారమ్ మాతురాజ్ఞా

శ్రీమాత ప్రవచించినట్లు సంస్కృతాన్ని నేర్చుకొందాం
భారతాన్ని సంస్కృతం చేద్దాం
విశ్వమంగళం సాధిద్దాం

డా॥ ప్రభాకర శర్మ

చివరి మాట – ఒక యథార్థ గాధ

వాళ్లని వెనకబడిన వాళ్లంటె ఎవరైనా నవ్విపోతారు.

కొన్ని సంవత్సరాల క్రితం సియాటిల్ నగరంలో వికలాంగుల కోసం ప్రత్యేకమైన ఒలింపిక్ క్రీడామహోత్సవాలు నిర్వహించిరి. వందగజాల పోటిలో తొమ్మిదిమంది మానసిక, దైహిక వికలాంగులు పరిగెత్తేందుకు తయారుగా గీతమీద పొంచి వున్నారు.

తుపాకి పేలంగానే ఉవ్వెత్తున, ఎలాగైనా సరే పరిగెత్తి గెలవాలనే ఉత్సాహంతో బయలుదేరారు. కాని ఒక్క చిన్న పిల్లవాడు మట్టుకు పాపం పడిపోయి రెండు గిరికీలు కొట్టి ఏడవటం మొదలు పెట్టాడు.

ఆ ఏడుపు విని మిగతా ఎనమండుగురు వెనక్కి తిరిగి చూసారు. అంతే అతని దగ్గరికి పరిగెత్తుకుని వెళ్లారు. ఒక పిల్ల, Down's Syndrome పీడితురాలు, ఆ పిల్లవాడిని ముద్దుపెట్టుకుని "నువ్వింక నయమయిపోతావులే" అని ప్రేమతో సముదాయించింది. తరువాత ఆ తొమ్మండుగురు ఒకరి నొకరు చేతులు కలుపుకొని అందరూ కలిసి చివరివరకు పరిగెత్తేరు.

ఆ దృశ్యమును చూసిన ప్రేక్షకులందరు నిలుచోని చాల సేపు చప్పట్లుకొట్టి హర్షధ్వనాలు చేసారు. కొన్ని నిమిషాలు జయ జయ ధ్వానాలతో ఆ స్టేడియమంతా మారుమ్రోగింది. అది చూసిన వాళ్లు ఇప్పటికి ఆ మరపురాని సంఘటనను గురించి కథలు కథలుగా చెప్పుకుంటున్నారు.

మన అగాధాలలో మనుషులందరు ఒకటే అని, ఒకరితో ఒకరు చేతులు కలుపుకున్న ఒకే ఆత్మ అని తెలుసుకో. జీవితంలో నువ్వు మట్టుకు నువ్వు ఒక్కడివే గెలవటం అంత ముఖ్యం కాదు. నీ కాలస్యమైనా లెక్కచేయక ఇతరులకు కూడ సాయపడి అందరిని ఉమ్మడిగా గెలిపించాలి. అలా చేయటంలోనే నిజమైన శాంతి, తృప్తి, ఆనందములు కలుగుతాయి.

ఇకనైనా మీ ధోరణి మార్చుకోండి! ఈ సందేశాన్ని నలుగురికి చాటించండి.

అనువాదం: రా. లక్ష్మీప్రసాదమ్మ

Editor: R.L.N.Sastry
Published by Pradeep Narang on behalf of Sri Aurobindo Society,
No. 1, Rangapillai Street, Pondicherry - 605001.
Printed by Amiyo Ranjan Ganguli at Sri Aurobindo Ashram Press,
38 Goubert Avenue, Pondicherry - 605001.

Single copy: Rs. 15   Annual Subscription: Rs. 100 (in India)

సమాచార పత్రం

మార్చి ఏప్రిల్ మాసములలోని ముఖ్యదినములు

29 మార్చి 1914 శ్రీమాత ఫ్రాన్స్ నుంచి వచ్చి మొట్ట మొదటసారి శ్రీఅరవిందులను కలుసుకున్నారు.

4 ఏప్రిల్ 1910 శ్రీఅరవిందులు పాండిచ్చేరి వచ్చిన రోజు.

24 ఏప్రిల్ 1920 శ్రీమాత జపాను నుంచి వచ్చి పాండిచ్చేరిలో స్థిరపడిన రోజు. దీనినే తరువాత దర్శనదినముగా చేసారు.

కేంద్రముల వార్తలు

జార్ఖండ్ లోని శ్రీఅరబిందో సొసైటీ కేంద్రముల, శాఖల సమావేశము రాంచిలో 22, 23 జనవరి 2005 తేదీలలో జరిగినది. వడోదరా (గుజరాత్) లో 21-25 జనవరి 2005 తేదీలలో డా॥ ఆనందరెడ్డిగారు 1.) కర్మల ద్వారా సాధన 2.) భక్తి ద్వారా సాధన 3.) ధ్యానము ద్వారా సాధన అనే విషయాల మీద ఉపన్యాసములు ఇచ్చారు. సిలిగురి (పశ్చిమ బెంగాల్) లో 9 జనవరి 2005 న శ్రీఅరవిందుల రెలిక్స్ ప్రతిష్ఠాపన వార్షికోత్సవమును జరుపుకొనిరి. చిత్తూరులో కాంఫర్డ్ ఇంగ్లీషు మీడియం స్కూలులో విద్యార్థులకు, ఉపాధ్యాయులకు శ్రీమాతారవిందులు మరియు వారి యోగమును గురించిన ఉపన్యాసములు ఇవ్వబడినవి. నైరోబి (కెన్యా) సొసైటీ కార్యనిర్వాహక వర్గం వారు ఒక పిల్లల ఆసుపత్రిని సందర్శించి 2200 లఘుదీపికలను బహూకరించిరి. పశ్చిమ బెంగాల్ కేంద్రముల, శాఖల సమావేశములను 5, 6 ఫిబ్రవరి 2005 తేదీలలో జరుపుకొనిరి. పాండిచ్చేరిలో All India Youth Camp for National Integration, 3-11 జనవరి 2005 తేదీలలో 16-25 సం॥ వయస్సుగల 22 మంది బాలికలు 37 మంది బాలురు పాల్గొనిరి. శ్రీ విజయ్, కైవల్య స్మార్ట్, శివకుమార్‌లతో సహా కొంతమంది సంచాలకులు దీనిని నిర్వహించిరి.

పరమ రహస్యం



అఖిల

అఖిల భారత పత్రిక, జూన్ 2005

పరమ రహస్యం

విషయసూచిక

పరమ రహస్యం[1]	...	2
ఆరోహణలోని మూడు స్థాయిలు	...	26
పనుల ఆవశ్యకత	...	30
క్రియాశీలమైన ధ్యానము	...	35
భౌతిక శరీరాన్ని చైతన్యవంతం చేయుట	...	37
సమాచార పత్రం	...	39

---

[1] ఆరు స్వగతాలు, చివరగా ఉపసంహారముగల ఈ రచనను గురించి శ్రీమాత ఈ విధంగా చెప్పారు.
“ఇది నాటక ఫక్కీలో ఉన్నప్పటికి, దీనిని నాటకం అనేందుకు వీలు లేదు. అయినప్పటికి మనం దీనిని రంగస్థలం మీద ప్రదర్శిస్తున్నాము. అందరూ ఇష్టపడతారని తలుస్తాను.”

రాజనీతిజ్ఞుడు, కళాకారుడు, అజ్ఞాతవ్యక్తి – ఈ మూడు పాత్రలు శ్రీమాతే రచించారు. అజ్ఞాతవ్యక్తి ద్వారా నేను మాట్లాడుతాను అని శ్రీమాత అన్నారు. మిగతా నాలుగు పాత్రలు నళిని (రచయిత) పవిత్ర (శాస్త్రజ్ఞుడు), ఆంద్రే (పారిశ్రామికవేత్త), ప్రణబ్ (క్రీడాకారుడు) లతో శ్రీమాతే మాట్లాడి రాయించేరు.

పరమ రహస్యం

ఆరుగురు ప్రసిద్ధ వ్యక్తుల స్వగతాలు, ఉపసంహారము

తమ జీవితకాలంలో లోకమంతటా పేరు ప్రఖ్యాతులు గాంచిన ఆరుగురు గొప్పవ్యక్తులు మానవ ప్రగతిపై ప్రపంచ మహాసభ ఏర్పాటయిన సందర్భంగా దానికి హాజరు కావడానికై ఒక నౌకలో ప్రయాణం చేస్తూ ఉండగా, అది సముద్రంలో మునిగిపోయింది.... విధివిలాసం! కాని వారెలానో బ్రతికి బయట పడి ఒక చిన్న రక్షకనావలో నట్టనడుమ సముద్రాన్నుండి ఒడ్డు చేరుకోవాలని నిశ్చయించుకొన్నారు.

ఆ నావలో ఏడవ వ్యక్తి కూడా ఒకతను ఉన్నాడు. యౌవ్వనంలో ఉన్నాడు. వయస్సుతో నిమిత్తం లేనట్టు వున్నాడు. అతను ఏ దేశానికీ, కాలానికీ చెందని విధంగా విచిత్రంగా వస్త్రాలు ధరించి వున్నాడు. అతను నావలో చుక్కాని ఉన్న వైపు నిశ్చ లంగా, ప్రశాంతంగా కూర్చొని, మిగతావారు చెప్పే దానిని శ్రద్ధ గానే వింటున్నాడు. వారు అసలు అతనిని గుర్తించినట్లే లేదు.

ఆ వ్యక్తులు రాజనీతిజ్ఞుడు, రచయిత, కళాకారుడు, శాస్త్రజ్ఞుడు. పారిశ్రామికవేత్త, క్రీడాకారుడు, అజ్ఞాతవ్యక్తి (అపరిచితుడు).


నావలో మంచినీళ్ళు అయిపోవచ్చాయి. ఆహారం కూడా ఇక ఎంతో లేదు. ఆకలి, దాహం మున్నగు బాధలు భరింపరానివిగా తయారవుతున్నాయి. కనుచూపు మేరలో ఆశాకిరణం ద్యోతకమ వడం లేదు. మృత్యువు ఆసన్నమవుతున్నది. ప్రస్తుత వేదనను మరచిపోవడానికై వారు ఒక్కొక్కరు తమ జీవితగాథలను చెప్పు కోసాగారు.

(తెర పైకి లేస్తుంది)

నా జీవిత మెలా సాగిందో మీకు మొదట నేను వివరిస్తాను. నా తండ్రి ఒక రాజకీయవేత్త. చిన్నతనంలోనే నేను పరిపాలనకు, రాజకీయాలకు సంబంధించిన సమస్యలను అర్థం చేసుకున్నాను. నా తండ్రి, తన స్నేహితులతో ఆ సమస్యలను గూర్చి చర్చిస్తూ వుండేవాడు. 12 ఏళ్ళ ప్రాయంనుండి నేను నా తండ్రితో బాటే వుండి ఆ సమస్యలను, చర్చలను వినేవాడ్ని. విభిన్న రాజకీయ పక్షాల అభిప్రాయాలన్నీ కూలంకషంగా తెలుసుకున్నాను. ప్రతి సమస్యకు అతితేలికయిన పరిష్కారమార్గాన్ని కనుగొన్నాను.

అందువలన నా చదువులు ఆ దిక్కుగానే సాగాయి. రాజకీయశాస్త్రంలో గొప్ప పండితుడ్నయాను. తరువాత, కాలక్రమేణా, సిద్ధాంతాలను ఆచరణలో పెట్టాలనుకొన్నప్పుడు నేను ఎన్నో చిక్కులు పడ్డాను. మనం అనుకొన్న వాటిని ఆచరణలో పెట్టడం ఎంత కష్టమో అప్పుడు తెలియవచ్చింది. నేను ఎన్నిటితోనో రాజీ పడ్డాను. నెమ్మదిగా నా మహత్తర ఆదర్శం అంతరించిపోయింది.

ఉజ్వలంగా సాగిన నా జీవనం మీరంతా ఎరిగివున్నదే. నేను దానిని గూర్చి చెప్పడం అనవసరం. కాని నేను ప్రధాని అయినప్పుడు నా హోదా నాకు అధికారాన్ని ఇచ్చింది. నా యౌవ్వనంలో నేను ఆరాధించిన మానవతా ఆదర్శాలన్నీ ఒక సారి స్మృతికి తెచ్చుకున్నాను. నేను వాటి వెలుగులో, వాటి సహాయంతో ముందుకు నడవడానికి యత్నించాను. నేను పార్టీ వ్యక్తిగా మారకూడదని అనుకున్నాను. ప్రపంచాన్ని వేధిస్తున్న రాజకీయ, సాంఘికధోరణుల మధ్య చెలరేగే సంఘర్షణను రూపుమాపాలని, ఈ గడ్డు సమస్యను పరిష్కరించాలని ఎంతో ప్రయత్నించాను. వాటిలో లాభాలు ఉన్నాయి, నష్టాలు ఉన్నాయి. ఏదీ పూర్తిగా చెడ్డదీ కాదు; ఏదీ పూర్తిగా మంచిదీ కాదు. రెండింటిలోనుగల మంచిని నిర్ణయించడానికై మార్గాన్ని అన్వేషించాలి. ఈ రెండింటిని సమన్వయపరచి ఆచరణలో పెట్టగలగాలి. కాని వాటిని



The Mother directing a play at
the Ashram Theatre, Nov., 1956

సమన్వయపరచగల ఒక నిర్దిష్టసూత్రాన్ని నేను కనుగొనలేక పోయాను. దానిని కార్యరూపంలో అసలే పెట్టలేకపోయాను.

జాతుల మధ్య శాంతి, సౌమనస్యాలు విలసిల్లాలని ఆకాంక్షించాను. మానవాళి మనుగడ కొరకు, ప్రగతి కొరకు పరస్పర సహకారం పెంపొందాలని కలలు కన్నాను. కాని యుద్ధాన్ని చేయమని నన్ను మించిన శక్తి ఏదో నన్ను పురికొల్పింది. ధర్మ బద్ధం కాని పద్ధతులతో, సంకుచితమైన కుటిలమార్గాల ద్వారా విజయాన్ని సాధించాలని, నా యోచనలు పెడమార్గం త్రొక్కాయి.

అయినప్పటికీ నేను గొప్ప రాజనీతిజ్ఞుడనని, రాజకీయవేత్త నని అందరూ నన్ను పొగడ్తలతో, ప్రశంసలతో ముంచెత్తారు. నేను మానవాళి ప్రియమిత్రుడనని అందరూ భావించారు.

కాని నా లోపం నాకు తెలుసు. నేను ఒక మహోన్నత మైన విజ్ఞాన ప్రకాశానికి, ఒక మహోత్కృష్టమయిన శక్తి సంప దకు దూరమైనానని నాకు తెలుసు. ఆ విజ్ఞాన, శక్తిసంపదలు నాకు ఉండి వుంటే చిన్నతనపు నా ఆశయాలన్నీ నెరవేరేవి.

ఇప్పుడు మృత్యువు సమీపిస్తోంది. జీవితంలో నేను సాధిం చింది చాలా తక్కువ. అదైనా బాగా సాధించలేకపోయాను. విచా రంతో, నైరాశ్యంతో నిండిన నా బ్రతుకు ఇక కొద్ది కాలంలోనే అంతరిస్తుంది.

రచయిత

క్షణికమైన ఈ మర్త్యజీవిత పరిధిలో స్పందించే ఒక మనోహర సౌందర్యాన్ని, ఒక మహత్తరసత్యాన్ని సుమనోజ్ఞభావనాలతలతో బంధించాలని తాపత్రయపడ్డాను. మన కన్నుల యెదుట కమనీ యమై కనుపించే ఈ సృష్టిహేల – ఈ మనుష్యులు, ఈ సంఘ టనలు, ఈ దృశ్యాలు, ఈ చరాచర సృష్టి సర్వస్వం, ఏవో భావా లతో, ఆలోచనలతో మన అంతరాంతరాలు కదలాడే ఆంతరంగిక ప్రపంచం.... ఇదంతా అంతుచిక్కని ఒక విచిత్ర పద్మవ్యూహం! అదే నన్ను సమ్మోహపరచింది; ఆ లోకాతీతసీమల నుండి ఏదో తీయని పిలుపు, తనని తెలుసుకొనమని, అర్థం చేసుకొని, శాశ్వ

తంగా పొందమని ఒక పిలుపు విన్నాను. గుండెలను కదలించే ఆ సుమధురవాణి దివ్యమహతీ స్వరాన్నే కాలదన్నేటట్లు ఉన్నది.

ఆ మాధురీ నినాద ప్రతిధ్వనిని నేను నా రచనలలో పొందుపరచాలని యత్నించాను.

ఈ విశ్వరహస్యాన్ని తెలుసుకొని వ్యక్తం చేయడమే నా లక్ష్యంగా పెట్టుకొన్నాను. అదృశ్య 'యక్షుడు' అడిగే అంతిమ ప్రశ్నకు జవాబివ్వాలని ప్రయత్నించాను. మనకు కనిపించకుండా గుప్తమై, సృష్టి యవనిక వెనుక నుండి మన జీవితాలను, ఈ అనంత జగత్తును నడిపించే ఆ 'పరమాద్భుతాన్ని' ఆవిష్కరించాలని, దానిని వెలుగులోకి తీసుకొని వచ్చి ప్రత్యక్షంగా ప్రదర్శించాలని తలచాను. భౌతికజగత్తులోనూ, భౌతికాతీతజగత్తులోనూ సాగే నిత్యవ్యవహారాలన్నీ నిర్జీవమైనట్టివి, అవన్నీ కల్లోలిత జలధితరంగాలు వంటివి. వాటికి నేను చేతనత్వాన్ని కల్పించాను. ఆ మూగ నాటకరంగాన సొగసైన పలుకులను సృజించాను. రచన నాకు అత్యంత విశిష్టమైన సాధనగా గోచరించింది. అంతకన్నా మించిన దివ్యసాధన మరొకటి లేదు అని అనుకున్నాను. దీనితో దేనినైనా సూక్ష్మంగా, అస్పష్టత లేకుండా వ్యక్తం చేయవచ్చు. రచనలో వ్యక్తం చేయదలచుకొన్న పదం రెండు ప్రపంచాలకు సంబంధించి వుంటుంది. అది భౌతికప్రపంచానికి సంబంధించి వుంటుంది. అందువలన ఒక రూపం ధరించ గలుగుతుంది. అది సూక్ష్మప్రపంచానికి కూడా చేరువలో వుండి, అతిసూక్ష్మ వస్తువులతోను, శక్తులతోను, స్పందనలతోను, సూత్రాలతోనూ, భావాలతోను సంబంధం కలిగివుంటుంది. సూక్ష్మజగత్తుకు అది రూపాన్ని ఇవ్వగలదు. నిరాకార జగత్తును మూర్తీభవింప చేయగలదు. అన్నింటికీ మించి, వస్తువుల పరమార్థాన్ని, స్వరూపంలో నిక్షిప్తమైన యదార్థతను వెల్లడించగలదు.

మానవ హృదయంలోను, ప్రకృతిలోను గల అవ్యక్త వేదనలకు కారణం ఏమిటో, దేనికొరకు ఈ నిరంతరాన్వేషణ సాగుతున్నదో, మానవహృదయం దేనికొరకు పరితపిస్తోందో, ఆకాంక్షిస్తోందో, దానిని నా కవితా రసవాహినిలో వెల్లివిరియ జేయా

లని అనుకొన్నాను. మరింత విస్తృతంగా కథలు, కల్పనల ద్వారా జీవితవైవిధ్యాన్ని, జీవితంలోగల రకరకాల ప్రవృత్తులు, కాంక్షలు, అపురూప విజ్ఞానం, అతిసామాన్య తెలివిహీనతలు చిత్రించాను. మానవుడు-ప్రకృతి – వీరి స్వరూప స్వభావాలకు సంబంధించిన చారిత్రిక ఘట్టాలకు ఒక నూతన శోభను, దీప్తిని చేకూర్చాను. జీవితంలోగల రాగద్వేషాలను, సుఖదుఃఖాలను నాటకరూపంలో ప్రతిబింబింపజేశాను. ఇంత దేనికి, ప్రాచీన సాహిత్య ప్రక్రియల ద్వారా నేటి యుగంలో నివసించేవారి కోర్కెలను, అవసరాలను ఎంతో రమణీయంగా సఫలీకృతమయేటట్లు చేశాను, సజీవ పాత్ర లను చిరస్మరణీయ వ్యక్తిత్వ విస్ఫూర్తితో తీర్చిదిద్దాను.

ప్రస్తుత అణుయుగానికి అనువుగా ఉండే నవలా ప్రక్రియ ద్వారా మహావ్యక్తుల జీవితచరిత్రలను రచించాను.

మానవాళి సమగ్ర గాథను కూడా మీకు అందివ్వాలని యత్నించాను. నిరంతర కాలభ్రమణంలో వారి పురోగతి, పరి ణామం, మనోవికాసం గూర్చి అందులో వివరించాలని తలచాను. కాని నాకు తెలుసు ఇది సరిపోదని. మానవునిలో ఆధ్యాత్మిక పిపాస దీనితో చల్లారదు. అదీ గ్రహించాను. మానవాత్మకు మరింత ఔన్నత్యం, గంభీరత కావాలి. మరింత ఉత్తమ శైలి వైపు ఆత్మిక నేత్రాలు ఆశతో పరికిస్తాయి. అందుకే నేను మీకు కావ్యాన్ని అందించాను. జీవితమంతా శ్రమించి సృష్టించాను దానిని. మీలో చాలా మందికి అది అర్థం కాదు; అవగాహన చేసుకొనలేకపోయారు. చాలామంది దిగ్భ్రమ చెందారు. కాని అందరూ అందుగల మంత్రస్పందనకు పరవశించారు. అవును, అడ్డుగా ఉన్న 'తెర' ను చీల్చివేయాలని నేను నిరాశ, నిస్పృహ లతో చేసిన చివరి యత్నం అది.

నేను కథాంశాన్ని, విధానాలను మార్చాను. నేను మాట లలో ఒక క్రొత్త అర్థాన్ని, ఒక కొత్త విలువను, ఒక కొత్త మహ త్తును నింపాను. ప్రపంచంలో మహారచయితల పోకడలన్నీ గమ నించాను. వ్యాస, వాల్మీక మహాకవుల కవితాశిఖరాలకు కూడా నా ఊహాలు ఆరోహించాయి.

అయినా, నేను ఏదో సాధించలేకపోయాను. నాకు సంతృప్తి లేదు. నాకు సంతోషం లేదు. కారణం, ఇవన్నీ నేను సృజించిన కిర్మీర స్వప్నాలు, గాలిలో వెదజల్లిన రంగుల కలలు. ఈ నిఖిల సృష్టిలో అణువణువునా విరాజిల్లే మహనీయ సత్యస్వరూపాన్ని, అంతర్భూతమై తేజరిల్లే అమృత సౌందర్యాకృతిని మనసారా వీక్షించలేకపోయాను. బాహ్యప్రపంచం పైనే నేను నా మనస్సును కేంద్రీకరింప జేశాను. ప్రకృతి బాహ్యయవనికనే నేను స్పృశించాను. కాని ప్రకృతి యదార్థస్వరూపం, అంతర్నిహిత సత్యం నా దృష్టికి అందలేదు. పైకి ఎంత అందంగా కనిపించినా, ఎంత వాస్తవంగా కనిపించినా, సృష్టి సహజ అంగాల చుట్టూ బంగారు పట్టుదారాలు అల్లాను.

ప్రతి విషయాన్ని ఛేదించి, మార్మిక నిగూఢతను వెలికి తీసి, అభివ్యక్తం చేసి, మూర్తీభవింపచేయగల శక్తి గలది, ఎటువంటి లోపమూ లేక, పరిపూర్ణమైనది అని నేను భావించిన సాధనం, ఉపకరణం చివరకు పనికిరాకుండా పోయినట్లు గ్రహించాను. ఒక పెనునిశ్శబ్దం, ఒక మహాశూన్యత ఈ విశ్వంలో ప్రత్యణువు సమీపంలోను నిలిచివున్నదని ఒక నిర్ణయానికి వచ్చాను.

ఆద్యంతరహితమైన ఈ అనంత జీవనవాహినిలో, ఈ అనేకానేక వైవిధ్యభూయిష్ట విపర్యయ సందోహంతో నిస్సహాయంగా హస్తాలు చాచి, "ఓ ప్రకృతీమ తల్లీ! ఓ మహిత మాతృస్వరూపిణీ! ఎక్కడ? ఎక్కడ నిన్ను దర్శించగలను? ఎక్కడ నీ పూర్ణ రూపావిష్కరణ?" అని విలపిస్తున్నాను. మనమంతా శూన్యనిబిడాంధకార గోళంలో చిక్కుకొన్న కిన్నెర, గంధర్వ, కింపురుషులం. మనం మన స్వర్ణపక్షాలను విదిలించి పైకి ఎగరాలని వృథా ప్రయత్నం చేస్తున్నాం.

ఈ అంతిమ క్షణాల్లో పసివానివలె, అజ్ఞానంతో అడుగుతున్నాను. – ఇదంతా ఏమిటి? ఏ ఈశ్వరునికి మనం నమోవాక్కులు అర్పించాలి, ఎవరికి నివాళులెత్తాలి? ఈ జీవన్మరణాలకు పరమార్థం ఏమిటి? ఈ పృథ్వీపై సాగే ఈ నిరంతర సంఘర్షణ, ఆవేదనలతో కూడియున్న ఈ విజయపరంపరలు, ఈ

మాయాకల్పిత దృశ్యమాన జగత్తు – వీటికి అర్థం ఉన్నదా? ఏనాటికీ అంతరించని ఈ అచేతనా, అజ్ఞాన అగాధాలవైపు ప్రవహించే విజయోత్సాహ ఉద్వేగ స్రవంతులు, అద్భుత ఆశాస్రోతస్వినులు – చివరకు ఇవన్నీ తప్పనిసరిగా అంతరించిపోవడం; ఈ సృష్టికన్నా మరింత విచిత్రమయిన ప్రళయం – ఇదంతా అర్థరహితం. ఒక దుష్ట హాస్యప్రవచనం, అతి భయానకం, వ్యర్థం.

శాస్త్రజ్ఞుడు

మీవలె నేను నా తోటిమానవుల పరిస్థితులను మెరుగుపరచాలనే ఉద్దేశంతో నా జీవితలక్ష్యాన్ని ఏర్పరుచుకొనలేదు. కార్యరంగంలోకి అడుగుపెట్టడంకన్నా, నాకు విజ్ఞానార్జనయే ప్రధాన ఆకర్షణియే కనిపించింది. నేటి అధునాతన వైజ్ఞానికపథంలోనే పయనించడానికి నిశ్చయించాను. పరమాద్భుతమయిన ప్రకృతిరహస్యాలను కనుగొనడంకన్నా మహాద్భుతమే మున్నది? జ్ఞానం అధికమైనకొలది అధికారం కూడా పెరుగుతుందని బహుశా గ్రుడ్డిగానే విశ్వసించాను. ప్రకృతిని జయించడం వలన మానవజీవితంలో నైతిక, ఐహిక సంపదలు వృద్ధిచెందుతాయని ఆశించాను. నేను, చాలా మంది మేధావులు 'అజ్ఞానం' ప్రపంచాన్ని పీడించే ప్రాథమిక అరిష్టం అని తలచాము. మానవాళికి పూర్ణత్వం సిద్ధింపకుండా ఇదే ఆటంకపరుస్తున్నది.

ఏ విధమైన చర్చా లేకుండా, మానవజాతికి నిరవధికమయిన పరిపూర్ణత్వం లభించగల అవకాశం ఉన్నదని అంగీకరించాం. త్వరితగతిని గాని, నెమ్మదిగా గాని 'ప్రగతి' అనేది సాధ్యమే. ఇంతవరకు వచ్చాము గనుక, ఇంకా ముందుకు పోగలమని మనకు తెలుసు. ఇంకా తెలుసుకొనడం అంటే ఇంకా అర్థం చేసుకొనడం, ఇంకా మేధాసంపత్తిని అభివృద్ధి చేసుకొనడం, ఇంకా ధర్మబద్ధులవడం – ఒక్క మాటలో చెప్పాలంటే పురోగతి సాధించడం అన్న మాట.

మేము అంగీకరించిన సిద్ధాంతం మరొకటి వున్నది – ఈ అనంత విశ్వాన్ని ఉన్నది ఉన్నట్లుగా తెలుసుకొనడం సాధ్యమే. బాహ్య పరిజ్ఞానంతో దానికి సంబంధించిన రహస్యాలను, నియమాలను గ్రహించవచ్చు. ఇది చాలా సుస్పష్టంగా కనిపించడం వలన దానిని గూర్చి ప్రశ్నే లేదు. 'విశ్వం ఉన్నది, నేను ఉన్నాను'. నిస్సందేహంగా ఈ విశ్వంలో నేనొక విభాగాన్ని. కాని దానిని తెలుసుకొనడానికి ప్రయత్నించినప్పుడు, దాని నుండి విడివడి బహిర్ముఖంగా దానిని పరిశీలించాలి. నాతోగాని, నా బుద్ధితోగాని సంబంధించకుండా ప్రకృతినియమాలు ఉన్నాయి. వాటంతట అవే నిలిచి ఉన్నాయి. వాటిని పరిశీలించగల వారదరికీ అవి ఒకే విధంగా ఉంటాయి.

ఈ మేలిక విజ్ఞాన ఆదర్శంతో ఉద్దీపితుడ్నై నా పనిని నేను ప్రారంభించాను. నేను శాస్త్రవిజ్ఞానాన్ని, అందులోను అణు పరిశోధనను ఎన్నుకొన్నాను. గొప్ప భౌతిక శాస్త్రజ్ఞులతో కలిసి కృషి చేశాను. 'యురేనియం' పరమాణువును విచ్ఛిన్నం చేయడం, అణ్వాస్త్ర ఉద్భవం అంతా గమనించాను. ఇదే కాలంలో అణుశక్తి నుండి సరాసరి విద్యుచ్ఛక్తిని కనుగొనడానికి దారిచూపిన ప్రయోగాన్ని మొదట నేనే ఊహించాను.

దీనితో ప్రపంచ ఆర్థిక పరిస్థితిలో పెద్ద మార్పు వచ్చింది. తక్కువ ధరలో విద్యుచ్ఛక్తి అందరికీ లభించడం జరుగుతున్నది. ఈ పరిశోధన వలన మనిషికి శ్రమించి పనిచేయడం తప్పింది.

ఈ విధంగా నేను చిన్నతనాన కన్న కలను సాధించాను. నేను పూర్తిగా సంతుష్టుడ్నయ్యానని అనుకొన్నాను. కాని, ఆ సంతృప్తి ఎంతో కాలం లేదు. ఈ పరిశోధన అనంతరం నేను మరొక మహత్తర విషయాన్ని కనుగొన్నాను. యురేనియం, థోరియము మున్నగు అపూరూప లోహాలనుండేగాక, సాధారణ లోహాలయిన రాగి, అల్యూమినియమ్‌ల నుండి కూడా అణుశక్తిని విడుదల చేయగల పద్ధతిని కనుగొన్నాను. దీనితో నన్ను ఒక పెద్ద సమస్య ఎదుర్కొన్నది – ఈ పరిశోధనను వెల్లడించనా వద్దా? అని ఇంతవరకు ఈ రహస్యం నాకు తప్ప ఎవరికీ తెలియదు,

అణుబాంబు తరువాత, ఉదజని బాంబును కనుగొన్నా రని అందరికీ తెలిసినదే. ఈ నూతన పరిశోధనలతో, ఇంతకు ముందు కనీవినీ ఎరుగని మహామారణాయుధాలు అందుబాటు లోకి రావడంతో, ఎక్కడ జూచినా భయోత్పాతం పెచ్చు పెరుగు తున్నది. ఇప్పుడు నేను నా వినూత్న పరిశోధనను వెల్లడిస్తే ఇది అందరి అందుబాటులోకి వస్తుంది. ప్రభుత్వాలు వాటిని అదు పులో పెట్టలేవు. ఒక వేళ ప్రతి నేరస్థుడు, ప్రతి అల్పుడూ తన పరిశోధనాగారంలో ఈ మారణాయుధాన్ని నిర్మించడం జరిగితే ఏమి తటస్థించగలదో వారు ఊహించగలరు. మానవాళి కంతకూ అతి ప్రళయాంతకం కాదా? నా పరిశోధనాభారంతో నేను కృంగి పోయాను. చాలా కాలం నేను వెనుకాడాను. నా మనస్సును, నా హేతువును సంతృప్తిపరచగల నిర్ణయానికి నేను రాలేకపోయాను.

ప్రకృతి రహస్యాలను అన్వేషించాలనే ఆకాంక్షతో, యువ్వ నోద్రేకంలో నేను రూపొందించిన సౌధాంతం నా కన్నులెదుటే ఎందుకూ కొరగాకుండా పోయింది. విజ్ఞాన ప్రగతి అంటే నైతిక ప్రగతి అనే అర్థం రాదు. మానవ ప్రకృతిని మార్చడానికి విజ్ఞానం, మేధాసంపత్తి చాలదు. అవి దాని ముందు శక్తిహీనమై పోగలవు. మనిషిలోగల లోభత్వం, కాంక్ష ఇలాగే ఉండిపోతే, రాతియుగం నాటి మనిషిలాగే నేటి మానవుడు గూడా జీవితాన్ని కొనసా గిస్తే, మానవాళికి ముక్తి అనేది ఉండబోదు. త్వరలో పరిపూర్ణ మయిన నైతికమార్పు రానిపక్షంలో మానవాళి తన చేతులలోగల మారణాత్మకశక్తితో తన్ను తాను సర్వనాశనం చేసుకొనడం తథ్యం.

నా రెండవ సిద్ధాంతం సంగతి చూద్దాం. నే నెప్పటికైనా మేలిక విజ్ఞానాన్ని పొందగలనా? ఈ ప్రకృతి రహస్యాన్ని కొద్ది గానైనా గ్రహించానని నేను రూఢిగా చెప్పగలనా? ప్రకృతి నియ మాలను గ్రహించడంలోగల ఆనందాన్ని నేను ఎప్పటికయినా అనుభవించగలనా? ఇక్కడే నా ఆదర్శం విఫలమైనది. సిద్ధాంతాలు కేవలం సంకేతాలు. ప్రకృతిలో కార్యకలాపాలు అన్నీ ఎలా సాగు తాయో అవి వివరిస్తాయి. కాని అవెందుకు ఉన్నాయో తెలుప

లేవు. అవి మనల్ని సత్యానికి చేరువగా తీసుకొని వెళ్ళలేవు. వివిధ గుణాలలో ఆ సత్యాన్ని వీక్షింపజేయడానికి అవి సహాయం చేయగలవు గాని పూర్తిగా దానిని కనుగొనడానికి, దానిని అవగాహన చేసుకొనడానికి ఏమాత్రం ఉపయోగపడవు.

'అనంతత్వపు' తీరంలో నేను ఒక పాదచిహ్నాన్ని కనుగొన్నాను. ఆ ఇసుకతిన్నెలపై గల గురుతుల్ని బట్టి మొత్తం స్వరూపాన్ని పునర్నిర్మించడానికి ప్రయత్నించాను. నేను విజయాన్ని సాధించాను; ఆ స్వరూపం నాదేనని గ్రహించాను. ఇప్పుడు ఇక్కడ నేను, మనమంతా ఉన్నాం.... ప్రస్తుతం నాకు మార్గాంతరమేమీ కనిపించలేదు. ప్రపంచాన్ని గూర్చి నిర్దిష్టమయిన, నిర్ధారణతో కూడిన అభిప్రాయాలు ఏవీ నాకు లేవు.... అన్నీ సందేహాలే, అన్నీ అపనమ్మకాలే! కాని ఇన్ని చీకట్లలో ఒక ఆశాజ్యోతి వెలుగకపోలేదు.... మానవాళిని పీడించే దుర్విధి విలాసం ఎప్పుడూ ఇలాగే కొనసాగదు.

కళాకారుడు

చాలా గౌరవప్రదమయిన బూర్జువా కుటుంబంలో జన్మించాను. కళను వృత్తిగా గాక ఒక కాలక్షేపంగా ఉపయోగించే కుటుంబం మాది. కళాకారులు శ్రద్ధాసక్తులు లేని వారు; వ్యభిచారులు, ధనముపై గౌరవము లేనివారు అని భావించేవారు. బహుశా వారికి వ్యతిరేకంగా ఒక చిత్రకారుణ్ణి అవుదామని నాకు ఒక బలీయమైన కోరిక వుండేది. నా సర్వచేతనా ప్రవృత్తులు నా నేత్రాలలో కేంద్రీకృతమై ఉన్నాయి. మాటలతో కన్నా ఒక బొమ్మ గీసి నన్ను నేను తేలికగా వ్యక్తం చేసుకోగలను. గ్రంథపఠనం ద్వారా గాకుండా, చిత్రాలను అవలోకిస్తూ నేను ఎంతో అధికంగా, బాగా నేర్చుకొన్నాను. నేను ఒకసారి చూసిన – ప్రకృతి దృశ్యాలు, మానవవదనాలు, కళాచిత్రాలను – జీవితంలో ఎప్పుడూ మరిచిపోను.

13 ఏళ్ల ప్రాయంలో, చిత్రలేఖనంలో అనేక రకాలను కృషి చేసి ఆ కళను సంపూర్ణంగా నేర్చుకొన్నాను. అప్పుడు నేను నా స్నేహితుల కొరకు, నా తల్లిదండ్రుల పరిచయస్తుల కొరకు బొమ్మలు గీసి డబ్బు తీసుకొంటూ వుండేవాడిని. నేను డబ్బు సంపాదించడం ప్రారంభించినప్పటి నుండి, నన్ను గూర్చి నా కుటుంబం తీవ్రంగా యోచించసాగింది. ఈ చిత్రకళను గూర్చి పూర్తిగా పరిశోధించాలని ఈ అవకాశాన్ని వినియోగించుకొనడా నికి ఉపక్రమించాను. నాకు తగిన వయస్సు రాగానే ఒక లలిత కళల పాఠశాలలో చేరాను. కొలది కాలంలోనే కళల పోటీలో ప్రప్రథముణ్ణిగా వచ్చాను. ఆస్థానకళాకారులలో కెల్లా నేను చిన్న వాడిని. దీనితో ఇటలీదేశపు కళతో పరిచయం చేసుకొనడానికి నాకు మంచి అవకాశం లభించింది. అటు తరువాత నేను ఉప కారవేతనాలను సంపాదించి స్పెయిన్, బెల్జియం, హాలెండ్, ఇంగ్లండు మున్నగు దేశాలు పర్యటించాను. ఒక యుగానికి గాని, ఒక కళావర్గానికి గాని చెందిన వ్యక్తి నవుదామని నే నెప్పుడూ కోరుకొనలేదు. అన్ని దేశాల కళలను, అన్ని రూపాలలోగల ప్రాక్పశ్చిమ దేశాల కళలను నేర్చుకొన్నాను.

అదే సమయంలో నేను స్వంతంగా చిత్రాలను గీశాను. ఒక కొత్తపంథా తొక్కాలని, ఒక కొంగ్రొత్త సూత్రావళిని కను గొనడానికి యత్నించాను. ఘనవిజయాన్ని, యెంతో కీర్తిని సంపాదించాను. కళాప్రదర్శనలలో ప్రథమ బహుకృతులను అందు కొన్నాను. నా కళాఖండాలను ప్రపంచంలోని ప్రధానమైన మ్యూజి యములు కొన్నాయి. నన్ను అదృష్టదేవత కనికరించింది. నా కెన్నో బిరుదులు ఇచ్చారు. ఎన్నో సన్మానాలు జరిగాయి. నేను గొప్ప మేధావి నన్నారు! కాని నన్ను ఏదో అసంతృప్తి వెన్నా డేది. 'మేధావి' అనే పదానికి నేను చెప్పుకునే అర్థం వేరు. ఒక కొత్తరకం కళాఖండంయొక్క వాస్తవమైన, ఉదాత్తమయిన, ఉన్న తమైన, స్వచ్ఛందమైన సౌందర్య, రమ్యతలను వ్యక్తం చేస్తూ ఒక కళాకారుడు నూతన విధానాలతో, సాధనాలతో, వినూత్న చిత్రాలను సృష్టించాలి. మానవునికి, మానవతకు పరిమితమైనా

నని నేను అనుకున్నంత కాలం భౌతికప్రకృతి రూపాలనుండి నేను పూర్తిగా దూరమవలేను. నాలో ఆ మహత్తర ఆశయం ఉంది. కాని అందుకు అవసరమయిన విజ్ఞానం, అంతర్దృష్టి లోపించింది.

మనమందరం ఇప్పుడు మృత్యుపరిష్వంగంలో జేరబో తున్నాం. నేను ఆశించిన దానిని ఏదీ నేను చిత్రించలేకపోయాను. నేను సృజించదలచుకొన్న వాటిని సృజించలేకపోయాను. నేను కీర్తిప్రతిష్ఠలను ఎంతగా సంపాదించినా, నేను ఘోరపరాజయాన్ని పొందానేమోనని అనిపిస్తోంది.

పారిశ్రామికవేత్త

నా తండ్రి ఒక కంసాలి. లోహపు పనిపట్ల నాకు అభిరుచి ఆయన వలనే కలిగింది. ఒక పనిని చక్కగా నిర్వహించడం, ప్రారంభిం చిన ఏ కార్యక్రమానికైనా ఏ విధంగా పూర్తిగా అంకితం అయి పోవాలో ఆయన వద్దనుండే నేర్చుకొన్నాను. ఏ పనినైనా బాగా చేయడం, ఇతరులకన్నా, ఇంతకుముందు ఎవరూ చేయనంత బాగా పనిచేయడం ఆయన నాకు నేర్పారు. ఒక పని వలన మనం ఏం లాభం పొందుతాం అన్నది మాత్రం ప్రధాన ధ్యేయం కాకూ డదని ఆయన అంటూ ఉండేవారు. కాని ఆయన తన వృత్తి పట్ల ఎంతో గర్వభావంతో ఉండకుండా లేని క్షణం లేదు. అందరూ ప్రశంసిస్తూ వుంటే, ఆయన ఎంతో ఆనందం పొందేవారు.

శకటం ఉత్పత్తి చేయడానికి మళ్ళీ ఇటువంటి అవకాశం రాదు. ఉత్పత్తి తగ్గించడం అంటే ధరలో పెరుగదలే. అందు వలన, అసలు సమస్య మేము విక్రయించే వస్తువులను ఉత్పత్తి చేయడంలోకాక, మేము ఉత్పత్తి చేసిన వస్తువులను విక్రయించ డంలోనే ఉందని ఒక నిర్ణయానికి వచ్చాను. 6 నెలల్లో నేను ఈ విషయాన్ని నిరూపించాను.

అప్పటి నుండి మా సంస్థ దానంతట అదే అభివృద్ధి చెందింది. నా సహచరులకు చాలా ప్రధానమైన నిర్ణయాలను వదలి

వేయవలసి వచ్చింది. కొన్ని నిర్దేశిక సూత్రాలను రూపొందించ డానికి మాత్రం నేను ఒక మూల ఏకాంతంగా గడపవలసివచ్చేది. ఆ సూత్రాలలో కొన్ని – సరకు నాణ్యత తగ్గకుండా అతితక్కువ ధరకు ఉత్పత్తి చేయడం, జీతాలు తగ్గించకుండా, తక్కువ ధర లకు కొత్తగా కొనేవారికి అమ్మడం.

మొట్టమొదటి సారిగా నేను అక్కడా అక్కడా గల విభా గాలతో మోటారుకారును నిర్మించాను. అంతకు ముందు కనీవినీ ఎరుగని విధంగా ఆ కారును ఉపయోగించే పద్ధతి కనుగొన్నాను. నా జీవితంలో నాకు నిస్సందేహంగా ఈ కారును కనుగొన్నా నన్న ఆనందం నన్ను ఉక్కిబిక్కిరి చేసింది. కాలం గడిచిన కొలది, కొంతమంది నా పట్ల ఈర్ష్య, క్రోధం వెలిబుచ్చారు. మరి కొంతమంది ఈ యంత్రానికి భవిష్యత్తు లేదని అన్నారు. కొద్ది మంది ప్రగతికాముకులు నాకు ధనసహాయం చేశారు. దానితో నేను ఒక చిన్న యంత్రాగారాన్ని స్థాపించాను. అందులో ఇద్దరు పనివారిని నియమించాను. కొద్దిగా ఉక్కును కొన్నాను.

నేను ధనాన్ని సంపాదించాలనే ఆపేక్షతో మాత్రం ఈ పనికి పూనుకొనలేదు. ప్రస్తుతము ఉన్న యంత్రవాహనాలకన్నా సుల భంగా నడిపించడానికి వీలయినవి, చౌకధరకు లభ్యమయ్యేవి తయారుచేయాలని తలచేవాడిని. అదే నాకు ఎంతో తృప్తి నిచ్చేది. వాహనాలు చౌకధరలకు లభ్యమయితే, ఎంతో మంది ప్రజలు వాటిని కొనగల్గుతారు.

అత్యధిక సంఖ్యలో నేను మొదట ఉత్పత్తి చేసిన నమూనా వాహనం నా కింకా గుర్తు ఉంది. చక్రాలపై అది ఎత్తుగా ఉంటుంది. దీనివలన అది గ్రామీణ ప్రాంతాల బాటలలో కూడ పయనించ గలుగుతుంది. దానిని చాలా పటిష్టంగా, గట్టిగా ఉండేటట్లు నిర్మించాము. కాని కొంతమంది కిది నచ్చలేదు. ధన వంతుల ఆహ్లాదం కొరకే అవి నిర్మిస్తున్నారని వారు తలచారు. ఈ నమూనా వాహనాన్ని నడపడం చాలా తేలిక. ఏ విధమైన శ్రమ అక్కరలేదు. దీని సహాయంతో అనుభవం లేనివారు కూడా

నడపడానికి వీలయ్యే ఒక మంచి వాహనాన్ని నిర్మించడానికి అవకాశం ఉన్నదని ఒక ఆశాభావం కలిగింది.

అయినా మొదటి ప్రపంచయుద్ధానికి ముందు ఈ వాహానానికి ఎటువంటి ప్రచారం లభించలేదు. ఆ కాలంలో ప్రేలుడు వస్తువుల రవాణా, క్షతగాత్రుల వాహానాలు త్వరితగతిని కదల డానికి యంత్రసహాయం అవసర మొచ్చేది. ఈ కారణంగా నా కర్మాగారం కార్యకలాపాలు చురుకుగా సాగడం ప్రారంభ మయ్యాయి. సైనికులు ఎక్కువ సరకు కావాలని కోరడంతో నాకు నా యంత్రపరికరాలను అభివృద్ధి చేసుకొనడానికి, కొత్త యంత్రాలను చక్కగా నిర్మించడానికి అవకాశం లభించింది.

యుద్ధానంతరం నా సంస్థ చక్కగా పనిచేయడం ప్రారంభించింది. పౌర అవసరాలకు అది మించినట్లు కనిపించింది. నా సహాయకులు భయపడ్డారు. ఉత్పత్తిక్రమాన్ని తగ్గించాలని, సిబ్బందిలో కొంతమందిని తొలగించాలని, అప్పుడు కొంతకాలం వ్యాపారం ఎలా సాగుతుందో చూడాలని వారు నాకు సలహా ఇస్తూ బలవంతం చేయడం మొదలుపెట్టారు. వారి యోచన బాగానే వున్నది. కాని ప్రపంచంలోకెల్లా చౌక అయిన మోటారు వ్యాపారస్థాయి దెబ్బతినకుండా, లాభాలను ఒక కనిష్ఠ ప్రమాణానికి తీసుకొని రావడమే గాక, ఉత్పత్తి ధరపై పన్ను లేకుండా, అనుకొన్న దాని ప్రకారం ఉత్పత్తి చేయడానికి ప్రచారం చేయడం – ఇలాంటివి కొన్ని సూత్రాలను నేను రూపొందించాను.

నా వ్యాపారం బాగా ప్రగతి సాధించింది. నేను ఏది తలచుకొంటే అందులో నాకు విజయం చేకూరేది. దీనితో నా గూర్చి పలువురు కథలుగా చెప్పుకొనేవారు. ఒక నవజీవన విధానాన్ని సృజించిన అవతారమూర్తినని, గొప్ప ఆదర్శపురుషుడనని అందరూ తలచేవారు. దీనితో నేను ఏ మాట పైకి అన్నా, ఏ పని తలపెట్టినా ప్రజలు దానిని ఒక గొప్ప ఆశయంగా ఎంచి, అదొక కొత్త సందేశంగా భావించేవారు.

దీని వెనుక ఉన్న సత్యమేమిటి? అభివృద్ధి చెందడమే నా వ్యాపారానికి జీవనాడి అయింది. ఏ క్షణంలో అది ఆగినా నా


వ్యాపారానికి పెద్ద ప్రమాదమే ఏర్పడుతుంది. నా వ్యాపారం ఎంత త్వరితగతిని పెరిగిందంటే, అది ఏ క్షణాన్నైనా పగిలే బుడగ మాదిరిగా వుందిగాని, సఫలతవైపు కదిలే ఒక సజీవసంస్థలా లేదు. ఈ విషయంలో నేను నిస్సహాయుడ్ని. మొత్తం వ్యాపారం ఏ క్షణాన దెబ్బతిన్నా దానివలన కార్మికులకు తీవ్రవేదన కలుగుతుంది.

నేను మానవాళికొరకు సాధించిన దేమిటి? వారు మరింత తేలికగా ప్రయాణం చేయగల్గుతున్నారు. వారిలో పరస్పరావగాహన పెంపొందిందా? నన్ను అనుసరించి జీవితాన్ని మరింత సుఖమయం, తేలిక చేయడానికి అవసరమైన వాటిని గరిష్ట ప్రమాణంలో ఉత్పత్తి చేసి ప్రజలకు అందించడం జరిగింది. దీని వలన కొత్త అవసరాలు, లాభాలు కొరకు తీరని కాంక్షలు ఉత్పన్నమైనాయి కదా? నా కార్మికులకు చాలా ఎక్కువ జీతాలు ఇచ్చాను. కాని దానివలన ఇంకా ఎక్కువ సంపాదించాలనే కోరిక వారికి గలిగించడంలో మాత్రం నేను విజయాన్ని పొందాను.


వారికి అసంతృప్తి, వేదన కలిగాయని గ్రహించాను. నేను ఊహించింది జరగలేదు. వారి జీవనప్రమాణం పెంచటం వలన, వారి సంక్షేమం విషయమై హామీ ఇవ్వడం వలన వారిలో పూర్ణ మానవత వెల్లివిరియ లేదు. మానవ వేదన పూర్వం ఎలా వున్నదో ఇప్పుడూ అలానే ఉన్నది. ఏమాత్రం తగ్గడం జరగలేదు. నేను ఉపయోగించిన పద్ధతుల వలన ఆవేదనను నిర్మూలించ లేకపోయాను. ఎక్కడో ఏదో పొరపాటు జరిగింది. నేను దానిని గ్రహించలేక పోయాను. దానిని నేను నా చర్యలతో సరిదిద్దుకోలేక పోయాను. ఇంకా కనుగొనవలసిన పరమ సత్యమేదో ఉన్నది. దానిని కనుగొనకపోతే మన కృషి అంతా వ్యర్థం.

క్రీడాకారుడు

నేను గొప్ప వస్తాదుల కుటుంబంలో జన్మించాను. నా తల్లిదండ్రులు అన్ని రకాల క్రీడలు, వ్యాయామ క్రీడలలో నిపుణులు. నా తండ్రి ఒక అద్భుత వ్యక్తి. ఆయనకి చిన్నతనంలోనే గొప్ప ఆటగాడని పేరు వచ్చింది. నేను గొప్ప వస్తాదు కావాలని వారు నన్ను జాగ్రత్తగా పెంచారు. చదువుకొనే రోజులలో నాకు బాక్సింగ్ పోటీలో విజయం లభించింది. తర్వాత బరువు లెత్తడం, దేహ ధారుఢ్యం, ఈత, టెన్నిస్ మొదలగు పోటీలలో నేను విజేతనయ్యాను. నాకిప్పుడు 18 ఏళ్ళ వయస్సు. నేనిప్పుడు జాతీయ ఒలింపిక్ పోటీలో పాల్గొనాలని కోరిక వుంది. జాతీయ పోటిలో 'డెకాథ్లన్' (Decathlon) అనే ఒక ప్రత్యేక కార్యక్రమాన్ని నేను ఎన్నుకున్నాను. అన్నింటిలో ఇది అతి కష్టమైనది. ఇందులో నేను విజయం సాధించాను. తర్వాత ప్రపంచ ఒలింపిక్ ఆటలలో నా దేశానికి ప్రాతినిధ్యం వహించవలసిందిగా నన్ను కోరారు. ఈ ఆటలలో కూడా నేను విజయం సాధించాను. ఇంతకు ముందు కన్నా ఇంకా ఎంతో పరిపూర్ణత్వంతో ఈ కార్యక్రమంలో ఘన విజయాన్ని సాధించాను, కాని ఏదో అనూహ్యామైనది, విచిత్రమైనది జరిగింది. నేను విజయశిఖరాలలో విహరిస్తున్నా, నాలో ఏదో ఆవేదన, విచారం, ఏదో తెలియరాని శూన్యత్వం నన్ను పరిహాసించడం ప్రారంభించాయి. "ఏదో నువ్వు పోగొట్టుకున్నావు. నీలో ఏదో లోపం ఉంది. ఇంకా ఏదో కనుగొనవలసినది ఉన్నది. నీలో నిలుపుకోవలసినది మరేదో వున్నది" అని ఎవరో నాతో చెప్తున్నట్లనిపించింది. నా శారీరక శక్తిని, భౌతిక నైపుణ్యం దేనికో వెచ్చించాలి. అదేమిటో నాకు ఎంత ఆలోచించినా తెలియరావడం లేదు. అటు తర్వాత నేను ఎన్నో క్రీడలలో పాల్గొన్నాను. కాని ప్రతి విషయంలోను ఈ భావం నన్ను వెంటాడుతూ వచ్చింది. రాను రాను నాకు వస్తున్న కీర్తిని గమనించి కొంతమంది నా చుట్టూ చేరారు. వారికి వ్యాయామశిక్షణ ఇవ్వడం ఆరంభించాను. దేశవ్యాప్తంగా నేను శిక్షణకేంద్రాలు తెరిచి వ్యాయమవిద్యలో




Two scenes from the performance of "The Great Secret"
by members of the Ashram on Dec. 1, 1954





A scene from the play staged for the second time on Dec. 1, 1969

Below: The Unknown Man



చాలామందిని సుశిక్షితుల్ని గావించాను. అతి త్వరలో నా పేరు ప్రపంచం నలుమూలలకు వ్యాపించింది. నేనొక గొప్ప వ్యాయామ విద్యావేత్తనని, వ్యవస్థాపకుడనని, అంతర్జాతీయరంగంలో వ్యాయా మవిద్యలో సాధికార వ్యక్తినని పేరుపొందాను. నన్ను సూపర్‌మేన్ అని, మానవాతీత శక్తిస్వరూపుడ్నని పిలిచేవారు. కాని నేనంతటి వాడని కాను. నేనింకా ప్రకృతికి బానిసను. నాలో లోపాలు, అజ్ఞానం వున్నవి.

ఇప్పుడు మృత్యుముఖంలో ఉన్నాను. విపరీతమైన బాధ, ఆకలి, పిపాస గూర్చి ఆలోచనలు నన్ను కదిలించలేవు. కాని నా సమస్యల్ని నా జీవితకాలంలో పరిష్కరించ లేకపోయాను. మనిషి కలలుగనే కీర్తిప్రతిష్టలు, గౌరవమర్యాదలు, సంపదలు, అపూర్వ విజయపరంపరలు, అన్నీ నాకు లభించాయి. కాని నాకు సంతృప్తి లేదు. కారణం – "ఈ జీవిత విజయసరళిలో నేను ఏదో పోగొట్టుకొన్నాను. శారీరకంగా నాకు సిద్ధించిన శక్తి, సామర్థ్యం, పరిపూర్ణత్వాలను ఏ అత్యుత్కృష్ట ప్రయోజనం కొరకు, ఏ మహోదాత్త ధ్యేయం సాధించడం కొరకు వినియోగించాలి? దేశ వ్యాప్తంగా నాకు లభించిన అవకాశాన్ని, అంతర్జాతీయ స్థాయిలో నాకు వున్న పలుకుబడిని ఏ ప్రయోజనం కొరకు అత్యుత్తమ రీతిని వినియోగించాలి?"–

అజ్ఞాతవ్యక్తి

(పడవలో నున్న అజ్ఞాతవ్యక్తి నెమ్మదిగా, ప్రశాంతంగా, సుస్ప ష్టంగా మాట్లాడడం ప్రారంభించాడు. ఒక సుప్రశాంతమయిన వినిర్మల శక్తి ఆయన వాక్కులో నిబిడీకృతమైనది.)

మీరంతా ఏమి తెలుసుకోవాలనుకుంటున్నారో నేను చెప్పగలను.

మీ మీ కార్యకలాపాలు స్వభావాలతో ఎన్నుకొన్న రంగా లలో విభిన్నమైనప్పటికీ మీ కందరికీ ఒకే అనుభవం కలిగింది. మీరు చేసిన కృషికి మణిమకుటంలా విజయం లభించినా, మీ

రంతా ఒకే నిర్ణయానికి వచ్చారు. భౌతికజగత్తు బాహ్యస్వరూపం చూస్తూ అంతర్భూతమైన మహాసత్యాన్ని తెలుసుకోలేక, మీరంతా బాహ్యచేతనావస్థలో జీవించారు. సర్వమానవాళిలో మేధావుల వర్గానికి మీరు ప్రతినిధులు. మనిషి జయించడానికి సాధ్యమైన వాటినెల్లా మీరు సాధించారు. మానవ ప్రపంచ శిఖరానికి మీరు అధిగమించారు.

కాని ఈ విజయశిఖరాలలో నిలబడిన మీకు ఎదురుగా ఒక అఖాతం వున్నది. అది దాటి మీరు వెళ్ళలేకపోతున్నారు. మీలో ఎవ్వరికీ సంతృప్తి లేదు. ఏమి చేయాలో తెలియదు. మీ సత్సంకల్పం, జీవితంవల్ల ఉత్పన్నమైన ద్వంద్వసమస్యను ఎలా పరిష్కరించాలో మీకు తెలియదు. ఈ సమస్యలో రెండు అంశాలు ఉన్నాయి. ఒకటి వ్యష్టి, మరొకటి సమిష్టి. తనకి, అందరికీ మేలు చేకూర్చుకొనడం ఎలా? ఈ చిక్కు సమస్యకు పరిష్కారం మీవద్ద లేదు. ఎంత ఉత్కృష్టమైనదైనా మానవ మేధస్సు దీనిని పరిష్కరించ లేదు. ఇది సాధించాలంటే మానవుడు ఒక కొత్త ఉన్నతమైన చైతన్యం, 'సత్యచేతన' లో జన్మించాలి.

ఈ తాత్కాలిక భ్రాంతుల వెనుక ఒక పరమసత్యం ఉన్నది. ఈ పరస్పర సంఘర్షణా సంయుత అచేతనా అనేకత్వం వెనుక ఏకైక ప్రశాంత చేతన వున్నది. ఈ అనృత కల్పనల వెనుక ఒక నిర్మల అమృత ప్రకాశ సత్యము ఉన్నది. ఈ అజ్ఞానం వెనుక ఒక మహోజ్వల విజ్ఞానం దాగి వున్నది.

ఈ సత్యం అతిసమీపంలో ఉన్నది. మీలోను విశ్వకేంద్రంలోనూ ఉన్నది. దానిని కనుగొని, ఆవిష్కరించండి. అప్పుడు మీ సమస్యలు పరిష్కరించ గల్గుతారు. మీ కష్టాలు అధిగమించగల్గుతారు.

మతాలు దీనిని బోధిస్తున్నాయని మీరు అనవచ్చు. ఈ సత్యాన్నే ఆ మతాలు భగవంతుడని అన్నాయి. ఔను, కాని మీ సమస్యకు, మీ జీవిత ప్రశ్నకు అవి సంతృప్తికరమైన సమాధానం ఇవ్వలేకపోయాయి. కష్టాలు అనుభవించే మానవాళిని పీడించే దురదృష్టాలను, దుర్విధిని పారద్రోలడానికి జరిపిన ప్రయ

త్నంలో ఈ మతాలు ఘోర పరాజయం చెందాయి. రాను రాను ఈ మతాలలోని సత్యాలు అంతర్హితమైనాయి.

మానవాళి అనుభవిస్తున్న వేదనలకు పరిష్కార మార్గం ఎక్కడో లేదు. ఈ ప్రపంచంలోనే ఉంది. అది గుప్తంగా వుంది. దానిని వెలికి తీసుకొని రావాలి. ఎలా పరిశీలించాలో మనకు తెలిస్తే, ప్రకృతే ఈ పరిష్కారాన్ని చూపుతుంది. ప్రకృతి తత్త్వం ఉన్నత సోపానాలకు పరిణామం ద్వారా అధిగమించడం అని మనకు తెలుసు. ఒక రూపం నుండి మరొక రూపాన్ని అది రూపొందిస్తూ పురోగమిస్తున్నది. విశ్వచైతన్యాన్ని అంతకంతకు అభివ్యక్తం చేయగల రూపాల్ని అది తయారుచేస్తున్నది. పృథివి పరిణామక్రమంలో మానవుడు తుది సోపానం కాదని నిదర్శనాలు కనిపిస్తున్నాయి. ఈ మానవుల పిమ్మట కొత్త పరిణామ రూపాలు ఆవిర్భవించనున్నాయి. మనిషికి, కోతికీ ఎంత తేడా వున్నదో, ఆ కొత్త జీవులకు మానవులకు అంత తేడా వుంటుంది. వర్తమాన మానవ చైతన్యం స్థానే ఒక నూతన చేతన – ఇది మానసిక చైతన్యం కాదు – మానసాతీత దివ్యచేతనత్వం – చోటు చేసుకొంటుంది. ఈ చైతన్యం నుండి దివ్యజీవనం సాగించే 'మానవాతీత విజ్ఞాన స్వరూపులు' జన్మిస్తారు.

భూమిపై ఈ సత్యం ఆవిష్కరించడానికి కాలం ఆసన్నమైనది. అందువల్లనే మీలో ఈ అసంతృప్తి, శూన్యత్వం వ్యాపించింది. మీరు అనుకొన్నది జీవితం నుండి పొందలేకపోయారు. చైతన్యంలో సంపూర్ణ, సమగ్ర పరివర్తనయే ఈ ప్రపంచాన్ని అజ్ఞాన అంధకారాన్నుండి సంరక్షించగలదు. ఈ చైతన్యంలో మార్పు, అభినవ, మహోన్నత సత్యచైతన్యం అభివ్యక్తం అవడం తప్పనిసరి. మానవాళి జీవితధ్యేయం, గమ్యం అదే. మన బ్రతుకులకు అర్థం అదే. ఈ ప్రపంచానికి ఆది, తుది అయిన మహాసత్యం వైపు ప్రకృతి మలుపు తిరుగుతున్నది. మనలో, లోతులలో దాగివున్న సత్య, శివ, సౌందర్యాలను, చిచ్ఛక్తి పరిపూర్ణత్వాలను మనం అభివ్యక్తం చేయాలి. అప్పుడే జీవితం మహత్తర దివ్య ఆనందమై వికసిస్తుంది.

రచయిత

మీ వాక్కులలో మంత్రముగ్ధం చేసే మహాశక్తి వున్నది. ఇప్పుడు మా ఎదుట మరో ప్రపంచం తలుపులు తెరువబడినట్లు అనిపిస్తున్నది. హృదయంలో ఒక కొత్త ఆశాకిరణం మెరుస్తున్నది. కాని ఇందుకు కాలవ్యవధి కావాలి. ఇప్పుడు మృత్యుముఖంలో వున్నాం. ఎలా? ఆలస్యం అయిపోయింది. ఆ సత్యాన్ని తెలుసుకోలేము.

అజ్ఞాత వ్యక్తి

లేదు. ఆలస్యం కాలేదు. ఒక మహిత ఆశయ ఫలసిద్ధికై మనం అంతా సంకల్పిద్దాం. భగవత్కరుణకై మనం ప్రార్థిద్దాం. విశ్వాసం గనుక వుంటే మహాద్భుతాలు జరుగుతాయి. మనం చేయదల్చుకొన్న పనిలో మనం పాల్గొనదలిస్తే, తప్పకుండా మనల్ని రక్షించడానికి ఆ దైవం పూనుకొంటుంది. భూమిని మార్చివేయగల ఈ నవచైతన్యం, ఈ నవసత్యం, నీ నవసౌందర్యం అవతరించాలని మనం అంతా చిత్తశుద్ధితో, వినిర్మల హృదయాలతో ప్రార్థన చేద్దాం.

(అంతా మౌనంగా, నిశ్శబ్దంగా వుండి మనస్సులు కేంద్రీకరింప చేస్తారు. అజ్ఞాతవ్యక్తి ఇలా ప్రార్థిస్తాడు.)

"ఓ మహాసత్యమా! మా కిప్పుడు ద్యోతకమైన అద్భుత రహస్యాన్ని అభివ్యక్తం చేయడానికి అవకాశం కల్పించు."

(అంతా ఈ ప్రార్థన చేస్తారు. హఠాత్తుగా కళాకారుని కంఠం వినిపిస్తుంది.)

"అటు చూడండి."

(దూరంగా ఒక పడవ కనిపిస్తుంది. అది నెమ్మదిగా వారి వైపే వస్తుంది.)

“మన ప్రార్థనను దైవం ఆలకించింది.” అని అజ్ఞాతవ్యక్తి అంటాడు.

“వారు మనల్ని చూశారు. వారు ఇటే వస్తున్నారు” అని అంటాడు శాస్త్రజ్ఞుడు

అజ్ఞాతవ్యక్తి నెమ్మదిగా అంటాడు:


“మానవాళికి మోక్షం లభించింది. విశ్వకళ్యాణానికి నవ జీవనం ఆరంభమైనది.”

(తెర)

అనువాదం: కె. యజ్ఞన్న

(‘*పరమ రహస్యం*’ నుండి)

(*CWM* Vol. 12, pp. 477-501)



ఆరోహణలోని మూడు స్థాయిలు

'సర్వధర్మాన్ పరిత్యజ్య మామేకం శరణం వ్రజ' అనే సూక్తికి అర్థం ఏమిటో మనం తెలుసుకోవాలి. మన ప్రథమావతారము కోరికలు ప్రధానమైన భౌతికధర్మానికి కట్టుబడి ఉండటం. ఆధ్యాత్మికంగా ఉన్నతమైన చైత్యపర్వము (psychicisation) మధ్య దశ. అది చాలా అద్భుతమైనదే. కాని మనకు అది కూడ చాలదు. ఆ దశను చేరినప్పుడు అంతకంటె ఘనమైన అతిమానస జ్యోతితో మన శరీరాన్ని పునీతము చేసి పరివర్తనము సాధించాలి.

— *సంపాదకుడు*


దైవము పదార్థ జగత్తులో మొదట అజ్ఞానము ద్వారా అభివ్యక్తమై, తర్వాత దివ్యజ్ఞాన కాంతులతో వికసించినప్పుడు మనకు భగవద్గీతలోని 'సర్వ ధర్మాన్ పరిత్యజ్య మామేకం శరణం వ్రజ' సర్వధర్మములను, నియమనిబంధనల నన్నింటిని వదిలిపెట్టి నా యందే శరణు పొందుము అనే చరమ సందేశమును మనం చక్కగా అర్థం చేసుకోగలం. ఎందుకంటే ఈ నియమనిబంధనలన్నీ అహంకారము భౌతికపదార్థము నుండి బయలుదేరి దైవమును జేరు ప్రయత్నములో అవసరమైన తాత్కాలిక నిబంధనలు మాత్రమే. ఇది ఒక మధ్యంతర స్థాయి మాత్రమే. ప్రాణిక భౌతికములతోను, కొండొకతరి దివ్యకాంతుల ఉద్దీపనము చెందిన మానసిక స్తరములతోను తృప్తి చెందిన మానవుని స్థాయికి ఇది సరిపోవచ్చునేమో గాని, దీని కావల వున్న అతిమానస మహాచైతన్యములో ఈ తాత్కాలిక ఆలంబనముల అవసర ముండదు. (But beyond is the unwalled wideness of a supramental infinite consciousness and there all temporary structures cease)

ఇక మన మీ మనస్సును నమ్ముకుంటే లాభం లేదు. దానిని దూరంగా వదిలేసి సర్వభూతాత్మకమూ, సమస్త జీవ కోటికి నేస్తమూ అయిన ఆ దైవమును నమ్మి ఆయన మీదనే భారము వేసి, ఆయన చేతుల్లోకి మనలను సంపూర్ణంగా సమర్పించుకుంటే గాని ఆయన దివ్యసామ్రాజ్యం లోకి మనం ప్రవే

శించలేము. మనం చేయవలసిందల్లా ఒక్కటే – ఏమాత్రం జంకు గొంకుగాని, భయభ్రాంతులుగాని లేకుండా అనంతమైన ఆ మహా సాగరంలోకి అమాంతంగా దుమకవలసిందే! అప్పుడు నువ్వు సర్వధర్మములకు అతీతమైన స్థాయిలో స్వేచ్ఛగా ఓలలాడెదవు! వ్యక్తి కతీతంగా, సమిష్టి కతీతంగా, విశ్వానికి కూడ అతీతమైన ఒకానొక దివ్యస్వేచ్ఛ, దివ్యశక్తి, దివ్యప్రేరణలను నువ్వనుభవించెదవు!

ఆరోహణమునందు మూడు దశలు కలవు. అట్టడుగు దశ శారీరక జీవనమునకు, దాని అవసరములకు కామితములకు సంబంధించినది. మధ్యదశ మానసిక, హార్దిక, చైత్యభావ (psychic) నియతములైన ఉన్నత ప్రయోజనములు, ఆకాంక్షలు, అనుభూతులు, ఆశయములకు సంబంధించినది శిఖరస్థాయిలో మొదట గంభీరమైన చైత్యానుభూతులు, ఆధ్యాత్మికానుభూతులకు సంబంధించిన దశ. అటు పిమ్మట మన సకలాకాంక్షలు, సకలాన్వేషణలు తమ ఆంతర్యసిద్ధిని పొందగలిగే అతిమానస నిత్యచైతన్య సాక్షాత్కార దశ (supramental eternal consciousness).

శారీరక జీవనదశ యందు మొదట వైయక్తిక, సామూహిక కామితములు, అవసరములు, పిమ్మట ఆ వ్యక్తికి, సమూహామునకు గూడ మేలొనగూర్చు ప్రయోజనములు ప్రాధాన్యము వహించును. మానసిక జీవనము నందు పూర్ణసత్య వేషముతో చలామణి కాజూచెడి అర్థసత్యము లనదగు భావములను, వికాసదశ యందుండియూ యింకనూ అపరిపక్వములైన అంతఃస్ఫురణానుభూతులను అనుసరించి మనస్సుచే కల్పితములైన ఆదర్శములును ప్రాధాన్యము వహించును. మానసికజీవన ప్రాబల్యము హెచ్చి, శారీరకజీవన ప్రాబల్యము తగ్గినప్పుడెల్ల, మనోమయ పురుషుడగు మానవుడు వైయక్తిక జీవనమును తన ఆదర్శానుసారము తీర్చిదిద్దుటకు మనోమయ ప్రకృతి ప్రేరణను పొందినటుల భావించుచుండును. జటిలతరమైన సంఘజీవనము సైతము కడకు ఆ సూక్ష్మవిధానము ననుసరించునట్లుగా ప్రేరేపించబడును.



Intellectual, volitional, ethical, emotional, aesthetic and physical training and improvement are all so much to the good, but they are only in the end a constant movement in a circle without any last delivering and illumining aim, unless they arrive at a point when they can open themselves to the power and presence of the Spirit and admit its direct workings. This direct working effects a conversion of the whole being . . .

Sri Aurobindo

ఆధ్యాత్మిక జీవనమున, అనగా మనస్సుకంటె ఉచ్ఛతరమైన శక్తి యొకటి అభివ్యక్తమై ప్రకృతిని కైవస మొనర్చుకొనుట సంభవించినపుడు, ఈ సంకుచిత ప్రేరణలు వెనుకకు తగ్గి క్షీణగతి నొంది కడకు అంతరించిపోవును. మనస్సున కతీతమైన ఆత్మస్వరూపుడై, సర్వగత, సర్వాతీత తత్వమగు పరమపురుషుడే మనలో ప్రభువై దీపించును. మన ప్రకృతి ధర్మపు ఉచ్ఛతమ, విస్తృతతమ, పూర్ణతమాభివ్యక్తి కనుగుణముగా మన సుస్వరూప వికాస పారమ్యమును యథేచ్ఛగా రూపొందించవలసి యున్నది. కడకు ఆ ప్రకృతియే పూర్ణసత్యమున సుప్రతిష్ఠిత మగుచు, పూర్ణసత్యపు సహజ స్వాతంత్ర్యముతో మనలో వ్యవహరించ నేర్చును. ఆయ్యది విధేయమగునది నిత్యుడగు పరముని దివ్యశక్తికి మాత్రమే. ఇక పైన వ్యక్తి పొందదగినది వేరేమియు లేదు. నెరవేరవలసిన కామితమును ఏదియు నుండదు. నిత్యుడైన పరముని అక్షరస్వరూపమునందు, లేక విరాట్పురుష స్వరూపము నందు అత డంతర్భాగమైనాడు.

జీవితములో పరమాత్ముని ఖేలనను, అభివ్యక్తినీ కొనసాగించుటయు, ప్రపంచగతిని దాని దివ్యగమ్యము దెసకు నడిపించుకొని పోవుటయు, నివి దక్క కార్యాచరణ కాతనిని ప్రేరేపించునది ఇతర మేదియు నుండదు. మానసిక భావనలు, అభిప్రాయములు, కల్పనలు ఇక అతనివి కావు. ఏలయన, అతని మనస్సు నీరవస్థితిని పొందినది. ఇప్పుడది దివ్యజ్ఞానపు సత్యతేజః ప్రసారణకు వాహకము మాత్రమే. అతని ఆత్మవిస్తృతి యందు ఆదర్శముల సంకుచితికి అవకాశము లేదు. పరమ పురుషుని అనంత మహాసాగర తరంగము లతని యందంతటనూ లేచి పడుచు, అతని సకల ప్రవృత్తులనూ సదా ప్రేరేపించుచుండును.

మూలం: శ్రీఅరవిందులు
అనువాదం: డా॥ ఆర్.ఎల్.ఎన్. శాస్త్రి, కమలాకర
వేంకటరావు ('యోగసమన్వయము' నుండి)

(*SABCL* Vol. 20, pp. 197-98)

పనుల ఆవశ్యకత

ఆధ్యాత్మిక జీవితమనగా పుస్తకాలు చదవటం కాదు. ధ్యానము చేయటంతో కూడ సరిపోదు. సూక్ష్మరూపంలో నీకు కలిగిన అనుభూతులను స్థూలజీవితంలో కూడ వర్తింపచేయాలి. నిజమే కదా మరి. ముక్కు మూసుకొని జపం చేసినప్పుడు నీలో కొన్ని మెరుపులు మెరవవచ్చు. దాని వలన నీకు కొంచెం జ్ఞానం కలగ వచ్చు. కాని అది నీ బాహ్యాజీవితాన్ని ఏమాత్రం మార్చలేదు.

– సంపాదకుడు

నువ్వు ఏ పనీ చేయకుండా చేతులు కట్టుకొని కూర్చుంటే కుద రదు. నీకు యోగానుభూతులేవీ కలగవు. ఎందుకంటే జీవిత మంతా యోగానికి క్షేత్రమే. నువ్వు చేసే ప్రతి కదలిక, మెద డులో మెరిసే ప్రతి ఆలోచన, నువ్వు చేసే ప్రతి పని సాధనకు ఒక అవకాశమే. ముఖ్యంగా కర్మలు సాధన చేయుటకు, తదను భూతులు పొందుటకు చక్కటి అవకాశములు. అంతరంగికంగా పొందిన ప్రయోజనములను బాహ్యాజీవనంలో నిరూపించు చక్కని ఆలంబనములు

నువ్వు జపతపాదులలో నిమగ్నమై ఏ పనీ చేయకుండా కూర్చుంటే నువ్వు పురోగమిస్తున్నావో లేదో తెలియదు. మీన మేషాలు లెక్కపెట్టుకుంటూ కూర్చుంటే నువ్వు ఏదో సాధించా వనే భ్రమలో పడిపోతావు. అలా కాకుండా నువ్వు పనిచేయటం మొదలు పెట్టావనుకో. అప్పుడు ఇతరులతో కలసి పనిచేయటం, పనిచేయటంలో శ్రద్ధ మొ॥ వాటి వలన నీ సత్తా ఏమిటో, ఏ మాత్రం ప్రగతి సాధించావో, ఇంకా సాధించవలసినది ఎంత వున్నదో నీకు తెలిసిపోతుంది. ఊరికే కదలకుండా మెదల కుండా వుండి నీలో నువ్వే భ్రాంతి చెందకూడదు. ఎప్పుడైతే నువ్వు బాహ్యా వ్యవహారములలో కలగజేసుకుంటావో, ఇతరుల తోటి, పరిస్థితులతోటి, లౌకిక విషయములతోటి సంపర్కము చెందుతావో అప్పుడే నువ్వు సాధనలో ఏమాత్రం అభివృద్ధి చెందావో తెలుసుకో గలుగుతావు. నీ చేతనాస్థాయి ఏమాత్రం

పెరిగిందో, నువ్వు కాస్త ప్రశాంతంగా వున్నావో లేవో, కోరికలు, ఆశలు, చపలత్వము ఏమాత్రం నీలో వున్నాయో, లేవో పనులు చేసినప్పుడుగాని నీకు తెలియదు. అలాంటిది ఏమీ లేకుండా కళ్లు మూసుకొని నీ చుట్టూ ఓ గిరి గీసుకొని ధ్యానంలో మునిగి పోయావనుకో – అప్పుడు నువ్వు వట్టి భ్రమలో పడిపోతావు. ఏవేవో అద్భుతమైన సిద్ధులను పొందానని అనుకుంటావు కాని అదంతా వట్టి కల, నీ భ్రమ అంతే.

*

ఈ బాహ్యజీవనము, – ఈ అనుదిన, అనుక్షణ కార్యకలాపము, – ఇయ్యది ధ్యాననిదిధ్యాసనములకై మేము వినియోగించు ఘడియల సాఫల్య సిద్ధికి అవశ్యము సహాయోగియై వెలయునట్టిదే కాదా? వీనిలో ఒక్కొక్క దానికి విడివిడిగా వినియుక్తమగు కాలముల అన్యోన్య సంబంధము, సాధన సంపత్తి కొరకును, సాక్షాత్కారోపలబ్ధి కొరకును చేయబడు ప్రయత్నముల అన్యోన్య సంబంధమును పోలినదే యగును. ఏలన, ధ్యాన నిది ధ్యాసముల ఫలము 'నీతో' ఐక్యము చెందుట. అయ్యది పుష్పవికసనము వంటిది. ఇక, ఈ దైనందిన కార్యకలాపమో, దీనిని లోహకారుని కొలిమి యందలి దాగలిపట్టెడపై జరుగు పనితో బోల్చవచ్చును. మానవసత్త యందలి ఎల్ల తత్త్వములును ధ్యాననిదిధ్యాస ఫలమగు తేజోపలబ్ధిని బొందు యోగ్యత సంతరించుకోవలెననిన, అందుకు వలయు విశుద్ధిని, సంస్కారమును, మృధుత్వమును బడయుట కవి ఈ పట్టెడపై పెక్కు పర్యాయములు సాగగొట్టబడవలసి యుండును.


ఈ యన్ని తత్త్వములును ఇట్లు ఒకదాని తరువాత నొకటిగా మూసలో కరగిన యనంతరమున గాని, మానవసత్త సమగ్ర వికాసమునకు బాహ్య కర్మకలాపావశ్యకత తొలగి పోనేరదు. అటుపైన ఈ కార్యకలాపము 'నిన్ను' అభివ్యక్తము చేయు సాధనముగా మారి, తద్వారమున ఇతర చైతన్య కేంద్రములను గూడ ఇదే రీతిగా 'కొలిమి సంస్కారము, తేజోపలబ్ధి' అనెడి ద్వివిధ కార్యార్థముగ మేలుకొల్పుటకై ఉపయుక్త మగును. కావుననే,

గర్వము, ఆత్మ సంతృప్తి అనునవి అత్యంత నికృష్టములైన ప్రతి బంధకములని చెప్పనగును. ఈ మన సత్త యందలి అసంఖ్యాక తత్త్వరీతులలో కొన్నింటిని సాది మర్దన చేసి శుద్ధపరచుటకై ఒదవెడి సూక్ష్మాతిసూక్ష్మ సదవకాశముల నెల్ల మనము వినమ్రతతో వినియోగించుకొని, అవ్వానికి నిర్వ్యైయక్తికత, నిరహంకృతి, మృదుత్వము, త్యాగము, భక్తి, కారుణ్యము, సౌజన్యము అనునవి అలవరచవలసి యున్నది.


సత్త యందలి రీతి విశేషములెల్ల అట్టి విధమైన లక్షణములకు అలవాటు పడినప్పుడు, అయ్యవి నిదిధ్యాసమున బాల్గొన గలిగి పరమైకాగ్రమున నీతో ఏకత్వమును బొందుటకు సంసిద్ధములై యొప్పారును. కావుననే, ఉత్తమోత్తముల విషయమున సైతము ఈ కార్యక్రమము కడు దీర్ఘముగా, నెమ్మదిగా కొనసాగవలసి యున్నదని నాకు తోచుచున్నది. కొట్టవచ్చినట్లుగ చూపట్టే హఠాత్పరివర్తనములు సమగ్రములు కానేరవు. ఇట్టి పరివర్తనములు సత్తయొక్క దృష్టియందు మార్పు తెచ్చి సునిశ్చియముగా సూటి మార్గమున ప్రవేశపెట్టు ననుమాట నిజమే. కాని, యథార్థముగా సర్వాంగీణ పరివర్తనము బొందవలె ననిన, ఎవ్వరును ప్రతి నిమేషమున అసంఖ్యేయముగ గలుగు నీ సర్వ విధానుభవముల యావశ్యకత నుండి తప్పించుకొననేరరు.

మూలం: శ్రీమాత
అనువాదం: డా॥ ఆర్.ఎల్.ఎన్. శాస్త్రి, కమలాకర
వేంకటరావు ('ప్రార్థనలు – ధ్యానములు' నుండి)

(*CWM* Vol. 7, pp. 291-92; Vol. 1, pp.6-7)



The librarian consulting with the
Mother at Sri Aurobindo Library (1950s)



THE MOTHER

క్రియాశీలమైన ధ్యానము

నేను రోజు గంటసేపు ధ్యానం చేస్తానండి అని బడాయిలు చెప్పు కొనే వాళ్లుంటారు. అది ఏమంత ఉపయోగం కాదంటారు శ్రీమాత. నీ ధ్యానం క్రియాశీలం కావాలి. నీలో ఆకాంక్ష జనించాలి. ఆ జ్వాల నీ శరీరాన్నంతా కుదుటపరుస్తుంది. నీ మనస్సును శాంత పరుస్తుంది. అప్పుడే నువ్వు నీ ఆకాంక్షకు జవాబులాంటి పై నుంచి వచ్చే సందేశములను వినగలగుతావు.

— సంపాదకుడు

క్రియాశీలమైన ధ్యానమంటే ఏమిటి? నీలో మార్పు తీసుకొని వచ్చి నిన్ను పరివర్తింప చేయగల శక్తి గలది.

సాధారణంగా ఈ విధమైన క్రియాశీల ధ్యానమును ఎవ్వరూ చెయ్యరు. ధ్యానము చేసినప్పుడు – కనీసం వారు కూర్చుని ధ్యానంలోకి దిగినప్పుడు – ఒక విధమైన నిస్తబ్దతను పొందుతారు. ధ్యానమంటే జడత్వం కాదు. మనిషిలోగాని, చేతన లోగాని ఏమాత్రం మార్పు వుండదు. ధ్యానానికి పూర్వం ఎలా వున్నారో, ధ్యానానంతరం కూడ సరిగ్గా అలాగే వుంటారు. ఎంత అచలంగా వుంటే అంత గొప్పగా ధ్యానం చేసామనుకుంటారు. ఇలా కొన్ని యుగాలు ధ్యానం చేసినప్పటికి వారిలోగాని, ఈ జగత్తులోగాని ఏమాత్రం మార్పు వుండదు.

*

ధ్యానం చేసేందుకు ఇంతకంటె మంచి పద్ధతి మరొకటి వున్నది. నీలో ఆకాంక్ష, ఒక జ్వాల ఎక్కడైతే వెలిగిపోతూ వుంటుందో ఆ కేంద్రం (చక్రం) మీద నీ దృష్టినంతా నిలపాలి. 'నేను' అనబడే నీ వ్యక్తిత్వాన్నంతా హృత్కేంద్రం మీద నిలిపి నీ అంతరంగాన్ని పూర్తిగా నిశ్శబ్దం చేయాలి. అంటే ఏమిటి? ఒక సాలీడు గూడును అల్లుతుందనుకో – ఆ చప్పుడు కూడ నీకు వినపడాలి! (...to obtain an attentive silence as though one wanted to listen to something extremely subtle, something that demands a complete attention, a complete concentration and total silence)

అసలు కదల కూడదు, మెదల కూడదు, ఆలోచించ కూడదు. అప్పుడే, అప్పుడు మాత్రమే పైనుంచి దిగివచ్చే ఆధ్యాత్మిక సంపదలను నువ్వు గ్రహించ గలుగుతావు. ఒక వేళ 'ఓహో! దాని స్వరూపమిలా వుంటుందా?' అని ఊహించుకోవటం మొదలు పెడతావో, అప్పుడిక ఇంతే సంగతులు. కాబట్టి నీ సొంత ఊహలను లేశమైనా నీలోకి జొరబడ నివ్వకూడదు.

ఎప్పుడైతే నీ ధ్యానాన్ని ఈ విధంగా మలుచుకుంటావో అప్పుడు ధ్యానానంతరం నీలో ఒక అద్భుతమైన మార్పును చూడ గలుగుతావు. నీ దృష్టే మారిపోతుంది, తత్త్వమే మారిపోతుంది. (...from within the being something new emerges in the consciousness: a new understanding, a new appreciation of things, a new attitude in life – in short, a new way of being) అది తాత్కాలికమే కావచ్చు. ఒకసారి ఒక మెరుపు వలె మెరిసి మాయమైపోవచ్చు. కాని నీలో ఓ మార్పు వచ్చినట్లు నీ అవగాహన పెరిగినట్లు, పరివర్తనా దిశలో నిశ్చయంగా ఒక అడుగు ముందరకు వేసినట్లు నీకు స్పష్టంగా తెలుస్తుంది. ఇక నువ్వు నీ మనస్సును దాటి విశాలచేతనలో నివసించెదవు. ఇక నుంచి నీ ఇంద్రియాలు నీ అదుపులోనే వుంటాయి. కోపతాపాలు నిన్ను బాధించవు.

కాని ఈ అద్భుతమైన ఫలితాలు వెంటనే కలుగుతా యనుకుంటున్నావేమో. నిజానికి నువ్వు అలాంటి దాన్ని గురించి ఊహించనైనా ఊహించకూడదు. ఒక వేళ అలా చేసావో నీ ఊహాలే మళ్లీ నీ మీదకు వచ్చి నిన్ను మోసం చేస్తాయి. అందుకని నువ్వు నిన్ను గురించి అసలు ఆలోచించకుండా తటస్థంగా వుండాలి. ఆర్ద్రమైన ఆకాంక్ష మట్టుకు నీయందు ఎల్లెడలా వెలిగిపోతూ వుండాలి. (One must be as neutral, as immobile, as passive as one can be, with a background of silent aspiration not formulated in words or ideas or even in feelings; something that does this *(gesture like a mounting flame)* in an ardent vibration, but which does not formulate, and above all, does not try to

understand.) కొంచెం అలవాటైతే చాలు నువ్వు ధ్యానానికి ఉప క్రమించిన వెంటనే నీకు అనిశ్చలమైన స్థితి కుదురుతుంది. అయితే మొదట్లో నువ్వు నేర్చుకుంటున్నప్పుడు చాల కాలయాపన జరుగుతుంది. ఆలోచనల నరికడుతూ నీ మనస్సుతో నువ్వు యుద్ధం చేయడంతోటే సరిపోతుంది. నీ ధ్యానసమయంలో ముప్పావు వంతు. దీంతోటే సరిపోతుంది. కాని నీ కలవాటైనప్పుడు రెండు క్షణాలలో నీ మనస్సును కూర్చోపెట్టి ఎకాయెకి ధ్యానావస్థను వెంటనే పొందగలవు.

ధ్యానంలో ఇంతకంటె మహత్తరమైన స్థాయిలు కూడ వున్నాయి. వాటిని పొందేందుకు ఇంకా ఎక్కువ కాలం పడుతుంది. కాని అంతవరకు పోకుండా ఇప్పుడు చెప్పిన ధ్యానం వలన కూడ చాలా ప్రయోజనం వుంటుంది.

మూలం: శ్రీమాత
అనువాదం: డా॥ ఆర్.ఎల్.ఎన్. శాస్త్రి

(*CWM* Vol. 8, p. 88; Vol. 9, pp. 114-15)

భౌతిక శరీరాన్ని చైతన్యవంతం చేయుట

ఈ భౌతిక శరీరం జడమే అయినప్పటికి దాని చైతన్యం దానికుంటుంది. క్రమశిక్షణ ద్వారా దానిని ఉద్దీపింప జేయవచ్చు. అప్పుడు శరీరావయములు ఒక నూతన తేజముతో భాసిస్తాయి. వాటి కదలికలు కూడ నృత్యవిన్యాసములను స్ఫురింపజేస్తాయి. శరీరకణములు కూడ దివ్యచేతనతో వెలిగిపోతూ వుంటాయి. కొంతమంది చిత్రకారుల చేతులు వాటంతట అవే కదులుతూ చిత్రపటమును గీయవూ! వారి చేతులకు చైతన్యముంటుంది. అదే విధంగా మొత్తం శరీరం కూడా చైతన్యంతో ఉద్దీపనమై సర్వాంగ సౌష్టవంగా భాసిస్తుంది. ఇది నిజమేనా అంటారేమో. ప్రయత్నించి చూడండి. — *సంపాదకుడు*

శరీరశిక్షణ ద్వారా శరీరకణములు వికసించి చైతన్యవంతములవుతాయి. ఈ విషయము ఎవరికి తెలియకపోవచ్చు. కాని అది

నిజము. మన దృష్టిని కండరముల మీద కేంద్రీకరించి వాటిని ఉపయోగించినప్పుడు, అవయవములకు శిక్షణ యిచ్చినప్పుడు, వాటి కదలికలను, శక్తిని, చురుకుదనాన్ని, నమ్యతను అభివృద్ధి పరచ దలచినప్పుడు ఒక తమాషా జరుగుతుంది. శరీరకణముల చేతనాప్రమాణము, వాటి యొక్క గ్రహణశీలత ఇంతకు ముందర లేని రీతిగా పెరుగుతాయి. ఈ విధంగా శరీరము యొక్క చైత న్యము అభివృద్ధి చెందుతుంది. శరీర వ్యాయామము యొక్క ముఖ్యోద్దేశమిదియే. శరీర చైతన్యమును పెంచుటకు ఇతర మార్గ ములు కూడ కలవు. కాని సర్వాంగంగా తీర్చిదిద్దుట కిదే మార్గము. నేను మీకు ఒక విషయాన్ని అదివరకే చెప్పాను. మేధావులు ఏ విధంగా మెదడును పదును పెట్టుకుంటారో అదే విధంగా కళా కారులు వారి హస్తములకు కూడ చేతనాస్ఫూర్తిని కలుగజేయ గలరు. అయితే దీని వలన ఒక్కొక్క అవయవము మెరగు కావచ్చు. కాని మొత్తము శరీరము కాదు. ఈ విధమైన శిక్షణ యొక్క అద్భుత పరిణామాలను నీవు గమనించినట్లయితే శరీరము యొక్క సామర్థ్యాన్ని చూసి నువ్వే ఆశ్చర్యపోతావు. శరీరధారి యైన చైత్యపురుషునకు ఇదెంతో ప్రయోజనకారి, సర్వాంగసౌష్ట వము, సమరసము అయిన శరీరము చైత్యపురుషునకు చాలా అద్భుతమైన ఉపకరణము. దాని కార్యమునకు మిక్కిలి సహాయ కారి. శరీర వ్యాయామము నభ్యసించు వారందరికీ యీ విధమైన ఉద్దేశము లేకపోవచ్చు. వాళ్ళకీ విషయాన్ని గురించి లేశ మాత్ర మైనా తెలియకపోవచ్చు. వాళ్ళకి తెలిసినా తెలియకపోయినా ఫలి తమిదే. మీకు సూక్ష్మదృష్టి కనుక ఉన్నట్లైతే క్రమపద్ధతిలో వ్యాయామ విన్యాసములు జరిపినవాడు నడుస్తుంటే ఒక విధమైన వెలుగు, చైతన్యము, జీవము అతనిలో ఉట్టిపడుతూ వుంటాయి. ఇతరులలో వుండవు.

మూలం: శ్రీమాత
అనువాదం: డా॥ ఆర్.ఎల్.ఎన్. శాస్త్రి
(జూన్ 2000 ‘అఖిల’ నుండి)

(*CWM* Vol. 10, p. 30)

సమాచార పత్రం

15 ఆగష్టు 2005 నాడు శ్రీఅరవిందుల 133 వ జన్మదిన మహోత్సవము జరుపబడును. సొసైటీ బీచాఫీసులో జరిగే రెండు ప్రత్యేక కార్యక్రమములు: 1) 12, 13, 14 ఆగష్టు తేదీలలో శ్రీఅరవింద సొసైటీ వార్షిక సమావేశములు. 2) శ్రీఅరవిందుల 'గీతా వ్యాసముల' మీద డా॥ నడ్కర్ణి గారు 17-26 ఆగష్టు తేదీలలో 9 గం॥ నుంచి 10 గం॥ ల వరకు, 10-30 నుంచి 11-45 వరకు ఉపన్యసించెదరు. ఈ సభలకు అందరూ ఆహ్వానితులే.

క్రిందటి సంవత్సరంలో (31-03-2005 తో అంతం) 8 నూతన శ్రీఅరవిందో సొసైటీ కేంద్రములు ప్రారంభించబడినవి: 1. ఉత్తర కాశీ (ఉత్తరాంచల్) 2. షామ్లి (ఉత్తరప్రదేశ్) 3. బీజాపూర్ (కర్ణాటక) 4. రెనిబెన్నూరు (గౌరిశంకర్ నగర్ కర్ణాటక) 5. హాంగల్ (కర్ణాటక) 6. మహాబలేశ్వర్ (మహారాష్ట్ర) 7. పైగంమ్బేర్ పూర్ (ఉత్తరప్రదేశ్) 8. ట్రషరీ కాలని బీజాపూర్ (కర్ణాటక)

M.S యూనివర్సిటి బరోడాలో శ్రీఅరవిందుల కాంస్య బస్టును డా॥ నడ్కర్ణిగారు 20-3-05 నాడు ఆవిష్కరించిరి. 'Future belongs to the young' అనే ప్రత్యేకముగా తయారుచేసిన లఘు దీపికను విద్యార్థులకు, ఇతరులకు పంచిపెట్టిరి.

ఆంధ్రా యూనివర్సిటిలో 28-02-2005 నాడు Lt. General (Retd) M.M. Lakhera, Lt. Governor of Pondicherry గారు 'Relevance of Sri Aurobindo in Building Modern India' అనే విషయంపై ఉపన్యసించిరి. హనుమకొండ (ఆంధ్రప్రదేశ్) శాఖవారు 'ఆరోగ్యము, యోగము, చైతన్యము' అనే విషయములపై 27-02-2005 నాడు ఒక గోష్టిని నిర్వహించిరి. డా॥ అలోక్ పాండే (శ్రీఅరవిందో సొసైటీ పాండిచ్చేరి) గారు ప్రధానోపన్యాసము నిచ్చిరి. డా॥ ఇందిరా పార్థసారథి, శ్రీమతి సత్యవాణి, శ్రీమతి. ఎన్. విజయలక్ష్మి గార్లు ఆరోగ్యం మీద మనస్సు చేసే ప్రభావం గురించి వివరించిరి.

శ్రీఅరవిందుల రచనలు చదవండి



అఖిల

అఖిల భారత పత్రిక,

జూలై 2005

పరమ రహస్యం

11/7/200.

విషయసూచిక

భవిష్యాద్గామి శ్రీఅరవిందులు ... 4

శ్రీఅరవిందుల రచనలను చదువుట ... 6

శ్రీఅరవిందుల రచనలను చదివే విధానము ... 8

శ్రీఅరవిందుల గ్రంథముల నుండి జవాబులు పొందుట ... 14

యోగానికి తెలివితేటలు అవసరమా? ... 17

పుస్తకాలు చదవటం వలన ప్రయోజనం ... 21

శాస్త్రము – శాస్త్రాతీతము ... 24

శ్రీఅరవిందుల బోధనలు ... 27

శ్రీమాత పిలుపు ... 32

ఆధ్యాత్మిక గ్రంథాలు చదివినంత మాత్రాన సరిపోదు ... 33

అనుబంధం

శ్రీమాతరవిందులు – జ్ఞానారవిందం ... 38

శ్రీఅరవిందుల రచనలను చదువుట ఎట్లు ... 40

సమాచార పత్రం ... 47

Read Sri Aurobindo and follow his discipline.


The Mother

(*CWM* Vol. 13, p. 24)

ఉపోద్ఘాతము

మనది పుణ్యభూమి. ప్రపంచానికి ఆధ్యాత్మిక బిక్ష పెట్టిన పవిత్ర దేశము. ఈ గడ్డ మీద జన్మ ఎత్తటమే ఒక సుకృతము. ఇంతటి మహత్తరమైన సంపదకు మనం వారసులము. సరే ఇదంతా నిజమే కాని మన సంగతి ఏమిటి? ఆధ్యాత్మిక వికాసానికి మన మేమైనా ప్రయత్నం చేస్తున్నామా? ఏదో జపం చేసుకోవటం ఏవేవో పుస్త కాలు చదువుకోవటం తప్ప సీరియస్‌గా మన మేమైనా ప్రయత్ని స్తున్నామా? ఊపిరి సలిపేందుకు కూడ వ్యవధిలేని నేటి యాంత్రి కజీవితంలో మరో విషయాన్ని గురించి ఆలోచించేందుకే అవ కాశం లేదు కదా! అందుకనే మనం ఈ దేశపు సంస్కృతి ఏమిటో ఈ ఆధునిక యుగంలో మనకి దారి చూపించగలిగిన వారు ఎవ రైనా వున్నారేమో కనుక్కొని వారి చెయ్యి పట్టుకుని నడవాలి. ఇవి వట్టి మాటలు కావు. ఉపశమనం కోసం చెప్పిన శ్రీరంగ నీతులు కావు. ఆచరణ యోగ్యమైన వాస్తవాలు. శ్రీఅరవిందులు అంటే అసలు ఎవరో మనం ప్రత్యక్షంగా కనుగొనెదము గాక! ఈ సంచికలో వారిని గురించి వివరించిన అనేక విషయాలను అవగాహన చేసుకొని ఏమాత్రమైనా ఆచరణలో పెట్టగలిగితే మన జీవితాలు ధన్యమైనట్లే!

— సంపాదకుడు



Seer deep-hearted

Seer deep-hearted, divine King of the secrecies,
Occult fountain of love sprung from the heart of God,
Ways thou knewest no feet ever in time had trod.
Words leaped shining, the flame-billows of wisdom's seas,
Vast in thy soul was a tide washing the coasts of heaven,
Thoughts broke burning and bare crossing the human night,
White star-scripts of the gods born from the presses of Light
Page by page to the dim children of earth were given.

Sri Aurobindo

భవిష్యద్గామి శ్రీఅరవిందులు

శ్రీఅరవిందులు పాత మతాలు పనికిరావని చెప్పి మరో కొత్త మతాన్ని బోధించేందుకో లేక కొత్త సిద్ధాంతాలను ప్రతిపాదించేందుకో రాలేదు. గతానికి స్వస్తి చెప్పి రానున్న ఉజ్వల భవిష్యత్తును మనమెలా ఆహ్వానించాలో చూపించేందుకే వచ్చారు.

*

అసలు శ్రీఅరవిందులు ఎవరు? భూమ్మీద అలా అలా మెరుపులా మెరిసి మాయమైపోయిన ఓ ప్రవక్తా? ఒక చరిత్రాత్మక పురుషుడా? ఇవేవీ కాదు. ముందుకు పురోగమిస్తూ ఆవిష్కారమౌతున్న భవిష్యత్స్వరూపమే శ్రీఅరవిందులు.

*

శ్రీఅరవిందుల బోధనలను దేశంలోని అనేక సిద్ధాంతాలలో ఒకటిగా జమకట్టడం నీవు చేస్తున్న పెద్ద పొరపాటు. ఈ ఆశ్రమంలో మనం చేస్తున్న కార్యక్రమము కూడా ఇతరత్రా జరుగుతున్నట్టి అనేక దైవకార్యాల వంటివే అనుకోటం కూడ సత్యానికి దూరమే అవుతుంది.

శ్రీఅరవిందులు మానవాళికి ఒక కొత్తసిద్ధాంతాన్ని బోధించి మరో మతాన్ని స్థాపించేందుకు వచ్చిన గురువుగాని మతాచార్యుడు గాని కాదు. పరమాత్మ ప్రత్యక్షంగా నిర్వహిస్తున్న కార్యమే వారు. ఆ కార్యమును సఫలీకృతపరచుటయే నా కర్తవ్యం.

*

ప్రపంచ చరిత్ర ప్రారంభమైననాటి నుంచీ ఏదో ఒక నామాన్ని, ఏదో ఒక రూపాన్ని ధరించి, పృథ్వీ పరివర్తనా కార్యంలో వారు ప్రాధాన్యత వహిస్తూనే ఉన్నారు.

*

ప్రస్తుతం పదార్థమయ జగత్తును అమృతమయంగా చేస్తున్న శ్రీఅరవిందులు ఈ బృహత్పరిణామపు రూపురేఖలను కొద్ది కొద్దిగా బహిర్గతం చేస్తున్నారు.

*

అనాదిగా, సృష్టి మొదలైనప్పటి నుంచీ అవతారాలు వస్తూనే ఉన్నాయి. రాబోయే పూర్ణపరిణామాన్ని తెలియచేసే వైతాళికుల మాదిరి ఒక్కొక్క అవతారం ముందుకు వస్తూంటుంది. అయిన ప్పటికీ కొత్త అవతారాన్ని ప్రతిఘటిస్తూ వెనుకటి అవతారాన్ని ప్రస్తుతించడం మానవులకు పరిపాటి అయిపోయింది. అదే ఇప్పుడు పునరావృత మవుతున్నది. భవిష్యత్తులో సిద్ధించబోయే అతిమానస అవతరణను ప్రకటిస్తున్న శ్రీఅరవిందుల సందేశం కూడా విమ ర్శల బారిన పడుతున్నది. కానీ కొద్దిలో ఆ సత్యం తప్పనిసరిగా నిరూపితమవుతుంది. వారు చెప్పినది జరిగి తీరుతుంది.

*

ఒక సరికొత్త జాతి, ఒక కొత్త ప్రపంచము ఆవిర్భవించనున్నట్లు అందరికీ తెలియచెప్పటానికే భగవంతుని విభూతి శ్రీఅరవింద లుగా అవతరించింది.

అతిమానసమనే ఆ కొత్త జాతి అవతరణకై వినమ్రతతో, ఉత్సాహభరితులమై మనందరం సన్నద్ధమయ్యెదము గాక.

*

మానవుడు పాత సృష్టికి చెందినవాడు. సమీప భవిష్యత్తులో జరగబోయే నూతన సృష్టి గురించీ, రాబోయే అతిమానసజాతి గురించీ చెప్పడానికే శ్రీఅరవిందులు కారణజన్ములైనారు.

*

భవిష్యత్తులో సిద్ధించబోయే సౌందర్యాన్ని గురించి ప్రపంచానికి వెల్లడించటానికి అవతరించిన శ్రీఅరవిందులు అదొక నిశ్చితి అనే నమ్మకాన్ని అందరికీ కల్గించే ప్రయత్నం చేశారు.

ప్రపంచం ఒక దురదృష్టకర విపత్తు వల్ల ఏర్పడినది కాదు. తనకు తాను అభివ్యక్తం చేసుకోవటం కోసం ముందుకు పయ నిస్తున్న ఒక అద్భుతమే అది. అది ఆ విధంగా పయనించడ మనేది ఒక ఆశ మాత్రమే కాదు, అది ఒక నిశ్చిత సత్యమేనని శ్రీఅరవిందులు తెలియచెప్పారు. అంతేకాక ప్రపంచానికి అత్యంత

సుందరమైన భవిష్యత్ ఎంతైనా అవసరం కాబట్టి అది సిద్ధించి తీరుతుందని వారు భరోసా ఇచ్చారు.

మూలం: శ్రీమాత

అనువాదం: డా॥ ఎ. ప్రభావతి, డా॥ ఎ.వి.ఆర్. శాస్త్రి;

(*CWM* Vol. 13, pp. 4-5, 10, 22-23; Vol. 17, p. 194; Vol. 13, pp. 19-20, 15, 22)

శ్రీఅరవిందుల రచనలను చదువుట

జీవితమంటే ఏమిటో, దాని అర్థమేమిటో, గమ్యమేమిటో తెలుసుకోవాలనే జిజ్ఞాస ఎంతమందికి వుంటుంది? ఏ కొద్దిమందికో గాని వుండదు. అట్టివారికి శ్రీఅరవిందుల పుస్తకాలు వరప్రసాదాలు.

*

నిన్ను గురించి తెలుసుకునేందుకే కదా భూలోకంలో నువ్వు జన్మనెత్తావు. శ్రీఅరవిందుల పుస్తకాలు శ్రద్ధగా చదివి నీ అంతరంగంలోకి సాధ్యమైనంత లోతుగా నీ దృష్టిని సారించు.

*

శ్రీఅరవిందుల పుస్తకాలు అధ్యయనం చేయటం ద్వారా భవిష్యత్తుకు ద్వారాలు తెరచుకుంటాయి!

*

శ్రీఅరవిందులు చెప్పిన విషయాలు చదివి, అధ్యయనం చేసి, ఆయన అడుగుజాడలలో నడిచి, రాబోవు నూతన సృష్టికి సంసిద్ధులము అవటమే మన ఏకైక కర్తవ్యము.

ఇదే మన జీవితానికి అసలైన అర్థము. ఈ దృష్టితో ఉన్నట్లయితే అన్ని ఆటంకములను దాటిపోగలము.

మనం నూతన సృష్టిని ఆహ్వానిస్తూ జీవించినట్లయితే కాలపాశం మన మీద పడదు. అప్పుడు మనం ఏ మాత్రం క్షయం లేకుండా జవసత్వాలతో, అపారమైన శక్తితో అధికోత్సాహంతో మన గమ్యాన్ని సమీపించెదము గాక.

శ్రీఅరవిందుల పుస్తకాలను శ్రద్ధగా చదువుకున్నట్లయితే మన ప్రశ్నలన్నిటికి జవాబులు దొరుకుతాయి.

*

ఏ విషయాన్ని గురించైనా క్షుణ్ణంగా తెలుసుకోవాలంటే శ్రీఅరవిందుల పుస్తకాలు చదవాల్సిందే. వాటి ద్వారా లౌకిక విషయ పరిజ్ఞానం కూడా నీకు లభిస్తుంది!

*

ప్రశ్న: జ్ఞానం పొందాలంటే ఏం చేయాలి?

శ్రీఅరవిందుల రచనలు చదవాలి.

ప్రశ్న: నాకు యోగసాధన చేయాలని వుంది. దీర్ఘనిద్ర నుండి మేల్కొలిపి చైత్య పురుషాభిజ్ఞతిని ప్రసాదించమని శ్రీమాతను వేడుకోవాలని నాకు తెలుసుగాని నేను చేయవలసినది మరింకేమైనా వున్నదా?

శ్రీఅరవిందులు బోధించిన విషయాలను క్రమశిక్షణతో శ్రద్ధగా చదివి నీ మేధను పెంచుకోవాలి. నీ ప్రాణికాన్ని, దాని చేష్టలను గమనిస్తూ కోరికలను జయించాలని నీ చైత్యపురుషుణ్ణి వేడుకుంటూ దానితో ఐక్యం కావాలి. నువ్వు ఇప్పుడు చేస్తున్న పనులను చేస్తూ సాధ్యమైనంత నిస్స్వార్థంగా శరీర పరిశ్రమను కొనసాగించాల్సిందే.

*

చదువు ప్రాణిక కోరికల నుండి నీ దృష్టిని మళ్ళించి దాని బలాన్ని పెంచుతుంది. నీ మనస్సును ప్రాణికాన్ని అదుపులో పెట్టాలంటే నువ్వు పూర్తిగా చదువులోనే నిమగ్నమైపోవాలి. అందుకనే నీ ధ్యాసనంతా చదువు మీదనే నిలపాలి.

*

క్రమం తప్పకుండా శ్రద్ధగా చదివినట్లయితే నీ మెదడు చురుగ్గా పని చేస్తుంది. తర్వాత నువ్వు విశ్రాంతి తీసుకున్నప్పుడు నీ మెదడు కూడా నిశ్శబ్దమౌతుంది. అప్పుడు నువ్వు నీ హృదయాం

తరాళములలోకి నీ దృష్టిని సారించి నీ చైత్యకేంద్రాన్ని తెలుసుకోగలుగుతావు.

మూలం: శ్రీమాత
అనువాదం: డా॥ ఆర్.ఎల్.ఎన్. శాస్త్రి

(*CWM* Vol. 17, p. 365; Vol. 12, pp. 206, 216, 207-208,398, 133-34)

శ్రీఅరవిందుల రచనలను చదివే విధానము

నా పుస్తకములను చదువుట ఏమంత కష్టము గాదు. ఏలన, అవి సులభమైన వ్యావహారిక భాషలో యున్నవి. వాటిని సావధానముగ ఏకాగ్రచిత్తుడవై, సహృదాభావముతో చదివితే చాలు. వాటి వలన నీవు లాభమును పొందగలవు.

కాని, శ్రీఅరవిందుల రచనలు అటుల గాదు. ఏలన, వారు క్లిష్టమైన గ్రాంథిక, వేదాంతశైలిలో వ్రాశారు. వాటిని అర్థము జేసికొనుటకు అంత తొందరగా వీలు కాదు. మొదట మెదడును సిద్ధము చేసికొనవలెను. అది కొంత కాలము పట్టును. స్వతఃస్సిద్ధముగా స్ఫురణశక్తిగల కొంతమంది అదృష్టవంతులకు తప్ప, ఇతరులకు యిది (మెదడును సిద్ధము చేసికొనుటకు) కొంత కాలము పడుతుంది.

కాని, నేను చెప్పేదేమంటే – నిశ్చలమైన మనస్సుతో కొద్ది కొద్దిగా చదువుతే బాగుంటుంది. మెదడును నిశ్శబ్దము గావించిన – అర్థము చేసుకోవాలని ఆరాటపడకుండా – అప్పుడు ఆ పంక్తులలోని శక్తి, నీ అంతరాంతరముల లోనికి ప్రవేశిస్తుంది. నిశ్చలమైన ప్రశాంతత యందు, అందులోని శక్తి నీ లోపల ఒక దీపాన్ని వెలిగిస్తుంది. అంతేకాదు, ఒక వేళ నీకు సరిగా అర్థం కాలేదనుకో. అందుల కవసరమైన నూతన కణములను కూడా నీ మెదడులో సృష్టిస్తుంది. అప్పుడు కొన్ని నెలల తరువాత, నీవదే పంక్తులను తిరిగి చదివినప్పుడు, వాటిలోని భావము నీకు

స్పష్టముగా తెలియడమే కాకుండా, అవి నీకు మిక్కిలి సన్నిహితము, ఆత్మీయము నగును.

అంతే కాదు. ప్రతి రోజు కొద్ది కొద్దిగా, ఒక క్రమపద్ధతిలో, వీలైనంత వరకు ఒక నిర్ణీతసమయంలోనే చదివిన యెడల మెదడు యొక్క గ్రహణశక్తి పెంపొందుతుంది.

ఈ పారాయణ కార్యక్రమముల వలనగాని, లేక శ్రీఅరవిందుల విస్తారమైన ఏ ఇతర రచనల నుండిగాని లాభమును పొందవలెనని నీవు అవలంబించవలసిన పద్ధతి: నీ ధ్యాసనంతను ఏకము గావించి, పఠనాంశమునందు లగ్నము చేసుకొని, సావధానచిత్తుడవై యుండుము. మనస్సులో చెలరేగు ఆలోచనలను కొంచమైన అదుపులో పెట్టుము – పూర్తిగా మౌనము గావించిన మరీ మంచిది – మనస్సును నిశ్చలము గావింపుము. మెదడులో యెట్టి స్పందనలు లేకుండా జేయుము. బుద్ధిని స్థిరపరుపుము. అప్పుడు చిత్తమంతయు సుస్థిరమయి, అద్దమువలె, లేదా నిస్తరంగ తటాకోపరితలము పగిది అచంచలమగును. ఈ స్థితిలో నీ వింక ఏమి చేసినా సరే, చదివినా సరే, అది నీ మనస్సు వలన మరుగున బడక తిన్నగా నీ అంతరాళముల లోనికి ప్రవేశించును. చాలా కాలం తరువాత, ఆ లోతుల నుండి, తిరిగి పైకుబికి తేటతెల్లముగా విదితమగును. ఈ జ్ఞానము మామూలుగా చదివి తెలుసుకొనుదాని వలె గాక, లోనుండి విదితమగు జ్ఞానజ్యోతివలె ప్రకాశించును

ఇటుల చదివినయడల, గ్రహణశక్తి అత్యుత్తమస్థాయి నందుకొనును. అటులగాక మామూలు పద్ధతిలో – మనస్సు ఒక ప్రక్కన ఆలోచనలతో ఉక్కిరిబిక్కిరవుతూ కూడ, – చదివిన యెడల, ఆ చదివిన విషయములను అప్పటికప్పుడే అర్థం గావించుకొన యత్నించును. అప్పుడు వాటిలో నిక్షిప్తమైన శక్తి, జ్ఞానము, ఆ పరమ సత్యమంతయూ నాలుగింట మూడు వంతులు వృథా అగును. మరొక విషయము. నీలో వికసించిన ఈ జ్ఞానజ్యోతి, నీ ఉనికి నంతటను వ్యాపించి, తేజోమయము గావించును. అంత

వరకు ఓపిక బట్టుము. ప్రశ్నలు వేయకుము. అప్పుడు నీవు చది వినదంతయు చక్కగా బోధపడును. ఎక్కువ సందేహము లుండవు.

మూలం: శ్రీమాత

అనువాదం: డా॥ ఆర్.ఎల్.ఎన్. శాస్త్రి (ఆగష్టు 1988 'అర్క' నుండి)

*

ప్రగాఢమైన ప్రబోధం వున్న పుస్తకాన్ని నువ్వు చదివి అర్థం చేసుకోవాలంటే, నిశ్శబ్దమైన మనస్సుతో దానిని చదవగలిగి వుండాలి. నువ్వు కాస్సేపు నిరీక్షించాలి. మాటలు లేని మౌన అంతరాంతరాలలోకి ఆ భావమును ప్రవేశించనివ్వాలి. అప్పుడు నీ బాహ్య చైతన్యంలోకి ఆ భావం నెమ్మదిగా తిరిగివచ్చి దానం తట అదే అర్థం అవుతుంది. కాని నీ బాహ్య మనస్సుపై మాటల్ని పరుగులు తీయిస్తే, మాటల్ని మనస్సుకు సర్దుబాటు చేయడానికి ప్రయత్నిస్తే, నువ్వు వాటి వెనుక గల అర్థాన్ని, శక్తిని కోల్పో తావు. భావవ్యక్తీకరణ కేంద్రానికి వెనుక గల అవ్యక్తమనస్సుతో నువ్వు సాయుజ్యము చెందకపోతే, పరిపూర్ణమైన అవగాహన కలు గదు.

వ్యక్తుల మనస్సులు కూడ ఒకదాని నుండి మరొకటి భిన్నంగా వుండే వేర్వేరు లోకాలు, ఒక్కొక్కరి లోకం (మనస్సు) తనలో తాను గుప్తమై మూతబడి వుంటుంది. మరో లోకంతో దానికి సంబంధం వుండదు. మనస్సు యొక్క లక్షణమే అది. అక్కడ నీ భావాలే నిన్ను మూసివేస్తాయి. నిన్ను నీవు మాత్రమే అర్థం చేసుకుంటావు. జీవితంపై నీ భావసంచయం మాత్రమే నీకు అర్థం అవుతుంది. కాని అవ్యక్త మనస్సులోని ఉన్నత భూమి కలో నువ్వు స్వేచ్ఛా జీవివి. నువ్వు అక్కడికి ప్రవేశిస్తే, నీ నుండి నువ్వు విడిపోయినట్లే. విశ్వజనీన మానస భూమికలోకి నువ్వు చొచ్చుకొని వెళతావు.

*

పుస్తకాలు దృష్టిలో పెట్టుకొని శ్రీఅరవిందులను అధ్యయనం చేయకూడదు. కాని ఆయన తత్వాన్ని విశదం చేసే వివిధాంశాల

ఆధారంగా ఆయన్ని అధ్యయనం చేయాలి. దైవం, సమైక్యత, మతం, పరిణామం, విద్య, ఆత్మజ్ఞానసిద్ధి, అతిమనస్సు మున్నగు అంశాలపై ఆయన ఏమి చెప్పారో వాటిని ఆధారంగా ఆయన్ని అధ్యయనం చేయాలి.

*

ఒక నిర్ణీత అంశంపై శ్రీఅరవిందులు ఏమి చెప్పారో నువ్వు తెలుసుకోవాలనుకుంటే, ఆ అంశంపై ఆయన రాసినదంతా చదవాలి. బాహ్యదృష్టికి మాత్రం ఆయన పరస్పర విరుద్ధమైన విషయాలు చెప్పినట్లు అనిపించవచ్చు. కాని మొత్తం అంశంలోని వివరాలు అన్నీ చదివి, కొద్దిగా అర్థం చేసుకుంటే, అన్ని వైరుధ్యాలు పరస్పర సామరస్యపూరక మవుతాయి. వాటిలో ఒక సర్వ సమగ్ర సమన్వయం లభిస్తుంది.

*

తొందరపాటుతో ఏ నిర్ధారణలకు రాకూడదు. మనం సహనంతో వుంటే అధ్యయనం చివరలో తిరుగులేని ఆయన వాదం ఆధారంగా తానెందుకు ఆ నిర్ధారణకు వచ్చారో వెల్లడిస్తారు.

*

అసలు భాషే ఎందుకూ పనికిరాని ఓ అజ్ఞానలోకం. అటువంటప్పుడు మనల్ని మనం వ్యక్తీకరించుకోడం, మనం మాట్లాడే మాటలు, మాటలు మాట్లాడే విధానం – అంతా అజ్ఞానమే కదా! అందువల్ల సత్యమైన దానిని చెప్పడం చాలా కష్టం. దీనికి వ్యాఖ్యానాలు కావాలి. అవి అన్నీ అబద్ధాల పుట్ట. లేదా సుదీర్ఘంగా వుంటాయి. శ్రీఅరవిందుల వాక్యాలు అందుకే సుదీర్ఘంగా వుంటాయి.

*

స్టడీ గ్రూపును ఎలా నడపాలి:

1) ప్రార్థన (ఓ మాతా, శ్రీఅరవిందా మీ ప్రబోధాన్ని అర్థం చేసుకోడానికి మేము చేసే ప్రయత్నంలో మీ సహాయం అర్థిస్తున్నాము.)
2) శ్రీఅరవిందుల పుస్తక పఠనం

3) ఒక క్షణం మౌనం.
4) చదివిన పుస్తకంపై ఒక చిన్న ప్రశ్న అడగవచ్చు.
5) ప్రశ్నకు జవాబు.
6) చర్చ ఉండరాదు.

*

విద్యార్థులకు శ్రీఅరవిందుల పుస్తకాల పరిచయం:
శ్రీఅరవిందుల పుస్తకాలను నమిలి మింగి, వాటిని అరిగీ అరగని ఆహారంగా విద్యార్థులకు బోధించకూడదు. ఆ రచనలను ఉపాధ్యాయులు ఎంత గొప్పగానైనా చెప్పనివ్వండి. కాని విద్యార్థులకు రచనలతో ప్రత్యక్ష ఆత్మస్పర్శ వుండాలి. ఆ వెలుగులు వెదజల్లే ఆనందతరంగాలలో వారు ఓలలాడాలి. విద్యార్థి మనస్సుకు, శ్రీఅరవిందుల చైతన్యానికి మధ్య అడ్డుతెరలాగ ఉపాధ్యాయుడు ఉండకుండా జాగ్రత్తపడాలి.

*

శ్రీఅరవిందులు రాక ముందర ఆధ్యాత్మికతలు పాతరకం ఆలోచనా ధోరణుల చుట్టూ తిరుగుతుండేవి. భూమిపై జీవితాన్ని శూన్యంగా భావించి, దానిని త్యజించడమే లక్ష్యంగా ఆ మతాలు ప్రబోధిస్తూ వచ్చాయి. నువ్వు ఏదో ఒక లక్ష్యాన్ని ఎంచుకోవాలి – అల్పమైన సుఖాలు, బాధలు, దుఃఖాల చుట్టూ పరిభ్రమించే జీవితము, నువ్వు నీతివంతంగా ప్రవర్తించకపోతే నరకంలో పడతావు అనే బెదరింపుల మధ్య సాగించే జీవితం –

లేదా మరో ప్రపంచంలోకో, స్వర్గంలోకో, నిర్వాణంలోకో, మోక్షంలోకో పరారీకావడం....

ఈ రెండు లక్ష్యాలు కూడా అంత మంచివి కావు. రెండు అధ్వాన్నమైనవే. భారతదేశం బలహీనమైపోవడానికి, పతనం కావడానికి ముఖ్యమైన కారణం ఇదే అని శ్రీఅరవిందులు అన్నారు. బౌద్ధమతం, జైనమతం, శూన్యవాదం భారతజాతిని నిర్వీర్యం చేశాయి.

ఈ భువన జీవనం నుండి పారిపోవడంలో సత్యం కనిపించదు. జీవితంలోనే ఉండాలి. దానిని పరివర్తన చెందించాలి. దివ్వీ

కరణం చేయాలి. అప్పుడే భగవంతుడు భౌతిక ప్రపంచంలో అభివ్యక్తం అవుతాడు అని శ్రీఅరవిందులు ప్రవచించారు. ఈ మొదటి సమావేశంలో మీరు నిజాయితీతో నిర్ణయం తీసుకోవాలి. You should be square and frank. (శ్రీమాత బల్లపై పెద్ద square ను చేతులతో సూచించారు) ఈ విషయాన్ని బలంగా పిల్లలలో నాటుకునేటట్లు మీరు (టీచర్లు) చెప్పాలి. అందులో సందేహం వుండరాదు. ఆ తర్వాత మీరు కథలు చెప్పి విద్యార్థుల్ని సంతోషపెట్టొచ్చు.

ప్రశ్న: శ్రీఅరవిందుల రచనలపై వ్యాఖ్య చేయడం వృథా, బుద్ధిహీనత కూడా అని నిన్న మీరు 'యోగసమన్వయం' క్లాసులో చెప్పారు. నా తరగతులలో నేను ఈ బుద్ధిహీనమైన పనే చేస్తున్నాను. ఆ వ్యాఖ్యను ఆపమంటారా?

శ్రీఅరవిందుల పుస్తకాలపై వ్యాఖ్యానాలు వినటం బద్ధకస్తులకి చాలా ఆనందంగా వుంటుంది. ఆ రచనలు వారికి బాగా అర్థం అవుతాయని వారు భావిస్తారు కాబట్టి.

అందువల్ల నేను జోక్యం చేసుకోలేదు. శ్రీఅరవిందుల రచనలు అందరు చదివి అర్థం చేసుకోలేరు. అందుకని ఆ రచనలు చదువుతున్నప్పుడు ప్రజలు వినడం, వాటిలో కొంత ఆసక్తి కనబరచడం మంచిదే.

నువ్వు క్లాసులో వ్యాఖ్యలు కొనసాగించు ఫరవాలేదులే. కాని వ్యాఖ్యలు చేస్తున్నప్పుడు అవి చాలవని, అసలు మౌలిక రచన నువ్వు చెప్పే దానిని అధిగమించి వుంటుందని నువ్వు స్పష్టంగా అర్థం చేసుకోవాలి.

మూలం: శ్రీమాత

*

నేను, శ్రీమాత చెప్పిన విషయాలలో లేదా నేను రాసిన మాటలలో ఏదో కొంత ప్రజలు చదివి, వాటి అసలు అర్థం కాకుండా వేరే ఏదో అర్థాన్ని చెబుతుంటారు. మా అనుభవాలకు, జ్ఞానానికి వ్యతిరేకమైన తర్కబద్ధమైన ఆకస్మిక నిర్ధారణకు వారు వస్తుంటారు. అది సహజమే. దుష్టశక్తుల పన్నాగంలో అదొక భాగం.

సర్వసమగ్రమైన, బహుముఖీనమైన మహాసత్యం వీక్షించడంకన్నా తర్కబద్ధమైన నిర్ధారణకు రావడం చాలా తేలిక.

మూలం: శ్రీఅరవిందులు

అనువాదం: కె. యజ్ఞన్న

(*CWM* Vol. 12, p. 205; Vol.10, p. 7; Vol. 4, pp. 198-99; Vol. 3, p. 65; Vol. 12, pp. 208, 399; Vol. 9, p. 250; Vol. 10, pp. 103-04; Vol. 12, p. 217; Vol. 12, pp. 211-213; Vol. 17, p. 344; *SABCL* Vol. 26, p. 493)

శ్రీఅరవిందుల గ్రంథముల నుండి జవాబులు పొందుట

తల్లీ! తమరు శ్రీఅరవిందుల గ్రంథమేదైనా తీసుకొని, అప్రయత్నంగా ఏదో ఒక పుట తెరచి, ఆ పుటలో ఒక వాక్యమేదైనా చదవటం గమనించాము. ఇందులో ప్రత్యేకత ఏమైనా వున్నదా? మా మనసులలో రేకెత్తే అనేక సందేహాలను నివృత్తి చేసుకొనే మార్గమేదైనా ఉన్నదా?

నాయనా! ఈ ప్రక్రియలో విశేషమేమీ లేదు. అది అందరకు సాధ్యమే. అయితే ఇందుకు ఒక నిర్ణీత పద్ధతిని అనుసరించాలని తెలుసుకో. నీవు పూర్తిగా ఏకోన్ముఖుడవు గావాలి. ముందుగా నీకు ఏం కావాలో స్పష్టంగా నిర్ణయించుకోవాలి. ఏదైనా సమస్య నిన్ను వేధిస్తున్నట్లయితే, ఆ సమస్యపై ఏకోన్ముఖుడవు గావటమే మార్గము. ఆధ్యాత్మిక పురోగతి విచారణాంశమైతే, జ్ఞాన ప్రాప్తికై అభ్యర్థించాలి. ఈ రెండున్నూ గాక, ఆత్మజ్ఞానమే నీ లక్ష్యమైతే, విశుద్ధ మనస్సుతో మౌనివై, గ్రంథము తెరచి, ఒక పేపరు నైఫ్‌ను ఆ మౌనావస్థలోనే, ఆ గ్రంథంలో గుచ్చి దాని మొనతో ఏదైనా సూచించాలి.

ఇటు చూడండి. ఇలాంటి గ్రంథాలు – శ్రీఅరవిందుల యోగసమన్వయము (Synthesis of Yoga) చూపిస్తూ – బహు

శక్తివంతమై, ఆధ్యాత్మికతత్వాన్ని అపురూపంగా ఆవిష్కరిస్తాయి. ఇలాంటి గ్రంథాలలోని వాక్యాలు, బీజాక్షరాల కలయిక వలె, బహు శక్తివంతమని గ్రహించటం అవసరం. ఈ రహస్యం తెలుసుకొనలేక, వీటి వల్ల లాభం పొందలేకపోవటము నిజంగా దురదృష్టమే. కాని, ఈ మాట సత్యమే సుమా! ఈ మాట ఒక అక్షర సమూహానికే గాదు. ప్రతి నిత్యము మనము దర్శించే మహామహుల చిత్ర పటములకు, దేవతాస్వరూప పటములకు కూడా వర్తిస్తుందని తెలుసుకోవాలి. అనగా ఈ పటము వాటి యందున్న మూర్తుల శక్తులతో కూడుకొని, దివ్యశక్తిని ప్రసరింప చేస్తాయి. నీవు శ్రద్ధతో ఆకాంక్షిస్తే అందుకు సంబంధించిన దివ్యతరంగాలు, ఆ గ్రంథములో ప్రవేశింపగా, నీకు తగు రీతిలో సమాధానము లభిస్తుంది.

కొద్దిగా వివరించుకొంటే ఒక గ్రంథముగాని, మరొకటిగాని నిలయమైనట్లైతే, అందులోని ప్రత్యంశము కూడ శక్తివంతమే అని గ్రహించాలి. ఉదాహరణకు ఇంద్రజాల విద్య తీసుకోండి. ఇంద్రజాలికుని వద్ద ఎంత చిన్న నలుసు ఉన్నా, ఆ శక్తి దానిలో ఇమిడి ఉంటుంది గదా! అలాగే ఒక గ్రంథంలోనున్నా, ఆ గ్రంథకర్త యొక్క వివేచనంతా అవ్యక్త దశలో ఉంటుందని గమనార్హము. జ్ఞానశక్తులు మూర్తీభవించిన శ్రీఅరవిందుల గ్రంథాలలో ఈ అవ్యక్త శక్తితత్వము అపూర్వము. శ్రీఅరవిందుల స్వరూపమే వారి గ్రంథమన్న మాట.

అందువల్ల ఏకాగ్రతతో వారి గ్రంథాలను పఠిస్తే, మూలతత్వము సులభంగా గ్రహించవచ్చును. ఏ కారణంగానైనా ఆ గ్రంథమును పఠించటం సాధ్యం కానప్పుడు పేజీలు తిరగేసి అక్కడక్కడ చూసినా కూడ సత్ఫలితాలను పొందవచ్చుననటం నిస్సందేహం.

అయితే, సందేహనివృత్తికే పఠించే గ్రంథముల పఠనము, వాటిని ఆకళింపు చేసుకోవటం ఆషామాషీ గాదు. ఏదో ఒక మోస్తరుగా పఠిస్తే ప్రయోజనం శూన్యం. అందువల్ల శ్రద్ధగా గాఢమైన ఆకాంక్షతో ఏకాగ్రచిత్తముతో గ్రంథము పఠించినపుడు బీజాక్షర సమూహాశక్తి సమ్మిళితమైన గ్రంథాక్షరశక్తుల సమ్మేళనము

పాఠకుని స్పృశింపగా, అనగా సాధకుని ఆకాంక్ష యందున్న పఠన శక్తియున్నూ, గ్రంథాక్షరము లందున్న మహాశక్తియున్నూ ఏకం కాగా నీకు సందేహనివృత్తి కాగల వాక్యాల వద్దకే నీ చూపుడు వేలు చేరుకొంటుంది. ఈ పద్ధతికి శ్రద్ధయే పరమార్థము. శ్రద్ధ లోపిస్తే ఇక ఇంతే సంగతులు.

కొన్ని ప్రత్యేక గ్రంథాలలో మాత్రమే ఈ విశేషము మనము గమనించగలము. మహావాక్యముల లాంటి సూక్తులు, సూత్రములు మొ॥ వాటి యందు ఈ పద్ధతి సత్ఫలితాలను ఇవ్వగలదు.

చివరగా ఒక మాట. మనము ఆశించే జవాబు గ్రంథము యొక్క ఆధ్యాత్మిక శక్తిపై ఆధారపడి వుంటుంది. ఉదా॥ ఒక నవలలో ఈ శక్తి శూన్యం. బీజాక్షర శక్తుల సమూహము వంటి గ్రంథంలో మనము ఆశించే జవాబు రావటం తథ్యం.

మూలం: శ్రీమాత
అనువాదం: శ్రీ శరణ్

(*CWM* Vol. 8, pp. 163-65)

నీవు మన ఆశ్రమ ప్రచురణ లన్నిటినీ పఠించినట్లు చెబుతున్నావు. అయినా, నీ జీవితంలో ఎట్టి మార్పు సంభవించలేదు. పఠనం నిరుపయోగమని నీవు ఆవేదన చెందుతున్నావు. అయితే పఠించిన తరువాత మంచిచెడుల విశ్లేషణ నీకు అలవడుతుంది. నీ అంతరంగం ఇంకా ఎదగలేదన్న మాట. అందువల్ల దాని యొక్క ప్రభావము నీపై కనిపించుట లేదు. మున్ముందు ఒక రోజు తప్పక నీ అంతరంగం నీపై చక్కని ప్రభావం చూపించ గలదు. నీవు గ్రంథపఠనానికి దూరము యుండినట్లయితే ఈ విశ్లేషణ కొరవడి, జ్ఞానశూన్యుడవని తలచగా, ఈ అజ్ఞానావస్థ ఘోర విపత్తని గ్రహించగలవు.

శ్రీమాత

(*The White Lotus* by Ravindra, p. 159)

యోగానికి తెలివితేటలు అవసరమా?

శాస్త్రగ్రంథ పఠనము చేతనూ, తత్వ మీమాంసా వ్యాసంగము చేతనూ పరమేశ్వరుని గూర్చి బుద్ధితో తెలిసికొనుటకు కృషి చేసి నంత మాత్రాన చాలదు. ఏలయన, నిత్యుడైన యా పరమేశ్వరుని గూర్చి శాస్త్రజాలము చెప్పినదంతయూ మనము తెలిసికొన వచ్చును గాక; అనంతుడైన యీ భగవానుని గూర్చి యోజింపద గినదంతయూ మనము యోజింపవచ్చు గాక; కాని, బుద్ధికింత దీర్ఘ పరిశ్రమ కల్పించినప్పటికీ, తుదకా పరమేశ్వరుని మనమే మాత్రమూ తెలిసికొన్నవారము కాకపోవచ్చును. ప్రబలమైన యోగ సాధనకీ బుద్ధిపరిశ్రమ తొలి సన్నాహముగ మాత్రమే పనికి వచ్చును. కాని ప్రతి సాధకుడూ ఈ పరిశ్రమ చేసితీరవలెననెడి నియమము లేదు. సాధకులెల్లరూ విధాయకంగా చేయవలసిన ట్టియూ, చేయగలిగినట్టియూ పరిశ్రమ కాదిది. తత్వవిచారణాత్మకమైన తార్కికబుద్ధితో సాధింపనగు జ్ఞానవిశేషము యోగసాధనకు తప్పనిసరియే యగునెడల, ఏ కొలదిమందికో తప్ప తదితరులకు యోగము కేవల మసాధ్యమైపోవలసి వచ్చును.

పరమేశ్వర తేజము మనలో, తన కార్యకలాపము నుపక్రమించుటకై మన వలన అపేక్షించెడి విషయములు రెండు మాత్రమే. ఒకటి, ఆత్మ నుండి పిలుపు; రెండు, మనస్సునందు తగుమాత్రమైన ప్రాపు. ఈ ప్రాపును మూడింటి ద్వారా సంపాదించవచ్చును. ఒకటి, – బుద్ధియందు పరమేశ్వరుని గూర్చిన దృఢభావము, రెండు, – మన కర్మప్రవృత్తియందు తత్సంబంధమైన యిచ్ఛ, మూడు – మన హృదయమునందు తన్నిమిత్తమైన అభిలాష, నమ్మకము, అక్కర. ఈ మూడునూ సమశ్రుతితో, సమగతితో నడువజాలకుండునేని, మూడింటిలో నేదొయకటి ప్రాధాన్యము వహింపవచ్చును. బుద్ధియందలి భావమునకు ప్రారంభదశలో తగినంత పుష్టి లేకపోవచ్చును – ఉండదు. హృదయము నందలి యభిలాష సంకుచితమై అసంపూర్ణమై యుండవచ్చును; నమ్మకము తగినంతగా ప్రకాశవంతము గాకపోవచ్చును; సుస్థిరమైన జ్ఞానా

ధారము లేకపోవుటచే దాని వెలుగు ఒక్క తీరున నుండక త్వరలో క్షీణించిపోవచ్చును. అంతేకాదు. తరచుగ నారిపోవుట కూడ సంభవింపవచ్చును. హోరుగాలిలో దివ్వెనుబోలె, మరల నతికష్టముతో దానిని వెలిగించవలసిన యవసరము పట్టవచ్చును.

కాని, మన అంతరాంతరముల నుండి సుదృఢమైన యాత్మనివేదన మెప్పుడు ప్రారంభమగునో, మన ఆత్మనుండి వచ్చెడి పిలుపుచే మనకు అవబోధ మెప్పుడు కలుగునో, అప్పుడీ యంతఃకరణ సంఘాతమంతయూ నెంత లోపభూయిష్టమైననూ ఈశ్వర కార్యమునకు తగిన యుపకరణమే యగును.

సుశిక్షితమైన మేధస్సు, సమున్నత జ్ఞానం కొరకు మనస్సును సన్నద్ధం చేసే మంచి సాధనం. కాని అది తనంత తానే యోగజ్ఞానాన్ని లేదా భగవతత్త్వాన్ని తెలుపజాలదు భగవంతుని గూరిన భావాలను మాత్రమే ఇవ్వగలుగుతుంది. భావాలను కల్గి ఉండటం జ్ఞానం కాదు కదా! సాధనా క్రమంలో మేధస్సు ఉన్నత మానసంగా (Higher mind) రూపాంతరం చెందాలి. అప్పుడే అసలైన జ్ఞానానికి మార్గదర్శనం కాగలదు. (In the course of the sadhana intellect has to be transformed into the higher mind which is itself a passage towards the true knowledge)

మానవులు తమ మేధస్సును అనుసరించాలని తప్పొప్పులకు చెందిన తమ స్వంత భావాలను విశృంఖలంగా కలిగి ఉండాలనీ, నొక్కిచెప్పాలనీ అనుకుంటాం. మేధస్సు మానవుని అత్యున్నత సాధనమనీ, అందుకే మానవుడు తన భావాలను అనుసరించి ఆలోచించాలని, నడచుకోవాలనీ అంటారు. కాని ఇది నిజం కాదు. మేధస్సుకు ప్రాణశక్తికి వలెనే మార్గదర్శనానికీ, నియంత్రణకూ ఒక అంతర్జ్యోతి అవసరం. మేధస్సు కంటే ఉన్నతమైన దాన్ని గుర్తించాలి. సత్యజ్ఞాన మూలక క్రియాశక్తికి మేధస్సు కేవలం మధ్యవర్తి మాత్రమే.

*

కోరికకు చెందిన ప్రాణికచర్య వలెనే మేధోచర్యల అలజడిని కూడా స్తబ్దం చేయాలి. అప్పుడు శాంతి, నిశ్చలతలు సంపూర్ణ

మౌతాయి. జ్ఞానం దివి నుండి భువికి దిగాలి. ఈ నిశ్చలతలో సాధారణ మేధో కర్మలు లేదా ప్రాణిక కర్మలు ఉపరితల చలనాలు మాత్రమే. వీటితో నిశ్శబ్దమైన అంతస్సత్తకు సంబంధం ఉండదు. అవిద్యకు సంబంధించిన పనులను సత్యజ్ఞానం లేదా నిజమైన జీవనక్రియగా రూపాంతరం చెందించాలంటే ఈ స్వేచ్ఛ అవసరం.

శ్రీఅరవిందులు

*

ఒక విశాలమైన, మార్దవమైన, సంపన్నమైన ఉత్తమ మేధోసాధనం తయారీకి మేధో సంస్కృతి అనివార్యమే. కాని దాని పని అంతటితో సరి.

మనస్సును అధిగమించడానికి ఇది ఎక్కువగా అనువు కంటే అడ్డంకి మాత్రమే. ఎందుకంటే సాధారణంగా సంస్కారవంతమైన, విద్యావంతమైన మనస్సు తనలోనే సంతృప్తి చెందుతుంది. అరుదుగా మాత్రమే తనను స్తబ్దపరచుకొని తనను తాను అధిగమించడానికి ఉద్యుక్తమౌతుంది.

*

చైత్య లేదా ఆధ్యాత్మిక విషయాలను ప్రస్తావించడంలో నా ఉద్దేశ్యం శబ్దాల చదునైన ఉపరితలం వెనుక లోతుగా, నిజంగా ఉపస్థితమై, భిన్నత్వంలో సన్నిహిత సంబంధం కలిగి ఉన్న విషయాలని. మేధోపరమైన నిర్వచనాలు, వివేచనలూ పూర్తిగా బాహిరమైనవి, కఠినమైనవి – అవి నిజమైన సత్యాన్ని చేరుకోజాలవు.

*

ఓ మధుమయీ! శ్రీఅరవిందుల రచనలను చదివినా, విన్నా ఈ నిత్యసత్యం, ఈ సుందర భావ వ్యక్తీకరణ నుండి ప్రజలు ఏ విధంగా తప్పించుకో గల్గుతున్నారని నాకాశ్చర్యం కల్గుతున్నది. ఆయనన్నొక సమున్నత సృష్టికర్తగా, స్వచ్ఛమైన కళాకారుడిగా, సమున్నత కవిగానైనా ఇంకా గుర్తించకపోవడం నిజంగా ఒక వింతే. కాబట్టి నా తీర్పులూ, అభినందనలూ నా ఆచార్యుల పట్ల భక్తిభావనచే ప్రభా

చితమైనవని అనిపిస్తున్నది. ప్రతివాడూ భక్తుడు కాదు కదా? కాని ఇది నిజం కాదనిపిస్తున్నది. మరైతే ఆయన ప్రవచనాలకు మానవుల హృదయాలు ఎందుకు సమ్మోహితం కావడం లేదు?

శ్రీఅరవిందులను ఎవరు అవగతం చేసుకోగలరు? ఆయన ఈ విశ్వమంత వైశాల్యం, ఆయన బోధన అనంతం.

ఆయనకు సన్నిహితం కావటానికి ఒక్కటే మార్గం ఆయన్ను చిత్తశుద్ధితో ప్రేమించడం, ఆయన రచనలకు మనను మనం నిస్సంకోచంగా సమర్పించుకోవడమే. ఈ విధంగా శ్రీఅరవిందులు ఊహించిన ప్రపంచ రూపాంతరీకరణకు ప్రతివారూ తనకు సాధ్యమైనంత ఎక్కువగా దోహదం చేయగల్గుతాడు.

*

నేనేదైనా తాత్విక పదజాలంతో చదివినా, ఏ కొంత తాత్విక దృక్పథంతో మాట్లాడినా, నీ కర్థం కాదని నేను గుర్తించాను. ఇందుకు కారణం నువ్వెంత మాత్రం తాత్విక సాముగరిడీలు చేయకపోవడమే. నువ్వు మేధావివి కాదనీ – నీలో అర్థం చేసుకొనే శక్తి లేదనీ కాదు. నువ్వు సరైన సాధన చేయలేదనే అర్థం. దీన్ని మరో విధంగా చెప్పాలంటే, ఆ భాషను నువ్వు నేర్చుకోలేదు. అదే పదాలను వాడుతున్నాం. వాటి మధ్య సంబంధంలో కొంచెం తేడాతో, వేరే జాతీయాలతో, వేరే దృక్పథంతో, అనుగుణమైన సాధన చేస్తే తప్ప నీకా భిన్న దృక్పథం కలగదు. సులభంగా చెప్పాలంటే తగిన శిక్షణ లేనిదే సాముగరిడీ అభ్యాసం చేయలేము కదా! నీ కెంత ప్రత్యేక సామర్థ్యం ఉన్నా, వరప్రసాదివైనా, తగిన అభ్యాసంతో సుశిక్షితుడివి కాకపోతే వాటిని నువ్వు చేయలేవు.

*

ఓ ప్రియమైన అమ్మా! నాకు తత్వవిచారం, నీతీశాస్త్రాల్లో ఒక క్రమబద్ధమైన ప్రణాళికను అవలంబించాలని ఉంది.

తత్వశాస్త్రం, నీతిశాస్త్రాలను చదవదల్చుకుంటే కేవలం మేధోపరమైన అభ్యాసాల వలె, నీ మెదడుకు కొంత పరిశ్రమ

కలిగించటానికి మాత్రమే చేయాలి. కాని ఇది విజ్ఞానానికి మూలం కాదనీ, ఈ పద్ధతిలో జ్ఞానానికి చేరువ కాజాలవనీ తెలుసుకోవాలి.

మూలం: శ్రీమాత

అనువాదం: కమలాకర వేంకటరావు ('యోగసమన్వయము' నుండి), మాడభూషణం రాజగోపాలాచార్య

(*CWSA* Vol. 23 (*Synthesis of Yoga)*, pp. 81-82; *SABCL* Vol. 24, pp. 1244- 246; *CWM* Vol. 16, p. 198; Vol. 3, p. 64; Vol. 16, pp. 310-11; Vol. 8, p. 365; Vol. 16, p. 199)

పుస్తకాలు చదవటం వలన ప్రయోజనం

మానసిక దశ ప్రారంభంలో మంచి పుస్తకాల అధ్యయనం కొంత సహాయాన్ని అందిస్తుంది. చక్కని వాతావరణాన్ని కల్పించి మనసుని సంసిద్ధం చేస్తుంది. సున్నితమనస్కులకు మనోప్రపంచంలో సాక్షాత్కార అనుభూతులను కూడా కలుగ చేయవచ్చు. దాన్ని జ్ఞానమనేందుకు వీల్లేదు. వాటి ప్రయోజనమంతటితో సరి. ఆ తర్వాత జ్ఞానసముపార్జనను నీ అంతట నువ్వు ప్రత్యక్షంగా పొందవలసిందే!

*

నీ వికాసం నువ్వు చదివే పుస్తకాల మీద ఆధారపడి వుంటుంది. తత్వశాస్త్రం మనసుని సూక్ష్మభూమికలలో పయనింప జేస్తుంది. మనసు కొన్ని భావాలను అట్టే పెట్టుకోడం ప్రారంభిస్తుంది.అదే దాని వలన కలిగే అనర్థం. అంతరంగ దృష్టికి అడ్డుతగిలి జ్ఞానాన్ని కలుగనివ్వదు (The only harm it can do is if the mind begins clinging to ideas instead of going forward to direct experience.)

*

బుద్ధికుశలత, వ్యక్తి చదివిన చదువు, పుస్తకాల భారంపై ఆధార పడదు. అది అతని మెదడుకు మేత మాత్రమే – మానవజీవితం కూడా అంతే కదా మరి.

*

యోగసాధనకు సంబంధించిన పుస్తకపఠన సమయంతో ధ్యానం చెయ్యాలనిపించడం మామూలే. దానిని సోమరితనంగా భావించడం పొరపాటు. అంతరంగం అభిలషించినపుడు ధ్యానం తప్పకుండా చెయ్యాలి. బద్ధకించకూడదు.

*

పనులు, మాట్లాడుట, చదువుట, వ్రాయుట అన్నీ ప్రశాంతంగా ఉన్నత చైతన్యంతో (మనస్సుతో కాదు) ఆంతరంగికంగానే జరిగిపోవాలి కాని – సామాన్య చైతన్యస్థాయిలో వలె చంచలమైన అలజడి వాతావరణంలో కాదు. (All should be done quietly from within – working, speaking, reading, writing as part of the real consciousness – not with the dispersed and unquiet movement of the ordinary consciousness.)

పఠనాశక్తి మనసుని బంధించినపుడు (కట్టిపడవేసినపుడు) కొందరు అలా చదవడంలోనే కాలం గడపడానికి యిష్టపడతారు. ఇతర వ్యామోహాల వలెనే, పఠనాశక్తి కూడా దాన్ని అది తృప్తిపరచుకునేందుకు అలవాటుగా మారుతుంది. ఈ ఆకర్షణలు మనల్ని గుప్పెట్లో పెట్టుకోనీయక వాటిని మనం వినియోగించుకోవాలి. ప్రకృతి శక్తులను అదుపుచేసేందుకు ఒక కేంద్రస్థానం ఎప్పుడూ ఉండాలి. దానికి కావలసినది ఎన్నుకునే నిర్ణయాత్మక శక్తి కలిగి వినియోగం తెలిసి వాటి చేష్టలను అనుసంధానించగలగాలి. అలా కానపుడు ప్రతీ ఆకర్షణ వ్యక్తిత్వంలో ఏదో ఒక భాగాన్ని అంటిపెట్టుకోగల ప్రమాదముంది. (విద్యార్థి, సంఘంలోని మానవుడు, రసికుడు, యోధుడు) వివిధ ఆకర్షణలు మానవుని తమ గుప్పెట్లో పెట్టుకుని నిర్దేశిస్తాయి. అలాకాక అది మానవుని అధీనంలో ఉండి ఉపయోగపడినవుడు అంత ప్రమాదకారి కాదు.

సాధనకు కవిత్వం ప్రత్యుమ్నాయం కాజాలదనేది స్పష్టము. కాని కవిత్వం అనుసరణీయ మవగలదు. వెలువడే భావాలను (భక్తి, అర్పణ మొ॥) వ్యక్తీకరించి స్థిరీకరించగలదు. తనకు కలిగిన అను భవాన్ని వ్యక్తీకరించి అనుభవశక్తిని బలోపేతం చేయగలదు. ఉప నిషత్తులు, గీత మొదలగు పుస్తకాలు అధ్యయనం, భక్తి సంగీతం ఏదో ఒక దశలో సాధకునికి సహాయపడతాయి. అలాగే కవిత్వం కూడా సాధనకు సహాయకారి అవుతుంది. బాహ్యాచైతన్యానికి, అంతరంగానికి లేక ప్రాణికానికి రహదారిగా మారుతుంది. కానీ అ దశలో ఆగిపోతే సాధించినదేమీ ఉండదు. సాధన ప్రధాన విషయమై ఒప్పారాలి. మానవ స్వభావాన్ని పరిశుద్ధ మొనర్చి సర్వ సమర్పణ గావించేది సాధనయే. సాధన అనగా చైత్యపురుషుని, అంతరంగాన్ని, ప్రాణికాన్ని ఆవిష్కరింపచేసేది. దైవసంబంధాన్ని పటిష్టం చేసి సన్నిధికి చేర్చేది. చరాచర సృష్టి యందలి సర్వవిష యములందు దైవాన్ని సాక్షాత్కరింపచేసేది. ఆత్మార్పణ, భక్తితో విశ్వచైతన్యంలో చైతన్యమును వికసింప చేసేది, ప్రతి ఒక్కరిలోను పరమాత్మను సాక్షాత్కరింపచేసి మనిషిని చైత్యపరివర్తనము, ఆధ్యాత్మిక పరివర్తనము కావించునదే సాధన. (Sadhana must be the main thing and sadhana means the purification of the nature, the consecration of the being, the opening of the psychic and the inner mind and vital, the contact and presence of the Divine, the realisation of the Divine in all things, surrender, devotion, the widening of the consciousness into the cosmic Consciousness, the Self one in all, the psychic and the spiritual transformation of the nature.)

*

చదువదగిన పుస్తకాలు – యోగసాధనకు ఉపయోగపడేవి, సహ కరించేవి, దివ్యప్రయోజన సిద్ధికై అవకాశాలను పెంపొందించేవి.

చదవకూడని పుస్తకాలు – ఏమాత్రం విలువలేనివి, లేక కేవలం వినోదం కలిగించేవి, కేవలం కాలక్షేపంతో మనసుని తృప్తి పరచేవి.

ప్రారంభంలోనూ చిట్టచివర కూడా చదువును దివ్యసంకల్పానికై అర్పించాలి.

శ్రీఅరవిందులు

*

నా సాధనకు అధ్యయనం ఎంతవరకు తోడ్పడగలదు?

అధ్యయనం మనసుకు, ప్రాణికానికి మంచి శిక్షణ ఇస్తుంది.

*

అధ్యయనం మనసుని బలోపేతం చేసి ప్రాణికం యొక్క కోరికలను ఉద్రేకాల నుండి దృష్టిని మరల్చుతుంది. మనసుని అదుపులో పెట్టగల శక్తివంతమైన మార్గాలలో పఠనాసక్తి కలిగి ఉండడం ఒకటి. అందువలన అధ్యయనం చాలా ప్రాధాన్యత కలిగి ఉంది.

మూలం: శ్రీమాత
అనువాదం: ఎస్. ఎస్. లక్ష్మి

(*SABCL* Vol. 24, pp. 1273, 1280, 1278; Vol. 23, pp. 739, 692; Vol. 24, pp. 1274-75, 1271, 1279, 1274; *CWM* Vol. 17, p. 146; Vol. 12, p. 133)

శాస్త్రము – శాస్త్రాతీతము

మన వ్యక్తిగత ఆలోచనలకు, ఆశయాలకూ, రాగాలకు, ద్వేషాలకూ, స్వార్ధపరమైన ఆవేశాలకు, అభిలాషలకు అతీతమైన ఒక ధర్మాన్ని ఏర్పరచటమే శాస్త్రం లక్ష్యం. ఇటువంటి ఈ సమాజంలో అర్థవంతంగా, సమర్థవంతంగా మనుగడ సాగించడానికి స్వీయ నియంత్రణ అవసరం. అంతే కాకుండా విముక్తికి (liberation) సన్నద్ధం కావాలంటే సాత్విక అహంకారాన్ని కూడ సాంతం తగ్గించుకోవాలి – ఇదిగో ఇటువంటి స్థితినే శాస్త్రం మనకు కలిగిస్తుంది.

పూర్వం శాస్త్రం అంటే వైదిక ధర్మమే! మానవ తత్వానికి, ప్రాపంచిక సూత్రాలకు సంబంధించిన పరిపూర్ణ విజ్ఞానం ఆధా

రంగా ఈ ధర్మం రూపొందింది. కాబట్టి మానవుడు తనను తాను తెలుసుకుని, తన ప్రవృత్తికి తగ్గట్టు ఈ ప్రపంచంలో జీవించడం ఎలాగో శాస్త్రం తెలియజేస్తుంది.

తరువాత కాలంలో స్మృతి ప్రమాణమే శాస్త్రం అయింది. ఈ దశలో శాస్త్రం, వేదం చెప్పిన వర్ణసిద్ధాంతం ప్రకారం మనుమలను స్థూలంగా నాలుగు వర్ణాలుగా విభజించి జీవనామార్గానికి కొత్తరూపం ఇవ్వడానికి ప్రయత్నించింది.

అయితే ఇప్పుడు శాస్త్రం అంటే కొంచెం మార్చి చెప్పుకోవాలి. యాంత్రికంగా, మూఢంగా అనుసరించే ఆచారాలు, సంప్రదాయాలు సాంఘిక అలవాట్లే కాదు – వాటిని మించిన ఒక వ్యవస్థ.

అది సాంఘికం కాదు – తామసం

క్రమశిక్షణగల సాధన కాదు – ఒక బంధనం

స్వార్థం, ఆత్మాభిమానం, దురహంకారం, స్వీయాభిప్రాయం – వంటి వాటి ప్రభావంతో తమకు అనుకూలంగా అత్యున్నత శాస్త్రాన్ని సైతం దుర్వినియోగం చేయగలిగే అవకాశం ఉంది.

వాస్తవానికి శాస్త్రం అనేది మోక్షసాధనకు ఒక మహత్తరమైన సాధనం, శబ్దబ్రహ్మ. అయితే మనం కేవలం సాధనతోనే సరిపెట్టుకో కూడదు. మనం కన్ను తెరిచింది మొదలు మొత్తం మన దృష్టి అంతా నిజమైన స్వేచ్ఛ మీదే కేంద్రీకృతం కావాలి. సంపూర్ణ శరణాగతితో తన కర్మలను సైతం భగవదర్పణం చేసి మోక్షం పొందిన జీవి, మోక్షసాధకుడు; శబ్దబ్రహ్మ అయిన ఈ శాస్త్రాన్ని సైతం అధిగమించి వెళ్ళగలడు, శబ్దబ్రహ్మాతి వర్తతే.

శాస్త్రగ్రంథముల ప్రామాణ్యమునూ అర్థసంపదయూ నెంత అద్భుతమైనవప్పిటికి, పరమ సత్యమునవి ఖండఖండములుగ, వ్యక్తం చేయునేకాని పూర్ణముగ వ్యక్తపరుపజాలవని పూర్ణయోగ సాధకుడు ముఖ్యముగ జ్ఞాపకముంచు కొనవలెను. ఎంతటి గొప్ప శాస్త్రమునైననూ అతడు దానిని ఉపయోగించుకొనునే కాని దానికే బద్ధుడైపోడు.

గంభీరార్థమూ, విశాలమూ, ఉదారమూ నగు శాస్త్రము, నిజ ప్రభావముచే అత్యుత్తమ శ్రేయస్సు నాతనికి సమకూర్చవచ్చును. తనకు గలుగు మహనీయ సత్యావబోధమూ, మహత్తరానుభవ సంపదా దాని మూలముననే యని యాతని అనుభవమున తోచు చుండవచ్చును. చిరకాలము ఏ ఒక్క శాస్త్రమునో, లేక, ఒకటి తర్వాత నొకటిగా అనేక శాస్త్రములనో, ఆధారము చేసికొని అతని యోగసాధనము నడువవచ్చును. హిందూ సంప్రదాయము నను సరించు సాధకులు భగవద్గీతనో, ఉపనిషత్తులనో, వేదమునో ఆధారముగా గ్రహించవచ్చును. లేదా, వివిధ శాస్త్రములయందలి సత్యముల అనుభవ పుష్టిని ఏకకాలముననే సాధకుడు సంపాదిం చుకొనుచూ, పౌర్వికి సంపదచే భవిష్యత్తును సుసంపన్న మొన ర్చుకొనుచూ యోగపరిపుష్ఠి నందవచ్చును. ఇంతచేసిననూ, తుద కాతడు, శాస్త్రాతీతుడై, ఆత్మస్థుడై మెలగుట నేర్చుకొనక తప్పదు. ఈ సాధనమతడు మొదటినుండియూ చేయగల్గిన మరీ మంచిది. 'శబ్దబ్రహ్మాతివర్తతే' శబ్దబ్రహ్మమున కతీతముగనూ, 'శ్రోతవ్యస్య శ్రుతస్యచ' – ఇంతవరకు విన్నదానికీ, ఇకముందు వినబోవు దానికీ అతీతముగ వర్తించునట్టిది. సాధకుడు సాధించవలసినది ఒక్క పరమసత్యమునేగాని గ్రంథములను గాదు.

మూలం: శ్రీఅరవిందులు
అనువాదం: పున్నమరాజు నాగేశ్వరరావు; కమలాకర వేంకటరావు ('యోగ సమన్వయము' నుండి)

(*CWSA* Vol. 13, p. 80; Vol. 23, pp. 55-56)

శ్రీఅరవిందుల బోధనలు[1]

దృశ్యమాన ప్రపంచం యొక్క యథార్థ స్వరూపము

శ్రీఅరవిందుల బోధనలు మన ప్రాచీన ఋషులు చెప్పిన జ్ఞానదీపికలతోనే ప్రారంభమవుతాయి. ఈ విశ్వంలో కనిపించే ప్రతి రూపానికి వెనుక పరమాత్మతత్వముంటుంది. చైతన్యముంటుంది. అన్నిటిలో ఉండే ఆత్మ ఒక్కటే. అది ఆద్యంతములు లేనిది. జీవులన్ని ఆ పరమాత్మలోనే ఐక్యమై ఉన్నప్పటికీ ఒక వేర్పాటు చైతన్యంవల్ల విడిపోతున్నాయి. వారి మనః ప్రాణ శరీరాలలో ఉండే సత్యమైన ఆత్మను తెలుసుకోలేని అజ్ఞానం అది. ఒకానొక మానసికప్రక్రియ ద్వారా ఈ వేర్పాటు చైతన్యపు తెరను తొలగించి మనలోను, అందరిలోను ఉన్న నిజమైన ఆత్మను తెలుసుకోవటం సాధ్యమే.

చేతనా పరిణామము

ఆ ఏకైక పరమాత్మ, ఆ చైతన్యం భౌతికపదార్థంలో చిక్కుకొని ఉన్నదని శ్రీఅరవిందులు అంటారు. ఆ చిక్కులో నుంచి విమోచనం కావడమే పరిణామక్రమము. జడంగా కనిపిస్తున్న దానిలో నుంచి చైతన్యం పైకి ఉబుకుతుంది. ఇలా వచ్చిన చైతన్యం ఊర్ధ్వముఖంగా పెరగాలని, విస్తరించాలని ఇంకా ఇంకా పరిపూర్ణం కావాలని, స్వయంసిద్ధంగా ప్రేరణ పొందుతుంది. ఈ విధంగా విడుదల పొందిన చైతన్యం ఎక్కే మొదటి మెట్టు జీవం. రెండోది మనస్సు. కాని పరిణామక్రమం మనస్సుతో ఆగిపోదు. ఇంకా స్వేచ్ఛగా ఎదిగి గొప్ప ఆధ్యాత్మిక, అతిమానసిక చైతన్యంలోకి పెరగాలని ఎదురు చూస్తుంది. పరిణామక్రమంలో తర్వాతి మెట్టు అతిమానసము. అంటే పరమాత్మయొక్క శక్తినిలయంగా ఉండే చైతన్యమయ జీవి. అప్పుడు పదార్థంలో అంతర్లీన

---

[1] ఇక్కడ శ్రీఅరవిందులు తనను గురించి తాను ఉత్తమ పురుషంలో చెప్పుకుంటున్నారు.

మైన దైవత్వం పూర్తి విముక్తి పొందుతుంది. ప్రాణికోటిలో పరి పూర్ణత అభివ్యక్తమవుతుంది.

అతిమానసం దిగివచ్చుట ద్వారా రూపాంతరీకరణము

పూర్వం వృక్షకోటిలోనూ, జీవరాశిలోను ఉద్దేశపూర్వక మైన సంకల్పం లేకుండానే పరిణామక్రమంలోని మొదటి మెట్లను ప్రకృతి అధిరోహించింది. ఇప్పుడు చేతనాత్మక సంకల్పమే పరిక రంగా చేసి ప్రకృతి మానవునిలో పరిణతి పొందగలుగుతోంది. కానీ, ఇది కేవలం మానవుని మానసిక సంకల్పం వల్ల జరిగేది కాదు. ఎందువల్లనంటే మనస్సు కొంతవరకే పోతుంది. ఆ తర్వాత వర్తులంగానే తిరగగలదు. ఒక పరివర్తనం జరగాలి. మనస్సు ఇంకా ఉన్నత తత్త్వంగా మారేటట్లు చైతన్యాన్ని మళ్ళించాలి. పూర్వపు తత్వసాధన, యోగాభ్యాసాలలో ఈ పద్ధతిని గమనిం చవచ్చు. ఆ రోజుల్లో ప్రపంచానికి దూరంగా వెళ్ళి పరమాత్మలో లీనమవడానికి సాధన చేసేవారు. శ్రీఅరవిందులు చెప్పేదేమంటే, ఆ ఉన్నత తత్త్వాన్ని ఇహలోకంలో అవతరింపచేయటం సాధ్యమే; ఆ ఆధ్యాత్మిక పరతత్వాన్ని ఈ ప్రపంచం నుంచి విముక్తం చేయ టమే కాదు. దానిని ఈ లోకంలోనే నిలిపి, మనస్సుయొక్క అజ్ఞానాన్ని, పరిమితజ్ఞానాన్ని తొలగించి, అతిమానస సత్యచైత న్యాన్ని ప్రవేశపెడుతుంది. అంతర్గతమైన పరమాత్మకు స్థిరైన పరి కరమవుతుంది. దాని ద్వారా మానవుడు తన శక్తిసామర్థ్యాలను, అంతరంగాన్ని కూడా తెలుసుకొని ఇప్పటిదాకా ఉంటూ ఉన్న జంతుమానవత నుంచి దివ్యమైన జాతిగా పరిణామం చెందగలడు. ఇంకా తెర మరుగునే ఉన్న అతిమానసతత్వం పైనుంచి అవత రించి మానవుని మార్చి పరివర్తన చేయటానికి వీలుగా తనలోని సకల భాగాలను తెరిచేందుకు యోగసాధనలోని మానసిక క్రమ శిక్షణను ఉపయోగించుకోవచ్చు.

అయితే ఇది వెంటనే జరగదు. నిర్ణీత కాలపరిమితోలోనూ జరగదు. ఒక్క పెట్టున వచ్చి చేసే అత్యద్భుతమైన పరివర్తనంగా కూడా జరగదు. అతిమానస అవతరణ సాధ్యం అయే ముందు సాధకుడు చేయవలసింది చాలా ఉంది. మానవుడు ఎక్కువగా పైపైన ఉండే మనస్సు, ప్రాణం శరీరాలలోనే జీవిస్తాడు. కానీ అతనిలో అంతర్లీనంగా అంతులేని అవకాశాలు కలిగిన జీవి ఉన్నాడు. అతడు దాని జ్ఞానాన్ని పొందాలి. ఇప్పుడు అతను పొందుతున్నది దాని అత్యల్ప ప్రభావము. అయినప్పటికి అదే అతనిని ఇంకా ఎక్కువ సౌందర్యము, సామరస్యము, సామర్థ్యము, జ్ఞానముల కోసం నిరంతరం ప్రయత్నం చేసేటట్లు ముందుకు తోస్తున్నది. అందువల్ల యోగమార్గంలో మొదట చేయవలసింది ఈ అంతర్గత శ్రేణులన్నిటినీ తెరచిపెట్టి అక్కడే ఉంటూ, బయట దాకా చూసుకుంటూ అంతర్గతమైన వెలుగు, శక్తులతో బాహ్యాజీవితాన్ని నడపాలి. అలా చేయటంలో తన లోపలి నిజమైన ఆత్మను తెలుసుకోగలుగుతాడు. అది ఈ మానసిక, ప్రాణిక, భౌతిక ధాతువులతో కూడిన బాహ్యామైన మిశ్రమం కాకుండా వాటికి మూలమైన యథార్థ వస్తువు – అఖండ దివ్యజ్యోతిలోని కణము. ఈ ఆత్మలోనే ఉండటం నేర్చుకొని పవిత్రత పొంది దాని ఒరవడిలో మిగిలిన తన ప్రకృతినంతటిని దివ్యసత్యం వైపు మళ్ళించాలి. ఆ తర్వాత ఊర్ధ్వద్వారం వివృతమైతే పరమాత్మతత్వం అతనిలోనికి అవతరిస్తుంది. అయితే అది పూర్ణమైన అతిమానసిక తేజస్సుగానీ, దాని శక్తిగానీ దిగివచ్చినట్లు కాదు. ఎందువల్లనంటే సాధారణ మానవ మనస్సుకూ, అతిమానస సత్యచైతన్యానికీ మధ్య అనేక చైతన్యశ్రేణు లున్నాయి. ఈ చైతన్యశ్రేణులను తెరచి వాటి శక్తిని మనః ప్రాణ శరీరాలలోకి తీసుకొని రావాలి. ఆ తర్వాతే సత్య చైతన్యం యొక్క శక్తి సంపూర్ణంగా ప్రకృతిలో పనిచేయగలదు. ఈ విధమైన ఆత్మశిక్షణ, సాధనా ప్రక్రియ చాలా క్లిష్టమైనది. చాలా కాలం పడుతుంది. కాని అది లేశమాత్రం లభించినా ఎంతో సాధిం

చినట్లే. అది అంతిమ విముక్తిని, పరిపూర్ణతను బాగా సాధ్యమయే టట్లు చేస్తుంది.

సంపూర్ణ పరివర్తనకై విభిన్న రీతుల సమీకరణము

పూర్వపు పద్ధతులు చాలావరకు ఈ మార్గానికి ఉప యోగపడతాయి. మనస్సును చాలా విశాలత్వంలోకి, పరమాత్మ తత్త్వంలోనికి, అనంతంలోకి వివృతం చేయడం, విశ్వచైతన్యం లోకి తీసుకొని వెళ్ళడం, ఆశలను, ఆవేగాలను అదుపులో పెట్టడం అవసరమే. బాహ్యంగా సన్యాసం ముఖ్యం కాదు. కానీ ఆశనూ, అనుబంధాల్నీ జయించాలి. దేహంపైనా, దేహావసరాలపైనా, పేరా శలూ, సహజావసరాలపైనా అదుపు తప్పనిసరిగా ఉండాలి. పురా తన సాంప్రదాయాలోని కొన్ని మూలసూత్రాలు ఈ యోగంలో ఉంటాయి. కంటితో చూసినదానికీ, వాస్తవానికీ తేడాను మన స్సుతో గమనించే జ్ఞానమార్గం; భక్తి, ప్రేమ, సమర్పణలకు హృదయంతో స్పందించే భక్తిమార్గం; స్వలాభం కోసం పనిచేసే ఉద్దేశం దగ్గర నుంచి సంకల్పాన్ని దూరం చేసి సత్యం వైపు మరల్చి అహం కన్నా మిన్నయైన వాస్తవానికి సేవ చేసే కర్మ మార్గము. ఈ విధంగా జీవి పూర్తి తర్ఫీదు పొందడం వల్ల దివ్య తేజస్సు, దివ్యశక్తి ప్రకృతిలో పనిచేసే అవకాశము ఏర్పడి అవి వచ్చినప్పుడు తెలుసుకొని స్పందించి పరివర్తన చెందగలదు....

గురువు పాత్ర

ఈ యోగంలో గురువు యొక్క ప్రేరణ, క్లిష్టదశలలో ఆయన పర్యవేక్షణలో, సన్నిధిలో ఉండడం ఎంతైనా అవసరం. లేనట్లైతే విజయావకాశానికి అడ్డం వచ్చే తప్పులని, తడబాటు లని ఎదుర్కోవలసి వస్తుంది. గురువంటే ఉన్నతమైన జీవిగా ఉన్నతచైతన్యం పొందినవారు. వారే దానికి ప్రతినిధిగాను, వ్యక్త మూర్తిగాను కూడా ఒక్కొక్కప్పుడు పరిగణించబడతారు. వారు కేవలం ఉపదేశం వల్లనే కాకుండా అంతకు మించిన తమ ప్రభా వంతో, తానే ఒక ఆదర్శంగా అయి తమ అనుభవాలను ఇతరులు

కూడా పొందేటట్లు చేయగల శక్తి ద్వారా శిష్యులకు సహాయపడతారు.

సంక్షిప్తంగా

ఇదీ శ్రీఅరవిందుల ఉపదేశము, ఆచరణ విధానము. దీన్ని ఏదో ఒక మతంగా చేయాలని వారు ఉద్దేశించలేదు. ప్రాచీన మతాలను మిళితం చేయాలని కూడా అనుకోలేదు. ఒక క్రొత్త మతం స్థాపించాలని అసలే అనుకోలేదు. దానికి కారణం వీటిలో ఏదైనప్పటికీ అది ఆయన ప్రధానోద్దేశాలకు చాలా దూరం. వారి యోగము ప్రధానంగా అంతరంగికమైన ఆత్మాభివృద్ధికి మార్గము. దాని ద్వారా ఈ మార్గాన్ననుసరించే వారు కొంతకాలానికి అందరిలోను ఉన్న ఏకైక పరమాత్మను దర్శించగలుగుతారు. మానసిక చైతన్యంకంటె ఉన్నతమైన ఆధ్యాత్మిక, అతిమానసిక చైతన్యాన్ని పొందుతారు. అది మానవప్రకృతిని పరివర్తనం చేసి దివ్యత్వంగా భాసింపచేస్తుంది.

ఆగష్టు 1934 శ్రీఅరవిందులు

అసతోమా సద్గమయ తమసోమా జ్యోతిర్గమయ

నా సత్యం అజ్ఞానాన్ని, అసత్యాన్ని త్యజించి జ్ఞానం వైపు గమించేది. తమస్సును వదిలి కాంతి వైపు పయనించేది. అహంకారాన్ని వదిలి పరమాత్మ వైపు, అసంపూర్ణతలను తృణీకరించి సంపూర్ణత్వం వైపు పయనించేది. నా సత్యం భక్తి లేదా చైత్య పురోగతికి సంబంధించిందే కాదు. జ్ఞానానికి, స్వచ్ఛతకు, దైవ శక్తికి ప్రశాంతతకూ సంబంధించింది. అట్లాగే వీటన్నిటినీ వాటి వాటి మానసిక, ఉద్రేకపర ప్రాణిక రూపాల నుండి అతిమానసిక వాస్తవం దిశగా ఉద్ధరించేంది.

*

మానవుని మహా ప్రస్థానం

మానవ జీవితమంతా దివ్యజీవనం వైపు పయనించే ఓ తీర్థయాత్ర. ఓ పర్వతారోహణము. ఓ మహాయజ్ఞం. ఆమోద యోగ్యమైన త్యాగం. కేవలం అదే మానవునికి ఈ ప్రపంచంలో ఉన్న అసలు సిసలైన పని, అతని అస్తిత్వానికి సార్థకత. ఇది లేకుంటే మానవుడు ఈ భౌతిక ప్రపంచపు విశాల వీధుల్లో ఎలాగో స్థానాన్ని పొందిన బురదజలంలోని క్షణభంగురమైన కీటకాల మధ్య పాకే మరో కీటకం మాత్రమే.

మూలం: శ్రీఅరవిందులు

('శ్రీఅరవిందులు – ఒక దీపిక' 'అఖిల' ఆగష్టు 2004 ల నుండి

(*SABCL* Vol. 26, pp.95-97; Vol. 23, p. 1049; Vol. 18, pp. 42-43)

శ్రీమాత పిలుపు

ఈ ప్రకృతిలో ఒక ఆరోహణా క్రమమున్నది. అది రాయి నుంచి చెట్టు వరకు, చెట్టు నుంచి జంతువు వరకు, జంతువు నుండి మనిషి వరకు, సంభవించింది. అందుకని మనిషి తనే పరిణామ క్రియకు మకుటమని, తన కంటె ఎక్కువ స్థాయి యింకేమి లేదని భావిస్తాడు. కాని అది చాలా పెద్ద పొరపాటు. భౌతికప్రకృతి దృష్ట్యా మనిషి కూడా ఒక జంతువే. ఆలోచించగలిగిన, మాట లాడే జంతువు. కాని తన భౌతిక జీవనసరళిలోను, బుద్ధులలోను జంతులక్షణములే భాసిస్తాయి. సృష్టి యిలాంటి లోపభూయిష్ఠ మైన జీవితో ఎందుకని తృప్తి చెంది యుండాలి? జంతువులో నుంచి మనిషి ఆవిర్భవించినట్లుగానే మరో మనిషి – అజ్ఞానానికి బానిసగా యుండే స్థాయినుంచి ఎదిగి ఊర్ధ్వముఖంగా పరిణామం చెంది – అదే బాహ్యరూపమును ధరించి వున్నప్పటికి అంతకు మించిన చేతనను పొందిన జీవి ఎందుకు రాకూడదు?

ఈ సత్యాన్ని మనకు బోధించుటకే శ్రీఅరవిందులు ఈ భూలోకంలో అవతరించారు. మానవుడు ప్రస్తుతం మానసిక స్థాయికి చెందిన జీవి. కాని అతడు కూడా పరిణామంలోని ఒక స్థాయి మాత్రమే. తత్కారణంగా అతను కూడా మరియొక మాన సేతర చేతనను పొందగలిగే అవకాశం ఉందని వారు చెప్పారు. సత్యచేతన, సంపూర్ణమైన, సమగ్రమైన, సలక్షణమైన, సుందరమైన, ఆనందమయమైన, సంపూర్ణ చైతన్యముగల జీవితమును పొంద గలిగే అవకాశము అతనికి కలదని వక్కాణించారు. శ్రీఅరవిం దులు ఈ సత్యమును భూలోకంలో ఆవిష్కరించుటకే వారి జీవి తాన్నంతటినీ ధారపోశారు. ఆ విశేష చైతన్యమే అతిమానసము. దానిని తనలో ప్రతిష్ఠించుకొని తన అనుచరులకు కూడా సిద్ధిం పజేయుటకు సహాయపడ్డారు.

మూలం: శ్రీమాత

అనువాదం: డి. సత్యవాణి (జూన్ 1999 'అఖిల' నుండి)

ఆధ్యాత్మిక గ్రంథాలు చదివినంత మాత్రాన సరిపోదు

పూర్వం అచ్చు యంత్రాలుగాని, పుస్తకాలుగాని ఉండేవి కాదు గదా. అందుకని అర్హుడైన విద్యార్థికి గురువు జ్ఞానోపదేశం చేసే వాడు. తానభ్యసించినది ఆచరించటమే విద్యార్థి కర్తవ్యము. అభ్య సించిన సత్యోపదేశాన్ని ఎంతవరకు విద్యార్థిచేత అనుష్ఠింపబడి నదో గమనించి గురువు తరువాయి పాఠ్యప్రవచనం కావించేవాడు.

ఇప్పుడు పరిస్థితులు మారినై. ప్రతి ఒక్కరూ చదువరియే! ఎవరు పడితే వాళ్లు ఇష్టమొచ్చినన్ని పుస్తకాలు చదువుకోవచ్చు. పుంఖాను పుంఖాలుగా గ్రంథపఠనం చేసి, ఎంత చదివినా తమలో ఎలాంటి మార్పు రాలేదని, బాధలు తీరలేదని, సిద్ధులు పొందలేదని వాపోవటం అవివేకం. ఆచరింపబడని అధ్యయనం అలజడిని, అశాంతిని సృష్టిస్తుంది.

విజ్ఞాన సముపార్జనకి సార్థకత సమ్యగ్యాచరణమే. ఇది విస్మరించకూడదు. అభ్యసించినిది ఆచరణలో అభివ్యక్తం కానపుడు వ్యక్తిత్వానికి, విజ్ఞానానికి మధ్య వైరుధ్యం ఏర్పడుతుంది. సాధకుడు అర్హతను కోల్పోతాడు. ఆచరింపబడని విజ్ఞానం గురించి ఎంత లెస్సగా మాట్లాడగలిగినా అది నిష్ప్రయోజనమే.

విజ్ఞాన సముపార్జన నిన్ను నీవు నిర్దేశించుకోగలిగే స్వభావ పరిణామానికి దోహదపడాలి. నేర్చుకొన్నది ఓరిమితో జీవితానికి అన్వయించుకొని ఆచరణ యోగ్యం కావించుకోవాలి.

నేర్చిన విద్య ఎంత మార్గనిర్దేశం కలిగించేదే అయినా ఆచరించాలనే దృఢసంకల్పం లేనపుడు అది నిష్ప్రయోజనమే!

నేడు సంకల్పించి రేపు మరిచే ఎంతో ఘనమైన నిర్ణయం కంటె చిత్తశుద్ధితో నిలకడగా చేసే ఎంత స్వల్ప ఆచరణ అయినా అది గొప్ప విలువైనది.

నీ ఆదర్శానికి వాస్తవరూపం ఈయవల్సినది ముందు నీవే!

ఉచితానుచితాలు చక్కగా గ్రహిస్తావు; కాని చిక్కు ఎక్కడ వస్తుందంటే ఆచరణలోనే. కాబట్టి నీవు ఆకాంక్షించ వలసినది అధికాధిక విజ్ఞాన సముపార్జన కాదు. ఏ శాస్త్ర తెలుసుకున్నా దానిని నిర్దిష్టంగా అమలుపర్చగలిగే మనోసంకల్పం ధైర్యం.

*

తెలుసుకున్నంత మాత్రాన చాలదు; ఆచరించాలి. అన్నింటికీ మించి అంకితభావం కావాలి.

*

దివ్యమహాప్రస్థానంలో నేర్చుకున్న విజ్ఞానం ఆచరణాత్మకమైనపుడు అది మరింత ఇతోధిక విజ్ఞాన సముపార్జనకు తోడ్పడుతుంది.

*

చిత్తశుద్ధితో కూడిన ఆచరణ స్వల్పమైనా కోటి గ్రంథాల అధ్యయనం కన్న మిన్న.

*

అపారమైన (శుష్క) సిద్ధాంతాలు, సలహాలు, నిర్ణయాల కంటె ఆచరణ ఉత్తమం.

చెప్పినది వినటం, విని అవగాహన చేసుకొనటం – అన్నిటికీ మించి ఆచరణ – శ్రేష్టతరం.

చిత్తశుద్ధి లేనివారు అప్రయోజకులు.

దివ్యబోధనల అధ్యయనం అవగాహన అభిలషనీయమే గాని, వాటిని జీవితానికి అన్వయింప చేసుకోవటం సర్వోత్కృష్టం.

దార్శనికులు తాము దర్శించిన ఆధ్యాత్మిక సత్యాలను సిద్ధాంతీకరించి బోధనలుగా వ్యక్తీకరిస్తారు. ఎంతటి మహత్తర దివ్యజ్ఞానోదయములైనా అవి అనుభూతి ప్రేరకములే.

ఆంగ్ల మూలం:

A drop of practice is better than an ocean of theories, advices and good resolutions.

*

To listen is good, but not sufficient – you must understand. To understand is better, but still not sufficient – you must act.

*

People who do not live what they think are useless.

*

It is good to read a Divine Teaching.
It is better to learn it.
The best is to live it.

*

All theories, all teachings are, in the last analysis, nothing but ways of seeing and speaking. Even the highest revelations are worth no more than the power of realisation that comes with them.

('ధమ్మపాద' లోని కొన్ని పద్యభాగాలకు శుక్రవారపు క్లాసులలో శ్రీమాత వ్యాఖ్యానం.)

మానసిక పరివర్తన కలిగించి మనశ్శాంతి నిచ్చే ప్రశాంత మధురవాక్కు ఒక్కటి చాలదా! మనసును కలవరపరిచే నిరర్థక వాక్కులు వేయేల!

నీ జడత్వాన్ని నిశ్చైతన్యాన్ని తొలగించగలిగే మహత్తర వాక్కు (లు) నీకు లభ్యమైనపుడు వాటి తాలూకు సద్భావనలను నిశ్శేషంగా జీర్ణించుకొని సత్ఫలితాలు అనుభవించిన పిమ్మటే క్రొత్త అంశాల నన్వేషించు.

ఎన్నో ఆదర్శ విషయాలతో బుర్ర నింపుకొని సైద్ధాంతిక పరంగా విషయ పరిజ్ఞానాన్ని కూడబెట్టుకోవటం (accumulation of knowledge) ప్రధానం కాదు. అనువైన, ప్రగతిశీలమైన ఒక్కొక్క ఆదర్శాన్నే స్వీకరిస్తూ తుదివరకు దానిని ఆచరణయోగ్యం కావించుకోవటం అత్యంత శ్రేయోదాయకం.

మూలం: శ్రీమాత

అనువాదం: కర్రా వెంకటేశ్వర్లు

(*CWM* Vol. 9, pp.66-70; Vol. 1, p. 1; Vol.16, p. 274; Vol. 17, pp. 90, 31; Vol. 14, pp. 224-26; Vol. 3, p. 228)

సమగ్రమైన యోగశాస్త్ర సారమే ప్రతి భావుక హృదయం లోనూ, అనుక్షణం స్పందించే స్పందన. అదే శాస్త్రమిచ్చే రహస్య సందేశం.

హృదయం ఆధ్యాత్మికత వైపు మళ్లినప్పుడు అంతర్గతంగా ముకుళీకృతమై వున్న జ్ఞానపద్మం, వికసిస్తూ వస్తుంది. ప్రాపంచిక వస్తువులతో లంపటం తగ్గుతూన్నకొద్దీ, జ్ఞానపద్మవికాసం పెరుగుతూ వుంటుంది. అది ఒక నివృత్తిలో జరిగే క్రియ. ఆ క్రమంలో జీవి, ఒక నిర్ణీతమైన స్థితికి వచ్చినప్పుడు, ఏ విధమైన వ్యతిరేక భావనలూ, ఏ విధమైన దుష్టశక్తులూ 'ఆత్మవికాసానికి' హాని కలిగించలేవు.

తన్ను తాను తెలుసుకోనుట

ఈ అనంతంలో తానో సూక్ష్మాణువునని తన్ను తాను తెలుసుకున్నవాడు స్వయంగా అనంతుడే అవుతాడు. జన్మాంతర సుకృతాలవల్ల అతనికి దైవకృప సిద్ధించి, ఆత్మకి స్వయం ప్రకాశం కలుగుతుంది. అదే జ్ఞానపద్మ వికాసానికి ప్రథమ సోపానం. గమ్యం చేరుకునే సాధన. సృష్టిగతిలో, ఎన్ని జన్మ పరంపరలున్నా, అక్కడికి చేరిన తరువాత, ఏదో ఒక జన్మలో ఏదో ఒక మలుపులో మోక్షం సిద్ధించి తీరుతుంది. ఇదే తన్ను తాను తెలుసుకోగలిగే యోగసారం.

స్వేచ్ఛానువాదం: డా॥ రాజేశ్వరి శంకరన్

ఆంగ్ల మూలం:

The supreme Shastra of the integral Yoga is the eternal Veda secret in the heart of every thinking and living being. The lotus of the eternal knowledge and the eternal perfection is a bud closed and folded up within us. It opens swiftly or gradualy, petal by petal, through successive realisations, once the mind of man begins to turn towards the Eternal, once his heart, no longer compressed and confined by attachment to finite appearances, becomes enamoured, in whatever degree, of the Infinite. All life, all thought, all energising of the faculties, all experiences passive or active, become thence forward so many shocks which disintegrate the teguments of the soul and remove the obstacles to the inevitable efflorescence. He who chooses the Infinite has been chosen by the Infinite. He has received the divine touch without which there is no awakening, no opening of the spirit; but once it is received, attainment is sure, whether conquered swiftly in the course of one human life or pursued patiently through many stadia of the cycle of existence in the manifested universe.

Sri Aurobindo

(*CWSA* Vol. 23, pp. 53-54)

అనుబంధం:

శ్రీమాతారవిందులు – జ్ఞానారవిందం

శ్రీమాతారవిందుల తత్వం ఏమిటి? దాన్ని తెలుసుకోవడం ఎలాగ? అన్నవి మన ముందున్న ప్రశ్నలు.

అసలు వారి రచనల్ని ఎందుకు చదవాలి? ఎలా చదవాలి? అన్నది మరో ప్రశ్న.

వాటిని చదువు కోసమే చదవాలా? వస్తుపరిజ్ఞానం కోసం చదవాలా? లేక భౌతిక విషయాల్ని సేకరించుకోవడం కోసమా? అంటే – పరమచైతన్యస్థితిని పొందడం అనే మహా కార్యసాధన ముందు అవన్నీ అప్రధానాలే. వాటికి ఎవ్విధమైన ప్రాధాన్యం వుండదు అన్నదే సమాధానం.

రూపాంతరీకరణ

శ్రీమాతారవిందుల వచనామృతం ద్వారా ఇంద్రియాతీతమైన చైతన్యాన్ని అలవరచుకొని దాన్ని పెంచుకొంటూ రసానందస్థితిని పొందడమే పరమావధి. అదే గమ్యం. దాన్ని సాధించడం కోసం, ముందు మనసుని స్థిరంగా నిలుపుకోవాలి. అయితే, అదంత తేలికైన పని కాదు. కాని, సాంకేతికమైన పదాల ద్వారా వారు నిర్దేశించిన మార్గం ఒక్కటే సులభమైన ఏకైక మార్గం. దాన్ననుసరించ కలిగితే, తద్వారా అద్భుతమైన మరో ప్రపంచం దర్శనమిస్తుంది. అప్పుడు సాధకుడికి రూపాంతరీకరణం జరిగి మనసు వశీకృతమై నిలకడగా నిలుస్తుంది. శ్రీమాతారవిందులు చూపించిన ఆ దివ్యశక్తికి ఎందరో మహానుభావులు పరవశించి పోయేరు.

అందువల్లనే సాంకేతికంగా వారు వాడిన పదాలు నిర్జీవమైన మామూలు పదాలు కావని మనం ముందు తెలుసుకోవాలి. వాటిల్లో చైతన్యతరంగాలు స్పందించి కాంతివంతమైన జ్ఞానరేఖలు ప్రసారితమవుతూ వుంటాయి. అది మాటలకీ అర్థాలకీ అతీతమైన లోకం. అదే అంతర్జగత్తు.

విశ్వవీణ

శ్రీమాతారవిందుల సూచన ఆ జగత్తుకి మార్గాన్ని చూపిస్తుంది. అది విశ్వస్రవమైన భావాతీతశక్తి కాబట్టి, అందులో ప్రవేశించే మార్గాన్ని అతి జాగ్రత్తగా ఎంచుకోవాలి. నిజానికి ఆ చలతీ సౌందర్యమే సృష్టిలో మొత్తంగా ప్రకాశిస్తూన్న రసానందం. అందులో ప్రవేశించడం అన్నది పూర్వజన్మ సుకృతం వల్ల సిద్ధించే ఒక ఆధ్యాత్మిక కళ. అది పట్టుబడితే ఆ సజీవశక్తి తనంతట తానే మనల్ని ఆకర్షించుకొని ఆనందమయ ప్రపంచంలో నిలుపుతుంది. *జీవిలో అంతర్లీనంగా వున్న చైతన్యం అక్కడ విశ్వశక్తిలో కలుస్తుంది. అప్పుడు విశ్వవీణ యొక్క ఏకైక నాదం వినబడుతుంది.*

మనకి లౌకికమైన ఎన్నో విద్యలు తెలిసి వుండవచ్చు. అవన్నీ పైన చెప్పిన 'ఆత్మ వికాసం' అనే కాంతిప్రభ ముందు మిణుగురుపురుగుల కాంతి వంటివే అని తెలిసిపోతుంది. *నిజానికి ఆ మహా కాంతిప్రభయొక్క ప్రతిబింబమే మనలో చిన్నగా, సన్నగా, ప్రకాశిస్తున్న ఆత్మ. దాన్ని ప్రజ్వలింప జేసుకోవడమే యీ విద్య.*

విషయవాంఛాపరమైన తర్కం, ఎక్కువైన కలగాపులగపు చదువులూ ఏకాగ్రతని పాడుచేసి మనసుని అసలు విషయం నుంచి తప్పించేస్తాయి. అలాటి వాటి వల్ల కలుషితం కాని నిర్మలచిత్తులూ, శాంతమనస్కులూ అయిన మహాత్ములు ఆత్మజ్ఞానంతో ఈ రహస్యాన్ని గుర్తించేరు. ఎప్పుడైతే భౌతికమైన తర్కం, ఆలోచనలూ, ఆత్మప్రకాశపు వెలుగులో కరిగిపోతాయో, అప్పుడు అవే రూపాంతరం చెంది నిర్వాణమనే మహత్కార్యానికి దోహదమవుతాయి.

అందువల్లనే శ్రీమాతారవిందుల తత్వం శరీరానికీ, మనసుకీ, హృదయానికీ అతీతమైనదవుతుంది. అదే విశ్వవీణానాదం.

మూలం: నళినీకాంత గుప్త

స్వేచ్ఛానువాదం: రాజేశ్వరీ శంకరన్

(*Collected Works of Nolini Kanta Gupta* Vol. 4, pp. 254-55)

శ్రీఅరవిందుల రచనలను చదువుట యెట్లు?

శ్రీమాతారవిందులను గురించిన కొన్ని విశేషములు మీరు నా వద్ద తెలిసికొనగోరితిరి. వారి నెరుగుటకు మూడు మార్గము లున్నవి – know about them, know of them or know them[1]

'About' అనగా ఒక మనిషి ఏమి చేయును. అతని వృత్తి, వుద్యోగము లేమి – కిమాసిత వ్ర జేతకిం? – 'of' అన అతని వ్యక్తిత్వం, గుణము, స్వభావము.

అన్నిటికంటే చివరదే శ్రేష్టమైనదనుకో. దేనిని గురించైనా సరే. నీవు తెలిసికొనదలచిన యెడల నీవు దానిలో లీనమైపోవలెను సుమా! (You have to become it!) అటుల గావించిన యెడలనే నీకు అసలైన జ్ఞానము లభించును. శ్రీమాతారవిందుల యునికిని బడయుటనగా యేమి? వారిలోని భాగమగుట. వారి చేతనలోని అంశమగుట. అదియే మన మిక్కడ వుండుటకు కారణము. నీ వటుల గావించిన యెడల చాలును. నీకు కొంచెము జ్ఞాన మబ్బి నట్లే....

శ్రీమాతారవిందుల రచనల నెట్లు చదువవలెనో, ఎట్లు చేబట్టవలెనో, ఎట్లు అర్థము చేసికొనవలెనో, మీకొకసారి చెప్పా ననుకుంటాను. ఇందు రెండు విషయములు కలవు. చదువుట, అధ్యయనము చేయుట అన ఒకటి కాదు. శ్రీఅరవిందుల రచన లను వూరికే చదవటం నిష్ఫలమే కావచ్చును – అంత పెద్ద మాటెందుకు లెండి కాని, అదేదో ఒక చిన్న సాయం, ఒక సూచి మాత్రమే యగును. అధ్యయన మనగానేమి? ఒక పుస్తకమును తీసికొని దానిలోని ప్రతి మాటకు, సమాసానికి అర్థము తెలిసి కొనుట – తెలియనివాటిని కోశములో చూసుకొనుట, ఈ విధంగా

---

[1] 'About' means what a man does, what his profession is, his occupation – *kimaisita vrajeta kim?* – and 'of' means his personality, his character, nature.

వాటి బాహ్యార్థము కనుగొనుట అవసరమే కావచ్చును. కాని వారి రచనలను పఠించు పద్ధతి అది కాదు.

వాటిని చదవాల్సిన పద్ధతిలో చదివితే, అదే చాలు. *చదివింది అర్థమయిందా లేదా, ఎంతవరకు అర్థమయిందని తర్జన భర్జనలు చేయక చదువుము. ఆ తరువాత మౌనము వహించి నిశ్చలంగా వేచి వుండుము.* అధ్యయించునపుడు నీవు నీ బాహ్యామనస్సుతో అర్థము చేసికొన యత్నింతువు. కాని, ఆ పుస్తకములలో వున్నది నీ బాహ్యామనస్సుకు, తెలివితేటలకు అతీతము. మనస్సుతో అర్థం చేసికొనుటనగా నేమి? నీవు దానిలోనికి మనస్సుతో ప్రవేశించుటయే గదా. ఇది శ్రమతో కూడిన పని. దీని వలన బాహ్యార్థము మాత్రము తెలియును. ఇది మెదడుకు మంచి మేతయే గావచ్చును. కాని నిన్నెక్కువ దూరము తీసికొనిపోజాలదు. అట్లుగాక నీవు నిశ్శబ్దంగా వుండుము. మనస్సును మౌనం జేసికొనుము. అర్థము చేసికొనవలెనని ఆరాటపడకుము. ఆ పుస్తకములలోని జ్ఞానము నీలోనికి తిన్నగా వచ్చుటకై సావధానముతో యెదురు చూడుము. బుర్రను వేడి చేసికొని తెలివితేటలతో దాని నందుకొన యత్నింపకుము. దానినే నీ లోనికి ప్రవేశించనిమ్ము. ఏలన ఈ గ్రంథములలోని పదములు, సమాసములు వట్టి శుష్కములుగాని, మృతములుగాని కావు సుమా! ఆ మాటలు, ఆ నాదము, ఆ లయ విన్యాసము, అవన్నియు సజీవములు, చైతన్యగర్భితములు. But what is there in the text is beyond your mind, beyond your intelligence. And to understand mentally means you drive your intellect forward into the thing. It is an effort and takes you only to the outside of the thing. It is an exercise of your brain, developed in that way, but it doesn't take you very far. Instead of that, suppose you could keep quiet, silence your mind, and only read, without unduly trying to understand, and wait for what is there in the text to enter into you. Instead of your intelligence driving forward, pushing forward and trying to catch the thing, let the thing come into you; for what

is there in their writings is not words and phrases, dead material, it is something very living, something conscious, that they have expressed in the words, phrases and the sound and rhythm. ఇంకా చెప్పాలంటే నీవు ఏ గ్రంథములోని వాక్యమును తీసి కొన్నా సరే – సావిత్రి లోనిదైతే యిక చెప్పనవసరమే లేదు. అది ఒక సజీవ ప్రాణి, నీవు సఖ్యము చేసికొనదగిన వ్యక్తి. అట్లు కావించినయెడల దానిని నీవు క్షుణ్ణంగా అర్థం చేసుకొని, మళ్లీ చక్కగా వివరించగలవని కాదు. అది ఒక సజీవ ప్రాణి, ఒక చెలి కాడు, ఒక సఖుడు. ఇంకా చెప్పాలంటే నీవు తెలుసుకొనవలసిన ఒక 'ప్రియుడు' ఇట్లు గావించినయెడల నీ ప్రయత్నము ఫలిం చును. నీవు మిక్కిలి సంతోషము ననుభవింతువు. ఆనందములో మునిగి తేలుదువు. నువ్వడుగుతావేమో, "ఊరికే ఒక పుస్తక మును తెరచి చదివినంత మాత్రాన ఆ వాక్యములలో వున్నదెట్లు అబ్బును?" అని. కాని నేను చెప్పునది వినుము. అవి సజీవమైన ప్రాణులు – నీవు సరియైన విధముగా వాటిని సమీపించిన యెడల అవి నీ పరమగును. ఆ చైతన్యమూ, ఒక్కొక్క పంక్తిలోని ఆ వ్యక్తి (being) నీ పరమగును. అప్పుడు దానిలోని సౌందర్య మును నీవు చవి చూడగలుగుదువు. ఇది భక్తితో కొలుస్తే సాధ్య మవుతుంది కాని ఆలోచించి అర్థంచేసుకోటం కాని, వర్ణించుట కాని దుర్లభము. సావిత్రిలోని మొదటి పంక్తిని తీసుకోండి.

It was the hour before the Gods awake.

ఇది ఒక మహామంత్రము. ఎంతో సుందరమైన యొక సజీవ ప్రాణి. దీని అర్థము యేమిటా అని నీవాలోచించాల్సిన పని లేదు. బ్రహ్మాండమంతయు అందు ఇమిడి వున్నది.

లేదా దివ్యజీవనములోని మొదటి వాక్యాన్ని తీసికోండి. అదియొక మహాసాగరముయొక్క కెరటాల సవ్వడి, పొంగిపొరలు సముద్రుడి వుప్పెన. మనలో వొక విశాల భావమును, బృహత్సం భూతిని కలిగించి మనల నచ్చోటికి గొంపోవు ఘోష. నేనిది వరకు వక్కాణించినట్లు, అదియొక సజీవమూర్తి, మహత్తర శక్తి.

దాని వెనుక ఒక వ్యక్తిత్వమున్నది నీవు దాని సాన్నిధ్యము నందుకొనవలెను.

"The earliest preoccupation of man in his awakened thoughts and, as it seems, his inevitable and ultimate preoccupation, – for it survives the longest periods of scepticism and returns after every banishment, – is also the highest which his thought can envisage. It manifests itself in the divination of Godhead, the impulse towards perfection, the search after pure Truth and unmixed Bliss, the sense of a secret immortality. The ancient dawns of human knowledge have left us their witness to this constant aspiration; today we see a humanity satiated but not satisfied by victorious analysis of the externalities of Nature preparing to return to its primeval longings. The earliest formula of Wisdom promises to be its last, – God, Light, Freedom, Immortality."

There is indeed a personality behind it and you have to make acquaintance with that personality.

Become it = నువ్వు అది అయిపోవాలి – అనగా భక్తితో సమీపించుట, కొలచుట. నీ ఆత్మతో దాని దరిజేరుట.

విద్యాభ్యాసములో కూడ అంతే – ఆ పద్ధతినే అవలంబిం చదగును. కేవలం బుద్ధిబలంతో చదివినా, వట్టి మేధాశక్తితో ప్రయత్నించినా లాభం లేదు. నీవెంత తెలివైనవాడివైనా, నీ కెంత గ్రహణశక్తి వున్నాసరే, అవి నిన్నెక్కువ దూరము తీసికొనిపోజా లవు. కాని అద్దానిని నీ ఆత్మ ద్వారానే సాధించగలుగుదువు. ఎంతో క్లిష్టమైన (Intellectual things) విషయములను సహితము ఆత్మ కవాటముల ద్వారానే అవగాహనము చేసికొనదగును. ఏలన ఆత్మయన నీలోని కౌశలమే (faculties), నీ వ్యక్తిత్వము యొక్క సారమే. ఆత్మ యనగా వట్టి చైతన్యము కాని, కేవలము సత్త గాని కాదు. అది నీ వ్యక్తిత్వములోని అంశము లన్నింటిని సమీకరించును. నీ మనః ప్రాణ, శరీరముల బీజములు – భౌతిక

శరీరము యొక్క నిజస్వరూపము సహితము – నీ ఆత్మలోనే వుండునని యెరుంగుము. అందువలననే, అదే – ఆ ఆత్మ ద్వారానే, వస్తువులతోనూ, వ్యక్తులతోనూ నిజమైన సంబంధ మేర్పరచు కొనదగును. ఆత్మంటే ఎక్కడో దూరంగా వుంటుందను కుంటు న్నావేమో, అది నీవే సుమా! *ఇంకా చెప్పాలంటే అసలు దూరంగా వున్నవి నీ మనసు, ప్రాణికము, భౌతికములే, అవి నీ నిజ స్వరూపములు కానేకావు. నీ కత్యంత సన్నిహితమయినది నీ ఆత్మయే.*

ఈ సందర్భములో శ్రీమాత పలుమారులు చెప్పిన మరొక విషయము జ్ఞప్తికి వచ్చును. అసలు మన మిక్కడెందుల కుంటిమి. పిల్లలిక్కడ కెందులకు వచ్చిరి? పాఠశాలలోగాని, క్రీడలలో గాని, ఇతర కార్యక్రముల ద్వారా గాని వాళ్ళకిక్కడామె ఏమి సమ కూర్చుచున్నది? వట్టి బాహ్యావిషయములలో చాకచక్యము, నేర్ప రితనమా? కాదు. మన గమ్యమది కాదు. ఈ విషయములు గర పుటకు యింతకంటే మంచి సంస్థలు బోలెడున్నవి. బుద్ధికుశలత, మనోవికాసము, ప్రాణికాభివృద్ధి, శరీరదారుఢ్యము – ఇవి రష్యా, జర్మనీ దేశనమూనాలు. ఆటలలో మన రికార్డులు వారి ప్రమా ణాల నందుకోలేవు. వాటి కోసమని మనం తహతహ లాడటం లేదు. శ్రీమాత వాక్కు *"నేనిక్కడ యిచ్చుచున్నది ప్రపంచంలో నీ కెక్కడా లభించదు – ఇక్కడ తప్ప యింకెక్కడా దొరకదు" బాహ్యావిషయములను నీవంత బాగుగ నిర్వర్తించలేకపోవచ్చును.* పరీక్షలలో తక్కువ మార్కులే రావచ్చును. ఇక్కడ మనం నేర్చు కుంటున్న పరమ సత్యమది కాదు. అది నీకు తెలియకుండానే దానంతటదే అబ్బును. నిన్ను సముద్రములో పారేస్తే నీ వళ్ళంతా తడిసిపోతుందా లేదా? దాని నెవ్వరైనా ఆపగలరా? ఇక్కడా అంతే. నీకు తెలియకనే నీవు నీ ఆత్మయొక్క అంతశ్చేతనలో మునిగి తేలుదువు. కావాలన్నా దీనిని తప్పించుకొనజాలవు. ఇదియే అత్యంత విలువైనది. ఈ ప్రపంచంలో అన్నిటికన్నా విలువైన వస్తువు. ఆత్మతో నీవు దేనిని చదివినా సరే, దేనిని నేర్చుకున్నా

సరే, ఏ వస్తువును సమీపించినా సరే, నీకు వేరైన అభిరుచి, ఆసక్తి కలుగుట తథ్యం.

నేను శ్రీఅరవిందుల వద్ద గీతాపఠనము కావించెడి వాడను. అప్పుడు వారు భాషావ్యాకరణములపై అంత శ్రద్ధ వహించెడివారు కారు. ఏదో అవసరమున్నంత వరకు కొద్దిపాటి వ్యాకరణము చాలనెడివారు. కవియొక్క వ్యక్తిత్వము, వారి నిజస్వరూపములతో నాకు సంబంధ మేర్పరచెడివారు. వారి చేతన దేనికి ప్రతినిధియో చూపెడివారు. అదే వరస, ముఖ్యధోరణి అనుకోండి. ఎందుకంటె కవి అనగా ఒక చేతనాస్థాయి. దానిలో లీనమైనప్పుడే ఆ చేతనను నీ వందుకోగలవు.

'అమృత' శ్రీఅరవిందుల వద్ద గీత నభ్యసించెడివారు. వారు కూడా అటులనే చెప్పెడివారు. కృష్ణార్జునుల పవిత్ర వాతావరణ మెల్లెడలా వ్యాపించెడిది. వారి సాన్నిధ్యము కలిగెడిది. ఇంక ఆ శ్లోకముల తాత్పర్యము, బోధనాంశములు అవేమంత ముఖ్యమైనవి కావు. (That is secondary) ఆ మనిషే ప్రధానము. ఒక రచయితను గాని లేక వారి రచనలలోని వ్యక్తిత్వాన్నిగాని, నీ ఆత్మ ద్వారానే. ప్రేమ ద్వారానే నీవు దర్శించగలవు. నిజముగా ప్రేమించగలది నీ ఆత్మయే.

ఒకసారి నన్నెవరో "ఆత్మ, ఆత్మ... అని చెపుతున్నావు. అది ఏది?"అని ప్రశ్నించిరి.

నా జవాబు "అది నీకు చాలా దగ్గరగా యున్నది. అయినా నువ్వ నమ్మవు గదా. సరే. నిన్ను నీవు నిశ్శబ్దంగా పరిశీలించుకొన్న యెడల, నీలో చెడ్డలక్షణములే గాక, కొన్ని మంచి వాటిని కూడా గుర్తించగలవు. ఇవి కొద్దిపాటే కావచ్చును. లేశ మాత్రమే కావచ్చును. ఒక మంచి ఆలోచన, ఒక సద్భావము, ఒక మధురానుభూతి – ఇవన్నియు నీలో పొంచివున్న మంచి తనానికి మచ్చుతునకలు. ప్రయత్నించిన యెడల యితరులలో గూడ యిట్టి సద్గుణము లున్నవని నీవు కనుగొందువు. ఇదంతయు నీ ఆత్మయొక్క అభివ్యక్తమే. సౌందర్యము, ప్రకాశము, నీలో అప్పుడప్పుడు వుదయించు చక్కని భావనలు, నీ చేతనలో

చిగురించు దివ్యానుభూతులు – ఇవన్నియు నీ ఆత్మనుండి వచ్చి నవే. ఆఖరికి పచ్చి హంతకుడిలో కూడ యిట్టి గుణము లుండక పోవు. అతి క్రూరమైన మేక్‌బెత్ రాణిని గుర్తుకు తెచ్చుకో. ఆమె డంకన్ (Duncan) ను గురించి ఏమని చెప్పింది. "నేను వాణ్ణి చంపేసేదానినే కాని, అతనిలో నా తండ్రి పోలికలు స్ఫురించి నవి"[1] చూశావా ఆమె కెంత మంచి ఆలోచన వచ్చిందో. కాబట్టి మనం నిస్పృహజెంద నవసరము లేదు. ఎంతటి అర్భకులైనా సరే నీళ్ళు కార్చనక్కర లేదు. రెండు విషయములు మట్టుకు గుర్తుంచుకోండి. 1) ప్రతి ఒక్కరికి ఆత్మంటూ వొకటి వుంటుంది. 2) మనకు కోటి ప్రభలకు సమమైన శ్రీమాత వుండనే వున్నది. ఆమె అండదండలు మన కుండనే వున్నవి. భగవంతుని తీరే మిటో తెలుసా! నీ వాయనను గురించి తలుచుకోకపోయినా సరే, ఆయన నిన్ను గురించి తలుస్తాడు. ఇది నిజం – నిజమే సుమా! ఎందుకంటే నీవు భగవంతుని అంశమే. దానిపై నీవు నీ చేతనను కేంద్రీకరించవలెను! అప్పుడది దానంతటదియే దినదినప్రవర్ధ మాన మగును.

మూలం: నళినికాంత గుప్త
అనువాదం: డా॥ ఆర్.ఎల్.ఎన్. శాస్త్రి
(ఏప్రిలు 1988 'అర్క' నుండి)

(*Collected works of Nolini Kanta Gupta* Vol. 5, pp. 35-39)

---

[1] Shakespeare: *Macbeth*, Act II, Scene 2.
Lady Macbeth: Had he not resembled
My father as he slept, I had done't

సమాచార పత్రం

15 ఆగష్టు 2005 నాడు శ్రీఅరవిందుల 133 వ జన్మదిన మహోత్సవము జరుపబడును. అప్పుడు శ్రీఅరవింద సొసైటి బీచ్చాఫీసులో జరిగే రెండు కార్యక్రమములు:

1) 12-14 ఆగష్టు తేదీలలో శ్రీఅరవింద సొసైటీ వార్షిక సమావేశములు. 2) 17-26 ఆగష్టు తేదీలలో డా॥ ఎమ్. వి. నడ్కర్ణిగారు 'శ్రీఅరవిందుల గీతావ్యాసములు' పై ఒక స్వాధ్యాయ శిబిరమును ఉదయం 9-10, 10-1145 గం॥ వేళలలో నడిపెదరు. దీనికందరు ఆహ్వానితులే.

బెంగుళూరులో యూత్ క్యాంపు: ఈ కార్యక్రమము శ్రీఅరవింద భవన్ – 110 గంగాధరచెట్టి రోడ్డు (అల్సూరు లేక్) బెంగుళూరు - 560043 లో 24-25 సెప్టెంబరు 2005 తేదీలలో నడుపబడును. యువకులలో ఆత్మజ్ఞానమును, శ్రీమాతరవిందుల వెలుగులో నూతన జీవితమునకు జిజ్ఞాసను మేల్కొలుపటయే దీని ఉద్దేశము. ఆత్మప్రబోధనము, జీవితానికి లక్ష్యమేమిటి? అనే ప్రశ్న ప్రధానాంశములు. ఈ శిబిరములోని కార్యక్రమము లన్నియు interactive గా వుండును. 16-30 ఏళ్ల వయస్సుగల 35 మందికి మాత్రమే ఇది పరిమితము. శ్రీఅరవిందభవన్‌లో వుండేందుకు వసతి వుంది. ఇందులో పాల్గొనదలచినవారు శ్రీఅరవింద భవన్‌లో శ్రీ ఎమ్.ఎమ్. భట్టాజార్జిగారిని 930-1230 మరియు 430-700 PM వేళలలో లేక టెలిఫోను (080) 25559885 ద్వారా సంప్రదించవచ్చును.

సంస్కృత భాషాభ్యాసము: దృశ్య-శ్రవణ మాధ్యముల ద్వారా నేర్చుకొనుటకై ఒక వెబ్‌సైట్ www.saice.org/sanskrit తయారుచేయడమైనది. ఒక గంట సేపుగల ఈ కార్యక్రమమును ఉచితముగా మీరు డౌన్‌లోడ్ చేసుకొనవచ్చును.

Thoughts and Vision of Sri Aurobindo అనే విషయముపై 60 విశ్వవిద్యాలయములలో జరిపిన 150 పరిశోధనా వ్యాసముల పట్టిక Sri Aurobindo Institute of Research in Social Sciences, Sri



Flower: Supramental manifestation

15 ఆగస్టు విశిష్టత

అఖిల

అఖిల భారత పత్రిక, ఆగస్టు 2005

విషయసూచిక

ఆగస్టు 15 ఎంతో ముఖ్యమైన రోజు ... 3

శ్రీఅరవిందుల ఆగమనము,
ఆవిర్భవించనున్న సరికొత్త జాతి ... 4

శ్రీమాత ఒక సాధకునికి రాసిన లేఖ నుండి ... 5

శ్రీఅరవిందులు ఒక సాధకునికి రాసిన లేఖ నుండి ... 6

15 ఆగస్టు 1906: బెంగాల్ జాతీయ కళాశాల ... 7

15 ఆగస్టు 1908: కోర్టులో ఒక ఇంటర్వ్యూ ... 8

15 ఆగస్టు 1908: మేజిస్ట్రేట్ చేసిన పొరపాటు ... 11

15 ఆగస్టు 1909: శ్రీఅరవిందుల జన్మదిన సందేశము ... 13

15 ఆగస్టు 1913: అమృత జ్ఞాపకాలు ... 14

మోతీలాల్ రాయ్‌కు శ్రీఅరవిందులు రాసిన
లేఖలోని (1913) కొన్ని అంశాలు ... 19

15 ఆగస్టు 1914: ఆర్య పత్రిక ప్రచురణ ... 21

15 ఆగస్టు 1923: శ్రీఅరవిందుల జన్మదిన ప్రసంగము ... 22

15 ఆగస్టు 1924: శ్రీఅరవిందుల జన్మదినోపన్యాసము ... 24

15 ఆగస్టు 1924 దర్శనము: పురాణీగారి జ్ఞాపకాలు ... 28

15 ఆగస్టు 1925: శ్రీఅరవిందుల జన్మదిన ప్రసంగము ... 34

మనస్సు – అతిమనస్సు ... 36

అతిమానసశక్తి అవరోహణకు అవసరమగు
ప్రపంచ పరిస్థితులు ... 40

మేరీమాత అభ్యుత్థానానికి,
శ్రీఅరవిందుల జన్మదినానికి గల సంబంధం ... 42

15 ఆగస్టు నాడు మన కర్తవ్యం ... 43

ఉపోద్ఘాతము

శ్రీఅరవిందులంటే ఎవరో ఒక మహామనీషి అని తెలుసునేగాని ఆయన నిజస్వరూపము ఎవ్వరికీ తెలియదు. ఒక్క మదర్‌కే తెలుసు. శ్రీవారు వారి జన్మదిన సందర్భాలలో చేసిన ప్రసంగముల ద్వారా మనకి కొన్ని విషయాలు తెలియవచ్చినవి.

మనం శ్రీఅరవిందుల సమకాలికులం – ఎంతో అదృష్ట వంతులం. ఎందుకంటే వారు భౌతికకాయాన్ని త్యజించినప్పటికి మన మధ్యన మెసులుతూనే ఉంటారు. ఎవరో ఒకసారి "నేడు శ్రీఅరవిందుల జన్మదినము గదా! వారు వచ్చినట్లు మనకు తెలుస్తుందా? వారు నిజంగా వస్తారా?" అని శ్రీమాతను అడిగారు. "వారెప్పుడూ మన మధ్యనే ఉంటారు. కాని ఈ రోజున నువ్వు ఆయనను గురించి ప్రత్యేకంగా తలుచుకుంటూన్నావంతే!" అని ఆమె జవాబిచ్చారు. కాని ఆయన ఎప్పుడూ మన మధ్యనే ఉంటారు. కళ్ళు మూసుకొని ధ్యానం చెయ్యి. అంతరంగంలోకి ప్రవేశించు. బాహ్యాస్పందనలను దాటి అఖాతాలలోకి వెళ్లు. అదిగో ఆ వెలుగు, ఆ మూర్తి, ఆ సాన్నిధ్యము, నిన్నావహించిన ఆ చైతన్యము ఎవరిదనుకుంటున్నావు? చూశారా! తనంతట తానే ఆయన వచ్చి, నిన్ను పరివేష్టించి ఉన్నప్పుడు, నువ్వు కాస్త ప్రయత్నించి, ఆయనను నీలోకి ఆహ్వానించవచ్చును గదా!

– సంపాదకుడు

కవర్ పేజీ మీద పువ్వు

ఆధ్యాత్మికార్థము :అతిమానస ఆవిర్భావము
Supramental Manifestation
Blood lily (Scadoxus multiflorus)

ఆగస్టు 15 ఎంతో ముఖ్యమైన రోజు

ఆగస్టు 15 శ్రీఅరవిందులు ఆవిర్భవించిన రోజు, భూలోక జీవితంలోనే ఓ గొప్ప మలుపు.

శ్రీమాత

శ్రీఅరవిందుల ఆగమనము, ఆవిర్భవించనున్న సరికొత్త జాతి

ఒక నూతన జాతి, ఓ వినూతన ప్రపంచం, అతిమానసం ఆవిర్భవించబోతోందని వెల్లడించడానికి దివి నుండి భువికి దిగివచ్చిన దివ్యపురుషుని అవతారమే శ్రీఅరవిందులు.

*

మానవుడు నిన్నటి సృష్టి.
రేపటి సృష్టిని, అనగా అతిమానసవ్యక్తి రాకను ప్రకటించడానికే శ్రీఅరవిందుల ఆగమనం.

శ్రీమాత

(ఒక సాధకునికి రాసిన లేఖ నుండి)

1959 ఆగస్టు 15

...మరి ఇప్పుడు ఈ రోజు నేను మళ్ళీ రాస్తున్నాను. ఎందుకంటే ఈ రోజు గతానికి తెరదించిన గొప్ప రోజు. గతంలో జరిగిన పొరపాట్లను చెరిపివేసిన రోజు....

శ్రీమాత

(ఒక సాధకునికి రాసిన లేఖ నుండి)

...ఆగస్టు 15 సహజంగా ఓ మలుపు. సాధనలోనూ, జీవనంలోనూ కూడా ఇది నాకు వ్యక్తిగతంగా గుర్తుంచుకోవలసిన రోజు.

ఇతరులకు పరోక్షంగా మాత్రమే.

శ్రీఅరవిందులు

అనువాదం పున్నమరాజు నాగేశ్వరరావు

(*CWM* Vol. 8, p. 265; Vol. 13, pp. 19-20; *SABCL* Vol. 27, p. 433)

15 ఆగస్టు 1906: బెంగాల్ జాతీయ కళాశాల

శ్రీఅరవింద ఘోష్ ప్రిన్సిపాల్‌గా, శ్రీ సచ్చిదానంద ముఖర్జీ సూప రింటిండెంట్‌గా బెంగాల్ జాతీయ కళాశాల, పాఠశాల 1906 ఆగస్టు 15 వ తేదీన బౌ బజార్ వీధిలో ప్రారంభమైంది.

సుమిత సర్కార్

*

బెంగాల్ జాతీయ కళాశాల, పాఠశాల ప్రారంభోత్సవానికి సంబంధించిన పూర్తి నివేదిక 1906 ఆగస్టు 15 న 'బెంగాలీ' అనే పత్రికలో ప్రచురించబడింది.

బౌ బజార్‌లోని 191/1 నెంబరుగల అద్దె ఇంటిలో ఆగస్టు 15 నాడే బెంగాల్ జాతీయ కళాశాల, పాఠశాల రూపు దాల్చినవి. దాని తొలి ప్రిన్సిపాల్ శ్రీఅరవింద ఘోష్.

...సాహిత్యం, విజ్ఞానం, సాంకేతికం అనే మూడు ప్రధాన శాఖలుగా బెంగాల్ జాతీయ కళాశాల, పాఠశాల తన కార్యకలాపాలను 1906 ఆగస్టు 15 నుండి ప్రారంభించింది.

హారిదాస్, ఉమా ముఖర్జీ

అనువాదం: పున్నమరాజు నాగేశ్వరరావు

(*The Swadeshi Movement in Bengal, 1903-08*; The Origins of the *National Education Movement 1905-1910;* 1957 ed., pp. 83,85)

Sri Aurobindo is always with us, enlightening, guiding, protecting. We must answer to his grace by a perfect faithfulness.

The Mother

(*CWM* Vol. 13, p. 13)

15 ఆగస్టు, 1908: కోర్టులో ఒక ఇంటర్వ్యూ

(15 ఆగస్టు 1908 న శ్రీఅరవిందులు ఒక పత్రికావిలేఖరికి ఈ క్రింది ఇంటర్వ్యూ ఇచ్చారు. అది ఆలీపూర్ మేజిస్ట్రేట్ కోర్టు ఆవ రణలో జరిగింది. అప్పుడు వారూ, ఇంకా అనేకమంది కోర్టులో విచారింపబడుతున్నారు. ఆ కేసే తరువాత ఆలీపూర్ బాంబ్ కేసుగా ప్రసిద్ధి చెందింది.)

ARABINDO GHOSE:
A REMARKABLE INTERVIEW
BIRTHDAYS AND COINCIDENCES
DID HE EDIT "BANDE MATARAM"?

ఒక ప్రముఖ ఇంటర్వ్యూ

జన్మదినాలు – యాదృచ్ఛికాలు

శ్రీఅరవిందులు 'వందేమాతరం' సంపాదకులా?

('ఎంపైర్ స్పెషల్')

శనివారం నాడు, విచారణకు ముందు, తరువాత కూడా తీవ్రవాదుల సైన్యంలో అత్యుత్సాహం కనపడింది. బరీంద్రకుమార్ ఘోష్‌కు, ముజఫర్ బాంబుఘటనకు గల సంబంధం వలన, ఈ కేసులో వచ్చిన ఉత్సాహం, కోర్టు ముగిసిన తరువాత ఓ గందర గోళంగా మారింది. వీటి ఫలితంగా, ప్రతి రోజూ కోర్టువ్యవహారాల విలేఖరికి, ఓ అపూర్వ అనుభవం లభ్యమైంది.

న్యాయమూర్తి లేచి వెళ్లిపోయిన తరువాత, ఈ విలేఖరి, సాధారణంగా పొడుగైన 'క్యూ' లో ఉండే ముద్దాయిలను తప్పు కుంటూ, లోపలికి వెళ్లేందుకు ప్రయత్నించాడు. ఆ 'డాక్' కేవలం ఇద్దరు నిల్చునేందుకే వీలుంటుంది. మామూలుగా అందులో జొర బడటానికి, ఒక క్రీడాకారునికే (acrobat) సాధ్యమవుతుంది.

శనివారం ఒక ప్రత్యేక దినం. ఈ విలేఖరిని వారెంత మాత్రం అనుమతించకుండా, అడ్డుతగిలారు. ఆ గుంపులో కొంతమంది విలేఖరి కంఠం చుట్టూ వ్రేళ్లాడితే, మిగతావారు అతనిని ముందుకు సాగనీయలా. "ఎందుకు నన్ను అడ్డుకుంటున్నారు?" అని ప్రశ్నిస్తే, "అరవిందుల నడుగు" అని సమాధాన మిచ్చారు.

ఆ విధంగా, అరవిందులతో మాట్లాడటం జరిగింది.

విచారణ ప్రారంభమైనప్పటి నుంచీ, ఈ శనివారం (15 ఆగస్టు 1908) వరకు, అరవిందులు ఒక విధమైన నిర్లిప్తతతో ఉండేవారు. మొదటిరోజు విచారణ నుంచి, ఈ 36 వ రోజుదాకా, ఆయన ఒక బెంచిమీద కూర్చొని, నేల మీదే దృష్టి నిలిపి ఉంచే వాడు. విచారణలోని విషయాలను ఏమాత్రం పట్టించుకుండేవాడు కాదు.

కాని ఈ శనివారం నాటి అరవిందులు పూర్తిగా భిన్నమైన వ్యక్తి. ఇంతవరకూ అతిగంభీరంగా, పరధ్యానంగా ఉండే అయన వ్యక్తిత్వం, ఒక్కసారిగా ప్రకాశవంతంగా, ఉత్సాహకరంగా మారి పోయింది. అరవిందులే వివరించినట్లుగా, దీనికి కారణం చాలా ప్రముఖమైంది. "మొదటి సంగతి, ఇవ్వాళ నా పుట్టిన రోజు. ఇప్పుడున్న పరిస్థితులలో, దానినెంత బాగా జరుపుకోవచ్చో, అంత బాగా జరుపుకుంటున్నాను. నా జన్మదినం 15 ఆగస్టు 1872. 1906 లో ఆ నా జన్మదినానే, నేషనల్ కాలేజీ తన ద్వారాలను తెరిచింది. మిగతా విషయాలతోపాటుగా, విద్యార్థులకు స్వదేశీ సిద్ధాంతాన్ని బోధించేందుకే ఆ కళాశాల."

ఇంకా వివరిస్తూ, అరవిందులిలా అన్నారు "1907 లో, ఆ రోజుకు ముందు రోజునో లేక తరువాతి రోజునో, నేను మొదటి 'వందేమాతరం' రాజద్రోహనేరం క్రింద అరెస్టు చెయ్యబడ్డాను. ఇవాల్టి నా జన్మదినం ఇంకా ప్రముఖమైంది. ఎందుకంటే ఇవ్వాళ, ఇప్పటివరకు విచారించిన సాక్ష్యాలాధారంగా తప్పక నా కేసును, పై కోర్టుకు 'కమిట్' చేస్తానని మేజిస్ట్రేటు హామీ ఇచ్చాడు. ఈ కేసు రాజద్రోహ నేరానికి కాదు, విప్లవం అనే నేరానికి."

"ఇంతేకాక, నా తమ్ముడు బరీంద్రుని కూడా నా జన్మ దినాన్నే, ముజఫర్ వ్యవహారంలో కుట్ర జరిపిన నేరానికి కాకుండా, హత్యా నేరానికి సహాయం చేశాడనే నేరాన్ని ఎదుర్కొనవలసి వస్తుందని భయపెట్టటం జరిగింది."

చిరునవ్వుతో అరవిందులిలా అన్నారు "ఇలా ఇదంతా నా పుట్టిన రోజునే జరిగిన చెప్పుకోదగిన ఘట్టాల సమాహారం సుమా!"

"ఈ సుదీర్ఘమైన విచారణలో మీరు అలిసిపోయారా అని అడుగుతున్నారా? మేము విసిగి వేసారిపోయిన మాట నిజమేకాని, మాకేం పరవాలేదు. నిజం చెప్పాలంటే, నేను '*వందేమాతరం*' సంపాదకుడనటానికి, ఇంతమంది సాక్ష్యులను తోలుకురావటం వృథా. నేను కచ్చితంగా '*వందేమాతరం*' కు సంపాదకత్వం వహించాను. అయితే అది బిపిన్‌బాబు మొదట్లో సంపాదకుడుగా ఉన్నప్పుడు, అప్పుడప్పుడు మాత్రమే. ఇంకోసారి స్పష్టంగా చెబుతున్నాను. నేనెప్పుడూ, ఎప్పుడూ కూడా, సంపాదకుని కుర్చీలో కూర్చొనలేదు. ఆ పత్రికలో ప్రచురితమైన వ్యాసాలను నేనెప్పుడూ వ్రాయలేదు. కొన్ని వ్యాసాలను వ్రాశాను కాని, అందులోని ప్రసిద్ధ వ్యాసాలను నేనే వ్రాసానని ఎంతమాత్రం చెప్పను. నిజానికి వాటిని నేనే వ్రాయలన్నది నా కోరిక" అంటూ తల పంకించాడు.

చివరగా అరవిందులు వదిలిన బాణమిది: "ఈ యాదృచ్ఛిక సంఘటనలకు నీవింకొకటి కలపవచ్చు. బహుశా నా వచ్చే జన్మదినానికి నేను అండమాన్ దీవుల నుంచి తిరిగివస్తానేమో!"

సంతోషంతో నిండిన ముద్దాయిల మధ్య, నేల మీద సుఖాసీనుడైన అరవిందుని వద్ద నుంచి, ఈ విలేఖరి సెలవు తీసుకున్నాడు.

('ది ఎంపైర్' ఆగస్టు 18, 1908)

అనువాదం: కాకుమాను తారానాథ్

(*CWSA* Vol. 7, pp. 1145-46, *Sri Aurobindo Archives & Research* April 1911, pp. 114-15)

ఆగస్టు 15 1908: న మేజిస్ట్రేట్ చేసిన పొరపాటు

ఆగస్టు 15 1908: ఈ రోజుకు రెండు విధాలైన ప్రాముఖ్యత ఉంది. మొదటిది: ఇది శ్రీఅరవిందుల 36 వ జన్మదినం. రెండవది: ఆలీ పూర్ బాంబుకేసు విచారణలో, సాక్షుల విచారణకు చివరి రోజు.

'ఎంపైర్' ఇంటర్‌వ్యూలో, శ్రీఅరవిందులు, ఆ రోజున న్యాయస్థానంలో జరిగిన ఒక సంఘటన ప్రాముఖ్యాన్ని గురించి చెప్పారు. అది మేజిస్ట్రేట్ లియోనార్డ్ బిర్లే చేసిన ప్రకటన. తాను ముద్దాయిలను 'రాజుకు వ్యతిరేకంగా తిరుగుబాటు చేయదలచారు' అన్న నేరారోపణతోను, శ్రీఅరవిందుల సోదరుడు బరీంద్రకుమార్ ఘోష్‌ను, హత్యాప్రయత్నానికి సహకరించాడన్న నేరారోపణతోను, సెషన్స్ న్యాయస్థానానికి కమిట్ చేస్తానన్న ప్రకటన.

బిర్లే ప్రకటన ముఖ్యమైనదే అయినా, దాని అసలు ప్రాముఖ్యత, కోర్టు వారి దృష్టికి రాలేదు. ఆ 14 వ తేదీన, ముద్దాయి శైలేంద్రనాథ్, దీనదయాళ్ బోస్‌ల న్యాయవాదులు, కొంతమంది సాక్షులను, ముఖ్యంగా అప్రూవర్ నరేంద్రనాథ గోస్వామిని క్రాసు పరీక్ష చేయటానికి, న్యాయస్థానం అనుమతి కోరారు. దానిని విన్న మెజిస్ట్రేట్ బిర్లే, తానింకా ముద్దాయిల విచారణను ఆలస్యం చేయ దలచుకోలేదంటూ, అనుమతి నిరాకరించాడు.

('వందేమాతరం', 1908 ఆగస్టు 15)

15 వ తేదీన, తిరిగి ఆ ఇద్దరు న్యాయవాదులు తమ కోరి కను పునరుద్ఘాటించారు. దానిని పరిశీలించిన బిర్లే, తాను సాక్ష్యా లను పరిశీలించి, ప్రాథమికంగా ముద్దాయిలు నేరం చేశారన్న నిర్ణ యానికి వచ్చాననీ, కాబట్టి తన ముందు సాక్ష్యులను క్రాసు పరీక్ష చేయవలసిన అవసరం లేదనీ, ఎలాగూ సెషన్సు న్యాయస్థానంలో అది జరుగుతుందని చెపుతూ, వారి కోరికను నిరాకరిస్తూ ఆర్డరు ఇచ్చాడు.

ఈ ఆర్డరు మనకు సహేతుకమయిందనే అనిపించవచ్చు. కాని ప్రభుత్వ ఫైల్ (ఐ.ఓ.ఆర్, జె&ఆర్ 4494/1908) ప్రకారం, ఆ ఆర్డరు పూర్తిగా చట్ట విరుద్ధమయినది. బిర్లే ఈ విధంగా చేసిన చిన్న పొరపాటు, రెండు వారాల తరువాత అప్రూవర్ నరేంద్ర నాథ గోస్వామి హత్య చేయబడటంతో, అమిత ప్రాముఖ్యాన్ని సంతరించుకుంది.

గోస్వామిని క్రాసు పరీక్ష చేయటానికి అప్లికేషన్ దాఖలు కాకపోయినట్లైతే, గోస్వామి సాక్ష్యం ముద్దాయిలకు వ్యతిరేకంగా వాడబడటానికి అవకాశముంది. బిర్లే అనుమతి నిరాకరించటంతో, సాక్షి హత్యతో, అతని సాక్ష్యం చట్టరీత్యా, ముద్దాయిలకు వ్యతిరే కంగా వాడబడటానికి వీలు లేనిదయింది.

కాని ఆ ఆగస్టు 15, 1908 న మేజిస్ట్రేటు ఇంకా కొంచెం జాగ్రత్తగా ఉన్నట్లయితే, శ్రీఅరవిందులు నేరం చేయలేదన్న తీర్పు బహుశా వేరువిధంగా ఉండి ఉండేది సుమా.

అనువాదం: కాకుమాను తారానాథ్

(Notes of *Sri Aurobindo: Archives & Research* April 1991 p. 128)

Sri Aurobindo is an emanation of the Supreme who came on earth to announce the manifestation of a new race and a new world: the Supramental.

Let us prepare for it in all sincerity and eagerness.

The Mother

(*CWM* Vol. 13, p. 19)

ఆగస్టు 15 1909: శ్రీఅరవిందుల జన్మదిన సందేశము

శ్రీవారు చిన్నప్పటి నుంచి తనను ఏదో ఒక శక్తి ప్రేరేపిస్తున్నట్లు గమనించారు. విద్యాభ్యాసము ముగించుకుని ఇంగ్లండు నుంచి మాతృదేశం తిరిగి వచ్చేసరికి ఆ శక్తి యింకా స్పష్టమైంది. భారత దేశాన్ని ఉజ్వల భవిష్యత్తు వైపు నడిపిస్తున్న ఒక మహాశక్తిగా దానిని గుర్తించారు. – సంపాదకుడు

నా బాల్యదశ మిడిమిడి జ్ఞానస్థితిలోనే నా ఊహకు అందని ఒకానొక విపరీతమైన తపన గమనించాను. కాలక్రమేణా వయస్సుతో బాటు ఈ తపన గూడ తీవ్రమైంది. బాల్యదశకు చెందిన భయాందోళనలు, నేను, నాది యన్న స్వార్థచింతన మొ॥ అన్నీ అంతరించిపోయాయి. నేను మాతృదేశానికి తిరిగి వచ్చేసరికి (6-2-1883) మరింత తీవ్రమై నేను అనుభవించిన బాధలకు మూలకారణమైన నియంతృత్వ, అణచివేత పోకడలు, నాయొక్క లక్ష్యశుద్ధికి బాటలు వేశాయి. ఈశ్వరానుగ్రహం వల్ల దైవాంశ సంభూతుడైన ఒకానొక మానవరూపం ఈ జగత్తుపై అవతరించినప్పుడు ఒకానొక నూతన నోత్తేజము జగత్తుపై ప్రజ్వలిస్తుందన్న మాట వాస్తవము. ఈ తరుణంలో నీవు మాతృదేశ సేవకై నడుముకట్టి అంకితమైపోవాలి. ఇదే నీ ప్రప్రథమ కర్తవ్యము. మన శక్తియుక్తులన్నీ మూటకట్టి ముందుకు దూకే తరుణం ఆసన్నమైంది. అయినా ఆందోళన చెందనవసరము లేదు. గత చరిత్రను పునరావృతం చేసుకొంటే ఇటువంటి ఉదాహరణలు కోకొల్లలు. శక్తిని కూడగట్టుకొని, ఆర్తితో పరమేశ్వరిని ఆరాధించాలి. ఈ దేశానికి దైవబలము తోడైంది. వెనుకకు తిరిగి చూసే అవసరం లేదు. ముమ్ముందు ఒకనాడు ఈ దైవబలము విజృంభిస్తుంది.

మూలం: శ్రీఅరవిందులు
అనువాదం: శ్రీ శరణ్

(*CWSA* Vol. 8, p. 178)

ఆగస్టు 15 1908: అమృత[1] జ్ఞాపకాలు

"ఆయన కళ్లు జ్యోతులల్లే మెరసిపోతున్నాయి. ఆయన దృష్టిని నా వైపు మరల్చినపుడు నాలో చీకటంతా మటుమాయమైపోయింది. ఆయన నాలోకి ప్రవేశించారు. నా యెదలో వారు ప్రతిష్ఠితమైనట్లనిపించింది." — అమృత

పాండిచ్చేరిలో యిప్పటి మిషన్ స్ట్రీట్‌ని అప్పట్లో మతకోయిల్ స్ట్రీట్ అనేవారు. ఆ వీధిలో ఒక పెంకుటింట్లో శ్రీఅరవిందులు ఆరు నెలల పాటు వున్నారు. ఇప్పుడా యిల్లు చాలా మారిపోయింది. అసలు గుర్తుపట్టలేము. ఆ యింట్లోనే శ్రీఅరవిందుల దర్శనం మొట్ట మొదటిసారి నాకు లభించింది. అదీ దూరం నించి మాత్రమే.

అప్పట్లో నేను ప్రతిరోజూ సాయంత్రం బీచ్‌లో రామస్వామి అయ్యంగారిని కలుస్తూ వుండేవాడిని. అయ్యంగారు శ్రీఅరవిందులు వుంటున్న యింట్లోనే వుండేవారు. అందుచేత ఎలాగైనా నాకు శ్రీఅరవిందుల దర్శనం చేయించమని రోజూ వారిని అడుగుతూ వుండేవాడిని. అలా కొన్నాళ్లు పట్టువదలని విక్రమార్కుడిలా ప్రయత్నించగా ప్రయత్నించగా చివరికి ఆయన మనసు కరిగి నేను తన గదికి రావడానికి మాత్రం అంగీకరించారు. అప్పట్లో మా పాఠశాలకి గురువారం, ఆదివారం రెండురోజులు సెలవులుండేవి. అయ్యంగారిని 4 గం॥ లకు ఆయన గదిలో కలవడం, 4 నుండి 5 వరకు మాట్లాడుతూ అక్కడే వుండి, 5 గంటలకి బీచ్‌కి పోయి యితర మిత్రుల్ని కలవడం జరిగేది.

అయ్యంగారి స్నేహం చేత శ్రీఅరవిందులవారి యిల్లు మా స్వంతయిల్లు లాగే అనిపించేది. అందుచేత ఆయన యింట్లో వున్నా

---

[1] కె. అమృత (జననం 1895) 1913 లో శ్రీఅరవిందులను కలిసేరు. అప్పుడతనికి 18 సం॥ లు 1919 లో అతని చదువు పూర్తయిన తరువాత శ్రీఅరవిందులతోను, శ్రీమాతతోను కలిసి వుండడం మొదలుపెట్టి జీవితకాలమంతా అంటే 1969 వరకు వారితోనే వున్నారు.

లేకపోయినా యెలాంటి సంకోచం, మొహమాటం వుండేదికాదు. అయినా ఆ గది దాటి వెళ్లడం సభ్యత కాదని యెక్కడికీ వెళ్లే వాడిని కాదు.

అలా రామస్వామిగారితో పరిచయం పెరిగినకొద్దీ శ్రీఅరవిందులవారితో వున్నవారందరి పేర్లూ తెలిసేయి. వారిలో ఒకరు యిప్పుడు కూడా యిక్కడే వున్నారు. ఆయన నళినీకాంత గుప్తా. గతించినవారిలో విజయకాంతన్ అనే తమిళపేరు పెట్టుకున్న బిజయ కుమార్ నాగ్, అందరూ 'సక్రా' అని పిలిచే సురేశ్‌చంద్ర చక్రవర్తి. సౌరేంద్రనాథ్ బోస్ పేరు మార్చుకోలేదు. వీరంతా బ్రిటిష్ ప్రభుత్వానికి ఆచూకీ దొరకకుండా వుండేందుకు మారు పేర్లు పెట్టుకోవలసి వచ్చింది. నాగేంద్ర నాగ్, బిరేన్‌రాయ్ తరువాత వచ్చి అక్కడ వుండేవారు.

వీరిలో నాగేంద్రనాగ్ క్షయవ్యాధితో బాధపడుతూ వుండేవాడు. ఒక్కొక్కసారి శ్రీఅరవిందులు వెనక వాటానుండి బయటకొచ్చి, ముందు భాగం హాలులో పడుకున్న క్షయరోగి ప్రక్కనే అదే చాప మీద కూర్చొని, యేవో ప్రశ్నలు అడగడం, తరవాత తన గదికి వెళ్ళడం చూచేవాడిని. సాయంకాలాలు అయ్యంగారితో మాట్లాడుతున్నప్పుడు, యీ విధంగా శ్రీఅరవిందుల దర్శనం చాలా సార్లు లభించడం నా అదృష్టం. కాని దగ్గరకు వెళ్ళకుండానే యిలా జరిగేది. ఆ రోజుల్లో నాకు ఇంగ్లీషు మాట్లాడటం బాగా వచ్చేది కాదు. వెనక వాటా నుండి బయటకు వచ్చింది మొదలు తిరిగి వెళ్లేవరకు ఆయన యే పనికోసం వచ్చారో, ఆ పని పూర్తి చేసుకు వెళ్ళడమే తప్ప యితర యే విషయం మీద దృష్టి సారించేవారు కాదు. కాని యే చిన్న విషయం అతడి దృష్టి దాటి పోదని అక్కడి వారు అనేవారు.

ఆ సమయంలోనే నేను వొకటి రెండు సార్లు నన్ను శ్రీఅరవిందులకు పరిచయం చెయ్యమని అయ్యంగారిని బ్రతిమాలాను. కాని నా ప్రార్థనలు ఆయన పట్టించుకోలేదు.

1913 ఆగస్టు 15, శ్రీఅరవిందులవారి జన్మదినం దగ్గర పడింది. మరొక్కసారి అయ్యంగారిని వేడుకున్నాను. వారి జన్మ

దినం నాడు నన్ను వారి దగ్గరకు తీసుకువెళ్లమని కోరాను. "అద్భుతంగా వుంది. అలాగే" అంటూ వొప్పుకున్నారు. ఇక నా ఆనందానికి అవధులు లేవు.

ఆగస్టు 15 నాడు అయ్యంగారు నన్ను నాలుగున్నరకి రమ్మని చెప్పారు. అంతకంటె కాస్త ముందుగానే నేనక్కడికి చేరుకున్నాను. ఆహ్వానితులందరూ అన్ని వైపుల నుండీ రాసాగారు. 5 లేక 5-15 ని॥ అందరూ రావడం పూర్తయింది. ఇంట్లో మసకచీకటిని బట్టి సూర్యాస్తమయానికి యింకా గంట సమయం వుండి వుంటుంది. ఇంటికి ముందు భాగంలో వున్న హాలులో మూడు వైపులా 20 లేక 25 అరిటాకులు పరిచారు. అంతా పెళ్లి భోజనాల లాంటి యేర్పాట్లు చేసారు.

ముఖద్వారం మూసిన వెంటనే శ్రీఅరవిందులు హాలులో కొచ్చి ఒక పక్క నిల్చున్నారు. అక్కడున్న వారిలో ఒకరు వెళ్లి ఆయన మెడలో ఓ గులాబీ పూలదండ వేసారు. మిగిలినవారంతా చప్పట్లు కొట్టారు. శ్రీఅరవిందులు యింగ్లీషులో యేదో కాస్త మాట్లాడారు. ఇవన్నీ అస్పష్టంగానే జ్ఞాపకం చేసుకోగలుగుతున్నాను. ఆ క్షణాలలో పట్టరాని ఆనందంతో, వుద్వేగంతో గుండె వేగంతో కొట్టుకోడం చేత యీ అస్పష్టత యేర్పడి వుంటుంది.

సంతర్పణ భోజనానికి కూర్చున్నట్లు అందరం అరిటాకుల ముందు కూర్చున్నాం. శ్రీఅరవిందులు ప్రతి ఆకు ముందు నిల్చుని, అక్కడ కూర్చున్న వ్యక్తిని చూస్తూ వుంటే, వారి ప్రక్కనించే ఒకరు వచ్చి రకరకాల మిఠాయిలు, యితర వంటకాలు వడ్డించారు. ఇలా చివరి ఆకు, చివరి వ్యక్తి వరకూ నెమ్మదిగా ఆయన వెడుతూ వుంటే, వారిని చూస్తున్న సంతోషంతో నా కళ్లు నిండిపోయాయి.

ఆ ఆవరణలో ఒక పెద్ద కూజాతో నీళ్లు, దాని ప్రక్కనే ఒక గ్లాసు వుంచారు. అందరం భోజనాలు చేసి చేతులు కడుక్కుని కాస్సేపు మాటలలో పడ్డాము. వరండాలో ఒక బల్ల, దాని మీద ఓ గుడ్డ పరిచి ఉంది. శ్రీఅరవిందులు వచ్చి దాని ముందున్న కుర్చీలో ఆసీనులయ్యారు. తరువాత కార్యక్రమం కోసం బహుశా యెదురు

చూస్తున్నట్టున్నారు. అప్పటికి చీకటి పడింది. ఇంట్లో ప్రతి భాగం లోను వొకటీ, రెండు హారికేను లాంతర్లు వెలిగించి పెట్టారు. వచ్చిన అతిధులంతా వొక్కొక్కరూ, యిద్దరిద్దరూ, ముగ్గురు ముగ్గురుగా సెలవు తీసుకుని యిళ్లకు వెళ్లిపోయారు.

ఏం చెయ్యాలో తోచక నేను నిరీక్షిస్తూనే వున్నాను. అతిధులంతా వెళ్లిపోయాక అయ్యంగారు వచ్చి నాతో అన్నారు. "ఇంకా భారతి, శ్రీనివాసాచారి, వి.వి.యస్. అయ్యరు అనే ముగ్గురు పెద్దమనుషులు వచ్చి శ్రీఅరవిందులవారిని చూసి మాట్లాడవలసి వుంది. వారు వచ్చి వెళ్లేవరకూ వేచి వుండగలిగితే, అప్పటికి శ్రీఅరవిందులవారితో వుండే అయిదారుగురు మాత్రమే వుంటారు. అప్పుడాయన అనుమతిస్తే నిన్ను తీసుకెళ్లి పరిచయం చేస్తాను" అని చెప్పారు. నేను అంగీకరిస్తూ తలాడించాను. అప్పటికే ఏడు గంటలు కొట్టింది. "ఎందుకింత ఆలస్యమయిందని?" యింట్లోవాళ్లు అడుగుతారనే భయం ఓ మూల పీకుతున్నది. అయినా సాహసించి సరే అన్నాను.

అయ్యంగారు మళ్లీ మరొకసారి అడిగారు "నువ్వు శ్రీఅరవిందులవారిని పై ముగ్గురు పెద్దమనుష్యులతో చూస్తావా? లేక ఆయనతో వున్న అనుచరులతో చూస్తావా?" అని. ఎలా చూసినా శ్రీఅరవిందులు శ్రీఅరవిందులే కదా. రెండింటికీ తేడా యేమిటో తెల్చుకోలేక కాస్సేపు వూగిసలాడి చివరికి వారి అనుచరులతోనే చూస్తానని చెప్పేసాను. "అలా అయితే కాస్సేపు వేచి వుండు" అని అయ్యంగారు అక్కడి నించి వెళ్లిపోయారు.

8 గం॥ వరకు నేను వేచి వుండవలసి వచ్చింది. భారతి, శ్రీనివాసాచారి, అయ్యరు వచ్చి, వెళ్లిపోతూ నా వేపు తేరిపార చూసారు. నేనెవరో పోల్చుకోడాని కనుకుంటా. అంత రాత్రివేళ నేనక్కడ వుండడం వారు వూహించలేదు. నేను శ్రీఅరవిందులతో వుండడానికి వచ్చానేమో అనే అనుమానం వారికి వచ్చినట్లుంది. అందుకే వారి ముఖాలలో ఆశ్చర్యం, సందేహం కలగలుపు భావాలు కదలాడాయి.

సుమారు 8 గం॥ 15 ని॥ లకు అయ్యంగారు నా వద్ద కొచ్చారు. "శ్రీఅరవిందుల వారి బల్ల ముందునించి వెళ్తూ, నువ్వా యన దర్శనం చేసుకోవచ్చు. మాట్లాడకుండా చేతులు కట్టుకుని వెళ్లు. ఆయన కుడివైపు నించి వెళ్తున్నప్పుడు కొద్దిసేపు ఆగి నమ స్కరించి నిశ్శబ్దంగా సెలవు తీసుకుని యింటికి వెళ్లిపో" అన్నారు. ఆ మాటలు యథాతథంగా నా మనసులో హత్తుకుపోయాయి.

ఇంతలో పిలుపొచ్చింది. నేను లేచి వెళ్లి శ్రీఅరవిందులవారి బల్లను సమీపించాను. ఇంటిపై కప్పునించి హరికేన్ లాంతరు వెలుగు ఒక ప్రక్కగా కొంతపడుతున్నది. ఆయన చుట్టూ ప్రద క్షిణ చేసినట్టు వెళ్లి ముందువైపు ఆగి నిల్చుని విధేయతతో రెండు చేతులు జోడించి నమస్కరించాను. అప్పుడాయన కళ్లు ఆ లైటు వెలుతురుకంటె కాంతివంతంగా మెరుస్తున్నాయి. ఆయన నా వైపు చూసారు. చూసిన మరుక్షణంలో నా వేదన, సంకోచం అన్నీ మటుమాయమయిపోయాయి. ఆయన మూర్తి నాలో పవిత్రదేవాల యంలో దైవమూర్తిలా ప్రతిష్ఠితమైపోయింది. నేనేం చేస్తున్నానో నాకు తెలియలేదు. భక్తిప్రపత్తులతో, వెనక్కి వెళ్లడం, ముందుకి రావడం యేదేదో చేస్తున్నాను. ఉండాలో, వెళ్లాలో నిర్ణయించుకో వాలనే స్పృహ కూడా లేకుండా పోయింది. అక్కడ నిల్చున్న వారిలో వొకరికి శ్రీఅరవిందులు తన దివ్యహస్తాలతో యేదో సంజ్ఞ చేసారు. మళ్లీ ప్రత్యేకంగా నాకొక లడ్డూ లభించింది. దానితో ఆయన నన్ను అనుగ్రహించినట్టు అనిపించింది. తరు వాత నేనాయన వద్ద సెలవు తీసుకుని యింటికి వెళ్లిపోయాను.

మూలం: అమృత

అనువాదం: నడిమింటి విజయలక్ష్మి

Reminiscences by Nolini Kanta Gupta and K. Amrita, pp. 156-59

మోతీలాల్ రాయ్‌కు శ్రీఅరవిందులు రాసిన లేఖ (1913) లోని కొన్ని అంశాలు

"నేను పరబ్రహ్మ సాక్షాత్కారమును పొందాను. అన్నమయకోశం కూడా అహంకారనివృత్తి పొందేందుకు యిక ఎంతో కాలం పట్టదు. ఈ పరమాత్మను జీవితంలో కూడా ప్రతిఫలింపజేసి మానవజీవితానికి భవిష్యబాటలు వేయాలి. సత్యయుగానికి నాంది పలకాలి. వేదాలు, ఉపనిషత్తుల అంతరార్థము నా కవగతమైనది" అంటారు శ్రీఅరవిందులు. — *సంపాదకుడు*

యోగసాధనలోను, నిత్యజీవితంలోను, ఆగస్టు 15 వ తేదీ నాకు ఒక ప్రత్యేకతను సంతరించుకొంది. ఈ సంవత్సరం ఈ తేది ప్రాముఖ్యం మరింతైంది. నా సాధనంతా ఒక కొలిక్కి రావటమే కారణం. పరబ్రహ్మస్థితిని పొందటం, దీర్ఘకాలం సాక్షాత్కార స్థితిని పొందటమంటే యోగసాధన లక్ష్యాలు సాధించినట్లే. 'అహం' అంతరించిపోయింది. మిగిలింది అన్నమయకోశమైన ఈ శరీరం మాత్రమే. అయితే ద్వైత్యభావస్పర్శల నుంచి విముక్తి పొందేంత వరకు సాధన కొనసాగించాలి.

సైద్ధాంతిక జ్ఞానవిషయమంతా నాకు వంటబట్టింది. అందు వల్ల మున్ముందు, యోగాభ్యాస విషయములపై నా దృష్టి సారిస్తాను. ఆ జ్ఞాన, శక్తుల ప్రేరణతో నా కార్యసాధన ముందుకు పోతుంది. విషయమంతా అవగాహనకు వచ్చింది. నీవు నన్ను మార్గదర్శకునిగా ఎంచుకున్నావు కాబట్టి భవిష్యత్ప్రణాళిక నీ ముందుంచబోతున్నాను.

1. సనాతన ధర్మ విశ్లేషణ ఒక నూతన కోణంనుంచి విశదీకరించటం ప్రథమ కర్తవ్యమని భావిస్తున్నాను. త్రిముఖ వ్యూహంగా కొనసాగే ఈ కార్యక్రమం ఇటీవలే ప్రారంభమైంది. శ్రీకృష్ణుని కృపావిశేషం వల్ల వేదార్థం గ్రహించుకొన్నాను. అంతే కాదు. వేదవాఙ్మయ రహస్యాల నిగూఢ సత్యాలను దర్శింపచేసింది. నవ్యనిరుక్తమునకు బాటవేసి, వేదార్థ వివరణకు నూతన మార్గము

నకు శ్రీకారము చుట్టింది. ఈ కృపావిశేషమే ఉపనిషద్వ్యాఖ్యలకు దారితీసింది. ఈ దృష్ట్యా సర్వత్రా ఏకత్వమే భాసిస్తున్నదనీ, సనాతన ధర్మమునకు వేదాంతతత్త్వమే మూలమనీ ఈ లోకానికి వివరించటమే నా ధ్యేయము. అందువల్ల భారతదేశ జనజీవన సనాతనధర్మమే ఈ జగత్తుకు ఆయువుపట్టు యని, సనాతన ధర్మమే సర్వజనరక్ష యని అవగతమవుతుంది.

2. వేదవాఙ్మయ స్ఫూర్తితో ఒక నూతన సాధనామార్గమును స్థాపన చేసి, ముక్తికాంతా పరిణయంతో బాటు, సర్వజనులను యోగక్షేమ్మలుగా రూపొందించి, ఈ సృష్టిలో సత్యయుగమునకు నాంది పలకాలి. అందుకు తరుణం ఆసన్నమైంది. అయితే ముగింపు ఇప్పుడే కాదు. కలియుగాంతం వరకు ఈ సాధన కొనసాగిపోవాలి.

3. ఈ బృహత్కార్యానికి భారతవర్షమే కేంద్రబిందువు. భారతదేశాన్ని ఈ ప్రపంచంలో ఉచితస్థానంలో నిలువరించాలి. ఈ పునర్నిర్మాణానికి యోగమే ఉచితమైన సాధనము.

4. మహామనీషియే మన లక్ష్యము. ఈ లక్ష్యసాధనకు సమాజంలో అవసరమైన మార్పులు, చేర్పులు చేపట్టటం అవసరం.

నాయనా, పై వాక్యాలన్నీ చదువుకొని యోగసాధనకు భరతవాక్యం పలికినట్లనని భావించవద్దు. ఇదంతా ఒక రేఖా చిత్రము మాత్రమే. చేయవలసింది, సాధించవలసింది చాలా ఉన్నది. ముందుగా ఇంద్రియచాపల్యాలు, అహం నాశనం చేసుకొని, పరమేశ్వరునికి అంకితమైపోవాలి.

చివరగా ఒక్క మాట. నేను తలపెట్టిన ఈ కార్యక్రమములో కొందరు సాధకులను ఎంపికచేసి శక్తిపాతము చేయాలని ఆలోచిస్తున్నాను. అందుకు నా ప్రస్తుత నివాసం ఒక ప్రయోగశాల, ఒక నర్సరీ వంటిది.

మూలం: శ్రీఅరవిందులు

అనువాదం: శ్రీశరణ్

(*SABCL* Vol. 27, pp. 433-35)

15 ఆగస్టు 1914: 'ఆర్య' పత్రిక ప్రచురణ

ఆగస్టు 15 (1914)

ఇంతవరకు జీవితం సంసిద్ధమవుతూనే వున్నది. ఈ రోజు అది 'ఆర్య' ప్రచురణతో ప్రారంభమై చందాదారుల ప్రవాహంతో కొనసాగుతోంది.

(1914 ప్రారంభంలో మోతీలాల్‌రాయ్‌కి ఇలా వ్రాసారు.)

నేనూ, రిచర్డు ప్రచురణకర్తలుగా 'ఆర్య' ఒక క్రొత్త తత్త్వాన్ని ప్రతిపాదిస్తూ ఫ్రెంచి, ఇంగ్లీషు రెండు భాషలలో ప్రచురించబడుతుంది. ఫ్రాన్స్‌వారికి, భారతదేశం, ఇంగ్లండు, అమెరికా ప్రజలకు అందుబాటులోనికి రాబోతోంది. ఇందు వేదాల యొక్క క్రొంగొత్త సిద్ధాంతాలు, ఉపనిషత్తుల వివరణ, భాషాంతరీకరణ ఆవిష్కృతమవుతాయి. నాయొక్క యోగవిధానాలను ప్రతిపాదించే వ్యాసపరంపరతో పాటు ఉపనిషత్తుల ప్రాతిపదికగా మానవాళిని ముందుకు నడిపించే ఆదర్శజీవిత సిద్ధాంతాన్ని అందించే వైదిక తత్త్వంగా (ఆది శంకరుని అద్వైతం కాదు) రూపొందుతుంది. ప్రపంచంలో నేను చేయదలచుకున్న కార్యమునకు ఇది సిద్ధాంతరూపము.

మూలం: శ్రీఅరవిందులు
అనువాదం: ఎస్. ఎస్. లక్ష్మి

(*CWSA* Vol. 10, p. 600; *SABCL* Vol. 27, pp. 455-56)

He has come to bid the earth to prepare for its luminous future.

The Mother

(*CWM* Vol. 13, p. 4)

15 ఆగస్టు 1923: శ్రీఅరవిందుల జన్మదిన ప్రసంగము

(ఎ.బి. పురాణిగారి జ్ఞాపకాలు [1])

ఈ రోజు అతిమానస సత్యానికి ప్రతీక. మన వేడుకలలో బహిరాడంబరము పనికి రాదు. బహిరార్భాటము వల్ల కొన్ని చౌకబారు శక్తులు విజృంభించి వాతావరణాన్ని విషపూరితం చేస్తాయి. అసలు సత్యాన్ని రానీయవు. నీ మనస్సులో, నీ మనస్సులోనే కాకుండా సర్వకోశములలోను పరమ ప్రశాంతత రాణించినప్పుడే ఆ మహాసత్యమును ఆహ్వానించగలుగుతావు. — సంపాదకుడు

నా జన్మదిన వేడుకలని ఇప్పటివరకూ ప్రాణికస్థాయిలోనే జరుపుతూ వచ్చాం. అందులో అంతర్లీనంగా అసలు కారణం బీజ రూపంలో వున్నప్పటికీ, దాన్ని వ్యక్తం చేసే విధానం మాత్రం ప్రాణికంగానే వుంది. ఇకనుంచీ, నా జన్మదినాన్నే జరిపితే, అది అతిమానససత్యాన్ని సూచించేందుకు తగినట్టుగా వుండాలి.

అతిమానససత్యం మన జీవితాల్లోకి ప్రసరించవలసి వుందని మీ అందరికీ తెలుసు. ఆ అతిమానస సత్యానికి ఈ నా జన్మదినం ఒక చిహ్నం. కానీ అది సంపూర్ణంగా వ్యక్తం కావడానికి చాలా అడ్డంకులున్నాయి. మన మనసు, మన ఆలోచనలు ఎటువంటివంటే, ఉన్నతస్థాయి నుంచి ప్రవహించే ఈ అతిమానస సత్యాన్ని తమ లక్ష్యాల కోసం వక్రీకరించ చూస్తాయి. అలాగే ప్రాణశక్తిస్థాయిలో కూడా ఆ ఉన్నతశక్తిని తమ కుత్సిత చర్యల కోసం మలచే గుణం వుంది. ఆ మహోన్నత అతిమానససత్యం మనలో సవ్యంగా పనిచెయ్యాలంటే, మన శరీరము, ప్రాణము,

---

[1] ఎ..బి. పురాణిని (1894-1965) గురించి. భారత జాతీయ ఉద్యమంలో శ్రీఅరవిందులు నాయకత్వం వహిస్తున్నప్పుడు ఎ.బి. పురాణి ఆయనవల్ల ప్రేరితులై గుజరాతులో ఉత్తేజభరితమైన యువ ఉద్యమాన్ని ప్రారంభించారు. తన 24 వ ఏట పాండిచ్చేరిలో శ్రీఅరవిందులను దర్శించి, 1923 లో అక్కడే స్థిరపడ్డారు.

మనసు – అన్నీ దానికి తగినంత స్వచ్ఛంగా వుండాలి. అవి కూడా అతిమానసస్థాయికి చేరుకోవాలి. కానీ సాధారణంగా నిమ్నస్థాయిలోని శక్తులు ఉన్నతస్థాయి సత్యాన్ని కానీ, శక్తులను కానీ, తమ లౌకిక, స్వార్థభరిత లక్ష్యాల కోసమే వాడుకో చూస్తాయి. ఉదాహరణకి – ఎవరైనా తమ జీవితాన్ని ఎప్పుడూ స్వార్థంతో నిండిన లౌకిక సుఖాల ననుభవించినప్పుడు కచ్చితంగా వారిచేత ఈ విశ్వశక్తులే (universal forces) అలా చేస్తున్నాయని తెలుసుకోవచ్చు.

పైనుంచి దిగి వస్తున్న మహాసత్యానికి అర్పణం అవడానికి మూడు విషయాలు గుర్తుంచుకోవాలి –

1. ఎటువంటి సంకోచాలు లేకుండా ఆ ప్రవాహానికి స్వాగతం పలకడం
2. అన్ని విధాలా దానికి లొంగిపోవడం
3. ఆ మార్గానికి అడ్డుగా వున్న అంశాలన్నింటినీ తొలగించడం.

ఇన్ని ఏళ్లుగా నేను అతిమానససత్య అవతరణ మార్గంలోని కష్టాలనీ, అవరోధాలనీ తెలుసుకుని తొలగిస్తూ మీకు మార్గం సుగమం చేసే ప్రయత్నంలోనే వున్నాను. ఇక ముందు నేను చేసే సహాయం మీరు దానిని అందుకునే సామర్థ్యంపై ఆధారపడి ఉంటుంది. మీరు ఎంత అందుకో గలిగితే, నేను అంత ఇవ్వగలను. ప్రతి సాధకుడికీ ప్రతి రోజూ ఒక నూతన అనుభూతి కలగాలని అనుకుంటారు. అది ఆ సత్యాన్ని మీలోకి ఆహ్వానించగల సంసిద్ధత మీద ఆధారపడుతుంది. సంపూర్ణ ఆత్మ సమర్పణ కాకపోయినా, మీలో ఎవరికైనా, ఎంతో కొంతయినా, నామమాత్రంగానైనా సరే, ఆ అతిమానససత్యం గురించి తెలిస్తే, నా జన్మదిన ఉద్దేశం సఫలమయినట్లే!

అనువాదం: బి. వరలక్ష్మి

(*Evening Talks* by A.B.Purani 1995, pp. 483-86)

15 ఆగస్టు 1924
శ్రీఅరవిందుల జన్మదినోపన్యాసము

(శ్రీఅరవిందులు ప్రొద్దున 9.15 మళ్లీ సాయంత్రం 4 గం॥ లకు బయటకు వచ్చారు. మొదట 10-15 నిమిషాలు నిశ్శబ్దంగానే వున్నారు. తర్వాత 30-35 నిమిషాలు మాట్లాడారు. ఎ.బి. పురాణి గారు దానిని రాసిపెట్టుకున్నారు. ఆ విశేషాలు ఈ క్రింద పొందు పరుస్తున్నాము.)

నా పుట్టిన రోజు నాడు నేను మాట్లాడటము పరిపాటయిపోయింది. కాని అలా చేయకుండా నిశ్శబ్దంగా వుండటమే నాకు యిష్టం. ఎందుకంటే నోటితో చెప్పిన విషయాలు కేవలం మీ మనస్సునే స్పృశిస్తాయి. నిశ్సబ్దస్థితిలో అయితే నేను మీ అంతరంగాలను ప్రేరేపించగలను. మనం ఇక్కడ చేస్తున్న యోగము ఇతరులు చేస్తున్న యోగం కంటె కొన్ని ముఖ్యమైన విషయాలలో భిన్నము. మనిషిలోని ఏదో ఒక అంగాన్ని – మనస్సు, హృదయము, ఇచ్ఛాదులను ఎంచుకోవటమో లేక పురుష ప్రకృతులను వేరు చేయుటమో పాతయోగానికి చెందిన పద్ధతులు. దాని ద్వారా అనంతమైన జ్ఞానము, అనంతమైన ప్రేమ, అనంతమైన సౌంద ర్యము మొ॥ దివ్యానుభూతులు కలుగవచ్చును. లేదా మన ఈ గుప్పెడు మనస్సుకు, హృదయానికి జీవాత్మునికి (Individual pu-rusha) అతీతమైన బ్రాహ్మీస్థితిని పొందవచ్చును.

అనంత జ్ఞానము, దైవేచ్ఛ లేక ఆనందము యొక్క నిర్గుణ స్వరూపములను కూడ దర్శించవచ్చును. కాని మన మక్కడితో ఆగిపోము. వాటిని దాటి పోవాలి. మానవజ్ఞానమునకు అతీత మైన అనంత జ్ఞానము, మానవేచ్ఛకు మూలమైన అనంతశక్తి, మానవ హృదయమునకు పట్టుబడని అనంతానందములు మన లక్ష్యములు.

మనకు కావలసినది సృష్టిలో సర్వవ్యాప్తమైయున్న దైవము యొక్క నిర్గుణస్వరూపమొక్కటే కాదు. ఆయన సగుణ స్వరూప

మును కూడ మనము దర్శించాలి. నువ్వు నీ యొక్క నిజస్వరూపమును కనుక్కున్నప్పుడే అది సాధ్యము. నువ్వు నీ అంతరంగిక స్వరూపమును గురించి తెలుసుకోవాలి. అంతర్మనస్సు, అంతః ప్రాణికము, అంతర్భౌతికములనే వారి నిజస్వరూపమనుకొని చాలామంది పొరబడుతారు. కాని నీ నిజస్వరూపము వేరు. అది దైవముయొక్క పరమోచ్ఛస్థాయిని చూస్తుంది. శరీరధారియైన మానవుడు ఈ భౌతిక ప్రకృతిని అధిగమించి తన నిజస్వరూపమును అనగా అతిమానసలోకంలోని దివ్యస్వరూపమును పొందాలి. ప్రతిమానవుడు మూలతః దైవమే అయినప్పటికి భౌతిక అవతారంలో దైవము యొక్క పాక్షిక స్వరూపం మాత్రమే.

ఇదండీ మన యోగము యొక్క స్వరూపము. నీ దివ్య స్వరూపమును ఊరికే దర్శించినంత మాత్రాన సరిపోదు. దానిని నీ శరీరంలోకి తీసుకొచ్చి దానిని గూడా మార్చాలి. పాతయోగాలన్నీ జీవితాన్ని మార్చలేకపోయాయి. ఆ యోగములు మనస్సును దాటిపోలేదు. కొన్ని దర్శనములు పొందినప్పటికి వాటికి మానసికరూపము నిచ్చి అంతటితో తృప్తిచెందేవారు. ఉదా: అనంత భూమికలను మనస్సుతో దర్శిస్తే సరిపోతుందా? ఈ భౌతికదేహము దివ్యప్రేమను భరించగలదా?

అందుకనే మనం ఆ దివ్యస్తరాలను దర్శించినంత మాత్రాన సరిపోదు. ఆ దివ్యజ్యోతి, దివ్యశక్త్యానందములను మన శరీరంలోకి దింపుకోవాలి. అప్పుడే మానవజీవితము – భౌతికజీవితం యొక్క స్వరూపము మారగలదు. మనము చేయవలసినది ఇది – ఈ శరీరం నుంచి కొంచెం దూరంగా నిలబడి జీవితంలో జరిగే ప్రతి విషయమును దివ్యచైతన్యంతో, ఆ దృష్టితో చూడాలి. (We must detach ourselves and observe all that is going on in the nature, not even the smallest movement, the most external act must remain unnoticed.)

మానసిక, ప్రాణిక స్తరములలో ఈ ప్రక్రియ ఎక్కువ కష్టమేమీ కాదు. కాని ప్రాణికభౌతికం (physical vital) లోను, భౌతిక స్థాయిలోకి వచ్చేవరకు ఇది చాలా కష్టమవుతుంది. ఎందుకంటే

ఇవన్నీ అజ్ఞానశక్తుల గుప్పిట్లో ఉన్నాయి. ఆ శక్తులే ఇక్కడ రాజ్యమేలుతున్నాయి. వాటి శాసనాన్ని మార్చడం చాలా కష్టం. పై నుంచి వచ్చిన దివ్యచైతన్యాన్ని అవి రానిస్తే కదా! అక్కడే అజ్ఞానాంధకారాలు మనని పూర్తిగా కప్పివేసి, కట్టేసి కదలనివ్వవు. ఈ స్థితిని మార్చాలంటే చాలా ఓర్పుకావాలి. ఈ భౌతిక ప్రాణికము, భౌతికము, ఉన్నత శాసనానికి (Higher Law) ఒప్పుకోవు. 'ఈ రాజ్యం మాది నువ్వెవరవు' అంటూ మానవ మనస్సును కూడా నమ్మిస్తాయి. మనిషి కూడా నిస్సహాయుడై వాటి చేతిలో కీలుబొమ్మై వాటితో పాటు వంతపాట పాడుతాడు! ఈ విధంగా ఆ శక్తులు సాధకుల మీద కూడా అధికారాన్ని చలాయిస్తాయి.

మరో విషయాన్ని మనం గుర్తుంచుకోవాలి. ప్రాణికజీవుడు వెంటనే ఫలితాలు కావాలంటాడు. ప్రాణిక భౌతిక, మరియు భౌతిక స్తరాల్లో కూడా వెంటనే మార్పు కావాలంటాడు. కాని అది చాలా ప్రమాదాలకు దారితీస్తుంది. అందుకని నువ్వు చాలా జాగ్రత్తగా మసలుకోవాలి. దివ్యజ్యోతి, దివ్యశక్తులను దర్శించినప్పుడు నువ్వు వాటిని వశపరచుకోవాలని గాని, వాటి ద్వారా మార్పుచెందాలని ఏమాత్రం ప్రయత్నించకూడదు. ఆ మహాశక్తులు ఆవిష్కారమైనప్పుడు ఆ దేవతల ముందర సాగిలబడి వాటికి విధేయుడవై సమర్పించుకోవాలంతే. పాక్షికంగా జరిగే మార్పు కూడా మనకు వద్దు. *ఈ బాహ్యజీవితము మారాలనంటే ఆ దివ్యశక్తులను మన భౌతికలోకంలోకి ఆహ్వానించాలి. నీ మనస్సు ఎందుకూ పనికిరాదు. దానిని తీసి పక్కన పెట్టాలి.* పైనుంచి దివ్యశక్తిని, దివ్యజ్యోతిని, ఆనందాన్ని మనలోకి ఆహ్వానించాలి. "ఈ ప్రకృతిని మార్చండి మహాప్రభూ" అని నమస్కారం పెట్టాలి. అలా జరిగేందుకు నీలో ఏ కోశాన సందిగ్ధంగాని, వ్యతిరేకతగాని ఉండకూడదు. ఆ పరమ సత్యమే నీకు శరణాగతి. (This requires an essential utter sincerity in every part of the being, which can see clearly all that is going on in the being and which wants only the Truth and nothing but the Truth.)

దివ్యశక్తి దిగివచ్చి మనలో పనిచేయాల్నంటే అతిమానస లోకంలో ఉన్న నీ దివ్యస్వరూపాన్ని నువ్వు కనుక్కోవాలి. (The second condition of the Light coming down and governing even the smallest detail of life is that one must grow conscious of his Divine personality which is in the Supermind.)

కొంతమంది సాధకులు కొన్ని దివ్యానుభూతులను అనుభవించి దాంతోనే తృప్తి చెందుతారు. అంతటితో ఆగకూడదు.

మరో విషయం. ఇక్కడ మన మందరం కలిసికట్టుగా ఒకే యోగాన్ని ఆచరిస్తూ ఒకే సత్యాన్ని శోధిస్తున్నాము. ఈ విధంగా మన మందరం కూడగట్టుకొని సాధన చేస్తున్న ఒక కూటమి. దాని వలన మనకు పరస్పర సహాయము లభించగలదు – లేక దిగజారటం కూడా జరుగుతుంది.

ఈ ప్రస్తుత మానవుడిని రూపాంతరీకరించి (transformation) నూతన మానవుని తయారుచేయాలంటే మనము ఆ దివ్య జ్యోతికి ద్వారములు తెరచిపెట్టాలి. ఆ దివ్యశక్తికి పూర్తిగా విధేయమైపోవాలి. నీలో చిత్తశుద్ధి పూర్తిగా రాణించినప్పుడు, ఆ దివ్యజ్యోతికి నీ ద్వారములను పూర్తిగా తెరచి దానికి సమర్పించుకున్నప్పుడు నీ చేతనాస్థాయి క్రమక్రమంగా అన్ని స్తరముల లోను పెరిగినప్పుడు – అప్పుడు గాని నువ్వు ఈ యోగానికి నిజమైన సాధకుడవు కాలేవు.

అనువాదం: డా॥ ఆర్.ఎల్.ఎన్. శాస్త్రి

(*Evening Talks with Sri Aurobindo* by A.B.Purani 1995, p. 486)

Sri Aurobindo has brought to the world the assurance of a divine future.

The Mother

(*CWM* Vol. 13, p. 4)

15 ఆగస్టు 1924: దర్శనము
పురాణిగారి జ్ఞాపకాలు

మన మెవ్వరం శ్రీఅరవిందులను వారి పుట్టినరోజు నాడు చూసి వారితో గడిపే భాగ్యమునకు నోచుకోలేదు. కాని పురాణిగారు ఆ అనుభవాన్ని ప్రత్యక్షంగా పొందారు. పొందటమే కాకుండా ఉన్నదున్నట్లుగా చాలా అద్భుతంగా వర్ణించి మన కందజేశారు. మనము దానిని చదివి, మళ్ళీ మళ్ళీ చదువుకొని ముగ్ధులమై దాని అంతరార్థాన్ని గ్రహించెదము గాక. — *సంపాదకుడు*

ఈ రోజు ఎంతటి సుదినము! ఏ వర్ణనలు, ఉపమానాలూ, ఎటువంటి పదజాలమూ ఈ ఆనందాన్ని అంచనా వేయలేవు. అది ఆగస్టు పదిహేనండీ – అంతే! Who can describe this day? Nothing can be added by the colours of imagination, poetic similies, and loaded epithets. It is enough to say, "It was the 15 th August." అదే అన్నిటినీ మించిన భావార్థాన్ని స్ఫురింపచేస్తుంది. మరే రోజూ కూడా ఈ దినంతో సాటిరావు. ఆశ్రమ మందెల్లడలా ఆధ్యాత్మిక వాతావరణం అలముకొని ఉంది. ప్రతివారి హృదయం భావావేశంతో ఉద్విగ్నమవుతూండగా అందరూ ఆధ్యాత్మిక వాతావరణంలో మునిగి తేలుతున్నారు.

పరమ గురువు తన శిష్యులతో ఎన్నో రకాలుగా అనుబంధాలను, ఏర్పరచుకోవడం వారి విశిష్టతకు గుర్తు. అనుబంధాలు ఎంతో పటిష్ఠంగా ఉండటమే కాక, ప్రతి శిష్యుడూ గురువుగారు తనకు మాత్రమే స్వంతమనీ, తననే అమితంగా ప్రేమిస్తున్నారనీ నమ్ముతాడు. అది వాస్తవమేనన్నట్లు గురువు కూడా ప్రతి శిష్యునీ ఆ విధంగానే చూస్తాడు. ఇది వట్టి భ్రమగానీ, భ్రాంతిగానీ కాదు. నూటికి నూరు పాళ్లు సత్యం. దివ్యశక్తి ఒక ప్రేమమూర్తిగా ఆవిర్భవించినప్పుడు ఆ ప్రేమ సర్వత్రా వర్తిస్తుంది. ఆ ప్రేమమూర్తే శ్రీఅరవిందులు.

ఆశ్రమమంతా సమర్పణ భావం పరవళ్లు తొక్కుతోంది. సర్వసమర్పణానందంలో ఆశ్రమవాసులంతా తేలిపోతున్నారు. సర్వం అర్పించేస్తే తేలిక గాక మరేముంటుంది? నీ బరువు బాధ్యతలు వహించే వారున్నారంటే నీ కెంత హాయిగా ఉంటుంది? Each believes the Master loves him most and it is true that he loves each the most. This feeling in not an illusion or delusive self-hypnotism, but is quite real. The spontaneous dynamic law of the Supreme Truth which he embodies is love – divine love. In all the inmates the delight of surrender is overflowing – the bliss of surrender, its sparkle pervades all. All is given up, everything is surrendered. How free you feel! How light and unburdened you feel! ఆ దివ్య ప్రేమశక్తిని నమ్ముకుంటే నీకంతా సుఖమే. *ఆయనపై భారముంచి నువ్వుగా అనుకునే అల్పిష్టి తత్వాన్ని ఆయనకే అప్పగించేస్తే, దాని సంగతి ఆయనే చూసుకుంటాడు. నీకిక చీకూచింతా ఉండదు. ఆయనను నమ్మటమే నీ పని. దానికి పెద్ద ప్రయత్నమేమీ అక్కర్లేదు. ప్రేమతో అర్పణ చేసుకోవటమొక్కటే.* అది చాలా తేలిక.

ఇక్కడ అందరి ముఖాలు సమర్పణ వల్ల కలిగిన ఆనందంతో వెలిగిపోతున్నాయి. ఎక్కడ చూసినా ఆనందం వెల్లువలై ప్రవహిస్తుంటే, అందరూ అందులో మునిగి తేలుతున్నారు. ఆ ఆనందం బయటనుంచి వచ్చింది కాదు కదా! అయితే ఆ అపరిమితానందం ఎక్కడి నుంచి వస్తున్నట్లు?

ప్రాతఃకాలం నుంచే ఆశ్రమంలో కోలాహలం ప్రారంభమైంది. పూలు తేవటం, దండలు కట్టడం, అభ్యంగన స్నానాలు చేయడం, మిఠాయిలు తయారు చేయడం, ఒకటేమిటి? అంతా సందడే సందడి. అంతా శ్రీవారి దర్శనం కోసం తహతహ. ఒక్కొక్క క్షణం గడుస్తున్నకొద్దీ ఆరాటం ఎక్కువవుతోంది. వారిని రోజూ చూస్తూనే ఉన్నప్పటికీ ఈనాటి ఉద్విగ్నతకి కారణమేమిటి? అది ఒక పరమ దర్శనము. ఇవ్వాళ ఒక్కరొక్కరుగా వెళ్లి ఆయనను ప్రత్యేకంగా దర్శించుకోగల సుదినము. ఈ రోజు వివిధ

కార్యక్రమాల వల్ల చైతన్యం సాంద్రమవుతోంది. ఇక దర్శించు కునేది సాక్షాత్తు ఆ పరదైవతాన్నే. ఇదొక అపూర్వావకాశమే మరి! It is "Darshan" – we see him everyday, but today it is "Darshan"! Today each sees him individually, one after another. In the midst of these multiple activities the conciousness gets concentrated. Today is "Darshan" – not of a human being but of some Supreme Divinity. Today is the rare chance of seeing the Divine.

ఆ ఇదుగో, వారు వరండాలో కుర్చీలో కూర్చున్నారు. అది ఒక సింహాసనంలా ఉన్నది. ఆ కూర్చున్న తీరులోనే దివ్యత్వం ఉట్టిపడుతోంది. ఆ పరమ గురువు, ఆ మహర్షి హృదయంలో సాగరోత్తుంగ తరంగాల వంటి భావావేశ స్పందన స్పష్టమవు తోంది. అది శిష్యులపై కురవబోయే కరుణారస వాహినియా? అక్కడున్న వారికి మాత్రమే ఆ దివ్యత్వం అనుభవమౌతుంది. ఆ రసవాహినిలో దిగినవారు బయటకు రావటానికి ఇష్టపడటం ఉండదు – మెడలో తెలుపు, గులాబి రంగుల తామర పుష్ప మాలికలు ధరించి వారు గంభీరవదనంతో ఆ సింహాసనంపై ఆసీ నులై ఉన్నారు. ఆ పువ్వులన్నీ శిష్యులు అర్పించిన చిరుకాను కలు కాబోలు. ఇక ఒక్కరొక్కరుగా స్పందించే హృదయాలతో ప్రార్థనలను, విన్నపాలను వారి ముందు కుమ్మరిస్తారు. *అయితే వారి కరుణామృతధారల వెల్లువలో అవన్నీ కొట్టుకొనిపోతాయి. వారి వారి మనస్సుల్లోని విశ్వాసరాహిత్యం, సందేహాలు మొద లైనవన్నీ మాయమైపోతాయి. మానవులకు కావలసిన అవస రాలన్నిటినీ ముందర తీర్చేసి ఆ తర్వాత తన ప్రేమ, కరుణా మృతాలను నిరంతరాయంగా ప్రవహింప చేస్తారు.* వారు చూసే చూపు – అందునుంచి జాలువారే ప్రసన్నత పరవశాన్ని కలిగి స్తుంది. అది మరచిపోవడం ఎవరికి సాధ్యం? సంతత కరుణా కటాక్షాలను వెదజల్లే వారి దైవత్వానికి సాటి ఏది? అలౌకికమైన పరమేశ్వర తత్వం అంటే ఇది కాకపోతే మరెక్కడుంటుంది?

సాధారణంగా ఆయన మూర్తీభవించిన జ్ఞానస్వరూపమే. కానీ ఈ రోజు మాత్రం ఇంకొకరకంగా ఉన్నారు. మూర్తీభవిం

చిన ప్రేమతత్వంగా ఉన్నారు. కవివర్యుడు పరమప్రేమమూర్తిగా అవతరించారు. కళ్ళతోనే కుశలమడిగి కరుణాకటాక్షాలను కురి పిస్తున్నారు ఆ మహనీయమూర్తి! Man does wonders with his eyes and looks but to do so much diivinity is needed.

ఆయనను ఏమి అడగాలి? ప్రేమనా? ఆశీర్వచనాలా? మన వంటి అనర్హులను శిష్యులుగా చేరతీసింది చాలక ఇంకా ఇవన్నీ కూడా అడగడమా? అనంతత్వపు అంచుల దగ్గరున్న భావనతో ఆయన అరమోడ్పు కనులలోని వాత్సల్యాన్ని దర్శించినప్పుడు మన ఆత్మ శాశ్వతంగా ఆయన అధీనంలోకి వెళ్ళినట్లే. ఇదొక అనిర్వచనీయమైన దివ్యప్రేమ రహస్యము. దీన్ని వివరించడం సాధ్యమయే పనికాదు. వాస్తవమనేది ఎప్పటికీ నిజమే, అనుభవించి చూసేదే. ఇంతకంటె వివరించడం అసాధ్యం. The inexplicable mystery of divine love was here a tangible experience! Who can explain a fact? A fact is a fact and an experience. There is no explanation possible.

ఆయనకు ఏమి సమర్పించుకోవాలని మనస్సు మథనపడు తుంటే ఆయనను ఏమి అడగాలా అని హృదయం వెతుక్కుం టోంది. రెండింటికీ సమాధానాలు లేవు. ఏమి ఇవ్వాలనుకున్నా అది ఎంతో అల్పమనే భావన కల్గి మనస్సు మిన్నకుంటే, హృదయం తను అడుక్కోవటమేమిటని సిగ్గుపడి, అహం గాయ పడిందనుకుంటుంది. అయితే ఈ కలవరపాటంతా ఎప్పటికి అంత మవుతుంది? చివరికి అడుక్కోవాలనుకునే హృదయమే నెగ్గుతుంది. అంతేకాక అక్కడ ఎవరిని ఏ విధంగా అనుగ్రహిస్తారో, ఏం జరుగుతుందోనని ఉత్సుకత కూడా ఉంది.

ఇదంతా కూడా దర్శనానికి ముందర పరిస్థితి. తీరా వారి ముందుకు వెళ్లేటప్పటికీ ఆ అహంభావము, ఆరాటం, రకరకాల ప్రశ్నలు, ఆలోచనలు, నిశ్చయాలు అన్నీ కూడా ఆ దివ్యదర్శన మనే నయాగరాలో కొట్టుకొనిపోయాయి. మూర్తీభవించిన దివ్య స్వరూపమే వారు. శుద్ధ స్ఫటికం వంటి పారదర్శకత, వారి హృదయపు స్వచ్ఛత; ఆ హృదయంలో కూడా పెల్లుబుకుతున్న

భావతరంగాలు. ఇక నోటి మాటలతో పని లేదు. ఒళ్ళు తెలియని స్థితిలో వారి పాదపద్మముల మీద సాగిలపడి హృదయం తనను తాను సమర్పించేసుకుంది. శరీరం తెలియచేసే భాష ఒక్కటే – సాష్టాంగ దండప్రణామములాచరించి సర్వసమర్పణ చేసుకొనుట, హృదయములోని ఆవేదన, కళ్లలోనుంచి స్రవించే ఆనందభాష్పాలు, మొదలైనవన్నీ శరీరం వ్యక్తం చేయగల చేష్టలు, దైవత్వంతో నిండిన ఆ ప్రశాంతతను వర్ణించేదెలా? అందతా ఒక చక్కని అను భవము.

ప్రతివారూ సమతాస్థితిలో ఉండాలని ప్రయత్నిస్తున్నారు. అంతా నిశ్శబ్దాన్ని, నిశ్చలతనూ పాటిస్తున్నారు. అయితే ఇవ్వాళ పరవళ్లు తొక్కుతున్న ఆ దివ్యప్రేమ వీరు పెట్టుకున్న అదుపు లన్నిటినీ తుడిచిపెట్టేసింది. ఆత్మ ప్రశాంతంగా ఉన్నప్పటికీ బాహ్యప్రకృతి మాత్రం కొత్త నీరు ప్రవేశించినట్లే ఒక రకంగా అలజడికి గురైంది. తన తెలివితేటలేం పనికి రాలేదు. ఇంక అంతటా దివ్యప్రేమ వెల్లువ ఇంతకు మునుపు లభించని విధంగా దైవికవిజయం లోని నిగూఢత ఈనాడు ఆత్మకు విశదమైంది.

మధ్యాహ్నం భోజనశాలలో అందరం కలుసుకున్నాము. అంతా ఆనందంలో మునిగి తేలుతున్నాము. పారవశ్యం కలిగిస్తున్న సంతోషం. ఆనందసామ్రాజ్యమే రాజ్యమేలుతున్నట్లుంది. ఇంతటి రసానందకల్పన చేసిన ఆ దివ్యకళాకారునికి జోహార్లు.

సాయంత్రం నాలుగు గంటలకు అందరం మామూలుగా[1] వరండాలో చేరాము. అంతా ఆశతో ఎదురు చూస్తూ కూర్చు న్నాము. అక్కడక్కడా గుసగుసలు తప్ప అంతా నిశ్శబ్దంగా ఉంది. అందరి మనస్సుల్లోనూ ఒకటే ఆలోచన కదులుతోంది. "వారెప్పుడు వస్తారు. వస్తారో రారో!" సరిగ్గా నాలుగు గంటల పది హేను నిమిషాలకు 'టిక్' మనే గడి చెరిచిన చప్పుడు నేడు కొత్తగా అనిపించింది. మెల్లిగా తలుపు తెరుచుకొని 'శ్రీవారు' అడుగు

[1] సాధారణంగా ప్రతి రోజూ ఆ సమయానికి అక్కడ శ్రీఅరవిందులను కలుసుకో వడం పరిపాటి.

పెట్టారు. వారి వెనుక శ్రీమాత ఎర్రంచుగల మీగడరంగు చీర కట్టుకొని కనిపించారు. వారు రోజూ కూర్చొనే విశాలమైన జపాన్ కుర్చీలో ఆసీనులైనారు. వారి కుడి పక్కన ఓ చిన్న స్టూల్‌మీద శ్రీమాత కూర్చున్నారు. అయిదు నిమిషాలపాటు నిశ్శబ్దం రాజ్యమేలింది.

ఆ తర్వాత ప్రతి ఒక్కరి పైనా విడివిడిగా దృష్టి సారించారు. మళ్ళీ అంతటా నిశ్శబ్దం. దివ్యమైన ఒక భావనా ప్రవాహం అంతటా వ్యాపించి అందరినీ ముంచెత్తింది. అనంతంగా ఈ ప్రవాహం ఇలాగే ఉండిపోతే ఎంత బాగుంటుంది. కానీ కాలం ఆగదు కదా! అందరూ దాన్నే ఆడిపోసుకుంటారు. పాపం దాని తప్పేముంది? నిజానికి ఇంతటి ప్రేమ, ఇంతటి ఆనందం ఆ దైవమే కల్పిస్తున్నప్పుడు కాలాన్ని కూడా అనంతత్వాన్ని పొందనీ. ప్రపంచమంతా దివ్యత్వం పొందుగాక! ఆ నిశ్శబ్దంలో ఇంకో బలమైన ఆకాంక్ష పెల్లుబుకుతోంది. దానికి వ్యక్తీకరణతో పని లేదు. అనంతకాలమంతా ఒక వెల్లువై ఆ నిశ్శబ్దంలో ప్రవహించి పోకూడదూ?

అనువాదం: డా॥ ఎ. ప్రభావతి, డా॥ ఎ. వెంకటరామశాస్త్రి

(A.B. Purani: *Evening Talks with Sri Aurobindo* Third Edn. 1982, p. 486)

The help of Sri Aurobindo is constant: It is for us to know how to receive it

The Mother

(*CWM* Vol. 13, p. 13)

15 ఆగస్టు 1925:
శ్రీఅరవిందుల జన్మదిన ప్రసంగం

(ఎ.బి. పురాణీగారి స్మృతులు)

అతిమానసజీవిని, అతిమానస ప్రపంచాన్ని, అతిమానస ప్రకృతిని ఆవిష్కరించటం, జీవితంలో వాటిని అభివ్యక్తం చేయడం – ఇదే పూర్ణయోగ లక్ష్యం. కాని కొన్ని సర్వ సాధారణమైన పొరపాట్లు జరిగే అవకాశం వుంది. వాటి పట్ల మనం జాగ్రత్త వహించాలి. అణిమ, గరిమాది తంత్రశక్తులు, రుగ్మతలను నయం చేయడం, శరీరవ్యాపార నియంత్రణాదులను అతిమానసికంగా కొందరు భావిస్తున్నారు. ఈ శక్తులు దాగివున్న అంతస్తలీయ (subliminal) అంతస్సీమలలోకి తెలిసో తెలియక ప్రవేశించటం వలన లభిస్తాయి. యోగం గాని, అతిమనస్సు గాని తెలియని వ్యక్తులకు కూడా ఈ శక్తులు రావడం చాలాసార్లు చూస్తూనే ఉంటాము.

గతంలో ఈ పూర్ణయోగాన్ని అనేకసార్లు ఆచరించినట్లు ఒక పరంజ్యోతి (Light) అవరోహించి, అదృశ్యమైనట్లు కూడా ఒక భావన ఉంది. ఇది సత్యదూరం. అతిమానస భౌతికకాయన్ని ఇంతవరకూ ఎవరూ సాధించలేదు. ఒకవేళ సాధించివుంటే, అది వుండివుండేది కదా! అటువంటి పిచ్చి ఊహాలతో మన యోగానికి ఆటంకాలు సృష్టించరాదు.

అంతిమ రూపాంతర స్థితిని (ultimate transformation) వెల్లడించే తరుణం ఇంకా రాలేదు. శరీర వ్యాపారాల సరళిపై ప్రాణిక నియంత్రణ సాధించినందువల్ల చాలామంది పురాతన యోగి పుంగవులు సిద్ధులు పొందారు. ప్రాణశక్తితో శారీరక వ్యాపారాలను, శరీరతత్వాన్ని నియంత్రించడం – ఇటువంటి ప్రాణిక సిద్ధులు పొందడం ఈ యోగలక్ష్యం కాదు.

అన్ని భూమికలలోను, మనలోని చైతన్యాన్ని పరిపూర్ణంగా పరివర్తన చెందించడానికి ప్రయత్నిస్తున్నాము. (What we are

attempting to achieve is a complete transformation of our entire being in all its planes of manifestation.) భౌతికశరీర పరివర్తన కాని, భౌతికశరీరంపై విజయంకాని పాతకాలపు యోగపద్ధతుల లక్ష్యం కాదు. పరివర్తన ఈ యోగపద్ధతులకు చిక్కలేదు.

మరో భావన ఉంది. సృష్టి యావత్తూ ఒకే భగవంతుడు కదా. ఆ 'ఏకం సత్' (చైతన్యాన్ని) తెలుసుకోవాలి. మన అన్ని చైతన్యభూమికలలోకి ఆ అనుభవం కొంతవరకు రావాలి. వేదాంత భావాలను బాగా నూరిపోసి, వంటపట్టించుకోవడం వల్ల కలిగిన పొరపాటు ఇది. ఒకే భగవత్ చైతన్యం ఉంది. ఆ సిద్ధిని పొందాలి నిజమే. కాని అక్కడితో ఆగిపోకూడదు. మన స్వరూపాన్ని పూర్తిగా రూపాంతరం చెందించాలి.

చైతన్యవంతులమై, స్పృహతో పరిణామం చెందడానికి ఒక ప్రయత్నం ఈ యోగం అనే భావన ఒకటి వుంది. పరమాత్మ ఈ పదార్థంలో (సృష్టిలో) అంతర్నిహితమై వున్నాడు. దానికి లోబడి వున్నట్లు అనిపిస్తుంది. పరిణామ ప్రక్రియవల్ల ప్రాణిక, మానసిక చైతన్యభూమికలు అభివ్యక్తమై రూపుదాల్చాయి. మనస్సు నుండి అతిమనస్సును పరిణమింపచేయడం ఈ ప్రయత్నం లక్ష్యం.

శరీరాన్ని (అన్నమయ పురుషుని) ప్రాణికంలోనికి, మనోమయకోశంలోకి, విజ్ఞానమయ (Supramental) ఆనందమయ చైతన్యభూమికలలోకి అధిరోహింప చేయుటం గూర్చి తైత్తిరీయ ఉపనిషత్తు ప్రవచిస్తుంది. అతిమనస్సును సిద్ధింపచేసుకున్నవాడు 'సూర్య' మణిద్వారం ద్వారా తప్పించుకుంటాడని మరో ఉపనిషత్తు వివరిస్తుంది.

అతిమనస్సును చేరిన పిమ్మట, అది ఎరుకతో జీవితంలోకి అవతరిస్తుందన్న భావన లేదు. అభివ్యక్త చైతన్యం అంతర్లయనం (involution) ప్రక్రియ ద్వారా అతిమనస్సుకు చెందిన సత్య చైతన్యంలోకి అంతర్నిక్షిప్తం అవుతుంది. దీనిని Involution అంటాము. అదే పరిపూర్ణత్వంతో అతిమనస్సు, మనోమయ, ప్రాణమయ, అన్నమయ కోశాలలోకి అవరోహిస్తుంది.

ఈ యోగసాధనలో ఒక అధిరోహణాక్రమం వుంది. అదే సర్వస్వం కాదు. అధిరోహణతోనే సంతృప్తి పడకూడదు. మన మనస్సు, ప్రాణం, శరీరాలను, మన ప్రకృతిని పరివర్తన చెందించి, వాటిని నియంత్రించే అతిమానస జ్యోతిర్నివహాన్ని సత్యాన్ని, సామరస్యాన్ని పూర్తిగా చైతన్యవంతులమై క్రిందికి తీసుకుని రావాలి. We want first to transform all our being into the Supramental nature. But that is not all, we have to call down and throw that Power upon the external life and establish the Truth and harmony there also.

అనువాదం: కె. యజ్ఞన్న

(A.B. Purani: *Evening Talks with Sri Aurobindo* Third Edn. 1982, p. 496)

మనస్సు – అతిమనస్సు

(1925 ఆగస్టు 15 వ తేదీ సాయం సంభాషణలు శ్రీ ఎ.బి. పురాణి స్మృతులు)

శిష్యుడు: మనస్సు నుండి అతిమనస్సు (supermind) పరివర్తనము – అతిమానసము నుండి ఇంకా ఉన్నతభూమికలకు చేరు మార్పుకన్నమరింత తీవ్రమైనదా?

శ్రీఅర: ఏమిటీ? అది అజ్ఞానభూమిక నుండి జ్ఞానభూమికకు అధిరోహించటంలోని ఓ కీలకమైన మెట్టు అని నీ ఉద్దేశమా?

శిష్యుడు: అవును.

శ్రీఅర: చూడు, మనస్సు విభజన ద్వారా పనిచేస్తుంది. సత్యాన్ని కూడా ఖండఖండాలుగ మాత్రమే చూస్తుంది. ఆ సత్య రీతులలో ఒక్కొక్క పర్యాయం ఒక్కొక్క దానినే గ్రహించగలుగుతుంది. కాని మనస్సు తాను గ్రహిం

చిన ఆ పాక్షిక భాగాన్నే పూర్ణసత్యంగా భావిస్తుంది. ఇలా గ్రహించడమే అసత్యమైనది, కపటమైనది.

అతిమానసం అటుల కాదు. అది సమ్మేళనాత్మకమైన ఐక్యాతాభూమిక. ఆ ఐక్యదృష్టితోనే అది విభజనను కూడ తెలుసుకొంటుంది. దైవం వైపు వెళ్ళడానికి మనకది అత్యంత దగ్గర దారి. అది మనస్సులో కూడ పని చేస్తుందన్న మాట నిజమే. కాని మనస్సులో నీవు సత్యాన్ని పాక్షికంగానే అన్వేషించి పాక్షికంగానే కనుగొంటావు. మనస్సు సత్యగ్రహణానికి ఒక ప్రయత్నమే కాని జ్ఞానం కాదు. మనస్సు జ్ఞానాన్ని అలా అలా ఉండవచ్చని సూచనప్రాయంగా చూపగలుగునే కాని జ్ఞానాన్ని పొందలేదు. అది సత్యాన్ని పూర్ణంగా ప్రకటింపజాలదు.

ప్రాణమయ భూమికలో కూడ అతిమానసం పని చేస్తుంది. అచట దాని స్వభావం సహజాతంతో కూడుకున్నది; కచ్చితమైనది. కాని అతిమనస్సుకు అత్యంత దగ్గర నున్న దాని కార్యం మరుగుపరుపబడి వుంటుంది. అతిమానసం అందుకు పూర్తిగా భిన్నమైనది. అది స్వయంప్రవర్తకమైనదని నీవు చెప్పవచ్చును. కాని అది యాంత్రికభావనలో కాదు. అది 'స్వయం క్రియాత్మక' సత్యం. ఒక్కసారి నీవు ఆ అతిమానన స్థాయికి చేరుకోగలిగితే నీ కిష్టమైతే నీవు 'సూర్యమణి ద్వారాల' ద్వారా క్రింది భూమికల నుండి తప్పించుకోవచ్చు. నీ వింకా యింకా ఉన్నత భూమికల పైకి పోగలిగితే సూర్యుని అవసరం లేనట్టి భూమికను చేరుకొనగలవు. కాని అతిమానసమును భౌతికభూమికల లోనికి అవతరింపచేయగలిగినపుడు మాత్రమే అదంతా సులభమవుతుంది; సాధ్యమవుతుంది. దాని తర్వాత నీ వికాసము సహజమైన, సులభమైన పెరుగుదలతో సాగిపోతుంది. అయితే యిదంతా యీ క్రింది

భూమికలైన మనఃప్రాణిక దేహాలలో నిరంతర పోరా టంగానే వుంటుంది.

నువ్వు ఎప్పుడైతే అతిమానసస్థాయికి చేరుకుంటావో నీకు అప్పుడిక ఆలోచనలతో పని లేదు. అతిమాన సంలో నీవు ఆలోచించవలసిన అవసరమే వుండదు. అట్లని అసలు తలపులు వుండవనికాని, అదంతా ఖాళీ అనీ శూన్యమనీ అర్థం కాదు. అక్కడ మరొక విధ మైన శక్తి పనిచేస్తుంది.

శిష్యుడు: ఎలా?

శ్రీఅర: 'ఎలానో' నీవు అర్థం చేసుకొనలేవు.

శిష్యుడు: కాని ఆలోచన లేకపోతే మనస్సెలా పని చేస్తుంది?

శ్రీఅర: నీవు మనస్సులో ఒక అంశం నుండి మరొక అంశా నికి – దాన్నుండి మరో అంశానికి అలా అలానే చింతి స్తావు. అంతట వాటన్నింటిని కలుపుకొని కార్యకారణ సంబంధాలతో ముడిపెడతావు. మరి వందలాది యిచ్ఛలు వాటి వివరణలను ప్రదర్శిస్తూ ఒకేసారి ఒక్క సెకండ్ లోపుగా వెలువడుతాయనుకో. దాన్ని నీ వూహించ గలవా? అదే అతిమానసభావన అంటే.

శిష్యుడు: ఓ! నేను దాన్ని వూహింపగలను.

శ్రీఅర: నిజమే, నీవు వూహించగలవు కాని, నువ్వు అనుభ విస్తే తప్ప ఆ విషయభావనను అనుభూతి నందజాలవు.

శిష్యుడు: అతిమనస్సు యొక్క మరొక లక్షణాన్ని మాకు అంది స్తారా?

శ్రీఅర: మరో లక్షణాన్నా! అది అలా మనస్సుతో గ్రహించేది కాదు సుమా!

శిష్యుడు: అయినప్పటికీ అది మాకు కొంత సహాయకారిగా వుండొచ్చునేమో కదా!

శ్రీఅర: సరే. ఉదాహరణకు ఒకే సమయంలో పరిపూర్ణ విశ్రాంతి, పరిపూర్ణ క్రియాకలాపము – అన్న భావాన్ని నువ్వు ఆలోచింపగలవా?

శిష్యుడు: మనఃశ్శక్తులన్నీ వాటికి సంబంధించిన లేక వాటి కను గుణంగా వుండే వాటి ప్రతిరూపాలను అతిమానసంలో కలిగి వుంటాయనడం నిజమేనా?

శ్రీఅర: 'ఆర్య' లో నేను చెప్పినదదే. 'ఆర్య' నేను అతిమాన సపు పొలిమేరల నుండి వ్రాసినది. ప్రతి ఒక్కరు ఆ స్థాయి ద్వారా పయనించాల్సిందే. మానవహేతువునకు అనుగుణంగా వుండే దైవహేతువు వుందనుట నిజమే (It is true that corresponding to Reason there is what may be called the Divine Reason.) ఆ దైవహేతువుగా పని చేసేది అతిమానస ప్రక్రియ నుండి ఉత్పన్నమైన దని చెప్పవచ్చు. కాని అది పూర్తిగా భిన్నమైనది. నేను దీన్నంతా మనఃస్థాయికి అనుగుణంగా అందిస్తున్నాను. నేను నీకు అతిమానస ప్రతిరూపాలను మాత్రమే యివ్వ గలను. కాని అది అతిమానసస్థాయిలో అచ్చంగా అలాం టిదే కాదు. ఉదాహరణకు మానవ హేతువు కార్య కారణాన్ని కనుగొని – ఆ రెంటినీ ఒక్కటిగ కలుపు తుంది. కాని దైవహేతువు వాటన్నింటినీ సరైన సంబం ధంలో వుంచుతుంది. ఇలా మనస్సు కనుగుణంగా వర్ణింపజాలని విషయాలు యింకా వున్నాయి.

శిష్యుడు: ఉదాహరణకు

శ్రీఅర: పరస్పర విరుద్ధాల మధ్య సామరస్యం – ఉదాహర ణకు పరిపూర్ణ నిశ్శబ్దత, పరిపూర్ణ భావప్రకటనల మధ్య సామరస్యతను నీ మనస్సున కనుగుణంగా వివరింపగలవా?

అనువాదం: బి. నరసింహయ్య

(A.B. Purani: *Evening Talks with Sri Aurobindo* Third Edn. 1982, p. 500)

అతిమానసశక్తి అవరోహణకు అవసరమగు ప్రపంచ పరిస్థితులు

(ఆగస్టు 15, 1925 నాటి సాయంసంభాషణల నుండి
శ్రీ ఎ.బి. పురాణిగారి జ్ఞాపకాలు)

శిష్యుడు: అతిమానసశక్తి అవరోహణకు ప్రపంచ పరిస్థితులు గతంలో కన్న యిప్పుడు ఎక్కువ అనుకూలంగా ఉన్నాయన్నారు, ఎందుకని?

శ్రీఅర: మొదటిది, భౌతికశాస్త్ర విజ్ఞానము కట్టలు తెంచుకొని విపరీతంగా పెరిగిపోతోంది.

రెండవది, బాహ్యా అంతరంగిక మానసికస్థాయిల మధ్య తెరలను, బాహ్యా అంతరంగిక, ప్రాణికస్థాయిల మధ్య తెరలను బాహ్యా అంతరంగ భౌతికస్థాయిల మధ్య కూడ నెలకొనియున్న అడ్డుతెరలను తొలగించు దిశగా ప్రపంచ వ్యాప్తంగా ప్రయత్నం జరుగుచున్నది. తత్ఫలితంగా చాలామందిలో ఆత్మజ్ఞానం వెల్లివిరుస్తోంది.

మూడవది, గతంలో ఎప్పుడూ లేనంతగా ప్రాణికశక్తులు భౌతికముపై తమ పట్టు బిగించుటకు ప్రయత్నిస్తున్నవి. మహోన్నత సత్యము అవతరించే ఈ సమయములో కొన్ని రాక్షసశక్తులు పైకి వచ్చి విలయతాండవ మాడుతాయి. మతిభ్రమించినవారి సంఖ్య పెరుగుట, భూకంపాలు సంభవించుట మొదలగు ఎన్నో విపరీత సంఘటనలు గోచరిస్తాయి. అదేగాక, ఆధునిక శాస్త్రపరిజ్ఞానముతో కనుగొన్న విమానములు, రైల్వే, టెలిగ్రాఫ్ లాంటి సాధనాల మూలంగా యావత్ప్రపంచము ఏకమవుతోంది. అట్టి ఐక్యత దివ్యసత్యావతరణకు అనువగు స్థితి, మనకు సమస్య కూడాను.

నాల్గవది, అధికసంఖ్యాకులను వశపరచుకొని గడగడలాడించగల వ్యక్తులు కొంతమంది తలెత్తుట.

ప్రపంచ పరిస్థితులు ఎక్కువ సన్నద్ధమై వున్నాయనుటకు, యివి కొన్ని సంకేతాలు. గతంలో చేయబడిన ప్రయత్నాల గురించి మనకేమీ తెలియదు. కాని ప్రస్తుతం మనం గమనించ గలిగినంత వరకు అట్టి ప్రయత్నం సల్పుటకు తగిన పరిస్థితులున్నాయన వచ్చును.

శిష్యుడు: ప్రపంచశక్తులను గూర్చిన పరిజ్ఞానము యోగములో అవసరమగు అంశమని భావిస్తారా?

శ్రీఅర: అవును! నీవు ప్రపంచశక్తులతో వ్యవహరించవలసి వుంటుంది. ఎందుకంటే, వాటంతట అవి, ముఖ్యంగా ప్రతికూలశక్తులు వాటి ప్రభావాన్ని చవిచూపిస్తాయి గనుక. అదే విధంగా సాయపడే శక్తుల గురించి కూడ నీకు అవగాహన కలగాలి. వ్యక్తిగత సాధన జరుపుతున్నప్పుడు కూడ యీ ప్రపంచశక్తులు తమకు తాముగా సాధకుడి అనుభవంలోకి వస్తాయి. నీవు పురోగతి సాధించిన కొద్దీ తప్పనిసరిగా వాటి ధోరణి మార్పు చెందుతుంది. ప్రపంచ శక్తుల గమనము నిమ్న స్తరాలలో ఆరంభం కాదు. చాల ఉన్నతస్థాయిలో ఆరంభమౌతుంది. అన్ని నిర్ణయాలు ఉన్నతస్థాయిలోనే తీసుకోబడతాయనునది నిజమే గాని, వాటికి సంబంధించిన స్తరాలలో వాటిని తెలుసుకొన వీలుపడదు. స్తరాల మధ్య ఒక అడ్డుతెర వేయబడింది. ప్రతి స్తరానికి తన స్వంత నిర్ణయం తీసుకునే స్వేచ్ఛ యివ్వబడింది. పోరాటంపై నిర్ణయం, పోరాడే శక్తులకు వదిలివేయబడింది. పోరాటం ఒక కీలకదశకు చేరినప్పుడు మాత్రమే, ఉన్నతస్థాయిలో తీసుకోబడిన నిర్ణయం వెల్లడవుతుంది. అల్పజ్ఞాన సముపార్జనా యత్నమే నీలో ఉన్నత జ్ఞానాభివృద్ధిని సాధించుటకు తోడ్పడుతుంది.

శిష్యుడు: సాధకుల బాధ్యత ఏమిటి?

శ్రీఅర: ఏకైక లక్ష్యముగల ఆకాంక్షతో ఈ ప్రయత్నానికి నీవు తోడ్పడవచ్చు. ఈ లక్ష్యసాధనలో అడ్డువచ్చిన దాని నంతా తిరస్కరించాలి. కాని, అలా చేయుటకు బదులు, ప్రతికూలశక్తుల సలహాలను స్వీకరిస్తూ, వాటి మంత్ర జపం చేస్తూ కూర్చుంటే, నీకు యితరులకు కూడ యిది సాధ్యపడదనే భావన కలుగుతుంది. అప్పుడు ఆ ప్రతికూల శక్తులకే దోహదపడిన వాడవవుతావు.

అనువాదం: అందుగులపాటి కైలాసపతి, జానకి

(A.B. Purani: *Evening Talks with Sri Aurobindo* Third Edn. 1982, p. 503)

మేరీ మాత అభ్యుత్థానానికీ శ్రీఅరవిందుల జన్మదినానికీ గల సంబంధం

(శ్రీ అనిల్ బరన్‌గారి జ్ఞాపకాల ఆధారంగా)

1926 ఆగస్టు 30

ఆగస్టు 15 విశిష్టత – అది మేరీ మాత (Virgin Mary) పునీతమైన రోజు – భౌతిక ప్రకృతి దివ్యత్వాన్ని సంతరించుకున్న రోజు. మేరీమాత ప్రకృతికి చిహ్నము – ఏసు (Jesus) మానవునిలో ఆవిర్భవించిన దివ్యాత్మ. కేథలిక్ మతాధికారులకు ఈ అంతరార్థం తెలుసు. అయితే దానిని బయటపెట్టరు.

శ్రీఅరవిందులు

*

1956 ఆగస్టు 15

ప్రశ్న: శ్రీఅరవిందుల జన్మదినానికీ, కేథలిక్ చర్చిలో జరిగే మేరీమాత దివ్య ఉత్థాన వేడుకలకీ ఏమన్నా సంబంధం వుందా?

శ్రీమాత: కచ్చితంగా ఉంది. అది శ్రీఅరవిందులే చెప్పారు. మేరీ మాత ఉత్థానమనగా భౌతిక పదార్థపు దివ్యీకరణమే (divinisation of Matter) ఇదే ఆఖరి అవతార ఉద్దేశం కూడా.

అనువాదం: బి. వరలక్ష్మి

(*Sri Aurobindo Circle*, 1985 p. 63; *CWM* Vol. 8, p. 270))

ఆగస్టు 15 న మన కర్తవ్యము

29-7-1926 నాటి సాయంకాలం కబుర్లు)

(అనిల్ బరన్ స్మృతి కిరణాలు)

శిష్యుడు: ఆగస్టు 15 వ తేదీ మీ జన్మదినంగా పాటించడం వెనుకగల విశిష్టత ఏమిటి?

శ్రీఅర: అది కేవలం ఒక సాంప్రదాయం – కొన్ని సంఘటనలను జ్ఞాపకం చేసుకునే పద్ధతి అంతే. ఎప్పుడైతే మనం ఏకాగ్రతతో ధ్యానం చెయ్యడం మొదలుపెడతామో అప్పుడు ఓ ఉన్నతమైన ఆధ్యాత్మిక వికాసాన్ని పొందే వాతావరణం ఏర్పడుతుంది. నిజానికి, ఆగస్టు 15 కానీ, దానికి చేరువగా మరొక తేదీ కానీ నేను ధ్యానం చేసినప్పుడు 'కొత్త వెలుగు' నాలోకి అవరోహించిన అనుభవం కలిగింది.

శిష్యుడు: ఆగస్టు 15 న కొంత జ్ఞానవికాసం కలుగుతుందని మేము భావిస్తున్నాము.

శ్రీఅర: ఇక్కడ ఉన్నవారు సృష్టించే పరిస్థితులపై అది ఆధారపడి వుంటుంది. వారిలో విస్తృతమైన ప్రశాంతి, అనుకూల వైఖరి వుంటే, తప్పకుండా ఉన్నతభూమికలలోని కాంతికిరణాలు దిగివస్తాయి. కాని అది ఏదో ఒక నిర్దిష్టమైన రోజుపై ఆధారపడి వుండదు. సరియైన పరిస్థితులు గనుక వుంటే ఏ రోజునైనా అది సంభవం కావచ్చును. (That depends on the conditions to be

created by those who are here. If they can have a widespread calm and a receptive attitude, then higher things may descend. But it does not depend on any particular day, it may occur any day when the proper conditions are created.

గత రెండు ఏళ్లలో ఆగస్టు 15 న ప్రాణిక చీకటిశక్తుల దుష్టలీలా ఖేలనాన్ని నేను గమనించాను. అప్పుడు అసలు ఆధ్యాత్మిక వికాసం కనపడలేదు. ఆ రోజు అల్లకల్లోలంగా వుంది. మొదటి కారణం – మామూలు పుట్టినరోజు తతంగాలు, విందుల హడావుడి. రెండవ కారణం – అన్ని రకాల మనుష్యులు వస్తారు. అక్కడి ప్రశాంత వాతావరణాన్ని వారు తట్టుకోలేక యథేచ్ఛగా ప్రవర్తించి, ఇతరుల శాంతిని కల్లోలితం చేస్తారు. ఆ రోజు మాత్రం ప్రశాంతంగా గడపాలి. మేధస్సు అడిగే ప్రశ్నలకు సమాధానం చెప్పడానికి బదులు అతిమానస నిశ్శబ్దంతో మాట్లాడతాను మీతో.

శిష్యుడు: పూలదండలు వేయడానికి మీకు అభ్యంతరం లేదనుకుంటాను?

శ్రీఅర: తప్పకుండా ఉంది.

శిష్యుడు: ఆగస్టు 15 న మమ్మల్ని కర్తవ్యోన్ముఖుల్ని చేసే ఒక కార్యప్రణాళికను ఇవ్వండి.

శ్రీఅర: నేను ప్రణాళికలను వేయను.

అనువాదం: కె. యజ్ఞన్న

Open to Sri Aurobindo's consciousness and let it transform your life.

The Mother

(*CWM* Vol. 13, p. 14)

సమాచార పత్రం

15 ఆగస్టు 2005 నాడు శ్రీఅరవిందుల 133 వ జన్మదిన మహో త్సవము జరుపబడును. 12-14 ఆగస్టు తేదీలలో శ్రీఅరవింద సొసైటీ వార్షిక సమావేశములు. 2) 17-26 ఆగస్టు తేదీలలో డా॥ ఎమ్. వి. నడ్కర్ణిగారు 'శ్రీఅరవిందుల గీతావ్యాసములు' పై ఒక స్వాధ్యాయ శిబిరమును ఉదయం 9-10, 10 to 11-45 గం॥ వేళలలో నడిపెదరు. దీనికందరు ఆహ్వానితులే.

అన్నామలై యూనివర్సిటీవారు దూరవిద్యాకార్యక్రమము లలో శ్రీమాతారవిందుల పూర్ణయోగమును ఒక పఠనాంశముగా చేర్చియున్నారు. 130 మంది విద్యార్థులు మార్చి, ఏప్రిల్ 2005 మాసాలలో సొసైటీ ఆఫీసుకు వచ్చినప్పుడు వారికి కొన్ని బోధనా తరగతులు నిర్వహించబడినవి. ముంబైలో టైమ్సు ఆఫ్ ఇండియా భవనములో డా॥ ఎమ్.వి. నడ్కర్ణిగారు 3-5 మే తేదీలలో 'Can India ever be Great again', 'Transhumanism – Spiritual vs Technological' and 'The Future of Humanity' అనే విషయములపై మూడు ఉపన్యాసములు ఇచ్చిరి. 'Art in Savitri' పై 6-9 మే తేదీ లలో మధులిక (Worli) లో నాలుగు ఉపన్యాసములు ఇచ్చిరి. J.B. Petit School and The Divine Grace Youth Academy లోని విద్యార్థులతో డా॥ నడ్కర్ణిగారు కొంతసేపు యిష్టాగోష్టి సలిపిరి.

కేంద్రముల, శాఖల వార్తలు

పూనె (మహారాష్ట్ర) లో 11 మే, 2005 నాడు డా॥ ఎమ్.వి. నడ్కర్ణిగారు రెండు ఉపన్యాసము లిచ్చిరి. ఖమ్మంలో 24-25 ఏప్రిల్ తేదీలలో వారి 25 వ వార్షికోత్సవమును జరుపుకొనిరి. పుష్పముల ప్రదర్శన, శ్రీ కొంగర భాస్కరరావు, శ్రీ కోటా వెంక టేశ్వరరావు, గోవర్ధనరావు, శ్రీమతి పి. లీలావతి, ఐ. త్రివేణి గార్ల ఉపన్యాసములు అందలి ముఖ్యాంశములు. అన్నై నగర్ (చెన్నై) కేంద్రమువారు 28 ఏప్రిల్ – 9 మే 2005 తేదీలలో ఒక పుస్తక ప్రదర్శనలో పాల్గొనిరి.

15 ఆగస్టు విశిష్టత - II



Flower: Beginning of the Supramental Realisation

అఖిల

అఖిల భారత పత్రిక

సెప్టెంబరు 2005

ఆగస్టు 15, స్వతంత్ర భారతం పుట్టినరోజు

ఆగస్టు 15 నా పుట్టినరోజు కూడా... దానికింత ప్రాముఖ్యం
రావటం నాకెంతో తృప్తికరమైన విషయం. స్థూల దృష్టికి ఇది
అదృష్టవాశాత్తూ లేదా కాకతాళీయంగా జరిగిన విషయమే అని
పించినప్పటికి అందులో అంతకు మించిన సూక్ష్మ మొకటున్నది.
అది నా జీవితాన్ని మొదట్నుంచి నడిపించుచున్న దైవీశక్తియొక్క
అభయహస్తమూ, భగవంతుడు నా కార్యము మీద వేసిన ఆమోద
ముద్ర అని నా మార్మిక దృష్టికి గోచరమవుతున్నది. వాస్తవము
నకు, ఇంచుమించు నేనాశించిన ప్రపంచ ఉద్యమములన్నియు
నా జీవితకాలములో సిద్ధించుటను చూడవలయునని ఆశించిన ఆ
రోజులలో, ఇవి అసాధ్యమైన కలలుగా కనుపించిననూ, ఈ దిన
మున అవి, ఫలసిద్ధికి సమీపమందున్నట్లు, లేదా ఫలించుట
ప్రారంభమైనట్లు, నెరవేరు మార్గమునందున్నట్లు గుర్తించగలుగు
తున్నాను.

మూలం: శ్రీఅరవిందులు
తెలుగు: ఆగస్టు 2004 '*అఖిల*' నుండి

(*SABCL* Vol. 26, p. 404)

A Power Worked
But None Knew Whence It Came[1]

శ్రీఅరవిందులు పాండిచ్చేరి వెళ్లాక రాజకీయాలను వదిలేసి పూర్తిగా ఆధ్యాత్మికసాధనలో నిమగ్నమైపోయారు. అయితే ఆయన ఈ దేశాన్ని, ప్రపంచాన్ని పూర్తిగా మరచిపోయారని చాలామంది అనుకున్నారు. కాని అది నిజం కాదు. ప్రపంచంలో జరిగే మార్పులను చాల శ్రద్ధగా గమనిస్తూ అవసరమైనప్పుడు ఆధ్యాత్మికశక్తిని ఉపయోగించేవారు. మనిషి అనగా కేవలం మనస్సు, ఇంద్రియాలే కాదు – వీటికంటె వెయ్యిరెట్లు గొప్పదైన ఆధ్యాత్మికశక్తి ఒకటి వున్నది. ఆధ్యాత్మికవిద్యను నేర్చుకున్నవారు ఆ శక్తిని ప్రయోగించగలుగుతారు.

– సంపాదకుడు

(ఈ వ్యాసం, ఒక శిష్యుడు తయారుచేసిన శ్రీఅరవిందుల జీవిత చరిత్ర లోనిది. దీనిని శ్రీఅరవిందులే దాదాపుగా తిరిగి రాసినప్పటికి ఉత్తమ పురుషంలోనే వున్నది.)

చంద్రనాగూర్‌లో శ్రీఅరవిందులు పూర్తిగా ఏకాంతసాధన లోకి దూకారనే అనాలి. అప్పుడు పాండిచ్చేరికి వెళ్లవలసిందిగా వారికొక పిలుపు వచ్చింది. కలకత్తా నుంచి వారు 'డూప్లే' అనే నౌకలో ప్రయాణమై, 1910 ఏప్రిల్ 4 వ తేదిన పాండిచ్చేరి చేరారు. ఆ రోజు నుంచి పాండిచ్చేరిలో, శ్రీఅరవిందులు యోగ సాధనలో మరింత ఎక్కువగా, పూర్తిగా నిమగ్నమైపోయారు. తన ముందుంచుకున్న ఆధ్యాత్మిక కార్యం యొక్క పూర్తి స్వరూపం వారికి మరింత స్పష్టంగా గోచరమైంది. తనయొక్క సర్వశక్తులూ దాని మీదే కేంద్రీకృతం చేయవలసిన అవసరమూ వారికి కనపడింది. దాని కనుగుణంగా ఆశ్రమం ఏర్పడింది. అయితే వారు దానిని రాజకీయాలకు, తత్సంబంధమైన కార్యకలాపాలకు దూరంగా ఉంచారు. 1910 లో సర్వవ్యవహారాల నుంచీ వారి

---

[1] A line from Sri Aurobindo's *Savitri* p. 44

యొక్క విరమణ జరిగి ఏకాంతంలోకి ఎలా ప్రవేశించారో, అలాగే రాజకీయ కార్యకలాపాల నుంచీ వారి విరమణ జరిగింది.

అయితే చాలామంది ఆ విరమణ అర్థం, వారేదో అత్యున్నత ఆధ్యాత్మిక అనుభవాన్ని పొంది, ప్రపంచంపట్ల ఎలాంటి ఇష్టాన్ని కలిగి లేరని లేదా భారతదేశపు భవిత పట్లా ఎలాంటి ఆసక్తి లేదనీ కాదు. అసలు వారి యోగము దైవాన్ని పొంది సంపూర్ణ ఆధ్యాత్మిక చైతన్యస్థితిని పొందగలగటం మాత్రమే కాదు. దానితో పాటుగా, ప్రపంచ కార్యకలాపాలన్నిటినీ, ఆధ్యాత్మికచైతన్య పరిధి లోనికి తీసుకొచ్చి, జీవితాన్నే ఆధ్యాత్మికత (Spirit) ఆధారంగా మలిచి, దానికొక ఆధ్యాత్మిక అర్థాన్నివ్వటమే.

తన 'రిటైర్‌మెంట్' లో కూడా శ్రీఅరవిందులు, ప్రపంచ సంఘటన లన్నింటినీ, భారతదేశ సంఘటనలనూ, గమనిస్తూనే ఉండేవారు. అవసరమైనచోట వారు క్రియాత్మకంగా జోక్యం చేసు కునేవారు. అయితే ఆ జోక్యం ఆధ్యాత్మికశక్తి ద్వారా, చడీచప్పుడు లేని ఆధ్యాత్మికచర్యల ద్వారా మాత్రమే. భౌతిక ప్రపంచంలో, మనస్సు, జీవం, శరీరాల సాధారణ శక్తులు, వాటి కార్యకలాపాలే కాకుండా, వెనుక నుంచి, పైనుంచి పనిచేయుగల శక్తులుంటూ యనీ, అవి అలాగే పనిచేస్తాయని తెలుసుకోవటం, యోగసాధ నలో పురోగతి సాధించిన వారి అనుభవాలలో ఒక భాగం. ఆధ్యా త్మిక చైతన్యస్థితిని పొందటంలో పురోగతి సాధించినవారిలో ఒక ఆధ్యాత్మిక గతిశీలమైన (dynamic) శక్తి వుంటుంది. పురోగతి సాధించినవారంతా, దానిని పొందుదామని అనుకున్నా, అనుకో కపోయినా, వున్నవారు దానిని వాడినా వాడకపోయినా, ఆ శక్తి మిగతావాటికన్నా ఎక్కువైనది, ఎక్కువగా ప్రభావితం చేసేది.

ఈ శక్తినే, తాను దానిని పొందగలిగిన వెంటనే, శ్రీఅర విందులు వాడారు. మొదట్లో, పరిమితమైన తన వ్యక్తిగత కార్యా ల్లోనూ, తరువాత వ్యవహారాల్లోనూ నిరంతరంగా వాడుతూ వచ్చారు. వాటి ఫలితాలపట్ల అసంతృప్తి చెందటానికిగాని, లేక మరోవిధమైన చర్యయొక్క అవసరానికిగాని, వారికే కారణం కన పడలేదు.

మొదటిది, రెండవ ప్రపంచయుద్ధ సంబంధమైనది. ప్రారంభంలో దానిని వారు చురుకుగా పట్టించుకోలేదు కాని ఎప్పుడైతే హిట్లరు తన వ్యతిరేకశక్తుల నన్నింటినీ కాలరాస్తాడని వారికి అనిపించిందో, ఎప్పుడైతే నాజీజం ప్రపంచాన్నంతా ఏలవచ్చుని అనిపించిందో, అప్పుడు వారు జోక్యం చేసుకోవటం ప్రారంభించారు.

వారు బహిరంగంగా మిత్రపక్షాలవైపు ఉన్నట్లు ప్రకటించారు, విరాళాల కోసం అభ్యర్ధన వచ్చినప్పుడు వారూ కొంత విరాళమిచ్చి, వారి సలహా కోరినవారికి సైనికదళంలో ప్రవేశించమనీ, లేదా యుద్ధప్రయత్నాలకు సహకరించమనీ ప్రోత్సహించారు. 'డన్‌కర్కు' యుద్ధం నుంచీ తన ఆధ్యాత్మికశక్తిని మిత్రపక్షాల వైపే ప్రయోగించారు.

అప్పుడంతా 'డన్‌కర్క్' యుద్ధంలో హిట్లరు తప్పక గెలుస్తాడనీ, ఇంగ్లాడు పతనం తప్పదనీ భావించారు. కాని జర్మనుల విజయపరంపర వెల్లువకు అడ్డుకట్ట పడి, యుద్ధధోరణి వారికి వ్యతిరేకంగా తిరగడాన్ని చూచిన తృప్తి శ్రీఅరవిందులది. వారిలా చేయటానికి కారణం హిట్లరు, నాజీజం వెనుక వారు నల్లని అసుర శక్తులను చూడటం, ఆ శక్తుల విజయమంటే మానవసమాజం దుష్టశక్తుల నిరంకుశ బానిసత్వానికి లోనుగావటమే అని వారికి తెలియటం. ఆ విజయం పరిణామ క్రమానికి, ముఖ్యంగా మానవుని ఆధ్యాత్మిక పరిణామానికి దెబ్బ అనీ, అది క్రమేణా ఐరోపా బానిసత్వానికే కాకుండా, ఆసియాకు, భారతదేశానికి విస్తరిస్తుంది. ఇంతవరకూ ఈ దేశం అనుభవించిన వాటికన్నా, ఈ బానిసత్వం ఇంకా భయంకరంగా ఉంటుంది. అంతేకాక ఈ దేశపు విముక్తికి చేసిన పని అంతా వ్యర్థమవుతుంది. ఈ కారణమే, వారిని బహిరంగంగా క్రిప్సు ప్రతిపాదనలను బలపరచి, కాంగ్రెసు నాయకులకు దాని నంగీకరించమని నొక్కి చెప్పించింది.

జపాన్ దురాక్రమణ విషయంలో, దాని ఉద్దేశం భారతదేశంపై దాడిచేసి, ముట్టడించి, జయించటం అని స్పష్టమయ్యేదాకా, వారు తమ ఆధ్యాత్మికశక్తితో జోక్యం చేసుకోలేదు. యుద్ధ

ప్రయత్నాలను బలపరుస్తూ, హిట్లరిజం యొక్క తప్పనిసరి ఫలితం అసురిక ప్రవృత్తే సుమా అని తాము వ్రాసిన కొన్ని ఉత్తరాలను అప్పుడే వారు బయటికి రానిచ్చారు. క్రిప్స్ ప్రతిపాదనలను ఎందుకు బలపరిచారంటే, దానివలన భారతదేశం, ఇంగ్లాండులు సంయుక్తంగా ఆసురికశక్తులను వ్యతిరేకిస్తాయనీ, క్రిప్స్ పరిష్కారం భారతస్వాతంత్ర్య సంపాదనా క్రమంలో ముందడుగేనని.

క్రిప్స్ సంభాషణలు విఫలమైనపుడు, వారు తిరిగి కేవలం, తన ఆధ్యాత్మికశక్తి మీదనే ఆధారపడి, అంతవరకూ తననెదిరించిన అన్నింటినీ తుడిచిపెట్టిన జపాన్ విజయం, తక్షణమే, అతి త్వరగా, అంతిమంలో తిరుగులేని, పెద్ద పరాజయాన్ని చూచిన తృప్తిని పొందారు.

కొద్దికాలం తరువాత, వారు భారత భవితవ్యాన్ని గురించి తాము అంతకు ముందు చూచిన దృశ్యం ఫలించి, దాని అంతర్గత కష్టాలెలాంటివైనా, భారతదేశం స్వతంత్రంగా ఉండటాన్ని చూసిన తృప్తినీ పొందారు.

మూలం: శ్రీఅరవిందులు
అనువాదం: కాకుమాను తారానాథ్

(*SABCL* Vol. 26, pp. 37-39)

రెండవ ప్రపంచ యుద్ధము, హిట్లరు, ఆగస్టు 15

హిట్లరు తన రాక్షసత్వంతో ప్రపంచాన్నంతా గడగడ లాడించాడు. బ్రిటను, అమెరికాలాంటి గొప్ప దేశాలు కూడ ఆయన ముందర వణికిపోయాయి. ఎందుకని? హిట్లరు ఒక రాక్షసుడు, ఒక అసురుని చేతిలో కీలుబొమ్మ. ఆ అసురునికి శ్రీఅరవిందులను గురించి తెలుసు – ఆశ్రమానికి వచ్చి ఇక్కడ ఏమి జరుగుతుందో చూసిపోతూ వుండేవాడు. కాని చివరికి వాని ఓటమి తప్పలేదు.

– సంపాదకుడు

ప్రశ్న: ఆగస్టు 15 కు ముందే యుద్ధం సమాప్తమవుతుందనీ, శాంతి ఒడంబడిక జరుగుతుందనీ హిట్లరు చేసిన ప్రకటన విచిత్రంగా ఉంది కదూ!

శ్రీఅరవిందులు: మన కార్యానికి అతను శత్రువు అనేదానికి ఇదొక నిదర్శనం. సంఘర్షణలో ఇమిడి ఉన్న విలువ దృష్ట్యా చూస్తే, అతని వెనుక ఉన్నది అసురశక్తి, దానవశక్తి అనేది స్పష్టంగా తెలుస్తోంది.

ప్రశ్న: అతను తన నిర్ణయాలెలా తీసుకుంటాడో వింతగా ఉంది.

శ్రీఅరవిందులు: నిర్ణయాలు తీసుకొనేది అతను కాదు, అతని వెనుకనున్న మరో మానవాతీత శక్తి. ఈ రాక్షసి అపుడపుడు వచ్చి ఇక్కడ ఎటువంటి కార్యం జరుగుతున్నదో చూసి పోతూనే ఉంటుంది.

ప్రశ్న: ఇక్కడ జరిగే కార్యం తన ప్రయోజనాలకు వ్యతిరేకమైనదని దానికి తెలుసా?

శ్రీఅరవిందులు: (నవ్వుతూ) తెలుసు. అది మహాబలమైన రాక్షసి. పాల్‌రిచర్డ్‌కు దీనితో సంబంధం ఉంది. 'Lord of Nations' అనే పుస్తకంలో అతను వ్రాసిన పథకాలు, పద్ధతుల ప్రకారమే ఇప్పుడు అంతా జరుగుతున్నది. అందులో అతను ప్రస్తుత నాగరికతను నాశనం చేయాలని వ్రాశాడు. కాని అతను లక్షించింది మాత్రం నాగరికత యొక్క మానవతా విలువల వినాశనం. హిట్లరు జర్మనీలో అలా చేయనే చేసాడు.... అంతేగాక అతనెక్కడికి వెళ్తే అక్కడ కూడా ఆ విలువల్ని నాశనం చేసాడు. మానవులు తమంత తాము అసురలతో తాళలేరు. హిట్లరు విషయంలో అది ఒట్టి ప్రభావం మాత్రమే గాదు, పూనకమో లేక మానవశరీరం దాల్చిన రాక్షసైనా కావచ్చు! స్టాలిన్ విషయంలో గూడా అంతే. ప్రాణికం భౌతికంలోకి దిగివచ్చింది. అందుచేతే మేధావులంతా తమ నాగరికత నాశనమవుతోందని కలవరపడ్తున్నారు. వాళ్లు ఆశించిన నాగరికతకు ప్రతీకలుగా నిలిచిన విలువలన్నీ నాశనం అవుతుండడం చూసి ఆందోళనపడ్తున్నారు. భౌతికం తప్ప మరో లోకం వాళ్లకు తెలియదు. కనుక వారు ఆందోళన చెందక తప్పదు!

మరో సందర్భంలో శ్రీఅరవిందులు ఇలా అన్నారు. "హిట్లరుకు కావల్సింది ప్రపంచాధిపత్యం. అతని తదుపరి ఎత్తు భారత దేశం వైపు తరలడమే అనేది తేలిగ్గానే చూడొచ్చు".

29-5-1940 న దివ్యమాత మనకో సందేశం ఇచ్చారు. దైవానికి వ్యతిరేకంగా అసురుడు శాశ్వత విజయం పొందలేడు అనేదే ఆ సందేశం. హిట్లరు తప్పక ఓటమి చెందాలి. శ్రీఅరవిందులిలా వ్యాఖ్యానించారు. "అది మిత్రపక్షాల వల్ల అని అర్థం కాదు. ఇంగ్లండు పతనమైతే, రష్యా, జర్మనీ, జపాన్, ఇటలీలు తప్ప మరే దేశమూ స్వతంత్రంగా వుండదు. నేను మాట్లాడేది పాత ప్రపంచాన్ని గురించి. తరువాత యుద్ధం రష్యా, జర్మనీల మధ్య అనుకుంటాను. ఇంగ్లండు పరిస్థితి విషమించిందని రష్యా తెలుసుకున్నపుడు, బాల్టిక్ దేశాల విషయంలో చేసినట్లుగా, నల్లసముద్రం మీద అదుపు సంపాదించడం కోసం స్టాలిన్ టర్కీ, రుమేనియాల మీద ఒత్తిడి తెస్తాడు. బాల్కన్ దేశాలలోని గడ్డు పరిస్థితిని చూసి హిట్లరు మౌనంగా ఉండకపోవచ్చు. ఆసియా మైనరుకు బాల్కన్‌కు మధ్యగల సమస్యను హిట్లరు ఇటలీ సాయంతో చక్కదిద్దవచ్చు, లేదా తరువాత అతనితో వ్యవహారం పరిష్కరించుకోవచ్చుననే ఉద్దేశ్యంతో ప్రస్తుతం స్టాలిన్‌ను స్వేచ్ఛగా వదిలి వేయవచ్చు".

అసలు అటువంటి దానికి ఏమాత్రం అవకాశం కన్పించని తరుణంలో శ్రీఅరవిందులు రష్యా, జర్మనీల మధ్య యుద్ధాన్ని ముందుగానే పసిగట్టారనేది మనమిక్కడ గమనించగలం.

ఆగస్టు 15, 1940

ఈ రోజు శ్రీఅరవిందుల జన్మదినం. ఒక్క పూటలో ఇంగ్లండులో 144 జర్మనీ విమానాలను కూల్చివేసారని మధ్యాహ్నం ఆకాశవాణి వార్త. ఇంతవరకూ ఇదే పెద్ద సంఖ్య. దర్శన మహోత్యమని మేమంతా వ్యాఖ్యానించాము. శ్రీఅరవిందులు నవ్వి "ఇంగ్లాండులోకి హిట్లరు విజయోత్సాహంతో ప్రవేశించవలసిన రోజు". అని అన్నారు.

ఒక నెల తర్వాత అదే తారీఖున అంటే 15-9-1940 న చిరునవ్వుతో శ్రీఅరవిందులు "ఇంగ్లండు 175 జర్మనీ విమానా లను ధ్వంసం చేసింది. ఇది చాలా పెద్ద సంఖ్యే. ఆక్రమణ ఇపుడు కష్టమవుతుంది. ఫ్రాన్సు పతనానంతరం హిట్లరుకు ఆ అవకాశం పోయింది. అతను నిజంగానే ఆ అవకాశం కోల్పోయాడు. ఫ్రాన్సు పతనానంతరం అతను ఇంగ్లాండు మీద దండెత్తి ఉంటే ఈ పాటికి అతను ఆసియాలో ఉండేవాడు. ఇపుడతనికి వ్యతిరేకంగా మరో శక్తి అవతరించింది. అయినా ఇంకా ప్రమాదం తప్పిపోలేదు" అన్నారు.

ఈ యుద్ధానికి ఆ తేదీకి సంబంధించి 'మదర్ ఇండియా' పత్రిక సంపాదకుడు ఇలా వ్రాసాడు. "బకింగ్‌హామ్ రాజప్రాసాదం నుంచి బ్రిటను పతనాన్ని ఆకాశవాణిలో ప్రకటించి తన పశ్చిమ యూరపు విజయాన్ని పూర్తి చేయాలని 1940 ఆగస్టు 15 వ తారీ ఖును హిట్లరు ఎంచుకున్నాడు. కాని ఆ రోజునే ఇంతకు ముందె న్నడూ లేనంత పెద్ద మొత్తంలో జర్మన్ యుద్ధవిమానాలు ధ్వంసం చేయబడ్డాయి. బ్రిటను యుద్ధం మలుపు తిరిగిన రోజుగా మనం దాన్ని చెప్పుకోవచ్చు.".

మూలం: నిరోద్‌బరన్

అనువాదం: కోనేరు వెంకటేశ్వరరావు

('శ్రీఅరవిందో గదిలో పన్నెండు సంవత్సరాలు' నుండి)

(Nirodbaran: *Twelve Years with Sri Aurobindo*, pp. 136-38)

కష్టాలలో కూరుకోపోయిన ఈ దేశాన్ని రక్షించేందుకు ఒక్కటే మార్గము. శ్రీఅరవిందులు ఈ విషయాన్ని తన యోగనేత్రంతో చూసి దానికి పరిష్కారం కూడా తెలిపారు.... మనం దాన్ని చదివి అర్థం చేసుకొని ఆచ రణలో పెట్టినట్లయితే ఈ దేశం బలాన్ని పుంజుకుం టుంది. చాలా శక్తివంతం కాగలదు.

శ్రీమాత

15 ఆగస్టు 1945

యుద్ధము అయిపోయింది. విజయం చేకూరింది. ఓ పరమేశ్వరా, ఆ విజయం నీదే – అందుకు మా వందన సహస్రము లర్పించుచుంటిమి.

ఇప్పుడు మాలో నుంచి ఒక ఆర్ద్రమైన ప్రార్థన పొంగివస్తున్నది. నీ శక్తి ద్వారానే ఈ విజయము సాధ్యమైనది. యుద్ధాన్ని గెలిచిన విజేతలు ఈ సంతోషంలో అదివరకు రణరంగంలో కష్టాలు వచ్చినప్పుడు చేసిన బాసలు మరచిపోకుండా వుండెదరు గాక. నీ పేరిట వారు యుద్ధం చేసిరి. ఇప్పుడు యుద్ధవిరమణ అనంతరం శాంతి సమకూర్చటంలో కూడ నీ కృపాకటాక్షములను మరువకుండెదరు గాక.

మూలం: శ్రీమాత

అనువాదం: డా॥ ఆర్.ఎల్.ఎన్. శాస్త్రి

(*CWM* Vol.15, p. 48)

రెండు శకలాలుగా నా పుట్టిన రోజు కానుక

7-7-1947

నేను అతిమానస లోకం నుండి (Supermind level) అతిమానసోపకరణముల ద్వారా పనిచేసినట్లైతే ప్రపంచం ఈ పాటికి పరివర్తన చెంది వుండేది. లేదా యిప్పుడున్న దానికన్న వేగవంతంగా విభిన్నరీతిలోను అద్వితీయంగా మార్పు చెందుతూ వుండేది. ఇప్పటి నా ప్రయత్నం సుదూరంలో నున్న ఉన్నత అతిమానస స్థాయిపై నిలుచొని అక్కడి నుండి ఈ ప్రపంచాన్ని మార్పు చెందించడం కాదు. ఆ అతిమానసం నుండి కొంత శక్తిని యీ పృథ్వి మీదకు కొనితెచ్చి, దాని ద్వారా పనిచేయడం నా ప్రస్తుత ఉద్యమం. కాని వర్తమాన పరిణామదశలో అధిమానసం (Overmind) యొక్క సత్వర అతిమానసీకరణం (Supramentalisation) మొదటి కార్యంగా వుంటున్నది. రెండవది జడము (Inconscient)

యొక్క తీవ్ర ప్రతిఘటనను లేదా ఆటంకాన్ని, మరియు మానవుల అజ్ఞానానికి అది యిచ్చే ఆశ్రయాన్ని తగ్గించడం. ఎందుకంటే మనిషి మారాలన్నా, ప్రపంచాన్ని మార్చాలన్నా ఆ ప్రయత్నానికి నిరంతరం ఆటంకంగా వుంటుండేది యిదే.

మానవ వ్యవహారాలపై అంటే యుద్ధం మొదలైన వాటిపై నేను నిరంతరం వినియోగిస్తున్న ఆధ్యాత్మిక శక్తి, అతిమానస శక్తి కాదు. అది అధిమానసశక్తి మాత్రమే. ఈ శక్తి భౌతికప్రపంచంలో పనిచేసినపుడు అది నిమ్నశక్తులతో అనివార్యంగా కలిసిపోతుంది. అందువలన దాని ఫలితాలు దాని ఉద్దేశానికి తగినట్లు యెంత బలంగా, యెంత అనుగుణంగా వుంటున్నా అవి పాక్షికాలే. అందుకే రేపు ఆగస్టు 15 వ తేదీన నా జన్మదిన కానుకగా భారతదేశపు సాతంత్ర్యం రెండు శకలాలుగా ప్రసాదింపబడుతున్నది! అఖండంగానే వుంటే నేనింకా బాగా సంతోషించేవాణ్ణి కదా.

మూలం: శ్రీఅరవిందులు

అనువాదం: బి. నరసింహయ్య

(*SABCL* Vol. 26, pp. 170-71)

15 ఆగస్టు 1947
శ్రీఅరవిందులు తన 75 వ పుట్టిన రోజున యిచ్చిన సందేశం

(శ్రీఅరవిందులను తన జన్మదినమునకు, భారతదేశ స్వతంత్రదినమునకు ముందురోజు సాయంత్రము ఒక సందేశము యివ్వమని ఆకాశవాణి తిరుచునాపల్లి వారు కోరగా వారీ సందేశమునిచ్చిరి:

నిరోద్‌బరన్‌కు శ్రీఅరవిందులు చెప్పగా వారు దానిని వ్రాసారు. రేడియోలో ప్రసారమైనప్పుడు శ్రీమాత చదివిన ఈ సందేశమును శ్రీఅరవిందులు కూడా విన్నారు. దాని రికార్డింగు ఎక్కడా లేకపోవడం మన దురదృష్టం.

మృత్యుంజయగారు 9 ఆగస్టు 1947 నాడు తన డైరీలో రాసుకున్న విషయాలు:

"ఆ సందేశాన్ని శ్రీమాత చదవగా తిరుచునాపల్లి నుంచి వచ్చిన సాంకేతిక నిపుణుల వర్గం సాయంత్రం 6 గం॥ లకు దానిని రికార్డు చేసుకున్నారు. వారికి తగిన ఏర్పాట్లు చేసి, ఆ మరుపురాని సన్నివేశంలో పాల్గొనటం నా అదృష్టం.

"శ్రీఅరవిందుల సందేశమును తమరు చదివినప్పుడు నేను కూడా అక్కడ వుండి, మీ కంఠస్వరమును వినేందుకు నోచుకున్నాను. తరువాత భారతమాతకు మీరు సమర్పించిన అద్భుతమైన ప్రార్థన విని పులకరించిపోయాను. ఏమి నా అదృష్టము. ఇవియే నా కృతజ్ఞతలు")

.15 ఆగస్టు స్వతంత్ర భారతానికి పుట్టినరోజు. ఈనాటితో ఈ దేశానికి పాతఘట్టము అంతమయింది – మన ఒక్కరికే కాదు. ఆసియాకి, ప్రపంచానికంతటికీ కూడ ఒక కొత్త యుగము ఆరంభమయింది. ఎందుకంటే మానవజాతి పురోగమనానికి – రాజకీయ, సామాజిక, సాంస్కృతిక రంగాలలో – కీలకమైన పాత్ర వహించగలిగిన ఒక నూతనజాతి ఆవిర్భవించినది. కేవలము నా అనుచరులు మాత్రమే ప్రతి ఏడు జరుపుకుంటున్న నా పుట్టిన రోజు ఇంతటి విశేష ప్రాముఖ్యతను సంతరించుకొనుట నాకు ఎంతో తృప్తికరమైన విషయము.

స్థూలదృష్టికి ఇది అదృష్టవశాత్తూ లేక కాకతాళీయంగా జరిగిన విషయమే అనిపించినప్పటికి అందులో అంతకు మించిన సూక్ష్మ మొకటున్నది. అది నా జీవితాన్ని మొదట్నుంచి నడిపించుచున్న దైవీశక్తియొక్క అభయహస్తమూ, భగవంతుడు నా కార్యము మీద వేసిన ఆమోదముద్రా అని నా మార్మికదృష్టికి గోచరమవుతున్నది. వాస్తవమునకు, ఇంచుమించు నేనాశించిన ప్రపంచ ఉద్యమములన్నియు నా జీవితకాలములో సిద్ధించుటను చూడవలయునని ఆశించిన ఆ రోజులలో అవి అసాధ్యమైన కలలుగా కనుపించినను, ఈ దినమున అవి, ఫలసిద్ధికి సమీపించి

నట్లు, లేదా ఫలించుట ప్రారంభమైనట్లు, నెరవేరు మార్గము నందు న్నట్లు గుర్తించగలుగుతున్నాను.

ఈ శుభముహూర్తమునకు నన్ను ఒక సందేశ మిమ్మని మీరు కోరియుంటిరి. కాని, నేనట్టి సందేశమిచ్చే పరిస్థితిలో లేను. నా బాల్యము, యౌవనకాలమునందు నేనూహించిన లక్ష్యములు, నా ముందుంచుకొనిన ఆదర్శములు ఇప్పుడు ఫలప్రదమగుటను చూచుచున్నందున వాటిని గురించిన వ్యక్తిగత ప్రకటనను మాత్రమే చేయగలుగుదును. అవి భావి భారత కార్యభాగము లైనందున, భారతదేశ స్వాతంత్ర్యమునకు సంబంధించినవని, అందు తప్పనిసరిగా ప్రథమ స్థానము నాక్రమించుకొనగలవని నా నమ్మకము. భారతదేశము మేల్కొనుచున్నదని మొదటి నుండి గట్టిగా చెప్పుతూనే ఉన్నాను. అది, తన లౌకిక ప్రయోజనములను, విస్తృతిని, ఔన్నత్యమును, శక్తిసంపదలను మాత్రమే నెరవేర్చుకొనుటకు గాక – (వాటిని కూడ భారతదేశము విస్మరించరాదు) – నిశ్చయముగ ఇతరులవలె అన్యదేశములపై ఏలుబడిని సంపాదించుకొనుటకు గాక, భగవానుని కొరకు, ప్రపంచమునకు సహాకరించుట కొరకు, సమస్త మానవజాతికి మార్గదర్శిగా, సహాయకారిగా కూడ భారతదేశము జీవించి, వికసించవలెను.

ఆ లక్ష్యముల, ఆదర్శముల యొక్క సహజ క్రమమిది: భారతదేశపు స్వాతంత్ర్యము, ఐక్యతను గడించగల విప్లవ మొకటి; ఆసియాఖండము పునర్జీవించి స్వేచ్ఛగలిగి – గతమున మానవ నాగరికతాభివృద్ధికి తాను నిర్వహించిన అమోఘమైన పాత్రను తిరిగి నిర్వహింపగలగ వలయును. నూతనము, మహత్తరము, ప్రకాశమానము, ఔదార్యమునగు జీవనమునకు మానవ జాతి ఎదగవలయును. అది బాహ్యమున పూర్ణముగ సిద్ధించుటకు, భౌతికముగ ప్రత్యేక ఉనికిగల ప్రజలు – వారి జాతీయ జీవితమును నిలుపుకొనుచు, కాపాడుకొనుచు, అందరు కలిసి సాధించగల అంతర్జాతీయ సమైక్యతపై ఆధారపడి యుండును. మానవ జాతి కంతటికీ ఆధ్యాత్మిక జీవనమునకు వలయు శిక్షణా విధానములను, ఆధ్యాత్మిక జ్ఞానమును భారతదేశము కానుకగ నొసం

గవలయును. కడపటిది ఉన్నతతర భూమికకు చేతనను ఉద్ధరించుట ద్వారా, మానవుడుద్బుద్ధుడై వ్యష్టిగ, సమిష్టిగ పూర్ణత్వమును గురించిన కలలు గనుటకు ప్రారంభించినది మొదలు, వానిని కలవరపెట్టి, విసిగించిన జీవితసమస్య లనేకములు పరిష్కరింపబడు నూతన పరిణామ పథము.

భారతదేశము స్వతంత్రదేశమైనదేగాని, ఐక్యతను బడయలేదు. (అఖండ భారతదేశము కాలేదు) — చీలిపోయి, ఖండములైన స్వతంత్రమే అది. పూర్వమువలె, బ్రిటిషువారి విజయమునకు కారణమైన విభిన్న సంస్థానములుగ విడిపోయి, మరల అయోమయస్థితిలో పడిపోవునా యనునట్లు గోచరించెను గాని, అదృష్టవశాత్తూ ఆ ప్రమాదమిప్పుడు తప్పినట్లే అనిపిస్తోంది. రాజ్యాంగ పరిషత్తువారు (Constituent Assembly) తెలివితేటలతో అవలంబించిన కఠిన పద్ధతివలన ఛిద్రము, చీలికలు లేకుండా నిమ్నజాతుల సమస్య పరిష్కారమైనది. కాని హిందూ, ముస్లిముల మతబేధము నేడు దేశవిభజనగా స్థిరపడేటట్లు గోచరించుచున్నది. కాంగ్రెసు నాయకులు, దేశనేతలు ఈ నిర్ణయము శాశ్వతమైనదిగ, తాత్కాలిక పరిష్కారమునకు మించినదిగ అంగీకరించరని ఆశించుదము. ఈ విభజన శాశ్వతమైనదే అయిన యడల భారతదేశము తీవ్రముగ దుర్బలమైపోవచ్చును. వికలమైపోవచ్చును. అంతఃకలహములకు సదా అవకాశముండును. నూతన దురాక్రమణకు, విదేశీయుల ఆధిపత్యమునకుకూడ అవకాశము లేకపోలేదు.

దేశవిభజన అంతరించవలసినదే — ప్రస్తుత తీవ్రపరిస్థితి సమసిపోవుట వలన గాని, శాంతి, అన్యోన్యతల ఆవశ్యకతలను క్రమక్రమముగ గుర్తించుట వలన గాని, అందరకు సంబంధించిన నిరంతర కార్యాచరణలను చేపట్టుట వలన గాని, మరేదో ఒక మార్గమున ఐకమత్యము ఏర్పడుట వలన గాని — ఈ విభజన అంతరించి పోగలదని ఆశించుదము. ఐక్యత ఏ రూపము నందైననూ రావచ్చును — దాని సరియైన రూపము ఒక (మతపరమైన) మూలసిద్ధాంతముగ ప్రాధాన్యత గలదిగ గాక, వ్యావ

హారిక (సర్వమత సమ్మత) మైనదిగ ఉండవచ్చును. ఏ విధ ముగానైనా ఈ విభజన అంతరించి పోవలసినదే — తప్పక అంత రించి పోవును. అటుల కాని యడల భారతదేశ భవిష్యత్తు తీవ్ర ముగ క్షీణించును. విఫలము కూడ కావచ్చును. కాని అటుల కారాదు.

ఆసియా మేల్కొనినది. అందలి బహుభాగములు విముక్త ములైనవి లేదా ఈ క్షణమున విముక్తములు కానున్నవి. ఇంకనూ దాస్యమందున్న ఇతర భాగములు సాతంత్ర్యమునకై తీవ్రముగ పోరాడుచున్నవి. ఏ స్వల్పమో మిగిలియున్నచో అది నేడో రేపో పూర్తియగును. ఈ విషయమున భారతదేశము తన పాత్రను నిర్వహించవలసి యున్నది. ఆ కార్యము శక్తిసామర్థ్యములతో ప్రారంభమైనది. తద్వారా అది తనకుగల సామర్థ్యమును అంత ర్జాతీయ మండలియందు తన స్థానమును పొందగలుగును.

మానవజాతి ఐక్యమగుట మొదలిడినది. అది అసంపూర్ణ మైనా — నిర్మాణాత్మక ప్రారంభము మాత్రమే — అయిననూ, భయంకరమైన దుస్థితులతో పోరాడవలసి యున్నది. ఈ పోరా టము భయంకరమైనదే. చరిత్రానుభవమును మార్గదర్శకముగ అంగీకరించినట్లయితే, విజయము సాధించువరకు ఆ తీవ్రత తప్పని సరిగ ఉద్ధృతము కాగలదు. ఇందులో కూడ భారతదేశము ముఖ్య మైన పాత్రను నిర్వహించుట మొదలిడినది. విస్తృత రాజనీతిజ్ఞ తను వృద్ధిపరచుకొనినట్లయితే — తాత్కాలిక పరిస్థితులను, తక్షణ అవకాశములను గాక — భవిష్యత్తును దృష్టి యందుంచుకొని ముందడుగు వేసిన యెడల తన పాత్రను చక్కగా నిర్వహించ గలదు. అయితే ప్రళయాంతక మొకటి జోక్యము కలిగించుకొని ఆటంకములు కలిగించవచ్చును; లేదా చేసిన దానినంతనూ నాశ నము చేయనూవచ్చు. అయిననూ తుదకు విజయము తథ్యము. ఏమైనప్పటికినీ, అనివార్యమైన ఆమె కదలికను, ఆమె సాధించిన దానిని బట్టి, ఐక్యత ప్రకృతి ధర్మమునందు అవసరమైనదని ముందుగనే నిర్భయముగ చెప్పవచ్చును.

ఇతర దేశములకు కూడ దాని ఆవశ్యకత విదితమైనది. ఆ ఐకమత్యమే లేనియడల మున్ముందు చిన్న చిన్న దేశాల ప్రజల స్వతంత్ర మెన్నటికిని సురక్షితము కాజాలదు. పెద్దవి, శక్తివంతములైన దేశములు కూడ సురక్షితముగ మనజాలవనుట నిశ్చయము. అటులనే భారతదేశము ఖండములుగ యున్నచో ఆమె రక్షణయందు ఆమెకే నమ్మకముండదు. అందువలననే సర్వమానవ శ్రేయస్సు దృష్ట్యా, ఐకమత్యము ఏర్పడవలయును. మానవ దుర్బలత్వము, బుద్ధిహీనమైన స్వార్థతలు మాత్రమే దానిని ఆటంకపరచును. ప్రకృతి అవసరమునకు దైవసంకల్పమునకు వ్యతిరేకముగ అధిక కాలమివి నిలువజాలవు. జాతీయ ఆశయములు ఫలించును. అంతర్జాతీయ రూపములు, సంస్థలు అభివృద్ధి జెందవలయును. ఇరుదేశముల లేదా సంఘపౌరసత్వము వంటివి కూడ పెంపొందవచ్చును. ఈ విధముగ సంప్రదాయములు స్వతః చేరువ కావచ్చును. జాతీయ భావదృక్పథములు తమ క్షాత్రత్వమును విడనాడి పూర్ణమైన స్వీయదృష్టితో సమగ్రముగ సమన్వయించుకొన వచ్చును. మానవజాతి 'ఏకత్వము' నూతనశక్తితో ప్రకాశించును.

ప్రపంచమునకు భారతీయ ఆధ్యాత్మిక ప్రదానమప్పుడే ప్రారంభమైనది. భారతీయ ఆధ్యాత్మికత ఐరోపా, అమెరికాలలో నిరంతరం అధికాధిక పరిమాణమున వ్యాపించుచున్నది. ఈ ఉద్యమము కాలానుగుణమైన విపత్తులు సంభవించిననూ అందరు అధికమైన ఆశతో ఆశ్రయము లభించునని కూడ – ఆమె ప్రబోధములకు మాత్రమే కాక, ఆమె ఆత్మ కొరకు, ఆధ్యాత్మిక సాధన కొరకు దృష్టిని భారతదేశముపై నిలిపి యున్నారు.

ఇక మిగిలినదంతా నా వ్యక్తిగత నమ్మకము, భావము, నా అదర్శములే. భారతదేశములోను, పాశ్చాత్యదేశములలోను దూర దృష్టిగల మేధావులు వీటిని గురించి ఆలోచించుటకు మొదలిడిరి. ఇతర మార్గములకన్న ఈ మార్గమునందున్న కష్టములు భయంకరములైనవి. అయినా యీ కష్టములు అధిగమించబడుటకే వచ్చును. పరమేశ్వరుని సంకల్పమున్న యెడల వాటిని అధిగమిం

లకు ఏమీ తక్కువైనవారు కారు. అటులనే తూర్పుదేశీయులమైన మేము నివసించు ఈ ప్రపంచ జీవనమున – భౌతికమైన భావములు, భౌతిక వైభవములు, పదార్థమునందు సమదృష్టితోనే వ్యవహరించుచున్నాము. తూర్పుదేశీయులు, పశ్చిమదేశీయులు – ఎక్కువగా కలిసిపోయి, ఒకరికొకరు దగ్గరకాగల అవకాశములున్నవి. ఒకరిపై ఒకరు శక్తివంతముగ ప్రభావితులు కాగలరు. ప్రస్తుతము ప్రకృతియొక్క ఒత్తిడి అధికముగ నున్నది. విధి బలీయమైనది. ఇట్టిది ఇదివరకెన్నడునూ లేదు.

ఆధ్యాత్మికము, భౌతికము – ఈ రెండింటి యందు ఇరువు రకుగల నమ్మకము, లక్ష్యము ఒకటే. ఒకరి సహాయము ఒకరికి ఎంతయినా అవసరమున్నది. కాబట్టి ఇక ముందు మన దృష్టి విభజన, విభేదములవైపు మరల్చరాదు. ప్రథమమున ప్రకృతిసిద్ధము, అస్పష్టముగ (అంధకారము, నిగూఢము) యేర్పడినదానిని అధిగమించి, ఐక్యతకు సంఘీభావమునకు – అవసరమైతే ఏకత్వమునకు, ఐక్యతాదర్శములతో ఏకముగ సఫలురగుటకు ప్రయత్నించవలయును. ప్రథమమున అజ్ఞానముతో యేర్పడిన విభజనల స్థానమున, నిరంతరమైన పట్టుదలతో అదికాధిక వెలుగు, జ్ఞానములను నిలుపుకొనవలయును. అయితే ఆ ఆదర్శములెట్టివి? ఆ లక్ష్యములెట్టివి? అవి మన జీవిత పరమార్థము. దాని మహోన్నత సత్యసంధతలపై ఆధార పడి యుండును.

ఇచ్చట మనము గమనించవలసిన దేమన, పూర్తి భేదము లేకపోయిననూ వాళ్లు తూర్పుదేశీయులు వాళ్లు పశ్చిమదేశీయులు అనే భావము సర్వవ్యాప్తముగ నున్నది. అయితే, ఈ ప్రపంచమునకు అతీతముగను, ప్రపంచమునందునను, సృష్టి యందన్నిటా తానేయై, అన్నిటినీ భరించుచు, ఆ లక్ష్యమునకు, ఆ గమ్యమునకు మనలను నడిపించుచున్న ఆత్మసత్యమే పరమోన్నత దివ్యసత్యమని తెలుసుకొనవలయును. ప్రకృతి తన అజ్ఞానాంధకారములతో ప్రారంభమై, చైతన్యాభివృద్ధి జెందుట ఈ ఉనికి యందొక లక్షణము. అదే మానవజీవిత రహస్యము, ఈ ప్రపంచమునకు అర్థమూ అదే. తూర్పుదేశీయులు సదా ఆత్మయే పరమసత్యమని

గట్టిగా నొక్కి చెప్పుటయేగాక, కొంతమంది పరమచాంధసులు యీ ప్రపంచమును, ఒక భ్రమగా భావించి, ఆత్మయే ఏకైక సత్య మన్నారు.

అటులనే పశ్చిమదేశీయులు అధికాధికముగ బాహ్యప్రపంచము మీదనే లక్ష్యమును నిలుపుకొని, మనోమయ జీవితమందే వ్యవహరించుచు – బాహ్య ఉనికి, దానిపై ఆధిపత్యమును గడించి, మనస్సును, జీవితమును పూర్ణము గావించుచు, ఇచ్చటనే సమగ్ర మానవతకు కృషి చేశారు. చివరకు యీ భావము క్రమముగ ఆత్మను నిరాకరించి, జడపదార్ధము మాత్రమే యదార్ధమను స్థితికి జేరినది. ఒకవైపున ఆధ్యాత్మిక సత్యమే ఏకైక ఆదర్శమని, మరొక వైపు జాతిని పరిపూర్ణత జెందించుట, పరిపూర్ణసంఘము, మానన మనస్సు, జీవితము, భౌతిక ఉనికి – సమగ్రమున క్రమాభివృద్ధి జెందాలనెడి కలలే ఆదర్శములై నిలిచినవి. అయినప్పటికి ఈ రెండు ఆదర్శములూ సత్యములే. ప్రపంచ స్వభావమునందు ఈ రెంటినీ ఆత్మోద్దేశములుగ విశ్వసింపవచ్చును. ఇవి రెండూ పరస్పర విరుద్ధములైనవి కావు. కాబట్టి భవిష్యత్ దృక్పథమున మనము ఆ విభిన్నతలను తొలగించి, రెండింటినీ ఐక్యతపరచి, స్నేహబంధమును పెంపొందజేయవలయును.

ఈ వస్తువాద ప్రపంచంలో పరిణామక్రమమే మానవ జీవనరహస్యంగా పాశ్చాత్య విజ్ఞానశాస్త్రాలు గుర్తించాయి. అయితే అవి ఆత్మచైతన్య వికాసం కన్నా బాహ్యరూపాభివృద్ధినే నొక్కి చెప్పాయి. చైతన్యాన్ని పరిణామ పరమార్ధంగా కాక కేవలం ఒక ఘటనగా మాత్రమే పరిగణించాయి. ప్రాచ్యదేశాల్లో కొందరు తత్వవేత్తలు, కొన్ని తత్వశాస్త్రాలు, ఆధ్యాత్మిక గ్రంథాలు పరిణామ క్రమాన్ని గుర్తించాయి. అయితే అది ఆత్మ ఎన్నో రూపాలను ధరించడం, మానవుడు ఎన్నో జన్మల నెత్తుతూ ఉన్నతసత్యం వైపు పురోగమించడం అన్న అర్థంలో మాత్రమే. ఒక రూపాన్ని చైతన్యం సంతరించుకొనడం అన్నది చైతన్యం యొక్క తాత్కాలిక స్థితి కాజాలదు. అది ఆత్మ తన సాక్షాత్కారాన్ని పొందడమే.

ఆత్మ ఎన్నో శరీరాలను ధరించి, ఎన్నో జన్మల నెత్తడం కోసం ఈ భూమ్మీదికి వచ్చినప్పుడే ఈ సాక్షాత్కారం సాధ్యం.

అచేతన పదార్థం అవచేతనగా, తదుపరి చైతన్య జీవనంగా వృద్ధి చెందడమే పరిణామ క్రమం. ఇది మొదటి జంతుజీవనంలో మనస్సుగా, తర్వాత పూర్తి చైతన్యాన్ని పొంది యోచించే మానవునిగా ప్రకృతియొక్క అత్యున్నత పరిణామంగా గోచరిస్తుంది. మేధోప్రాణిగా అవతరణే అత్యున్నత సాధనంగా, అంతిమ స్థాయిగా ప్రస్తుతం భావిస్తున్నాం. కాని పరిణామక్రమంలో మరో మెట్టును ఊహించడం సాధ్యమే. అసంపూర్ణమైన మానవ మస్తిష్కాని కతీతంగా ఒక చైతన్యాన్నీ, మనస్సుయొక్క అజ్ఞానాన్ని దాటి సత్యాన్నే స్వంతహక్కుగా, ప్రకృతిగా ఆ చైతన్యం కలిగి ఉంటుంది. వేదాల్లో చెప్పినట్లుగా అది సత్యచైతన్యం (Truth-Consciousness) నేను చెప్పినట్లుగా అతిమానసం (Supermind). అది జ్ఞానాన్ని కలిగి ఉంటుంది. దాని కోసం అన్వేషిస్తూ, అది లభించలేదని చింతించడం ఉండదు. ఒక ఉపనిషత్తులో మానసికజీవి కంటె జ్ఞానజీవి ఉన్నతమైనదని, ఆత్మ దాన్ని అందుకొని తద్వారా ఆధ్యాత్మిక అస్తిత్వపు పరిపూర్ణ ఆనందాన్ని సాధించాలని ఉవాచ.

ప్రకృతియొక్క ఈ తదుపరి పరిణామదశను ఇక్కడ చేరుకుంటే, ఆత్మసాక్షాత్కారం కలిగి పరిపూర్ణ జీవనం ఇక్కడ కూడా సాధ్యమవుతుంది. ఈ శరీరంలోనే సంపూర్ణ ఆధ్యాత్మిక జీవనం సాధ్యము కావచ్చు. లేదా సంస్కరింపబడిన మరో శరీరం కావచ్చు. దాన్ని ఈ ప్రపంచంలోనే దివ్యజీవనం అనవచ్చు. సమగ్ర సంపూర్ణ వికాసం కొరకు మానవ స్వప్నం ఫలిస్తుంది. ఎన్నో మతాలు, ఎందరో ఆధ్యాత్మిక దార్శనికులు కోరుకున్న భూలోక స్వర్గం అన్న మాట.

ఆత్మ పరమాత్మ వైపు అధిరోహించడం దాని పరమ లక్ష్యం – అవసరం. అదే అంతిమసత్యం. అయితే ఈ భూమిపైకి పరమాత్మ, దాని శక్తుల అవరోహణ కూడా ఉండొచ్చు. అప్పుడు ఈ భౌతికప్రపంచ అస్తిత్వం సమర్థనీయమౌతుంది. సృష్టికి ఒక పరమార్థాన్ని, దివ్యలక్ష్యాన్ని ఇస్తుంది. సృష్టి రహస్యాన్ని ఛేది

స్తుంది. ఈ పరమోన్నతాదర్శ సాధనలో ప్రాక్పశ్చిమాలు సయోధ్యను పొందుతాయి. ఆత్మ భౌతికపదార్థాన్ని ఆవరిస్తుంది. భౌతిక పదార్థం తనలోని సత్యాన్ని, ఆత్మలోని పదార్థాలన్నిటా దాగి ఉన్న పరమసత్యాన్ని గుర్తిస్తుంది.

మూలం: శ్రీఅరవిందులు

తెలుగు: జూన్ 1994 'అర్క'; మాడభూషణం రాజగోపాలాచార్య

(*SABCL* Vol. pp. 413-16)

15 ఆగస్టు 1950 దర్శన సందేశము

మన సాధన ఒకానొక స్థాయికి చేరుకొన్నది; ఇప్పుడు అవచేతన (subconscient) లోను, అచేతన (inconscient) ప్రాంతంలోను ఉన్నది. అందుకని శారీరకంగా కష్టాలు చాలా ఎక్కువైనాయి. వాటికి మనం చలించిపోకుండా, పట్టుదలతో, ధైర్యంగా ఎదుర్కోవాలి.

ఏమి జరిగినా, నీవేమి చేసినా భయపడకూడదు. దానికే మాత్రం అవకాశ మివ్వకూడదు. భయం పొడచూపిన వెంటనే నీవు స్పందించాలి. నన్ను పిలవాలి.

నువ్వే శరీరమనే భావము (దేహాత్మనాభావము) నకు దూరము కావాలి. "ఏయ్, నువ్వు ఎందుకు భయపడతావు? నువ్వంత భయపడనవసరం లేదు" అని ఒక చిన్న పిల్లవానికి చెప్పినట్లుగా దానిని బుజ్జగించాలి.

భయము మనకు బద్ధశత్రువు. మనం దాని జాడ కూడా లేకుండా పూర్తిగా జయించాల్సిందే.

మూలం: శ్రీమాత

అనువాదం: డా॥ ఆర్.ఎల్.ఎన్. శాస్త్రి

(*CWM* Vol. 15, pp. 196-97)

ఒక ప్రకటన

15 ఆగస్టు 1954

భారతదేశపు పౌరసత్వం కావాలన్న నా చిరకాల కోరికను నేను ఈ రోజున ప్రకటించుకుంటున్నాను. 1914 లో మొట్టమొదటిసారి నేనీ దేశానికి వచ్చినప్పటి నుంచి ఇదే నా నిజమైన మాతృదేశమని, నా కాత్మీయమైన దేశమని నాకు తెలిసింది. భారతదేశానికి స్వతంత్రము వచ్చిన వెంటనే ఈ కోరికను తీర్చుకోవాలనుకున్నాను. కాని పాండిచ్చేరిలోని ఆశ్రమ బాధ్యతల వలన ఇంతవరకు అది సాధ్యం కాలేదు. ఇప్పుడా కోరికను బహిరంగపరచుకుంటున్నాను.

అయితే శ్రీఅరవిందుల చింతన ప్రకారం ఇరుదేశాల పౌరసత్వమును నష్టపరచని ఏకత్వములోనే సత్యమున్నది. ఒక దేశపు పౌరసత్వాన్ని త్యజించి మరో దేశ పౌరసత్వాన్ని పొందటంలో గొప్పతనమేమున్నది? అందుకని ఫ్రెంచిదేశీయురాలుగా ఉంటూ కూడా భారతదేశానికి చెందటం నా ఆశయము.

నేను ఫ్రాన్సులో పుట్టి అక్కడే విద్యాభ్యాసమును గావించితిని. అయినా నా ఆత్మ ఇక్కడే ఉన్నది. భారతదేశీయురాలుగా ఉండాలనే నా అభిలాష. కాని చేతనాస్థాయిలో ఈ రెండింటికి ఏమాత్రం తేడా లేదు. ఈ రెండూ పరస్పరపూరకములు. ఉభయ దేశాలను సమానంగా నేను సేవించగలను. శ్రీఅరవిందుల అద్భుతమైన బోధలకు ఒక రూపాన్నివ్వటమే నా ధ్యేయము. అయనేం చెప్పారు? అన్ని దేశాలు మౌలికంగా ఒకటే అని, దైవముయొక్క ఏకత్వాన్ని భంగపరచకుండా ఈ భూమ్మీద విభిన్నరూపాలలో అభివ్యక్తపరచటమే ఆ దేశాల విధి అని వక్కాణించారు.

మూలం: శ్రీమాత
అనువాదం: డా॥ ఆర్.ఎల్.ఎన్. శాస్త్రి

(*CWM* Vol. 13, p. 43)

దర్శన దినముల విశేషాలు

(15-8-1956 నాటి శ్రీమాత ప్రసంగము నుంచి)

ఆశ్రమంలో ఎప్పుడూ ఆధ్యాత్మిక వాతావరణం దట్టంగా అలము కొని చాలా గంభీరంగా వుంటుంది. దర్శనదినాలలో ఎక్కువ మంది కొత్తవ్యక్తులు రావటంవలన ఆ ఉధృతం తగ్గుతుంది. అయితే ఈ పర్వదినాల వలన ఒక ముఖ్యమైన ప్రయోజనమున్నది. ఆశ్రమంలో చైతన్యము దర్శనానికి వచ్చినవాళ్ళ ద్వారా దేశం నలుమూలలా వ్యాపిస్తుంది. — సంపాదకుడు

మధుమయీ! దర్శనదినాలలో ఆశ్రమ వాతావరణం భిన్నంగా ఎందుకుంటుంది? ఆ రోజులలో మన కర్తవ్యమేమి?

భిన్నంగా ఎందుకు వుంటుందంటావా? నువ్వు కనుక్కోలేవూ? అయితే నేను చెపుతా విను. దర్శనదినాల్లో కొత్తవాళ్లు చాలామంది వస్తారు. వారు సద్భావంతో వచ్చినప్పటికీ అజ్ఞానంలో మునిగి ఉంటారు. ఆ అజ్ఞానం చుట్టుపక్కల వాతావరణంలోకి కూడా ప్రవహిస్తుంది. ఆ విషయాన్ని అవగతం చేసుకోలేని అమాయకులు ఆ అజ్ఞానపు భారంతో క్రుంగిపోతారు.

అయితే ఇక్కడ అజ్ఞానం, అయోమయం అసలు లేవని నేనంటం లేదు! కానీ అది అంత ఉండదు. ఏది ఎలా ఉన్నప్పటికీ ఇక్కడ ఒక రకమైన చైతన్య మథనం నిరంతరం జరుగుతూ ఉంటుంది. తెలిసినా, తెలియకపోయినా, కోరినా కోరకపోయినా, ప్రతీవారూ ఆ చైతన్యాన్ని గ్రహిస్తూనే ఉంటారు. అది క్రమంగా పనిచేస్తూనూ ఉంటుంది.

సందర్శకులు కొద్ది సంఖ్యలో వచ్చినప్పటికీ వాతావరణంలో కొంత మార్పు కలుగుతుంది. కానీ దానివల్ల పెద్ద బాధ ఏమీ ఉండదు. కానీ ఈ విధంగా అసంఖ్యాక జనం వస్తే మాత్రం చైతన్యస్థాయి దిగజారిపోతుంది. ఈ అజ్ఞానంలో కూరుకోకుండా చైతన్యాత్మకంగా నిలబడితే ఫర్వాలేదుకానీ లేకపోతే అది వారిని ముట్టడించేసి ఉక్కిరిబిక్కిరి చేస్తుంది.

నేను చెప్పేది అది కాదు తల్లీ! ఈ కొత్త వాతావరణం ఆనందమయమే అంటున్నాను.

అది నీకు సంతోష వాతావరణంగా కనిపిస్తోందా? అయితే అది నీ వ్యక్తిగతమే. దాన్ని నీవు పదిలంగా ఉంచుకోవాలి. అలా నీకు తోస్తున్నదంటే నీ పాతజ్ఞాపకాలు కొన్ని నీలో కొంత కదలికను కలిగించి యుండవచ్చు. లేక నీవు ఆనందమయమనుకొనేది నీ ప్రాణికం కావచ్చు. లేక ఉత్తేజమైనా కావచ్చు. సరిగ్గా ఎప్పుడు నీకా సంతోషం కలిగింది?

ఈ రోజు దర్శనమైన తర్వాత.

అయితే అది జన్మదిన సందర్భాలలో కలిగే ఉత్తేజం లాంటిదే అయి ఉండవచ్చు. సాధారణంగా జన్మదినం రోజున గ్రహింపు శక్తి ఎక్కువగా ఉంటుంది కదా! అటువంటిదే ఈ రోజు కూడా ఉండవచ్చు. ఇంకా కొందరు తమ గ్రహింపు కోసమని ఏదో ఒక సందర్భాన్ని గుర్తు చేసుకుంటారు. అదైనా కావచ్చు.

శ్రీఅరవిందులు దర్శనమిచ్చే రోజుల్లో ఏవో కొన్ని శక్తుల కేంద్రీకరణ గానీ లేదా వారు భక్తులకియ్యాలనుకునే అనుభవం గాని ముందుగానే అక్కడ ఏర్పడి ఉండేది. ఆ విధంగా ప్రతి దర్శనదినం పురోగతికి ఒక మెట్టుగా ఏర్పడేది. ప్రతి దర్శన దినానికీ ఏదో కొంత పురోగతి కొత్తగా కలిగేది. ఆ రోజుల్లో సందర్శకులు పరిమితంగానే ఉండేవారు కాబట్టి అదంతా ఒక పద్ధతిలో జరిగేది.

ఇటీవల కాలంలో ఈ విధమైన బిగింపు ఒక్క దర్శన సమయాల్లోనే కాకుండా ఎప్పుడు పడితే అప్పుడే, ఇతర సందర్భాలలో కూడా జరుగుతోంది. అంతే కాదు. ఇప్పుడు పురోగతి వేగం పుంజుకుంది, *అనేక స్థాయిలు వెంటవెంటనే ముందుకు జరుగుతున్నాయి. వాటిని అనుసరించడం కష్టమవుతోంది. అజాగ్రత్తగా ఉంటే చూస్తుండగానే వెనకబడిపోవటం పూర్వం కంటే చాలా ఎక్కువవుతుంది.* పరిస్థితి వెంటవెంటనే మారిపోతుంది. వెనకబడిపోతే అంతా తనను వదిలేశారని బాధపడవలసి వస్తుంది.

ఈ దర్శనదినాల్లో ఉండే రద్దీవల్ల అంతర్గత పురోగతి ఎక్కువ జరగదనే చెప్పవలసి వస్తుంది. ఆశ్రమం లోపల కేంద్రీ కృతమయేది తక్కువై అంతా బయటకు విస్తరిస్తోంది. ఇప్పుడు ఈ రోజుల ప్రత్యేకతను మనం ఉపయోగించుకునే తీరులో కూడా తేడా ఉంది. శక్తుల కేంద్రీకరణం తక్కువైనప్పటికీ చైతన్యం విస్తృతం కావడానికి, ముందుకు వెళ్ళడానికీ అవకాశాలు కూడా ఉన్నాయి. జనం రద్దీ పెరగడంవల్ల కొంచెం అసౌకర్యం పెర గడం ఒక ఎత్తైతే పూర్వంకంటే ఇప్పుడొచ్చే మనుష్యుల స్థాయిలో కూడా చాలా తేడా ఉంది.

ఇంతకీ నేను చెప్పేదేమంటే దర్శనదినాల్లో నీవు పొందు తున్న ఆనందం ఇక్కడ కలుగుతున్న సందడివల్ల కలిగిన ఉత్తే జమే తప్ప మరేమీ కాదు. అంతేకాక నీలో కల్గిన అధిక గ్రహణ శక్తివల్ల ఎక్కువగా శక్తిని పొంది ఉండవచ్చు. అంతకు తప్ప నాకు తెలిసినంతవరకూ ప్రత్యేకంగా ఇప్పుడు దివ్యత్వం ఎక్కువైనదేమీ లేదు. ఇంతకూ చెప్పేదేమంటే నీలో సంతోషం వెల్లివిరియడానికి కారణం నీకే తెలియాలి. ఆ ఆనందాన్ని నిలబెట్టుకునే చిట్కాను నీవే పట్టుకోవాలి.

అమ్మా ప్రతి దర్శన సమయంలోనూ మీరు ఇచ్చే సందేశానికి గల ప్రాముఖ్యత ఏమిటో తెలియచేస్తారా? ఈనాటి సందేశంలో అతిమానస అవతరణానికి చిహ్న మైన ఒక పువ్వును కూడా చిత్రించారు కదా! దాన్ని కొంచెం వివరంగా తెలియచేయండి.

అది ఒక భావాన్ని బహిర్గతం చేయడానికై నిర్దేశించినది. దాని ప్రభావం ప్రపంచం నలుమూలలా విస్తరించడానికే దీని ప్రతులను వేల సంఖ్యలో అంతటా పంపిణీ చేయడం జరుగుతోంది. ఈ దర్శన సందేశాల్లోని అంతరార్థాన్ని ముందుగా బాగా అధ్య యనం చేసి పరిశీలించి, ప్రయోగించి, నిరూపించి ఆ తర్వాతే పంపిణీ చేస్తాము. మొదట పరిశోధన, ఆ తర్వాత ప్రకటన జరు గుతుంది. మొదట జరిగేది వ్యక్తి పురోగతి అయితే దర్శన సమ యంలో అది దశ దిశలా వ్యాప్తిస్తుంది.

శ్రీఅరవిందులు ఎప్పుడూ రెండు రకాల ప్రగతిని గురించి చెప్పేవారు. మొదటిది వ్యక్తి తనంత తానుగా గమ్యానికి చేరేందుకు చేసే ప్రయత్నం, రెండవది ప్రపంచాన్ని సంసిద్ధం గావించడానికి చేసే ప్రయత్నము. ప్రపంచ పురోగతివల్ల వ్యక్తికి ఏ విధంగాను నష్టమూ ఉండదు, సహాయమూ లభించదు. కానీ, ఈ రెండింటి మధ్య మంచి సమతుల్యత మాత్రం ఏర్పడుతుంది. వ్యక్తిగతమైన ప్రయత్నం చాలా ఊపుతోనూ, వేగంగానూ జరుగుతుంది, అది ఎంతో గాఢంగా, స్థిరంగా ఉండి చాలా దూరం వెడుతుంది. దానికి సామూహిక ప్రయత్నం ఊతాన్ని, బలాన్ని ఇస్తుంది. అవి రెండు సమానస్థాయిలో జరగటం శ్రేయస్కరము. వ్యక్తి వేగంగా పురోగమిస్తున్న కొద్దీ సామూహిక ప్రాతిపదికను పటిష్ఠం చేసుకోవడం మరింత అవసరమవుతుంది.

మూలం: శ్రీమాత

అనువాదం: డా॥ ఎ. ప్రభావతి, డా॥ ఎ. వెంకటరామ శాస్త్రి

(*CWM* Vol. 8, pp. 262-65)

15-8-1957: రెండు సందేశాలు

నూతన ప్రపంచం ఆవిర్భవించింది. అందులో స్థానం కోరుకున్నవారు దానికోసం త్రికరణశుద్ధిగా ప్రయత్నించాలి.

*

A new world is born – all those who want a place in it must sincerely prepare themselves for it.

*

Heralding the birth of a new world, we invite all those who want to have a place in it to prepare themselves sincerely for it.

మూలం: శ్రీమాత

అనువాదం: డా॥ ఎ. ప్రభావతి, డా॥ ఎ. వెంకటరామ శాస్త్రి

(*CWM* Vol. 15, p. 105)

శ్రీఅరవిందులు నిత్యులు, శాశ్వతులు

శ్రీమాత చెప్పిన విషయాలను మనమూరికే ఏవో పాఠాలకు మల్లే చదువుకోని వల్లెవేసుకుంటే సరిపోదు. అవి గర్భితార్థములు. ప్రపంచ చరిత్రలో శ్రీఅరవిందుల జన్మను వారు 'శాశ్వత జన్మ' అన్నారు. దీని అర్థమేమిటని అడిగినప్పుడు 'నువ్వు కనుక్కో లేవా' అని అవిడ సవాలు విసిరారు. చేతనోన్నతిని పొంది, ఆ స్తరములలోకి ప్రవేశించి దీని అర్థమును తెలుసుకోమని దాని భావము. — *సంపాదకుడు*

ఆగస్టు 14, 1957

ఈ సాయంకాలం సందేహాలు, సమాధానాలు వద్దు. శ్రీఅర విందుల సజీవ దివ్యతేజో స్మృతిని కృతజ్ఞతా భావంతో మననం చేసుకుంటూ పదిల పర్చుకుందాం. శక్తివంతమైన వారి దివ్యతేజో చైతన్యాన్ని (his ever luminous, and active consciousness) ఈ భువిపై సిద్ధింపజేసి ఎరుకపర్చేటందులకు వారెంత చేశారని! మాన వాళిని ఉద్ధరించే ఈ కార్యక్రమం ఇంకా కొనసాగింపబడుతూనే ఉన్నది కదా!

రేపే వారి పుణ్యజయంతి. విశ్వేతిహాసంలో వారు నిత్యులు, శాశ్వతులు.

సెప్టెంబరు 4, 1957 నాటి వివరణ

శ్రీఅరవిందుల పుట్టినరోజుకు ముందురోజు నేను మాట్లా డిన మాటలలో కొన్నిటికి వివరణ కోరుతూ నాకు ఒక ఆసక్తి దాయకమైన ప్రశ్న అందినది. నా పదజాలం గురించిన ప్రశ్న కాబట్టి నాకు ఆసక్తి కలిగించింది. ఆ పదజాలం నిగూఢర్థదా యకం, భావగర్భితం. పైకి సరళంగానే ఉంటుంది. కాని కొంచెం తరచి చూస్తే బహుళార్థదాయకం. వేర్వేరు చైతన్యస్థాయిల వారికి వేర్వేరు అర్థాలు స్ఫురిస్తాయి. భావవైవిధ్యం కోసం ఉద్దేశపూర్వకం గానే. అలా వ్యక్తీకరింపబడినది. ఇది ఇలా ఉంటుందని మీకు నేను ముందే సూచించాను గదా.

వివిధ చైతన్య స్థాయిలలో స్ఫురించిన భావ వైవిధ్యాలు పరస్పర పూరకాలు. వివిధ దృక్కోణాల నుంచి గ్రహించిన అర్థ సమన్వయంతో, సమగ్ర సర్వతోముఖ భావాన్ని గ్రహించడం సాధ్యమౌతుంది. అన్ని దృక్పథాల నుంచి గ్రహించిన భావార్థ సమాహారాన్ని ఒక్క మారుగా స్పష్టీకరించటానికి మన భాష చాలదు. అందుచేత భావవివరణను ఒక క్రమపద్ధతిలో, ఒకదాని తర్వాత మరొకటి సాగిస్తూ సమగ్రమైన అవగాహన కల్పించాలనే ధ్యేయంతో వివరిస్తున్నాను.

శ్రీఅరవిందుల జననము గురించి ప్రస్తావిస్తూ వారిది eternal birth అని అభివర్ణించాను. eternal అంటే మీ అభిప్రాయం ఏమిటని నన్ను ప్రశ్నించారు.

Eternal అన్న మాటలను వాచ్యార్థంగా (literal meaning) తీసుకుంటే దానికంత ప్రాధాన్యత ఉండదు. ఆ పదాలకు ఉన్న విస్తృతార్థాన్ని భౌతిక (physical), మానసిక (mental), చైత్య (psychic), ఇంకా ఆధ్యాత్మిక (spiritual) స్థాయిలలో అన్వయించి మీకు వివరిస్తాను.

భౌతికస్థాయిలో శ్రీఅరవిందుల జన్మ పర్యవసానాలు మహీతలం ఉన్నంత కాలము నిత్యనూతనంగా అనుభవైకవేద్యంగా ఉంటాయి. ఆ విధంగా శ్రీఅరవిందుల జన్మ శాశ్వతము (eternal)

మానసికస్థాయిలో శ్రీఅరవిందుల స్మృతి నిత్యపరిణామ శీలంగా తరతరాలకు అమరమై ఉంటుంది.

చైత్యపరంగా (psychically) వారి అవతరణ యుగయుగాలకు విశ్వేతిహాసంతో పునరావృతమౌతూనే ఉంటుంది. ఈ భూమి మీద వారి అభివ్యక్తీకరణ పునర్నవంగా అంతకంతకు సమగ్రతను, పరిపూర్ణతను సంతరించుకుంటూ ప్రకాశిస్తుంది. ఇది ఒక తరంనుంచి మరో తరానికి పురోగమనశీలంగా ముందుకుసాగే దివ్యోన్నత అభివ్యక్తీకరణ.

తుదిగా, కేవలం ఆధ్యాత్మికంగా (from purely spiritual point of view) అన్వయించుకొన్నప్పుడు వారి జన్మము పరమా

త్మని అవతారమే! మానవాకృతిని దాల్చి భూమిపై అవతరించిన పరమాత్మస్వరూపమే వారు!

Eternal birth అన్న ఈ రెండు మాటలకు ఇంతటి వ్యాఖ్యానం ఉంది!

ముగించే ముందు మీకు ఒక సలహా – "ఏమిటది? అంతా గందరగోళంగా ఉన్నదే? ఏమీ బోధపడటం లేదు" అనుకోకండి. అంతఃసత్యాలు, భావగర్భితాలు అయిన ఈ మాటలను అవగాహన చేసుకోగలిగే చైతన్యస్థాయికి నేనింకా యెదగలేదు" అనుకోండి. సరేనా!

మనసులో ఈ మాటలను మరీ మరీ మననం చేసుకుంటూ ధ్యానించండి.

*

విశ్వేతిహాసంలో శ్రీఅరవిందుల అవతారం శాశ్వతం అన్నారు కదా! Eternal *అన్న పదానికి నిర్దిష్టమైన అర్థం ఏమిటి?*

ఆరోహణక్రమంలో ఈ వాక్యాన్ని నాలుగు చైతన్యస్థాయిలలో అవగాహన చేసుకోగలుగుతాము.

1) ఈ భూమి మీద భౌతికస్థాయిలో వారి జనన పర్యవసానము – 'పరమం ప్రయోజనం' – పరమమోత్కృష్ట ప్రయోజనకరమైనది.

2) మానసికంగా వారి అవతారము విశ్వేతిహాసంలో శాశ్వత కీర్తి వర్ధనము.

3) చైత్యపరంగా యుగయుగాలకీ వారు పునరావృతమౌతూనే ఉంటారు.

4) ఆధ్యాత్మికంగా వారు నిత్యులు, శాశ్వతులు.

మూలం: శ్రీమాత
అనువాదం: కర్రా వెంకటేశ్వర్లు

(*CWM* Vol. 9, p. 171,177-78; Vol. 13, p. 10)

1958 ఆగస్టు 15: శ్రీమాత ప్రసంగము

శ్రీఅరవిందుల జన్మదినమైన ఈ రోజు 'ధమ్మపథం' మీకు చదివి వినిపించేబదులు మీకు అంతకంటె ఆసక్తికరమైన విషయం – శ్రీఅరవిందులు మనకు దేవతలకుగల సంబంధాన్ని ఎలా దర్శించారో వివరిస్తాను.

భారతదేశంలో భిన్నలోకాలకు చెందిన అనంత సంఖ్యాకమైన దేవతాగణాలు ఉన్నాయి. వీరిలో కొందరు మానవులకు అతిసన్నిహితులు, కొందరు పరాత్పరుడికి అతిసన్నిహితులు, మరి కొందరు మనకూ, ఆయనకూ మధ్యవర్తులు.

నా భావమేమిటో మీకు పురాణాలలోని దేవతలను గురించి ప్రస్తావన చేసినపుడు అర్థమవుతుంది. (నిన్న మీరు చూచిన చిత్రంలోని దేవతల లాంటివారు) దేవతలు అనంత శక్తి సంపన్నులైనా మానవుని కన్నా చాలా తక్కువైనవారేనని చెప్పక తప్పదు.

పృథ్విని సృష్టించే అధిమానసిక కక్ష్యకు చెందిన దేవతలనే (gods of the Overmind) ఇంతవరకు మనం ఎరుగుదుము. వేదాల్లో కీర్తింపబడిన వీరు ఋషుల దర్శనం ద్వారా మనకు చేరువయినారు. ఇంకా అతిమానస దేవతలు (gods of the Supermind) ఉన్నారు. వారి వారి (ఉత్తమ) లోకాలలో వర్తిస్తున్న ఈ దేవతలు భువి మీదకు అవతరించబోతున్నారు.

శ్రీఅరవిందులు ఎక్కువగా వేద దేవతలను గురించి మాట్లాడినా, ఇంకా అనేక విషయాలను గురించి కూడా ప్రస్తావించారు. ఏమైనా ఆయన వేద దేవతల గురించి సుస్పష్ట వివరణలు ఇవ్వలేదు. అయితే ఆయన ప్రస్తావించిన దేవతలు పురాణ దేవతల కంటే ఉన్నతులు, ఉదాత్తులు.

'భావాలు – సూక్తులు' (Thoughts and Aphorisms) అన్న గ్రంథంలో శ్రీఅరవిందులు ఒక ప్రార్థన ద్వారా దేవతలను వర్ణిస్తున్నారు.

ఓ వరుణా, నీ బృహత్వంలోకి మమ్మల్ని మేల్కొల్పు!

ఓ ఇంద్రా మాలో శక్తిగా వర్తించు!
ఓ సూర్యదేవా! నీ అద్భుత తేజస్సుతో మాలో ప్రకాశించు!
ఓ చంద్రుడా! నీ ముగ్ధమోహన సౌందర్యాన్నీ, మాధుర్యాన్నీ
మాపై కురిపించు!
ఓ రుద్రా! నీ ఉగ్రమైన ప్రళయభయానక శక్తితో మాలో
విజృంభించు!
ఓ మరుత్తులారా! ప్రచండవేగంతో మాలో వర్తించండి.
ఓ ఆర్యమా! అనంతసత్త్వంగా మాలో వర్తించు!
ఓ భగుడా! భోగపరాయణుడిగా మాలో వర్తించు!
ఓ మిత్రా! దయాదాక్షిణ్యాలుగా, ప్రేమానురాగాలుగా మాలో
వర్తించు!
ఓ ఉషస్సూ! వర్ణాల వైభవాన్ని మాచే దర్శింపజేయి!
ఓ రాత్రి దేవీ! సార్థకమైన పూర్ణత్వంగా మాకు దర్శనమివ్వు!
ఓ ప్రాణమా! నవనవోన్మేష ఉత్సాహంతో మాలో వర్ధిల్లు
ఓ మృత్యుదేవతా! మమ్మల్ని ఒక హర్మ్యం నుంచి మరొక
రమ్యహర్మ్యానికి నడిపించు!
ఓ బృహస్పతీ! మాలో సామరస్యాన్ని, సమన్వయాన్ని
సమకూర్చు!
ఓ కాళీ! నేను దేవతలకు వశంవదుణ్ణి కాకుండా అనుగ్రహించు!

శ్రీఅరవిందులు కాళికాదేవిని నీ పురోగతికి అవరోధమైన వాటినన్నిటిని తొలగించి, అభ్యుదయ పథం వైపు నడిపించే మహాశక్తిగా భావించారు. మన మీ విషయాన్ని గురించి ధ్యానం చేద్దాము.

శ్రీఅరవిందులు ఎందుకు కాళికాదేవికి వేదదేవతల కంటె ఎక్కువ ప్రాముఖ్యము ఇచ్చారు?

వేదదేవతలు అటువంటి లక్షణాలకు ప్రతినిధులుగా, ప్రతీకలుగా మనకు వాంఛనీయమేకాక అవసరం కూడా! అందువలనే శ్రీఅరవిందులు ఆ లక్షణాలను తన స్వభావంలో నెలకొనేటట్టు చేయమని వేదదేవతలను వేడుకున్నారు. పరాత్పరుడిలో ఐక్యం కావాలని కోరుకునేవాడికీ, పరమోచ్చ సిద్ధిని కోరుకునేవాడికీ ఇది

చాలదు. ఈ కారణం వలననే చివరిగా ఆయన కాళీమాతను దేవతలందరికీ అతీతంగా వర్తించగల శక్తిని ప్రసాదించమని ప్రార్థిస్తున్నారు.

జగన్మాత స్వరూపాల్లో కాళీమాత అతిశక్తివంతమైనది. ఆవిడ శక్తి సృష్టిలోని అన్ని దేవతల శక్తికంటే గొప్పది. ఆవిడలో ఐక్యం కావడమంటే సర్వదేవతల సమిష్టి శక్తుల కంటే బృహత్తరమైన, సంపూర్ణమైన శక్తిగా రూపొందటమే! అందువలననే శ్రీఅరవిందులు కాళికామాతలో ఐక్యం కావటమనేది అన్నిటి కంటె ఉత్తమమైనదిగా, పరమమైనదిగా పరిగణించారు.

15 ఆగస్టు 1961

అచేతనలోంచి బహిర్గతమౌతున్న దివ్యచేతన

నిశ్చేతన లోతులందు గూడ
వెలుగుచుండు నిత్యముగా
ధగద్ధగిత కాంతులీను
దివ్యమైన చేతనంబు

శ్రీమాత

అనువాదం: ధారా రాధాకృష్ణమూర్తి

(*CWM* Vol. 9, pp. 376-77; Vol. 10, 85)

యజ్ఞయాగాదులతో దేవతలనాహ్వానించడం మనకు తెలుసు. ఈ దేవతలందరూ మనకంటె పైన వుండే ఊర్ధ్వలోకాలకు చెందినవారు. ఇంతకంటె పైన అతిమానస లోకాలున్నాయి. ఆ దేవతలను గురించి మనకు తెలియదు. వారిక్కడ ఆవిష్కారమైనప్పుడు ఒక నూతన సృష్టి జరుగుతుంది, నూతన మానవుడు ఆవిర్భవిస్తాడు.

ఎంతో వైభవమైన 15 ఆగస్టు (1962)

దర్శన సమయాలలో ఆశ్రమ ప్రాంగణం గొప్ప ఆధ్యాత్మికశక్తితో పొంగిపొరలుతూ వుంటుంది. కాని ఈ రోజున అది అంతకంటె చాల పెద్ద ఎత్తున వున్నది. శ్రీఅరవిందులే దిగివచ్చి ఆశ్రమ మంతా ఆక్రమించారు. అక్కడ ధ్యానంలో నిమగ్నమైన సాధకుల నందరిని తనలో ధరించారు! — సంపాదకుడు

(ఆగస్టు 15, 1962 శ్రీఅరవిందుల 90 వ పుట్టినరోజు నాడు జరిగిన సామూహిక ధ్యానమును గురించి శ్రీమాత ఒక సాధకునికి చెప్పిన విషయములు.)

15 వ తారీఖున 10 గం॥ లకు ఇక్కడ ధ్యానము చేశాము. ఉదయం 9.45 కు నేను నా బల్ల దగ్గర నిశ్శబ్దంగా కూర్చు న్నాను. అప్పుడు... శ్రీఅరవిందులు వచ్చారని నేను చెప్పనుగాని — ఎందుకంటె ఆయన ఎప్పుడూ ఇక్కడే వుంటారు — చాలా ప్రత్యేకమైన రీతిలో దిగివచ్చారు... సూక్ష్మభౌతికంలో సమూర్తం గానే (concretely) వచ్చారు. ఆయన అంత ఎత్తుగా వున్నారు. ఇక్కడ అందరూ కూర్చుండే విధంగానే కాళ్లు ముడుచుకొని కూర్చొని ఆశ్రమాన్ని అంతా కప్పివేశారు. అక్కడి వాళ్లందరు (ఆయన స్ఫూర్తి పొందినవారు) ఆయనలోనే వున్నారన్న మాట. ఆయన అలా కూర్చునే వున్నారు (వాళ్ల తలల మీద కాదు.) సూక్ష్మభౌతికంలోకి (subtle physical) వారు వచ్చినట్లు నాకు తెలిసింది. నేను ఆయన్ని చూసాను (నేను కేవలం ఈ శరీరానికే పరిమితం కాదని మీకు తెలుసును కదా.) చాల పెద్దగా, సర్వాంగ సౌష్టవమైన ఆయన బృహద్రూపం దిగుతున్న రాపిడి నాకు తెలిసింది — ఎవ్వరూ భయపడకుండా మెల్లిగా, అతి మెల్లిగా దిగివచ్చారు. స్థిరపడ్డారు. ఒక అరగంటసేపు, ఇంకా కొన్ని నిమిషాల సేపు ఆయన నిశ్చలంగా కూర్చొని అక్కడ వున్న ప్రతి ఒక్కరికి ఆయన శక్తిని ప్రసరింపజేసారు — అందరు ఆయనలోనే వున్నారు.

నేనక్కడ కూర్చొని నాలో నేను నవ్వుకుంటున్నాను.... లేదు, నిజంగా పెద్దగానే నవ్వుతున్నాను. ఆయన సర్వత్రా విస్తరించారు. (శ్రీమాత తన శరీరాన్నంతా సూచించారు) అంతటా ప్రగాఢమైన శాంతి! బ్రహ్మాండమైన శాంతి, బ్రహ్మాండమైన శక్తి (such peace, such force, such power).... అది ఒక అనంతమైన అనుభూతి, బ్రహ్మాండమైన భావము, కేవలత్వము (absoluteness) అంటే ఇంకే విధమైన ప్రశ్నలుగాని, సంశయములుగాని లేవు. అన్ని ఆకాంక్షలు ఫలించినై. సకల సిద్ధులు కలిగినై. ఇక సాధించవలసింది ఏమీ లేదు. బ్రహ్మచైతన్యంలో ఓలలాడడమే! ...you could feel him like that everywhere (*Mother touches her whole body)*, everywhere. And with such peace! Such peace, such force, such power.... And a sense of eternity, immensity, and absoluteness. A sense of absoluteness, as if all were fulfilled, so to speak, one lived in Eternity.) అదొక మహత్తరమైన అనుభూతి. మరీ మూసుకొనిపోయుంటే తప్ప మిగతా వాళ్లందరికీ ఆ అనుభూతి కలిగే వుంటుంది.

ఇక్కడ మూసుకొనిపోయి ఉన్నవాళ్ళు ఎంతమందున్నారో నాకు తెలియదు (నవ్వుతూ), నేను వాళ్ళ నడగలేదు కదా.

తరువాత ఆయన మెల్లి మెల్లిగా తిరిగి వెళ్లిపోయినారు. మళ్లీ మామూలు పరిస్థితి నెలకొన్నది. అక్కడక్కడ ఆయన వచ్చిన జాడలు, కలిగించిన సంచలనము మాత్రమే మిగిలిపోయినై.

ఇక్కడ చాలమందికి దాని పూర్ణస్వరూపము తెలిసి ఉండక పోవచ్చునుగాని, వారిలోకి ఏదో ఒకటి దిగివచ్చినట్లు మట్టుకు తెలిసే వుంటుంది. మధ్యాహ్నానికి పరిస్థితంతా సర్దుకున్నప్పుడు (ఆయన ఎప్పుడూ ఉండనే ఉంటారుగాని, మరీ అంత గంభీరంగా కాదు. ఆయన ఎప్పుడూ ఇక్కడే ఉంటారు.) "అయ్యో! ఆ దివ్యదర్శనం అయిపోయిందా.... ఆగస్టు 15 అయిపోయిందా! ఆ అద్భుతానుభూతి అయిపోయిందా!" అన్నట్లు, వాతావరణమంతా చప్పబడిపోయింది. అయితే నిజంగా నేను చెప్పినట్లుగానే జరిగింది. అమూర్తంగానో, ఏదో సూక్ష్మరూపంలోనో కాదు. అది చాలా

ప్రత్యక్షంగా జరిగినట్లే, అంతకంటే ఎక్కువే (more than concrete). ఆ అనుభూతిని, ఆ ప్రత్యక్షానుభూతిని ఎలా చెప్పాలో నాకు తెలియదు. దానికి తిరుగులేదు (There was a sense of absoluteness about it.) నేనాయనను అతిమానసవెలుగులో ఎప్పుడూ చూస్తూనే ఉంటాను. ఆయనెప్పుడూ వస్తూనే ఉంటారు. నేను బాల్కనీలోకి వెళ్లినప్పుడు ఆయన వచ్చేవారు. ఒక్కొక్కప్పుడు సమాధి మీద ఉండేవారు. తరచు ఆయన వస్తూనే ఉండేవారు. ఆయన రూపం చాలా పెద్దగా ఉండేది. కూర్చున్నప్పుడు ఆశ్రమము కంటే ఎక్కువ చోటును ఆక్రమించేవారు. చాలా గంభీరంగా, ముట్టుకుంటే తెలిసేటట్లుగా భౌతికంలోకి వచ్చారు. అంటే ఊరికే ఒక మనిషి వచ్చి అక్కడ కూర్చున్నారు అని కాదు దాని అర్థం. ఆయన రాకతో సకలమూ సిద్ధించింది. ఇక ఏ విధమైన అనుమానము లేదు. ఏ విధమైన విచారము లేదు. అయ్యో! ఏం చెయ్యాలి, ఎలా చెయ్యాలి, ఏం దారి అనిఏ విధమైన ఆవేదనా మనస్సులో లేదు.

ఈ విధంగా ఒక ముప్పావుగంట గడిచింది. ఆ తరువాత మళ్లీ అంతా మామూలైపోయింది.

(నిశ్శబ్దం)

ఇంత అద్భుతమైన ఆగస్టు 15 నేనెప్పుడూ చూడలేదు. అది ముప్పావుగంట ఉన్నది.

(నిశ్శబ్దం)

ఆయన ఆ విధంగా వస్తున్నారని నాతో ముందర చెప్పలేదు. అందుకని అందరు ఒక అరగంటసేపు ధ్యానం చేస్తారని చెప్పినప్పుడు నాలో ఏదో కదిలింది. సరే ధ్యానానికి తగిన ఏర్పాటు చేసి గం॥ 9.45 కు నేను బల్ల దగ్గర కూర్చున్నాను. అప్పుడది మొదలైంది. స్పష్టమైన ఆకారం దాల్చేందుకు 10 నిమిషాలు పట్టింది. 'ఔనా!' ఇదా సంగతి అని అప్పుడు నేను అర్థం చేసుకున్నాను.

ఆయన మనకు చాలా అద్భుతమైన ఓ కానుకనిచ్చారు.

వారి మాధుర్యము, వైభవము, శక్తి, శాంతి చాలా ఎక్కువగా, ఆయన శరీరంలో ఉన్నప్పటికంటె చాలా ఘనంగా, స్పష్టంగా కనిపించినై.

నాకు తెలుసు. నేను ఆయన గదిలోకి వెళ్లినప్పుడల్లా, ఆయనను కలుకుకొన్నప్పుడల్లా నాకలాగే అనిపించేది. నేను పని చేస్తున్నప్పుడు కూడా ఆయన నా వెనకాలే ఉండి ఆయనే అంతా చేస్తున్నట్లనిపించేది. కాని నేటి అనుభూతి బలీయమైనది. చాలా బలీయమైనది. అది వచ్చి నిన్ను పూర్తిగా ఆవహించేస్తుందన్న మాట. కావాలన్నా నీవు తప్పించుకోలేవు. That's how it was – something ABSOLUTE.

మూలం: శ్రీమాత

అనువాదం: డా॥ ఆర్.ఎల్.ఎన్. శాస్త్రి

(*Mother India* Aug 2004, pp. 735-36)

15 ఆగస్టు 1962 నాడు ఒక సాధకుడు పొందిన అనుభూతి

శ్రీమాతకు ఒక సాధకుడు రాసిన లేఖ

ప్రియమైన మాతా,

15 ఆగస్టు నాటి ధ్యానము చాలా లోతుగా గొప్పగా ఉన్నది. మొదట ప్రగాఢమైన నిశ్శబ్దము. ఎవరో తలలోంచి ఆలోచనలన్నిటిని పిండిపారేసినట్లనిపించింది.

ఎవరో వచ్చి ఆశ్రమమంతా చాలా నిశ్చలపరిచినట్లు అనిపించింది. అదేమిటో నాకు తెలియలేదు. కొంచెం సేపు అలా ఉన్నది. తరువాత మళ్లీ మనస్సులో ఆలోచనలు కదల నారంభించినాయి.

ఈ అద్భుతమైన రోజున నేను పొందిన అనుభూతిని మీకు విన్నవించుకుంటున్నాను.

మీ పాదపద్మములకు ప్రణామములు
పృధ్వీసింగ్

శ్రీమాత జవాబు: 28 ఆగస్టు 1962

శ్రీఅరవిందుల బృహద్రూపము (సూక్ష్మభౌతికంలో) ప్రత్యక్షంగా ధ్యానం జరుగుతున్నంతసేపు మన ఆశ్రమం మీద ఆసీనమై ఉన్నది.

15 ఆగస్టు 1964: శ్రీమాత సందేశములు

(ఆకాశవాణి తిరుచునాపల్లి నుంచి
ప్రసారనార్థమై యిచ్చిన సందేశము)

భూమియొక్క ఆధ్యాత్మిక చరిత్రలో శ్రీఅరవిందుల స్థానము కేవలం ఒక బోధన కాదు. ఒక దివ్యప్రబోధము (revelation) కూడా కాదు. పరమాత్మ పంపించిన మహాకార్యము.

*

(శ్రీఅరవిందుల తపాలబిళ్ల
ఆవిష్కరించుటకు యిచ్చిన సందేశము)

భూలోకానికి ఒక బంగారు భవిష్యత్తు చూపించేందుకే వారు అవతరించారు.

దర్శనదినాలలో శ్రీమాతారవిందుల కటాక్షము సాధకుల మీద ప్రసరించబడుతుంది. అయితే ఒక్కొక్కప్పుడు ఇది ఒక మహాశక్తిపాతమువలె చాలా పెద్దెత్తులో జరుగుతుంది. ఆ సమయంలో అక్కడ వుండి, ఆకాంక్షించినవారు దానిని గ్రహించ గలుగుతారు.

శ్రీఅరవిందుల రోజు

15 ఆగస్టు 1967

మన మనస్సు చంచలం. ఆ మాటకొస్తే సృష్టి అంతా చంచలమే. ఈ సృష్టి లక్షణమే అది. పైనుంచి ఒక మహాశక్తి దిగివచ్చినప్పుడు అది అచలమౌతుంది. ఆ రోజున ఆశ్రమంలో అదే జరిగింది, చాలా పెద్ద ఎత్తున. ఈ అనుభూతి కేవలం బాహిరంలోనే కాదు. మన లోపల కూడ (అన్నమయకోశంలో) అంతా గట్టిగా రాయి అయిపోయింది. ఆ విరాట్ పురుషుడే దిగివచ్చాడా ఏమిటి? అట్లాగే సాయంత్రం బాల్కనీ దర్శనమప్పుడు కూడ శ్రీఅరవిం దులే వచ్చి (మదర్ ద్వారా) దర్శనమిచ్చారు. — సంపాదకుడు

ధ్యానానికి వేళయింది. అందుకు నేను సిద్ధంగా కూర్చొని వున్నాను. నిర్ణీత సమయానికి యింకా ఒక అర నిమిషమే వున్నది. ఉన్నట్లుండి పిడుగు పడ్డట్టయింది. ఎట్టి హెచ్చరిక లేకుండానే, అకస్మాత్తుగా ఒక మహాశక్తి దిగివచ్చింది. మహాబలీయమైంది, చలనరహితంగా అలాగే ఉండిపోయింది.... అప్పుడు శ్రీఅరవిం దులు నాతో మాట్లాడినట్లనిపించింది. (అది మామూలుగా ధ్యాన సమయంలో కలిగే అనుభూతివలె వున్నప్పటికీ, ఇది అంతకు మించిందే. నిజంగా జరిగినట్లే వుంది.) అది 'సువర్ణయ ప్రశాం తత' (Golden Peace) అని శ్రీఅరవిందులు సెలవిచ్చారు. అలా దిగివచ్చిన ఆ మహాశక్తి, ఆ ప్రబలశక్తి ఏ మాత్రం చలించకుండా పూర్తి అరగంట, ముప్పై అయిదు నిమిషాలు అలాగే నిలిచిపో యింది. ఈ సంఘటన క్రొత్తది. ఇంతకు ముందు నా కెప్పుడూ ఇటువంటి అనుభవం కలుగలేదు. ఇతరులకు కూడ ధ్యానానికి కూర్చోగానే అప్రయత్నంగా ఇటువంటి అనుభవమే కలిగినట్లు చెప్పారు. ధ్యానానికి కూర్చున్నదే తడవుగ, ఒక మహాశక్తి దిగి వచ్చి, చలనరహితంగా వుండడమే గాకుండా, వారిని ఆవహించి, ఆ చుట్టుప్రక్కలను కూడ ఘనీభవింప చేసింది. జన్మలో వారు యెప్పుడూ కని, విని, ఎరుగనంతటి మహాశాంతిని పొందారు.

అదే 'సువర్ణయ ప్రశాంతత' – ఎందుకంటే, బంగారు వర్ణంగల అతిమానసజ్యోతి (golden supramental light) ఇదేనను భావం నాకు అప్పుడు కలిగింది. మహత్తరమైన ఆ శాంతిని మాటల్లో చెప్పడం ఎలా సాధ్యపడుతుంది? (gesture of massive descent)... అది మూర్తీభవించిన ప్రశాంతత, అంటే, చలనరహితంగా వుండటంవల్ల కాదు. అక్కడ పరమనైశ్చల్యం నెలకొన్నది. (...other persons told me that as soon as they were seated for meditation (*gesture of massive descent*), something came down with a tremendous power, completely immobile, and a feeling of peace that they had never felt in their life.)

Golden peace. And it is true, it gave the impression of the golden supramental light. But it was... a peace! Concrete, you know, not the negation of disorder and activity, no: concrete, concrete peace.)

ఆ ప్రశాంతత స్థిరపడింది. నేను దానిని ఆపదలచుకొన లేదు. సమయం అయిపోయినా రెండు, మూడు నిమిషాలు అలాగే వున్నాను. నేను ఆపిన వెంటనే, అది కూడ ఆగిపోయింది. దాని ప్రభావానికి లోనై ఈ శరీరంలో గొప్ప మార్పు కనిపించింది. తిరిగి నేను యథాస్థితికి వచ్చేటప్పటికి అర నిమిషం పట్టింది.

అది ఆవిర్భవించడం, తిరిగి వెళ్లడం జరిగిపోయింది. అది ధ్యానసమయానికి వచ్చి, అరగంటకు పైనే వుండి వెళ్లింది.

సాయంత్రం బాల్కనీ వద్ద ఒకే జనసందోహం. అంత పెద్ద జనార్ణవాన్ని నేను ఎప్పుడూ చూడలేదు. అన్ని వీధులలోను జనం, జనం. నేను చూడగల్గినంత మేర అన్ని వీధులు జనంతో క్రిక్కిరిసిపోయాయి. నేను బయటకు వచ్చాను. జనం నుండి ప్రార్థనలు ప్రాధేయపడుతున్నట్లు విజ్ఞాపనలు, ప్రపంచం, ముఖ్యంగా దేశంలోని పరిస్థితి గురించిన నిరసన నినాదాలు వెల్లువ. వారి నిరసన తరంగాలు పెల్లుబికాయి. అంతా చూశాను. 'ఈ రోజు నాది కాదులే, శ్రీఅరవిందులది' అని నాలో నేను అనుకున్నాను. అప్పుడు నేను వెనక్కు తగ్గి (వెళ్లినట్లు సంజ్ఞ) శ్రీఅరవిందుల్ని ముందుం

చాను. ఆయన అక్కడ నిలబడి, "పరమాత్మ లీలలను గురించి, అందరి కంటే ఆయనకే బాగా తెలుసు" అని సాధారణంగానే అన్నారు. నేను వెంటనే చిరునవ్వు నవ్వాను. (గట్టిగా కాదు, చిరు నవ్వు మాత్రమే)

ఆ ఉదయం ధ్యానసమయంలో వచ్చిన ఆ పరమశాంతియే మరల యిప్పుడు, ఇక్కడ ఆవిష్కారమైంది.

శ్రీఅరవిందులు హాస్యచక్రవర్తి గదా! "పరమాత్మ లీలలను గురించి, అందరికంటే ఆయనకే బాగా తెలుసు" అని వారు ఎప్పుడైతే చమత్కరించారో, ఆ తక్షణమే, ఆ ప్రశాంతత అంతటా ఆవహించింది.

మూలం శ్రీమాత

అనువాదం: డా॥ ఆర్.ఎల్.ఎన్. శాస్త్రి (ఆగస్టు 1992 'అర్క' నుండి); యజ్ఞన్న

(*CWM* Vol. 15, pp. 424-25)

దివ్యజనని సందేశం

(పుదుచ్చేరి ఆకాశవాణి నుండి ప్రసారం)

శ్రీఅరవిందుల శతవార్షిక వత్సరంలో నేడు తొలి రోజు. ఆయన శరీరాన్ని త్యజించినా, మనతో బాటే వున్నారు, సజీవంగా, సచైతన్యంగా.

శ్రీఅరవిందులు భవిష్యత్తుకు చెందినవారు.

ఆయన భవిష్యత్ కాంతి దూత. అతిమానస క్రాంతిదర్శి. భగవంతుడు ఆదేశించిన మహోజ్వల భవిష్యత్తును త్వరితగతిని సిద్ధింపచేసుకోవడానికి మనకు ఆయన మార్గాన్ని ఆవిష్కరించారు.

ఇప్పటికీ ఆయన అదే మహత్కార్యంలో నిమగ్నమై యున్నారు.

మానవాళి అభ్యుదయ ప్రస్థానానికి, భారతదేశపు సముజ్వల భవిష్యత్తు కోసం పాటుబడే వారంతా ప్రజ్ఞా సమన్విత

మైన (clairvoyant) ఆకాంక్షతో, ఆత్మజ్యోతితో భాసించే దివ్య కార్యోన్ముఖులై సమైక్యమవ్వాలి. ఉద్యమించాలి

అనువాదం: యజ్ఞన్న

(*CWM* Vol. 13, p. 14)

ఆగస్టు 15, 1972: శ్రీఅరవిందుల శతజయంతి

శ్రీఅరవిందుల సందేశము భవిష్యత్తుపై నిత్యనూతన కాంతులు వెదజల్లగలదు.

15 ఆగస్టు 1972

*

ఈ సృష్టిలో ఒకానొక నూతన జాతిని, నూతన ప్రపంచాన్ని (Supramental) అతిమానసాన్ని ఆవిష్కరింపజేయుటయే (పరాతత్వము నుంచి అవతరించిన) శ్రీఅరవిందుల అవతార కార్యము.

15 ఆగస్టు 1972

*

నేటి మానవుడు గతకాలానికి చెందినవాడు. అయితే శ్రీఅరవిందుల ఆగమనం ముమ్ముందు నవ్యనవీన సృష్టికి, ఋతచిత్ (Supramental) అవతరణకు నాంది కాగలదు.

15 ఆగస్టు 1972

*

మనము పురోగతిని ఆకాంక్షిస్తూ దైవబలానికై, చేతులు మోడ్చి స్వాగతించటమే, ఈ పవిత్ర భారతదేశంలో అవతరించిన శ్రీఅరవిందులకు, వారి శతజయంతి నాడు మనము అర్పించగల ఘనమైన నివాళి.

15 ఆగస్టు 1972

*

One more step towards Eternity.

మూలం: శ్రీమాత
అనువాదం: శ్రీశరణ్

(*CWM* Vol. 13, pp. 19-20)

అనుబంధం:

వారిరువురిది ఒకే చైతన్యము, ఒకే బాట

శ్రీమాత చైతన్యము. నా చైతన్యము ఒకటే. దివ్యచైతన్యమే రెండు రూపాలలో వచ్చింది. ఎందుకంటే లీలకు అది అవసరం గనుక. ఆమె జ్ఞానము, శక్తి, చైతన్యము లేనిదే ఏమీ జరగదు. ఎవ్వరైనా శ్రీమాత చేతనను పొందినట్లైతే దాని వెనుక నేను కూడా ఉన్నానని గ్రహించాలి. అటులనే నా వెనుక కూడ ఆమె వుంటుంది.

*

శ్రీమాత, నేను ఒకే శక్తికి రెండు రూపాలము — శివ-శక్తులు, పురుష-ప్రకృతులు, దైవము యొక్క రెండు ముఖములు.

*

శ్రీమాత మార్గమునకు నా మార్గమునకు ఏ విధమైన తేడా లేదు. మొదటి నుంచి అది ఒకటే. అతిమానస పరివర్తనానికి, దైవ సిద్ధికి దారితీసే మార్గమది. ఒక్క గమ్యములోనే కాదు, మొదటి నుంచి నడిచే మార్గము కూడా ఒకటే.

మా ఇద్దరినీ, మదర్‌ని, ఒకవైపు, నన్ను మరొక వైపు ఉంచటం, విభజించి వ్యతిరేకంగా చూపించడం అసురశక్తుల పన్నాగము. సాధకులను గమ్యము చేరకుండా తప్పుదారి పట్టించేందుకని అవి చేయు ద్రోహము. ఇటువంటి తప్పుడు భావాలన్నిటినీ మనస్సు నుంచి బహిష్కరించాలి.

మరో విషయం తెలుసుకోవాలి. శ్రీమాత వెలుగు, శ్రీమాత శక్తి పరమసత్యము యొక్క వెలుగు, శక్తి. నువ్వెప్పుడు కూడా

శ్రీమాత జ్యోతిశ్శక్తుల సాన్నిధ్యంలో ఉండాలి. అప్పుడే నీలో దివ్యసత్యము ప్రవర్ధమానమవుతుంది.

Know that the Mother's light and force are the light and force of the Truth; remain always in contact with the Mother's light and force, then only can you grow into the divine Truth.

మూలం: శ్రీఅరవిందులు
అనువాదం: డా॥ ఆర్.ఎల్.ఎన్. శాస్త్రి

(*SABCL* Vol. 26, pp. 455-57)

సమాచార పత్రం

శ్రీఅరవిందులు భవిష్యత్తుకు చెందినవారు. ఆయన భవిష్యత్ కాంతి దూత. అతిమానస క్రాంతిదర్శి. భగవంతుడు ఆదేశించిన మహోజ్జ్వల భవిష్యత్తును త్వరితగతిని సిద్ధింప చేసుకోవడానికి మనకు ఆయన మార్గాన్ని ఆవిష్కరించారు. ఇప్పటికీ ఆయన అదే మహత్కార్యంలో నిమగ్నమై యున్నారు.

మానవాళి అభ్యుదయ ప్రస్థానానికి, భారతదేశపు సముజ్జ్వల భవిష్యత్తు కోసం పాటుబడే వారంతా అంతరవలోకనా ప్రజ్ఞా సమన్వితమైన ఆకాంక్షతో, ఆత్మజ్యోతితో భాసించే దివ్య కార్యోన్ముఖులై సమైక్యమవ్వాలి. ఉద్యమించాలి.


శ్రీమాత

ఆంగ్లమూలం:

Sri Aurobindo belongs to the future: he is the messenger of the future. He still shows us the way to follow in order to hasten the realisation of a glorious future fashioned by the Divine Will.

All those who want to collaborate for the progress of humanity and for India's luminous destiny must unite in a clair-voyant aspiration and in an illumined work.


The Mother



మహాలక్ష్మి

అఖిల

అఖిల భారత పత్రిక, అక్టోబరు 2005



Integral Wealth of Mahalakshmi

Wealth in all domains and all activities, intellectual, psychological, material, in feeling and action.

Spiritual significance and explanation given by the Mother to pure white water lily with a golden centre.

(Picture on the Cover)

ఉపోద్ఘాతము

లక్ష్మీదేవిని గురించి అందరికి తెలుసు కాని, శ్రీఅరవిందులు శ్రీమాత నాలుగు శక్తులలో ఒకటి అయిన మహాలక్ష్మి అనే మరొక దేవతను గురించి ప్రస్తావించారు. ఐశ్వర్యమనగా ధనం కాదు – దివ్యత్వము, సౌందర్యము, కళ, 'రసోవైసః' అన్నారు కదా. అది ఒక గొప్పతనం, ఒక ఠీవి, ఒక వైభవము. ఈ ఉన్నత లక్షణాలు మనిషియొక్క అన్ని విభాగములలోను రాణించాలి. మానవ జీవితము యొక్క అన్ని క్షేత్రములలోను ప్రకాశించాలి. మహాలక్ష్మి అనుగ్రహము మనకు లభించిన యెడల జీవితము సర్వతోముఖంగా వికసిస్తుంది. కాని ఆ అనుగ్రహము ఎలా దొరుకుతుందనేదే ప్రశ్న. నీ మనస్సును ఆమెకు అర్పించుకోవాలి – పూర్తిగా ఆమెకు విధేయమైపోవాలి. నీలో ఏ కోశాన కాఠిన్యముగాని, మొరటుతనము గాని వుండరాదు. మాలిన్యము పనికిరాదు. నీ మనస్సు, నీ యిల్లు, అందలి వస్తువులు, పరిసరాలు అన్ని కూడ అందంగా తీర్చిదిద్దిన అలంకారాలు కావాలి. సౌకుమార్యాన్ని ప్రతిబింబించాలి. నీ మనస్సెప్పుడూ క్షణికావేశానికి గురికాకుండా స్థిమితంగా, ప్రశాంతంగా ఉండాలి. ఇక నీకెట్టి సమస్యా ఉండదు. నువ్వు ఆమె అనుంగు బిడ్డవు. అప్పుడు నీపై మహాలక్ష్మి కరుణార్ద్ర దృక్కులు ప్రసారమౌతాయి.

– సంపాదకుడు

Editor: R.L.N.Sastry
Published by Pradeep Narang on behalf of Sri Aurobindo Society,
No. 1, Rangapillai Street, Pondicherry - 605001
Printed by Amiyo Ranjan Ganguli at Sri Aurobindo Ashram Press,
38, Goubert Avenue, Pondicherry - 605001

Single copy: Rs. 15   Annual Subscription: Rs. 100 (in India)

A Monthly Published by

SRI AUROBINDO SOCIETY, PONDICHERRY - 605002

Registered with the Registrar of Newspapers for India: No. 23593/72

మాతృమూర్తి మహాలక్ష్మి దర్శనము

ఇక్కడ శ్రీఅరవిందులు మాతృమూర్తి యొక్క నాలుగు ముఖ్యాంశములు – ఆమె ముఖ్యశక్తులు, దేవతా స్వరూపములు అయిన మహేశ్వరి, మహాకాళి, మహాలక్ష్మి, మహాసరస్వతులను గురించి వివరిస్తున్నారు. మహాలక్ష్మి గురించిన విశేషములను ఇక్కడ అందిస్తున్నాము.

– సంపాదకుడు

I

జ్ఞానము, శక్తి మాత్రమే శ్రీమాత రూపములు కావు. అంతకంటె మహిమాన్వితరూప మొకటున్నది. అది ఒక ఇంద్రజాలం లాంటిది. అది లేనిదే జ్ఞానము, శక్తి అసంపూర్ణములు. అది లేనిదే ఏదియు పరిపూర్ణము కాజాలదు. ఈ జ్ఞాన, శక్తులకు పైన సమస్త జీవులను, చరాచర వస్తుజాలము నంతను ఆకర్షించి సామరస్యపరచగల ముగ్ధమనోహర రూపము, తెర వెనుక నుండి నడిపిస్తూ వాటన్నిటిని ఆనందహేలలో ముంచెత్తగల నిత్య సౌందర్యము, లయవిన్యాసములతో పరవశింపజేయగల దివ్యగాంధర్వ మొకటున్నది.

ఇదే మహాలక్ష్మి, శ్రీమాత అంశములలో ఇంత సమ్మోహన పరచే రూపము మరొకటి లేదు. మహేశ్వరి ఎక్కడో మానవ మాత్రులు అందుకోలేనంత గగనసీమలలో వుంటుంది. మహాకాళి సంగతి చెప్పనే అక్కర్లేదు. ఆమె వేగాన్ని, గంభీరత్వాన్ని ఎవరు తట్టుకోగలరు? కాని మహాలక్ష్మి మానవమాత్రులకు సన్నిహితంగా అందుబాటులో ఉంటుంది. ఆమెను అందరూ సంతోషంగా ఆశ్రయిస్తారు.

మూలం: శ్రీఅరవిందులు

అనువాదం: డా॥ ఆర్.ఎల్.ఎన్. శాస్త్రి



THE MOTHER

The Example to be followed

(Caption given by the Mother)

II

అందరకు అభిలాషనీయమైనది మహాలక్ష్మి. దీనికి కారణం ఆమె దివ్యమధురాకృతి. అది చాల ఆశ్చర్యకరమైనది. మనస్సును మూర్ఛిల్ల చేసేటంత అమృతమూర్తి. ఆమె సాన్నిహిత్య మెంత ఆనందదాయకం! ఆమెను 'హృత్పుండరీక' నిలయగా భావించడ మంటే బ్రతుకును బృందావనంగా మలుచుకోవటం. లావణ్యం, సౌకుమార్యం, మాధుర్యం ఆ మూర్తి నుండి, సూర్యుని నుండి వెలుగు లాగా నిత్యప్రసారం పొందుతుంటాయి. ఆమె అద్భుత దృష్టి ఎక్కడ నాటుతుందో ఆమె మధుర దరహాస మెక్కడ అంచరెక్క లాగా వాలుతుందో, అక్కడ జీవాత్మ పొందే సాంద్రానందంలో లోతులెవ్వడు అంచనా కట్టగలడు! ఆమె హస్తస్పర్శ అయస్కాంత మహిమ కలది. వాటి మార్మిక సుకుమార ప్రభావం మనః ప్రాణ శరీరాల కొక అమృతసేచనం. ఆమె పాదక్రాంతి ప్రసరించిన చోటు ఆనందధామం. అక్కడ కోటి నందనవనాలు వెల్లివిరుస్తాయి.

III

ఐనా ఆమె దర్శన స్పర్శనాదులంత సులభ సాధ్యం కావు. మనస్సు, జీవాత్మల సామరస్యం, సౌందర్యం, ఆలోచన భావాల మనోజ్ఞత, ప్రతిబాహ్యాకర్మలో, చలనంలో, సామరస్య సౌందర్యాలు, జీవితంలో పరిసర వాతావరణంలో సౌందర్య సామరస్యాలు, అను ష్ఠేయాలు, ఉపాస్యములు కాకపోతే ఆమె సన్నిధి అలభ్యం. విశ్వ రహస్యానందాల లయలకు నీ గుండె స్పందించ గలిగితే అనంత సమగ్ర సౌందర్యావలోకనానికి నీ చూపులభ్యస్తములైతే, ఆ ఏకైక సమన్వయ సామరస్యానికి జీవితాలున్ముఖమైతే ఆ దివ్య వాతావ రణంలో ఆ తల్లి కాలూనగలదు.



THE MOTHER

All here shall be one day her sweetness' home,
All contraries prepare her harmony...

Sri Aurobindo

IV

క్షుద్ర, నీచ, జగుప్సావహ వాతావరణంలో దుర్గంధ భూయిష్ఠ ప్రదేశాలలో అంధతమస్సులో క్రూర ఘోర స్థలాల్లో ఆమె దర్శనం అసాధ్యం. ఆమెకవి చోట్లు కావు. అవేమైనా పద్మ లతలా, ఆమె నిలువటానికి? ఎక్కడ ప్రణయ పద్మం వికసిస్తుందో, సౌందర్య లత మారాకు తొడుగుతుందో అవి ఆమె కిష్టమైన చోట్లు. ఏ మాత్రమవి క్షుద్రజాంతవ భావస్పర్శ పొందినా ఆమె నిలువదు. ఆమె హిరణ్యకిరణ ప్రసరణ సోకదు. మానవ హృదయాల్లో, స్వార్థం, ద్వేషాసూయలు, కృతఘ్నత, దుర్మార్గం, సంకుచితత్వం, ప్రలోభాలు, దివ్యామృతచషకంలో విషబిందువులై ఎదలకు తాకితే చాలు అక్కడ దేవతా సౌందర్యం కమిలిపోతుంది. ఆ కల్పలత వాడిపోతుంది. వేసవిలో పద్మదళం లాగా, దివ్యతానిష్ఠత ఆమె ప్రవేశానికి కంచుకోట. ఆమె తన ముఖాన్ని చాటుచేసికొనేది కాదు! జటిలులలో జడలు విరబోసుకున్న కర్కశ శూన్యతల కామె ఎదురుచుక్క. అలాగే హృదయ స్పందనముల అణచివేత, ఆత్మ జీవన మనోహరాకర్షణల నిరాశ మామె కిష్ట ముండదు.



V

ప్రేమ సౌందర్యాల ద్వారా ఆమె మానవ హృదయాల్లో పారిజాత లతలను నాటగలదు. ఆమె పరమ సృష్టిలోకి దివ్యకళా సామ్రాజ్యంలోకి మానవ జీవితం ప్రవహించి సర్వ విశ్వమూ పవిత్ర రసభరిత మహాకావ్యంగా పరిఢవిల్లుతుంది. విశ్వ ఐశ్వర్యాలు ఒకే చోట కూడబడతాయి. వాటి నడుమ ఒక ఋతు గీతాలాపన జరుగుతుంది. అప్పుడు ఒక సామాన్యమైన గడ్డిపువ్వు కూడా ఆమె నిట్టూర్పు గాలి సోకి ఆమె ఏకత్వ స్ఫురణ తాకి – దివ్య నీల కమలమై విప్పారుతుంది. కలకల నవ్వులతో కళలారబోస్తుంది. ఆమె స్పర్శ సోకిన హృదయంలో జ్ఞానము అద్భుత శిఖరాలకు ఎగసిపోతుంది. ఆ శిఖరాగ్ర మేమిటి? జ్ఞానాధికమైన ఆనంద నృత్యహేల. అదొక మార్మిక రహస్యం, యోగదర్శనం. భక్తి ఉన్మత్త దివ్యాకర్షణతో మేళవించి జీవశక్తులకు లయల పాఠాలు నేర్పి, వాని క్రియలలో సామరస్యాన్ని బలిష్ఠం చేసి, అద్భుత లావణ్యమయ రూపాలుగా మలిచి వాటిని శాశ్వతాలు చేస్తుంది.

మూలం: శ్రీఅరవిందులు

స్వేచ్ఛానువాదం: తుమ్మపూడి కోటీశ్వరరావు (‘మహాదేవి సూక్తము’ నుండి)

(*SABCL* Vol. 25, pp. 30-33)

సౌందర్య సామరస్యములు వెల్లివిరియుట

సాధారణ మానవుని జీవితము ధనార్జన, యితర లౌకిక విషయములందు నిమగ్నమై యుండును. కాని నీకు దైవము కావలెనన్నచో నీ దృష్టిని కొంచెం సౌకుమార్యంగాను, కళాత్మకంగాను మార్చుకోవాలి. కేవలం భావనలోనే కాకుండా నిత్యజీవితంలో కూడా సౌందర్యభావన వెల్లివిరియాలి.

— సంపాదకుడు

సర్వవ్యాప్తమైన మృదులయతో ఈ సృష్టిలో అన్ని దిశలా, అన్నిటా, అన్ని వ్యవహారాలలోనూ సత్యమే వ్యక్తమై, జీవితంలోని ప్రతి క్షణం, ప్రతిక్రియా సౌందర్యాన్ని, సామరస్యాన్ని వ్యక్తం చేయాలి. చైతన్యవంతమైన అందం, ఆనందాలతో జీవితంలోని ప్రతి క్షణం స్పందించాలి. ఇదే ఈ పుడమిపై ఆ భగవంతుని అస్తిత్వానికి ముఖ్యచిహ్నాలు. అతిమానసస్థాయినించి చూస్తే, దైవాభివ్యక్తికి ఇతర మార్గాలెంత విలువైనవో సౌందర్య సామరస్యాలు కూడా అంతే విలువైనవి. కానీ, వీటిని ఇతర వ్యవహారాల నించి వేరు చెయ్యకూడదు, సమిష్టిలో భాగం గానే వుంచాలి.

*

అందమే నీ నిరంతర ఆదర్శమై, ఆత్మ సౌందర్యం, ఆలోచనల్లో సౌందర్యం, చేతలలో, కర్మలలో, చేష్టలలో సౌందర్యం వుంటే నీవు చేసే ప్రతి పనిలోనూ దివ్యసౌందర్యం అభివ్యక్తమవుతుంది, ఆ దివ్య సహకారం సదా నీకు లభ్యమవుతుంది.

మూలం: శ్రీమాత

అనువాదం: బి. వరలక్ష్మి

(*CWM* Vol. 3, p. 109; Vol. `12, p. 234)

Beauty is his footprint showing us where he has passed

(*Savitri*, p. 112)

భౌతిక ప్రపంచంలో సౌందర్య స్ఫూర్తి

ప్రపంచంలో ప్రేమ, కళ, సౌందర్యములను గురించి, నిత్యజీవితంలో కూడా వాటిని ఏ విధంగా స్ఫురింపజేసుకోవాలో శ్రీమాత మనకు చెప్పారు. అందమంటే కేవలం పుష్పములకు, ప్రకృతి దృశ్యాలకు మాత్రమే పరిమితం కాదు. నిజమైన సౌందర్యము సర్వవ్యాప్తమైనది. ప్రపంచంలోని ప్రతి వస్తువు ఒక కళాఖండమే. నీ కళ్లను కప్పివేసిన అహంకారపు పొరలను తప్పించినపుడుగాని నీకీ విషయము అవగతము కాదు.

— సంపాదకుడు

భావ ప్రపంచమున సత్యాన్ని కప్పిపుచ్చుటం ఎంత పెద్ద నేరమో, రూప ప్రపంచమున సౌందర్యము లేకపోవటం అంత గొప్ప నేరము. ఎందుకంటే జగత్ప్రభువునకు ప్రకృతి సమర్పించు జోహార్లే సౌందర్యము. అది రూపమున వెల్వడిన దివ్యభాష. బాహ్యప్రవృత్తియందు సౌందర్యాభిలాషలేని, అభివ్యక్తపరచలేని దివ్యచేతన అసంపూర్ణ చేతనయే యగును.

కాని, దైవమునభివ్యక్తము చేయు నితర లక్షణముల వలెనే, యథార్థమైన సౌందర్యమును కనుగొనుట, అర్థము చేసికొనుట, అభివ్యక్తము చేయుట కడుంగడు కష్టము. పరమ సత్యమును, పరమానందమును కనుగొనుటకు అహంకార త్యాగము చేసి వ్యక్తిత్వము నతిక్రమించుట ఎంతగా అవసరమో, అట్లే యీ పరమ సౌందర్యమును కనుగొనుటకు, అభివ్యక్తము చేయుటకుకూడ అంతగానే అవసరము. అచ్చమైన సౌందర్యము విశ్వజనీనము, విశ్వజనీనత లేనిదే దానిని కనుగొనుటయు, గుర్తించుటయు ఎవరికీ సాధ్యపడదు.

ఓ సర్వసౌందర్యాధి దేవా! నీయెడ నేను ఎన్ని నేరములు చేసితినో, ఇంకనూ చేయుచున్నానో!... నీ సత్యధర్మపు పూర్ణజ్ఞానమును నా కనుగ్రహించుము. అపుడు నేను ఎట్టి లోపమూ లేకుండ దాని కనుగుణముగ మెలగనేర్తును. నీవు లేని ప్రేమ



Aristocracy of Beauty

So perfectly formed that it compels admiration

(Spiritual significance & explanation given by the Mother)

Botanical name : Dietes iridioides — Lavender & white

అసమగ్రము; అద్దాని అత్యుత్తమ భూషణము నీవు; అద్దాని అత్యంత ప్రసన్న మందహాసము నీవు....

నీ స్వరూపము తాము భావించునట్టిదే యని కొందరు గర్వితమతులు భ్రమపడుదురు. ప్రత్యేకించి ఏ ఒక్క ప్రాణి యందు నీకు పక్షపాతము లేదు గదా. ఏ రూపమునందైనను నీవు జాగృతి పొంది ప్రకాశింపగలవు. కాని, ఇట్లు నిన్ను సాక్షాత్కరింప జేసికొనుటకు నీ రహస్యమును తెలుసుకోవలెను!

ఓ పరమసుందరా, నీ సత్యదర్శమును నే నెప్పుడును తప్పకుండుటకై, అద్దాని పూర్ణజ్ఞానమును నా కనుగ్రహింపుము. సామరస్యమును సర్వత్ర అనుశాసింపగల ప్రేమతత్త్వపు దివ్య మకుటము భాతి నాలో నీవు ప్రకాశమానుడవు కమ్ము.

మూలం: శ్రీమాత

అనువాదం: కమలాకర వేంకటరావు ('ప్రార్థనలు – ధ్యానములు' నుండి)

(*CWM* Vol. 1, pp. 349-50)

రసజ్ఞత

సౌందర్యమే నీ నిరంతరాన్వేషణ కావాలి. అప్పుడు నీ ఆలోచనలు, భావములు, సమస్త జీవితము సౌందర్యముతో ఆచ్ఛాదితమై నీ మనస్సును ద్రవింపజేస్తుంది. ఇక బ్రతుకంటే ఏదో బలవంతమైన శిక్ష కాదు. అదొక పూలబాట, రసానుభూతి, చేతనోద్దీపనము! *–. సంపాదకుడు*

మధుమయీ రసజ్ఞతంటే ఏమిటి?

ఇది సౌందర్యాస్వాదనకు సంబంధించినది, సౌందర్యాన్ని దర్శించి స్పందించగలిగి సహృదయ చేతనను కలిగి వుండటం. ఉదాహరణకు కొందరు వ్యక్తులు తమ చుట్టూ ఉన్న దృశ్యాలనూ, పరిసరాల్నీ, వస్తువులనూ పరిశీలిస్తూ వాటి అందచందాలకు ఏమాత్రం స్పందించకుండా తిరుగుతూ వుంటారనుకోండి.

వారికి దాని వలన కలిగే సంతోషమేమీ వుండదు. ఆకాశం వైపు చూస్తూ అక్కడ మేఘాలున్నాయా లేవా అనీ, అవి వర్షిస్తాయా లేవా అని గమనించడానికి మాత్రమే ప్రయత్నిస్తారు. మరికొంందరు అలా కాదు – అందమైన ఆకాశాన్ని చూసి పులకరించిపోతారు. వాళ్లు "ఆహా! ఈ రోజు ఎంత ఆహ్లాదంగా వుంది, సూర్యోదయం మనోహరంగా వుంది. మేఘాలు చిత్రవిచిత్రకారాలతో సుందరంగా వున్నాయి" అంటారు. మొదటిరకం వాళ్లకు సౌందర్యాన్ని దర్శించి ఆనందించే యోగ్యత లేదు. రెండవశ్రేణి వారికి సౌందర్యానికి స్పందించి దానినా స్వాదించగల శక్తి వుంది.

*

పరిశుద్ధ సౌందర్య భావన గొప్ప పవిత్రీకరణ వలన మాత్రమే సాధ్యమవుతుంది.

*

భగవంతునికి సమర్పింపబడనిదే సౌందర్యం పరిపూర్ణమైన శక్తిని సంతరించుకోలేదు.

*

జీవితంలో అత్యంత విలువైన విషయాలను నీవు చర్మ చక్షువులతో దర్శించలేవు.

*

సౌందర్యారాధనా కాంక్ష వలన ప్రమాదము రాదు. ఈ ఆరాధన మహాలక్ష్మి యొక్క సర్వవ్యాపకమైన, వైభవోపేతమెన సౌందర్యమయితే సౌందర్యమే నీ నిరంతర వ్యాపారము కావలెను:

ఆత్మ సౌందర్యము
ఆవేదనలలో సౌందర్యము
భావములలో సౌందర్యము
చేష్టలలో సౌందర్యము
కర్మలలో సౌందర్యము

ఉన్న యెడల నీ యొక్క ప్రతి స్పందన, నీవు చేసే ప్రతి చేష్ట ఒక సౌందర్యాభివ్యక్తిగా అలరారుతూ వుంటుంది.

అందుకు దేవుని సహాయం నిరంతరం నీకు లభిస్తూనే వుంటుంది.

మూలం: శ్రీమాత

అనువాదం: ధారా రాధాకృష్ణమూర్తి

(*CWM* Vol. 12, p. 234)

శరీరం ద్వారా సౌందర్యాభివ్యక్తి

'శరీరం ఖలు ధర్మసాధనం' అన్నారు కదా! ఈ శరీరాన్ని ఆరోగ్యంగా, జవసత్వాలతో ఉంచుకోవాలి. ఈ శరీరం మనమనుకున్నంత కఠినమైనదేమి కాదు. దానిని కూడ మృదువుగా, సుకుమారంగా తీర్చిదిద్దవచ్చు. నీ మనస్సులో మొరటుతనము, దౌర్జన్యమూ ఏ కోశాన ఉండరాదు. అది సౌందర్యము, సౌహార్ధము వంటి సద్భావములతో నిండి ఉన్నప్పుడు శరీరం కూడా తదనుగుణంగా స్పందిస్తుంది. ఆ దివ్యలక్షణాలన్నీ శరీరంలో కూడా ప్రతిబింబిస్తాయి. — *సంపాదకుడు*

భౌతికదేహానికి కూడ సౌందర్యదృష్టి అలవాటు చెయ్యాలి. గాఢాభ్యసమైన ఆ భావన శరీరానికి సహజధర్మమైనప్పుడు అది కణాలను ప్రభావితం చేసి సౌందర్యాన్ని వ్యక్తం చేయగల సామర్థ్యాన్ని శరీరానికి కలిగిస్తుంది. శరీరం ఎంత సుతిమెత్తని పదార్థమో చాలామందికి తెలియకపోవచ్చు. కానీ ఒక విషయం మాత్రం మీరు గమనించే ఉంటారు. అంతర్గతంగా ప్రశాంత చిత్తము, సౌందర్యభావనలు, సద్భావము కలిగి, లోవెలుగును దర్శించినవారి ముఖాలలో కనిపించే కళాకాంతులు చెడు ఆలోచనలతో, చెడు ప్రవృత్తులతో జీవించే వారి ముఖాలలో మచ్చుకైనా కనిపించవు కదా! మానవుడు పశుప్రవృత్తితో జీవిస్తున్నప్పటి కంటే అది దాటి మానవత్వ పరాకాష్ఠను చేరినప్పుడు ఎంతో భిన్నమైన వర్చస్సుతో భాసిస్తాడు.

డాబు, దర్పం కోసం తమ అందాన్ని ఇనుమడింప చేసుకోవాలని ప్రయత్నిస్తే మాత్రం ప్రయోజనం కనిపించదు. ఆ సౌందర్యభావన లోనుంచి వచ్చినప్పుడు మాత్రమే అది శరీరంలో కూడా ప్రతిబింబించగలదు. అయితే ప్రతిక్షణం దుష్టసంకల్పాలు, దురాలోచనలు కలగకుండా జాగ్రత్తపడుతున్నట్లయితే క్రమంగా ఒక రకమైన సామరస్యం ఏర్పడి వారి రూపంలోనూ, ముఖకవళికల్లోనూ ప్రస్ఫుటమైన మార్పు వస్తుంది. అంతర్గత స్థితిని శరీరం వ్యక్తం చేసి తీరుతుంది.

కాని సాధారణంగా ఒకటి మరచిపోవడం జరుగుతుంది. ఏమిటంటే రోజుకి అయిదారు గంటలు మంచి చైతన్యస్థాయిలో వుంటే బానే వున్నానులే అనుకొంటావు. ఆ తర్వాత మళ్లీ పాశవికలక్షణాలకు లోబడి బాహ్యపరిస్థితుల కనుగుణంగా నడుచుకోటం ప్రారంభిస్తావు. అప్పుడు నీ వ్యక్తిత్వాన్ని దిగజారకుండా కాపాడగల పరతత్వాన్ని వేడుకోవాలనే విషయం పూర్తిగా మరచిపోతావు.

మూలం: శ్రీమాత

స్వేచ్ఛానువాదం: డా॥ ఎ. ప్రభావతి, డా॥ ఎ. వెంకటరామ శాస్త్రి

(*CWM* Vol. 4, p. 55)

అందమా! దైవాన్ని చేరే మార్గం నీవే

ఈ సృష్టి ఆనందంలోంచి వచ్చిందనీ మళ్లీ ఆనందమే దాని గమ్యమనీ, సౌందర్యానందములు ఈ సృష్టి లక్షణములని మన శాస్త్రాలు ఘోషిస్తున్నాయి. కాని మనకీ లక్షణాలు ఎక్కడా కనపడవే! అవును, ఈ సౌందర్యం పైకి కనపడేది కాదు. మనం అంతర్దృష్టిని అలవరచుకోవాలి. అప్పుడు మనలో దాగివున్న సౌందర్యతృష్ణ మేల్కొని సత్యాన్ని ఆస్వాదించటం నేర్చుకుంటుంది.

– సంపాదకుడు

చాలామంది విజ్ఞులు అందమైనవి. యోగ్యమైనవి ఒక్కటేనని అభిప్రాయపడతారు. ఇలాంటి భావన సరైనది కాకపోవచ్చునుగాని, సరైన దృక్పథంలో కనుక గమనించినట్లయితే, ఇది వట్టి సత్యమే కాదు, సృష్టికి మూలమైన సత్యమని కూడ తెలుస్తుంది. మన తత్వశాస్త్రం ప్రకారం, జగత్తు అంతా ఆనందంలో పుట్టి ఆనందంలోనే లయమవుతుంది. ఈ ఆనందాన్ని వ్యక్తపరచే పదత్రయము సంతోషము, ప్రేమ, సౌందర్యము అని చెప్పవచ్చు. సర్వజగత్తులోను, ప్రతిమానవునిలోను, జీవితంలోను, ప్రకృతిలోను దివ్య సౌందర్యాన్ని చూసి, ఆ చూసినదానిని ప్రేమించి, ఆ ప్రేమ సౌందర్యాలలో స్వచ్ఛమైన కల్తీలేని బ్రహ్మానందాన్ని పొందగలిగినట్లయితే, అదే మానవజాతి అంతా కలిసికట్టుగా భగవంతుని అందుకొనుటకు నిర్దేశింపబడిన మార్గమవుతుంది. కాని ఆ ఆనందము స్వచ్ఛమైనది, అమలినమైనది అయివుండాలి. స్వార్థపరమగు మనోవికారములతోను, వేదనాభరితములు దుఃఖపూరితములగు వాటితోను కలుషితము కారాదు. మన అవగాహనను, మన ఇంద్రియజ్ఞానాన్ని ప్రభావితం చేయు మంచిచెడులను, అందవికారాలను గ్రహించే జ్ఞానానికి బదులు, అఖండరసము, భేదరహితము, అసంక్షిప్తము అగు ఆనందమును అన్ని విషయములలోను ప్రతిష్ఠించాలి. మహోన్నత లక్ష్యమును చేరుటకు ముందుగానే యిది జరగాలి. ఈ లక్ష్యమును చేరే మార్గంలో స్వల్పసౌందర్యము స్థానే అత్యధిక సౌందర్యమును నిమ్నస్థాయి సౌందర్యమునకు బదులు ఉన్నతస్థాయి సౌందర్యమును అల్పసౌందర్యమునకు బదులు కులీనసౌందర్యమును ప్రతిస్థాపించగోరు క్రిందిస్థాయికి చెందిన అసంక్షిప్త సౌందర్యజ్ఞానము యొక్క ఆసరాను పూర్తిగా వినియోగించుకోవాలి.

మూలం: శ్రీఅరవిందులు

అనువాదం: అందగులపాటి కైలాసపతి, జానకి

(*SABCL* Vol. 17, pp. 237-38)

జీవిని, జీవితాన్ని సౌందర్యమయం గావించుట

అన్ని కళాప్రదర్శనశాలలను ప్రతి ఇంటిలోగిలి లోనికి కొనిపోవుట సాధ్యపడదు, కాని మన జీవితానికి సంబంధించిన అన్ని యేర్పాట్లు, మన ఇంటినుండే అన్ని గృహోపకరణాలు ఒక అభిరుచితో సమకూర్చబడి, సుందరమైనవి అయినప్పుడు, మన అలవాట్లు, ఆలోచనలు, భావాలు కూడ ఔన్నత్యము, ఔదార్యము ప్రతిబింబించునవిగాను, క్రమబద్ధమైనవిగాను, మాధుర్యము గౌరవ మర్యాదలు కలవిగా నుండుట అనివార్యమౌతుంది.

*

నీతినియమాలను రూపొందించుటలో, సౌందర్యదృష్టి చాలా ముఖ్యం. మనలోని ధర్మపరాయణత విశేషంగా మన ప్రవర్తనలో ప్రస్ఫుటమయ్యే రమణీయతయే అని, మనలోని పాపభీతి మన ప్రవర్తనలోని వికార వికృత స్వభావాలకు ప్రతీక అని, మనం సాధారణంగా గుర్తించలేము. అభివృద్ధి అందాన్ని, ఆనందాన్ని తిరస్కరించుటలో లేదు. నిమ్నస్థాయికి చెందిన సౌందర్యానందాల నుండి ఉన్నతస్థాయికి, అల్పపరిపూర్ణతనుండి అధిక పరిపూర్ణతకు ఎదుగుటలో వుంటుంది.

*

విశ్వప్రకృతి యొక్క అఖండ సౌందర్యముతోనే కాక దాని వివిధ రమణీయాకృతులతో కూడ సంపూర్ణ నిమగ్నత చెందియుండుట, మానవప్రకృతి యొక్క సంస్కరణకు మరియు దాని అణువు అణువునూ సుందరంగా తీర్చిదిద్దుటకు బలమైనశక్తిని కలిగివుంటుంది. దాని పరాకాష్ఠ స్థితిలో అది మానవ ప్రకృతిని పరిశుద్ధ పరచే ఒక మహోన్నత శక్తి.

మూలం: శ్రీఅరవిందులు

అనువాదం: అందుగులపాటి కైలాసపతి, జానకి

(*SABCL* Vol. 17, pp. 245, 240-42; Vol. 20, p. 495)

ఉత్తమోత్తమ సౌందర్య దర్శనమే భగవంతుని దర్శనం

అందమైన వస్తువులంటే అందరికి ఇష్టమే. ప్రకృతిని చూసి ఆనందించలేని వాళ్లెవ్వరైనా వుంటారా! అందరూ సౌందర్యారాధకులే. ఒక పువ్వు, విరగపూసిన వృక్షము, ఆకాశము, సముద్రము, ఒకటేమిటి సృష్టిలో ఎటు చూసినా అందచందాలు మనను ఆహ్లాదపరుస్తూనే వుంటాయి. అటులనే మన మనస్సు, ఆలోచనలు, హృదయస్పందనలు, శరీరవిన్యాసములు ఇవన్నీ కూడ దైవమును సౌందర్యము ద్వారా ఆరాధించుటకు సాధనములే. — *సంపాదకుడు*

దేనినైతే మనం సౌందర్యం ద్వారా అన్వేషిస్తున్నామో దానినే పర్యవసానంలో మతం ద్వారా అన్వేషిస్తున్నాము. అదే పరమమూ, దివ్యమూ అయినది. ఈ అన్వేషణ మొదట్లో రూపసౌందర్యాధనగా ప్రారంభమవుతుంది. ఇది భౌతిక ఇంద్రియాలను, ప్రాణికంలో ముద్రపడిన భావాలనూ, ప్రవృత్తులనూ, కాంక్షలనూ ఆకర్షించేదిగా మాత్రమే వుంటుంది. మనం ఈ ప్రయత్నం సాగిస్తున్న సమయంలోనే భావమయ సౌందర్యమంటే మనకు అవగమవుతుంది. భావోద్వేగాలు మేల్కొల్పబడతాయి. పరిపూర్ణ ప్రక్రియల అవగాహన, సమన్వయమూ, సామరస్యమూ సిద్ధిస్తాయి. వీటికి పూర్వరంగంగా మనలోని సౌందర్యాత్మ ఈ స్పర్శను, దర్శనాన్నీ, ఉత్తమ సౌందర్యం ప్రసాదించే ఉదాత్తానందాన్నీ, సర్వే సర్వత్రా అనుభవించగలగటం ప్రారంభమవుతుంది. దీనిని పొందడానికి మనకు అనేక మార్గాలున్నా ఇంద్రియాలుగానీ, ప్రేరణలుగానీ తమంత తాము మనకు దీనిని కలిగించ లేవు —ఎందుకంటే ఆ స్థితి ఇంద్రియాతీతమైనది గనుక. తార్కికతా, మేధస్సూ దీనిని సాధించే మార్గాలయినప్పటికీ, ఇది తర్కానికీ, మేధస్సుకూ అతీతంగా వర్తిస్తుంది. అయినా ఈ తెరల గుండానే ఆత్మలోనికి ప్రవేశించడానికి ప్రయత్నిస్తుంది.

ఇటువంటి సర్వే సర్వత్రా నిండియున్న దివ్యసౌందర్య భావన ఆ సౌందర్యం యొక్క ఆత్మ. దానియొక్క ఆవిష్కారమూ,

సౌందర్యం ఆత్మను స్పృశించనపుడు మాత్రమే కలుగుతాయి. ఇది ఒక పుష్పం యొక్క సౌందర్యమో, రూపం యొక్క సౌందర్యమో, ఒక పాత్ర యొక్క ఉదాత్తతకూ శక్తిసామర్థ్యాలకు సంబంధించినదో, చిత్రకారుడి కుంచె చిత్రించిన రేఖావిన్యాసమో, శిల్పియొక్క విన్యాస కౌశలమో, మానవుని మనసులో విరిసిన మెరుపులాంటి భావనో, సూర్యాస్తమయంలో వ్యక్తమయ్యే వర్ణశోభో, భీభత్స తుఫానులోని విధ్వంసక శక్తో ఏదో ఒకటి కావచ్చు – ఏదైనా మనలోని సౌందర్యదృష్టి నిస్సందేహంగా పరిపూర్ణమైన సంతృప్తి చెందుతుంది.

నిజానికిది మతసంబంధ సాధనల ద్వారా ప్రకృతిలోని, మానవప్రకృతిలోని, భావమయ జగత్తులోని, పరిపూర్ణ సౌందర్యాన్ని అన్వేషించటం భగవంతుణ్ణి అన్వేషించటమే అవుతుంది. ఎందుకంటే తను సృష్టించిన వివిధ రూపాలలో భగవంతుడు తానే గుప్తంగా దాగియున్నాడు గనుక! మనలో పెరిగే సౌందర్యభావనా, దానిని గురించిన అవగాహనా, అది కలుగజేసే సంతోషమూ, మనలోని సౌందర్య గ్రహణశక్తీ ఇవన్నీ ఈ దివ్యసౌందర్యాన్ని అన్ని రూపాల్లోనూ సృష్టి ప్రక్రియల్లోనూ గుర్తించేట్లు చేస్తుంది. దాని ద్వారా మనయొక్క బాహ్య అంతరంగిక జీవితాలను దర్శించగలుగుతాము. దీనివలన మన మనసులో సృజించుకున్న అత్యంత సౌందర్యమయుడైన భగవంతుని రూపాన్ననుసరించి మనల్ని తీర్చిదిద్దుకుంటాము. అప్పుడు మనలోని సౌందర్యారాధకుడు (aesthetic being) ఏ కార్యం కోసం జన్మించాడో అది నెరవేరినట్లే! అతడు దివ్యానందానుభవాన్ని అందుకునే స్థితికి ఎదిగినట్టే!

ఈ విధంగా పరమోత్తమ సౌందర్యాన్ని సర్వే సర్వత్రా దర్శించటం భగవంతుణ్ణి దర్శించటమే అవుతుంది.

దివ్యమైన సౌందర్యానికి రూపకల్పన చేసి, సృజించి దర్శింపజేయటమంటే, మన హృదయాల్లోని భగవంతుని రూపాన్నీ, శక్తినీ ఆవిష్కరించటమే అవుతుంది.

*

సౌందర్యాభిలాష నేరమేమీ కాదు. నిజానికి సర్వే సర్వత్రా వెల్లి విరిసే మహాలక్ష్మి సౌందర్యాన్ని, సౌకుమార్యాన్ని దర్శించటం చాలా గొప్ప విషయం. అది భోగలాలసత్వం కానే కాదు. ఈ విషయాల్లో మనమే మాత్రం అవకాశమిచ్చినా విపరీత అసహజ ధోరణులు చోటుచేసుకుంటాయి. మహాకాళి పట్ల కలిగిన భక్తి భావానుభూతిలో రాజసిక క్రోధమూ, హింసా మనలో ప్రవేశించి మనల్ని స్వాధీనపరచుకుని ప్రాణిక కక్ష్య లోనికి ప్రాకి తీవ్రమైన వాంఛలను రేకెత్తిస్తాయి. స్వంతం చేసుకుని అనుభవించాలనే కోరిక కలుగకుండా, ప్రాణికవాంఛల కతీతంగా, సౌందర్యాన్ని ఒక చిత్రకారుడు దర్శించినట్లు దర్శించాలి.

*

ఏ స్వరూపంలో వ్యక్తమైనా సౌందర్యానందాల్ని ఒకటిగా పరి గణించాలి. అది వసివాడని – శాశ్వత యవ్వనము, నిత్యత్వము, దివ్యసాన్నిధ్యము.

మూలం: శ్రీఅరవిందులు

భావనువాదం: ధారా రాధాకృష్ణమూర్తి

(*SABCL* Vol. 15, p. 135; Vol. 9, p. 143, 235-36)

సౌందర్య సీమలకావలి తీరం

మనకు కావలసినది దైవమే అయినప్పుడు, మనమా దైవమును ఒక అందమైన చిత్రమును చూసినప్పుడు, ఒక దివ్యప్రతిమను దర్శించినప్పుడు బాహ్యదృష్టిని దాటి అంతరంగిక నేత్రముతో చూసి రసానుభూతిని పొందగలము. – *సంపాదకుడు*

అందము ఆనందము వంటిది కాదు. ప్రేమ లాగా అదొక అభి వ్యక్తి, ఆనందస్వరూపం. ఆ రూపం ఆనందము యొక్క నిర్మాణం, దానితోనే అది తయారైనది. కనుక ఏ ద్రవ్యంతో అది నిర్మిం పబడినదో ఆ ఆనందాన్నే అందం కల్గిస్తుంది. సౌందర్య దర్శనం దృష్ట్యా ఆనందం రసరూపాన్ని ధరిస్తుంది. ఈ రసమంటే

సౌందర్య దర్శన స్పందనం — ఆ స్పందనమొక మనః ప్రాణ ప్రతి క్రియ మాత్రమే. ఆధ్యాత్మిక దర్శనం వేరే కోవకు చెందినది. అది పై రీతిగా మనః ప్రాణాల ప్రతిక్రియ కాదు. అదొక ప్రత్యేక స్ఫురణ; దర్శనం. అది సౌందర్యసీమలు దాటి చాలా దూరం పోతుంది. దాని చూపునకు విశ్వజనీన సౌందర్యం కన్పిస్తుంది. వస్తువు లోపలికి చూస్తుంది. ఇది సాధారణ నేత్రానికి అందనట్టిది. హృదయానుభవానికి అతీతమైనది. రసాన్ని, భోగాన్ని అతిక్ర మించి ఇంకా పైనున్న కేవలానంద సీమల్లోకి అడుగుపెడుతుంది. మనఃప్రాణశరీరాల ప్రతి క్రియారూపమైన రసానుభవం కంటె సాంద్రము — అగాధము — పూర్ణసంతుష్టి రూపంలో వుంటుంది. అది అంతటా ఏకత్వాన్నే దర్శిస్తుంది. సృష్టికంతర్గతంగా, ఆధా రంగావున్న ఆనందాన్నే అనుభవిస్తుంది. ఇవన్నీ మాటల కందని ఒక సౌందర్యానందాన్ని కల్గిస్తాయి. పరమేశ్వరుని ప్రేమను, వస్త్వంతర్గతమైన శాశ్వత సత్తా సౌందర్యాన్ని కల్గిస్తాయి. అది వస్తువుల సౌందర్యాన్ని కూడా చూస్తుంది. కాని ఆ చూపు మనస్సుది కాదు, భౌతికదృష్టి కందరానిది. భౌతికనేత్రానికి అందంగా కన్పించనిదానిని కూడా. అందంగా కన్పింప చేస్తుంది. నేత్రాలకు తోచే అందం ఇంకా విశాలంగా, అనంతంగా, మాటల కందని సౌందర్యంగా గోచరిస్తుంది. సర్వత్రా వున్న సౌందర్య మూర్తిని ఈ ఆత్మదర్శనం అందిస్తుంది. అది ఏకైక సత్తామాత్ర స్వరూపమైన దానియొక్క సౌందర్యం — పారమేశ్వరీయకమైన అందం. అదొక దివ్యానందలీలా తాండవం.

*

భగవంతుని దయవల్ల నా కనులు తెరుచుకొన్నవి. అందుచేత గ్రామ్య (vulgar) పదార్థాల్లో ఉదాత్తతను (nobility) చూచాను. జగుప్సలో రమ్యతను దర్శించాను. కురూపాల్లో వైభవాన్ని, నైచ్యంలో మహోదారతను చూచాను.

మూలం: శ్రీఅరవిందులు

అనువాదం: తుమ్మపూడి కోటీశ్వరరావు

(SABCL Vol. 9, p. 492; Vol. 17, p. 81)

నేటి భూలోక పరిస్థితులు

(ఓ సాధకుడు శ్రీమాత తనలో ఎప్పుడూ తప్పు లెన్ను తోందని వాపోయాడు. అతనికి శ్రీమాత యిచ్చిన జవాబు)

నే నెప్పుడూ ఎవ్వరిలోను తప్పు లెంచను! పక్షపాత బుద్ధి నాకు లేనే లేదు. కానీ నా దృష్టికోణమే వేరు. నా చైతన్యస్థాయి నించి నాకు ఈ భూమ్మీద సకల జీవరాసులూ, మానవజాతి, దాని మనస్తత్వము ఒక స్పందనల రాశి మాత్రమే. అది కూడా ఎక్కువ శాతం అసత్యం, అజ్ఞానం, అల్లకల్లోలం మేళవించిన తరంగాలే. అందులో క్రమక్రమంగా వృద్ధిపొందుతూ, అవరోధాలని అధిగ మిస్తున్న సత్యం, సామరస్యం, సయోధ్యలు పై స్థాయినించి ప్రవ హించడం గమనిస్తాను. ఆ స్థాయినించి చూస్తుంటే, అహంభావా నికీ, స్వార్థానికీ, మిథ్యా పొరల్లో కూరుకున్న వేర్పాటుభావానికీ తావే లేదు అన్నారు.

అసలేది మంచో, ఏది చెడో తెలియని గందరగోళస్థాయిలో యింకొంచెం గందరగోళం జోడయినప్పుడు నేను వీలున్నంత వరకు కొంత ప్రశాంతత తీసుకురావడానికి కావలసిన శాంతి తరంగాలని పంపుతాను. ఇటువంటి సమయాల్లో ఎవ్వరికీ ఎటు వంటి దెబ్బ, హాని కలగదు కానీ వాళ్ల అహంవల్లో, మూర్ఖత్వం వల్లో వాళ్లు, ఏ అజ్ఞానానికీ, అల్లకల్లోలానికీ, భిన్నత్వానికీ వత్తాసు పలుకుతున్నారో, దానికి దెబ్బ తగులుతుంది మరి!

నిజానికి మీరు స్వతఃస్సిద్ధంగా, సహజంగానే సత్యం వైపే వుంటారని నా గట్టి నమ్మకం. పైగా ఈ విషయాల్లో ఒకరు తప్పు ఒకరు ఒప్పు అనేది వుండదు – వారి వారి మూర్ఖత్వాన్ని బట్టి అసత్యాన్నీ, అజ్ఞానాన్నీ ఎంతవరకూ పట్టుకుని వేళ్లాడుతున్నారో అంతవరకూ వారు దోషులే.

మూలం: శ్రీమాత

అనువాదం: బి. వరలక్ష్మి

(*CWM* Vol. 17, pp. 241-42)



Harmony

Let us work for the day when this will become both the means and the end.

(Spiritual significance & explanation given by the Mother)

Botanical name : Antigonon — several colours

సామరస్య తరంగాలు

సాధారణంగా మనం అనుకున్న దానికంటే తరచుగానే ఇలా జరుగుతుంది – ఒక దుర్ఘటన జరుగుతుంటే కలుగజేసుకొని తప్పించే సమరస తరంగాలు. ఒక రుగ్మత నివారణ జరిగినా, ఒక ప్రమాదం తప్పిపోయినా దానికి కారణం ఆ సమరస తరంగాల ప్రభావమే. భూమండలానికి జరిగే ఉత్పాతాలు కూడా ఇలాగే తప్పుతూ ఉంటాయి. అంటే క్షుద్రతరంగాలు వ్యాపిస్తున్నప్పుడు సామరస్య తరంగాలు వాటిని అడ్డుకోవటం సంభవిస్తుంది. అందువల్ల భగవంతుని నమ్మేవారు ఎప్పుడూ "భగవంతుని దయవల్ల అంతా సవ్యంగా జరిగింది" అనుకోటంలో తప్పు లేదన్న మాట.

ఒక ఉదాహరణ యిస్తాను. శ్రీఅరవిందుల వద్ద వున్న అతిమానసశక్తితో ఆయన కొంతమంది రోగులకు బాధోపశమనం చేసేవారు. అది దైహిక సంబంధమైనదైనా సరే ప్రాణికమైనా లేక మానసికమైనదైనా సరే వారు సామరస్య తరంగాలను, అంటే అతిమానసశక్తిని ఆ దోషమున్నచోట కేంద్రీకరింపచేసే వారు. అది వెంటనే పని చేసి పరిస్థితిని చక్కబరచేది. వారు ప్రయోగించిన శక్తివల్ల ఏర్పడిన సామరస్య తరంగాలు మామూలు సామరస్య తరంగాల కంటే ఎక్కువ శక్తివంతమైనవి. అందువల్ల అది ఆ రుగ్మతపై మామూలు వైద్యాల కన్నా ఎంతో మెరుగ్గా పనిచేసి పరిపూర్ణ నివారణ కలిగిస్తుంది.

మూలం: శ్రీమాత

అనువాదం: డా॥ ఎ. ప్రభావతి, డా॥ ఎ. వెంకట్రామ శాస్త్రి

(*CWM* Vol. 10, pp. 192, 161)

సమన్వయం

సమన్వయమనగా సర్వమూ ఏకమాత్ర సత్యంతో ఏకీభవించ టమే.

*

సృష్టిలో భావాదులు, చైతన్యస్వరూపాలు, జీవభూతాలు తమ సంస్కారాన్ని అనుసరించి ఇతర రూపాదులతో సహజీవనం కొనసాగిస్తూనే తమ ప్రత్యేకతను నిలుపుకుంటూ వ్యవహరించటం కద్దు. ఈ పరిస్థితిలో సమతుల్యతా, సమన్వయాదులకు ఆస్కారం కనుపించదు. ఈ విభిన్న తత్త్వాలతో, ఏకత్వసాధనమే లక్ష్యంగా, పరస్పర అవగాహనతో ఏకత్రాటిపై ముందుకు సాగిపోవటమే సమన్వయ సూత్రము.

*

భిన్నత్వంలో ఏకత్వమే ఈ సృష్టి వైచిత్రి. ఇందుకు సమన్వయ సూత్రమే మూలము. నిజానికి అవ్యక్తమైన శూన్యచైతన్యంలో (pure and blank unity) సామరస్యపరిచేందుకు ఏమీ ఉండదు. భిన్నత్వమే కూడగట్టుకొన్నప్పుడు కూడా, ఆ దురవగాహన ప్రాబల్యంలోనే, అంతర్గతమైన సమన్వయ సూత్రమేదో ఉండి తీరాలి. భిన్నత్వమంతా ఏకత్వంగా భాసించిన సత్యస్వరూపంలో ఈ సమన్వయ సూత్రం నిత్యనూతనంగా ప్రకాశిస్తూనే, భిన్న భిన్న చైత్యస్వరూపాలతో బాహ్యాసంబంధాలను, అంతర్గతంగా ప్రభావితం చేస్తూ భాసించటం విశేషం.

మూలం: శ్రీఅరవిందులు
అనువాదం: శ్రీ శరణ్

(*SABCL* Vol. 23, p. 560; Vol. 18, p. 285; Vol. 19, pp. 1040-41)

విశ్వంలో సామరస్యం – నేటి పరిస్థితి


ఈ బ్రహ్మాండంలోని వస్తువులన్నీ పరస్పర సహజీవనం కొనసాగిస్తూ ఉంటాయి – అలా కాకపోతే అది ఎప్పుడో ఛిన్నాభిన్నం అయి ఉండేది. అయితే పాక్షికంగానో, ప్రముఖంగానో వైరుధ్యాల్లోంచి పుట్టిన సంగీతంలో శ్రుతిలయలు ఉన్నట్లే, ప్రపంచంలో కూడా వస్తువులు ప్రత్యేకంగా తమ తమ స్థానాల్లో భిన్న స్వరాలుగానే ఉంటాయి. ప్రతీ వస్తువూ మరొకదానితో చాలా వరకు విభేదిస్తూనే ఉంటుంది. అయితే ఈ విభిన్న లక్షణాలు కలిగిన వస్తువుల వెనుక దివ్యశాసనం అంతర్లీనంగా ఉండడం వల్ల మొత్తం ప్రపంచం అంతా ఆ శ్రుతిలో తన రాగం కూడా కలుపుతూ ఉంటుంది. విశాల విశ్వ దృక్పథంతో తిలకించేవారికి ఇది అవగతం అవుతుంది. ఈ సామరస్యం పరిణామంలోను, ప్రగతిలోను ఉంటుంది.

మొత్తం ఈ విశ్వం అంతా కలిసి గమ్యం చేరుకోవడానికి ప్రయత్నం చేస్తోంది. ఆ గమ్యాన్ని ఇంకా చేరుకోలేదు. ఆ గమ్యాన్ని చేరుకోడాన్ని త్వరితం చేయడమే యోగం. ఒకసారి గమ్యం చేరుకున్నామా ఇక భిన్నస్వరాలు ఉండవు. అప్పుడు అంతా సుస్వరాల సంగమమే. వైరుధ్యం నుండి పుట్టిన సామరస్యం ఉండదు. ప్రస్తుతం ఉన్న దృశ్యానికి వివరణ ఇదే.

మూలం: శ్రీఅరవిందులు

అనువాదం: పున్నమరాజు నాగేశ్వరరావు

(*SABCL* Vol. 23, pp. 1082-83)



అస్తిత్వము – సమన్వయము

ఈ సృష్టిలోని నిత్యజీవనం గమనిస్తే ప్రతి యొక ఘటన అన్నిటి యందూ ముఖ్యపాత్ర పోషిస్తుందని మనము గమనించవచ్చును.

లోతుగా పరిశీలిస్తే అస్తిత్వమంతా సమన్వయ సూత్రానికి సంబంధించినదేనని తెలుస్తున్నది. అపరిష్కృత వైషమ్యాల యందు దాగియుండి, మనము తెలుసుకొనలేని ఒకానొక సమన్వయ లక్షణం వాటియందే ఇమిడిపోయి యుండటము మనము నిత్యము చూస్తున్నాము. ఈ విభేదాలతో నిత్యజీవనం సాగించటమే వివేక లక్షణం కానేరదు. జ్ఞానికి ఈ సర్దుకొనిపోయే లక్షణం అంగీకారం కాదు. అంతే కాదు. పూర్తిగా ఏకత్వాన్ని స్పృశించని మధ్యే మార్గం అవలంబించటం జ్ఞానికి ఆమోదయోగ్యం కాదు. ఇందుకు కారణము సర్వత్రా సమన్వయ సాధన, సమతుల్యతా గ్రహింపు, సృష్టికి ఆయువు పట్టు. ఈ వైషమ్యాలు, భేదాభిప్రాయాలు విజృంభించి సామరస్య సాధన దుర్లభమైనప్పటికీ, సమన్వయసూత్ర భావన మరింత బలపడి, సులువుగా పరిష్కరించుకొని లక్ష్యం చేరుకోవచ్చును.

మూలం: శ్రీఅరవిందులు
అనువాదం: శ్రీశరణ్

(*SABCL* Vol. 18, p. 2)

ఆధ్యాత్మిక జీవితము – ఇతరులతో సామరస్యము

ఆధ్యాత్మిక జీవితంలో ఇతరులతో సామరస్యం కలిగి ఉండటం అనేది మానసిక లేదా ప్రాణిక సంబంధాల మీద కాక దివ్యచైతన్యంలో, దైవంతో ఏకమవ్వడం ద్వారా నెలకొల్పబడాలి. తాను దైవాన్ని అనుభూతి చెందుతూ, ఇతరులు అదే దైవంలో ఉన్నారని భావిస్తున్నప్పుడే నిజమైన సామరస్యం నెలకొంటుంది. అంతవరకు అందరూ అమ్మ బిడ్డలే అని, అందరిదీ ఒకే దివ్యలక్ష్యం

కదా అన్న సుహృద్భావంతో ఉండాలి. నిజమైన సామరస్యత చైత్యాధారితము (psychic) లేదా ఆధ్యాత్మిక పునాది పైన స్థాపిత మౌతుంది.

*

వ్యక్తుల వల్ల జరిగే తప్పులు వాళ్ళలోని అహాన్ని, వాళ్ళ వ్యక్తిగత యిష్టాయిష్టాల్ని ప్రతిబింబిస్తాయి. అహంకార ధోరణి వాళ్ళ సౌకర్య సదుపాయాలు, అంతా తనది చేసుకోవాలనుకునే వైఖరి, దంభాదులన్ని పనిని పాడుచేస్తాయి. నిజానికి పని 'అమ్మది' అని భావిస్తూ చేయడమే సరైన పద్ధతి. ఒక నీ పని మాత్రమే కాదు. ఇతరుల పని కూడ అంతే అని పని చేస్తే సహజమైన సామరస్యం నెలకొంటుంది. బాహ్యానిబంధనలవల్ల, కేవలం బాహ్య నిర్వహణవల్ల సామరస్యత రాదు. దానిలో ఆంతరిక సమత్వం ఉండి ఉండాలి. లేకపోతే ఎప్పుడూ గొడవలు, ఘర్షణలు జరుగుతూనే వుంటాయి.

*

ప్రశ్న: సమత్వమనేది కేవలం బాహ్యానిర్వహణ ద్వారా కుదరదు. ఆంతరిక సామరస్యత ఉండి వుండాలి. లేకుంటే ఎప్పుడూ, ఘర్షణలు, అవకతవకలు ఏర్పడతాయి అని వ్రాసారు. ఆ ఆంతరిక సామరస్యత అంటే ఏమిటి?

అమ్మలో ఏకమవడం.

మూలం: శ్రీఅరవిందులు
అనువాదం: హర్షవర్ధన్

(*SABCL* Vol. 23, p. 814; Vol. 25, pp. 262-63)

సామరస్యము – మన యోగలక్ష్యము

మనిషిలోని విభాగములు ఒక్కొక్కటి ఒక్కొక్కవైపు లాగుతూ ఉంటాయి. వాటిని మైత్రిభావముతో పరస్పరము సహకరించుకొనునట్లు చేయవలెను. ఈ పనిచేయుటకు మేధస్సు, ప్రాణికము ఎందుకు పనికిరావు. అంతర్ముఖంగా మాత్రమే అది లభిస్తుంది – పరమ సత్యంతో సమన్వయం సాధించే ఒక నైజము ఆ విభాగము లన్నిటిలోనూ ఉంటుంది. నిర్వాణంలో కూడా ఒక నైజ మున్నది. నిర్వాణం అంటే మరేమీ కాదు. ఆత్మ సాధించిన శాంతి – స్వేచ్ఛ. అది ప్రపంచంతోనూ ప్రపంచవ్యవస్థ లేదా అవ్యవస్థ తోనూ నిమిత్తం లేకుండా తనలోనే ఉంటుంది. భగవంతుని కోసం హృదయార్తి, భక్తిలో కూడా ఒక నైజం ఉంది. అదే దివ్యప్రేమ, ఆనందానికి సంబంధించిన సత్యం. తపస్సు చేయాలనే సంకల్పం లోనూ ఒక సత్యం ఉంది. అది తన అంగములపై ఆత్మ యాజమాన్యానికి సంబంధించినది. గాయకుడు, కవి, ఒక సత్యాన్ని చూస్తారు. సౌందర్యం ద్వారా పరమాత్మను ఆవిష్కరించే సత్యం అది. మానసికంగా అంగీకరంచేవారూ, సందేహించే వారి వెనుక ఉందొక సత్యం. అసత్య రూపాలను తృణీకరించే సత్యం అది. ప్రాణిక వ్యక్తిత్వాలు రెంటి వెనుకా ఉందొక సత్యం. ఆంతర, బాహిర లోకాల మీద అహంకారం కాకుండా పరమాత్మ యాజమాన్యము. ఈ సామరస్యాన్నే యోగం ప్రతిబింబిస్తుంది. కాని దీన్ని బాహిరనియమాల ద్వారా సాధించలేం. అంతర్ముఖులై చైత్య, ఆధ్యాత్మిక కేంద్రం నుండి వీక్షిస్తూ, సంకల్పిస్తూ, క్రియాశీలమైనప్పుడే దీన్ని సాధించవచ్చు. అందులోనే ఉంది ఆత్మపరమైన సత్యం – సామరస్య రహస్యం.

మూలం: శ్రీఅరవిందులు

అనువాదం: మాడభూషణం రాజగోపాలాచార్య

(*SABCL* Vol. 22, pp. 53-54)

నిరంతరాభివృద్ధి

శ్రీమాతారవిందుల నుంచి మనకు సంక్రమించిన జ్ఞానభాండారంలో మన ప్రశ్న లన్నింటికి సమాధానాలు దొరుకుతాయి. కేవలం ఆధ్యాత్మిక ప్రశ్నలే కాకుండా లౌకిక సమస్యలకు కూడాను. ఈ సృష్టి పరిణామశీలమైనది. ఒకే చోట చతికిలపడి కూర్చోదు, శిథిలమైపోదు. అదెప్పుడూ నిత్యకళ్యాణం పచ్చతోరణమే! ఈ విషయం స్థూలదృష్టికి తెలియకపోవచ్చు. కాని మార్మిక నేత్రానికి గోచరమవుతుంది. నాటి సృష్టికంటే నేటి సృష్టి అందమైనది. రేపు ఇంకా అద్భుతంగా పరస్పర సామరస్యంతో అలరారుతూ వుంటుంది. మన మెంత అదృష్టవంతులం!

– సంపాదకుడు

వస్తువులు తమ తమ స్థానాల్లో లేవు అనే ఆలోచన నాకు చాలా పసివయస్సులోనే అనిపించింది. దానిని గురించిన వివరణ మాత్రం నాకు ఆ తరువాత తెలిసింది. నాకు మంత్రవిద్యను నేర్పిన వ్యక్తి దాన్ని గురించి వివరించాడు.

ఆయన అంటారు కదా! సమతుల్యతకు (Equilibrum) ప్రతీకగా నిలిచిన ఈ విశ్వం స్తబ్ధము కాదు. ప్రగతిశీలము. వివరంగా చెప్పాలంటే – ప్రతి వస్తువూ తన స్థానంలో తనదైన స్పందన, తనదైన గమనం కచ్చితంగా కలిగి ఉంటుంది. ప్రతీ వస్తువూ తన స్థానంలో సరిగ్గా ఉంటూనే మొత్తం విశ్వంతో సంబంధం కలిగి ఉంటుందన్న మాట.

శ్రీఅరవిందులు ఈ విషయాన్నే చెప్పారు. ఏదీ చెడ్డది కాదు. అయితే ఏదీ తన స్థానంలో ఉండడం లేదు. తన కాలంలోనూ, ఈ విశ్వంలోనూ కూడా ఉండడం లేదు. ఈ లోకాలు, ఈ నక్షత్రాదులు దగ్గర్నుంచి ప్రతీ వస్తువూ, తన స్థానంలో కచ్చితంగానే ఉంటోంది. పెద్ద పెద్ద లోకాల నుండి సూక్ష్మాతిసూక్ష్మ అణువు వరకు మొత్తం అంతా దివ్యత్వాన్ని ప్రగతిపథంలో వ్యక్తం చేస్తూనే ఉంటుంది. ఈ విశ్వంపై ఈ సృష్టి సర్వం దివ్యలోకం పరిపూర్ణమేనని శ్రీఅరవిందులు ప్రవచించే సత్యం దీనిపైనే

ఆధారపడి ఉంది. శ్రీఅరవిందులు దానిని అతిమానసము అన్నారు. అది ఆవిర్భావం కాగలదు. సమతుల్యత అనేది సృష్టికి అత్యంత అవసరమైన ధర్మం. కనుకనే పరిపూర్ణత అనేది అతిమానసము ఆవిర్భావమైనప్పుడే సాధ్యమౌతుంది.

మూలం: శ్రీమాత

అనువాదం: పున్నమరాజు నాగేశ్వరరావు

(*CWM* Vol. 10, pp. 107-08)

మహాలక్ష్మి ఆగమనము

మనస్సు, జీవుడు, ఆత్మ — ఈ మూటి సామరస్యం, సౌందర్యం, ఆలోచనలు, భావాల్లో అందం, ప్రతి బాహ్యాకర్మలోను, చర్య లోను, సామరస్య సౌందర్యాలు, జీవితంలో, పరిసర వాతావర ణంలో, సామరస్యమూ, సమత్వం, సౌందర్యం — అనుష్ఠేయాలు, ఉపాస్యాలు. అనుష్ఠించి ఉపాసించకపోతే — ఆమె సాన్నిధ్యం అలభ్యం. ఎక్కడ ప్రేమ పద్మం వికసిస్తుందో, సౌందర్యవల్లి మారాకు తొడుగుతుందో, అక్కడ ఆ తల్లి కాలూని నిలుస్తుంది. అవి ఏమాత్రం క్షుద్రభావ స్పర్శ పొందినా ఆమె అక్కడ నిలు వదు.

శ్రీఅరవిందులు (*The Mother*, p. 31)

పరిసరాలు, వాతావరణం. పరిస్థితులు, జీవనవిధానం, అన్నిటి కంటె నీ అంతరాలోచనలు — ఇవన్నీ క్షుద్రంగా వుంటే స్థూలంగా, అహంకారపూరితంగా, అవినీతి కాలవాలంగా వుంటే — అక్క డకు ప్రేమదేవత ప్రవేశించదు. అసలామె అవతరించదు. సౌంద ర్యానికి గుడి కట్టి ఆరాధించకపోతే ఆమె నిలువదు. నేనిలా అంటున్నానంటే ఇల్లు, వాకిలి, కుర్చీలు, మేజాలు, అలంకరణ సామగ్రిని గూర్చి చెప్పటం లేదు. నీ లోపలి భావనలు, మనస్పం దనలు — నీలోని ఉదారదృష్టి, ఉదాత్త ఆలోచనలు, నిస్వార్థ

మనస్కత – సమతా సామరస్యపూరితములు కాకపోతే ప్రేమావి ష్కారం జరుగదు. అది జరగాలంటే నీవు పవిత్రంగా, పరిశుద్ధంగా వుండాలి. కానీ ఆమె నీ లోనికి రావటం ప్రారంభించగానే నీచ భావ సంపర్కం జరుగుతుంది. వెంటనే ఆమె నీ లోగిలిలోకి తొంగి చూడదు సరిగదా – చూడక వెనుతిరుగుతుంది. ఆ ఛాయల్లోకి మరల రాదు. ఇదే శ్రీఅరవిందులు అంటున్నది – "ఆమె అవత రించటానికి ఇష్టపడదు" అని. కానీ లోకమంటుంది "ప్రేమ తమను వంచించిందని" అది వారి తప్పేగాని ఆమెది కాదు. వారీ ప్రేమలో అసహ్యా నీచ అధార్మిక భావాలారోపిస్తారు. స్వార్థం, అవినీతితో కలిపి ఆస్వాదిస్తామనుకొంటారు. పాపం – ఆ పిచ్చిది అక్కడకు రానే రాదు. వారామెను హింసిస్తారు. దానితో ఆమె చిక్కి కృశించిపోతుంది. ఆమె ఏం చేస్తుందిక? పారిపోక. అందు కని లోకమంటుంది "ప్రేమ నిలకడ లేనిది" అని. నిజానికి వీరి హృదయసీమ అపరిశుభ్రంగా వున్నా ఆమె తమలో కాలుపెడు తూనే వుంటుంది. ఇది గుర్తించి కృతజ్ఞులు కావటానికి బదులు అలా దోషారోపణ చేస్తారు!

శ్రీఅరవిందులు మహాలక్ష్మిని గురించి ఇలా అన్నారు కూడ." దరిద్రత[1] లోకి ఆమె తొంగిచూడదని".

ఔను. ఔదార్యం, కరుణ, ఉత్కంఠ, హృదయవైశాల్యం, ఆంతరైశ్వర్యం – ఇలాంటి ఉదాత్త గుణసంపద లేని ఎండివాడి రాలిపోయిన చోటికి 'మహాలక్ష్మి' ఎలా రాగలదు? ఆమె నడిచే దారిలో అవన్నీ రాళ్ళు, రప్పలూ, ముళ్లూ నయ్యె. నీ సంపదను గురించి కాదు వారన్నది. గొప్ప కోటీశ్వరుడు కూడా మనస్సులో బిచ్చగాడు కావచ్చు. ఆమె దృష్టిలో పేదవాడు హృదయవైశాల్యం కలవాడైతే ధనికుడు క్రిందే లెక్క..!

దరిద్రుడంటే – ఏ గుణాలు, లక్షణాలు లేనివాడు శక్తి సామర్థ్యతలు లేనివాడు, దయాదాక్షిణ్యాలు లేనివాడని అర్థం. వాడు

---

[1] ఇక్కడ దరిద్రత అనగా డబ్బు లేకపోవడం కాదు .. బుద్ధి, గుణములకు సంబం ధించిన విషయము.
– సంపాదకుడు

నిజంగా అసంతృప్తి, దుఃఖాల్లో బ్రతుకుతుంటాడు. విశాలదృష్టి లేని బ్రతుకు ఏమి బ్రతుకది? వాడి కంటే పేదవాడెవ్వడు? అవే కనుక వుంటే – వాడి కంటె ఐశ్వర్యవంతుడెవ్వడు? తమలో తాము ముడుచుకొంటూ లోకాన్నంతా కబళించాలనుకొంటూ తమ వైపుకే దాని నాకర్షించే ప్రయత్నం చేయటం, తమ దృష్టితో లోకాన్ని చూచి అన్వయించుకోవటం – ఇదీ దుఃఖాన్ని కలిగించే అంశం. వాడే నిజానికి బిచ్చగాడు. కానీ నిన్ను నీవు ఉదార బుద్ధితో అర్పించుకో – ఏ ఆలోచనా, స్వార్థం లేకుండా – అంత కంటె ఆనందమేముంటుంది? అంతా నాదే, నాకే కావాలనుకోవ టమే దుఃఖహేతువు. తనను తాను అర్పణం చేసుకొన్నవాడే నిజా నికి ధన్యుడు. లక్ష్మీపుత్రుడు. సౌందర్యమూర్తి

మూలం: శ్రీమాత

అనువాదం: తుమ్మపూడి కోటీశ్వరరావు

(*CWM* Vol. 4, p. 403-405)

ధనము పట్ల మన వైఖరి

నీకు దేవుడు కావాలంటే డబ్బును నిరసించనవసరం లేదు. ధనము కూడ దైవానికి చెందినదే. ధనశక్తి దైవముయొక్క ఆయు ధమే. ఇంతవరకు ఈ విషయాన్ని గుర్తించనందువల్లనే ధనము అసురుల చేతుల్లో వుండిపోయింది. కాని మనకిప్పుడు తెలుసు కదా – మన మిప్పుడు కళ్లు తెరచుకొని దానిని తిరిగి యథా స్థానానికి జేర్చెదము గాక! *– సంపాదకుడు*

ఒకానొక విశ్వజనీన శక్తికి ధనము ప్రత్యక్షరూపము. లోక మున నీ శక్తి వ్యక్తమయినపుడు దాని ప్రభావము అన్నమయ ప్రాణమయ కోశములపై గానబడును; బాహ్యాజీవన పరిపూర్ణత కయ్యది అపరిహార్యము. దాని యుత్పత్తియు, వ్యాపారమును దివ్య ములే. అయినను, ఈశ్వరుని యన్ని శక్తుల వలెనే యదియు నీ లోకమున నియుక్తము. అథః ప్రకృతి గతమగు నజ్ఞానక్షేత్రమున

అహంకార ప్రయోజనములకై యది యపహృతము కావచ్చును; ఆసురిక శక్తులకు జిక్కి తత్కార్యములకై వినియుక్తమైనను కావచ్చును. మానవాహంకార పక్షమునకును, అసురపక్షమునకును విశేషాకర్షణముగల శక్తిత్రయములో అర్థమొకటి; తక్కినవి అధికార కామములు. ఏ తచ్ఛక్తిమంతులు సామాన్యముగా వీనిని చక్కగా గ్రహించి సద్వినియోగము చేయరు. అర్థాన్వేషకులు, అర్థ సంగ్రహీతలు తరచుగా అర్థవశవర్తు లగుచున్నారే కాని దానిని నిగ్రహింపజాల కున్నారు. ఆసురసంపత్తి గలవారు చిరకాలము ధనమును హస్తగతము చేసికొని దుర్వినియోగము చేయుచుండుటచే, తద్వికృత ప్రభావమునుండి తప్పించుకొనువారు కొలది మందియే. కావుననే ఆధ్యాత్మసాధనలన్నియు ఆత్మనిగ్రహము, సర్వసంగపరిత్యాగమును, ధననిరాకరణమును ప్రధానముగా బోధించుచున్నవి; లేదా నియమించుచున్నవి. కొందరు ధనమును, సంపదలను నిషేధించి, పేదరికమును, అకించనత్వమును (రిక్తత్వమును) ఆధ్యాత్మమార్గమున కత్యంతావశ్యకములని ఘోషించుచున్నారు. ఇయ్యది భ్రమాత్మకము. దీని ననుసరించుటచే విరుద్ధశక్తులు ప్రబలములగును. భగవానుని సంపదను భాగవత జీవికకై యుద్ధరించి, ఈశ్వరార్పణబుద్ధితో వ్యవహరించుట సాధనకు అతిమానసమార్గ మగును.

ధనశక్తి నుండియు, తచ్ఛక్తి యొసగు భోగ్యవస్తువుల నుండియు, తదుపాయముల నుండియు విరాగివలె నీవు వైముఖ్యము వహింపరాదు; వానియెడ రాజసికరక్తి పూనరాదు; సంతుష్టిలోలుడవై వాటికి దాసుడవు కాగూడదు; జగజ్జననికై యర్థము నుద్ధరించి మాతృసేవార్థమే వినియోగింపదగిన శక్తిగా భావింపుము.

సమస్త సంపదయు భగవానునిదే. సంపన్నులు తద్ధర్మకర్తలేగాని యజమానులు కారు.

మూలం: శ్రీఅరవిందులు
అనువాదం: శ్రీ శివశంకరానంద

(*SABCL* Vol. 25, pp. 11-12)

సమాచారపత్రం

16 అక్టోబరు నాడు దేశవ్యాప్తంగా అందరూ లక్ష్మీపూజ పండగ చేసుకుంటారు. అందుకని ఈ నెల 'అఖిల' కూడా 'మహాలక్ష్మి' ని గురించిన ప్రత్యేక సంచికగా ప్రచురిస్తున్నాము. ఆమె లక్షణములైన సౌందర్య సామరస్యములను మనం మనస్సుతో, ఆత్మతో కోరుకున్నంత మాత్రాన సరిపోదు. మన సమస్తమైన ఆలోచనలు, సర్వభావములు, చేష్టలు, జీవితము, పరిసరాలన్నిటిలోను ప్రతిబింబించుకోవాలి.

నవంబరు 2005 లో సొసైటీ బీచ్ ఆఫీసులోని కార్యక్రమములు:

1) 21-23 తేదీలలో సొసైటీ స్త్రీల విభాగమువారు 'దైవానుగ్రహము' అను విషయముపై ఒక సదస్సును నిర్వహించెదరు.

2.) 26 నవంబరు నుండి 4 డిసెంబరు వరకు శ్రీఅరవిందుల గీతావ్యాసములపై డా॥ మంగేష్ నడ్కర్ణిగారు స్వాధ్యాయ శిబిరమును నిర్వహించెదరు.

నవంబరు, డిసెంబరు మాసములలోని పర్వదినములు

17 నవంబరు: శ్రీమాత మహాసమాధి జరిగిన రోజు.

20 నవంబరు: శ్రీమాత భౌతికకాయమును సమాధి చేసిన రోజు.

24 నవంబరు: సిద్ధి దినము.


5 డిశంబరు: శ్రీఅరవిందుల దేహత్యాగము చేసిన రోజు.

9 డిశంబరు: శ్రీఅరవిందుల భౌతికకాయమును సమాధి చేసిన రోజు.

శ్రీఅరవిందో సెంటరు ఆఫ్ ఎడ్యుకేషన్‌వారి వార్షికోత్సవములు:

1) 1 డిశంబరు ఆశ్రమ ప్రదర్శనాలయంలో సాంస్కృతిక కార్యక్రమములు.
2) 2 డిశంబరు: ఆశ్రమ క్రీడాంగణములో వ్యాయామ విన్యాసములు.

జీవిత పరమార్థం



Flower: Life energy

అఖిల

అఖిల భారత పత్రిక, నవంబరు 2005

విషయసూచిక

జీవితాదర్శము ... 3

అంధకారంలోంచి బయటపడండి ... 4

ఊర్ధ్వ పరిణామము ... 7

భూలోక జీవితం – అభివృద్ధికి మార్గము ... 8

నీ ప్రత్యేకమైన పాత్ర ఏమిటో తెలుసుకోవాలి ... 12

మనిషిలోని పరస్పర వైరుధ్యాలు ... 15

దైవావిర్భావానికిగల ఆటంకాలు –
మనం సాధించవలసిన కార్యము ... 16

జీవనలక్ష్యం సుఖమేనా? ... 18

సృష్టికి గమ్యం నిర్వాణం కాదు ... 20

భువనజీవన పరమావధి ... 22

మానవుని యథార్థ ఆరామం ... 26

కొన్ని దీపికలు ... 27

అనుబంధం

సత్యాధిరోహణ (జీవనలీల) ... 29

ఓ నూతన ప్రపంచానికి ఆవిష్కరణ జరిగింది ... 41

విజయానికి సోపానము ... 44

సమాచార పత్రం ... 45

ఉపోద్ఘాతము

అసలు వారసుడిని బందీచేసి ఒక దుర్మార్గుడు తనే రాజని చలామణి అయిన ఉదంతాలు మనం వింటూనే వుంటాము. మానవ జీవితానికి కూడ ఇది వర్తిస్తుంది. మనిషి తనని తనే మోసపుచ్చుకుంటాడు. తనలోని నైజాన్ని విస్మరించి తప్పుదారి పట్టించే సేవకుల (ఇంద్రియాలు) మాట వింటాడు. నీలోని ఆత్మయే రాజన్నమాట. జీవితమే నీ రాజ్యము. ఆ రాజ్యాన్ని రాజు కప్పజెప్పటమే నీ కర్తవ్యము. ఆ కర్తవ్యపాలనలో జీవితంలోని ప్రతి నిమిషము, నీకు ఎదురయ్యే ప్రతి సన్నివేశము 'నీ పని పడతానుండు' అని నిన్ను సవాలు చేస్తూంటుంది. అంతేకాదు. నీ మనస్సు కూడ నక్షత్రకుడల్లె నిన్ను వెంటాడుతూంటుంది. ఆ కర్తవ్యంతో పోలిస్తే నీ జీవితమెంత చిన్నది? అందుకని నువ్వు ఒక్క నిముషం కూడ వృథా చెయ్యకూడదు; పనిచేస్తున్నప్పుడు, పనిచెయ్యనప్పుడు, పగలనక రాత్రనక సర్వకాల సర్వావస్థలలోను, ఒక్క క్షణమైనా ఏమరుపాటు లేకుండా అప్రమత్తుడవై ఉండాలి. అప్పుడు దేవుడు కూడ నీకు సహాయపడతాడులే. నువ్వు నీ స్వార్థప్రయోజనాలను పూర్తిగా విస్మరించి, మనస్సు చేసే మోసాలకు దూరమైనప్పుడు విశ్వమహాశక్తులు నీలోకి ప్రవహిస్తాయి. నిన్ను విజయపంథాలో నడిపిస్తాయి.

— సంపాదకుడు

జీవితాదర్శము

జంతువు పరిణమించగా మానవుడు ఉద్భవించాడు. మనిషికి మనస్సున్నది నిజమే. అయినప్పటికీ అతని జీవితం పట్టాలు మీద రైలువలె యిరుకు దారిలో మందకొడిగా నడిచిపోతుందేగాని, అంతకు మించి విశాలవీధుల్లోకి సాహసించదే! విసుగు పుట్టించి మొహం మొత్తుతుందేగాని తృప్తి నివ్వదే! — సంపాదకుడు

మానవులు దేహధారులై జన్మనెత్తుతారు. ఎందుకో వారికి తెలియదు. జీవయాత్రను గడుపుతారు. ఎందుకో వారికి తెలియదు. అలాగే జీవితాన్ని చాలిస్తారు. అది కూడా వారికి తెలియదు. మళ్లీ నిరంతరం చర్వితచర్వణంగా ఈ దేహయాత్రను గడిపేస్తుంటారు. దీని ధ్యేయమేమిటో తెలియదు. ఎవరో ఒక మహాత్ముడు వచ్చి "చూడు, దీనికంతా ఒక గొప్ప ప్రయోజనమున్నది. ఈ అవకాశాన్ని పోగొట్టుకుండేవు జాగ్రత్త" అని హెచ్చరించేంతవరకు ఈ నాటకం జరుగుతూనే ఉంటుంది.

*

అధిక సంఖ్యాకులు జీవితాన్ని ప్రశాంతంగా గడపాలని కోరుకుంటారు. అనగా వారి ఉద్దేశ్యంలో ఎక్కువ అతిశయానికి పోకుండా ఒక గిరి గీసుకొని హద్దులలో జీవించడం. ఏదో మామూలుగా నిత్యకృత్యమైన పనులు చేసుకుంటూ, ప్రతి రోజూ కాలక్షేపం చేయటం. మళ్లీ మరునాడు అదే వరస — అవే పరిస్థితులు, పరిసరాలు మరీ విసుగుపుట్టకుండా ఏదో కాస్త వైవిధ్యంగా జీవయాత్రను గడిపేస్తుండటమే సాధారణంగా మానవుల పరమావధి!

జీవితంలో ఎక్కువ కష్టపడకుండా మంచి పరిసరాలలో పుట్టడం, ఎక్కువ ఒడిదుడుకులు లేకుండా ఉండటం, ఎక్కువ కష్టపెట్టకుండా ఉండే జీవిత భాగస్వామిని ఎంచుకోవడం, సంతానం కలగటం, వాళ్లు ఆరోగ్యవంతులై చక్కగా పెరిగి పెద్దవాళ్లు కావటం, వృధాప్యంలో ఎక్కువ ఆరోగ్యసమస్యలు లేకుండా సంతోషంగా ఉండటం, కాలం తీరిపోయినప్పుడు సునాయాసంగా

దేహాన్ని చాలించటం – ఇదే అధికసంఖ్యాకులు కోరుకునే జీవితం, మానవులు సాధారణంగా కోరుకుండే ఆదర్శవంతమైన జీవితం. కాని అది కాదనే వాళ్లంటారు. ఎందుకుండరూ, ఆ జీవితం మొహం మొత్తేసి విసుగు పుట్టదూ!

మూలం: శ్రీమాత

అనువాదం: డా॥ ఆర్.ఎల్.ఎన్. శాస్త్రి

(*CWM* Vol. 8, pp. 176, 57-58)

అంధకారంలోంచి బయటపడండి

మానవజీవితము ప్రొద్దున లేచినప్పటి నుండి యాంత్రికంగా గడిచిపోతుంది. ఎవరో ఒక గురువు వచ్చి నీ కళ్ళను తెరిపించేంత వరకు అంతే.అప్పుడు "నేనసలు ఇక్కడెందుకున్నాను" అని ప్రశ్నించుకోవడం జరుగుతుంది. ముఖ్యంగా ఏ ప్రమాదమో లేక దుర్భరమైన పరిస్థితులు ఎదురైనప్పుడో నీ అసలు రూపాన్ని, ఆత్మను కనుక్కుండే ప్రయత్నం జరుగుతుంది.. – సంపాదకుడు

సాధారణంగా మానవజీవితం ఏదో యాంత్రికంగా గడిచిపోతూం టుంది. దేహాన్ని ధరించి ఈ భూమ్మీదికి ఎందుకొచ్చి పడ్డాము? అసలీ భూమికను (formation) ఎందుకు దాల్చవలసి వచ్చింది? అసలీ జన్మయొక్క ఉద్దేశమేమిటి? అనే ప్రశ్నలు బహుకొద్దిమంది మాత్రమే అడుగుతారు. జవాబు కోసం వెతికేవాళ్లు యింకా తక్కువమంది. ఒక మహాపురుషుడు ఎవడైనా కనబడి దారి చూపించాలి. శ్రీఅరవిందులో లేక మరెవ్వరైనా జ్ఞానులు, మహాత్ములు వ్రాసిన పుస్తకాలు నీ చేతుల్లోకి వస్తే సరే. కాని మామూలు జీవితం గడుపుతున్నవారి వలె నువ్వు కూడా ఏ మహాత్ముల బోధలు వినలేదనుకో. ఒకవేళ విన్నా కూడా అది దేవుళ్లను గురించో లేక మతాలను గురించో అయివుండవచ్చు. అవి కేవలం

బాహ్య ఆడంబరాలే తప్ప నువ్వు ఈ భూమ్మీద ఎందుకు జన్మిం చావో చూపించలేవు. అసలు నీ కటువంటి ఆలోచనే రాదు.

ప్రొద్దున లేచినప్పటి నుంచి నిత్యకృత్యం సాగిపోతూం టుంది. రోజులు గడిచిపోతూంటాయి. చిన్నప్పుడు నీ ధ్యాసంతా ఆటల మీద, తిండి మీద ఉంటుంది. తరువాత చదువు, ఆ తరు వాత ప్రాపంచిక జీవితము, పరిస్థితుల ప్రాబల్యానికి లొంగిపోవ డమే కదా! ఈ విధంగా బాహ్యజీవితంలో నిమగ్నమైపోయినప్పుడు "అసలు సమస్య ఏమిటి? నేనిక్కడెందుకున్నట్లు?" అని ఎంత మంది ప్రశ్నించుకుంటారు? కొంతమందికి ప్రమాదాలు సంభ వించినప్పుడుగాని ఈ జిజ్ఞాస కలుగదు. ఆప్తబంధువులు చని పోయినప్పుడో, పరిస్థితులు విషమించినప్పుడో కాస్త తెలివైన వారికైతే ఈ దుఃఖం ఎందుకు వచ్చిందో, ఈ జీవితం వలన ఉప యోగమేమిటో, అసలు కర్తవ్యమేమిటో అనే ప్రశ్నలుదయిస్తాయి.

అప్పుడుగాని వారు ఈ ప్రశ్నలకి జవాబులు కోసం వెద కడం మొదలుపెట్టరు.

నీలో దైవము నిక్షిప్తమై ఉన్నాడని తెలుసుకోటం, తెలిసి నప్పుడు ఆ దైవాన్ని కనుక్కోటం – ఈ జిజ్ఞాస జీవితంలో ఎప్పుడో అప్పుడు వస్తుందనుకోండి. కాని మనిషి జన్మించిన పుడే చైత్యపురుషుడు కూడా శరీరంలోకి ప్రవేశిస్తాడు. లోతు లలో, అగాధసీమలలో ధగధగలాడిపోతుంటాడు. జన్మచరితార్థత కోసం ప్రేరేపిస్తాడు. కాని ఈ విషయం ఎంతమందికి తెలుసు? చైత్యపురుషుణ్ణి ఎంతమంది గుర్తించగలరు? చిత్రమేమిటంటే పరి స్థితులు విషమించినపుడే, బాధాకరమైన పరిస్థితులు కలిగినప్పుడు గాని ఈ జిజ్ఞాస మొదలుగాదు. అంతవరకు గుడ్డెద్దు చేలో పడ్డట్లే ఉంటుంది. మనిషి జీవితం. అయితే ఈ అగాధాలలోని చైత్యపురు షుడు నిన్ను ప్రేరేపిస్తూ, అదే పనిగా వదలకుండా నిన్ను మళ్లీ మళ్లీ దిశానిర్దేశ్యము కావిస్తూ, తట్టి లేపుతూ, తనలో ఐక్యం చేసు కొంటాడు. అయితే నీకీ విషయాన్ని గురించి వీసమైనా తెలియదు.

అంతవరకు నీది గుడ్డి జీవితమే. విధి రథచక్రాల క్రింద పడి నలిగిపోవడమే నీ వంతు. "దేవుడు నన్నిలా పుట్టించాడు.

నా స్వభావమింతేలే. నన్నెవరు మార్చగలరు?" అని విలపిస్తూ ఉంటావు. జీవితం దుర్భరంగా ఉంటుంది. ఉక్కుపాదాలతో నిన్ను తొక్కేస్తుంది. నేలపాలు చేస్తుంది. అలా నేలమీద పాకే బదులు, దాని కతీతమై జీవితంయొక్క వేర్వేరు పాయిలన్నిటిని ఒకే సూత్రం క్రింద బంధించి, జీవితాన్నంతా స్పష్టంగా ఒకే గమ్యం వైపు నడిపించే ఏకైక ప్రక్రియగా తీర్చిదిద్దాలి.

ఒక విషయాన్ని గురించి నీవు స్పష్టంగా తెలుసుకోవాలి. ఒకటి సాధారణ జీవితము (normal life) మరొకటి అతీతమైన జీవితము (exceptional life). మొదటిది నీకు చాలా (అజాగృత స్థితి) న్యాయమే అనిపించవచ్చు. అందుకని నువ్వు ఇదే కైలాసం, ఇదే వైకుంఠమనుకుంటావు. ఈ పైపై ఆర్భాటాల నుండి వెనక్కు తగ్గి దృష్టిని మరల్చాలి. "*అరె! ఇదేమిటి చుక్కాని లేని పడవల్లే నేనిలా గిలగిలా కొట్టుకొంటున్నా నా. ఛీ! ఇది పనికి రాదు*" *అని నడుం బిగించి శోధన మొదలుపెట్టాలి. ఉద్దేశపూర్వకంగా పట్టుదలతో ఒక పద్ధతి ప్రకారం ప్రతి అడుగు ఆచితూచి వేయాలి. ఇలా చేసే వాళ్లు చాలా అరుదుగా ఉంటారు. మన కళ్లకి వాళ్లు (abnormal) గా కనబడతారు. కాని నిజంగా జీవించాల్నంటే ఇదే చక్కటి రాజమార్గము.*

మూలం: శ్రీమాత

అనువాదం: డా॥ ఆర్.ఎల్.ఎన్. శాస్త్రి

(*CWM* Vol. 9, pp. 15-19)

ఊర్ధ్వ పరిణామము

పరిణామ సిద్ధాంతం ప్రకారము మనిషి తనే సృష్టిలో గొప్పవాడు అని, తనకంటె ఎక్కువ తెలివి ఎవరికీ వుండదని అనుకుంటాడు. కాని పరిణామ క్రమంలో మనిషి ఒక మధ్యంతరజీవి మాత్రమే. ఈ పరిణామం తనను దాటి వెళ్లినప్పుడు తనను తల దన్నే అతిమానసజీవి పుడతాడు. — *సంపాదకుడు*

ఈ ప్రకృతిలో ఒక ఆరోహణ క్రమమున్నది. అది రాయి నుంచి చెట్టువరకు, చెట్టునుంచి జంతువువరకు, జంతువునుంచి మనిషి వరకు సంభవించింది. అందుకని మనిషి తనే పరిణామ ప్రక్రియకు మకుటమని, తనకంటె ఎక్కువ స్థాయి యింకేమీ లేదని భావిస్తాడు. కాని అది చాలా పెద్ద పొరపాటు. భౌతికప్రకృతి దృష్ట్యా మనిషి కూడా ఒక జంతువే — ఆలోచించగలిగిన, మాటలాడే జంతువు; కాని భౌతిక జీవితసరళిలోను, బుద్ధులలోను, జంతులక్షణాలే భాసిస్తాయి! సృష్టి యిలాంటి లోపభూయిష్టమైన జీవితో ఎందుకని తృప్తిచెంది వుండాలి? జంతువులోనుంచి మనిషి ఆవిర్భవించినట్లుగానే మనిషిలోంచి మరో మనిషి — అజ్ఞానానికి బానిసగావుండే స్థాయినుంచి ఎదిగి ఊర్ధ్వముఖంగా పరిణామం చెంది — అదే బాహ్యరూపమును కలిగియు, అంతకు మించిన చేతనను పొందిన జీవి ఎందుకు రాకూడదు?

ఈ సత్యాన్ని మనకు బోధించటానికే శ్రీఅరవిందులు అవతరించారు. మానవుడు ప్రస్తుతం మానసికస్థాయికి చెందిన ఓ జీవి. కాని అతడు కూడా పరిణామంలో ఒక స్థాయి మాత్రమే కదా. తత్కారణంగా అతనికి కూడా మరియొక నూతన చేతనను (Truth-Consciousness) పొందగలిగే అవకాశం ఉందని వారు చెప్పారు. సంపూర్ణమైన, సమగ్రమైన, సలక్షణమైన, సుందరమైన, ఆనందమయమైన, సంపూర్ణచైతన్యముగల జీవితమును పొందగలిగే అవకాశము కూడ కలదని వక్కాణించారు.

ఇక నీ యిష్టం. అంతా నీ నిశ్చయం మీద, నీ నిష్ఠ మీద ఆధారపడి ఉంటుంది. నీకు కేవలం జాంతవిక మానవునిగా బ్రతకాలని ఉందో లేక శ్రీఅరవిందుల అతిమానసాన్ని ధరించిన ఓ నూతన మానవునిగా, భూలోకంలో ఒక సరికొత్త జీవితాన్ని గడిపే మానవజాతిగా పరిణమించాలని ఉందో నీ యిష్టం. దీనికి అవసరమయిన సాయమంతా నీకు లభిస్తుంది.

మూలం శ్రీమాత

అనువాదం: డి. సత్యవాణి (జనవరి 2004 '*అఖిల*' నుండి)
(*CWM* Vol. 12, pp. 116-17)

భూలోక జీవితం – అభివృద్ధికి మార్గము

మనిషి జీవితం ఎంత యాంత్రికం అయినప్పటికి అందులో అభివృద్ధికి ఆస్కారం వున్నది. జీవితమనగా ఒకే చోట పడివుండటం కాదు, నిరంతర ప్రయత్నం వలన తనను తాను అధిగమించి చేతనా శిఖరాల్ని అందుకోవటం. – సంపాదకుడు

జీవితమంటే ఏమిటి? ద్వంద్వాలను ఎదుర్కొని మనకు కావలసిన దానిని ఎంచుకోవడమే. సదసత్తులు, చీకటివెలుగులు నిన్ను నిరంతరం సవాలు చేస్తూనే ఉంటాయి. అందుకని నువ్వు నిరంతరం అప్రమత్తుడవై ఉండాలి – శిఖరారోహణమో లేక అగాధంలోకి పతనమో పురోగమనమో, తిరోగమనమో ఎంచుకుంటూ ఉండాలి!

*

ఎప్పుడు నువ్వు ముందుకు వెళ్లకుండా ఆగిపోతావో అప్పుడే నువ్వు క్రిందికి జారిపోతావు. ఎప్పుడైతే తృప్తిచెంది ఆహా! అంతా బాగానే ఉందిలే అనుకొని ఆకాంక్షించడం మానేస్తావో అప్పుడే నువ్వు క్షీణించడం మొదలుపెడతావు. *జీవితమంటే రాయల్లే ఒక చోట పడివుండటం కాదు – గమనము, నిరంతర ప్రయత్నము, ముందుకు సాగిపోవడము, శిఖరారోహణము, భవిష్య విజయాల*

(future realisations) వైపు పురోగమించడం. కదలకుండా కూర్చు న్నావో అది ప్రమాదము, సర్వనాశనము. నీకు విశ్రాంతి కావా ల్నంటే ఏ పని చెయ్యకుండా కూర్చోనక్కర్లేదు. ప్రయత్నించ టంలో, పనులు చేయడంలో, ముందుకు పురోగమిచటంలోనే నీకు శాంతి లభిస్తుంది. నీకు కోరికలు లేనప్పుడు, నువ్వు అహం కారాన్ని జయించినప్పుడు, దైవానుగ్రహాన్నే నమ్ముకున్నప్పుడే నీకు నిజమైన శాంతి లభిస్తుంది.

*

భూలోక జీవితమే అభివృద్ధికి ఆటపట్టు. ఇచ్చటే, ఈ భువిపైననే భౌతికసృష్టి కొనసాగుతున్నప్పుడే అభివృద్ధి సంభవము. ఈ అభి వృద్ధిని ఒక జన్మనుండి మరోజన్మకు స్వయంగా స్వీయపరి ణామ క్రమాన్ని, పరిణతిని ఏర్పాటు చేసుకొని, కొనిపోవునది జీవాత్మ.

*

చైత్యము (psychic) జీవుడి అంతర్భాగంలో ఓ చిన్న మెరుపులా ప్రారంభమౌతుంది. దానినుండి దినదిన ప్రవర్ధమానంగా తన స్వీయసంకల్పము, కార్యాచరణ కలిగినటువంటి ఒక స్వతంత్రు డగు చైతన్యవంతుడైన జీవి ఆవిర్భవిస్తుంది. చైత్యపురుషుడు (psychic being) ఆరంభదశలో దివ్యచైతన్యపు ఓ చిరు నిప్పురవ్వ మాత్రమే. జన్మజన్మల పరంపరాక్రమం ద్వారా, అదొక చైతన్య పూరిత వ్యక్తిత్వాన్ని పెంపొందించుకుంటుంది. ఈ పెంపు ఒక శిశువు పెరుగుదలను పోలి వుంటుంది. అదొక రూపకల్పన చేయబడుచున్న వస్తువు లాంటిది. చాలాకాలం పాటు, ఎంతో మందిలో జీవాత్మ ఒక రూపొందుతున్న అస్తిత్వంలా ఉంటుంది. అది పరిపూర్ణ వ్యక్తిత్వమును కలిగి వుండదు. సంపూర్ణ చైత న్యవంతము కాదు. తనపై తాను అజమాయిషీ చెలాయించుకోగల జీవి కాదు. తనను తాను పెంపొందించుకొని సంపూర్ణ చైతన్య వంతమైనదిగా రూపొందాలంటే ఒకటి తర్వాత ఒకటి వచ్చే పున ర్జన్మలన్నీ దానికి అవసరమౌతాయి.

*

విషయాన్ని మరింత ఆసక్తికరమైనదిగ చేసేదేమిటనగా, జీవిని దివ్యకేంద్రం చుట్టూ సమతుల్యపరచి, ఒక పద్ధతిగా ఏర్పాటు చేసుకునే ప్రక్రియ, భౌతికకాయం ధరించి ఈ భువిపైన ఉన్నప్పుడు మాత్రమే సాధ్యమౌతుంది. అదే, నిజంగా భౌతికజీవితానికి అత్యావశ్యకమగు మూలకారణం. ఎందుకనగా, భౌతికకాయంలో నీ వుండనట్లయితే ఆ పనిని అసలు చేయలేవు.

అంతకన్నా రసవత్తరమైనదేమిటంటే, ఈ కార్యాన్ని మనుషులు మాత్రమే నిర్వర్తించగలరు. అందుకు కారణం, మనుషులకు మాత్రమే వారి కేంద్రస్థానంలోని చైత్యపురుషసత్తాలో దైవ సన్నిధి నిబిడీకృతమై వుంటుంది. ఉదాహరణకు, స్వయం అభివృద్ధి, క్రమబద్ధీకరణ, అన్ని అంశాలపై అవగాహన పెంపొందించుకొనుటకు అవసరమగు పనులు, ప్రాణిక మరియు మానసిక స్తరాలలో నుండే జీవులకు అందుబాటులో వుండవు. మామూలుగా, దేవతలంటూ పిలవబడే జీవులకు సైతం, ఇవి అందుబాటులో ఉండవు. ఈ చర్యలను చేపట్టాలనే కోరిక వారికి కలిగినప్పుడు, వారిని వారు సంఘటితపరచుకోవాలని, పరిపూర్ణ చైతన్యం పొందాలని నిజంగా ఆశించినప్పుడు శరీరధారణ చేయవలసి వుంటుంది.

*

ఇక్కడ నేమ మీకొక అతిముఖ్యమైన విషయం చెప్పాలి. చైత్యపురుషుడు ఈ భూమిపైన కొనసాగే భౌతికజీవితంలో మాత్రమే అభివృద్ధి చెందగలదు, తనను తాను రూపొందించుకొనగలదు. అది శరీరాన్ని వదిలిన వెంటనే, ఒక విశ్రాంతిలోకి ప్రవేశిస్తుంది. అట్టి విశ్రాంతి, దీర్ఘకాలం కొనసాగవచ్చు. ఎంతకాలం వరకనేది దాని ఇచ్ఛపైన, అది సాధించిన ప్రగతిస్థాయిపైన ఆధారపడి వుంటుంది. ఆ విశ్రాంతి జీర్ణించుకొనుటకు అవసరమైనది, ఒక విధంగా చెప్పాలంటే, సడీచప్పుడూ లేకుండా సాధించే అభివృద్ధికి అవసరమగు విశ్రాంతి, చైత్యపురుషుని వినూత్న అనుభవాలలోకి చేరుకొననిచ్చి, అభివృద్ధిని చురుకుగా సాధించుటకు వీలగు విశ్రాంతి.

ప్రశ్న: మధుమయీ, ఏవిధంగా వ్యక్తి తన చైత్యపురుషుణ్ణి అభి వృద్ధిపరచుకోగలడు?

అది జీవితానుభవాలన్నింటి ద్వారా రూపొందుతుంది, పెరుగుతుంది, వృద్ధిచెందుతుంది. చివరకు ఒక పరిపూర్ణమైన, చైతన్య వంతమైన స్వేచ్ఛాజీవిగా పరిణమిస్తుంది.

ఈ సంబంధాన్ని, సహాయాన్ని బలోపేతం చేసి, వీలయితే చైతన్యవంతమైన చైత్యవ్యక్తిత్వాన్ని పెంపొందించుటకు, వ్యక్తి ఏకాగ్రతతో ఆ దిశగా మళ్లి, దానిని తెలుసుకొనుటకు, అనుభ వించుటకు ఆకాంక్షించాలి. దాని శక్తిని గ్రహించుటకు తనను తాను తెరచుకొని వుండాలి. ప్రతిసారి, దాని నుండి సంకేతం అంది నప్పుడల్లా, దానిని తు.చ తప్పకుండా మనస్ఫూర్తిగా అనుసరించుటకు అత్యంత శ్రద్ధ వహించాలి. ఒక మహోన్నత ఆకాంక్షతో జీవించుటకు, అంతరంగ ప్రశాంతతను పొందుటకు శ్రద్ధ వహించుట, వీలయినంతవరకు అన్ని వేళలా ఆ ప్రశాంతస్థితిలోనే వుండుట, చేపట్టే అన్ని కార్యాలలోను హృదయపూర్వక శ్రద్ధా శక్తులు కనబరచుట – ఇవే చైత్యపురుషాభివృద్ధికి ఆవశ్యకమగు నిబంధనలు.

*

భువిపైన జీవితం ప్రధానంగా, అభివృద్ధిని సాధించే క్షేత్రం. కాని, సాధించవలసిన అభివృద్ధినంతా సాధించుటకు, జీవితం ఎంత స్వల్పమైనది?

అల్పమైన కోరికలను తీర్చుటకు ప్రయత్నిస్తూ, వారి సమ యాన్ని వృథాపరచటం, ఒట్టి అవివేకం. దైవసాక్షాత్కారం పొంది నప్పుడే నిజమైన సంతోషం సాధ్యపడుతుంది.

మూలం: శ్రీమాత

అనువాదం: అందుగులపాటి కైలాసపతి, జానకి

(*CWM* Vol. 14, p. 29; Vol. 9, pp. 65, 270; Vol. 5, p. 205; Vol. 8, p. 176; Vol. 4, p. 144; Vol. 16, pp. 223-24, 434)

నీ ప్రత్యేకమైన పాత్ర ఏమిటో తెలుసుకోవాలి

భగవంతుడు మనుష్యు లందరినీ ఒకే విధంగా పుట్టించడు. ఒక్కొక్కరిదీ ఒక్కొక్క ప్రత్యేకమైన ఆత్మ. ఆ ప్రత్యేకమైన ఆత్మయొక్క బహిరాభివ్యక్తియే అతని ప్రత్యేకత, అతను నిర్వహించవలసిన విశిష్టమైన పాత్ర. — *సంపాదకుడు*

మనుష్యులందరు ఒకేలాగ వుండరు. ఒక్కొక్కరిది ఒక్కొక్క వ్యక్తిత్వము, ఒక్కొక్క పాత్ర, తను మాత్రమే చేయగలిగే నిర్దిష్టమైన కార్యము, తను మాత్రమే ఆక్రమించగలిగే ఒక ప్రత్యేకమైన స్థానము!

ఈ ప్రత్యేకతకు ఒక కారణమున్నది. ప్రతి ఒక్కరూ తమ అగాధసీమల యొక్క బాహ్యాభివ్యక్తియే. ప్రతివారిలోను ఆత్మశక్తి దీపించెడి ఒక విలక్షణమైన సామగ్రి వుంటుంది. దాన్ని దర్శించినప్పుడే తన కార్యముయొక్క నిర్దిష్టస్వరూప మేమిటో తెలియవస్తుంది.

మూలతః అందరిలోను దీపించెడి ఆత్మశక్తి ఒకటే అయినప్పటికి అది ఒక్కొక్కరిలోను, ఒక్కొక్క ప్రత్యేకరూపంలో అభివ్యక్తమవుతుంది. అందుకనే ప్రతివారు "నేనొక్కడినే ప్రత్యేకంగా చేయగలిగిన పని ఒకటుంటుంది. అది గొప్ప కార్యము కాకపోవచ్చును. అల్పమైనదే కావచ్చును. ఏదైనప్పటికి దానికే నా ప్రాణమంతా పెట్టి నేను నిర్వర్తించాలి. అదేమిటో తెలుసుకోవాలి గదా మరి. నన్ను నేను పరిశీలించుకోవాలి. నా అభిరుచులు, ధోరణులు, ఇష్టాయిష్టాలేమిటో కనుక్కోవాలి. ఏ విధమైన గర్వముకాని, చిన్నతనముకాని లేకుండ, ఇతరులు ఏమనుకుంటారోయని లెక్కచేయకుండ, ఊపిరి ఎంత అప్రయత్నంగా పీలుస్తానో అంత సహజంగా, ఒక పువ్వు తనంతట తానే తన పరిమళాన్ని అందరికీ ఎలా వెదజల్లుతుందో, అంత యథాతథంగా నేనుంటాను. మరో విధంగా వుండలేను కనుక" అని తెలుసుకోవాలి.

మనం మనలోని స్వార్థపరత్వమును, వైయక్తిక కోరికలను, అహంకారపు చేష్టలను ఎప్పుడైతే విరమించుకొంటామో అప్పుడే మన ఆత్మకు లోబడి దాని ఉపకరణము లయ్యేదము ఈ అగాధాలలోంచి పొంగిపొరలే ఆవేశము మనలను విశ్వమహాశక్తులతో కలిపి ఉన్నతంగా నడిపిస్తుంది.

మరో విషయం. ఎప్పుడైతే మనము మాలిన్యాలను వదిలించుకొని ఉన్నతస్థాయికి ఎదుగుతామో అప్పుడే మనం చేయవలసిన కార్యమేమిటో స్పష్టంగా తెలుస్తుంది. అందుకని నిన్ను నీ వెప్పుడు అధిగమిస్తూ వుండాలి. అందులకు ఎట్టి అవకాశమును పోగొట్టుకోకూడదు. నిర్లక్ష్యపరచరాదు. అప్పుడే నీవు చేసే కర్మలు ఊటబావిలో నుంచి వచ్చిన స్వచ్ఛమైన నీరువలె నిర్మలంగా వుంటాయి.

*

ప్రశ్న: ఆధ్యాత్మికతకు నిలయమైన ఈ భూమ్మీద చైత్యపురుష ధారియై జన్మించడమే మనలో ప్రతి ఒక్కరికీ ఒక గురుతర బాధ్యత ఉన్నదని ఋజువు చేస్తుంది కదూ?

నిస్సంకోచంగా ప్రతి ఒక్కరూ ఏదో ఒక ప్రత్యేక కార్యాన్ని చెయ్యడానికే ఈ భూమ్మీద పుడతారు. కానీ, చైత్యపురుమడు చక్కగా ప్రగతి సాధించాకే ఈ కార్యసాధన సంభవం. లేకపోతే, అప్పటివరకూ కార్యసాధన బాధ్యత సామూహికంగానే వుంటుంది. అభివృద్ధితో పాటే వ్యక్తిగత బాధ్యత కూడా పెరుగుతుందని గుర్తించాలి. తాను ఈ భూమి మీదికి ఒక నిర్దిష్ట కార్యక్రమం పూర్తి చేసేందుకే వచ్చాననీ, అందులో అహానికి తావులేదనే స్పృహ ఏదో ఒక క్షణంలో కలుగుతుంది. ఈ అవగాహనే ప్రగతి పథంలోకి ప్రవేశం!. "నేనిక్కడ వున్నానంటే, నేను పూర్తి చేయాల్సినదేదో వుంది. నాకు చైతన్యస్పృహ వుందంటే, నేను చేయాల్సిన పని నిర్వర్తించుటకే. మరి ఆ పనేమిటి?" అని ఆలోచించాలి. ప్రతి ఒక్కరూ తమని తాము వేసుకోవాలసిన మొదటి ప్రశ్న "నేనిక్కడెందుకున్నాను" అనే.

*

"నేనిక్కడెందుకున్నాను" అనేది ఆలోచించుకుంటే, ఇక్కడ ఏమి గ్రహించడానికొచ్చామో, మన పాత్ర ఏమిటో, దాన్ని పూర్తి చేసేందుకు మనకి ఉన్నవీ, కావలసినవీ ఏమిటో తెలుస్తుంది. ఇదేకాక దీనితోపాటు ప్రగతికి అవరోధాలుగా వున్న ఆలోచనలు, శక్తులు కూడా ఏమిటో తెలుస్తాయి. అంటే, సంపూర్ణ చిత్తశుద్ధి, నిష్పక్షపాత దృష్టి అలవరచుకుంటే, నీ చైత్యపురుషుణ్ణి గుర్తించ గలుగుతావు.

దీనికి సంపూర్ణ చిత్తశుద్ధి అవసరం. నిష్పక్షపాతంగా ఆత్మావలోకనాన్ని చేసుకోవాలి. ముందునుంచే నేను ఇదో అదో చెయ్యడానికే పుట్టాననో, నాకీ శక్తేవుందనో అనుకోకూడదు. ఎందుకంటే, అసలైన శక్తిని కానీ, ప్రగతిని కానీ నిర్ణయించేది శారీరక, మానసికస్థాయిల్లోని అవగాహన కాకూడదు. త్వరపడి "ఇదే నా కర్తవ్యం" అనుకోడం ఎంత పొరపాటో, ఎప్పుడూ నిరుత్సాహంతో తమని తామే కించపరచుకుంటూ "నేనుత్తి అసమర్ధుడిని" అనుకోడం కూడా అంతే తప్పు. ఈ రెండు ఆలోచనాసరళులూ, ఆత్మజ్ఞానానికి అవరోధాలే. చక్కటి అద్దం ఉన్నదున్నట్లు ఎలా ప్రతిబింబిస్తుందో, మీ అంతఃదృష్టి కూడా మీ వ్యక్తిత్వాన్ని అంతే చక్కగా చూపాలి. అప్పుడు నిశ్శబ్దమైన కీకారణ్యం మధ్యలో ఉన్నట్టుండి ఒక ప్రశాంతమైన కొలను, దానిపై ప్రశాంతమైన చంద్రకిరణాలు సోకితే అక్కడి దృశ్యం ప్రస్ఫుటమయినంత అందంగా, మీ ఆత్మస్వరూపం అవగాహనలోకొస్తుంది – క్రమక్రమంగా మీరేమిటో, మీలోని దివ్యత్వమేమిటో, ఏమి సాధించడానికొచ్చారో తేటతెల్లమవుతుంది.

మూలం: శ్రీమాత
అనువాదం: డా॥ ఆర్.ఎల్.ఎన్. శాస్త్రి; బి. వరలక్ష్మి

(*CWM* Vol. 2, pp. 49, 51; Vol. 4, p. 246; Vol. 15, pp. 357-58)

మనిషిలోని పరస్పర వైరుధ్యాలు

మానవునిలో కొన్ని లోపాలు దాగి వుంటాయి. మనిషి కేవలం పైకి కనబడే ఆకారము మాత్రమే కాదు. అతనిలో అగాధాలున్నాయి. కాబట్టి నీవు నీ యిరుకు దారుల లోనుంచి బయటపడి నీ విశాలత్వాన్ని, అగాధాలను దర్శించు. తద్వికాసమును పొంది ఆనందించు.
— సంపాదకుడు

ప్రతి మనిషిలోనూ, ఎన్నో, ఎన్నెన్నో పరస్పర విరుద్ధమైన లక్షణాలుంటాయి. విచిత్రమేమిటంటే, ప్రతి లక్షణం అదే అతని నిజ స్వభావమంత బలంగా నాటుకుని వుంటుంది! కేవలం శారీరక, మానసిక స్థాయిలకే ఇవి పరిమితం కావు. అంతరంగంలో కూడా వుంటాయి. పైగా ఏ వ్యక్తీ ఒకే ఒక స్థాయిలో జీవించడు. ఒకే క్షణంలో అన్ని స్థాయిల్లోనూ జీవిస్తాడు. మరి ఈ వైరుధ్యం ఎందుకు? తెలుసుకోవాలంటే ప్రతి ఒక్కరూ ఒక ప్రత్యేక కార్య సాధనా సామర్థ్యంతో కర్తవ్యంతో వచ్చారని తెలుసుకోవాలి. మరి సంపూర్ణ స్వచ్ఛతని అభివ్యక్తం చేయడం సాధ్యమా? తప్పకుండా సాధ్యమే – దేనినైతే మనం వ్యక్తం చేసేందుకొచ్చామో – దాని పూర్తి విరుద్ధమైన లక్షణంతో దాన్ని సవాలు చేయడమే – ఏ శక్తికయినా ఘర్షణలోనించే బలం వస్తుంది! అన్ని బలహీనతలనీ, అవరోధాలనీ అధిగమించి మేలిమిస్థాయికి ఎదగాలంటే ఎక్కడెక్కడ బలహీనతలున్నాయో, వేటిని పోగొట్టుకోవాలో తెలియాలి కదా? ఉక్కులాంటి దృఢత్వం రావడానికి ఇనుమును సమ్మెటపోట్ల ధాటికి గురిచేస్తారు కదా. అందుకే ఈ వైరుధ్యాలను లక్ష్యసాధనకి సాధనాలుగా వాడుకోవాలి.

మూలం శ్రీమాత
అనువాదం: బి. వరలక్ష్మి

(*CWM* Vol. 15, pp. 355-56)

దైవావిర్భావానికిగల ఆటంకాలు – మనం సాధించవలసిన కార్యము

నీకు మనస్సున్నది, ఆలోచనాశక్తీ వున్నది. మరి ఈ అంధకారము, అజ్ఞానము ఎక్కడి నుంచి వచ్చినవట? చూడు, అసలు నీవెక్కడ నుంచి వచ్చావు? జడపదార్థంలోంచే గదా! ఆ జడత్వము నిన్నా వహించి, నీ జీవితంలో అడ్డంకులు కల్పిస్తూ వుంటుంది. నీవీ విషయాన్ని గుర్తించి దీన్ని అధిగమించాలి. – సంపాదకుడు

పరిశీలించి చూస్తే మనకు జీవితంలో కలిగే ఆటంకాలు మనం సాధించవలసిన కార్యాలతో ముడిపడి వుంటాయి.

ఈ దోషం భౌతికపదార్థానికి చెందినది. మనం దోషభూయిష్టమైన పదార్థంచేత నిర్మింపబడి వున్నందున, దాని దోషంతో పాలు పంచుకొనక తప్పదు కదా.

అందువలన మన అంతరాంతరాలలోని సత్తా ఎంత గొప్ప పరిపక్వతను, ఎంత గొప్ప చేతనాస్థాయిని, ఎంత గొప్ప విజ్ఞానాన్ని కలిగియున్నప్పటికీ, అది భౌతిక శరీరంలో అవతరించినందున, దాని ఆవిర్భావ పరిపూర్ణతకు ఆటంకాలు తలెత్తుతాయి. అంతే కాదు, దాని అవతరణ ఆశయం కూడ ఆ ఆటంకాలను జయించుటకుగాను, జడపదార్థాన్ని రూపాంతరీకరణ గావించుటకుగాను అయివుంటున్నది. అందువల్ల మనం మన లోపల ఆటంకాలను ఎదుర్కొనవలసినందుకు ఆశ్చర్యపడనవసరము లేదు, విచారించవలసినదీ లేదు.

*

ఇదేమిటి 'అతనీ పని నెందుకు చేయడు?' అని కాని, 'అతను మరో పని చేస్తున్నాడేమిటి?' అని కాని లేదా మరొకరు 'వారు చేయకూడని కార్యం చేస్తారని' కాని ఎప్పటికీ నీవనవద్దు. ఇదంతా నీ బాధ్యత కానే కాదు. అసలు నువ్వెందుకు పట్టించుకొంటావు? నీవు యీ భువిపై భౌతికదేహంతో నిర్మించబడి వున్నావు. నీ జన్మకు ఒక ఉద్దేశం ఉంది. దేహం ఎరుక పొందేట్లు చేయాల

న్నది నీ ఆశయం. కనుక నీవు నీ శరీరాన్ని ఎరుక కలిగిన సమగ్ర దైవోపకరణంగా తయారు గావించు. ఆ దైవం నీ మానసిక, ప్రాణిక, దైహిక భూమికల్లో కొంత పదార్థాన్ని, శక్తిని ప్రసాదిం చాడు. ఆ దైవం నీ నుండి యేమి ఆశించాడో దానికి అనుగుణం గానే అవి వుంటాయి. అంతే కాదు, నీ చుట్టు ఉన్న పరిస్థితులు కూడ నీ నుండి ఆయన ఆశించేదానికి అనుగుణంగానే అమరి వుంటాయి కూడ.

"నా జీవితం భయంకరంగా వుంది, ఈ ప్రపంచంలో నేను చాలా దీనాతి దీనవస్థతని గడుపుచున్నాను" అని అనేవారు గాడి దలు! దైవసృష్టిలో ప్రతి ఒక్కరూ తన సమగ్ర అభివృద్ధికి అర్హ మైన జీవితాన్నే కలిగి వుంటారు.

మిమ్మల్ని మీరు జాగ్రత్తగా పరిశీలించుకు చూస్తే, ప్రతి మనిషీ తాను తనలో పొందవలసిన సద్గుణమునకు లేదా ఉత్తమ విలువకు, వాటి వ్యతిరేకగుణం కూడ అతనిలో వుంటుందని గమ నించగలడు. మీలో ప్రతి ఒక్కరు తన స్వంతమైన ఒక ప్రత్యేక ఆశయం, ఒక జీవితకార్యం, ఒక ప్రత్యేక గమ్యం కలిగి వుంటారు. వాటికి తోడుగా ఆ సమగ్రసిద్ధికి అవసరమైన ఆటం కాలు కూడ అతనిలో నిగూఢంగా వుంటాయి. నీలో నిరంతరం వెలుగునీడలు సమానంగా వున్నట్లుగా గమనింతువు. నీవు శక్తిని కలిగియుందువు. అదే సమయాన ఆ శక్తియొక్క వ్యతిరేక శక్తిని కూడా కలిగియుందువు. నీలో అంధకారము, నీడ వున్నట్లు నీవు గమనిస్తే, దానితోబాటు నీలో ఎక్కడో గొప్ప వెలుగు కూడ వుందని గట్టిగా విశ్వసించు. ఒకదాన్ని సాధించడానికి మరో దాన్ని ఎలా ఉపయోగించాలో ఆ బాధ్యత నీదే.

ఈ సత్యాన్ని గూర్చి అల్పంగా మాట్లాడుతారు. కాని యిది చాల ప్రధానమైన విషయం. జాగ్రత్తగా పరిశీలిస్తే యిది ప్రతివారి విషయంలోను అలాగే వుంటుంది. ఇది పరస్పర విరుద్ధభావాలకు దారితీయొచ్చు. ఐనా యిది పరమసత్యం. ఉదాహరణకు ఒక గజ దొంగ, పరమ నిజాయితీపరుడుగా వుండనగును. మరియు మితి మీరిన అసత్యవాది అత్యుత్తమ సత్యసంధుడు కాగలుగును.

కనుక నీలో ఎక్కువగా బలహీనత గోచరిస్తే నిరాశచెంద పనిలేదు. ఎందుకంటే ఆ బలహీనత గొప్ప దివ్యశక్తికి చిహ్నంగా వుండవచ్చు. కనుక 'నేనిలా వున్నాను. మరోలా వుండజాలను' అని అనవద్దు. ఎందుకంటే అది సత్యం కాదు. 'నీవలా వున్నావు' ఎందుకంటే నీవు అందుకు పూర్తి వ్యతిరేకంగా వుండితీరాలి కనుక.

నీకు కష్టాలన్నీ వున్నాయి. కాని వాటి వెనక అవి దాచిన సత్యం కూడా వుంది. వాటిని ఆ సత్యంగా రూపాంతరీకరించడానికి నీవు నెరవేర్చుకోవాల్సి వుంది. ఆ కష్టాలుండేది అందుకొరకే.

ఒక్కసారి దీన్ని అర్థం చేసికొంటే నీ కష్టాల్లో చాలా భాగం అంతమై నీవు చాల సంతోషంగా వుంటావు. ఈ స్థితిని అందుకొన్న వ్యక్తి అమితమైన చీకటి కోణాల మధ్య సతమతమవుతూ వుంటే 'నేను అత్యున్నత స్థాయికి ఎదగగలను' అని, లోతైన అగాధంలో పడివుంటే 'నేను ఎంతో ఎత్తుకు అధిగమించగలను' అని ఈ స్థితి నాకు చూపిస్తున్నదని అతడు చెప్పగలుగును.

మూలం: శ్రీమాత

అనువాదం: బి. నరసింహాయ్య

(*CWM* Vol. 2, p. 52; Vol. 4, pp. 117-18)

జీవనలక్ష్యం సుఖమేనా?

సుఖసంతోషాలను కోరుకోవడం న్యాయమే. అయితే ఇది నీవనుకుండే శరీరసౌఖ్యం కాదు. నీ ఆత్మతో నీవు దైవాన్ని కనుక్కొని నీ జీవితంలో దానిని వికసింప చేసినప్పుడు నీకు నిజమైన సంతోషము, దివ్యానందము కలుగుతాయి. — సంపాదకుడు

పాశ్చాత్యదేశాలలో బాగా ప్రాచుర్యం పొందిన భావాలు రెండున్నాయి. వాటిలో ఒకటి – జీవితానికిగల ప్రధాన లక్ష్యం సుఖం. రెండు – ఒక వ్యక్తి కొన్ని లక్షణాలతో పుడతాడు. వాటిని మార్చడం అసంభవం

మొదటిది ఒక మహనీయ సత్యానికి వికృతరూపం. మొత్తం సృష్టి అంతా ఆనందంపై ఆధారపడి వుంది నిజమే. ఈ ఆనందమే గనుక లేకపోతే అసలు జీవితమే లేదు. కాని ఈ ఆనందం భగవంతుని గుణం. అది సాపేక్ష ప్రపంచానికి అతీతం. (it is unconditioned) జీవితంలో సుఖం కోసం జరిపే అన్వేషణగా దీనిని తలచరాదు. మామూలు జీవితంలోని సుఖం, పరిస్థితులపై ఆధారపడుతుంది. ఆనందంగా బ్రతికే హక్కు తనకు వుంది అనే విశ్వాసం ఒక వ్యక్తి తన జీవితాన్ని తానే జీవించాలన్న సంకల్పానికి దారితీస్తుంది. ఈ వైఖరిలో మితిమీరిన అహంభావం వుంది. అది అనేక సంఘర్షణలకు, బాధలకు, నిరాశకు, నిరుత్సాహానికి, చివ రకు సర్వనాశనానికి దారితీస్తుంది.

ప్రస్తుత ప్రపంచంలో జీవితగమ్యం వ్యక్తిగత ఆనందం కాదు. సత్యచైతన్యం వైపు పురోగమించడం, అందుకు ఆత్మను మేలుకొల్పడం.

*

ఆనందం పొందడమే జీవితలక్ష్యమా? ఇది అసలు విషయాన్ని తలక్రిందులు చేయడమే. మానవ జీవనలక్ష్యం భగవంతుని కనుగొనడం. భగవంతుని అభివ్యక్తం చేయడం. సహజంగా అది ఆనందానికి దారితీస్తుంది. ఈ ఆనందం భగవత్ సాక్షాత్కార సిద్ధికి పర్యవసానమే కాని లక్ష్యం కానే కాదు. పర్యవసానాన్ని జీవితలక్ష్యం అనుకొని పొరపాటుపడడమే మానవాళిని వేధించే చాలా వేదనలకు మూలకారణం.

మూలం: శ్రీమాత

అనువాదం: కె. యజ్ఞన్న (జూన్ 2004 'అఖిల' నుండి)

(*CWM* Vol. 12, pp. 18, 312)

సృష్టికి గమ్యం నిర్వాణం కాదు

ఆధ్యాత్మిక పర్వతాల శిఖరము నిర్వాణమా? కానే కాదు. నీవు ఈ జీవితాన్ని, "దాని కర్మ ఇంతేలే" అని వదిలేయటం న్యాయమా! భగవంతుని ఉద్దేశము ఇదే అనుకోవడం ఎంత హాస్యాస్పదము. నువ్వు దర్శించిన ఆ ఉన్నతలోకాల్ని క్రిందకు తీసికొని వచ్చి ఈ మానవజీవితాన్ని కూడ పరిణమింపజేయాలి. దివ్యజీవనాన్ని స్థాపించాలి.　　　　*– సంపాదకుడు*

ఆత్మాన్వేషణలో మునిగి దానికోసం నిరంతరసాధన చేస్తూ చివరికి ఆత్మసిద్ధిని, ఆత్మైక్యతను సాధించి తన జీవితానికి వాటినే కర్తను చేసుకోవడమనేది ఒక మహాద్భుతమైన అనుభవము. ఆ మంత్రజాలంలో చిక్కగానే ఇక వారు ముగ్ధులైపోతారు. అంతేకాక ఆత్మసిద్ధికి దాన్నొక మూలసూత్రంగా భావించి ఇలా చెప్పడం ప్రారంభిస్తారు. "అది కనక సాధిస్తే, అంతా సాధించినట్లే. ఇక ఇక్కడ చేయవలసిందేమీ లేదు. మీ గమ్యాన్ని మీరు చేరారు."

ఆ స్థాయిని దాటిపోవాలంటే నిజానికి చాలా ధైర్యం కావాలి. ఆ ఆత్మానుభూతి పొందినది ఒక warrior soul అయితే కేవలం తన ఆత్మానందంతో తృప్తి చెందదు. అందరూ అదేవిధంగా సాధనచేసి ఆనందం పొందాలని కోరుకుంటుంది. సంతోషం పొందనివారిపట్ల సానుభూతితో, కరుణతో తన విజ్ఞత నుపయోగించి వారంతా ఈ స్థాయికి చేరేటట్లు సహాయం చేస్తుంది. కష్టపడలేని వారంతా ఈ విధమైన ఆత్మోపలబ్ధిని పొంది హాయిగా ఉంటారు. ప్రాపంచిక జీవితానికిక చరమగీతం చెప్పినట్లే. అంతే కదా! ఇంతేనా! భగవంతుని ఉద్దేశం ఇదేనని నమ్ముతున్నావా?

(నిశ్శబ్దం)

ఇది మాత్రమే భగవత్సంకల్పం అనుకుంటే, అంతకంటే హాస్యాస్పదమైన విషయం ఇంకోటి ఉండదు. సృష్టిచేసింది సృష్టిలోంచి బయటపడటానికేనా? అంత కష్టనష్టాల కోర్చి చేసిన సృష్టి దాన్నుంచి బయటపడాలనుకునేటంత విచిత్రంగానూ, విషా

దభరితంగానూ ఉండేటట్లయితే అసలీ సృష్టి ప్రారంభించకుంటే బాగుండేది కదా.

కానీ అసలు విషయం అది కానే కాదు. దాన్ని అర్థం చేసుకునే పద్ధతి ఉంది. అది తెలుసుకోదలచినవారు పూర్తిగా అంతర్ముఖులై లోలోనికి చొచ్చుకొనిపోవాలి. అహంభావాన్నే కాక అహంతనే విసర్జించాలి. ఏ విధమైన సంకోచమూ, స్వార్థమూ లేకుండా సంపూర్ణ సమర్పణ కావించుకున్నప్పుడే ఆ భగవంతుని సృష్టి ప్రణాళికంతా పూర్తిగా బోధపడుతుంది. సృష్టి ఒక హాస్యాస్పద విషయం కాదని, బయల్దేరి వెళ్లి మళ్లీ అక్కడికే తిరిగి రావలసిన ముళ్ళబాట కాదనీ వారు గ్రహిస్తారు. పైపెచ్చు సృష్టిలో ఎంత మాధుర్యముందో అందరికి తెలియచెప్పగలుగుతారు; జీవితంలోని అందమూ, ఆనందమూ, బ్రతకటంలోని మధురానుభూతి, ఉదాత్తత, నిరుపమాన ప్రగతి, నిరంతరాభివృద్ధి మొదలైనవన్నీ చాటి చెప్పేందుకే సృష్టి జరిగిందనే విషయం అవగతమవుతుంది. సృష్టిలో ప్రతివస్తువుకీ ఓ సార్థకత ఉందని తెలుసుకొని తాము పడ్డ కష్టాలు, సంఘర్షణలూ అన్నీ మరచిపోయి తమ లక్ష్యం చేరుకోవాలనే కార్యక్రమంలో పూర్తిగా మునిగిపోతారు, తమ లక్ష్యాన్ని సాధించగలమనే నిశ్చితత్వం వారికి పూర్తిగా ఏర్పడుతుంది. ఇదంతా తెలుసుకోవాలంటే 'నేను' అనే అహంభావాన్ని పూర్తిగా ఒదులుకోవాలి. తన అస్తిత్వానికి మూలాధారమైన భగవంతుని నుంచి తను వేరుగా ఉన్నాననే భావాన్ని వదిలిపెట్టాలి. జీవితానికి గమ్యాన్ని, లక్ష్యాన్ని తెలుసుకోడానికి ఇది ఒక్కటే మార్గము. పనికిరాని దుస్తులను విడిచేసినట్లు అహాన్ని జారవిడిచెయ్యడమే కర్తవ్యము.

ఇలా చేసిన ప్రయత్నం పూర్తి ప్రతిఫలాన్నిస్తుంది. అంతేకాక మార్గంలో ఒంటరిగా ఉన్నామనుకోనక్కర్లేదు. విశ్వాసంతో ప్రయత్నిస్తే సహాయం కూడా లభిస్తుంది.

మూలం: శ్రీమాత

అనువాదం: డా॥ ఎ. ప్రభావతి, డా॥ ఎ. వెంకటరామ శాస్త్రి

(*CWM* Vol. 9, pp. 426-28)

భువన జీవన పరమావధి

శ్రీఅరవిందుల 'ది లైఫ్ డివైన్' లోని ఆఖరి ఆరు అధ్యాయాలు దివ్యజనని చదవడం ప్రారంభించారు.

> *"ప్రకృతిలో అంతర్నిక్షిప్తమైన పరమాత్మను మృణ్మయ జీవరూపం ఆవిష్కరించేంతవరకు భౌతిక ప్రపంచంలో చైతన్య పరిణామం, ఆధ్యాత్మిక పరిణామం సాగుతూం టుంది* (constant developing self-formation). *అదే ఈ భువనజీవనానికి అత్యంత విశిష్టమైన లక్ష్యం, పరమావధి. ఒక దట్టమైన భౌతిక నిశ్చేతనలో పరమాత్మ, పరాత్పర మహాసత్యం దాగి వుంది. అదే అంతర్లయనం* (involution). *ఈ పరిణామ ప్రస్థాన వైశిష్ట్యం మొదట్లో ఈ అంతర్లయన ప్రక్రియ ద్వారా అంతర్నిక్షిప్తమైనది. ఒక దివ్యశక్తి – అదే సృష్టిశక్తికి తొలిరూపం, అచేతనగా కనిపిస్తుంది. అయిన ప్పటికీ ఒక మహామేధస్సు చేసే పనిని అది చేస్తుంది.*
>
> *శ్రీఅరవిందులు 'ది లైఫ్ డివైన్' పుట 824*

ఈ విశ్వజీవనంలోని తొలిసూత్రమేమిటో మొదటి వాక్యం ప్రకటి స్తుంది. ముందు అర్థం చేసుకోవాలి. Central motive అని శ్రీఅర విందులు అంటారు. పదార్థంలో దాగివున్న దైవము యొక్క సంపూర్ణ అభివ్యక్తిని సమావిష్కరించడమే ఈ భువనజీవన పరమ ప్రయోజనం. ముందు ఆ దైవాన్ని జాగృతం చేయాలి. పోషించి ప్రమాణం పెంచాలి. చివరికి ఆవిష్కరించాలి. పదార్థం అంతరాంతరాలలో పరమాత్మను విముక్తం చేసే క్రమవికాస సరళి పదార్థంలో నుండి బాహ్యప్రకృతిలోకి పురోగమిస్తుంది.

మొదట మనకు రాళ్లురప్పలు, మట్టి, ఖనిజాలతో కూడిన ఒక ఖనిజ సామ్రాజ్యం మిక్కిలి అచేతనంగా కనిపిస్తుంది. అయితే ఈ అచేతన వెనుక పరమాత్మ జీవనధార, దివ్యచైతన్య స్రవంతి ఉన్నది. అది పూర్తిగా నిక్షిప్తం, సుషుప్తిలో ఉన్నట్లు కనిపిస్తుంది. బాహ్యదృష్టికి అలా కనిపిస్తుంది. పదార్థంలో ఒక చైతన్యం అభి వ్యక్తమవడానికి వీలుగా పైకి జడంగా కనిపించే ఈ పదార్థాన్ని,

ఆ పరాచేతన నెమ్మదిగా, క్రమంగా పరివర్తింప జేస్తుంది. ఈ జడ పదార్థం బాహ్యాదృష్టికి ప్రాణం లేకుండ, జీవం లేకుండ చైతన్య రహితంగా అనిపిస్తుంది.

ఒక రాయిని తీసుకొని, దానిని మామూలు నేత్రాలతో చూస్తే "దీనికి జీవం లేదు. చేతన అసలే లేదు" అంటాము. బాహ్యా రూపాల వెనుక ఏముందో చూడగల్గితే, ఆ పదార్థంలో నిక్షిప్తమై, ప్రతి అణువులోను ఒక సర్వోన్నత దివ్యపరాత్పర మహాసత్యం భాసిస్తూంటుంది. లక్షలాది సంవత్సరాల పర్యంతం ఈ సత్యం క్రమంగా పనిచేస్తూ పరమాత్మను వ్యక్తం చేయగల రూపాన్ని సంసిద్ధం చేస్తున్నది. అదే జడపదార్థాన్ని రూపాంతరం చెందించడం. ఈ జీవన ఇతిహాసం మహాప్రస్థానంగా ముందుకు కదులుతుంది. ఎలా? రాయి నుండి హఠాత్తుగా జీవధాతువు మొలకెత్తింది. జీవాన్ని బహిర్గతం చేసే సేంద్రీయ పదార్థం అవతరించింది. ఇది ఒక్కసారి జరగలేదు. క్రమానుగతిగా వచ్చిన అనేక జాతుల (species) ద్వారా సంభవమైంది. ఖనిజ, వృక్షరాజ్యాల మధ్య మధ్యంతర మూలకాలు వున్నాయి. అవి ఖనిజ సామ్రాజ్యానికి చెందినవో, వృక్షజాతికి చెందినవో, ఎవరికీ తెలియదు. వాటిని జాగ్రత్తగా పరిశీలించాలి. ఈ రెండు విభాగాలకు చెందని విచిత్రమైన జాతిప్రాణులు (species) కూడా ఉన్నాయి. అవి వృక్షాలనీ చెప్పలేము, ఖనిజాలనీ చెప్పలేము. అప్పుడు వృక్షసామ్రాజ్యం వృద్ధి చెందసాగింది. జీవం ఏర్పడింది. ఒక మొక్క మొలకెత్తి, పెరిగి పెద్దదవడం జరిగింది.

తొలి అద్భుతం – జీవం ప్రాదుర్భవించడంతో బాటు అది రాలిపోవడం, కుళ్ళిపోవడం, విచ్ఛిన్నమైపోవడం కంటె మరో సంఘటన ప్రారంభమైంది. రాయిలోకన్న జీవప్రపంచంలో ఇది మరింత వేగంగా జరగడం గమనార్హం. ఇతర శక్తుల ఆఘాతం నుండి ఒక రాయిని రక్షించవచ్చు. ఆ రాయి ఎంతకాలమైనా అలాగే వుంటుంది. కాని మొక్కలో పెరుగుదల, ఆరోహణ, పతనం, కుళ్ళిపోవడం జరుగుతుంది. అయితే ఇది ఒకానొక చేతనా పరిధిలోనే సంభవిస్తున్నది. వృక్షశాస్త్రాన్ని అధ్యయనం చేసినవారికి అక్కడ

ఒక చేతన వుందని తెలుస్తుంది. మొక్కకు సూర్యరశ్మి అవసరం. జీవించడానికి మొక్కలు పెరిగేటట్లు చేసే క్రియాత్మక శక్తి సూర్యుడు అందిస్తాడు. సూర్యకాంతి లేనిచోట మొక్కను పాతితే, అది సూర్యుని వెలుగును అందుకోవడం కోసం ప్రయత్నిస్తుంది. అటు పెరుగుతుంది. మనిషి అడుగుపెట్టని స్వచ్ఛమైన అరణ్యంలో మొక్కలు సూర్యకాంతి కోసం తిన్నగా, బాగా పైకి పెరుగుతాయి. అది ఆసక్తికరమైన విషయం.

గోడలు అడ్డుగా వున్న ఇంటి ముందువున్న ప్రదేశంలో మొక్కలు పెంచుతారు. సాధారణంగా దాని ఎత్తు ఇంత (చేత్తో చూపిస్తూ) అన్నట్లు వుంటుంది. కాని సూర్యకాంతి కోసం అది గోడల ఎత్తును దాటడానికి ప్రయత్నిస్తుంది. అందువల్ల మొక్కలో చైతన్యం, జీవేచ్ఛ వున్నాయి. జీవించాలన్న గట్టి పట్టుదల అది. అప్పటికే అది పరిణామక్రమంలో వ్యక్తమైనది. ఈ విధమైన జాతులు మరిన్ని పెరగడంతో, అవి మొక్కలలాగా కనిపించవు. కాని ఇంకొక రూపం దాల్చవు. అటువంటి మధ్యంతరస్థితి ఒకటి వున్నది. చాలా ఆసక్తిదాయకమైన species వున్నాయి.

మాంసాహార మొక్కలు వున్నాయి. తెరిచివున్న నోళ్ల లాగా వుంటాయి. ఒక ఈగను అందులో వేస్తే, ఆ మొక్క దానిని మింగివేస్తుంది. అది చెట్టూ కాదు. అలా అని పూర్తిగా జంతువూ కాదు. ఇటువంటి చెట్లు ఎన్నో వున్నాయి.

ఇక జంతువుల సంగతి చూద్దాం. మొట్టమొదట అవతరించిన మృగాలను చెట్లనుండి వేరుచేయడం కష్టం. వాటికి చైతన్యం లేదనే చెప్పాలి. అయితే వివిధ రకాల జంతుజాతిలో ఉన్నతస్థాయి మృగాలవరకు – వాటిలో చైతన్యం కనిపిస్తుంది. వాటికి తమదైన యిచ్ఛ వుంటుంది. అవి చాలా చైతన్యవంతంగా వుంటాయి. చాలా తెలివైనవిగా వుంటాయి. ఉదాహరణకు ఏనుగు. ఏనుగుల గురించి ఎన్నో కథలు వున్నాయి. అవి మీకు తెలుసు. వాటికి అద్భుతమైన మేధాసంపద వుంది. కాబట్టి అప్పటికే సూచనప్రాయమైన మనస్సు (బుద్ధి) ఏర్పడిందన్న మాట.

ఈ మనస్సు క్రమవికాసం చెంది ఒకసారి మృగదశకు పరిణామం సాగింది. ఆ మృగాలు తర్వాత అంతరించిపోయి వుండ వచ్చును. వాటి శిథిలావశేషాలు కనిపించాయి. ఒక కోతిలాంటి మధ్యంతర మృగం, లేదా కోతిలాంటి మృగం వుండి వుండాలి.

మనకు తెలిసిన కోతిలాంటిది కాదు. రెండు కాళ్లతో నడిచే వానరం లాంటిది. అక్కడ నుండి మనం మనిషివద్దకు వస్తున్నాం. మనిషి పరిణామం ఇక్కడ నుండే ప్రారంభమైంది. మనిషికి చాలా ఉన్నతమైన మేధాసంపత్తి ఉందని అనలేము. అయితే ఈ దశలో బుద్ధి పనిచేయడం, స్వేచ్ఛాజీవనం, ప్రకృతి పరిసరాలకు, శక్తులకు స్వతంత్రరీతిలో ప్రతిస్పందించడం ఇవన్నీ మనం గమనించవచ్చును. మనిషిలో ఉన్నతచైతన్యం వరకు ఎన్నో భూమికలున్నాయి. ఆధ్యాత్మిక జీవనం సాగించే శక్తియుక్తులు అతనిలో వున్నాయి. ఈ పుటలో శ్రీఅరవిందులు చెప్పే విషయం ఇదే –

మనిషి తన అత్యున్నత దశలో ప్రకృతిపై ఆధారపడకుండా జీవనం ప్రారంభించాడు. He can become altogether independent. తనలో ఆధ్యాత్మిక చైతన్యం సిద్ధిని పొందిన మనిషి, తానెక్కడ నుండి ఆవిర్భవించాడో, ఆ దివ్యచైతన్యస్థితితో ప్రత్యక్ష సంబంధం పెట్టుకోగల మనిషి ప్రకృతి విధించే సంకెళ్ళ నుండి, ప్రకృతి శక్తుల పరిష్వంగం నుండి విడివడి స్వతంత్రజీవనం సాగించగలడు.

ప్రకృతి పూర్తి ప్రక్రియతో పనిలేకుండా, తనలో ప్రత్యక్ష సంబంధం పెట్టుకోగల ఒక మానవరూపాన్ని నిర్మించగల దశకు, తనను తాను అభివ్యక్తం చేసుకోగల ఒక చైతన్యవంతమైన ఉపకరణాన్ని రూపుదిద్దుకోగల దశకు – అంతర్గత దివ్యచైతన్యం, సర్వోన్నత ఆధ్యాత్మిక సత్యం, ఒక్క మాటలో – దైవం చేరుకున్నది.

మూలం: శ్రీమాత

అనువాదం: కె. యజ్ఞన్న

(*CWM* Vol. 9, pp. 208-12)

మానవుని యథార్థ ఆరామం[1]

మనిషి జీవన సాఫల్యమంతా వ్యక్తావ్యక్తములను కలిపే సేతువును నిర్మించుకోవడం. అదొక బంగారు వంతెన. దానితో గాఢాంధకారమయమైన భౌతిక ప్రపంచం సర్వోత్కృష్టమైన కాంతిమయ ప్రపంచం ముడిపడతాయి. ఇదీ చేయనినాడు మానవజీవితం వ్యర్థం. మనిషి తన యథార్థ సత్తాకు – అయథార్థ అసత్తకు కొలికిపూస. అతడు శూన్యాన్ని కలిపే కాలివంతెన. అతడు నాలుగు దారులు కలిసే కూడలి. సిలువలో నాలుగు చేతులూ కలిసే నడిమి చోటు. అతని చైతన్య సింహాసనం – రెండు లోకాలను కలిపే బిందువు – ఆ చైతన్యబిందువు స్వరూపమేమిటి? అగమ్యమూ, అచింత్యమూనైన అనంతతత్త్వం నిర్దిష్టరూపధారణం చేసే చోటది. అక్కడ నుండి అనంతమైన విభిన్నరూపాలను ధరిస్తుంది. అది మనిషికి శాశ్వతమైన నివాసగృహం....

ఆ కేంద్రం పరమ ప్రేమాలయం. పరిపూర్ణ చైతన్యపద్మం. స్వచ్ఛమైన పూర్ణజ్ఞానరాశి. ప్రభూ! నిన్ను నిజంగా ప్రేమిస్తూ నిన్ను ఆరాధించాలని వాంఛించేవారిని అక్కడ స్థాపించు. దాని వల్ల నీ సృష్టి కార్యక్రమం పూర్తి ఆవుతుంది. ఆ మణిసేతువు నిర్మితం కాక తప్పదు. తద్వారా నీ దివ్యశక్తులు ఈ ప్రపంచంపై శరత్కాలపు వెన్నెలగా వర్షించక తప్పదు.

మూలం: శ్రీమాత

అనువాదం: తుమ్మపూడి కోటీశ్వరరావు

(*CWM* Vol. 1 , p. 232)

---

[1] నివాసస్థానం – ఇల్లు

కొన్ని దీపికలు

అంతరంగంలోకి చొచ్చుకొనిపోయి అక్కడ పరివేష్టించి వున్న దైవాన్ని దర్శించుకొని సర్వసమర్పణం గావించుకోవడమే మానవ జీవితానికి పరమావధి. అలా సమర్పించుకొంటే మన చర్యలకూ, అనుభూతులకూ ఆయనే కర్తగా వ్యవహరించగలడు. దాని వల్ల మన జీవితానికి ఉజ్జ్వలమైన లక్ష్యం ఏర్పడుతుంది.

*

అది చాలా తేలికే. మన అంతరంగంలో ఉన్న దానితోనే మనం ఏకత్వం పొందాలి.

*

ప్రశ్న: అమ్మా, అయితే నేను ఏమిటి?

జవాబు: బాహ్యంగా చైతన్యవంతుడు కావాలనుకొనే ఒక అచైతన్య స్వరూపుడవు.

అంతర్గతంగా దేహంలో ఆవిర్భూతుడవు గావాలనుకొనే చిదాత్మవు.

*

సాధారణ జీవితానికి ఆశయం కర్తవ్యనిర్వహణ. ఆధ్యాత్మిక జీవితానికి ఆశయం దైవాన్ని తెలుసుకోవడము.

*

జీవితాన్ని త్యజించడం అసలైన ఆధ్యాత్మికత కాదు; దివ్యమైన పరిపూర్ణతతో జీవితాన్ని సంపూర్ణం చేసుకోవడమే ఆధ్యాత్మికత.

*

ప్రశ్న: మనమీ జీవితాన్ని ఆదర్శవంతంగా గడపాల్నంటే ఏం చేయాలి?

జవాబు: దైవాన్ని అభివ్యక్తం చేయడమే జీవితానికి అర్థం; అదే దాని సత్యమూ, ఏకైక వ్యాపారమూనూ.

*

ఆశయరహితమైన జీవితం ఎప్పటికీ దుఃఖదాయకమే.

ప్రతివారికీ ఒక ఆశయమనేది ఉండాలి. నీ ఆశయం మీదనే నీ జీవితం ఆధారపడి ఉంటుందనే విషయం మరవవద్దు.

*

నీ భవిష్యత్తు నీ చేతుల్లో ఉంటుందనే విషయం మాత్రం పూర్తిగా నమ్మవచ్చు. నీవు ఏ విధంగా ఉండాలని కోరుకుంటావో ఆ విధంగానే తయారవుతావు. ఈ ఆదర్శం, ఆకాంక్ష ఎంత ఉత్కృష్టంగా ఉంటే నీకు సిద్ధించేది కూడా అంత ఉన్నతంగా ఉంటుంది. అందుకు తగిన దృఢనిశ్చయంతో నీ జీవితాశయాన్ని ఎల్లప్పుడూ గుర్తెరిగి మసులుకోవాలి.

*

జీవితానికి ఒక పరమ ప్రయోజనముంది. అదేమిటంటే భగవంతుని కనుగొని సేవించడమే.

ఆ దైవం ఎక్కడో లేడు – మనలోనే, మన అంతరంగంలో నిగూఢంగా, మన ఆలోచనలకు, స్పందనలకు అతీతంగా ఉంటాడు. ఆ దైవం వలన శాంతి, స్థిరతలు లభించటమే కాదు, కష్టాలన్నిటికీ పరిష్కారం కూడా దొరుకుతుంది. నీ కష్టాలను, సమస్యలను ఆయనకు అప్పగించేస్తే ఈ ఊబిలోనుంచి ఆయనే నిన్ను బయటకు లాగుతాడు.

*

నీ అల్పిష్టిరూపాన్ని దాటి అంతరంగంలోకి ప్రవేశించగలిగితే అన్ని ద్వారాలు తెరవగల తాళంచెవి నీకు లభ్యమవుతుంది.

*

పూర్ణాతిపూర్ణచైతన్యం కోసం, పూర్ణాతిపూర్ణమైన అభివ్యక్తి (ఆవిర్భావ) దిశగా మనం నిర్విరామంగా పురోగమిద్దాం,

మూలం: శ్రీమాత

అనువాదం: డా॥ ఎ. ప్రభావతి, డా॥ ఎ. వెంకటరామ శాస్త్రి

(*CWM* Vol. 14, pp. 14, 19, 7; Vol. 13, p. 365; Vol. 7, p. 262; Vol. 12, pp. 3, 122; Vol. 14, p. 5; Vol. 5, p. 41; Vol. 15, p. 101)

అనుబంధం:

సత్యాధిరోహణ (జీవనలీల)

పూర్వరంగం

కళాకారుడి స్టూడియో

సంధ్యావేళ, చీకట్లు కమ్ముతున్నాయి. కొంతమంది సత్యాన్వేషకులు సమావేశమయ్యారు. ఆ సమావేశం పూర్తి కావస్తున్నది. అందలి సభ్యులు:

సజ్జనుడు (మానవతావాది)

నిరాశావాది

శాస్త్రజ్ఞుడు

ఇద్దరు ప్రేమికులు

కళాకారుడు

ముగ్గురు విద్యార్థులు (ఒక బాలిక, యిద్దరు బాలురు)

సర్వసంఘపరిత్యాగి అయిన ఓ సన్యాసి

దివ్యసత్యాన్వేషకులు (పరమాత్మనే నమ్మిన, పరమాత్మకు ప్రీతిపాత్రులయిన యిద్దరు.)

తెర లేస్తుంది

కళాకారుడు: ప్రియమిత్రులారా, మన సమావేశం ఒక కొలిక్కొచ్చింది. ఇప్పుడు మనం ఏకగ్రీవంగా తీర్మానం చెయ్యాలి. ఇంకా మీరు చెప్పదల్చుకున్నదేమైనా వుంటే చెప్పండి. తరువాతే చివరి నిర్ణయం తీసుకుందాం.

మానవతావాది: సరే, నే చెప్తున్నా. నా జీవితమంతా మానవ సేవకే అంకితం. ఎన్నేళ్లుగానో, ఎన్నో రకాల సేవ చేసేను. కాని, యెందుకో అవి నాకు సంతృప్తి నివ్వలేదు. ఆ మూలసత్యమేదో తెలుసుకుంటేనే నా సేవ సార్థకమవుతుంది. తాత్కాలికమైన యీ విధానాలేవీ శాశ్వత పరిష్కారాలు కావు. ఒక్క సత్యచైతన్యమే మానవజాతిని రక్షిస్తుంది. అదే నా ధ్యేయం.

నిరాశావాది: నేను జీవితంలో యెన్నో ఒడిదుడుకుల పాలయ్యేను. ఎన్నో ఆశాభంగాలు, యెన్నో అన్యాయాలు, ఘోరమైన కష్టాలు

యీ కళ్ళతో చూసాను. ఇంక దేనిలోను నాకు నమ్మకం లేదు. ఈ ప్రపంచంనించి, మనుష్యుల నించి ఆశించేదేమీ లేదు. ఇంక ఒక్కటే ఆశ మిగిలింది. అదే సత్యము. అప్పుడైనా పరిస్థితి చక్క బడుతుందో? లేదో?

మొదటి అన్వేషకుడు: మమ్మల్ని చూడండి. ఒకే ఒక ఆకాంక్ష మమ్మల్ని కలిపింది. ఏ యితర వాంఛలు, వుద్రేకాలు, భౌతిక సంబంధాలు మా మధ్య లేవు. అన్నిటికంటే బలంగా ఆకర్షించి, మా జీవితాలను అధిగమించేట్టు చేసింది సత్యాన్వేషణ మాత్రమే. అదే నిత్య సత్యాన్వేషణ.

ఒక ప్రేమికుడు: (అన్వేషకుల్ని చూపుతూ) మేం మాత్రం అలా కాదు. (ప్రేయసి మీద చేయివేసి) మా జీవితాలు ప్రేమకే అంకితం. మేం ఒకరి కోసం ఒకరు బతుకుతాం. శరీరాలు వేరైనా ఒకే ప్రాణం, ఒకే వూపిరి, ఒకే హృదయం, ఒకే భావం, ఒకే రాగం. అంతెందుకు? సర్వస్వం ఒకరికొకరుగా ప్రేమతో, ప్రేమలో, ప్రేమ కోసమే బతుకుతున్నా ప్రేమజీవులం. ఆ ప్రేమ మూలసత్యం కను క్కోవడం మా లక్ష్యం.

సన్యాసి: సత్యమంత తేలికగా దొరుకుతుందా! ఎంత కష్టపడాలి! దారి చూస్తే నిటారుగా, కాలు పెట్టడానికి శక్యం కాదు. ఎంత నిష్ఠ! ఎంత నియమం! ఎన్ని ఆటంకాలు! ఎన్ని మాయలు! ఎన్ని ప్రలోభాలు! ఇవన్నీ తట్టుకోవాలంటే పట్టువదలని కృతనిశ్చయం, ఇనప నరాలు కావాలి. ఈ పవిత్రలక్ష్యాన్ని చేరడానికి ఏ త్యాగా నికైనా సిద్ధపడాలి. అందుకు నేను సిద్ధం. ఆ యోగ్యత కోసమే తపస్సు చేస్తాను.

కళాకారుడు: (ఇతరుల వంక చూస్తూ) అందరూ చెప్పడం అయిందా? ఏకగ్రీవంగా ఒప్పుకున్నట్టే కదా. ఇక సత్యానికి మార్గ దర్శి అయిన ఈ పవిత్ర పర్వతాన్నధిరోహిద్దాం. ఇది చాలా కష్ట తరమయనది. బృహత్తర కార్యక్రమం. అయితేనేం మహత్తరమ యింది. ఎప్పుడైతే మనం పర్వతశిఖరాగ్రాన్ని చేరుతామో, అప్పుడు సత్యదర్శనమయిందన్న మాటే. అక్కడితో సమస్యలన్నీ పరిష్కా

రమయిపోతాయి. అందుచేత రేపే బయలుదేరుదాం. సిద్ధంగా వుండండి. సెలవు.

(అందరూ సెలవు తీసుకుని నిష్క్రమిస్తారు)

ఏడు దశలు

మొదటి దశ

అది ఒక పచ్చని పీఠభూమి. అక్కడి నించి మొత్తం లోయ అంతా చూడవచ్చు. ఇక్కడనించి దారి కొంతవరకు చాలా సౌక ర్యంగా, వెడల్పుగా వుంటుంది. తర్వాత హఠాత్తుగా చిన్న చిన్న శిఖరాల చుట్టుముట్టే యిరుకు దారులుగా మారుతుంది. ఎడమ వైపు ఎత్తైన పర్వతం వస్తుంది. అక్కడి వరకు అందరూ కలిసి వస్తారు. శక్తి అంతా కూడగట్టుకుని కుతూహలంగా దిగువనున్న లోయలోకి తొంగి చూసేరు. ఇంతలో ఆ మానవతావాది అందర్నీ వుద్దేశించి చెప్పసాగాడు.

మానవతావాది: మిత్రులారా! నేనో ముఖ్యవిషయం, సీరియస్‌గా చెప్తున్నా వినండి. (అందరూ ఆసక్తిగా వింటారు)

ఇంతవరకు మనం చీకూచింతా లేకుండా హాయిగా వచ్చాం. ఈ అనుభవంలో జీవితాన్ని చక్కగా ఆకళింపు చేసుకోగలం. నిత్య జీవితంలో సమస్యలు, మానవజాతి బాధలు, వాటి కారణాలు పూర్వంకంటె బాగా అర్థం చేసుకోగలం. ఎంతో లోతుగా, విశా లంగా ఆలోచించ గలుగుతున్నాం. నేను కోరుకున్న పరిష్కారానికి చేరువయ్యాం. (నిశ్శబ్దం)

ఈ ముఖ్యమైన మలుపులో, అతి ముఖ్యమైన ఒక నిర్ణయా నికి రావాలి. ఇక ముందు ఈ దారి నిటారుగా మారి ఎక్కటం కష్టమౌతుంది. పర్వతాన్ని యిటువైపునుండి అటువైపుకు దాటి వెళ్లాలి. అక్కడి నుంచి లోయకాని, మనుష్యులుకాని కనబడరు. అంటే నేను నా మానవసేవ కార్యక్రమాలకి తిలోదకాలివ్వాలి. మానవసేవకే అంకితమౌతానన్న ప్రతిజ్ఞకి ద్రోహం చెయ్యాలి. అది నా వల్ల కాదు. అందుకే నేను మిమ్మల్నందర్నీ వదిలి నా

కర్తవ్య నిర్వహణకి తిరిగిపోతున్నాను. తప్పదు. మీతో వుండ మని నన్ను బలవంతపెట్టకండి.

(అతడు క్రిందకు దిగిపోసాగాడు. మిగిలినవారందరూ ఆశ్చర్యచకి తులై, నిరాశగా ఒకరి మొహాలొకరు చూసుకుంటారు.)

సన్యాసి: అయ్యో పాపం! బాహ్యప్రపంచపు మాయలోపడి కొట్టుకుంటున్నాడు. కర్మబంధాల నించి తప్పించుకోలేక వెనక్కి తిరిగిపోయాడు. మనం దేనికీ చలించకూడదు. నిర్విచారంగా, నిస్సంశయంగా మన దారిన మనం పోదాం పదండి.

(వాళ్లందరూ మళ్లీ బయలుదేరారు)

రెండవ దశ

కొంచెం ఏటవాలుగా ఉన్న దారి పోను పోను నిటారుగా మారి, మలుపు తిరగడంతో యెటుపోతున్నదీ తెలుసుకోవడం కష్టమవు తుంది. క్రిందివైపు పొడవుగా, తెల్లని దట్టమైన మేఘం ప్రపంచం నించి వీరిని పూర్తిగా వేరు చేస్తున్నది.

అందరూ అంతో యింతో సంతోషంగానే వున్నారు. అందరి కంటె వెనకగా వస్తున్న నిరాశావాది మాత్రం విచారంగా కాళ్లీ డ్చుకుంటూ వస్తున్నాడు. దార్లో రోడ్డు పక్క కూలబడిపోయాడు. రెండు చేతుల్తో తలపట్టుకుని కదలకుండా కూర్చున్నాడు.అతడు రాకపోవడంతో మిగిలినవాళ్లు వెనక్కి తిరిగి చూసేరు. విద్యార్థుల్లో ఒకడు వెనక్కి నడిచి అతనిని సమీపించి భుజం మీద చేయి వేసి:

మొదటి విద్యార్థి: ఇదేమిటి? ఏమయింది నీకు? అలిసిపోయావా?

నిరాశావాది: (అతడిని వెళ్లిపోమ్మంటూ) ఏం లేదు. నన్నొది లేసెయ్యి. ఇది చాలు బాబూ! ఇక నా వల్ల కాదు.

మొదటి విద్యార్థి: అదేమిటి? రా! పోదాం. మనసు కుదుటపర్చుకో.

నిరాశావాది: వద్దు. నన్నొదిలేయమని చెప్పానుగా. ఇది శుద్ధ తెలివితక్కువ, మొండిసాహసం. *(వారి పాదాల దిగువ మేఘాన్ని చూపుతూ.)* అటుచూడు మనం ప్రపంచంతో, జీవితంతో వేరు పడిపోయాం. ఈ ఆరోహణకర్థం లేదు. *(దారి లంబంగా తిరిగిన*

వైపు చూపిస్తూ) మనం ఎటుపోతున్నామో, అసలు తెలియడం లేదు. ఇది మూర్ఖత్వం కాకపోతే మరేమిటి? అసలు సత్యమంటూ వుందో లేదో తెలియదు. ప్రపంచం, జీవితం ఏవీ? మనందరం యీ నరకంలో ఖైదీలం. యిదే సత్యం. ఇంకా ముందుకి మీరు వెళ్తే వెళ్లండి. నేను మాత్రం కదలను. మీతో రాను.

అతను మళ్లీ రెండు చేతుల్లో తలపెట్టుకుని కూర్చున్నాడు. ఇంక నచ్చచెప్పి లాభం లేదని ఆ విద్యార్థి వెనుతిరిగి పోయాడు. అందరూ మళ్లీ బయలుదేరారు.

మూడవ దశ

శాస్త్రజ్ఞుడు, కళాకారుడు మాట్లాడుకుంటూ వెనకబడిపోయారు. సంభాషణ ముగింపులో వుంది.

శాస్త్రవేత్త: మనం కొంచెం తొందరపడి యీ సాహసయాత్రకి బయల్దేరామనిపిస్తున్నది. నా మనసులో మాట చెప్పాను సుమా!

కళాకారుడు: నిజమే. ఇంతవరకు మనం అధిరోహించిన దానిని బట్టి చూస్తే యిదంతా వ్యర్థప్రయత్నమే అనిపిస్తున్నది. అయితే దీనివల్ల కొన్ని ఆసక్తికరమైన విషయాలు తెలుసుకున్న మాట నిజం. కాని అందువల్ల కలిగే ప్రయోజనం ఏమంత చెప్పుకోతగ్గది కాదు కదా!

శాస్త్రవేత్త: అవును. నాకు నా పద్ధతులే ఇష్టం బాబూ. అవి ఎంతో సహేతుకంగా వున్నాయి. అది స్థిరమైన ప్రయోగాల మీద ఆధారపడ్డవి. ఒకటి పూర్తిగా సత్యమని ఋజువయితేనే గాని తరవాత అంశానికి పోను నేను. సరే! మన మిత్రుల్ని పిలుద్దాం. వాళ్లతో ఒక ముఖ్యవిషయం చెప్పాలి.

అందర్నీ పిలుస్తాడు. అందరూ శాస్త్రవేత్త దగ్గరికి చేరగానే అతడు మాట్లాడడం మొదలెడతాడు.

శాస్త్రజ్ఞుడు: ప్రియమిత్రులారా! సహ ప్రయాణీకులారా! మనం ప్రయాణం చేస్తున్నకొద్దీ ప్రపంచానికి, సత్యానికి దూరమయి పోతున్నాం. రానురాను చిన్నపిల్లల్లా ప్రవర్తిస్తున్నామేమో అనే ఆందోళన నాలో క్షణక్షణం పెరిగిపోతున్నది. ఈ పర్వతం ఎంత

నిటారుగా, ప్రమాదకరంగా వున్నదో చూసారా! దాని శిఖరాగ్రం అంతుపట్టని యెత్తులో, యెంత దుర్గమంగా వుందో కూడా తెలిసొచ్చింది. అది చేరుకుని సత్యదర్శనం చెయ్యడం సాధ్యమా చెప్పండి. అసలు మనం పైకి వెళ్లే మార్గం గురించి కాని, దానిలో వుండే కష్టనష్టాల గురించికాని యేమీ తెలుసుకోకుండా బయల్దేరాం. మనం తప్పుతోవలో పోతున్నామేమో? సరైన త్రోవలో పోతున్నామో లేదో కూడా తెలియడం లేదు. దీనిని బట్టి మన ఆశలు ఫలిస్తాయని గ్యారంటీ యేమిటి? మనం క్షమించరాని తొందరపాటు పడ్డాం. అశాస్త్రీయమైన ప్రయత్నం చేస్తున్నామని అనుకుంటున్నాను. మీ పట్ల నా స్నేహభావం ఎప్పటిలాగే వుంటుంది. కాని నేనింక ముందుకు రాలేను. నేనిక్కడితో ఆగిపోదల్చుకున్నాను. ఇది చెప్పడానికి విచారిస్తున్నాను. లక్ష్యాన్ని చేరుకునే మార్గం సరిగ్గా యిదని నిశ్చయంగా తెలుసుకుని, యీ సమస్యని బాగా పరిశీలించి ఒక నిర్ణయానికొస్తేకాని నేను రాలేను. ప్రకృతిలోని అతిచిన్న వస్తువయినా సరే, దాని గురించి కూలంకషంగా తెలిస్తే తప్ప నేను నమ్మను. ఇప్పుడు మనం అన్వేషిస్తున్న సత్యం నేను తప్పకుండా కనుక్కొంటాను. అందుకోసం నేనిక్కడే వుంటాను. మీకు వీడ్కోలు చెప్తున్నాను. మీరు శాస్త్రీయవిధానం కావాలంటూ నా దగ్గరకే తప్పకుండా వస్తారు. లేదా అనుకున్నది సాధిస్తే నేనే మీ వద్ద కొచ్చి ఆ శుభవార్త చెప్తాలెండి. సెలవు.

కళాకారుడు: నేను కూడా మిమ్మల్ని వదిలిపెట్టాలనే అనుకుంటున్నాను. కాని శాస్త్రజ్ఞుడు చెప్పిన కారణాల వలన కాదు. అవి కూడా బలవత్తరమైనవే.

ఆసక్తికరంగా సాగిన యీ ఆరోహణలో నేను కొన్ని అపురూప అనుభవాలు పొందాను. కొత్త అందాల్ని దర్శించాను. సౌందర్యానికి కొత్త నిర్వచనాలు దొరికాయి. నాలో పుట్టిన వుత్సాహం, వుద్వేగం వాటికి రూపకల్పన చేస్తేగాని నన్ను నిలవనివ్వవు. అందరికీ కనువిప్పు కలిగించాలి. ఈ భౌతిక ప్రపంచమంతా వాటి వల్ల కాంతివంతం కావాలి.

మిమ్మల్ని వదిలిపెట్టడం నాకు విచారంగానే వున్నది. ఇక్కడే వుండి నా నూతన భావాలకు రూపకల్పన చేస్తాను. మరెప్పుడైనా యీ ఆరోహణలో మీతో కలుస్తాను. కొత్త కొత్త విషయాల పరిశోధనా తపనలో, మీరెక్కడున్నా సరే. మిమ్మల్ని కలుస్తాను. సెలవు. శుభమస్తు.

మిగిలినవాళ్లంతా ఆశ్చర్యంగా ఒకరినొకరు చూసుకున్నారు. అంతలో రెండవ విద్యార్థి (విద్యార్థిని) అరిచింది.

రెండవ విద్యార్థి: వాళ్లు పోతే పొయ్యారు మనం వీళ్లందర్నీ ఎందుకు లెక్క చెయ్యాలి? ఎవరికి వారే వారికి తోచిన గమ్యం నిర్ణయించుకుని ఆ దారి పట్టుకుని పోతున్నారు. పోతే పోనీ. వీళ్లెవరూ మనల్ని ఆపలేరు. పదండి. ధైర్యంగా, నీరసపడకుండా మన లక్ష్యం వైపు అడుగులు వేస్తూ పదండి.

శాస్త్రజ్ఞుడు, కళాకారుడు తప్ప మిగిలినవారు సాగిపోతున్నారు

నాలుగవ దశ

ఇద్దరు అన్వేషకులు, సన్న్యాసి యెక్కడా ఆగకుండా స్థిరంగా, దృఢంగా నడుస్తున్నారు. వారి వెనుక ప్రేమికులిద్దరూ చెట్టాపట్టా లేసుకుని మైమరచి నడుస్తున్నారు. వాళ్లకి యితరులున్నారన్న స్పృహ కూడా లేదు. ఆ వెనుక ముగ్గురు విద్యార్థులు నడుస్తున్నారు. బాగా అలసిపోయినట్లు కనిపిస్తున్నారు. ముగ్గురూ ఆగిపోయారు.

మొదటి విద్యార్థి: మిత్రులారా! ఇదేమి ఆరోహణరా బాబూ! ఏమిటి ఈ దారి! అలా పైకి పోవడమే తప్ప అంతం కనిపించదే. ఊపిరితీసుకోడానికి కూడా వ్యవధి లేదు. నేను బాగా అలిసిపోయాను.

రెండవ విద్యార్థి: ఏమిటి? నువ్వు కూడా ఆగిపోతావా? ఇదేం బాగు లేదు. నీ సాహసానికి తగినట్టు లేదు.

మొదటి విద్యార్థి: అబ్బే. అదేం లేదు. ఆగిపోయే ప్రశ్నే లేదు. కాకపోతే కొంచెం విశ్రాంతి తీసుకుని బయల్దేరదాం. కాళ్లు తెగ నొప్పెడుతున్నాయి. కొంచెం సేదదీరి వెళ్లినట్టయితే తొందరగా ఎక్క

గలం. ఒక్క క్షణమంటే ఒక్క క్షణమే కూర్చుని తరువాత రెట్టింపు వుత్సాహంతో పోదాం. అప్పుడెంత బాగుంటుందో మీరే చూద్దురు గాని.

మూడవ విద్యార్థి: సరే! అయితే. నిన్నొక్కణ్ణీ వదిలి మేమూ వెళ్ళం. నేనూ బాగా అలసిపోయాను. కూర్చుందాం రండి. ఇప్పటి వరకు మనం చూసినవి, నేర్చుకున్నవీ చెప్పుకుందాం.

రెండవ విద్యార్థి: *(కాస్సేపు తటపటాయించి, కూర్చుంటుంది.)* సరే! నేనూ కూర్చుంటా లెండి. మిమ్మల్నొదిలి వెళ్లడం యిష్టం లేక సుమా! ఇక్కడ మనం ఎక్కువ సేపు కూర్చోవద్దు. దారి తప్పితే ప్రమాదం.

(ప్రేమికులిద్దరూ వీళ్లు కూర్చోడం చూసి కూడా ఆగకుండా సాగిపోతారు.)

అయిదవ దశ

ఇంకా ఎత్తుకు చేరాక యిరుకైన దారి, అక్కణ్ణుంచి విశాలమైన దృశ్యము ఆ లోయ దట్టమైన తెల్లమేఘాల చాటున యింకా చూపు కందకుండానే వున్నది. ఎడమవైపు సరిగ్గా దారి కవతల వొక చిన్న యిల్లు దూరంగా విసిరివేసినట్టు వున్నది. మొదటి ముగ్గురూ ఆగకుండా ముందుకి దూసుకుపోతున్నారు. ప్రేమికు లిద్దరు చేయి చేయి కలుపుకొని కలల్లో తేలిపోతూ, వాళ్ల లోకంలో వాళ్లు తాపీగా నడుస్తున్నారు.

స్త్రీ: *(తాను ఒంటరిగా మిగిలిపోయానని గ్రహించింది.)* చూడు ప్రియా! ఎవ్వరూ లేరు. మనం మాత్రమే వున్నాం. మిగిలిన వాళ్లంతా యేమయ్యేరో? పోనీలే! వాళ్ల వూసు మనకెందుకులే, మనిద్దరం హాయిగా వుండలేమా?

ప్రియుడు: *(దారి ప్రక్కనే వున్న యిల్లు చూపిస్తూ)* చూడు ప్రియతమా! ఆ కొండ ప్రక్కనే వున్న చిన్న యిల్లు చూడు. విసిరేసినట్టు విడిగా వున్నా, మనల్ని పిలుస్తున్నట్టు వున్నది. ఎంతో సుపరిచితంగా, విశాలంగా వుంది. ఇంతకంటే మనకేం కావాలి చెప్పు. మనకి నచ్చిన చక్కని యిల్లు. మనం నిర్మలమైన ప్రేమ

జంట. అష్టకష్టాలుపడి ఆ సత్యం కోసం పోతున్నవాళ్లని పోతే పోనీ. మనం మన స్వంతమైన, మనకే స్వంతమైన సత్యాన్ని కను క్కున్నాం. ఇది చాలు.

ప్రేయసి: అవును ప్రియా! ఈ యింట్లోనే మనం వుండి పోదాం. ఎవర్నీ లెక్కచెయ్యొద్దు. మన ప్రేమని సార్ధకం చేసుకుందాం పద.

(ఇద్దరూ చేయి చేయి కలుపుకుని యింటివైపు వెళ్లిపోయారు.)

ఆరవదశ

దారి పోగా పోగా సన్నబడి యింకా వొక పెద్ద గోడలాంటి పర్వతం వద్ద ఆగిపోయింది. ఆ రాతిగోడ ఆకాశన్నంటుతున్నట్టు న్నది. దాని శిఖరాగ్రం చూపు కందడం లేదు. ఎడమ వైపు వొక చిన్నపీఠభూమి దానికి చివర దూరంగా క్రిందికి వొక చిన్న కుటీరం కనిపిస్తున్నది. ఆ ప్రదేశం మొత్తం ఒక యెడారిలా వుంది.

చివరికి మిగిలిన ముగ్గురు ఆరోహకులు అక్కడికి వచ్చారు. సన్న్యాసి మిగిలిన యిద్దరిని ఆపి తాను కూడా ఆగిపోయాడు.

సన్యాసి: నే చెప్పేది దయచేసి వింటారా! మన ఆరోహణలోనే నా నిజమైన అస్తిత్వాన్ని, నిజమైన ఆత్మని తెలుసుకున్నాను. శాశ్వతతత్వం యేదో అర్థమయింది. ఆ శాశ్వతతత్వంతో ఏకీభవించి మోక్షం సిద్ధింపచేసుకున్న నాకు తెలుసుకోవలసిందింకేమి లేదు. నా కింకేమీ అక్కర్లేదు. ఆ తత్త్వము (That) తప్ప మిగిలిన దంతా మిథ్య. పనికిమాలినది. నా గమ్యం నేను చేరుకున్నాను.

(పీఠభూమి వైపు చూపిస్తూ) ఈ పవిత్ర యేకాంత ప్రదేశం నాకు నచ్చింది. ఇక్కడే నిశ్చలధ్యానంలో నా శేషజీవితం గడుపు తాను. మనుష్యులకు, లోకానికి దూరంగా, జీవితాశలకు దూరంగా స్వేచ్ఛగా గడుపుతాను.

మారుమాటాడకుండా, వీడ్కోలు కూడా చెప్పకుండానే, వెనక్కి తిరిగి చూడకుండా సూటిగా అతని లక్ష్యం వైపు వెళ్లిపోతాడు.

అక్కడే ఆగిపోయిన అన్వేషకులిద్దరూ వొకరినొకరు చూసుకుంటారు. అతడి మహనీయ వ్యక్తిత్వానికి చలించిపోతారు. అంతలో తేరుకుని వారిలో స్త్రీ కేక పెడుతుంది.

అన్వేషకురాలు: కాదు, కాదు. ఇది సత్యం కాదు. అసలైన దివ్య సత్యం యిది కానే కాదు. ఈ సృష్టి మొత్తం మిథ్య యెన్నటికీ కాదు. ఇలా అనుకుని మనిషి తప్పించుకుపోలేడు. అదీ కాక యింకా మనం పర్వత శిఖరాగ్రం చేరుకోనే లేదు. ఆరోహణ పూర్తి కాలేదు.

అతడు: (*ఆ దారి రాతిగోడవరకు వచ్చి ఆగిపోడం చూపుతాడు. అది నిట్టనిలువుగా వుంది.*) కాని, యిక్కడితో యీ దారి ఆగిపోయింది. దీనిని బట్టి యే మనిషీ యింతవరకు యింతకంటె ముందుకు పోలేదు. ఈ రాతిగోడ చూస్తే యెక్కడానికి ఎక్కడా అవకాశం లేదు. మనమే ఎలాగో యేదోదారి కనిపెట్టి, ఒక్కొక్క అడుగే వేసుకుంటూ ముందుకి పోదాం. సంకల్పబలం, ఆత్మవిశ్వాసం తప్ప యిక్కడ మనకి సాయం చేసేవాళ్లుగాని, సలహా యిచ్చేవాళ్లుగాని ఎవ్వరూ లేరు. నిస్సందేహంగా మన దారి మనమే చూసుకోవాలి.

ఆమె: (*కుతూహలంగా*) మరేం ఫరవాలేదు. వెళ్దాం పద. ఇంకా కనుక్కోవలసినది మిగిలే వుంది. ఈ సృష్టికి అర్థం వుండి తీరుతుంది. అదే మనం కనుక్కోవాలి.

(*ఇద్దరూ బయలుదేరుతారు*)

ఏడవ దశ

శిఖరాగ్రం

ఆ యిద్దరూ అతిసాహసంతో ప్రతి పరీక్షా నెగ్గారు. బృహత్ ప్రయత్నంతో శిఖరాగ్రం చేరుకున్నారు. జ్ఞానకాంతిపుంజాలలో స్నాతులయ్యారు. వాళ్లు నిల్చున్న శిఖరాగ్రం తప్ప మిగిలినదంతా తేజోమయంగా వెలిగిపోతున్నది. అది వారి పాదాలు మోపడానికి కూడా చాలీచాలకుండా వున్నది.

అన్వేషకుడు: ఆహా! ఎలాగైతేనేం శిఖరాగ్రం చేరుకున్నాం. మిరు మిట్లుకొలిపే కాంతులతో, తేజోమయమైన దివ్యసత్యం తప్ప మరేమీ లేదు.

అన్వేషకురాలు: మనమెంతో కష్టపడి యెక్కివచ్చిన మెట్లు మాయమైపోయాయి. మిగిలినవన్నీ కూడా అదృశ్యమయిపోయాయి.

అన్వేషకుడు: వెనకా, ముందూ, అంతటా శూన్యం. మన పాదాలు మోపటానికి చోటు తప్ప మరేం లేదు.

అన్వేషకురాలు: ఇప్పుడు మనం ఎక్కడికి వెళ్లాలి? ఏం చెయ్యాలి?

అన్వేషకుడు: ఇక్కడ వున్నది దివ్యసత్యం. మన చుట్టూ అణువణువునా నిండివున్నది దివ్యసత్యం మాత్రమే.

అన్వేషకురాలు: కాని పరిపూర్ణ దివ్యసిద్ధికి మనం యింకా ముందుకు పోవాలి. అందుకు మరొక రహస్యం తెలియాలి.

అన్వేషకుడు: మానవప్రయత్నం యేదీ యిక పనికిరాదు. అది యిక్కడితో ఆఖరని స్పష్టమవుతున్నది. మరొక దివ్యశక్తి యేదో తప్పక కలగజేసుకోవాలి.

అన్వేషకురాలు: అవును. దైవకటాక్షం, దైవకటాక్షం తోడ్పడాలి. ఆ దైవమే మనకి దారిచూపాలి. ఆ అద్భుతం దైవానికే సాధ్యం.

అన్వేషకుడు: *(చేత్తో దిగంతాన్ని చూపుతూ)* అటు చూడు. సుదూరంలో ఆ అగాధాల అవతలి వైపు మిరుమిట్లుగొలిపే మహోన్నతకాంతులతో నిండి మెరిసిపోతున్న శిఖరాగ్రం. ఆ పరిపూర్ణ సమగ్రరూపాలు. అద్భుత మధురస్వరాలు. అదే మనం చేరుకోవలసిన లోకం. నవ్యభూతలం.

అన్వేషకురాలు: అవును తప్పకుండా అక్కడికే. కాని ఎలా?

అన్వేషకుడు: మనం అక్కడికి చేరుకోవాలి కనుక ఆ దారి కూడా మనకి తప్పక చూపబడుతుంది.

అన్వేషకురాలు: అవును. మనం నమ్మితీరాలి. పరమాత్మకి సర్వసమర్పణ చేసుకొని ఆయనలో పరిపూర్ణ విశ్వాసం వుంచాలి.

అన్వేషకుడు: నిజం. దైవసంకల్పానికి పరిపూర్ణ ఆత్మసమర్పణ చెయ్యాలి. అప్పుడు కంటికి కనిపించే దారులన్నీ అదృశ్యమయి

పోతాయి. అయినా భయసంకోచాలు లేకుండా సంపూర్ణ విశ్వాసంతో ముందుకు సాగిపోవాలి.

అన్వేషకురాలు: ఎక్కడికి మనం చేరుకోవాలో అక్కడికి తప్పకుండా చేర్చబడతాం.

(ఇద్దరూ గాలిలోకి దుముకుతూ సాగిపోతారు.)

ఉపసంహారం

దివ్యసిద్ధి

అదొక దివ్యలోకం

అన్వేషకుడు: ఆహా! చూడు. ఒక అద్భుతశక్తితో మనకి కంటికి కనిపించని రెక్కలు పుట్టుకొచ్చాయి.

అన్వేషకురాలు: (చుట్టూ చూస్తూ) ఏమిటీ అపూర్వ మహోజ్వల కాంతి? ఏం వైభవం?

అన్వేషకుడు: ఇప్పుడీ దివ్యజీవితం జీవించేదెలాగో నేర్చుకుందాం పద.

(తెర పడుతుంది)

మూలం: శ్రీమాత

అనువాదం: నడిమింటి విజయలక్ష్మి

(*CWM* Vol. 12, pp. 505-18)

ఓ నూతన ప్రపంచానికి ఆవిష్కరణ జరిగింది

(ఓ కొత్త ప్రపంచం – పుట్టింది)

మీ అందరితో ఓ కొత్త ప్రపంచం పుట్టిందని ప్రకటించాను. అయితే పాత ప్రపంచస్థితిగతులు దాన్ని చుట్టి ఉండటం వలన చాలమందికి ఆ నూత్న ప్రపంచ ఆవిర్భావం జరిగిందన్న విషయం తెలియటల్లేదు. సుసూక్ష్మమైన ఆ భేదాన్ని చూడలేకపోతున్నారు. అయితే ఆ నూతనశక్తులు వాటి పనిని అవి చేసుకుపోతున్నాయి. క్రమం తప్పకుండా. చాలా శ్రద్ధతో, అత్యంత పట్టుదలతో, సావధానంగా తమ పనిని సాధిస్తూ క్రమంగా ఫలితాన్ని సాధిస్తున్నాయి. నిన్నటి నా అనుభవమే దానికి నిదర్శనం. దానియొక్క ఫలితాన్ని క్రమంగా నిత్యం నే పొందిన అనుభవాన్నిబట్టి గమనించాను. వాటిని క్లుప్తంగా క్రమంగా వివరిస్తాను.

మొదట నే చెప్పేదేమిటంటే ఇది ఆధ్యాత్మిక జీవితానికి, దివ్యసత్యానికి గురించిన నూతనానుభూతి మాత్రమే కాదు. దీన్ని గురించి శ్రీఅరవిందులు వివరించారు, నేనూ అనేకసార్లు చెప్తూ వచ్చాను. ఆ అనుభవాన్ని మాటల్లో ఇలా చెప్పవచ్చు. పాత ఆధ్యాత్మికత ప్రకారం దైవాన్ని తెలుసుకోవడమంటే ఈ ప్రపంచాన్ని వదిలిపెట్టడమే. ఈ ప్రపంచం ఎలా పోతే మనకేం అనుకుని మిథ్యావాదంతో ఈ ప్రపంచాన్ని వదిలిపెట్టడం. అది పాత పద్ధతి. మరి ఈ కొత్తపద్ధతిలో ఏం చేయాలి? ఆ పాతపద్ధతికి వ్యతిరేకంగా – ఈ జీవితాన్నే దివ్యంగా మార్చాలి. అంటె మట్టిని బంగారం చేయాలి. ఈ భౌతికప్రపంచాన్ని దివ్యప్రపంచంగా మార్పుచేసి ప్రతి అణువులోను దైవప్రకాశాన్ని చూడాలి. రూపాంతరానికి ప్రయత్నించాలి, కృషి చేయాలి.

ఈ విషయాన్ని ఇదివరకే చెప్పుకున్నాం. అనేకసార్లు మళ్ళీ మళ్ళీ వివరణ చేసుకున్నాం, చాలా వరకూ అర్థం చేసుకున్నాం. నిజానికి మనం చేపట్టవలసిన యోగానికి అదే పునాది. అయితే దీన్ని మనం పాతపద్ధతితో కలసి పురోగమిస్తూ, ప్రపంచాన్ని మరింత విస్తృతపరుస్తూ సాగడమే అని భావించినంతవరకూ,

మనం ఇంకా ప్రాథమికదశలోనే అంటే ఆలోచనాపరిధిలోనే ఉన్నామని గ్రహించాలి. నిజానికి ఇప్పటివరకూ అదే పరిధిలో సాగుతున్నాం.

కాని ఇప్పుడు జరిగిన ఈ సంఘటనతో కొత్తప్రపంచ ఆవిర్భావం చూస్తూన్నాం. అది సత్యమై నిత్యమై మన ముందుకొచ్చింది. కొత్త ప్రపంచం పుట్టింది, పుట్టింది, పుట్టింది! మన కళ్ల ముందర నర్తిస్తోంది, ఆవిష్కరింపబడిన తిరుగులేని సత్యం. ఇప్పుడు జరిగినది పాతప్రపంచానికి రూపాంతరీకరణం కాదు, నూత్న ప్రపంచ ఆవిర్భావం – పదండి ముందుకు పదండి ముందుకు అంటూ మనని పిలుస్తోంది. పాత ప్రపంచంలోకి కొత్త ప్రపంచం దూసుకొని వచ్చేస్తున్న సంధికాలంలో మనమున్నాం. ఈ రెండు ముడిపడి ఉన్న అవస్థ. మొండికేసి పోరాడుతూ మార్పు నంగీకరించని సామాన్య చైతన్యం ఒకవైపు – మరోవైపు నెమ్మదిగా నిశ్శబ్దంగా తన స్థానాన్ని బలపరచుకుంటున్న నూతన ప్రపంచం. ఇంకా బిడియంగా, ఎవరికీ తెలియకుండా, రహస్యంగా లోలోపల తన పని తాను చేసుకుపోతోంది. బాహ్యంగా ఉన్న స్థితిని కల్లోలపరచకుండా నెమ్మదిగా తన పనిలో తాను నిమగ్నమై ఉందా శక్తి. ప్రస్తుతం సామాన్య చేతనలో ఉన్నవారికి అది గుర్తించటం సాధ్యం కాదు. అయినా ఆ పని నిరంతరం కొనసాగుతోంది. పెరుగుతూనే ఉంది. సర్వత్రా వ్యక్తమైన, ఆధిపత్యం వహించేవరకూ ఆ పని సాగుతూనే ఉంటుంది.

*

మీరంతా ఈ గొప్ప సమయంలో ఈ భూమిపై ఉన్నారంటే మీరు దాన్ని కోరుకున్నారన మాట. మీరు ఎప్పుడు ఆశించారో, ఎప్పుడు కాంక్షించారో మీకు జ్ఞాపకం లేకపోవచ్చు. కాని నాకు తెలుసు. *అందుకే ఈ సాహసంలో పాలుపంచుకుందుకు మీరిక్కడ ఉన్నారు. మీరు ఈ కార్యాన్ని సాధించగలిగే స్థాయికి ఎదగాలి. మీరు ఆ కార్యసాధనకు, ఆ నూతన ప్రపంచ ఆవిష్కరణకు, ఆ సాహసయాత్రకు తయారుకావాలి.* మీ బలహీనతల్ని, మీ పరిధుల్ని జయించాలి. అన్నిటికన్నా ముఖ్యం అహంకారా

నికి గుడ్‌బై చెప్పాలి. అహంకారమా! నీకు కాలం చెల్లిపోయిం దని చెప్పాలి. మనకి 'అహం' లేని జాతి కావాలి. అహం స్థానాన్ని దివ్యచైతన్యం ఆక్రమించాలి. మనకు కావలసింది ఆ దివ్యచేతనే. ఆ దివ్యచేతనే ఈ జాతి స్వయంవికాసానికి తోడ్పడి అతిమానస జీవి పుట్టుకకు కారణమౌతుంది.

*

మొదటిసారిగా మావనసృష్టి జరిగినపుడు 'అహం' అనేది అన్నిం టిని కలిపే సాధనంగా ఉండేది. అహాన్ని ఆధారం చేసుకునే వ్యక్తిత్వం యొక్క భిన్నస్థితుల సమాహారముండేది.

ఇప్పుడు అతిమానసజీవుల ఆవిర్భావానికి అంతా సంసి ద్ధంగా ఉన్నప్పుడు 'అహం' పూర్తిగా తొలగిపోవాలి. అహం స్థానే చైత్యపురుమడి ప్రతిష్ఠ జరగాలి. దైవప్రతినిధిగా మనిషిలో క్రమంగా పనిచేస్తూ, మానవునిలో దైవాన్ని వ్యక్తపరచడమే చైత్య పురుమడు సాధించేది. ఈ చైత్యపురుమని ప్రభావం చేతనే మని షిలో దైవం వ్యక్తం కావడం, అతిమానసజాతి తయారుకావడం సంభవిస్తుంది. చైత్యపురుషం అమరమైనది, దాని ద్వారానే ఈ భూమ్మీద అమరత్వాన్ని స్థాపించడం సాధ్యమౌతుంది.

అందుచేత ఇప్పుడు ముఖ్యమైన విషయం మనలోని ఆ చైత్యపురుమడ్ని కనుక్కొని దానిలో పరిపూర్ణంగా లయించి నెమ్మ దిగా అహంయొక్క స్థానంలో ఆ చైత్యపురుమడ్ని ప్రతిష్ఠించాలి. అప్పుడు అహానికి మరోదారి లేక మార్పుచెందడమో లేక మాయ మైపోవడమో జరుగుతుంది.

మూలం: శ్రీమాత

అనువాదం: డి. సత్యవాణి

(*CWM* Vol. 9, pp, 148-49; Vol. 11, p. 307; Vol. 16, p. 342)

చివరి మాట:

విజయానికి సోపానము

మనిషి ముత్యపుచిప్పలా ఉండాలి. భారతదేశంలో ఒక చక్కటి పిట్టకథ ఉంది. స్వాతి నక్షత్రం వెలిసిన సమయంలో వర్షం కురిసి ఒక చినుకు ఆలిచిప్పలో పడినట్లయితే ఆ చినుకు ముత్యమవుతుందిట. ఆలిచిప్పలకు ఈ విషయం తెలుసు కాబట్టి స్వాతి నక్షత్రం వెలిసేనాటికి అవి సముద్రం పైకి వచ్చి ఆ అమూల్యమైన వర్షపుచినుకుకై వేచి ఉంటాయి. చినుకు వాటిలో పడిన వెంటనే మూసుకోపోయి సముద్రపు అడుగుకి వెళ్లిపోతాయి. అక్కడ నిదానంగా ఆ చినుకును పొదిగి ముత్యంగా రూపొందిస్తాయి. మనిషి కూడ అలాగే ఉండాలి. ఏ విషయాన్నైనా సరే, ముందు వినాలి. తరువాత అర్థం చేసుకోవాలి. అటు పిమ్మట మనస్సును ఎట్టి బాహ్యాప్రభావాలకు లోను కానివ్వక, దాని మీదనే లగ్నం జేసి, అంతరంగంలో ఉన్న సత్యాన్ని ఆవిష్కరింపజేయడానికి కంకణం కట్టాలి. కాని యిందులో ఓ ప్రమాదమున్నది. ఇప్పుడు ఇది, అప్పుడు అది అంటూ కేవలం కొత్తదనానికి ఆకర్షితుడవై, దీని కన్న వినూత్నమైన వేరొక విషయం తటస్థపడితే, దాని కోసం వెంపరలాడటం – ఇలా చేస్తూపోతే నీ శక్తిసామర్థ్యాలను వృథా పరచడమే అవుతుంది. ఏదైనా ఒక పనిని చేపట్టినప్పుడు దాని అంతు చూడాలి. మధ్యలో ఆగిపోకూడదు. ఎవరయితే ఒక ఆశయంపట్ల ఉన్మాదభరిత ఆసక్తితో అంకితం అవుతారో వారే వెలుగు చూడగలుగుతారు. ఇక్కడో పని, అక్కడో పని పెట్టుకొని, అన్నింటిని అర్థంతరంగా వదలివేసేవారు దేనినీ సాధించలేరు. క్షణికంగా ఉత్తేజితులవడంతోనే వారి ఉద్వేగం అంతమవుతుంది. ప్రకృతి చేతిలో కీలుబొమ్మలవడం తప్ప, ఆలోచనలు అధిగమించి ముందుకు సాగలేరు.

ఎవరైతే యోగులు కావాలని మనసారా కోరుకుంటారో, వారు ఇట్టి కప్పగంతుల తంతుకు స్వస్తి చెప్పాలి. ఒక ఆశయాన్ని చేపడితే, ఆ ఆశయమే వారి జీవితపరమావధి కావాలి. దానిని

గురించే ఆలోచించాలి. కలలు గనాలి, జీవించాలి. మెదడు, కండరాలు, నరాలు ఒకటేమిటి, శరీరంలోని ప్రత్యణువు ఆ ఆశయంతో నిండిపోవాలి. ఇతరమైన ఆలోచనల నన్నింటిని పూర్తిగా వదలివేయాలి. విజయసాధనకు ఇదియే మార్గము.

మూలం: స్వామి వివేకానంద
అనువాదం: అందుగులపాటి కైలసపతి, చేకూరు జానకి
(2003 సెప్టెంబరు 'అఖిల' నుండి)

సమాచార పత్రం

ప్రకటన

తప్పనిసరి పరిస్థితుల వలన 26-11-05 నుంచి 4-12-05 వరకు జరగవలసిన డా॥ యమ్.వి. నడ్కర్ణిగారి 'గీతావ్యాసముల అధ్యయన శిబిరము' రద్దుచేయబడినది.

నైరోబీ (కెన్యా) కేంద్రం వారు 13 జూలై 2005 నాడు శ్రీఅరవిందో భవనంలో శ్రీఅరవిందుల అవశేషముల ప్రతిష్ఠాపన రోజును వైభవముగా జరుపుకొనిరి. 80 మంది యువకులతో సహా 150 మంది భక్తులు ఇందు పాల్గొనిరి. మరియు 'Towards 'Tomorrow' అనే కార్యక్రమంలోని భాగంగా 350 లఘుదీపికలను ప్రభుత్వాధికారులకు పంచిపెట్టిరి.

అన్నానగర్ (చెన్నై) కేంద్రం వారు విద్యార్థుల కోసం చిత్రలేఖనము, వక్తృత్వ పోటీలను నిర్వహించిరి. చండీఘర్‌లో 1-8-2005 నాడు శ్రీ ప్రదీప్ నరంగ్‌గారు 'ఆరో వసుంధర' పేరుతో ఒక ఉద్యానవనమునకు ప్రారంభోత్సవము చేసిరి. ఔషధమొక్కలు, శ్రీమాత వివరించిన ఆధ్యాత్మికార్థములను వివరించిన పూలమొక్కలను అక్కడ వేసెదరు. ప్రతాప్‌నగర్ (యు.పి) కేంద్రంలో మానవాళి భవిష్యత్తు గురించి శ్రీమాతారవిందులు చెప్పిన విషయములను డా॥ జె.పి. సింగ్‌గారు వివరించిరి. ఇండోర్ (మ.ప్ర)

7/12/2005



ధనము - సాధన

అఖిల

అఖిల భారత పత్రిక, డిసెంబరు 2005

ధనము – సాధన

7/12/12

ధనశక్తి

ధనము – ఒక విశ్వజనీన శక్తి ... 3
ధనము – ఒకానొక శక్తియొక్క భౌతికరూపము ... 5
డబ్బును సృష్టించిందెవరు? మానవుడా దేవుడా? ... 7
ధనశక్తిపై అసురశక్తుల ఆధిపత్యం ... 10
ఉపయోగవాదం ... 12
ఆటవికత (Barbarism) ... 15
ధనశక్తిని తిరిగి దైవానికి అప్పగించుట ... 19

అభివృద్ధి

ధనము పట్ల సాధకుని వైఖరి ... 22
దైవకార్యానికి ధనమొక సాధనము ... 24
దుబారా పనికిరాదు ... 27
సంపన్నవంతుల కర్తవ్యము ... 28
అన్యాయ ఆర్జన ... 31
పేదరికము ... 33
వైరాగ్యము, ఆధ్యాత్మికము, వ్యాపారము ... 34
ధనము – భవిష్యత్తు ... 38
ఈ యిల్లు నా స్వంతం కాదు ... 40
సమాచార పత్రం ... 41

ఉపోద్ఘాతము


'ధనమూల మిదం జగత్' అన్నారు సరే కాని ఎంతకాలానికీ ఈ ప్రపంచపు సమస్యలు తీరటం లేదే! దీనికి కారణమేమిటి? ప్రస్తుతం ధనమంతా అజ్ఞానుల చేతులలో ఉన్నది. కోరికల దాహాన్ని తీర్చేందుకు మాత్రమే ఉపయోగపడుతోంది. కాని శ్రీమాత ధనమును ఒక శక్తి అన్నారు. గాలి, నీరు వలెనే అది ఏ ఒక్కరికీ చెందినది కాదు. ఈ విషయాన్ని గుర్తించినప్పుడు నువ్వు ఆ శక్తికి ఒక చక్కటి ఉపకరణము కాగలవు. దైవము ఆజ్ఞాపిం చిన కార్యములను నిర్వహించగలవు. తన కార్యములను దైవము నీ ద్వారానే చేయించుకుంటాడు. ధనము దైవానికి చెందినది. నీ ద్వారా ఏ కార్యములు చేయించుకోవలెనో అందుకు తగినంత ధనము నిచ్చి నీ ద్వారా తన కార్యక్రమమును సఫలము చేసు కుంటాడు. ధనమును నిలవ చేయకూడదు. నిర్బంధించకూడదు (గాలి, నీరు వలెనే). అలా చేస్తే అదెవరికీ ఉపయోగపడదు. దానిని విడుదలచేసి సర్క్యులేషనులో పెట్టినప్పుడే అది సద్విని యోగము కాగలదు. దివ్యకార్యమునకు ఉపయోగపడగలదు.

— సంపాదకుడు

ధనము – ఒక విశ్వజనీన శక్తి

విద్యుచ్ఛక్తిని నువ్వు చూడలేవు. మనకది కనపడదు. కాని ధన శక్తి అలా కాదు. అది కనపడుతుంది. విద్యుచ్ఛక్తివలె అది కూడ ఒక శక్తే. విద్యుచ్ఛక్తితో మిషన్లను నడిపించగలవు.. ధనశక్తి ఈ భూలోకాన్నే నడిపిస్తుంది. అది భూమినంతటిని వికసింపచేసే అద్భుతమైన శక్తి. అది ఒక దివ్యశక్తి దాని నిజస్వరూప మేమిటో మనం తెలుసుకోవాలి. *– సంపాదకుడు*

ఒకానొక విశ్వజనీన శక్తికి ధనము ప్రత్యక్షరూపము. లోకమున ఈ శక్తి వ్యక్తమయినపుడు దాని ప్రభావము అన్నమయ ప్రాణ మయ కోశములపై గానబడును. బాహ్యజీవన పరిపూర్ణత కది అత్యావసరము. దాని మూలము దైవమే. నిజానికి దానిని ప్రయో గించునది కూడ దైవమే. అయినను, ఈశ్వరుని యన్ని శక్తుల వలెనే యదియు నీ లోకమున నియుక్తము. నిమ్న ప్రకృతిగత మగు నజ్ఞానక్షేత్రమున అహంకార ప్రయోజనములకై యది దుర్విని యోగము కావచ్చును; ఆసురిక శక్తులకు జిక్కి తత్కార్యములకై వినియుక్తమైనను కావచ్చును. మానవాహంకార పక్షమునకును, అసురపక్షమునకును విశేషాకర్షణముగల శక్తిత్రయములో అర్థమొ కటి. మిగిలినవి అధికారము, కామము. ఏ తచ్ఛక్తిమంతులు సామా న్యముగా వీనిని చక్కగా నిర్వహించలేరు. దుర్వినియోగము చేయు దురు. అర్థాన్వేషకులు, అర్థసంగ్రహీతలు తరచుగా అర్థవశవర్తు లగుచున్నారే కాని దానిని నిగ్రహింపజాల కున్నారు. ఆసుర సంపత్తి గలవారు చిరకాలము ధనమును హస్తగతము చేసికొని దుర్వినియోగము చేయుచుండుటచే, తద్వికృత ప్రభావమునుండి తప్పించుకొనువారు కొలదిమందియే. కావుననే ఆధ్యాత్మసాధన లన్నియు ఆత్మనిగ్రహము, సర్వసంగపరిత్యాగమును, ధననిరాక రణమును ప్రధానముగా బోధించుచున్నవి; లేదా నియమించు చున్నవి. కొందరు ధనమును, సంపదలను నిషేధించి, పేదరిక



మును, వైరాగ్యమును ఆధ్యాత్మమార్గమున కత్యంతావశ్యకములని ఘోషించుచున్నారు. ఇయ్యది భ్రమాత్మకము. దీని ననుసరించు టచే విరుద్ధశక్తులు ప్రబలములగును. భగవానుని సంపదను భాగ వత జీవికకై యుద్ధరించి, ఈశ్వరార్పణబుద్ధితో వ్యవహించుటయే సాధకునకు అతిమానసమార్గ మగును.

మూలం: శ్రీఅరవిందులు

అనువాదం: శ్రీ శివశంకరానంద (‘*జనని*’ నుండి)

(*SABCL* Vol. 25, pp. 11-12)

ధనము – ఒకానొక శక్తియొక్క భౌతికరూపము

మన దృష్టిలో ధనము ఒక వస్తువు. దానికి పరిమాణమున్నది. కాని దానిని పెంచి పోగుచేసుకోవచ్చునని అనుకోటం ఒక భ్రమ, దాని మూలస్వరూపమేమిటో తెలియకపోవటమే. ధనాన్ని ఊరికే పాతరవేస్తే దాని శక్తిని కోల్పోతుంది. అది ఒక శక్తి. ఆ శక్తినే మనం వశపరుచుకోవలసి వున్నది. అప్పుడు ధనం దానంతటదే నీ దగ్గర కొచ్చేస్తుంది, దాన్ని వినియోగించే అవకాశము నీకు కలుగుతుంది.

– సంపాదకుడు

ధనము యొక్క నిజస్వరూపమేమిటో మనం తెలుసుకోవాలి. కరెన్సీ నోట్లు, నాణెములు ధనమే. ఇంకా ఆస్తిపాస్తులు, విలువైన వస్తువులు ఇవన్నీ దాని ప్రతిరూపాలే. అది ఒకానొక శక్తియొక్క భౌతికరూపము. ప్రాణికం (vital) దాన్ని తీసుకొని తన ద్వారా ఉపయోగించినప్పుడు అది అనేక రూపాలలో అభివ్యక్తమవు తుంది. భౌతికక్షేత్రంలో దీని ఆకర్షణ, ఇది సృష్టించే ప్రకంప నలు తప్పించుకోలేనంత బలీయంగా ఉంటాయి. వ్యాయామం వల్ల శరీరానికి సత్తువ చేకూరుతుంది. అలాగే ధనం కూడా విని యోగించేకొలదీ శక్తిని పుంజుకుంటుంది. వినిమయ వినియోగాలే ధనశక్తికి నిజశక్తి.

ధనశక్తిపై నీకు అదుపు ఉండాలి. అంటే ఇతోధికంగా ప్రోగు చేసి భద్రంగా దాచిపెట్టడం కాదు. లోభత్వంతో కనుక అలా చేస్తే ఈ శక్తి నిస్తేజమై, నిర్వీర్యమై చేజారిపోగలదు కూడా! వినిమయ వినియోగములలో దీని నెంతగా వాడుక చేస్తే అంతగా అది బలాన్ని పుంజుకుంటుంది. ప్రాణికసీమలలో దీని ప్రభావం బహుముఖమైనది. విభిన్న ప్రయోజనాల వినియోగంలో దీని కళా కాంతులు భిన్నవర్ణాలుగా దృశ్యమానమౌతవి.

ధనము ప్రాణికస్థాయిలో ఒక శక్తి మాత్రమేనని అనుకున్నాం కదా! అందుకే అది ఎవరికీ స్వంతం కానేరదు. ఏ ఒక్కరూ దీనికి హక్కుదారు కాలేరు. విశ్వంలో ప్రకృతిశక్తులు అనంతంగా ఉన్నాయి. వాటిలో ఏ ఒక్క శక్తినీ ఎవ్వరూ స్వంతం చేసుకోలేరు కదా! వెలుతురు ఒక శక్తి. ఇది ఎవరి స్వంతమూ కాదు! ఈ వెలుగు అంతా నాది, కాబట్టి దీనిని నేను భద్రపర్చుకుంటాననగలిగే మూర్ఖుడెవడు ఉంటాడు! ధనశక్తి విషయంలోనూ అంతే. కాకపోతే మనం అలా భావించం. ఈ సొమ్ము – నాణెములు, కరెన్సీ నోట్లు – మన స్వంతం అనుకుంటాం. ఇది ఒక మూర్ఖత్వము. లాంతరును నాది అనుకోగలవు – కాని దీపకాంతి నాకే స్వంతం అనుకోలేవు కదా! ఎప్పుడైతే నువ్వు నాణెములు, కరెన్సీ నోట్లు నీ స్వంతం చేసుకుంటావో అప్పుడు వాటికి సహజ సిద్ధమైన మారకశక్తి పోతుంది. ఆ శక్తులను నీవెలా స్వంతం చేసుకోగలవు? ఈ అసలు సిసలు ధనశక్తి నీకు ఒక్కనికే స్వంతం కానేరదు. ఇది అందరిది. ధనాన్ని కూడబెట్టి దాచావు అనుకో, ఏమౌతుంది? ఒక పాత్రలో నిండా నీళ్లు నిలువ ఉంచితే ఏమౌతుంది. కొంతకాలానికి పాడై నిరుపయోగం కాదూ! నిల్వ ఉంచిన డబ్బు విషయం కూడా అంతే! వాడుక లేని భద్రపరిచి ఉంచిన సొమ్ము dead money. వ్యర్థం.

మూలం: శ్రీమాత

అనువాదం: కర్రా వెంకటేశ్వర్లు

(*CWM* Vol. 4, pp. 249-50; Vol. 5, pp. 357-58)

డబ్బును సృష్టించిందెవరు? మానవుడా దేవుడా?

ఒకానొక శక్తికి ప్రత్యక్షరూపమే డబ్బు. అది ఒక ప్రతీక మాత్రమే. దానిని అచ్చువేసేందుకు యంత్రాలు కావాలి నిజమే. అంత మాత్రాన డబ్బుని సృష్టించింది మనిషే అని అనలేము. ఒక న్యాయమైన మనిషి వుంటాడు. డబ్బును సత్కార్యములకు విని యోగించే చైతన్యం కలిగి ఉంటాడు. అతను సంపాదించకపో యినా వానికి డబ్బు దానంతటదే వస్తుంది. దాని శక్తి అటువం టిది. — *సంపాదకుడు*

మధుమయీ, ధనాన్ని సృష్టించేది మానవుడైతే అది దివ్య శక్తి ఎలా అవుతుంది?

శ్రీమాత నవ్వి అంటారు — నీవు చెప్పేదెలాగుందంటే — మానవుడు మానవుని వలననే ఉద్భవిస్తున్నాడు కదా! మరి వాస్త వంలో అతను దైవమెలా కాగలుగుతున్నాడు, అని అడిగినట్లుంది. ఈ సృష్టి సర్వమూ బాహ్యరూపంలో బాహ్యపదార్థ సాధనసామగ్రి ఆధారంగానే ఉత్పన్నమౌతున్నది, కాని దాని వెనుక పనిచేసేవి అదృశ్యమైన దివ్యశక్తులే కదా! కరెన్సీ నోట్లు, నాణెములు గాలి లోంచి ఊడిపడవు గదా. యంత్రాలతోనే ఉత్పన్నం కాబడుతు న్నవి. అవి కేవలం పదార్థరూపములే తప్ప స్వయం శక్తిరూపాలు కావు. అవి భౌతిక వస్తు వ్యక్తీకరణలు మాత్రమే. డబ్బు పేరుతో మనం భౌతికవస్తు సముదాయమును చలామణీ చేసుకుంటున్నాం. ఇది పరిపాటిగా జరిగే పని (conventional). కొన్ని దేశాలలో గవ్వలు ద్రవ్యంగా వాడబడుచున్నవి. ఎక్కడో ఒక ఉత్తరదేశంలో చేపలు పట్టేందుకు ఉపయోగింపబడే కొక్కెములను డబ్బుగా ఉపయోగించుకుంటారట. ఎవడు ఎక్కువ కొక్కెములు కలిగి ఉంటే వాడు అంత సంపన్నుడు. అపరిమితంగా ఉంటే మహా సంపన్నుడు. ఇది కేవలం సంప్రదాయబద్ధంగా సాగేది. వాటికి ద్రవ్యశక్తి అదృశ్యంగా ఉన్నది. అదే శక్తి అనేక రూపాలుగా వ్యక్త



The Mother

మౌతుంది. మనం బంగారానికి అత్యధిక విలువ నిస్తాం. ఎందు కని? దానికి తుప్పు పట్టదు. నశించిపోదు. మన్నిక యెక్కువ. మరిన్ని బంగారు గనులు బయల్పడి ఈ లోహం ధారాళంగా లభ్య మౌతుంటే దీని విలువ సహజంగానే తగ్గిపోతుంది కదా! ధనశక్తి బాహ్యమైనది కాదు! అంతఃశక్తి (the force that is behind). దీనికి ఉన్న అంతర్గత ఆకర్షణశక్తే భౌతికవస్తు సముదాయాన్నంతటిని నిర్దేశిస్తుంది.

కాబట్టి, ఇది కేవలం మనం పెట్టుకున్న వ్యవహారం. ముద్రిం పబడిన ఒక కాగితం ముక్క – ఎంత మాసిమురికిగా అసహ్యంగా ఉన్నా – డబ్బుగా పదిలపర్చుకొని చెలామణీ చేసుకోవటం లేదూ మనం! ఆ పేపరుముక్కలు మాసిపోయినా కూడ మన దగ్గర ఎంత అధికంగా ఉంటే అంత సంపన్నులం! ఎందుకని? పరిపా టిగా ఉన్నది కాబట్టి. ఈ ధనశక్తిని వశం చేసుకోగలిగి సత్కా ర్యాలకు, సంక్షేమ కార్యక్రమాలకు సద్వినియోగం చేసినపుడు ఆ వ్యక్తికి పరోక్ష ధనశక్తి వశమై ఉంటుంది.

డబ్బు పుష్కలంగా సంపాదించగలిగే వానికి భౌమిక శక్తులు వశమై ఉంటాయా?

సంపాదించే విధానంపై ఇది ఆధారపడి ఉంటుంది. అక్రమ పద్ధతిలో సంపాదించిన డబ్బుపై సాధారణంగా కంట్రోలు ఉండదు. నిష్ఠాగరిష్ఠగా విధినిర్వహణ చేసుకుంటూ ఉండి, అసంకల్పితంగా డబ్బు వచ్చిపడినపుడు అతడు ధనశక్తికి బానిసకాడనే భావిం చాలి. ప్రక్కదారులు పట్టనవసరం లేకుండానే ధనాన్ని ఆకర్షించ గలిగేవారు కొందరు ఉంటారు. మసిపూసి మారేడుకాయ చేసే ధనార్జనపరులూ కొంతమంది ఉంటారు. డబ్బున్న ప్రతివాడికి ధనశక్తిపై అదుపు ఉండదు; డబ్బు అప్రయత్నంగా వచ్చినపుడు ఆతనిలో ఏదో ధనాకర్షణశక్తి ఉన్నదని భావించాలి.

మూలం: శ్రీమాత

అనువాదం: కర్రా వెంకటేశ్వర్లు

(*CWM* Vol. 6, pp. 252-53; Vol. 4, p. 376)

ధనశక్తిపై అసురశక్తుల ఆధిపత్యం

ధనశక్తి ప్రస్తుతం ఆసురికుల చేతుల్లో చిక్కుకొని వున్నది. అందు కని సత్కార్యములకది దొరకదు. కాని ఎక్కడైనా ఒక్కచోట ఆ ఆసురికశక్తుల ఓటమి సంభవించినట్లయితే అప్పుడు ధనశక్తిని బంధించిన పగ్గాలు సడలింపబడతాయి. మిగిలిన ప్రదేశాలలో కూడా దానిని అసురులబారి నుండి విడిపించడం సులభం అవుతుంది.

– సంపాదకుడు

ధనశక్తి ప్రస్తుతం ప్రాణికజీవులు (vital beings) – అసురలోక వాసుల వశంలో వున్నది. ఈ దుష్టశక్తుల ప్రాబల్యానికి లోనై వుంటుంన్నందుననే ధనం సత్యం కొరకైన సత్కార్యాలకు (cause of Truth) అవసరమైనంతగా వెచ్చించబడుట లేదు. అసుర శక్తుల బంధాల్లో నున్నందువల్ల, ధనం ప్రక్క త్రోవలకు, అసత్కార్యాల వైపు మళ్లుచున్నది. ఈ పృథ్విపై ఆ దుష్టులు ఆధిపత్యం కలిగి వుండుటకు సంపదయే ప్రధాన సాధనమవుతున్నది. ధనశక్తిపై అసురశక్తుల ఆధిపత్యం పూర్తిగాను, శక్తివంతంగాను, పకడ్బందీ గాను యేర్పాటు చేయబడివుంది. దృఢమైన యీ ఏర్పాటు నుండి కొంతైనా సొమ్మును విడిపించడం మిక్కిలి కష్టసాధ్యమైన పని. ప్రస్తుతం యీ ధనవంతుల నుండి స్వల్పధనాన్నైనా లాక్కొను టకు ప్రయత్నించినపుడెల్లా అసురశక్తులతో భీకరసంగ్రామం చేయాల్సి వస్తున్నది.

ఐనప్పటికీ ధనంపై ఆధిపత్యం వహించిన అసురశక్తులపై ఎక్కడైనా ఒకచోట గణనీయమైన విజయం చేకూరితే చాలు, అది సమాంతరంగా, సహజంగా అన్ని స్థావరాల్లోను వాటిపై విజయం చేకూరడానికి దోహదం చేస్తుంది. ఒకచోట అవి లొంగిపోతే, సత్యం కొరకైన సత్కార్యాలకు ధనం యివ్వజాలమని భావించే వారంతా కూడ హఠాత్తుగా వాటికి ధనం యివ్వాలని ముందుకు వస్తారు.

అందువల్ల ప్రాణమయశక్తుల చేతుల్లో ఆటబొమ్మలుగాను, వాటి ఉపకరణాలుగాను వుంటున్న శ్రీమంతులు ధనం ఖర్చు చేయడానికి పూర్తిగా విముఖులని చెప్పరాదు. ఎందుకంటే స్వంత కోర్కెలను తృప్తిపరచుకొనవలసి వస్తే వాళ్లు వెంటనే సంతోషంగా ధనాన్ని మంచినీళ్లప్రాయంగా ఖర్చుపెడతారు. కాని వారి సంపదను లేదా ఆదాయాన్ని యితరులతో పంచుకొనవలసి వచ్చినప్పుడు మట్టుకు చాల భాధపడతారు. సంపదయొక్క సంరక్షకుడు తన ధనాన్ని ఇనుపబీర్వాలో దాచి భద్రంగా సంరక్షించుకొంటాడు. సంపదను తమ అదుపులో పెట్టుకొన్న ప్రాణశక్తులు కూడ అలాంటి సంరక్షకుని వంటివే. ఆ ప్రాణశక్తుల గుప్పెట్లో వున్నవారిని తమ ధనం వెచ్చించమని కోరితే వారు తమ పర్సు తెరవడానికి సవాలక్ష ప్రశ్నలు వేస్తారు. కాని వారిలో ప్రాణిక ప్రేరణ కలిగితే వారంతట వారే తమ ఖజానాను తెరచి తమ కామనల తీర్చుకొనుటకు స్వేచ్ఛగా ధనం వెచ్చిస్తారు. సాధారణంగా అవి కామవాంఛల పేరు ప్రతిష్ఠలకు సంబంధించినవిగా వుంటవి. అదే విధమైన ప్రాణికస్థాయికి చెందినవైనచో ఆహారము, మొదలైన కోర్కెలకు కూడ వారు ఖర్చు చేయ వెనుకాడరు. ఇలాంటి స్వార్థప్రాణిక కామనల వర్గానికి చెందని సత్కార్యాలకై పైకం వెచ్చించవలసి వస్తే వారు, ఎంతగానో, పరిశీలించి, ప్రశ్నించి, పరీక్షించి, తమ అయిష్టాన్ని, కోపాన్ని ప్రదర్శిస్తూ చివరకు సహాయం చేయ నిరాకరిస్తారు.

ప్రాణిక కామనలకు బానిసలైన వారిలో సత్యము, వెలుగు, ఆధ్యాత్మిక ప్రయోజనాల కొరకైన ఆకాంక్షల స్పృహ కలిగినా వారు వాటిని ధనతృష్ణకు సమానంగా సరితూచలేరు. అలాంటి వారి నుండి ధనాన్ని దైవకార్యాల కొరకు పొందడమంటే వారి నుండి స్వార్థమనే రాక్షసిని పూర్తిగా తొలగించడానికై యుద్ధం చేయడం వంటిదే అవుతుంది. దానికై తొలుత, వారు సేవ చేస్తున్న అసురికశక్తిని (vital being) జయించాలి. లేదా పరివర్తన చెందించాలి. ఇదంత తేలికైన పని కాదు. ఎందుకంటే ఆసురికజీవుల అధీనంలో నున్న మనుషులు సుఖజీవనం నుండి మారినా మార

వచ్చు. వారు భోగాలకు స్వస్తి చెప్పి సన్యాసాన్ని చేపట్టినా చేప ట్టవచ్చు. ఐనప్పటికీ వారు ఎప్పటివలెనే పిసినారులుగా వుండి పోయే ప్రమాదం లేకపోలేదు. అంతేకాదు, ఇప్పుడు మునుపటి కన్న ఎక్కువ చెడుగానూ వుండవచ్చు.

మూలం: శ్రీమాత

అనువాదం: బి. నరసింహయ్య

(*CWM* Vol. 3, pp. 45-46)

ఉపయోగవాదం

నేడు భౌతికవాదము మిన్నుముడుతున్నది. ద్రవ్యరాక్షసి మనలను మింగేసేటట్లున్నది.. విద్య, జ్ఞానము, లలితకళలు సమస్తము ఈ దృష్టితోనే అభ్యసించబడుచున్నవి. ఇదొక జాడ్యము. దానిని ఉపయోగవాదమంటారు. కాని విద్య అనగా మనోవికాసమును కలిగించునది. జ్ఞానమనగా మన పరిధిని విస్తృతపరచునది. లలితకళలనగా మనలోని కళాపిపాసను పెంచునవి. మన జీవితాన్ని ఈ దృష్టితో సంస్కరింపవలసి యున్నది. — సంపాదకుడు

దాదాపు ఒక శతాబ్దాన్నించి మానవుడు ఒక వింతజబ్బుతో బాధ పడుతున్నాడు. అది మరింత ప్రబలి పతాకస్థాయిని చేరుకుంది. దాన్ని మనం 'ఉపయోగవాదం' (యూటిలిటేరియనిజమ్) అనవచ్చు. మనుషులు, వస్తువులు, పరిస్థితులు, పనులు అన్నీ కూడా ఒక్క ఉపయోగం అన్న ప్రాతిపదికపై ఏర్పడుతున్నాయి. ఏ విషయమైనా ఆ 'ఉపయోగం' అన్న దానిలో ఇమిడినపుడే అది స్వీకరించబడుతోంది. ఓ ప్రయోజనం ఉన్నపుడే జనం దేన్నైనా మెచ్చుకోవడం జరుగుతోంది. ఉపయోగపడే దెప్పుడూ ఉపయోగం లేనిదాని కంటె మంచిదే నేను కాదనుట లేదు. అయితే ముందుగా 'ఉపయోగం' అన్నది ఎలా నిర్ణయిస్తున్నామో తెలుసుకోవాలి. ఎవరికోసం, దేనికోసం, ఏ విధంగా అన్న ప్రశ్నలు వేసుకోవాలి.

నాగరికత పెరిగిన జాతులుగా భావిస్తున్న వాళ్లే ఈ 'ప్రయో జనం కోసం' అన్న నిర్వచనాన్ని కనుగొన్నారు. వీరికి ఏది ఆక ర్షిస్తుందో, ఏది ఎక్కువ ధనాన్ని సంపాదించిపెడుతుందో అదే ఉపయోగపడేదని అర్థం. ప్రతిదీ డబ్బుతోనే కొలుస్తారు. ఆర్థిక న్యాయంతోనే వాటి విలువ నిర్ణయించబడుతుంది. దానినే నేను 'ఉపయోగవాదం' అంటాను. ఈ జబ్బు ఓ అంటువ్యాధి. చిన్న పిల్లలకు కూడా సులువుగా అంటుతుంది! ఏ పసిమనసులు సౌందర్యం, గొప్పతనం, పరిపూర్ణత్వం కోసం కలలు కంటారో – ఏ కలలు సామాన్యుల సాధారణ జ్ఞానానికి భిన్నంగా, విశి ష్టంగా, ఉన్నతంగా వికసిస్తాయో, అలాంటి పసివయసులో ఉండే గొప్ప కలల నించి వాళ్లను పక్క తోవపట్టిస్తున్నాం. ఇప్పుడు వాళ్లు ఈ మంచివిషయాల పట్ల, అంత ఉత్సాహం చూపటం లేదు. వీటిల్లో ఏ విధమైన 'థ్రిల్' లేదని వాళ్ల భావన. డబ్బు గురించి కలలు కనడమే ప్రధాన విషయంగా మారింది. డబ్బు ఎలా సంపాదించాలన్నదే వాళ్లకున్న ఏకైక చింతన.

ధనార్జనే ముఖ్యమయిన ఆశయంగా పెట్టుకున్న యువత ఆ చదువులు కూడా అలాంటి ప్రయోజనాన్నాశించే అభ్యసి స్తున్నారు. పరీక్ష పాస్ కావడమే వారి ధ్యేయం. మంచిమార్కులు, మంచిజీతం, మంచి జీవితం – డిప్లొమాలు, సర్టిఫికేట్లు సంపాదిం చడమే వారి లక్ష్యం. దాని కోసమే వారి నిరంతర కృషి. ఆ కృషి వెనుక ఏ ఉన్నతాశయమూ లేదు, మరే విలువలూ లేవు. – కేవలం ధనార్జన, హోదా, పదవి, అంతస్తు – '*ధనమూలం మిదం జగత్*' అన్నదే వారి నినాదం.

వారికి విద్య పట్ల ఆసక్తికాని, విద్య గొప్ప లక్ష్యసాధనకు సహాయపడుతుందనే ఆలోచనగాని లేదు. అర్థం చేసుకోరు. విద్య యొక్క అనేక ప్రయోజనాలు ముఖ్యంగా – జ్ఞాన సముపార్జన, సృష్టి రహస్యాలను తెలుసుకోవడం, ప్రకృతిని పరిశీలించడం, అర్థం చేసుకోడం, క్రమశిక్షణ, వ్యక్తిత్వవికాసం, చైతన్యవికాసం, బలహీనతలను జయించడం, తనని తాను సమర్థునిగా తయారు చేసుకోడం, అజ్ఞానాన్ని, అసమర్థతల్ని తొలగించుకొని జీవితంలో

అభివృద్ధి సాధిస్తూ క్రమంగా మరింత ఉన్నతలక్ష్యాల కోసం ప్రయత్నిస్తూ, విస్తృత పరిధిలో జీవితాన్ని నడిపించడానికి విద్య నభ్యసించాలన్నది వాళ్ల కందని విషయం. విద్య మంచిని పెంచి, విశాలైన దృక్పథాన్ని, నిజాయితీని పెంచుతుందన్న విషయాన్ని 'వట్టి యుటోపియన్' గా భావిస్తారు. వాళ్లకు నచ్చే విషయం కేవలం లౌకికం, డబ్బు నెలా సంపాదించాలన్న ఒకే ఒక పర మార్థం కోసం వాళ్లని తయారుచేసుకోవడం.

*

డబ్బు – సంపదని పెంచటానికి, సమృద్ధిని, ఉత్పత్తిని పెంచే సాధనంగా ఒక సమూహానికో, ఒక దేశానికో లేదా మొత్తం భూమ్మీద అందరికి ఉపయోగపడే వస్తువు. ధనం కేవలం ఒక సాధనం, ఒక శక్తి, ఒక ఆయుధం తప్ప ధనమే సర్వస్వం కాదు. అన్ని శక్తులూ, అన్ని అధికారాల్లాగే ధనం కూడా చలనం లోనూ, మారకంతోనూ మాత్రమే శక్తిసాధనంగా మారుతుంది. కాని దాన్ని మూటకట్టి దాచిపెట్టడం వలన కాదు. ఒక చక్కని ఉదాహరణగా ప్రపంచానికి నిరూపించి చూపడమే మనం ఇక్కడ సాధించవలసినది. ఆంతరంగికమైన మానసిక పరిజ్ఞానంతో సంస్థలు ఏర్పడి బయట పనిచేసినపుడు మానవజీవితాన్ని బాధించే అనేక రుగ్మతలని నిర్మూలించి క్రొత్త ప్రపంచాన్ని సృష్టించ గలం. అదే ఇక్కడ మనం చేస్తున్నది. ఇది సాధించటానికే ఈ నిరంతర ప్రయత్నం.

చేతనాస్థాయి పెరిగినపుడు ఆర్థికసుస్థిరత్వం సమకూరు తుందా?

చైతన్యవికాసం ఉన్నపుడు సహజంగానే ఆర్థికస్థితిలాంటి విషయాలపట్ల ఆసక్తి తగ్గుతుంది.

మూలం: శ్రీమాత

అనువాదం: డి. సత్యవాణి

(*CWM* Vol. 12, pp. 353-54; Vol. 13, p. 154; Vol. 15, p. 58)

ఆటవికత (Barbarism)

నాగరికత పెరుగుతున్న కొద్దీ మనిషి కోరికలు కూడా పెరుగు తున్నాయి. కార్లు, సెల్‌ఫోన్లు రకరకాల గేడ్జెట్లు మనకు దర్శన మిస్తున్నాయి. దీనిని నాగరికతనలా లేక భౌతికరాక్షసులను అంద లమెక్కి కూర్చోపెట్టడమనాలా? శ్రీఅరవిందులు దీనిని బార్బేరిజం అనగా 'ఆటవికత' అన్నారు. మనం మళ్లీ ఆటవికస్థాయికి దిగ జారిపోవలెనో, లేక విజ్ఞానస్ఫూర్తితో వేగంగా ముందుకు సాగిపో వలెనో మీరే నిర్ణయించుకోండి. — *సంపాదకుడు*

విజ్ఞానశాస్త్రము మానవజీవితాన్ని అనేక విధములుగా మెరుగుపరి చింది. అతని పరిధిని విశాలపరిచింది. లోతైన సంస్కృతికి దారి తీసింది. అయితేనేమి అసలైన భౌతికజీవితమంటే ఏమిటో మనకు తెలియకుండా అయింది. ఆ విజ్ఞానశాస్త్రప్రగతి కూడ కొంతవరకు దీనికి కారణమే. కేవలం బాహ్యాసౌకర్యములను పెంపొందించి భౌతికజీవితమునకే ప్రాముఖ్యత నిచ్చి మరో విధమైన బానిస త్వానికి (Barbarism) దారితీసింది. దీనిని, ఇటువంటి దాసోహాన్ని ఏమనాలో తెలియదు. ఇది పారిశ్రామిక యుగము గదా! అధికా ధికంగా పెరిగి పెద్దదవుతున్న వాణిజ్య, ఆర్థిక, సంస్కృతి పరా కాష్ఠకు జేరుతోంది. ఈ యుగము ఇక అంతమైపోతోంది. మని షిలో వాంఛాజీవుడొకడున్నాడు గదా! ఆ వాంఛాజీవినే ఆత్మయని పొరపాటు పడి దానిని తృప్తిపరచడమే జీవితపరమావధి అను కుంటాడు.

అతని ఉద్దేశంలో భోగభాగ్యాలతో కోరికలను తీర్చుకొం టూపోవడమే జీవలక్షణము. జాంతవిక మానవుడు ఏ విధంగా కండపుష్టిని, ఆరోగ్యము, జవసత్త్వములు మాత్రమే ముఖ్యమను కుంటాడో అటులనే ఆసురిక మానవుడు లేక ఆర్థికమానవుడు (the vitalistic or economic barbarian) వాంఛలను పెంచుకుంటూ ఐశ్వర్యమును అభివృద్ధిచేసుకొనుటయే తన పరమావధి అనుకుం టాడు. అతని ఉద్దేశ్యంలో తాత్త్వికచింతన, నైతిక లేక మతపర

మైన జీవితము, సంస్కారము ముఖ్యం కాదు. ధనమే దైవము. ఉత్పత్తులను చేసి ఆస్తిపాస్తులను పెంచుకోవటమే అతని బ్రతుకు.

హద్దుపద్దూ లేకుండ ధనకనకవస్తువాహనాదులను పెంచు కోవటం, కళావిహీనమైన వస్తువుల ఆడంబరము, లెక్కలేనన్ని సదుపాయాలు, సౌకర్యాలు, మతము పేరుతో చేసే పూజాపున స్కారాలు, వ్యాపారముగా మారిన రాజకీయాలు, పాలనావ్యవస్థ, వినోదసాధనాలు – ఈ వ్యాపారచక్రంలో బందీ అయిన ఆర్థిక మానవునికి సౌందర్యము, రసాస్వాదన అంటే ఏమిటో తెలి యదు. అవి కేవలం వృథా అన్న మాట! లలితకళలు, కవిత్వము వట్టి ఆడంబరాలు లేదా వ్యాపారప్రకటనలకు (advertisement) మాత్రమే ఉపయోగములు. అతని ఉద్దేశ్యంలో నాగరికత అనగా సుఖమే, నైతికజీవితమనగా సామాజిక స్తోమతయే. రాజకీయా లనగా పారిశ్రామికాభివృద్ధి, కొనుగోలుదారులను వెతుక్కోవటం, ఇతర దేశాలను జయించి, వాటిని తమ గుప్పెట్లో పెట్టుకోవడం, లాభదాయకంగా వ్యాపారం చేయటం, మతమనగా లాంఛన ప్రాయమైన కార్యక్రమాలు లేక జనాకర్షణలు పొందే మాయలు, మర్మాలు. విద్య అనగా పారిశ్రామిక జీవితంలో విజయాలు సాధిం చగలగాలి. విజ్ఞానశాస్త్ర మనగా క్రొత్త క్రొత్త యంత్రాలను కని పెట్టటం, జ్ఞాన మనగా సుఖసంతోషాలను, ఉత్పత్తి యంత్రాలను వాటిని సక్రమంగా నడిపించేందుకు అవసరమైన వ్యవస్థను తయా రుచేయటం, పెద్ద పెద్ద పెట్టుబడిదారులు, వారి అండదండల నాశించే ప్రభుత్వ ఉన్నతాధికారులు, అనేక పరిశ్రమలను చాక చక్యంగా నడిపించగలిగే మోతుబరులు మొదలైనవారే ఈ వ్యాపార సమాజాన్ని నడిపించే నిజమైన పరిపాలకులు.

ఈ బాహ్యాడంబరమంతా కేవలం ప్రాణికాతిశయము. ప్రాణికజీవి విజృంభణము. ఇందులో తప్పేమిటి అని అడగవచ్చు. ఇది ఆసురిక ప్రవృత్తి. ప్రాణికాభివృద్ధి గూడ మానవుని సర్వతో ముఖవికాసమునకు అవసరమే. దాని పాత్ర దాని కున్నది. అంతకు మించితే ప్రమాదము. మానవుడు సమాజంలోని అంగమే కదా! అతని జీవితము సంపూర్ణంగా ఉండాలన్న మాట నిజమే. అయితే

అది శోభాయమానంగా దివ్యసత్యానికి చేరువగా వుండాలి. ఈ శరీరము, జీవితము కేవలం స్వలాభం కోసమే కాకుండా అంతకు మించిన పాత్రగా, ఒక చక్కటి ఉపకరణంగా వుండాలి. మానవ కళ్యాణానికి దోహదం చేయాలి. తన స్వతః ప్రయోజనాలకే కాకుండా అంతకంటె గొప్పదైన మనోమయ పురుషునికి విధే యమై సత్యంశివం సౌందర్యములకు ఆలవాలమై వుండాలి. మరి ప్రస్తుతం ఈ వ్యాపార చక్రంలో నడుస్తున్న జీవితం కేవలం ఒక తాత్కాలిక స్థాయే. అక్కడే చతికిలబడి కూర్చోకూడదు. అలా జరిగిన జీవితం అక్కడే స్తంభించిపోతుంది. అంతుపొంతులేని ఆడంబరాలతో ఊపిరికూడ సలపకుండా వుంటుంది. రాక్షసుడు పెరిగి పెరిగి నాశనమైపోయినట్లు దాని భారంతో అదే కృంగిపో తుంది.

స్వేచ్ఛానువాదం: డా॥ ఆర్.ఎల్.ఎన్. శాస్త్రి

మన క్రియాత్మక జీవితములో బాహ్యావసరములకు బానిసలమగు టతో తృప్తిపడి శీఘ్రతాత్కాలికప్రయోజనములే మన మనోవా క్కాయ కర్మములను నియమించుచున్నవని సరిపెట్టుకొనుచుం డుటచే ఈ కష్టముత్పన్నమగుచున్నది. అయినను దాని యందు కూడ చివరకు ఉన్నత సత్యమునే చేరవలసి యున్నది. పర్య వసానములో మన జీవితమునందు ఆదర్శములతో కూడి ఆంత రంగికమైనస్థితి కంటె దైనందిన జీవితముతో కూడిన సాంఘిక స్థితి వేరుకాదని తెలిసికొందము. పైగా మన జీవితములోని బల వత్తర సూత్రము, శక్తి అగునట్టి అత్యంతోన్నత సంపూర్ణయథార్థ తత్త్వమును వాని యందాలోకించి వ్యక్తి సమూహముల యందు దాని నభివ్యక్తము చేసిననే గాని వాని నిజమైన అర్థమును తెలి సికొని వాని నిష్ఠుర బాధాకరసమస్యలను పరిష్కరింపలేము. దైవము నాలోకించి, సాక్షాత్కరించుకొని వ్యక్తీకరించుటకు మన కీయబడిన బహ్వర్థసుసంపన్నావకాశమే జీవితసర్వస్వమై యున్నది. (All life is only a lavish and manifold opportunity given us to discover, realise, express the Divine)

మిగిలిన వారి వలెనే హేతుయుక్త మానవుడు నీతిమయ జీవితమును కారణధర్మ సూత్రములచేత నియమించి దాని ఆచరణ ధర్మస్వభావములను కేవల హేతుస్థితికి దింపుటకు యత్నించెనన్నమాట వాస్తవము. అతడు దీనిలో కృతకృత్యుడు కాలేదు; కాలేడు. కృతకృత్యుడైనట్లుగా అతడు చేయు నటనములు మాటలతో, ఊహాలతో, శుష్కతత్త్వముతో, అతుకులమారి సమన్వయముతో బుద్ధి నిర్మించునట్టి సొగసైన గాలిమేడలు. చివరిమాట చెప్పవలసినచో ఈ నటనలతోడి వైఫల్యములన్నియు యాథార్థ్యము యొక్క దృఢస్పర్శ తగిలిన వెంటనే కూలిపోవును.

మూలం: శ్రీఅరవిందులు
అనువాదం: వెంపటి కృష్ణమూర్తి (*'మానవావర్తము'* నుండి)

(*SABCL* Vol. 15, pp. 72-73, 138)

పెట్టుబడిదారులకు, వ్యాపారులకు రాబోవు బంగారు భవిష్యత్తులో భాగస్వాములు కాగల అవకాశం దైవంచే ఇవ్వబడింది. కాని చాలమంది భవిష్యత్తుకన్న ధన శక్తి బలీయమైనదని అంగీకరించి, ఆ సదవకాశాన్ని తిరస్కరించారు.

కాని భవిష్యత్తు తన తిరుగులేని శక్తితో వారిని అణగద్రొక్కేస్తుంది.

శ్రీమాత

(*CWM* Vol. 15, p. 57)

ధనశక్తిని తిరిగి దైవానికి అప్పగించుట

ధనము పట్ల 'నాది' అనే భావము సహజమే! కాని ఒక మహా సముద్రాన్ని పట్టుకొని .'నాది' అనుకోటం న్యాయం కాదు. ధనమొక మహాప్రవాహము. వ్యక్తిగత వాంఛను జయించినప్పుడు నువ్వు ఆ ప్రవాహంలోకి ప్రవేశించగల్గుతావు. అప్పుడు నీకా ధనమూ దొరుకుతుంది. నువ్వు దానిని సద్వినియోగమూ చేయ గల్గుతావు. నువ్వు దానికో చక్కని ఉపకరణమన్న మాట.

— సంపాదకుడు

అసురులవశంలో ఉన్న ధనాన్ని మళ్ళి మదర్ చేతుల్లోకి రప్పించటమెలా?

ఇక్కడ పరస్పరాధారితములైన మూడు విషయాలున్నా యని శ్రీఅరవిందులు అంటారు. అధికారం, ధనం, కామం – ఈ మూడు ఒకదానిపై ఒకటి ఆధారపడి ఉంటాయి. వీటిలో ఏ ఒక్క దానిని జయించాలన్నా, మూడింటిని జయించవలసి ఉంటుందని నా నమ్మకం – ఒకదానిని జయించాలంటే మిగతా రెంటిని కూడ చేజిక్కించుకోవలసిందే. వ్యక్తి ఈ మూడింటిపైన ఆధిపత్యం పొంద లేనట్లయితే – అధికారేచ్ఛ, ధనాపేక్ష, కామవాంఛ – వాటిలో ఏ ఒక్కదాన్నీ నిశ్చయంగా పొందలేడు. ధనానికి నేడున్నటువంటి అత్యధిక ప్రాధాన్యత సమకూరింది ధనంవలననే కాదు. ఎందు కంటే, ధనాన్ని కూడబెట్టి, అలా కూడబెట్టుకొన్న దానిని లెక్క బెట్టుకొనుటతో సంతోషపడే కొందరు మూఢులను మినహా యించి, సాధారణంగా ధనాన్ని అది సమకూర్చే సంతృప్తి కోసం అభిలషించి ఆర్జిస్తారు. ఇది దాదాపు ఇచ్చిపుచ్చుకోవడం లాంటిది: ఈ మూడింటిలో ప్రతి ఒక్కటి, కోరికల ప్రపంచంలో దాని స్వంత విలువలు కలిగియుండుటయేకాక, మిగతా రెండింటిపైన కూడ ఆధారపడుతుంది.

నాకు కలిగిన ఒక అనుభూతి గురించి చెప్పాను: ప్రపం చపు భాగ్యరాసులను, భూసంపదలను పరిరక్షిస్తూ కాపలాకాసే నల్లని పెనుత్రాచు గురించి – అది కామవాంఛపై నియంత్రణను

కోరింది. కారణం, కొన్ని వాదనల ప్రకారం అధికారంకోసం పడే ఆరాటపు లక్ష్యం కామవాంఛల సంతృప్తి. వ్యక్తి దీనిని నియంత్రించగలిగితే, మానవచైతన్యం నుండి దానిని సమూలంగా నిర్మూలించగలిగితే, అధికారదాహం, ధనవ్యామోహం వాటంతటవే మాయమౌతాయి. దీనివల్ల విశదమయ్యేదేమిటంటే, మానవ జీవితంలో ఈ మూడూ అతిపెద్ద ప్రతిబంధకాలనీ, వాటిని జయిస్తే తప్ప మానవాళి మార్పు చెందుటకు లేశమాత్రమైన అవకాశం లేదని.

*

నిధినిక్షేపాలు సర్పాలచే రక్షింపబడుతుంటాయని చాలా ఫెయిరీటేల్సులో ఉంటుంది. ఇది నిజమేనా?

అవును, కాని అది స్థూలశరీరధారి గాదు – ప్రాణిక సర్పం. నిధినిక్షేపాల తాళంచెవి ప్రాణిక ప్రపంచంలో ఉంటుంది. ఒక భయంకరమైన నల్లని సర్పం దానిని రక్షిస్తూంటుంది. అది అతి భయంకరమైనది, సాధారణ సర్పం కంటే వందరెట్లు పెద్దది. నిధి ద్వారాలను కాపలా కాస్తుంటుంది. దేదీప్యమానంగా, నల్లగా, ఎల్లప్పుడూ నిటారుగా, మెలకువతో ఉంటుంది. ఒకప్పుడు నేను దాని ఎదుట నిలుచుట తటస్థించింది. (మామూలుగా ఈ జీవులు నా ఆదేశాలను పాటిస్తుంటాయి) "నన్ను వెళ్లనీ" అని దానిని అడిగాను. అది ఇలా సమాధానం ఇచ్చింది, "మిమ్మల్ని వెళ్లనీయడం నాకిష్టమే, కాని నేనలా చేస్తే అవి నన్ను చంపేస్తాయి; అందుకని మిమ్మల్ని వెళ్లనీయలేను" అప్పుడు నేనిలా అడిగాను, "ప్రవేశం పొందాలంటే నేను నీకేమివ్వాలి?." అది ఇలా అంది "దానికొక్కటే మార్గం. మనిషిలోని కామవాంఛపై మీరు ఆధిపత్యం సంపాదించగలిగితే, మానవాళి దానిని జయించుటలో మీరు సఫలీకృతులు కాగలిగితే, అప్పుడు నేను అడ్డగించను, మిమ్మలను వెళ్లనిస్తాను."

ఇప్పటి వరకు కూడ అది నాకు దారి నివ్వలేదు. దాని షరతును నేను తీర్చలేకపోయానని ఒప్పుకోవాలి. అందరి మనుష్యులోను దానిని జయించగల ప్రావీణ్యతను నేను పొందలేకపోయాను.

అది చాలా కష్టం.

*

నువ్వు ఈ ధనప్రవాహంలో ఉండదలచుకుంటే ఏం చెయ్యాలో తెలుసా! ఇంపర్సనల్‌గా వుండాలి. 'ఇది నాకు చెందినది కాదు. అది ఒక శక్తి. నేనా శక్తిని అత్యంత ఉపయోగకరంగా, మహా ప్రయోజనములు సిద్ధించునట్లు ప్రయోగింపవలెను' ఇలాంటి స్పంద నలవల్ల, నిర్విరామకృషివల్ల ఈ శక్తి పెరుగుతుంది – ఆకర్షణ శక్తియేగాక ఒక పద్ధతిగా తీర్చిదిద్దగల శక్తి కూడ. అనగా, ఎలాంటి సాధన సంపత్తి లేకపోయినా, ఈ శక్తిని గనుక కలిగి ఉన్నట్లయితే దానిచే పనిచేయించవచ్చు, దానిని అందరికి అందు బాటులోకి తేవచ్చు. అవసరమనిపిస్తే, ఈ డబ్బు తనకు ఎందుకు కావాలో సూచనమాత్రముగా నైన బయటకు పొక్కకుండా తన కవసరమగు శక్తిని దానినుండి పొందవచ్చు. సాధారణ సంపద లకు అనువైన పరిస్థితులకు పూర్తిగా భిన్నమైన పరిస్థితులలో ఉన్నప్పటికీ, ఈ శక్తిని వాడుకోగలడు. అంతేకాదు. తన కార్య నిర్వహణకు అవసరమయ్యే సమస్త సంపదలు అతనికి అందు బాటులో ఉంటాయి.

ఈ ఉత్తరం శ్రీఅరవిందుల కార్యార్థం ధనం సమకూర్చ డానికై బయలుదేరాలనుకున్నవానికి వ్రాయబడింది. అతనికి ఎలాంటి సాధనాసంపత్తి లేనందువల్ల శ్రీఅరవిందులతో ఇలా అన్నాడు, "నాకుగా నాకు ఏమీ లేనందువల్ల ప్రజలు నన్ను నమ్మరు, నేనేమీ వసూలు చేయను." బాహ్యశక్తి అంత ముఖ్యం కాదు. నీలో అంతర్లీనమై ఉన్న శక్తిని ఉపయోగించుట వలన, ధన మెక్కడ ఉన్నా సరే, దానిపై నీకు అధికార మేర్పడుతుంది" అది ప్రజాసంస్థలలో ఉన్నా, వ్యక్తుల వద్ద ఉన్నా, దానిపై అధి కారం పొందవచ్చు. అవసరమేర్పడినప్పుడు, ఒక రకమైన స్పంద నతో కావలసిన దానిని ఆకర్షించవచ్చు.

మూలం: శ్రీమాత

అనువాదం: అందుగులపాటి కైలాసపతి, జానకి

(*CWM* Vol. 4, pp. 381-82, 189-90; Vol. 6, pp. 250-51)

ధనము పట్ల సాధకుని వైఖరి

నువ్వు శ్రీమాత బిడ్డవు. ఆమె ఆదేశాలను పాటించుటకు సర్వ సన్నద్ధుడవు. అందుకని నువ్వు ధనాన్ని నిరసించకూడదు. శ్రీమాత కార్యములకది కావాలి. నీకు దాని పట్ల వ్యామోహము లేనప్పుడు అది దానంతటదే నీ దగ్గర కొస్తుంది.

— సంపాదకుడు

ధనశక్తి నుండియు, తచ్ఛక్తియొసగు భోగ్యవస్తువుల నుండియు, ఉపకరణముల నుండియు ఒక విరాగివలె నీవు వైముఖ్యము వహింపరాదు; వానియెడ రాజసిక రక్తి కూడ పూనరాదు. సంతుష్టికై లోలుడవు క్రీతదాసుడవు కాగూడదు; జగజ్జననికై యర్థము నుద్ధరించి మాతృసేవార్థమే వినియోగింపదగిన శక్తిగా భావింపుము.

సమస్త సంపదయు భగవానునిదే. సంపన్నులు తద్ధర్మ కర్తలేగాని యజమానులు కారు. తత్సంపద నేడు వారికడ నున్నది; రేపు ప్రదేశాంతరమున కరుగవచ్చును. తమకడ నున్నప్పుడు వారా సంపదను ఏ భావముతో, ఏ యుద్దేశముతో ఏ ప్రయోజనమునకై వినియోగింతురో అదియే ప్రధాన విషయము.

నీ కడ నున్న ధనముగాని నీవు సంపాదించునది, నీ ప్రయోజనమునకై వినియోగించునది యంతయు జగన్మాతదే యని భావింపుము. నీ వామె నర్థింపకుము. ఆమె నీ కనుగ్రహించుదానిని నిజోద్దేశములకై వినియోగింపుము. సంపూర్ణముగా స్వార్థ రహితుడవు కమ్ము. ధర్మబుద్ధితో నుండుము. సూక్ష్మవిషయములందును క్రమబద్ధుడవై, అప్రమత్తుడవై, వివేచనాయత్తుడవై, ఉత్తమ ధర్మకర్తవై యుండుము. అర్థము నీ యది కాదనియు, జగన్మాతదే యనియు నిరంతరము భావించుచుండుము.

అదియును గాక జగజ్జనికై నీవు స్వీకరించు ధనమును శ్రద్ధాభక్తులతో తత్సన్నిధానముననే యుంచుము. స్వప్రయోజనార్థముగాని, అన్యప్రయోజనమునకుగాని దానిని తాకకుము. సంపన్నుల సాహాయ్యమును కాంక్షింపకుము. వారి యాడంబరమును

ప్రాభవమును గాంచి సంభ్రమింపకుము. జననికై నీ వర్ధించునపుడు ఆమెయే నీ ద్వారా తనకు చెందినదానిలో స్వల్పభాగమును మాత్ర మభిలషించునట్లు భావింపుము. నీ వర్ధించునతడు ఇచ్చు సమాధానము ననుసరించి అతని యోగ్యత నిర్ణీతమగును.

నీవు ధనమునందు మోహముగాని, వైముఖ్యముగాని లేక యున్ననాడు ఈశ్వరప్రయోజనమునకై ధన వినియోగమున కధికతర సమర్థుడు కాగలవు. సమరసభావము, వాంఛారాహిత్యము, దివ్యశక్తికిని తత్కార్యమునకును నీ సంపదను, ఆర్జనను సంపూర్ణముగా సమర్పించుటయు చిహ్నము లగును. ధన వినియోగవిషయములలో మానసికాందోళనము, బాధ్యత, సంకోచము సంభవించునో అది నీ లోపమునకో, బంధమునకో చిహ్నమగును.

లక్ష్యప్రాయుడగు సాధకుడు దారిద్ర్యము స్వీకరించి జీవింపుమన్నచో జీవింపగలడు. అతని నెట్టి లోపము బాధింపదు; దివ్యచైతన్య మాతనిలో ప్రవేశించి క్రీడించుట కెట్టి యవరోధము నుండదు. సంపన్నుడుగా జీవింపుమన్నను అతడు తద్విధముగా జీవింపగలడు. క్షణమైనను ధనాశాపీడితుడు కాడు. దుర్బలత్వముతో ధనాభ్యాసములకు కట్టువడడు. ఈశ్వరేచ్ఛయు, పరమానందములే అతని సర్వస్వము.

అతిమానససృష్టిలో ధనశక్తిని ఈశ్వరశక్తికి మరల వశపరుపవలయును. జగజ్జననీ సృజనదృష్టిలో నూత్న దివ్యప్రాణ దివ్యదేహములను సత్య సుందర సుసంబద్ధ జీవితములుగా స్థిరీకరించి సంస్థాపించుటకై ధనశక్తిని వినియోగింపవలెను. ప్రథమతః దానిని జననికై యుద్ధరింపవలసియున్నది. స్థిరచిత్తులు, విశాల హృదయులు, అహంకారరహితులు, వీతప్రత్యాశాపరులు, నిస్సంశయాత్ములు, సంపూర్ణాత్మసమర్పకులు నగువారలే విజయసాధనలో సమర్థులు. అట్టివారి విశుద్ధశక్తిసరణులలోనే పరాశక్తి ప్రసరిల్లును.

మూలం: శ్రీఅరవిందులు
అనువాదం: శ్రీ శివశంకరానంద ('జనని' నుండి)

(*CWM* Vol. 25, pp. 12-14)

దైవకార్యానికి ధనమొక సాధనము

ధనము పట్ల వ్యామోహం పనికిరాదని మనం చెప్పుకున్నాం కదా! అసలు దానిని నువ్వు సొంతం చేసుకోటమెందుకు? రేడియో తరంగాలు గాలిలో ఉంటాయి. గ్రహణయంత్రము పెట్టుకున్నప్పుడు వాటిని నీవు స్వీకరించగలవు. ధనము కూడా అటువంటిదే. నీ మనస్సు ఎంత నిర్మలంగా, ఎంత విశాలంగా ఉంటే అంత ప్రమాణంలో దానిని నీవు గ్రహించగల్గుతావు.

— సంపాదకుడు

డబ్బు నెలా ఖర్చు పెట్టాలి? అసలు అది ఎవరికి చెందినదో తెలిస్తే గదా ఈ విషయాన్ని గూర్చి ఆలోచించడం. నిజానికి డబ్బు ఏ ఒక్కరికీ చెందినది కాదు. డబ్బును సొంతవస్తువుగా పరిగణించడం వలననే గొడవ వస్తుంది. డబ్బు ఒక శక్తి, విద్యుచ్ఛక్తి లాంటిది. నీ కివ్వబడిన ఒక క్రియాశక్తి. 'నేను, నాది' అనే ప్రసక్తి లేకుండ ఇంపర్సనల్‌గా దానిని నిర్వహించాలి, ధనము నిచ్చునది దైవమే గదా! ఆయన యిచ్ఛప్రకారమే ఇంపర్సనల్‌గా, విజ్ఞతతో దానిని నిర్వహించాలి. దాని పంపిణీకి (diffusion) విని యోగమునకు నీవొక చక్కటి ఉపకరణము అయినట్లైతే అది నీ దగ్గరకు వస్తుంది. దానిని ఏ విధంగా వాడాలో ఆ విధంగా వాడే సామర్థ్యము ఎంత ఎక్కువగా వుంటే అంత ఎక్కువగా వస్తుంది. ధనం విషయంలో అదే సక్రమమైన పద్ధతి.

భూలోకంలో ఒక కార్యమును నిర్వహించుటకై దైవీశక్తులను ఆకర్షించి అభివ్యక్తపరచేందుకు ధనమొక శక్తి అని నీవు గ్రహించాలి. ఈ విధంగా ఎవ్వరైతే దాని నుపయోగించగలరో, ఎవ్వరైతే స్పష్టంగా సంపూర్ణంగా దాని సత్యాన్ని దర్శించగలరో, వారి చేతులలోకే అది వస్తుంది.

మొట్టమొదట 'ఇది నాది' అనే భావాన్ని నీ మనస్సులోంచి బహిష్కరించాలి. 'ఇది నాది' అంటే ఏమిటో నాకు అర్థం కాదు. అసలది తమకే చెందినదని మనమలెందు కనుకొంటారు? ఇష్ట మొచ్చినట్లు చేసేందుకు, ఖర్చు పెట్టేందుకు — అంతే కదా మరి.

మరి కొంతమంది దాన్ని దాచి పెట్టుకోవాలని ప్రయత్నిస్తారు – అదొక జాడ్యము. వాళ్లకు కావలసి వచ్చినప్పుడు వుంటుందని అలా చేస్తారు.

కాని నీ వొక విషయం తెలుసుకోవాలి. నీవొక రేడియో స్టేషనువలె గ్రహించి ప్రసారం చేసే యంత్రము (receiving and transmitting station) అనుకో. ఎంత ఇంపర్సనల్‌గా, సంపూర్ణంగా, ఎంత విశాలదృష్టితో ఎంత సర్వోత్కృష్టంగా, ఎంత విశాలంగా, ఎంత సార్వజనీనంగా. వుంటావో, అంత డబ్బు నీ దగ్గరకు వస్తుంది.

భూలోకం యొక్క పురోగమనానికి, పరివర్తనానికి ఎంత అవసరమైన విధంగా వుంటే అంత అధికారం నీ చేతిలోకి వస్తుంది. అంటే ఏమిటి? అతి విశాలమైన దృష్టి, సామర్థ్యము కలిగివుండాలి అన మాట.

డబ్బు తప్పుదారి పట్టడం మనం చూస్తూనే వుంటాము. అయితే సక్రమమైన పద్ధతి కూడ ఒకటున్నది. ఏ మాత్రం వృథా కాకుండ అత్యధికమైన ఫలితము కలిగేటట్లు ధనశక్తిని నిర్వహించి ప్రవహింపచేయుటలో ఒక ఆనందమున్నది. ఇది ఒక అద్భుతమైన విషయము. కొంతమంది మనుష్యులుంటారు. ఎక్కువ ధనాన్ని కూడబెట్టుకొని చాల పెద్ద యెత్తులో ఉపయోగించగలరు. మరి కొంతమంది డబ్బుంటే బాగుంటుంది, దానిని ఖర్చు పెట్టగలము అనే దాతృత్వబుద్ధిగల వారుంటారు. కాని వారికి బహిరాభివ్యక్తి లేదు. అట్టి కౌశలము లేదు. నిజమైన అవసరాలను తీర్చగలిగే సామర్థ్యముంటే మంచిదే.

వ్యాధులను పోగొట్టి ఆరోగ్యాన్ని చేకూర్చటం, అసత్యానికి సత్యంగా మార్చటం, దుఃఖాన్ని సంతోషంగా మార్చటం మొ॥ అన్నీ ఒకే కోవకు చెందిన వృత్తులు. కృత్రిమమైన విషయాన్ని వాస్తవంగా మార్చటం – ఇదే ముఖ్యము. దీని కింత డబ్బు అవసరం, దానికింత డబ్బు కావాలి, ఈ కార్యానికింత అవసరం, మరోదాన్ని మరమ్మత్తు చేసేందుకో లేక తయారుచేసేందుకో ఇంత డబ్బు కావాలి అనుకుండేవాళ్లు ఈ విధమైన కార్యములకు

చక్కటి వాహికములుగా వుంటారు. అట్టివారి ద్వారా కావలసిన ధనం వస్తుంది.

ధనమును పోగుజేయుటమూ, ఖర్చుపెట్టడమూ (విడివిడిగా రెండూ అజ్ఞానంతో కూడుకొన్న ప్రక్రియలే) ఇవి రెండూ ఒకే మనిషిలో రాణించడమనేది ఒక మహావిషయము. అప్పుడు మహా ప్రయోజనములు కలుగును. అది మంచిదే. ఆ విధంగా జరిగిన పుడు మెల్లిమెల్లిగా దానిని ఆచరణలో పెట్టటం సాధ్యమౌతుంది.

అలా జరగాలంటే స్పష్టమైన ఆలోచనలుగల మనుష్యులు కావాలి. అనేకమంది మధ్యవర్తులు – అన్ని చోట్ల ఒకే సమయంలో పనిచేయగలిగే చక్కటి ఉపకరణములు (మనుష్యులు) కావాలి.

డబ్బు ఏ ఒక్కరికో చెందినది కాదు. అది సామూహిక సంపద – సమగ్రమైన, విశాలమైన, సంపూర్ణమైన దృష్టికలవారు మాత్రమే దానిని వినియోగించాలి.

I would add something to that: not only integral and comprehensive, but essentially *true* as well; a vision which can tell the difference between a use which is in accord with the universal progress, and a use which could be termed fanciful. But these are details, for even the mistakes, even, from a certain standpoint, the waste, help the general progress: these are lessons learned the hard way.

మూలం: శ్రీమాత
స్వేచ్ఛానువాదం: డా॥ ఆర్.ఎల్.ఎన్. శాస్త్రి

(*CWM* Vol. 13, pp. 275-77)

సర్వ సంపదలు సర్వేశ్వరునకు చెందినవే, ఆ సర్వేశ్వరుడే వాటిని మానవులకు బదులిస్తాడు. అది ఆయనకే మళ్ళి తిరిగి వెళ్లాలి.

శ్రీమాత

(*CWM* Vol. 15, p. 53)

దుబారా పనికి రాదు

మనము వాడుకునే వస్తువులను దుర్వినియోగం చేసి అతి తక్కువ కాలంలో పాడుచేయటం, వృథాపరచడం, చిందరవందరగా పడేయటం, పేరాశ వలనగాని, తామసిక బుద్ధివలనగాని వస్తువులను, సౌకర్యాలను (నీళ్లు, విద్యుచ్ఛక్తి మొ॥) నిర్లక్ష్యంగా వాడటం – ఇలాంటివన్నీ కూడ అభివృద్ధి నిరోధకాలు. అలాంటప్పుడు ధన శక్తి పారిపోతుంది. సమాజంలో ఇది చాలా కాలం నుంచి జరుగుతూనే వుంది. ఇంకా ఇలాగే కొనసాగినట్లైతే మన ఆదాయము ఎక్కువైనామట్టుకు ఏం లాభం? ఇంకా ఎక్కువ వస్తువులను నిర్లక్ష్యంగా వాడి పాడుచేస్తారు, వృథాపరుస్తారు అంతే. పెరిగిన ఆదాయం నష్టమైపోతుంది. ఈ పరిస్థితి బాగుచేస్తేకాని అభివృద్ధి సాధ్యపడదు.

మూలం: శ్రీఅరవిందులు

అనువాదం: డా॥ ఆర్.ఎల్.ఎన్. శాస్త్రి

(*SABCL* Vol. 23, p. 716)

ప్రశ్న: నా దగ్గరున్న వస్తువులన్నీ నా స్వంతమే అనే భావాన్ని వదిలించుకోవాలంటే నేనేం చెయ్యాలి మదర్?

జవాబు: నువ్వే పూర్తిగా దైవానికి చెందినప్పుడు ఇక నువ్వే మిటి, నీ సరంజామ ఏమిటి, నీ సర్వస్వమూ దైవానికే చెందుతుంది.

సంపన్నవంతుల కర్తవ్యము

"ధనమున్నవాళ్లు దానికి దాసులైపోతారు" అని అంటారు శ్రీఅరవిందులు.

నీవు సంపన్నుడవైతే భోగలాలసుడివి అవుతావు. ఆ లాలసత్వంలో విచక్షణారహితంగా, విలాసవంతంగా, విచ్చలవిడిగా ఆ సంపదని అనుభవిస్తావు. ఎప్పుడైనా ఆ సంపదను కోల్పోవచ్చు. కాని అలవాటు పడ్డ విలాసాలు నిన్ను వదలవు. అది తట్టుకోలేక సర్వస్వాన్ని కోల్పోయినట్టు బాధపడతావు. జీవితం దుర్భరమనిపిస్తుంది. నిరాశ నిస్పృహాలు నిన్నావరిస్తాయి. ధనంతో నీకుండే బంధం విడదీయరానిదై బలహీనుడివైపోతావు. అయితే కలిమిలేములతో సంబంధం లేకుండా యెప్పుడూ ఒకే విధంగా వుండే వారికి యీ బలహీనతలు, బాధలు వుండవు. అటువంటి స్థితప్రజ్ఞులకు డబ్బు వుండడం లేకపోవడం అన్నది అప్రస్తుతం. అదే సరైన పద్ధతి. డబ్బున్నప్పుడు అనుభవిస్తావు. లేనప్పుడు లేదు. నీలోని అంతశ్చేతనకి రెండు ఒకటే. అది నీకాశ్చర్యం కలిగించినా అదంతే.

ఎంత యెక్కువ ధనం వున్నా, ఇంకా ఎక్కువ కావాలనిపిస్తుంది!

కాని ఎంత యెక్కువ ధనముంటే అంత నరకం! అవసరానికి మించిన ధనం వుండడమే అనర్థదాయకం. అది మనిషిని మూర్ఖుణ్ణి చేస్తుంది. పరమలోభిగా మారుస్తుంది. క్రూరుడిగా చేస్తుంది. ప్రపంచంలో వుండే పరమ అనర్థాలలో యిదొకటి. అసలు కోరికలు ఉన్నంతవరకు నీకు డబ్బు వుండనే ఉండకూడదు. భూలోకమంత విశాలచైతన్యమున్న వానికి ఎంత సంపద వున్నా నష్టం లేదు. అలా కాని వాడికి ఆ సంపదే శాపమై అతని మీద స్వారీ చేస్తుంది. ప్రతివారూ ధనవంతులు కావడమే తమ తెలివికి నిదర్శనమనుకుంటారు. నిజానికి అదే అనర్థము, అవమానకరము. చివరికి దైవానికి దూరం చేసి నిరాదరణకి గురి

చేస్తుంది. ఈ విషయం ఎవరికైనా సరే నిర్మొహమాటంగా వారి ముఖం మీదే చెప్పగలను.

మంచివాడుగా, తెలివిగలవాడుగా, ఉదారుడిగా వుండడం పేదవాడికంటె ధనవంతుడికే కష్టం. చాలా దేశాల్లో, చాలా మందిని నేనెరుగుదును. అన్ని దేశాల్లోనూ యెప్పుడూ నేను కలుసుకున్నవారిలో అత్యంత ఉదారులు నిరుపేదలే. చేతినిండా డబ్బు వచ్చినట్లైతే వెంటనే అతడిలో ఒక రకమైన జబ్బు ప్రవేశిస్తుంది. అదేమిటంటే ఆ డబ్బుతో విడదీయరాని బంధం. అదొక శాపమని నా భావం.

అందుకని గొప్పవాళ్లు దానధర్మాలు చెయ్యాలి నిజమే. అయితే కొంతమంది గొప్పవాళ్లు పేరు ప్రతిష్ఠల కోసం అలా చేస్తూ వుంటారు. నువ్వు ఆ పొరపాటు చెయ్యకూడదు. అహంకారంతో కాకుండా విచక్షణతో, సాత్విక స్వభావంతో నిజమైన వుపయోగం యెక్కడుంటుందో తెలుసుకోవాలి. మీ వున్నత చైతన్యం ద్వారా ఉత్తమమైన, అన్నింటికంటె ఉపయోగకరమైన విధానం తప్పకుండా కనుక్కోగలరు. సర్వ్యులేషనులో వున్నప్పుడే డబ్బుకి నిజమైన విలువ లభిస్తుంది. ఆ విధంగా ఖర్చు చేసినట్టయితే ప్రతివారికీ, ప్రతి పైసాకి విలువ వుంటుంది.

ధనమొక శక్తి, మీ కిదివరకే వొకసారి చెప్పాను. ప్రకృతి శక్తని ప్రవహిస్తున్న నీటికి శక్తి యెలాగ వున్నదో, అలాగే వ్యాప్తిలో వున్న ధనం కూడా వొక చైతన్యశక్తి. వ్యుత్పత్తికి, పంపిణీకి సహకరించే దవుతుంది. వస్తూత్పత్తికి, సంపూర్ణమైన, స్వేచ్ఛాయుతమైన పంపిణీకి సుకరమైన మార్గదర్శకమవుతుందున్నది నిజము.

అందుకే ధనాన్ని సక్రమంగా అత్యుత్తమమైన అనుకూల పద్ధతుల్లో వినియోగించ గలిగినవారి చేతుల్లో పెట్టాలి. స్వార్థ రహితులు, వ్యక్తిగతమైన కోరికలు, బంధాలనించి విముక్తులైన వారే దీనికి అర్హులు. అంతే కాదు. ప్రపంచావసరాలని బాగా అవగాహన చేసుకుని, దాని కనుగుణంగా ఏం చెయ్యాలో, ఎలా చెయ్యాలో అంచనా వేయగలిగిన, విశాలదృక్పథం కలవారై

వుండాలి. అలాంటివారి నిర్వహణలోనే ఈ శక్తి సద్వినియోగ మవుతుంది.

వీటన్నిటితో పాటు వీరు ఉన్నతమైన ఆధ్యాత్మికజ్ఞానం కలవారైతే మరీ మంచిది. భూమ్మీద దివ్యశక్తి, దివ్యప్రేమ అవ తరణకి కూడా క్రమంగా ఈ శక్తిని ఉపయోగించగల సమర్థులు కాగలరు. అప్పుడు ఏ సంపద, ఏ ఆర్థికశక్తి శాపగ్రస్తమనుకు న్నామో అదే అత్యున్నతమైన దివ్యాశీస్సు (ఐశ్వర్యం) గా మారి అందరికీ మేలు చేస్తుంది.

ఉపయోగించే పద్ధతిని బట్టే వస్తువు విలువంతా వుంటుంది. సృష్టిలో ప్రతి వస్తువుకు తనదైన వొక స్థానముంటుంది. ఒక ప్రయోజనం వుంటుంది. సహజమైన ఉపయోగం వుంటుంది. దానిని అందుకు విరుద్ధంగా వాడుకుంటే అది స్థానభ్రంశానికి, అనిశ్చితికి దారితీసి నరకప్రాయమవుతుంది. ప్రస్తుతం లోకంలో అతికొద్ది వస్తువులే సద్వినియోగమవుతున్నాయి. అతి కొద్ది వస్తు వులే వాటి కేర్పరచిన స్థానాల్లో వుంచబడుతున్నాయి. మిగిలినవి చాలా వరకు అలా లేకపోవడం చేతనే ప్రపంచం యింత భయం కర నరకంగా మారి కష్టాలు కన్నీళ్ళతో బాధపడుతున్నది. ప్రతి వస్తువు దేనిస్థానంలో అది వుండాలి. అప్పుడే సామరస్యం, సమ తుల్యతతో ప్రపంచమంతా యీ కష్టాలు, కన్నీళ్ల నుండి విముక్తి పొందుతుంది. ప్రగతి పథంలో పయనిస్తుంది. అదే అసలు రహస్యం.

అందుచేత యేదీ దేనికది యెప్పుడూ చెడ్డది కాదు. కాని యించుమించు అన్ని వస్తువులూ వేటి స్థానంలో అవి వుంచ బడకపోవడం చేతనే యిన్ని సమస్యలు.

మూలం: శ్రీమాత

అనువాదం: నడిమింటి విజయలక్ష్మి

(*CWM* Vol. 4, pp. 375-76; Vol. 7, pp. 54-56)

అన్యాయ ఆర్జన

అక్రమంగా సంపాదించిన డబ్బును దైవకార్యానికి అడగవచ్చా?

శ్రీఅరవిందులు ధనమొక గుణరహిత (నిర్గుణ) శక్తి అంటారు. ఎలా సంపాదించావనేది కేవలం నీ వ్యక్తిగత విషయం మాత్రమే. ఆ సంపాదించే పద్ధతి నీకో, ఇంకొకరికో హాని కలిగిస్తే కలిగించి వుండొచ్చు. అంతమాత్రాన ఆ ధనానికి ఎటువంటి రంగు, రుచి, వాసనలుగాని వ్యక్తిగత ఇష్టాయిష్టాలు, మాలిన్యాలుగాని అంటవు! ఇటువంటి వాటికి ధనం అతీతం. అది ఒక శక్తి మాత్రమే. ఉదాహరణకి – ఒక దుష్టుడూ, మూర్ఖుడూ విడిచే గాలి ఓ సజ్జనుడి నిశ్వాసలోని గాలి కంటె ఎక్కువ కలుషితం కాదు గదా! ఎవరి నిశ్వాసంలోంచి వచ్చినా అది ఒకే గాలి! ఆ వ్యక్తిలోని మంచిచెడ్డలకీ దానికీ ఏ సంబంధమూ లేదు. ధనం కూడా అలాంటిదే. న్యాయాన్యాయాలతోగాని, పాపపుణ్యాలతో గానీ దానికి సంబంధం లేదు.

ఇంక అన్యాయంగానో, దొంగతనంగానో సంపాదించిన ధనాన్ని దైవకార్యాలకి తీసుకోవడమో తీసుకోకపోవడమో అనేది కేవలం మన ఆలోచించే తీరు మీదా, మన వ్యవహారిక దృష్టి మీద ఆధారపడుతుంది. మనకెలా చెయ్యాలనిపిస్తే అలా చెయ్యవచ్చు. ఒక దారుణమైన హంతకుడు ఎవరినో హత్యచేసి డబ్బు సంపాదించాడనుకోండి – అతనికి ఉన్నట్టుండి పశ్చాత్తాపం కలిగి "నేను చేసిన పనికి ప్రాయశ్చిత్తంగా నేను చెయ్యగలిగిందొక్కటే – ఈ డబ్బుని నిష్పక్షపాతంగా సత్కార్యాలకి వినియోగపడేచోట ఇచ్చేస్తా" అనుకుంటే అందులో తప్పులేదు – పైగా దాన్ని విలాసాలకీ, స్వార్థానికీ వాడేకంటే ఇది నయమే కదా.

అన్యాయార్జితాన్ని, దైవకార్యాలకి తీసుకోలేకపోవడానికి కారణాలు కేవలం ప్రాపంచికమూ, వ్యావహారికమైనవే కావచ్చు. నైతిక కారణాలు అనను. కానీ ఆధ్యాత్మికంగా దీనికి ఇంకొన్ని కారణాలుంటాయి. "కేవలం ఓ ధర్మకార్యానికి నీ అన్యాయార్జి

తాన్ని ఇచ్చినంత మాత్రాన నీ కెటువంటి పుణ్యము నిజంగా రాదు. చేతనయితే, ఆ ధనాన్ని ఇతరులకి నువ్వు దానం ఇచ్చేకంటే, ఎవరిని బాధించి సంపాదించావో, వారికే అది తిరిగి ఇచ్చెయ్యి — దాన్ని దాని చోటికి చేర్చు!" నిజానికి పశ్చాత్తాపంతో అన్యాయార్జితాన్ని ఇతరులకి దానం చేసేకంటే ఇదే ఉత్తమం!

గుర్తుంచుకోవలసిందల్లా ఇటువంటి విషయాల్లో ఎప్పుడూ కచ్చితమైన నియమ నిబంధనలు కానీ, సూత్రాలు కానీ వుండవు. ప్రతి అంశాన్ని వివిధ కోణాల నించి పరిశీలించి రక రకాల పరిష్కారాలు పొందవచ్చు. దాని వలన ధనానికొచ్చే హెచ్చుతగ్గులేమీ లేవు. ధనమనే ఈ ప్రస్ఫుటశక్తికి దాన్ని సంపాదించే మార్గంతో సంబంధం లేదు. ఒక కాసుకిగానీ, ఒక బంగారు కణికెకిగానీ వుండే విలువ ఎప్పుడూ ఒకటే. అది మారదు. పైగా ఈ ధనమనే శక్తివల్ల ప్రమాదంలో పడేది కేవలం దుష్టులే. ఇంక రెండో విషయం — ఏ పాపికానీ, దుష్టుడుకానీ తనంతట తానుగా తన అన్యాయార్జితాన్ని ఓ పుణ్యకార్యానికివ్వాలని ఎందుకనుకుంటాడు? ప్రాయశ్చిత్తమూ లేకపోతే దేముడు తను చేసిన పాపం నించి తనని రక్షిస్తాడనా? ఇదే నిజమయితే దీన్ని ప్రోత్సహించకూడదు. నిజంగా బాధపడి, పశ్చాత్తాప పడుతుంటే ఆ డబ్బుని పుణ్యకార్యాలకో, ప్రజాసంక్షేమానికో వాడితే అది వేరు. పైగా, ఇలాంటి విషయాల్లో కచ్చితంగా ఇది తప్పు అది ఒప్పు అనలేం. ప్రతిసారీ సందర్భాన్ని బట్టి నిర్ణయం మారుతుంది. ఇక పోతే, ఎవరయినా దౌర్జన్యంగా, అన్యాయంగా డబ్బు సంపాదించారని తెలిశాక దాన్ని మనంతట మనంగా దైవకార్యాలకి దానమివ్వమని అడగడం మాత్రం మంచిది కాదు. అలా చేస్తే అతనిని పరోక్షంగా క్షమించినట్టు, సమర్థించినట్టు అవుతుంది. అది మాత్రం చెయ్యకూడదు. అలా కాక, అడగకుండా, తనంతట తానే ఇస్తే వద్దనక్కర లేదు.

అన్యాయార్జన చేసే వాళ్లనించి సాధారణంగా డబ్బు రాబట్టేవాళ్లు అనుసరించే పద్ధతులు కూడా సరయినవి కావు —

వాళ్లని భయపెట్టి బెదిరించి, భవిష్యత్తులో నరకయాతన పొందుతారని చెప్పడమూ మంచిది కాదు.

మూలం: శ్రీమాత
అనువాదం: బి. వరలక్ష్మి

(*CWM* Vol. 4, pp. 379-81)

పేదరికము

చక్కని సమాజం, పరిపాలన, న్యాయం వున్నచోట పేదరికముండదు. ఒక వ్యక్తో, ఒక వర్గమో కొంతమంది వ్యక్తులో పేదరికాన్ని ఒక ఉన్నత ఆదర్శంగా అవలంబిస్తే ఫరవాలేదు కానీ మొత్తం జాతికంతా అదే ఆదర్శం కాకూడదు, ఎందుకంటే వికాసం, ప్రగతి కుంటుపడతాయి.

కేవలం ధనంతో, పేదరికం నిర్మూలించగానే ఈ భూమ్మీద సమస్యలుండవనీ, సంఘంలో కష్టాలుండవనీ, అందరూ ఆనందంగా వుంటారనీ అనుకోడం పొరపాటు. పూర్తి ఆత్మవికాసం కలిగే వరకూ ఈ అసంతృప్తి, అల్లకల్లోలం, తప్పవు.

మూలం: శ్రీఅరవిందులు
అనువాదం: బి. వరలక్ష్మి

(*Essays Divine and Human*, pp. 462-63)

వైరాగ్యము, ఆధ్యాత్మికము, వ్యాపారము

ఆధ్యాత్మికమంటే వైరాగ్యమేనా? ఎవరైనా ఆధ్యాత్మిక జీవనం గడుపుతున్నారంటే వారు తిండి తినకుండా రోజుల తరబడి ముక్కుమూసుకుని కూర్చునే ఉంటారనీ, తమకంటూ ఏమీ లేకుండా ఉన్నదంతా పంచిపెట్టేసి బికారిగా జీవితం గడుపుతారని అంతా అనుకుంటారు. సుఖసంతోషాలకి దూరంగా ఉండటమే పారమార్థిక జీవనానికి తార్కాణమని వారి అభిప్రాయము. ఆధ్యాత్మిక సత్యాన్ని అవగాహన చేసుకొని దర్శించాలనుకుంటే మాత్రం నువ్వు ఈ విధమైన ఊహాగానాలకి దూరంగా ఉండాలి. నువ్వు త్రికరణశుద్ధిగా దైవమార్గాన్ని అనుసరించాలనుకొని, నీ చైతన్యాన్నీ, నీ జీవితాన్నీ దైవమయం చేసుకోవాలనుకున్నప్పుడు నీవు వెళ్లి చేరుకున్నది ఒక పూరిగుడిశా కాదు, అక్కడున్న దివ్య పురుషుడు తనకున్నదంతా పంచిపెట్టేసిన బికారీ కాదు. అక్కడ సకల భోగభాగ్యాలనూ అనుభవిస్తూ, భక్తులిచ్చే కానుకలను ఆనందంగా స్వీకరిస్తూ సుఖంగా ఉండే పరమపురుషుడుంటే నీవు అదివరలో ఊహించుకున్న పారమార్థిక జీవితానికి పూర్తిగా భిన్నంగా ఉంటుందని నీవు నిర్ఘాంతపోతావు.

అందుకనే స్వచ్ఛమైన ఆధ్యాత్మిక సత్యాన్ని స్వేచ్ఛగా దర్శించాలనుకున్నప్పుడు ఆధ్యాత్మికత అంటే వైరాగ్యమనే దురభిప్రాయాన్ని పూర్తిగా తొలగించుకోవాలి. అది తొలగిపోతే ఆధ్యాత్మికత అంటే ఏర్పడిన నీ సంకుచిత అభిప్రాయం పోయి అత్యున్నతమైన దానిని తెలుసుకోగలుగుతావు, నీ హృదయం వికసిస్తుంది. ఇక ఈ నీకు లభించినదాన్ని సంతోషంగా స్వీకరిస్తావు, దాన్ని వదిలిపెట్టాల్సి వచ్చినప్పుడు అంత సంతోషంగానూ వదిలేస్తావు. నీ దగ్గరకు కొన్ని వస్తువులొచ్చినై – అనుభవించు; పోయినై – చిరునవ్వుతో వదిలేసెయ్.

నీవు దైవాన్ని కోరుకున్నప్పుడు నీ కుండే పాత అభిప్రాయాలన్నిటినీ విసర్జించాలి. నీ అభిప్రాయాలనే దైవానికీ అంటగట్టి ఆయనే వాటిని ఆమోదిస్తాడనీ అనుకోకు. నేను పట్టిన కుందే

లుకు మూడే కాళ్లనే మొండివాదన యోగులకు పనికిరాదు. దైవాజ్ఞ ఏమైనప్పటికీ దానిని వెంటనే శిరసావహించడానికి సంసిద్ధుడై యుండాలి. ఒకటి తనకు అవసరమైనదని కానీ, ఇంకొకటి నెత్తి మీద బరువని కానీ అనుకోకూడదు. ఆధ్యాత్మిక జీవనం గడుపుదామనుకున్నవారు మొట్టమొదట తమకున్నవాటి నన్నిటినీ దానం చేసేయాలనుకున్నారంటే అది కేవలం తమ భారం వదిలించేసుకోటానికే కాని, తను భగవంతుని ఆధీనం కావాలని మాత్రం కాదు. ఆ విధంగానే విలాసాలతో మునిగితేలే ధనవంతులు దైవమార్గంలోకి రాగానే తమ విలాసవస్తువుల నుండి దూరంగా పారిపోవాలనుకుంటారు. దానికి కారణం ఆ విలాసాల బానిసత్వం నుంచి విముక్తులు కావాలని. అయితే అది సరైన పద్ధతి కాదు. ఆ వస్తువులన్నీ తమవి అనుకోవటమే వారి తప్పు. నిజానికి అవన్నీ దైవానివే. ఆ దైవమే నీ కిచ్చినప్పుడు వాటిని నువ్వు సంతోషంగా అనుభవించు, ఏ క్షణంలోనైనా వాటిని వదిలేయటానికికూడా అంత సంతోషంగానూ సిద్ధంగా ఉండు!

శ్రీమాత

*

ఆధ్యాత్మిక జీవనానికి ఒక్కొక్కప్పుడు వైరాగ్యము అవసరమే కావచ్చు. నిజానికి సర్వసంగపరిత్యాగి వలె జీవితావసరాలను అతి తక్కువకి కుదించుకొని జీవించలేనివారు ఆధ్యాత్మిక జీవితంలో సంపూర్ణంగా ఎదగలేరని నా ఉద్దేశ్యము. అంటే ధనం సంపాదించాలనే అత్యాశ, తిండి మీద ఆసక్తి, అన్నీ కావాలనుకునే మమకారం మొదలైనవాటన్నిటినీ పూర్తిగా తన చేతన నుంచి తొలిగించేసుకోవాలి. అంతే తప్ప ఆధ్యాత్మిక పరిపూర్ణతకి వైరాగ్యం ఆవశ్యకమనిగానీ, అది ఆధ్యాత్మిక పరిపూర్ణతకి దీటైనది అనిగానీ నేను అనుకోవడం లేదు. ఏ పనిచేస్తున్నా, ఎన్ని పనులున్నా, బాధ్యతలున్నా దేనిలోనూ కోరికగాని, అహంభావం గానీ లేకుండా పూర్తి స్వాధిపత్యంతో భగవంతునికి సర్వసమర్పణ గావించి ఆయన కోసమే పనిచేయడమనే సంప్రదాయం ఉంది. అలా కాకపోతే జనకుడు, విదురుడు వంటి మహాపురు

మలు ఉండేవారు కాదు. ఇంకా చెప్పాలంటే కృష్ణుడు మధురాధిపతిగా, ద్వారకానాధునిగా, బృందావన నాధునిగా, పరమయోధునిగా కురుక్షేత్రంలో పార్థసారథిగా ఉండేవాడే కాదు. కేవలం ఒక గొప్ప విరాగిగా మాత్రమే మిగిలిపోయేవాడు. మన హిందూ సంప్రదాయంలో, భారతభాగవతాది గ్రంథాల ప్రకారం కర్మపరిత్యాగము, కర్మాచరణ రెండూ కూడా ఆధ్యాత్మ మార్గానికి ఆచరణ యోగ్యమైనవే. సర్వకర్మలు పరిత్యజించటమే హిందూ సంప్రదాయమనీ, మిగతా కర్మాచరణ, జీవితానుభవం మొదలైనవి ఆధ్యాత్మిక మార్గానికి వ్యతిరేకమనీ అవన్నీ పాశ్చాత్యదేశాల సంప్రదాయాలనీ అనుకోనక్కర లేదు.

*

వర్తకవ్యాపారాలు చేయడం తప్పనీ, పాపమనీ నేనెన్నడూ చెప్ప లేదు. మన దేశపు ఆధ్యాత్మిక సాంప్రదాయంలో కూడా అటువంటి అభిప్రాయం లేనే లేదు. నాకే అటువంటి అభిప్రాయముంటే 'క' గారి దగ్గర్నుంచిగానీ, తూర్పు ఆఫ్రికాతో వ్యాపారం చేస్తున్న మన ముంబై శిష్యుల దగ్గర్నుంచిగాని ధనాన్ని స్వీకరించేవాణ్ణే కాదు. అంతే కాక వారి వ్యాపారాన్ని కొనసాగించకుండా అంతా మూసివేసి ఆధ్యాత్మిక ప్రగతి మీదనే దృష్టి పెట్టుకోమని చెప్పేవాణ్ణే. 'క' గారు ఆధ్యాత్మిక సాధనా, మిల్లులో పనీ రెండూ చేస్తానంటే ఎలా ఊరుకోగలను? ఆ మిల్లు మూసేసి ఏ ఆశ్రమానికో వెళ్లి ధ్యానంలో కాలం గడపమని సలహా ఇచ్చేవాణ్ణి కదా! నేనైనా కూడా మొదట్లో రాజకీయాలలో పాల్గొనమనే ఆదేశానికి బదులు వ్యాపారం చేయమని ఉత్తర్వు వచ్చినా ఆ విధంగా చేసేవాణ్ణి తప్ప అదేదో దోషమని మాత్రం అనుకుండే వాడిని కాదు. *ఏమి చేసినప్పటికీ అది ఏ భావనతో చేస్తున్నాము, దాని ఉద్దేశమేమిటి, అది దేనికి ఉపయోగపడుతుంది అనేదే ముఖ్యము.*

శ్రీకృష్ణభగవానుడు అర్జునుని మహాభయంకరమైన యుద్ధం చేయమని ఏ విధంగా ప్రేరేపించాడో, అదే స్ఫూర్తితో మానవులందరూ కూడా తమ తమ కార్యాలను నిర్వహించాలనే కదా చెప్పాడు. కర్మఫలాన్ని భగవంతునికే అర్పించి కార్యాచరణ

కావించాలని 'సర్వకర్మాణి' అన్నాడు కదా! శ్రీకృష్ణుడు ఆధ్యాత్మిక పురుషుడు కాడనీ, అతగాడు అర్జునుడి కిచ్చిన సలహా తప్పు అనీ అనగలవా? మానవుడు తన ప్రవృత్తి ననుసరించి తన వంతుగా వచ్చిన పనిని తన శక్తిసామర్థ్యాలతో, ధర్మబద్ధంగా సక్రమంగా నెరవేరిస్తే భగవంతునికి చేరువవుతాడు.

భగవంతుడే బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య ధర్మాలను నిర్దేశించాడు కదా! దాని ప్రకారం వ్యాపారధర్మం నిర్వహిస్తూ ధనార్జన చేస్తూ అంతర్గతంగా యోగసాధనను ఆధ్యాత్మిక జీవనాన్ని కొనసాగించవచ్చు. భక్తి, జ్ఞాన యోగాలతో బాటుగా కర్మయోగానికి కూడా ప్రాధాన్యత నిచ్చిన కర్మ ద్వారా మోక్షసాధన చేసుకోవచ్చని భగవద్గీత చెపుతోందికదా! శ్రీకృష్ణభగవానుడు ఇంతకు మించిన నియమాన్నే జోడిస్తూ ప్రతిఫలాపేక్ష లేకుండా, కర్మఫలంపై మమకారం లేకుండా, అహంభావరహితంగా పనిచేయటమే ఒక యోగమని కూడా చెప్పాడు. కర్మాచరణ పట్ల ఈ భారతీయ వైఖరి అనాదిగా కొనసాగుతోంది. స్వధర్మమైన ఏ పనినైనా సక్రమంగా నెరవేరుస్తుంటే అది ఏ విధంగానూ దైవ మార్గానికి ఆటంకం కాదు. ఆధ్యాత్మిక జ్ఞానానికిగానీ, ఆధ్యాత్మిక జీవనానికిగానీ ప్రతిబంధకం కాదు.

డబ్బు విషయానికొస్తే అది జీవనానికి, కార్యాచరణకు కూడా అవసరమే. అది జీవితానికి సంబంధించిన ఓ మహాశక్తి. దైవకార్యంగా దాన్ని అధీనంలోనికి తెచ్చుకోవాలి. దానిపై నీకు మక్కువా ఉండకూడదు. అట్లాగని అదంటే ఏవగింపు గానీ, భీతిగానీ పనికిరాదు.

మూలం: శ్రీఅరవిందులు

అనువాదం: డా॥ ఎ. ప్రభావతి, డా॥ ఎ. వెంకటరామశాస్త్రి

(*CWM* Vol. 3, pp. 53-55; *SABCL* Vol. 23, pp. 676, 675-76, 1069)

ధనము – భవిష్యత్తు

ఈ విశాల ప్రపంచంలో సత్పురుషులకు, స్వేచ్ఛాజీవులుగా సంచరించటానికి ఒక సుక్షేత్రం ఉండి తీరాలి. ఆధిపత్యానికి, అధికారానికి ఇక్కడ ఆస్కారం లేదు. శాంతిధామమైన ఈ సుక్షేత్రంలో ఋతమే రాజ్యమేలుతుంది. సమన్వయము, పరస్పరావగాహనలకే ఇక్కడ పెద్ద పీట. దుఃఖోపశమనము, అజ్ఞానాంధకారాల నిర్మూలన, ఆటంకాలన్నిటినీ అధిగమించి, ఆధ్యాత్మిక పురోగతికి పాటు పడటమే ఈ శాంతిధామములో దినచర్య. ఇంద్రియ చాపల్యాలు, భోగభాగ్యాలు ఈ శాంతిధామానికి ఆమడ దూరం. కీర్తికాంక్షలు, ఆధిపత్యధోరణుల కన్న సేవాతత్పరత, కార్యదీక్షతగలవారే శిరోధార్యులు.

ఈ క్షేత్రంలో అందరికీ నిత్యావసరాలు అందుబాటులో ఉంటాయి. ఎటువంటి కొరతగాని, లోటుగాని, ఉండవు. ఈ క్షేత్రవాసుల విజ్ఞానసంపద, ఆధ్యాత్మిక పరిపక్వత వారియొక్క కర్తవ్యనిర్వహణలో ఋజువు కాగలవు. మరొకవిధంగా ఎన్నటికి కాదు. లలితకళలందు ఆభిరుచిగల క్షేత్రవాసులకు నిత్యము పండుగే. సాహిత్యము, చిత్ర, శిల్పకళల ప్రోత్సాహానికి ఈ సుక్షేత్రము కంకణం కట్టుకుంటుంది. ఈ సౌందర్యారాధన వల్ల ప్రాప్తించే ఆనందానికి అవధులు లేవు. ధనబలానికి అతీతము. డబ్బుకు దాసోహమనే నీచస్థితి ఇక్కడ గోచరించదు. ఈ సమాజంలో వ్యక్తియొక్క కీర్తిప్రతిష్ఠలు అతని సంపన్నస్థితి కంటె సామర్థ్యానికి మాత్రమే గౌరవం లభిస్తుంది. ఈ క్షేత్రంలో పనియనగా కర్మానుష్ఠానము వ్యక్తివికాసానికి ఒక సాధనమేనని, ఉపాధికై మాత్రము కాదు. తన శక్తియుక్తులను వృద్ధిపరచి తన చుట్టూ ఉన్న సమాజసేవయే పరమావధిగా భావించుటయే లక్ష్యం. చివరగా మానవుల సంబంధ బాంధవ్యాలలో నెలకొన్న నిత్య సంఘర్షణలకు అడ్డుకట్ట వేసి సచ్ఛీలత, పరస్పర అవగాహన, సౌభ్రాతృత్వములను ప్రతిష్ఠించటమే ఈ శాంతిధామము యొక్క ధ్యేయము.

ప్రాచీన భారతదేశంలో ఉన్నతవర్గాల ప్రాబల్యమే అధికమని ఉటంకించవచ్చును. అప్పటి తత్త్వవిచారణ చింతన, ఔన్నత్యాన్ని కాంక్షించి, అందుకు పాటుపడే ఒకానొక ఆదర్శం నెలకొని ఉన్నది. అన్నింటి యందు శ్రేష్ఠత్వమును ఆశించే ఒకానొక వైపరీత్యము కానవస్తుంది. తత్త్వచింతనగాని, లలితకళలైన సాహిత్యం, శిల్పముగాని, శీలాదులుగాని మరేదైనాగాని వాటియందు ఈ దృష్టి గోచరిస్తుంది. ఈ విపరీత దృష్టి ఎంతవరకు వెళ్లినదని పరిశీలిస్తే, ప్రపంచం తలక్రిందులైనా సరే! సర్వోత్కృష్టత ప్రాప్తించాలి. అని ఆశించేవరకు ఈ దృష్టి కానవస్తుంది.

*

ఈ ఆర్థిక ప్రణాళిక పెద్ద పెద్ద రాక్షసి యంత్రాగారాలను స్థాపించే లక్ష్యమెన్నటికీ కాదు. తమ ప్రకృతిస్వభావాలకు అనుగుణంగా, నిత్యజీవనంలో తమ కర్తవ్యం నిర్వహిస్తూ, విరామసమయంలో మానసికంగా ఎదుగుతూ అందరకు ఆనందమయమైన జీవితాన్ని అందించటమే ధ్యేయంగాని మరొకటి గాదు.

మూలం: శ్రీఅరవిందులు
అనువాదం: శ్రీ శరణ్

(*CWM* Vol. 12, pp. 93-94; *Archives & Research* April 1978, p. 5; *SABCL* Vol. 15, p. 241)

నోట్లు, నాణెములు మొ॥ వాటి వెనుక ఒక శక్తి – మారకశక్తి (the power of exchange) ఉన్నది. దానినే మనం డబ్బు అంటాం.

*

ధనమనగా ఒక సాధనము, ఒక ఆయుధము, ఒక శక్తి – అంతకు మించిన (మనము పొందవలసిన) వస్తువేం కాదు.

శ్రీమాత

(*CWM* Vol. 5, p. 358; Vol. 13, p. 154)

ఈ యిల్లు నా స్వంతం కాదు

అక్టోబరు 7, 1913 నాటి శ్రీమాత ప్రార్థన

నీ కంకితము చేయబడిన ఈ ఇంటికి మూడు నెలల తర్వాత తిరిగివచ్చినప్పుడు,నాకు రెండు విచిత్రమైన అనుభూతులు కలిగి అనే భావము ఏమాత్రము లేదు. నాకిదంతా చాలా క్రొత్తగా వున్నది. విదేశాలకు వెళ్లినప్పటి కంటె క్రొత్తగా వున్నది. ఊరి బయటకు వెళ్లి పచ్చిక బయళ్లలో చెట్ల మధ్యన ఉన్న దానికంటె క్రొత్తగా అనిపించటం నాకు చాలా ఆశ్చర్యమనిపిస్తోంది! ఇంతకు ముందర నాకు తెలియని విషయమొకటి నాకు ఇప్పుడు తెలుస్తోంది. అదివరకు ఈ ఇల్లు నాదే అని ఎలా భ్రమపడేదాన్ని అని తలచుకుంటే నవ్వు వస్తోంది. నా చుట్టూ వున్న వస్తువులను యథాతథంగా దర్శించి, వాటి నిజస్వరూపమేమిటో తెలుసుకోవాల్నంటే, నా గర్వము పూర్తిగా, నిశ్చయంగా అణగారిపోవాలి. ...it was necessary for all pride to be broken, crushed, trampled down definitively so that I could at last understand, see and feel things as they are.

నా కేదైనా సొంతమైనదంటూ ఉంటే కదా నేను నీ కివ్వగలిగేది. అదివరకు ఈ విషయం తెలియక పిచ్చిదానిలా ఈ ఇంటిని నీకు సమర్పించేదాన్ని! అంతా నీదే, నీవే కదా మా కవసరమైన వస్తువుల నిచ్చేది. అటువంటప్పుడు ఏ వస్తువుల నైనా మా సొంతం అని అనుకోవటం ఎంత హాస్యాస్పదం. ఇక్కడ నేనొక ఆగంతకురాలిని అంతే. ఎక్కడైనా అంతే కదా. నీ సందేశాన్ని అందించేందుకై భూలోకంలోకి వచ్చిన నీ సేవకురాలిని. మానవుల మధ్యకు వచ్చిన ఆగంతుకురాలిని. అయినా వారి జీవితంలో మెరిసే ఆత్మను, వారి యెదలో కదిలే ప్రేమను.

మూలం: శ్రీమాత

అనువాదం: డా॥ ఆర్.ఎల్.ఎన్. శాస్త్రి

(*CWM* Vol. 1, p. 32)

సమాచార పత్రం

సావిత్రి శిబిరము: డా॥ మంగేష్ నడ్కర్ణిగారు శ్రీఅరవిందుల 'సావిత్రి' ని (Book - I) గురించి ఒక అధ్యయన శిబిరమును 23-2-06 నుండి 5-03-06 తేదీలలో (9-10 A.M, 11-30–11-45) శ్రీఅరవిందో సొసైటీ బీచ్ ఆఫీసులో నడిపెదరు.

కార్డు కేలండరు: 2006 సం॥ కు శ్రీఅరవిందుల సందేశముతో ఒక Page mark cum calendar అందరికి పంపబడును. అదనపు కాపీలు కావలసినవారు ఒక కార్డుకు రూ 1/-, 7 కార్డులకు రూ॥ 5/-, 100 కార్డులకు రు॥ 30-00, తపాలా ఖర్చులతో సహా Sri Aurobindo Society, Beach Office, No-1, Rangapillai Street, Pondicherry 605001 కు advance తో సహా ఆర్డర్లు పంపవలెను.

శ్రీ గోపాల్ భట్టాచార్జీగారు జర్మనీ, UK, USA దేశాలను Aug - Sept 2005 నెలల్లో దర్శించిరి.

కేంద్రముల వార్తలు

హార్దా (మ.ప్ర) కేంద్రమువారు శ్రీ కైవల్యా స్మార్టుగారి ఆధ్వర్యమున సెప్టెంబరులో ఒక యువకేంద్రమును నడిపిరి. కోయంబత్తూరు (త. నా) లో డా॥ ఆలోక్ పాండేగారు 17, 18 సెప్టెంబరు తేదీలలో ఈ క్రింది విషయములపై ఉపన్యసించిరి. 'శ్రీమాతారవిందుల యోగము – భవిష్యత్తు' 'ఆరోగ్యము పట్ల చేతనాపూర్వకమైన దృష్టి' 'మనిషిలోని విభాగములు వాటి సామరస్యము' 'సమర్పణ'. అన్నానగర్ (చైన్నై) లో రెండు తమిళ పుస్తకములు ఆవిష్కరింపబడినవి. చిత్తోర్‌గడ్ (రాజస్థాన్) లో శ్రీ కైవల్యా స్మార్టుగారు 'శ్రీమాతారవిందుల బాటలో సమగ్రాభివృద్ధి' అనే విషయముపై 17, 18 సెప్టెంబరు తేదీలలో ఒక శిబిరమును నడిపిరి. శ్రీచరణ్ కేంద్రము (ముంబాయి) వారు లోకండ్‌వాలా కాంప్లెక్సు బేక్ రోడ్డును శ్రీఅరవింద మార్గముగా మార్చుటకు ప్రారంభోత్సవమును చేసిరి. గుల్‌బర్గా (కర్ణాటకా) లో రాష్ట్రంలోని మూడు విభాగముల కార్యక్రమములను 24, 25 సెప్టెంబరు